# చరిత్ర

## చరిత్ర రచనా పద్ధతి

ఖండాలు : I - II

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2004

## రచయితల బృందం

సంపాదకుడు

ఆచార్య వై. వైకుంఠం

సహ సంపాదకులు

ఆచార్య వి. రామకృష్ణారెడ్డి

కుమారి ఇ. సుధారాణి

రచయితలు

ఆచార్య వై. వైకుంఠం

ఆచార్య వి. రామకృష్ణ

శ్రీ. జె. దుర్గాప్రసాద్

డా. పి. సుధీర్

డా. అట్లూరి మురళి

శ్రీ జి. సుదర్శన్ రెడ్డి

ముఖచిత్రం

యమ్. రమేష్

11SOSH 27-4-05

BRAOU

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115054
Date 27.4.2005
Call No 9.54

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్.

ప్రథమ ముద్రణ : 1995
పరిష్కృత ముద్రణ - 1999 , 2000 2003 ,2004

© 1995 డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నైనా ఉపయోగించదల్చుకుంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం.

ఇతర వివరాలకు : డైరెక్టర్ (అకడమిక్) డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నెం.46, జ్యూబిలీ హిల్స్, హైదరాబాద్ - 500 033. ఆం.ప్ర.

Lr. No. 954/Dr. BRAOU/DMP/PTG/F.No.28/J.O .No. 003 Copies: 350 Books

Printed at Kesava Art Printers, Red Hills, Lakdi-ka-pool, Hyderabad -500 004.

# పరిచయం

చరిత్ర అనే మాటను రెండు భిన్న అర్థాల్లో ఉపయోగించడం జరుగుతూంది. మొదటిది, అధ్యయన విషయం గురించి; రెండోది, అధ్యయనం గురించి. ఈ రెండో అర్థంలో, చరిత్ర, చరిత్రకారుని పరిశోధన, సంఘటనల గూర్చి సూచింపబడుతూంది. చరిత్ర గ్రంథాల్లో కానీ, చరిత్రాధ్యయనంలోకానీ, చరిత్ర అంటే ఏమిటో, చరిత్రాధ్యయన ప్రయోజనం ఏమిటో, చరిత్ర రచన ఎలా చేయాలో, అందుకు తత్వ శాస్త్ర ప్రయోజనం ఏమిటో, చరిత్రను నిర్మించినవారెవరో, చరిత్రకారుని మనోదృక్పథాలేమిటో అనే విషయాలపై సమాచారం, అవగాహన తక్కువ. ఈ విషయాలపై తెలుగులో వచ్చిన మౌలిక రచనలూ తక్కువే. శాస్త్రీయంగా చరిత్ర రచన చేయాలంటే, చరిత్ర రచనా పద్ధతుల్ని క్షుణ్ణంగా తెలుసుకోవడం అవసరం. చరిత్ర రచనా పద్ధతులను తెలుసుకోకుండా, చరిత్ర విషయాలను చదవడం అసంబద్ధమౌతుందనడం, అతిశయోక్తికాదు. చరిత్రతో తాత్విక దృక్పథం తోడైతే, చరిత్ర పరిధి విస్తృతమవడమే కాక, వైవిధ్యాన్ని సంతరించుకుంటుంది. లౌకికంగా, పక్షపాత రహితంగా, ఉపదేశాత్మకంగా, తాత్వికంగా చరిత్ర రూపొందాలనే భావం, ఆకాంక్ష, చరిత్రకారుల్లో, ముఖ్యంగా పద్దెనిమిదో శతాబ్ది చివరి కాలం నుండి అధికమైంది. దీంతో, శాస్త్రీయ దృక్పథంలో చారిత్రక ఆధారాలను నిశితంగా పరిశీలించి, ప్రామాణికతను నిర్ధారించి, గతంలో ఏది ఎందుకు జరిగిందో, క్రమబద్ధమైన, విశ్వజన్యమైన విశ్లేషణలతో కూడిన వివరణ, ఇప్పుడు చరిత్రకారులకు ఆదర్శంగా మారింది. అయితే, చరిత్రకారుడు చేసేటువంటి విషయ చిత్రీకరణ, అతని అవగాహన, అతని మానసిక దృక్పథంపై చాలావరకు ఆధారపడి ఉంటుంది. చరిత్రలో చెప్పేటటువంటి విషయాల్ని సరిగ్గా అందనా వేయాలంటే, చరిత్రకారుని అభిప్రాయం, వ్యక్తిత్వం, మానసిక దృక్పథాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. సమాజంలో నెలకొని ఉన్న సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు చరిత్ర రచనలను గుణ రీత్యా, పరిణామ రీత్యా చాలావరకు ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు, బ్రిటీష్ పరిపాలనా కాలంలో మనదేశంలో చేసినటువంటి చరిత్ర రచనల్లో కొన్ని, వలసవాద తత్వంతో ప్రభావితమైతే, మరికొన్ని, జాతీయ భావాల చేత ప్రేరేపితమైనాయి. కాబట్టి, ఏదేశ చరిత్రనైనా సమగ్రంగా అర్థం చేసుకోవాలనుకుంటే, ఆ రచన వెనుక దాగిఉన్న చరిత్రకారునికి సంబంధించిన విషయాలు, సమకాలీన పరిస్థితుల స్పష్టమైన అవగాహన ఎంతైనా ఆవశ్యకం.

చరిత్రలో ప్రథమ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, "చరిత్ర రచనా పద్ధతి" కోర్సుగా రూపొందించబడింది. చరిత్ర పునాదులు, ఆధారాలతోపాటు, ఐరోపాలో, భారతదేశం లోను, ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక యుగాల్లో జరిగిన చరిత్ర రచనా పరిణామాలను, వివిధ కాలాల్లో, దశల్లో జరిగిన చరిత్ర రచనాభివృద్ధిని విశ్లేషించడం జరిగింది.

ఈ కోర్సులో మొత్తం ఆరు ఖండాలు, ఇరవైమూడు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం, దీన్ని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతూంది. మొదటి పుస్తకంలో, మొదటి రెండు ఖండాలకు సంబంధించిన పదకొండు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో, చరిత్ర శాస్త్రం అనే వాదం, చరిత్రకు పునాదులైన యదార్థాలు, కార్యకారణ సంబంధం, సాధారణీకరణ, విషయ

BRAOU

BRAOU

# విషయక్రమం


| | | | |
|---|---|---|---|
| | | | పుట నెం. |
| ఖండం - I : | చరిత్ర పునాదులు | | |
| భాగం - 1 : | చరిత్ర ఒక శాస్త్రం | ... | 3 |
| భాగం - 2 : | చారిత్రక యదార్థాలు, హీరిస్టిక్స్ | ... | 13 |
| భాగం - 3 : | కార్యకారణ సంబంధం | ... | 28 |
| భాగం - 4 : | సాధారణీకరణ | ... | 37 |
| భాగం - 5 : | విషయ నిష్ఠత | ... | 47 |
| భాగం - 6 : | సంశ్లేషణ | ... | 57 |
| ఖండం - II : | చారిత్రక ఆధారాలు | | |
| భాగం - 7 : | పురావస్తు ఆధారాలు, శాసనాలు, నాణేలు | ... | 71 |
| భాగం - 8 : | సాహిత్యం | ... | 93 |
| భాగం - 9 : | పాలనా రికార్డులు | ... | 104 |
| భాగం - 10 : | వార్తాపత్రికలు | ... | 112 |
| భాగం - 11 : | మౌఖిక సాంప్రదాయం | ... | 137 |
| | పాఠ్యప్రణాళిక | | |
| | మాదిరి పరీక్షా పత్రం | | |
| | అభ్యాసాలు | | |


BRAOU

BRAOU

# ఖండం-I : చరిత్ర పునాదులు

ఈ ఖండంలో, 1,2,3,4,5,6 భాగాలున్నాయి. ఒకటో భాగంలో, చరిత్ర ఒక శాస్త్రం అనే వాదం ఏర్పడ్డ క్రమాన్ని, కారణాల్ని గూర్చి చర్చించడం జరిగింది. రెండో భాగంలో, చారిత్రక యదార్థాల స్వరూప స్వభావాలు, చరిత్ర రచనలో వాటి పాత్ర, యదార్థాలు లభ్యమయ్యే సాక్ష్య పత్రాల శోధన, సమీకరణ, వాటిని భద్రపర్చడం గూర్చి వివరించడమైంది. మూడో భాగంలో, కార్యకారణ సంబంధాల ఆవశ్యకత, సిద్ధాంతాల వివరణ ఉంది. నాల్గో భాగంలో, సాధారణీకరణ స్థాయిలను, కాలానుగుణ్య స్వభావం గూర్చి వివరించడమైంది. ఐదో భాగంలో, విషయ నిష్ఠత, దాని ప్రాముఖ్యత, పరిమితులు, చారిత్రక ఆభాస, దోషాల గురించిన వివరణ ఉంది. ఆరో భాగంలో సంశ్లేషణ విధులు, సంబంధిత యదార్థాల సమీకరణ, నిర్మాణాత్మక వివేచన గురించి చర్చించడమైంది.

నిష్ఠత, సంశ్లేషణలు, చరిత్ర ఆధారాలైన పురావస్తు శాస్త్రం, శాసన శాస్త్రం, నాణేల శాస్త్రం, సాహిత్యం, రికార్డులు, వార్తాపత్రికలు, మౌఖిక ఆధారాలు వివరంగా చర్చించబడ్డాయి. చరిత్ర రచనా పద్ధతుల గురించి, వీటి అధ్యయనం ద్వారా మీరు గ్రహించగలరని భావిస్తున్నాం.

రెండో పుస్తకంలో చివరి నాలుగు ఖండాలకు చెందిన పన్నెండు భాగాలను పొందుపర్చడం జరిగింది. వీటి ద్వారా, ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక యుగాల్లో, ఐరోపా, పశ్చిమాసియా, భారతదేశాల్లో చరిత్ర రచనాభివృద్ధిని, పరిణామాన్ని గురించి విద్యార్థులకు సరైన అవగాహన ఏర్పడగలదని ఆశిస్తున్నాం.

విద్యార్థుల్లో పరిశీలనాసక్తిని, యోచనాశక్తిని పెంపొందించి, చరిత్ర రచనా పద్ధతుల గురించి క్షుణ్ణంగా తెలుసుకొనేందుకు, ఈ పాఠ్య భాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తోంది.

BRAOU

BRAOU

# భాగం-1 : చరిత్ర ఒక శాస్త్రం

విషయ క్రమం


1.0 లక్ష్యాలు

1.1 పరిచయం

1.2 చరిత్రపై విజ్ఞాన శాస్త్రాల ప్రభావం

1.3 చరిత్ర శాస్త్రమా అనే వివాదం

1.4 చరిత్రలో సాధారణీకరణ

1.5 చరిత్రలో గుణపాఠాలు

1.6 చరిత్ర భవిష్యత్తును ఊహించుట

1.7 చరిత్రలో ఆత్మాశ్రయం, విషయ నిష్ఠత

1.8 చరిత్రకు మతం, నీతితోగల సంబంధం

1.8.1 మతంతో సంబంధం

1.8.2 నీతితో సంబంధం

1.9 ప్రాక్కల్పన

1.10 చరిత్ర కళ అనే వాదం

1.11 సంగ్రహంగా

1.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

1.13 ఉపయుక్త గ్రంథాలు


## 1.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- చరిత్ర ఒక శాస్త్రం అనే వాదం ఏర్పడ్డ క్రమాన్ని గురించి విశ్లేషించగలగాలి.
- చరిత్ర శాస్త్రం అని చెప్పగల్గడానికి గల కారణాలను పేర్కొనగలగాలి.
- చరిత్ర ఒక కళా? అనే సందేహానికి గల కారణాలను వివరించగలగాలి.

BRAOU

## 1.1 పరిచయం

మనకున్న అనేక విషయాలను విభజించినట్లైతే, అవి శాస్త్రాలు, కళలు అని రెండు రకాలుగా విభజించవచ్చు. ఈ రెండింటికీ కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. దానిదాని ప్రత్యేక లక్షణాలను బట్టి, అది దేనికి చెందిందో నిర్ణయించవచ్చు. అదే విధంగా, చరిత్ర లక్షణాలను గుర్తించ ప్రయత్నించిన కొందరు, చరిత్ర శాస్త్రమనీ, మరికొందరు కాదనీ వాదోపవాదాలు చేశారు. ఈ వాదోపవాదాల కారణంగా, చరిత్ర లక్షణాలేమిటి? చరిత్ర లక్ష్యమేమిటి? అనే సందేహాలు చరిత్రకారునికి కలగటం ప్రారంభమైంది. అయితే, అనేకమంది చరిత్రకారులు చరిత్ర విజ్ఞాన శాస్త్రం వంటి శాస్త్రం కాకపోయినా, శాస్త్రానికున్న లక్షణాలు దీనికుండటం వల్ల, దీనికే ఒక ప్రత్యేక లక్ష్యం ఉండటంతో, దీన్ని కూడా, శాస్త్రమనే పేర్కొన్నారు. అయినా, దీనికి కళకుండే లక్షణాలు కొన్ని ఉండటంవల్ల కొంతమంది చరిత్రకారులు, చరిత్ర ఒక కళే అని వాదించే అవకాశం ఉంది. ఈ భాగంలో మనం చరిత్ర శాస్త్రమా? అనే వాదం గురించి, చరిత్ర శాస్త్రమనడానికి బలపర్చే లక్షణాలను గూర్చి, చరిత్ర ఒక కళ అనే వాదం గురించి తెలుసుకుంటాం.

## 1.2 చరిత్రపై విజ్ఞాన శాస్త్రాల ప్రభావం

నిజానికి చరిత్ర రచనలో శాస్త్రీయత, ప్రాచీన కాలంలోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. థూసిడైడ్స్ (Thucydides) అనే గ్రీక్ చరిత్రకారుడు, చరిత్రలో మానవ ప్రవర్తన శాస్త్రీయ క్రమాన్ని తెలుసుకోడానికి ప్రయత్నించాడు. కాని, ఆధునిక కాలంలో శాస్త్రీయ పరిశోధనలు జరిగేంతవరకు, చరిత్రను సాహిత్యంలో భాగంగానూ, ఒక కళగానూ మాత్రమే పరిగణించేవారు. 16 వ శతాబ్దం తరువాత, విజ్ఞాన శాస్త్రంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, క్రొత్త అన్వేషణలు, ప్రత్యేకంగా, డార్విన్, న్యూటన్ సిద్ధాంతాల వల్ల, మానవుల ఆలోచనా సరళిలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఈ మార్పులు సాంఘిక శాస్త్రాలపై, ముఖ్యంగా, చరిత్రపై ఎక్కువ ప్రభావాన్ని చూపించాయి. వీటితోబాటు, ఈ కాలంలో పరిశోధనల్లో అనుసరించిన శాస్త్రీయ పద్ధతులు, విశ్లేషణ కూడా, చరిత్రపై ఎంతో ప్రభావాన్ని చూపించాయి. వీటన్నిటిలో డార్విన్ పరిణామ సిద్ధాంతం, (Evolution Theory) చరిత్రపై ఒక ముఖ్యమైన ప్రభావాన్ని చూపిందని చెప్పవచ్చు. డార్విన్ సిద్ధాంతంలో ఉన్న ప్రకృతి వరణ సూత్రం (Principle of Natural Selection), యోగ్యతమ సార్థక జీవన భావన (Concept of the Survival of the fittest)లు పూర్తిగా చారిత్రక ప్రక్రియలే. ఆతర్వాత చరిత్రకారులు న్యూటన్ చలన సిద్ధాంతాలు (Laws of motion), భూమ్యాకర్షణ సిద్ధాంతం (Law of Gravitational Force) వంటి సిద్ధాంతాలను చరిత్రలోకూడా యదార్థాల ఆధారంగా, రూపొందించాలని భావించారు. ఇటువంటి శాస్త్రీయ పరిశోధనలు, తత్ఫలితంగా, మానవ విజ్ఞానంలో వచ్చిన మార్పుల కారణంగా, సాంఘిక శాస్త్ర పరిశోధకులకు ఇది ఒక్క శాస్త్రీయ పరిశోధనలకే పరిమితమా, లేక, సామాజిక మార్పులకూ, సాంఘిక శాస్త్రాలకే వర్తింపజేయవచ్చునా అనే మీమాంస ఏర్పడింది. దాని ఫలితంగా, చరిత్ర శాస్త్రమా అనే ప్రశ్న మొదలై తర్కంగా మారి, భిన్న అభిప్రాయాలకు దోహదపడింది. వీటి ఫలితంగా, చరిత్రను ఒక శాస్త్రం అనే భావనతో, రచనలు చేయడం ప్రారంభించడం జరిగింది.

BRAOU

## 1.3 చరిత్ర శాస్త్రమా? అనే వాదం

19వ శతాబ్దంలో ఆధునిక చరిత్రకు మూలపురుషుడైన జర్మన్ చరిత్రకారుడు లియోపాల్డ్ వాన్ రాంకె (Leopold von Ranke) చరిత్రను శాస్త్రంగా పరిగణించి, ఖచ్చితంగా జరిగిన విషయాలను స్పష్టంగా చెప్పడమే చరిత్రకారుని ప్రథమ ధర్మమనీ, అవి ఖచ్చితత్వానికి, ప్రామాణికతకు, నూరు రూపమై ఉండాలని పేర్కొన్నాడు. కానీ, రాంకె వర్తమానాన్ని గూర్చి బోధించడమో, భవిష్యత్తును గురించి ప్రవచించడమో, చరిత్రకారుని కర్తవ్యం కాదని చెప్పాడు. ఇదే వాదాన్ని, అగస్ట్ కామ్టే (Auguste Comte) బలపర్చాడు. ఈ పంథా చరిత్రను తార్కిక వాదం, శాస్త్రీయ దృక్పథంతో మిళితం చేస్తుంది.

బకల్ (Buckle) 'మానవ కార్యకలాపాల్లో ఏనాడూ దారితప్పని విశ్వజనీయమైన సూత్రం వ్యాపించి ఉంటుందని' పేర్కొంటే, సీలీ (Seely) చరిత్రకు సాహిత్యంతో ఎటువంటి సంబంధం లేదని చెప్పగా, యార్క్ పోవెల్ (York Powell) చరిత్ర అనేది శాస్త్రం తప్ప వేరుకాదని నొక్కి వక్కాణించాడు. ఈ సందర్భంలో, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో, ఆక్టన్ తర్వాత చరిత్ర పీఠాన్నలంకరించిన బ్యూరో, 1903లో 'చరిత్ర ఖచ్చితంగా శాస్త్రమే' అన్నది పెద్ద వివాదమై, చరిత్ర శాస్త్రమా? కాదా? అనే చర్చ తీవ్ర స్థాయిలో ప్రారంభమైంది. ఇతడు తన ఉపన్యాసంలో నిగమన పద్ధతి (Deductive Method) ని శాస్త్రం వాడుతుందనీ, అదే విధంగా, చరిత్రకారుడు "మొదట యదార్థాలను సేకరించి తర్వాత వ్యాఖ్యానించాలనీ" "చరిత్ర ఒక శాస్త్రం. అంతకంటె తక్కువా కాదు, ఎక్కువా కాదు," అని పేర్కొన్నాడు. 1930 ప్రాంతంలో కాలింగ్ఉడ్ (Collingwood) బ్యూరో వాదాన్ని సమర్థిస్తూ, శాస్త్రజ్ఞుల అన్వేషణకు ముఖ్యమైన ప్రకృతి ప్రపంచానికీ, చారిత్రక ప్రపంచానికీ మధ్య, భేదాన్ని స్పష్టంగా పేర్కొనడానికి కృషి చేశాడు. అయితే, శాస్త్రాలు ఆకాలంలో గొప్ప విప్లవాత్మక పరిశోధనలకు దోహదపడ్డాయి. తత్ఫలితంగా, యదార్థాలను కనుక్కోడానికి ఆధునిక కాలంలో కృషి జరుగుతుందనీ, అందువల్లనే, చరిత్రకారుడు శాస్త్రీయ దృక్పథ ప్రపంచానికి దగ్గరయ్యాడని, ఇ.హెచ్. కార్ పేర్కొన్నాడు.

ఈ వివాద క్రమంలో శాస్త్రాలకు కావాల్సిన క్రమబద్ధమైన పద్ధతులు, క్రమపద్ధతిలో జ్ఞాన సముపార్జన మొదలైనవి, చరిత్రలో కూడా ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. అనుకూలవాదులు (Positivists) కూడా ఇది శాస్త్రమని, మొదట యదార్థాలు ఏవో నిర్ధారించుకొని, నిర్ణయాలు (Conclusions) చెయ్యాలనీ చెప్పారు. వాస్తవానికి క్రమపద్ధతిలో బోధించే విషయ పరిజ్ఞానాన్ని శాస్త్రం అనాలి. చరిత్రలో విషయ నిష్ఠత, వస్తుపర పరిశోధన (Objective research) ను ఆధునిక కాలంలో గుర్తించడంతో, ఇదో శాస్త్రమని ఒప్పుకోక తప్పదు.

## 1.4 చరిత్రలో సాధారణీకరణ

చరిత్ర శాస్త్రమా? కాదా? అనే చర్చలో, చరిత్ర లక్షణాలు శాస్త్రానికున్న ప్రత్యేక లక్షణాలతో పోల్చడం జరిగింది. ఆ దశలో శాస్త్రానికున్న కొన్ని ప్రత్యేక లక్షణాలు, చరిత్రకు లేవనే ఆరోపణ ప్రారంభమైంది. అందులో, శాస్త్రం సాధారణ, సార్వజనీన విషయాల గురించి వివరిస్తే, చరిత్ర

BRAOU

కేవలం ప్రత్యేక, అసదృశ్య విషయాల గురించి వివరిస్తుందన్నది మొదటి ఆరోపణ. ఈ ఆరోపణ గ్రీక్ తత్వవేత్త అరిస్టాటిల్ తోటే ప్రారంభమైంది. ఇదే ఆలోచన 20వ శతాబ్ది ప్రారంభ కాలం వరకు కొనసాగింది. వీరి దృష్టిలో, చరిత్ర విడివిడి సంఘటనల గురించి, వ్యక్తుల గురించి చర్చిస్తుంది. ఏ రెండు సంఘటనలు కానీ, ఏ ఇద్దరు వ్యక్తులు కానీ ఒకే విధంగా ఉండరు. కానీ, నిజానికి చరిత్రకారుడు సాధారణీకరణ చేయకుండా ఉండలేడు. సంఘటనలు వేరైనా, వ్యక్తులు వేరైనా చరిత్రకారుడు సాధారణీకరణ చేస్తాడు. ఈ సందర్భంలో, ఇ.హెచ్. కార్ "చరిత్రకారునికి ప్రత్యేకతల్లో కాక, ప్రత్యేకతల్లోని సాధారణ లక్షణాలంటే ఆసక్తి ఉంటుంది." దుఃఖం, బాధ, సంతోషం, కోపం, ఆవేశం వ్యక్తులందరికీ సమానమే. అయితే, జరుగుతున్న సంఘటనలు ఏమేరకు తమమీద ప్రభావం చూపిస్తున్నాయో, ఆమేరకు వారి స్పందన ఉంటుంది. అణచబడ్డ వ్యక్తులు ఎప్పుడో ఒకప్పుడు తిరుగబడి తీరుతారనేది చారిత్రక సత్యమే. కాబట్టి, చరిత్రకారుడు కూడా సాధారణీకరణ చేస్తాడు. సామాన్యంగా, చరిత్రకారుడు సాధారణీకరణాన్ని తన ఆధారాలను సరిచూచుకోడానికి ఉపయోగిస్తాడు. ఔరంగజేబ్ తన సోదరులను హతమార్చాడా, లేదా, అనే అనుమానం వచ్చినప్పుడు మొగలుల కాలంలో వారసులను హతమార్చే అలవాటు ఉందా అనే సాధారణీకరణ గురించి, చరిత్రకారుడు ఆలోచిస్తాడు. అదే విధంగా, చరిత్ర పాఠకుడు కూడా, సాధారణీకరణ గురించే ఆలోచిస్తాడు. చరిత్ర పాఠకుడు చరిత్రకారుని పరిశీలనను తనకు తెలిసిన సందర్భాలకు, లేదా, తన కాలానికి వర్తింపజేస్తూ, సాధారణీకరణ చేస్తాడు. వలస పాలనలో, బెంగాల్ జమీందారీ రైతుల బాధల గురించి చరిత్ర పాఠకుడు అధ్యయనం చేస్తున్నప్పుడు, అవి ఆంధ్రలో జమీందారీ రైతుల పట్ల ఎంతవరకు వర్తించాయన్న సాధారణీకరణ చేస్తాడు. ఇ.హెచ్. కార్ అన్నట్లు, "చరిత్ర సాధారణీకరణాల మీద మాత్రమే బ్రతుకుతుంది."

అయితే, సాధారణీకరణ మనే పేరుతో అన్ని ప్రత్యేక సంఘటనలను కూడా, ఒక సిద్ధాంతంలో ఇమడ్చడానికి చేసే ప్రయత్నం మాత్రం తప్పు పద్ధతి. సామాజిక మార్పును ఉత్పత్తి సంబంధాలతో ముడిపెట్టే సాధారణీకరణ చేసిన మార్క్స్ కూడా, ఈ పద్ధతిని సమర్థించలేదు. ఈ సందర్భంలో మార్క్స్ ఈ విధంగా అంటాడు. "ఎంతో పోలిక ఉన్న సంఘటనలు, వేరు వేరు చారిత్రక పరిస్థితుల్లో జరిగిన ఎడల, అవి వేరు వేరు ఫలితాలను కలుగజేస్తాయి. వీటిని వేరు వేరుగా అధ్యయనం చేసి, ఆతర్వాత ఒక దాంతో ఒకటి పోల్చినట్లైతే, చాలా సులభంగా పరిణామాల సరళిని అర్థం చేసుకునే కీలకం తెలుస్తుంది. కానీ, ఏదో చారిత్రక - తాత్విక సిద్ధాంతాన్ని ఉపయోగించుట ద్వారా, ఈ విధమైన అవగాహనకు రావడం జరుగదు." కావున, చరిత్ర అనేది ప్రత్యేకతకు, సాధారణీకరణకు గల సంబంధం గురించి చెప్తుంది. చరిత్రకారునికి ఈ రెండింటినీ వేరు చేయడం సాధ్యపడదు.

## 1.5 చరిత్రలో గుణ పాఠాలు

శాస్త్రానికున్న ఇంకో ముఖ్య లక్షణం, అది మానవునికి గుణ పాఠాల నందిస్తుంది. అదే విధంగా, చరిత్ర కూడా గుణ పాఠాలను చెప్తుంది. చరిత్రలో సాధారణీకరణకు, చారిత్రక గుణ పాఠాలకు, చాలా దగ్గర సంబంధముంటుంది. చరిత్రకారుడు ఒక సంఘటన నుండి ఏర్పర్చుకున్న గుణ పాఠాన్ని, ఇంకో సంఘటనకు కూడా వర్తింపజేసి, సాధారణీకరణ చేయటం జరుగుతుంది. దీనికి ఉదాహరణలు అనేకం. 1919లో జరిగిన పారిస్ శాంతి సమావేశంలో విషయాలను చర్చించేటప్పుడు, ఆయా రాజ్య ప్రతినిధులు 1815 నాటి వియన్నా కాంగ్రెస్‌ను, ఒక గుణపాఠంగా తీసుకున్నారు. అదే విధంగా,



BRAOU

దక్షిణాఫ్రికా లోని తెల్ల దొరల ప్రభుత్వం అనేక ఆసియా, ఆఫ్రికా స్వాతంత్ర్య పోరాటాలను గుణ పాఠంగా తీసుకొని, అక్కడి ప్రజలకు స్వాతంత్ర్యమివ్వడం జరిగింది. నేటి ప్రభుత్వాలు వాటి విధానాల అమలు ఫలితాన్ని గుణపాఠంగా తీసుకొని, తమ తర్వాత విధానాలను రూపొందించుకోటం జరుగుతుంది. ఈ విధంగా, గుణపాఠాలను నేర్చుకొన్న వ్యక్తుల సముదాయమే, చరిత్రలో ప్రగతి పథంలో అడుగిడడం జరుగుతుంది.

## 1.6 చరిత్ర భవిష్యత్తును ఊహించుట

చరిత్ర భవిష్యత్తును ఊహించదని కొందరు అపోహ పడతారు. కానీ, పైన పేర్కొన్న రెండు ముఖ్య విషయాల్లో సాధారణీకరణ చేయడం, గుణపాఠం నేర్చుకోడం అనేవి, భవిష్యత్తును ఊహించటంతో ముడిపడి ఉన్నాయని గమనించాలి. అయితే, ఈ ఉహించడం భౌతిక శాస్త్రమంత ఖచ్చితంగా ఉండకపోవచ్చు. ఎందుకంటే, చరిత్రకారుడు కొన్ని సంఘటనలను సాధారణీకరణ చేసి, అటువంటి పరిస్థితులే ఉన్నట్లైతే, చరిత్రలో అటువంటి సంఘటనలు జరగవచ్చని చెప్పవచ్చు. అయితే, అటువంటి సంఘటనలు జరగకుండా పాలకవర్గం గట్టి ప్రయత్నం చేస్తే, అది జరగకపోవచ్చు. ముఖ్యంగా, భవిష్యత్తును ఊహించినప్పుడు, జరుగబోయే సంఘటనలు ఏ వర్గానికైతే నష్టం కలిగేటట్లు ఉంటాయో, ఆ వర్గం జాగ్రత్తపడి, ఆ సంఘటనలు జరగకుండా ఉండటానికి ప్రయత్నం చేస్తుంది. జరిగిన దాన్ని ఒక గుణపాఠంగా ఉపయోగించుకుని, భవిష్యత్తును తన కనుకూలంగా మార్చుకోడానికి ఆ వర్గం ప్రయత్నిస్తుంది. దాంతో, అనేక సందర్భాల్లో జరగాల్సిన సంఘటనలు జరగకపోవచ్చు. అంతమాత్రాన, చరిత్రలో భవిష్యత్తును ఊహించటం జరగదని చెప్పలేం. భౌతిక శాస్త్రంలో భూమ్యాకర్షణ శక్తి వల్ల, ఆపిల్ పండు చెట్టునుండి కిందపడ్తుందని చెప్పినా, మధ్యలో ఎవరైనా పట్టుకున్నట్లైతే కిందపడదు. అంతమాత్రాన భౌతిక శాస్త్రంలో భూమ్యాకర్షణ సిద్ధాంతానికి విలువలేదని చెప్పలేం. అదే విధంగా, చరిత్రలో కూడా ఒకే రకమైన పరిస్థితులున్నప్పటికీ, ఒక్కోసారి ఒకే రకమైన సంఘటనలు జరగకపోవచ్చు. ప్రత్యేక సంఘటనలెప్పుడూ, ఒకదాన్నొకటి పోలి ఉండవు. అవి ఒక్కోసారి ఆకస్మికంగా కూడా జరుగుతాయి. ఉదాహరణకు, ఒక ఊళ్లో ప్లేగు వ్యాధి ప్రబలిందని తెలిసినప్పుడు, అది ఆ ఊళ్లో అందరికీ వ్యాపించవచ్చని మన గతానుభవాన్ని బట్టి సాధారణీకరణ చేయవచ్చు. కానీ, ఫలానా వ్యక్తికి ఖచ్చితంగా ప్లేగు వస్తుందని చెప్పలేం. చరిత్రకారుడు కూడా, ఇదే విధంగా ఆలోచిస్తాడు. ఈ విధంగా, విజ్ఞాన శాస్త్రంలోనూ, చరిత్రలోనూ భవిష్యత్తు గురించి ఆలోచించటం, దాదాపు ఒకే రకంగా ఉంటుందని చెప్పవచ్చు.

## 1.7 చరిత్రలో ఆత్మాశ్రయం, విషయ నిష్ఠత

విజ్ఞాన శాస్త్రాలకు, చరిత్రకు ఒక్క విషయంలో తేడా ఉంది. మొదటి వాటిలో ప్రకృతిని గురించి మానవుడు పరిశీలించడమైతే, చరిత్ర, సాంఘిక శాస్త్రాల్లో మానవుడి చర్యల గురించి మానవుడే పరిశీలించడం జరుగుతుంది. ఈ సందర్భంలో, చరిత్రకారుడు చేస్తున్న పరిశీలనలో, తన అభిప్రాయాలు కూడా చోటుచేసుకొంటాయి. అందువల్ల, చాలా సందర్భాల్లో చరిత్రకారుడు చరిత్ర రచనలో, పక్షపాతం చూపించే అవకాశం ఉంది. ఒక్కోసారి చరిత్రకారుని పరిశోధనా ఫలితాలను ఊహించి, మానవులు తమ ప్రవర్తనను మార్చుకోవచ్చు; లేదా, సంఘటనలు జరుగకుండా ప్రయత్నించవచ్చు.

BRAOU

ఒక కాలంలోని ఆర్థిక పరిస్థితులు అదే విధంగా కొనసాగితే, ఆర్థిక పతనం తప్పదని ఆర్థిక శాస్త్రవేత్త ఎవరైనా చెప్తే, ఆర్థిక పతనం జరగకుండా, ఆ కాలపు ప్రభుత్వం తప్పక ప్రయత్నిస్తుంది. అదే విధంగా, ఫ్రెంచ్ విప్లవ ఫలితాలు నెపోలియన్‌తో అంతమైనాయని తెలుసుకున్న రష్యన్‌లు, తమ విప్లవానికి అటువంటి ముగింపు ఉండకూడదని, నెపోలియన్ లక్షణాలున్న ట్రాట్స్కీని కాదని, స్టాలిన్‌ను తమ నాయకుడుగా అంగీకరించారు. అయితే, ఒక్కోసారి చరిత్రకారుడు మార్పు త్వరగా రావాలనో లేక, ఏదో ఒక ఫలితం ఆశించో, తనకు తెలియకుండానే ఆత్మాశ్రయం (Subjective)కు లోనయ్యే అవకాశం ఉంది. రాజనీతి శాస్త్రజ్ఞుడు తాను అభిమానించే రాజకీయ పార్టీ రాబోయే ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో, ఆపార్టీయే గెలుస్తుందనీ, ప్రజా ధోరణి అదేవిధంగా ఉందని చెప్పవచ్చు. ఈ విధమైన పద్ధతి, విషయ నిష్ఠతను సాధించలేదు. సత్యాన్వేషణ చరిత్ర పరిశోధనా లక్ష్యం కాబట్టి, విషయ నిష్ఠతలేని సత్యాన్వేషణ లోపభూయిష్టమైందనీ, శాస్త్రజ్ఞుని లాగే విషయ నిష్ఠత (Objectivity) కోసం, చరిత్రకారుడు నిష్పాక్షికతతో పరిశోధన కొనసాగించాలి.

## 1.8 చరిత్రకు మతం, నీతితో గల సంబంధం

చరిత్ర రచనలో మతం, నీతికి ప్రముఖ స్థానం ఇవ్వడం వల్ల, ఇది నీతికాదు అనే వాదన కూడా ఉంది. చరిత్రకు మతం, నీతితో సంబంధాలున్నా, చరిత్ర మతం, నీతికి లోబడి మాత్రం లేదు. ఈ సంబంధం చరిత్ర శాస్త్రమనడానికి ఏ విధమైన అవరోధం కాదు.

BRAOU

### 1.8.1 చరిత్రకు మతంతో గల సంబంధం

చాలామంది చరిత్రకారులు తాము యదార్థాలతో నిరూపించ వీల్లేని వాటిని, మతంతో నిరూపించ ప్రయత్నిస్తారు. వారి దృష్టిలో మతం అనేది పేక ముక్కల్లో, ఒక జోకర్ లాంటిది. పేక ముక్కల్లో ఏ విధంగానైతే లేని పేక ముక్క స్థానంలో జోకర్‌ను ఉపయోగిస్తారో, అదేవిధంగా, చరిత్రకారుడు లభ్యమయ్యే అన్ని యదార్థాల సాయంతో పరిశోధించినా, అంతు తెలియని విషయాలకు మతాన్ని ఉపయోగించాలని డి. ఆర్సీ లాంటివారు పేర్కొన్నారు. ఈ కారణం వల్ల, చాలామంది చరిత్రను శాస్త్రం కాదని అన్నారు. కాని, కార్ల్‌బార్త్ అనే మతాధికారి మత చరిత్రకు, లౌకిక చరిత్రకు సంబంధం లేదని, చరిత్రకారుడు లౌకిక చరిత్ర మాత్రమే రాయాలనీ, పేర్కొంటాడు. బట్టర్ ఫీల్డ్ అభిప్రాయ ప్రకారం, 'సాంకేతిక చరిత్ర' (అంటే మత చరిత్ర కాని చరిత్ర) ను మాత్రమే, చరిత్రకారుడు రాస్తాడని అంటాడు. కానీ, అతడు దైవిక చరిత్ర కూడా ఉందని నమ్ముతున్నట్లు అర్థమవుతుంది. అదేవిధంగా, బెర్డయేవ్, నీబుర్, మాంటైన్ వంటి చరిత్రకారులు చరిత్ర స్వతంత్ర ప్రతిపత్తిని గుర్తించినా, చరిత్ర లక్ష్యం చరిత్రకు ఆవల ఉందని పేర్కొంటారు. కాని, ఇ.హెచ్. కార్ అభిప్రాయంలో చరిత్రకు, చరిత్రకతీతమైన విషయానికే పొత్తుకుదరదు. అతని ఉద్దేశంలో, చరిత్ర జోకర్ లేకుండా ఆడే పేకాట లాంటిది.

### 1.8.2 చరిత్రకు, నీతికి సంబంధం

చరిత్రకూ, నీతికి ఉన్న సంబంధం మరింత జటిలమైంది. చరిత్రకారునికీ, నీతిశాస్త్రవేత్తకూ విషయాలను చూడ్డంలో ఒకే దృష్టి ఉండదు. వ్యక్తుల మంచీ చెడ్డలకన్నా వారి చర్యలు, వాటి

ఫలితాలే, చరిత్రకారునికి ముఖ్యమైనవి. చంద్రగుప్త విక్రమాదిత్యుడు సోదరుని చంపి, రాజ్యానికి రావడం వంటి నీతి బాహ్యమైన చర్యపట్ల శ్రద్ధ వహించడం కన్నా, అతని పాలన గూర్చి శ్రద్ధ వహించడమే, చరిత్రకారుని ముఖ్య కర్తవ్యం. అదే విధంగా, తండ్రిని చంపిన అజాత శత్రువు మంచివాడా కాదా అనే ఆలోచన, చరిత్రకారుని పరిధికి చెందింది కాదు. కానీ, అతడు మగధ రాజ్యాన్ని ఏ విధంగా విస్తరించాడు అనేది తెలుసుకోడమే, చరిత్రకారుని ముఖ్య విధి. కానీ, ఆక్టన్ ఉద్దేశంలో, చరిత్రకారుడు "వివాదాలలో ఒక మధ్యవర్తి" లాంటివాడు. చారిత్రక వ్యక్తుల వ్యక్తిగత ప్రవర్తనను గూర్చి తీర్పులు చెప్పే అధికారం, అవసరం, చరిత్రకారునికి ఉందని ఇతని అభిప్రాయం. అదేవిధంగా, ఇసయా బెర్లిన్ అనే అతడు చార్లిమాన్, నెపోలియన్, చంఘీజ్ ఖాన్, స్టాలిన్ వంటివారు చేసిన హత్యాకాండల నాధారంగానే, వారిని అంచనా వేయాలని అంటాడు. కానీ, నౌల్స్ ఈ పద్ధతిని వ్యతిరేకించి, "చరిత్రకారుడు న్యాయాధిపతి కాడు" అనీ, వ్యక్తుల మంచి చెడ్డలను గూర్చి శిక్షించాల్సిన అవసరం లేదనీ అంటాడు. క్రోస్ కూడా ఈ వాదాన్ని సమర్థిస్తాడు. కార్ కూడా ఈ అభిప్రాయాన్ని సమర్థించి, "వ్యక్తుల నీతిని గూర్చి కాక, సంఘటనల, వ్యవస్థల విధానాల్లోని నీతిని గూర్చి తీర్పులు చెప్పడం, చరిత్రకారుని ముఖ్య విధి" అని అంటాడు. మాక్స్ వెబర్ వ్యక్తులను కాకుండా, వారిని సృష్టించిన వ్యవస్థను ఖండించాలని పేర్కొంటాడు. వ్యక్తులను నిందించటం ఎంత పొరపాటో, వ్యక్తి ఆరాధన కూడా అంతే పొరపాటు. కాబట్టి, చరిత్రకారుడెప్పుడూ వ్యక్తుల మంచి చెడ్డల కన్నా, వ్యక్తుల చర్యల పట్లనే ఎక్కువ శ్రద్ధ చూపించాలి.

## 1.9 ప్రాక్కల్పన (Hypothesis)

BRAOU

శాస్త్రానికున్న ఇంకో అతిముఖ్యమైన లక్షణం, పరిశోధనాంశానికి ప్రాక్కల్పన నేర్పర్చుకోడం; దాన్ని రుజువు చేయడం కోసం, అనేక ప్రయోగాలు చేయడం. ఈ విధంగా, ప్రాక్కల్పనలు తయారు చేసుకుని, వాటిని రుజువు చేయడానికి ప్రయోగాల వంటివి, చరిత్ర రచనలో చేయడం సాధ్యం కాదు. కాబట్టి, చరిత్ర ఒక శాస్త్రం కాదని కూడా ఒక వాదం ఉంది. కాని, ఆధునిక కాలంలో చరిత్ర రచనలో కూడా, ప్రాక్కల్పనకు ప్రాధాన్యం ఏర్పడింది. శాస్త్రంలో లాగే చరిత్ర రచనలో కూడ, నిగమన తర్కం (Deductive logic) ఉపయోగించి, ప్రాక్కల్పనలు రూపొందించుకోడం జరుగుతుంది. ఈ ప్రాక్కల్పనలను రుజువు చేయడానికి అనేక చారిత్రక సంఘటనలను పరిగణనలోకి తీసుకొని, వాటికి తగ్గ యదార్థాలను (facts) సేకరించుకోడం జరుగుతుంది. విజ్ఞాన శాస్త్రంలో ప్రాక్కల్పన నిరూపణ ఎక్కువగా పరిశీలనపైనా, ప్రయోగాలపైనా ఆధారపడి ఉంటుంది. చరిత్ర రచనలో యదార్థాల (facts) ను జాగ్రత్తగా పరిశీలించి తన ప్రాక్కల్పనను నిరూపించడానికి చరిత్రకారుడు ప్రయత్నిస్తాడు. కాని, గతాన్ని తనంతతానుగా ప్రత్యక్షంగా పరిశీలించలేడు. శాస్త్రజ్ఞుడు యదార్థాలను ప్రత్యక్షంగా పరిశీలించి, కావాలనుకుంటే మళ్ళీ మళ్ళీ ప్రయోగాలు చేసి, ప్రాక్కల్పనను నిరూపించడానికి ప్రయత్నం చేస్తాడు. చరిత్రకారుడు తాను సేకరించిన యదార్థాల విశ్వసనీయతను, అంతః విమర్శ (Internal criticism), బాహ్య విమర్శ (External criticism) ల ద్వారా పరీక్షించి, సంశ్లేషణా ప్రక్రియ (Synthetic operation) ద్వారా యదార్థాల సామూహికీకరణ చేసి, తన ప్రాక్కల్పనను నిరూపించటానికి ప్రయత్నిస్తాడు. ఈ సందర్భంలో, తాను విషయ నిష్పత (Objectivity)ను సాధించడానికి కృషి చేస్తుంటాడు. అందువల్ల, ఈ విధమైన పద్ధతిలో చారిత్రక రచన జరుగుతుంది. కాబట్టి, చరిత్రను కూడా శాస్త్రమనే అనటం అభిలషణీయం. ప్రాక్కల్పన విషయంలో చరిత్రకారునికి, శాస్త్రజ్ఞునికి

చాలా సామ్యం ఉంది. ఇద్దరూ అవసరమైన యదార్థాలను సేకరిస్తే, అన్ని సమస్యలు సులభంగా పరిష్కారమౌతాయని అభిప్రాయపడతారు. అదే విధంగా, ఇద్దరూ యదార్థం లేక, శాస్త్రీయ సత్యం అనేవి పూర్తి సత్యం (truth) కావనీ, అవి "నిపుణులు అంగీకరించిన అభిప్రాయం" మాత్రమేననీ భావిస్తారు. హెన్రీ పాయిన్ కేర్ అనే ఫ్రెంచ్ గణిత శాస్త్రజ్ఞుడు తన 'శాస్త్రం, ప్రాక్కల్పన' (La Science et 1' hypothese) అనే గ్రంథంలో, శాస్త్రజ్ఞుడు సాధారణ ప్రతిజ్ఞా వాక్యాలను ప్రాక్కల్పనలుగా మార్చి, వాటిని పరిశీలించుకోడానికీ, ధృవీకరించుకోడానికీ, వాటిలో మార్పులు చేర్పులు చేసుకోడానికి లేదా, తిరస్కరించడానికీ ఉపయోగపడేట్లు తయారు చేసుకుంటాడని అంటాడు. ఇదే విధమైన పద్ధతినే చరిత్రకారుడైనా, సాంఘిక శాస్త్రజ్ఞుడైనా, ఉపయోగిస్తాడు. చరిత్రకారుని ప్రాక్కల్పన, శాస్త్రజ్ఞుని ప్రాక్కల్పనలు రెండూ కూడా, విషయం పట్ల అవగాహనను పెంపొందించటమే కాక, భావి ఆలోచనలకు తావిస్తాయి.

చరిత్రలో ప్రాక్కల్పనలు యుగ విభజన (Periodization), భౌగోళిక విభజనల నాధారంగా చేసుకుని జరుగుతాయి. ఇవి, అంత సహజమైనవి కావు. యుగ విభజనలో ఏ యుగం ఎప్పుడు అంతమైందో, ఏ యుగం ఎప్పుడు ప్రారంభమైందో చెప్పటం కష్టం. అదే విధంగా, భౌగోళిక ఎల్లలను గుర్తించటం కూడా చాలా కష్టం. కానీ, ఈ విధమైన ప్రాక్కల్పనలు చరిత్రలో తప్పనిసరి. ఇటువంటి ప్రాక్కల్పనల విషయంలో, జార్జి సోరెల్ అనే భౌతిక శాస్త్రజ్ఞుని అభిప్రాయం చక్కగా సరిపోతుంది. అతని అభిప్రాయంలో, పాక్షికమైన, నమ్మదగ్గ ప్రాక్కల్పనలతో ప్రయత్నించి, తాత్కాలికమైన నిర్ణయాలు వచ్చినా సంతృప్తి చెందాలి. అంతేకాక, అభ్యుదయ మార్పులను ఎల్లప్పుడూ ఆహ్వానించాలి.

ఇప్పటివరకు మనం చరిత్ర శాస్త్రమైతే, శాస్త్రానికున్న లక్షణాలు ఉన్నాయా అనే విషయాన్ని చర్చించాం. చరిత్ర శాస్త్రమే అనడానికి పై చర్చ దోహదపడ్తుంది. కానీ, ప్రామాణిక శాస్త్రాల్లాగే (Normative Sciences) ఇది సిద్ధాంతాలను, లేక, సాధారణీకరణాలను అన్ని పరిస్థితుల్లోనూ రుజువు చేయలేదు. అందుకే దీన్ని, సామాజిక శాస్త్రాల్లో భాగంగా చేయటం జరిగింది. చరిత్ర రచన ఆధారాలు, యదార్థాలు, మానవుని అనుభవాలకు, సాధించిన ఘనతకు సంబంధించినవి. అందుచేత, అవి ప్రామాణిక శాస్త్రాల్లాగే శాస్త్రీయ పరిశీలనకు భిన్నంగా, ప్రయోగాల్లో నిరూపించేవికావు. అయితే, చరిత్రను శాస్త్రజ్ఞునిలా విమర్శనాత్మక తార్కిక కోణంతో చూడ్డం, సాధారణీకరణను చేయడం ద్వారా, చరిత్ర, శాస్త్రానికి దగ్గర అవుతుందని చెప్పవచ్చు.

## 1.10 చరిత్ర కళ అనే వాదం

చరిత్ర కున్న కొన్ని ప్రత్యేక లక్షణాలనుబట్టి, చరిత్రను కళ అని కూడా భావించటం జరిగింది. చరిత్ర సాహిత్యం లేక, సంగీతం వంటి కళలకు భిన్నమైందికాదు. గతాన్ని పునర్నిర్మించడమే, చరిత్రకారుని కర్తవ్యం. వక్రీకరింపబడి చెప్పే, లేక అసంపూర్ణ వర్ణనలు, అసంపూర్ణంగా మరచిపోయిన అంశాలు, అనేక యదార్థాలుగా వస్తాయి. ఆ సందర్భంలో, చరిత్రకారుని ఊహాశక్తి, కళాకారునిగా ఆవిషయానికి న్యాయం చేయాలనే కృషి, చరిత్రను కళగా పరిగణించడానికి దోహదపడుతుంది. చరిత్ర కారుడు గొప్ప పండితుడు, అలోచనాసరళిని వివిధ కోణాల్లో భావవ్యక్తీకరణకు చేయగల నైపుణ్యంకల కళాకారుడు. చరిత్రలోని వాఙ్మయ స్వభావానికి కార్లైల్, మెకాలేలు ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు.

విక్టోరియా యుగంలోని చరిత్ర రచనా శైలిలోని వాఙ్మయ పోకడలు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే, వాటిని గొప్ప వాఙ్మయ కళాఖండాలుగా పేర్కొన్నారు. అంతేకాక, చరిత్రకారుని ప్రధాన కర్తవ్యం గతాన్ని నిర్మించటం. ఇందులో భాగంగా, సేకరించిన యదార్థాలను తన భావనా శక్తితో, విలువలకు సంబంధించిన అవగాహనతో, భావ వ్యక్తీకరణతో, గతాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తాడు. తన భావనా పటిమతో, కళాత్మకమైన శైలిలో గతాన్ని చక్కగా వర్ణిస్తాడు. కాబట్టి, దీన్ని కళ అని అనేకమంది వాదిస్తారు.

చరిత్ర, సంస్కృతి, కళలను గూర్చి చెప్పేటప్పుడు మానవ నైజం, రాజులు, వారి పాలనా కాలం, ఆర్థిక సాంఘిక పరిస్థితులను తెల్పడంలో, కళాభావం ఎక్కువ కన్పిస్తుంది. విషయ వ్యక్తీకరణలో, రాసే విధానంలో, మేధాసంపత్తిలో చరిత్ర రచనను ఒక కళగా భావించినా, ఆధునిక కాలంలో దాని పరిశోధనా విధానం, చెప్పే రీతి, చరిత్ర కళకంటే శాస్త్రానికే దగ్గరగా ఉంటుంది. అందుకోసమే, ట్రెవిలియన్ అనే చరిత్రకారుడు చరిత్రలో కళ, శాస్త్ర లక్షణాలు రెండూ కన్పిస్తాయంటాడు. కానీ, చరిత్ర రచనకై అనువర్తించే శాస్త్రీయ పద్ధతిలో అన్వేషణ, సత్య నిరూపణకు జరిగే కృషి, రచనలో శ్రవించే విషయ నిష్పత్త (Objectivity), దీన్నో శాస్త్రంగా పేర్కొనడానికి దోహదపడతాయి. ఏది మైనా, అనేక వాదనల పరిశీలనానంతరం, చరిత్రను ఒక శాస్త్రంగానే మనం పరిగణించవచ్చు.

## 1.11 సంగ్రహంగా

1. చరిత్ర శాస్త్రమా? కాదా? అనే వివాదం ఏర్పడ్డ క్రమాన్ని గూర్చి;
2. చరిత్ర శాస్త్రమనడానికి ప్రధానంగా ఇందులో సాధారణీకరణ, గుణ పాఠాలను నేర్చుకోడం, భవిష్యత్తును ఊహించడం, విషయ నిష్పత్తను సాధించడానికి ప్రయత్నించడం, మతం, నీతులతో సంబంధం లేకపోవడం వంటి కారణాలను గూర్చి;
3. చరిత్ర కళ అనే వాదాన్ని గూర్చి తెలుసుకున్నాం.

## 1.12 పరీక్షా నమూనా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. చరిత్రపై విజ్ఞాన శాస్త్రాల ప్రభావాన్ని వివరించి, చరిత్ర శాస్త్రమా అనే వాదనను గూర్చి రాయండి.
2. ఆధునిక కాలంలో చరిత్ర రచనలో ప్రాక్కల్పనా ప్రాధాన్యాన్ని విపులంగా చర్చించండి.

**II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చరిత్రలో సాధారణీకరణ అంటే ఏమిటి?
2. చరిత్ర ఒక కళే అనే వాదాన్ని గూర్చి రాయండి.
3. చరిత్రకు మతం, నీతితో గల సంబంధాన్ని గూర్చి రాయండి.

BRAOU

## 1.14 ఉపయుక్త గ్రంథాలు


Carr, E.H. : **What is History?**

Collingwood, R.G. : **The Idea of History**

Rajayyan, K. : **Historiography - History in Theory and Method**

Sheik Ali, B. : **History: Its Theory and Method**

దుర్గాప్రసాద్, జె. : చరిత్ర రచనా శాస్త్రం (తెలుగు అకాడమి ప్రచురణ)


రచయిత : ఆచార్య వై. వైకుంఠం

BRAOU

# భాగం-2 : చారిత్రక యదార్థాలు, హీరిస్టిక్స్

విషయ క్రమం


2.0 లక్ష్యాలు

2.1 పరిచయం

2.2 యదార్థం అంటే ఏమిటి?

2.3 చారిత్రక యదార్థాలు

2.4 మౌలిక యదార్థాలు

2.5 చారిత్రక యదార్థాల నిర్దేశంలో చరిత్రకారుని పాత్ర

2.6 కార్ వ్యాఖ్యానం

2.7 యదార్థాల స్వభావం

2.8 చరిత్ర పునరావృతమౌతుందా?

2.9 చరిత్ర మొత్తం సమకాలీనమే

2.10 గతాన్ని వ్యాఖ్యానించటంలో భవిష్యత్తు పాత్ర

2.11 చారిత్రక పద్ధతి

2.12 హీరిస్టిక్స్

2.13 చరిత్ర ఆధారాలు - సమీకరణ, వాటిని భద్రపరచటంలో ఆయా సంస్థల పాత్ర

2.14 సంగ్రహంగా

2.15 పరీక్షా నమూనా ప్రశ్నలు

2.16 ఉపయుక్త గ్రంథాలు


## 2.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- చారిత్రక యదార్థాలు అంటే ఏమిటో తెల్పి, వాటి స్వరూప స్వభావాలను పేర్కొనగలగాలి.

BRAOU

- చరిత్ర రచనలో చారిత్రక యదార్థాల పాత్రను, వాటిని నిర్ణయించడంలో చరిత్రకారుని ప్రాముఖ్యతను విశ్లేషించగలగాలి.
- చారిత్రక యదార్థాలు లభ్యమయ్యే పద్ధతులను వివరించగలగాలి.

## 2.1 పరిచయం

కేవలం కట్టుకథలపైన, పుక్కిట పురాణాలపైన, లేదా, ఊహ మీదనో చరిత్ర ఆధారపడలేదు. జీవిత వాస్తవికతలపై ఆధారపడి, నిజంగా జరిగిన సంఘటనలను గురించిన క్రమబద్ధమైన విజ్ఞానాన్ని, అది విశదీకరిస్తుంది. ఇంకా, ప్రధాన సంఘటనల కార్యకారణ సంబంధాలను వివరించటం, సమస్య మూలం కనుక్కోవటం, విషయాన్ని లోతుగా పరిశీలించటం, దాన్ని పైనుండి చివరి వరకు వ్యాఖ్యానించటం స్వభావ రీత్యా సంకీర్ణం కనుక, చరిత్ర అనేక దృక్పథాలకు, వివరణలకు ఆలవాలం. అది గతకాలపు సంఘటనల విశ్లేషణ, వివరణ, వర్ణనలతో కూడింది కనుక, చరిత్రకారుడు చారిత్రక యధార్థాల స్వభావాన్ని మనసులో పెట్టుకోవాలి. అనుషంగిక శాస్త్రాల సాయంతో లభించే ప్రాథమిక, లేదా, మౌలిక యదార్థాలు చరిత్రకారులందరికీ సమానమేగాని, గతానికి సంబంధించిన యదార్థాలు చారిత్రక యదార్థాలు కావటం, చరిత్రకారుడాపాదించే ప్రాధాన్యతపై ఆధారపడింది. చారిత్రక యదార్థాలన్నీ వాటిని గ్రంథస్థం చేసిన వ్యక్తుల, చరిత్రకారుల మనసుల్లో పరావర్తనం చెంది, బయటపడ్డవేనని కార్ నొక్కి చెప్పాడు. చరిత్రకారుడు సమకాలీన పరిస్థితుల ప్రభావంలోనే స్పందిస్తాడు. కనక చరిత్రకు చరిత్రకారుడు కావాలి, చారిత్రక యదార్థాలూ కావాలి. వీటిలో, దేనికీ ఇంకో దాని మీద ఆధిపత్యం లేదని, చరిత్ర పరిశోధనలో చరిత్రకారుడు తానెంచుకున్న విషయానికి అనుగుణంగా యదార్థాలు, అవి లభించే సాక్ష్య పధాలను ముందుగా సమీకరించి, భద్రపరచటం విధిగా భావిస్తాడు.

## 2.2 యదార్థం అంటే ఏమిటి?

ఆంగ్ల పదం ఫాక్ట్ (Fact)కి మూలం, ఫాక్టుమెస్ట్ '(Factumest)' అనే మాట. దీన్నే మనం 'యదార్థం' అనో, 'వాస్తవం' అనో వ్యవహరిస్తున్నాం. సాధారణంగా ఉందనో, జరిగిందనో తెలిసిన దాన్ని సూచించడానికి ఈమాట వాడతారు. అయితే, యిటువంటి నిర్వచనం, చరిత్రకారునికి అసంతృప్తిని మిగులుస్తుంది. దీనికి కారణం, ఇది చాలా పరిమితమైన, సాధారణమైన భావంతో ఉందని కాదు. జరిగినదంతా, లేదా, వాస్తవమంతా చరిత్రకారుడు తన వర్ణనలోకి, లేదా, గ్రంథంలోకి చొప్పించటం సాధ్యం కాదు గనక, ఒక వేళ ఈ విధంగా చొప్పించటం సాధ్యమైనా, అది చరిత్ర కాబోదు. ఎందుకంటే, కేవలం యదార్థాల సేకరణే చరిత్ర కాదు కాబట్టి. అలాగని, చరిత్రకు యదార్థాలు ముఖ్యం కాదని భావించకూడదు.

'చరిత్ర'కు మూలమైన గ్రీక్ పదం 'ఇస్తోరియా'కు అర్థం, 'అన్వేషణ' లేదా, 'పరిశోధన' లేదా, 'పరిశీలన'. ఈ అన్వేషణ దేన్ని గురించి అంటే, గతం గురించి అని చెప్తాం. ఈ పరిశీలన ఎవరి గురించి, దేన్ని గురించి అంటే, మానవ జగత్తు గురించి అని తెలిసిందే. మానవుడు అనాగరిక దశను దాటి, విచక్షణా జ్ఞానాన్ని పెంపొందించుకుని సంఘజీవనం ఆరంభించినప్పటినుండి, చరిత్రను అధ్యయనం చేస్తున్నాం. అది ఒక కల్పిత గాథ కాదు. పుక్కిట పురాణం కూడా కాదు. కాలక్రమేణా

BRAOU

జరిగిన మానవ నాగరికతా, సంస్కృతుల పరిణామాన్ని వివరించేది. ఈ మానవ నాగరికతా పరిణామాన్ని వివరించేందుకు, గతంలో జరిగిన సంఘటనలపై చరిత్రకారుడు ఆధారపడతాడు. ఈ సంఘటనలను అతడు యదార్థాల నుండి గ్రహిస్తాడు. ఏ చారిత్రక అన్వేషణకైనా, యదార్థాలు ముడిసరుకు. యదార్థాలు లేకుంటే, చరిత్ర లేదని చెప్పాలి. అలాగని, యదార్థాలే చరిత్రకు సర్వస్వం కాదు.

## 2.3 చారిత్రక యదార్థాలు

ఉపయోగించే సాంకేతిక నైపుణ్యం దృష్ట్యా, చరిత్ర శాస్త్రమనీ, మానవాళి కార్యకలాపాలకు, అనుభవాలకు సంబంధించిన ప్రాధాన్యత వహించిన కథనాన్ని అందిస్తుంది గనక, ఇది కళ యని పలువురి అభిప్రాయం. చరిత్రకారుడు మానవుని ఈ కార్యకలాపాలను, అనుభవాలను ఏ విధంగా తెలుసుకోగలుగుతున్నాడు? తప్పనిసరిగా చారిత్రక యదార్థాల ద్వారా మాత్రమే, తెలుసుకోగలుగుతున్నాడు. చారిత్రక యదార్థమంటే ఏమిటి? ఇతర విజ్ఞాన విభాగాల్లోని యదార్థాలకు, దీనికి తేడా ఉందా? ఒక విధంగా, చరిత్రలో యదార్థాలు అసదృశమైనవే. ఎందుకంటే, ఇవి గతాన్ని వర్ణిస్తాయి. అంటే, ఇవి గత యదార్థాలన్నమాట. గతించిన కాలానికి సంబంధించినవి కాబట్టి, ఈ చారిత్రక యదార్థాలు, అంచనాలు ఖచ్చితమైనవని ఎలా తెలుసుకోడం? చారిత్రక ప్రమాణం దృష్ట్యా మాత్రమే, యదార్థాలను పరీక్షించగలం. ప్రత్యక్ష పరిశీలనకు గతమనేది మన ముందు సజీవంగా లేకున్నప్పటికీ, గతానికి సంబంధించిన, గత కాల సంఘటనలు వదిలి వెళ్లిన అనేక అవశేష దృశ్య చిహ్నాలను, యదార్థాల నిరూపణకు అధ్యయనం చేయవచ్చు, ఉపయోగించుకోవచ్చు. చారిత్రక సంఘటనలు ఒకప్పుడు వాస్తవంగా జరిగినవే అయినా, ఇప్పుడు కంటికి కనిపించేవికావు. వాటి చిహ్నాలే, వాటిని వాస్తవమైనవిగా మనముందు నిలబెడుతున్నాయి. చరిత్రకారుడు ప్రత్యక్షంగా పనిచేసేది వీటితోనే. ఈ అవశేష చిహ్నాల ద్వారానే, అతడు సంఘటలను గురించి ఆలోచిస్తాడు. వీటి సహాయంతోనే, గతకాల సంఘటనల క్రమబద్ధమైన, తార్కికమైన చరిత్ర కథనాన్ని పునర్నిర్మిస్తాడు.

చరిత్ర అనేది గత కాల సంఘటనల విశ్లేషణ, వివరణ, వర్ణనలకు సంబంధించింది గనక, చరిత్రకారుడు చారిత్రక యదార్థాల స్వభావాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. చరిత్రకారుని దృష్టి ప్రాథమికంగా, చారిత్రక యదార్థాల విమర్శనాత్మక పరిశీలన, చారిత్రక సాక్ష్యాల స్వభావంపై ఉంటుంది. గతంలో జరిగిన ప్రతిదీ, చరిత్రలో యదార్థమే. ఈ యదార్థాలు వాల్ష్ పేర్కొన్నట్లు, 'సూక్ష్మ యదార్థాల అసంబద్ధ రాశి.' వేటికవే విడివిడిగా వివిధ చరిత్ర ఆధారాల్లో చెల్లాచెదురై ఉన్న పరమాణువుల వంటివి. వీటిలో అత్యధికం ఉపేక్షితావస్థలో ఉండి, చరిత్రకారునికి లభ్యం కావు. జిజ్ఞాసతో పరిశీలించే మనస్తత్వం ఉన్న చరిత్రకారుడు, తాను వ్యవహరించే విషయానికి అన్వయించే యదార్థాలను ఎంపిక చేసుకుని, వాటికి ప్రాధాన్యతను ఆపాదించకుంటే, ఈ యదార్థాలు అచేతనంగా, అర్థరహితంగా మిగులుతాయి. మరోరకంగా చెప్పాలంటే, చరిత్రకారుని స్పందన, చైతన్యం యదార్థాల ఉనికికి సార్థకత నిస్తున్నది.

చరిత్రలో ఏం చెప్పినా, యదార్థాలపై ఆధారపడకుంటే అది సత్యం కాబోదు. యదార్థాలు కళ్లెదుట కన్పించే శిలలు. వీటిపైనే, సత్యాన్ని నిర్మించటం జరుగుతుంది. యదార్థాలే లేకుంటే, చరిత్రలో హేతువుకు సార్థకత లేదు. చరిత్రకారుని కథనం యదార్థాల ప్రామాణికతపై ఆధారపడి ఉంటుంది.

115054
Dr. BRAOU
(BRAOU)
Acc. No.
Class No.

ఆధారాల విశ్వసనీయతను నిర్ధారించడం, వాటిని విశ్లేషించడం, చరిత్ర కథనాన్ని పేనడానికి కావాల్సిన యదార్థాలను వాటినుండి రాబట్టే ప్రయత్నం చేయడం - ఇవన్నీ ఈ ప్రక్రియలో అంతర్భాగమే. సాధారణ యదార్థాలనుండి చారిత్రక యదార్థాలను వేరుచేయడం, చరిత్రకారుని ప్రాథమిక విధి. యదార్థాల ప్రామాణికతను నిర్ధారించుకోవాలి. ఆ యదార్థాలే నమ్మదగ్గ సాక్ష్యాలని ధృవీకరించుకోవాలి. సాక్ష్యాధారాలతో నిజాన్ని రాబట్టటం, అదనపు సాక్ష్యం ఆధారంగా దాన్ని రూఢిపర్చుకోడం, ఇతర సామ్యాలతో సరిచూడటం - ఇదంతా ఈ ప్రక్రియలో భాగమే.

## 2.4 మౌలిక యదార్థాలు

ఈ సందర్భంలో, ఇ.హెచ్. కార్ చెప్పిన ఒక విషయం గుర్తుంచుకోవాలి. కొన్ని మౌలిక యదార్థాలనేవి ఉంటాయి. ఇవి, చరిత్రకారులందరికీ ఒక్కటే. ఇవే, చరిత్రకు వెన్నెముక లాంటివి. ఉదాహరణకు, 1526లో జరిగిన మొదటి పానిపట్టు యుద్ధం. ఇది ఒక మౌలిక యదార్థం. చరిత్రకారుడు ఇటువంటి మౌలిక యదార్థాల గూర్చి ప్రాథమికంగా పట్టించుకోడు. నిజమే ....... యీ యుద్ధం ఎప్పుడు జరిగింది. ఎక్కడ జరిగింది, ఎవరెవరికి జరిగింది తెలియడం ముఖ్యమే. చరిత్రకారుడు వీటి విషయంలో, తప్పని సరిగా దోషరహితంగా ఉండాలి. ఈ మౌలిక యదార్థాలకు సంబంధించి ఖచ్చితత్వం రాబట్టడం, అతడు తప్పనిసరిగా పాటించాల్సిన విధి. ఇదేదో గొప్ప సుగుణమని అతణ్ణి పొగడాల్సిన పని లేదు. మౌలిక యదార్థాల విషయంలో ఖచ్చితత్వాన్ని రాబట్టటానికి, అతడు చరిత్ర, అనుషంగిక శాస్త్రాలపై ఆధారపడతాడు. చరిత్రకు ఇటువంటి యదార్థాలు ముడిసరుకే కాని, ఇవే చరిత్ర కాదు. ఇవి చరిత్రకారులందరికీ సమానమే. ఈ మౌలిక యదార్థాలను నిర్ధారించే ఆవశ్యకత అనేది, వీటిలో ఉన్న ఏదో శ్రేష్ఠతపై కాక, చరిత్రకారుడాపాదించే ప్రాధాన్యత నిర్ణయంపై ఆధారపడి ఉంది. దీన్ని ప్రభావితం చేసే కార్యసాధక పద్ధతి ఒక్కటే. సరైన యదార్థాలను ఎంచుకోడం, పేర్చుకోడంపై ఉంది.

BRAOU

కిట్సన్ క్లార్క్ చెప్పినట్లు, చరిత్రలో ఏభాగంలోనైనా ఏదో మేర నిజముంది. అంటే, అది యదార్థాలకు సంబంధించిన భాగం మాత్రమే. చరిత్రకారుడు చేసే మొత్తం వ్యాఖ్యానం, మొత్తం పునర్నిర్మాణం ఊహాత్మకమే. ఈ ఊహ యదార్థాలను గౌరవించకుంటే, అది విలువలేంది, వంచనా పూరితమూను. ప్రత్యక్ష జ్ఞానవాదంచే ప్రభావితులైన కొందరిలో, యదార్థాలు వాటంతటవే మాట్లాడతాయని భావించటం, ఒక నాగరిక లక్షణమైంది. కాని, ఇది నిజం కాదు. వాటి తరఫున, వాటి ఆధారంగా, వాటి ద్వారా, చరిత్రకారుడే భాషిస్తున్నాడు. అతడే, యదార్థాలను మాట్లాడేలా చేస్తున్నాడు. ఏ చారిత్రక వివరణలోనైనా, యదార్థాలు అంతర్గతంగా ఉండక తప్పదు. చరిత్రకారుని ఊహకు, అతని ఆలోచనా సరళికి, విశ్లేషణకు పరిమితుల్ని నిర్ణయించటమే, యదార్థాలు నిర్వర్తించే పని. నిజమైన చరిత్రకారుడెవరూ వీటి పరిధిని అతిక్రమించడు. చరిత్రకారుడే వీటిని యదార్థాలుగా నిర్దేశిస్తున్నాడు. వేటిని ప్రస్తావించాలో, వేటికెంత ప్రాధాన్యతనివ్వాలో, ఏ క్రమంలో, ఏ సందర్భంలో చెప్పాలో, అతడే నిర్ణయిస్తున్నాడు. గతానికి సంబంధించిన అసంఖ్యాకమైన యదార్థాల్లో కొన్నింటికే, అతడు చారిత్రకత నాపాదిస్తున్నాడు. ఒకప్పుడు మామూలు యదార్థంగా, ఏప్రాధాన్యతా లేంది ఆ తర్వాత, చారిత్రక యదార్థంగా చరిత్రకారుని చేతుల్లో ప్రాధాన్యతని సంతరించుకోవచ్చు. బారక్లో

అన్నట్లు మనం చదివే చరిత్ర, యదార్థాలపై ఆధారపడ్డదైనా, ఖచ్చితంగా చెప్పాలంటే, వాస్తవం కానే కాదు. అంగీకరింపబడ్డ తీర్పుల పరంపరయే.

## 2.7 చారిత్రక యదార్థాల నిర్దేశంలో చరిత్రకారుని పాత్ర

'ధృవీకృత యదార్థాల సముదాయమే చరిత్ర' అనే భావన, గత శతాబ్దంలో చాలా ప్రబలంగా ఉండేది. చరిత్ర ఆధారాల వల్ల లభిస్తున్న బహుళ సమాచారం నుండి, యదార్థాలేవి నిర్ధారించబడుతున్నాయి. ఇతర సాక్ష్యాలు వీటిని ధృవీకరిస్తున్నాయి. ఈ విధంగా, ధృవీకరించిన యదార్థాలన్నిటినీ సంకలనం చేసే ఒక మాలగా కూరిస్తే, అది చరిత్ర అవుతుందా? అలా అయితే, ఆ చరిత్ర బ్రిటీష్ చరిత్ర తత్వవేత్త కాలింగ్‌వుడ్ చెప్పినట్లు, అతుకుల బొంత అవుతుంది. నాగరికతా పరిణామాన్ని విశదం చేయలేని అటువంటి సంకలనం, చరిత్ర ఎలా అవుతుంది? యదార్థాలే సర్వస్వం ...... యదార్థాలే చరిత్ర అని భావించిన 19వ శతాబ్ది చరిత్రకారులు, తత్వవేత్తలు యదార్థాల కిచ్చినంత ప్రాధాన్యతను, అవి లభించే సాక్ష్య పత్రాలకూ ఇచ్చారు. అంతగానూ ఆరాధించారు. కాని, ఏ సాక్ష్య పత్రమైనా (గ్రంథం కావచ్చు, శాసనం కావచ్చు మరే ఆధారమైనా కావచ్చు) ఆ పత్రకర్త లేదా, రచయిత ఏమనుకుంటున్నాడో, పాఠకుడేవిధంగా అనుకోవాలనుకుంటున్నాడో అదే తెలియజేస్తుంది తప్ప, అంతకు మించి తెలుపదనే విషయాన్ని విస్మరించారు. సాక్ష్య పత్రాల్లో లభించిన, లేక, లభించని యదార్థాలను చరిత్రకారుడు తన కథనంలో ఉపయోగించుకోడానికి ముందు, యింకా చాలా ప్రక్రియకు లోనుచెయ్యాలి. చరిత్రకు యదార్థాలెంత ముఖ్యమో, ఆయదార్థాలను నిర్దేశించే, వాటిని వ్యాఖ్యానించే చరిత్రకారుడూ అంతే ముఖ్యం. యదార్థాలు వాటంతటవి మాట్లాడలేవని ఇంతకు పూర్వమే చెప్పుకున్నాం. ఆ యదార్థాలను నిర్ణయించేవాడు, వాటితో మాట్లాడించే వాడు చరిత్రకారుడు. చరిత్రకారుని దృక్పథం, రచనా ధోరణి చారిత్రక యదార్థాల ఎన్నికపై ఆధారపడి ఉంటుంది. అంతేగాక, ఏ యదార్థాలకు ప్రాధాన్యమివ్వాలి, ఏ సందర్భంలో ప్రవేశపెట్టాలి, ఏ వరసలో ప్రవేశపెట్టాలి అనేది కూడ చరిత్రకారుడే నిర్ణయిస్తాడు గనక, అతను ఆలోచించిందే చరిత్ర.... అతని అనుభవమే చరిత్ర అవుతుంది. చరిత్ర, చరిత్రకారునిచే సృష్టించబడుతుంది. అయితే, 'భావాల చిత్రే చరిత్ర' అనే కాలింగ్‌వుడ్ వంటివారి అభిప్రాయంలోనూ లొసుగులున్నాయి. చరిత్ర నిర్మాణంలో చరిత్రకారునికే పెద్ద పీట వేస్తే, వస్తుగతమైన, లేదా, విషయ నిష్ఠతో కూడిన చరిత్ర లేదనాల్సి వస్తుంది. అలాగే, చరిత్రకారుడు తాను పరిశీలిస్తున్న కాలాన్ని తనకాల దృష్టి కోణం నుండి పరిశీలించినప్పుడు, చరిత్ర సరైన వ్యాఖ్యాన లక్షణం, సమకాలీన ప్రయోజనాలను తీర్చడమే అవుతుంది. అటువంటప్పుడు, చరిత్రలో యదార్థాలకు విలువ ఉండదు. వ్యాఖ్యానమే ప్రధానం అవుతుంది. ఇది సరికాదు.

## 2.6 కార్ వ్యాఖ్యానం

ముందే చెప్పినట్లు చరిత్రకు యదార్థాలెంత ముఖ్యమో, ఆ యదార్థాలను, వాటి ప్రాధాన్యతను నిర్దేశించే చరిత్రకారుని వ్యాఖ్యానమూ అంతే ముఖ్యం. చరిత్రకారుడు నిర్వర్తించాల్సిన విధిని తెలుపుతూ, చరిత్ర అంటే ఏమిటి అనేది వివరిస్తూ, ఇ.హెచ్. కార్ ఈ క్రింది విధంగా చెప్పాడు:

BRAOU

'చరిత్రకారుడు యదార్థాలను తాత్కాలికంగా ఎంపికచేసి, దేని సహాయంతో ఎంపిక చేశాడో ఆ తాత్కాలిక వ్యాఖ్యానంతో ఒక ప్రాథమిక చట్రాన్ని సమకూర్చి, తన చరిత్ర నిర్మాణ కార్యక్రమాన్ని ఆరంభిస్తాడు. ఆ కార్యక్రమంలో తీసుకున్న యదార్థాలు, వ్యాఖ్యానం ఇతరులవి కావచ్చు, తనవే కావచ్చు. చరిత్ర నిర్మాణంలో అతడు ముందుకుసాగే కొద్దీ, వ్యాఖ్యానం, యదార్థాల ఎంపిక, వాటి వరస, ఒక దాన్ని మరొకటి పరస్పరం ప్రభావితం చేసుకుంటూ అతని ప్రమేయం లేకుండానే, క్రమేణా మార్పుకు లోనవుతాయి. చరిత్రకారుడు వర్తమానానికి, అతని యదార్థాలు గతానికి చెందినవి కాబట్టి, ఈ పరస్పర కార్య విధానం వర్తమానానికి, గతానికీ కూడ ఉంటుంది. కనుక, చరిత్రకారుడు, చారిత్రక యదార్థాలు ఒకదానికొకటి పరస్పరం అవసరం. యదార్థాలు లేని చరిత్రకారుడు మూల రహితుడూ, నిష్ఫలుడూ; చరిత్రకారుడు లేని యదార్థాలు మృతప్రాయం, అర్థరహితం అవుతాయి. కాబట్టి, చరిత్ర అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం - చరిత్ర చరిత్రకారునికీ, అతని యదార్థాలకూ మధ్య అవిచ్ఛిన్నంగా సాగే, పరస్పర కార్య విధానం. వర్తమానానికీ గతానికీ మధ్య జరిగే, అనంతమైన సంభాషణ.

## 2.7 యదార్థాల స్వభావం

BRAOU

చరిత్ర గత కాల సంఘటనల విశ్లేషణ, వివరణ, వర్ణనలకు సంబంధించింది. గనక, చరిత్రకారుడు యదార్థాల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ముందే చెప్పుకున్నాంగదా! అతని వ్యక్తిత్వం, ఆలోచనా సరళి ప్రభావం, ఈ యదార్థాలపై పడకుండా ఉండటం అసాధ్యం. గత కాల సంఘటనలపై అతని సానుభూతితో కూడిన, లేదా, వ్యతిరేకమైన ఉద్దేశాలు, ఆలోచనలు, వివేకం, ఎంతో కొంత ప్రభావం చూపించక మానవు. చరిత్రకారుడు విషయగతంగానే ఉండాలని ఎంత ప్రయత్నించినా, అతడు పూర్తిగా పక్షపాత రహితుడు కాలేడు. గతం గురించిన తన అధ్యయనానికి అతడే విలువల ప్రమాణాన్ని అన్వయిస్తున్నాడో, అది సమకాలీన (అతని కాలపు) సాధారణ, సామాజిక, తాత్విక, మత, ఆర్థిక భావాల పరిధిలోనే నిర్ణయించబడుతున్నది. సమకాలీన భావాల ప్రాబల్యం, చరిత్ర ఆధారాలను శోధించి, యదార్థాలను వెలికితీయడంలో, అనేక ఇతర శాస్త్రాలు అందిస్తున్న నూతన సాంకేతిక విధానాలు, చరిత్ర నెప్పటికప్పుడు మలుపు తిప్పుతూనే ఉన్నాయి. పురాతత్వ శాస్త్రం, సంఖ్యా పరిశీలన శాస్త్రం, రేఖాచిత్ర సూత్ర విజ్ఞానం, ఛాయాచిత్రణం, రేడియోగ్రఫీ, మనోవిజ్ఞాన శాస్త్రం, పరాగ విశ్లేషణం వంటివి, గతం గురించిన అనేక కొత్త యదార్థాలను వెలుగులోకి తెచ్చాయి.

మానవ సమాజంలో అభివృద్ధి, పరిణామాలు అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటాయి. అభివృద్ధి అనేది, నిర్దిష్టమైన రీతిలోనే ఉంటుంది. రాజకీయ సంస్థల విషయమే చూస్తే, జీవన భద్రతకు, ఆస్తిపాస్తుల రక్షణకు, ప్రభు వర్గ పాలన, ధనిక వర్గ పాలన, రాచరికం, ప్రజాస్వామ్యం మొదలైన వివిధ రకాల ప్రభుత్వాల ఏర్పాటుకు, ఆయాకాలాల్లో పరిస్థితులు దారితీయటం కనిపిస్తున్నది. సంస్థ కానివ్వండి లేదా, వ్యవస్థ కానివ్వండి, లోపాలతో సంక్లిష్టమైనప్పుడు మరొదాని అవసరం వస్తుంది. చరిత్రలో మనకు రెండు సమస్యలు ఎదురౌతాయి. ఇందులో మొదటిది, సంఘటనలను గురించిన పరిజ్ఞానం, లేదా, ప్రాపంచిక అనుభవం. రెండోది, యీ అనుభవాన్ని మానవాళికి తెలియజేయడానికి

చరిత్రకారునికుండాల్సిన అవగాహన, సమర్థత. అనుభవం పాఠం అనుకుంటే, దాన్ని గురించిన ఆలోచనను వ్యాఖ్యానంగా తీసుకోవచ్చు. అంటే, నిర్ధారిత యదార్థాలను పాఠంగా, వీటి వివరణ భాగాన్ని వ్యాఖ్యానంగా భావించవచ్చు. యదార్థాలను వరసగా చెప్పుకుంటూ మాత్రమే వెళ్తే, అవి ఏం సూచిస్తున్నాయో విశ్లేషించకుండా ప్రచురించినట్లే ఉంటుంది. యదార్థాల ధృఢమైన పునాది లేకుండా, సాధారణమైన వ్యాఖ్యానానికి పూనుకుంటే, అది పూర్తిగా ఊహాగానంతో రాసిన కట్టు కథ లాంటి నవలే అవుతుంది.

## 2.8 చరిత్ర పునరావృతమౌతుందా?

చారిత్రక యదార్థాల స్వభావానికి సంబంధించి, యింకా కొన్ని ఇతర అంశాలూ ఉన్నాయి. యదార్థాలను, తద్వారా చరిత్ర స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని కొందరు చరిత్రకారులు, 'చరిత్ర పునరావృతమౌతుంద'ని భావిస్తారు. మరి కొందరు దీన్ని తిరస్కరిస్తారు. ఈ రెంటినీ పాక్షికంగానే అంగీకరించవచ్చు. చారిత్రక సంఘటనలు ఒకేరీతిగా ఒకేచోట జరగకున్నా, సూక్ష్మంగా పరిశీలిస్తే, ఆ సంఘటనల వెనకాల ఏకత్వం, ఒక నమూనా కనిపిస్తుందనే భావన, చరిత్ర పునరావృతమౌతుందనే ఆలోచనకు దారితీసింది. ప్రకృతిలో రుతువులు తిరిగి సంభవిస్తున్నట్లే, చరిత్రలో పరిణామాలూ పునరావృతమౌతాయని ప్రాచీనులు భావించారు. గ్రీక్, రోమన్, హిందూ సంప్రదాయాలు చారిత్రక ఆవృత్తులను తెలిపాయి. మానవ ప్రగతి పథం సరళ రేఖ కాదనీ, అదృష్ట, దురదృష్టాలు ఒక దాని వెంట మరొకటి వెన్నంటే ఉంటాయని, వారు అభిప్రాయపడ్డారు. చరిత్ర చక్రీయమనీ, సంఘటనలు పునరుక్తాలనీ, అవే పరిణామాలు సంభవం అనీ, ప్రాచీన కాలంలో గ్రీక్ చరిత్రకారుడు థుసిడైడ్స్ వెలిబుచ్చిన అభిప్రాయమే, ఈ 20వ శతాబ్దంలో జర్మన్ చరిత్రకారుడు స్పెన్గ్లర్, బ్రిటీష్ చరిత్రకారుడు టాయన్బీల వరకు ప్రబలంగా ఉంది. అయితే, చరిత్ర ఎప్పుడూ ఖచ్చితంగా పునరావృతం కాదనే చెప్పాలి. ప్రతి సంఘటన దేనికదే ప్రత్యేకమైందే, కాని, పూర్వాపరాలతో కార్యకారణ సంబంధం రీత్యా, యితర సంఘటనలకు బద్ధమై ఉంటుంది. చరిత్రలో మనకు సాదృశ సంఘటనలు ఎదురౌతాయి కాని, ఏకరూప సంఘటనలు ఎదురవవు. సంఘటనలు ఒకేలా కన్పిస్తాయోమోకాని, ఎప్పుడూ ఒక్కటి కావు. కార్ పేర్కొన్నట్లు, చారిత్రక పరిజ్ఞానం ఉన్న ప్రజల్లో, చరిత్ర చాలా అరుదుగా పునరావృతమౌతుంది. కారణం, గతంలో ఒక చారిత్రక సంఘటన ఎలా ముగిసిందో, తర్వాత తరాల వారికి తెలిసినప్పుడు, వారి ప్రవర్తన ఆ పరిజ్ఞానం వల్ల ప్రభావితం అవుతుంటుంది. అయినా, చరిత్ర పునరావృతమౌతుంది అనే ఆలోచన, మనిషి సృజనాత్మక క్రియాశక్తులకు గొడ్డలి పెట్టుగానే భావించాలి.

## 2.9 చరిత్ర మొత్తం సమకాలీనమే

యదార్థాలను, తద్వారా సంక్లిష్టమైన చరిత్ర స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొనే, చరిత్ర పునరావృతమౌతుంది అనే భావన పర్యవసానంగా, ఈ శతాబ్ది ఆరంభంలో ఇటలీకి చెందిన చరిత్రకారుడు క్రోస్ 'చరిత్ర సమస్తం సమకాలీనమే' ననే తత్వాన్ని ప్రచారం చేశాడు. యదార్థాలను విచక్షణ లేకుండా ప్రతికరించడం కాక, వాటికి విలువకట్టడం చరిత్రకారుని ప్రధాన కర్తవ్యమనీ, ఆ ప్రయత్నం

విశ్లేషించి, సూత్రీకరించి, వ్యాఖ్యానించటంతో ఒక తత్వవేత్తగా, ఈ ప్రక్రియల ఫలితాలను పాఠకులకు తనదైన భాషా శైలిలో అందించటంలో ఒక సాహితీవేత్తగా, చరిత్రకారుడు రూపుదాలుస్తున్నాడు.

చరిత్రకారుడు లేదా, చరిత్ర పరిశోధకుడు స్వీయ ప్రతిభతో, యింతకు ముందు ఎవరూ చేయని రీతిలో, తనకు తానుగా ఆలోచిస్తూ కొత్త సమాచారాన్ని కనుక్కోడం, ముందే తెలిసిన విషయానికి కొత్త వివరణ ఇవ్వడం, సమాచారాన్ని సూత్రబద్ధం చేయటం ద్వారా, విజ్ఞాన పరిధిని విస్తరిస్తాడు. గతాన్ని సంపూర్ణంగా మన కళ్లముందు నిలబెట్టాడానికి, జరిగింది జరిగినట్లు గతకాల సంఘటనలను పునర్నిర్మించటానికి, యింతవరకూ దురభిప్రాయాలేవైనా ఉంటే, వాటిని సరిదిద్దటానికి, మనకున్న విషయ పరిజ్ఞానం దృష్ట్యా, భావాలను విస్తరించటానికి, విశ్లేషించటానికి, సమన్వయించి సిద్ధాంతీక రించటానికి, అతడు గతాన్ని లోతుగా పరిశీలిస్తాడు. ఈ విధమైన చరిత్ర పరిశోధనకు, చరిత్ర రచనకు సంబంధించిన ఒక ప్రధాన విభాగమే, చారిత్రక పద్ధతి. ఇది చారిత్రక సత్యాన్వేషణలో, సమర్పణతో అనుసరించే ప్రక్రియ. వివిధ దశల్లో సాగే చరిత్ర రచనా సంవిధానాన్ని విశదం చేసే, ఒక సాధన మిది. చారిత్రక యదార్థాల స్వభావం ఎంత సంకీర్ణమో, ఎంత సంక్లిష్టమో దృష్టిలో ఉంచుకుంటే, చరిత్ర రచన అంత సులువైన విషయం కాదని స్పష్టమవుతుంది. చరిత్ర సామగ్రిని చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలి. సుసంగతమైన చరిత్ర ఆధారాలన్నిటినీ శ్రద్ధతో సేకరించటం, సామగ్రిని గావించటంలో జాగ్రత్త వహించటం, సాక్ష్య పత్రంలో ఉన్న పాఠం నిఘంటు వాస్తవిక అర్థాలను విమర్శనాత్మకంగా పరిశీలించటం, ఆ పత్ర రచయిత పరిశీలనలోని ఉద్దేశాలను, ప్రేరకాలను ఆమూలాగ్రంగా శోధించటం, అవకాశం ఉన్న దోషాలను తొలగించడానికి నిశితంగా పరిశీలించటం, వీటన్నిటితో సత్యానికి దగ్గర కావటానికి, అంచెలంచెలుగా పరిశోధకుడు ఒక క్రమబద్ధమైన విధానంలో ముందుకు సాగుతాడు. ఈ ప్రయాణంలో అతనికి వివేచన, ఊహ, ఓర్పు, నేర్పు, ముందు చూపు, తర్కం, అంతర్దృష్టి కావాలి. గత కాలపు మిగిలి ఉన్న సాక్ష్యానికి చారిత్రక పద్ధతిని అన్వయించి, తద్వారా, తనకు సాధ్యమైనంత మేరకు, విశ్వసనీయమైన సమాచారాన్ని అతడు సేకరిస్తాడు.

BRAOU

## 2.11 చారిత్రక పద్ధతి

చరిత్ర రచనలో సమాచారాన్ని సేకరించటం, సేకరించిన ఆ సమాచారాన్ని విమర్శనాత్మకంగా విలువ కట్టటం, అనంతరం దాన్ని పాఠకులకు అందించటం, మూడు ప్రధాన దశలు. వీటికంటే ముందు, ఉపయోగించే సమాచార విశ్వసనీయతను పరిశోధకుడు నిర్ధారించకుంటే, ఈ ప్రక్రియలన్నీ నిరుపయోగమే. తన పరిశోధనా విషయానికి సంబంధించి, తెలిసిన, తెలుసుకోగలిగిన సమాచారం అంతా రాబట్టాకనే, అతడు ముందుకు సాగుతాడు. సమాచారం లభించే సాక్ష్య పత్రాలను అన్వేషిం చటం, వాటిని సమీకరించటం, చరిత్ర పరిశోధకుడు నిర్వర్తించే ప్రథమ కర్తవ్యం. అతడు ఎక్కడ ఏయే సాక్ష్య పత్రాలు (చరిత్ర ఆధారాలు) లభిస్తాయో తెలుసుకోగలగాలి. వాటిని సేకరించాలి. సేకరించిన ఆ ఆధారాలను విమర్శనాత్మకంగా సూక్ష్మ పరిశీలన చేయటం, అతని రెండో పని. ఈ ప్రక్రియలో, సాక్ష్య పత్రాల ప్రామాణికతను బాహ్య విమర్శ ద్వారా నిర్ధారిస్తాడు. సేకరించిన సాక్ష్యాధారాలు, మంచివో, చెడ్డవో, నమ్మదగ్గవో, కాదో; ప్రామాణికమో, కాదో, అసలైనవో, నకిలీవో పరీక్షిస్తాడు. అంతర్విమర్శ ద్వారా, సాక్ష్యాధారాలు అందించే యదార్థాల (సమాచారం) విలువను నిర్ణయిస్తాడు. అనంతరం, నిర్ధారించిన చారిత్రక యదార్థాలను సమగ్ర సమరస రూపంగా ఏర్పర్చటం,

వాటి కారణ సంబంధమైన మూలాన్ని ధ్రువపర్చుకోవటం చరిత్ర పరిశోధకుని తృతీయ కర్తవ్యం. ఈ దశలో, వేటికవే విడివిడిగా ఉన్న చారిత్రక యదార్థాలను శాస్త్రీయ కార్యకారణ ప్రక్రియలో పరస్పర సంబంధం కలవిగా, ఒక క్రమ పద్ధతిలో వ్యాఖ్యానాత్మకంగా వర్గీకరించి, ఒక అర్థవంతమైన, ఆకర్షణీయమైన రూపంగా ఏర్పరుస్తాడు. దీన్ని చక్కని కథనంగా పాఠకుల ముందుంచటమే, అతడు నిర్వర్తించే చివరి పని.

## 2.12 హీరిస్టిక్స్

చరిత్ర పరిశోధనా ప్రక్రియలో అనుసరించే చారిత్రక పద్ధతి నాలుగు దశల్లో మొదటిదే, 'హీరిస్టిక్స్' (Heuristics). ఈ పదం, జర్మన్ భాషలోని 'హీరిస్టిక్' (Heuristick) నుండి గ్రహించబడింది. అయితే, దీనికి మూలం గ్రీక్ పదం 'హీరిస్కెన్' (Heuriskein). దీనికి అర్థం (కనుగొనడానికి తోడ్పడేది) లేదా, 'పరిశోధనను ప్రేరేపించేది'. చరిత్రకు ముడిసరుకైన యదార్థాలు లభించే, అనేక సాక్ష్య పత్రాల శోధన, సమీకరణాలను 'హీరిస్టిక్స్'గా చరిత్రకారులు పరిగణిస్తున్నారు. ఇది ప్రధానంగా, అనేక రకాల చరిత్ర ఆధార సామగ్రిని సమీకరించి, భద్రపర్చడానికి సంబంధించింది. గతించిన కాలంలో, మనుషుల ఆలోచనలకు, కార్యకలాపాలకు ప్రతీకలుగా మిగిలినవి చరిత్ర ఆధారాలు. ఇవే గతానికి సాక్షీభూతంగా మనకు మిగిలాయి. వీటి ఆధారంతోనే, చరిత్రకారుడు గతాన్ని మనముందు నిలపడానికి ప్రయత్నిస్తున్నాడు. గతకాల సంఘటనలు వదలి వెళ్లిన ఈ అవశేష దృశ్య చిహ్నాలతోనే, అతడు ప్రత్యక్షంగా పనిచేసేది. వీటి ద్వారానే అతడు, సంఘటనలను గురించి ఆలోచిస్తాడు. ఈ ఆధారాల సాయంతోనే, గతకాల సంఘటనల క్రమబద్ధమైన, తార్కికమైన చరిత్ర కథనాన్ని పునర్నిర్మిస్తున్నాడు. ఈ విధంగా నిర్మించే చారిత్రక కథనం, ప్రామాణికకత లభిస్తున్న, వివాదాస్పదం కాని, నిర్దుష్టమైన ఆధారాలపై ఆధారపడి ఉంది. ఇటువంటి చారిత్రక ఆధారాలను సమీకరించటం, వీటిని భద్రపరచటం, పరిశోధకుడు నిర్వర్తించే ప్రథమ కర్తవ్యం. చరిత్ర రచనా వ్యాసంగంలో ఇది మొదటి దశ. ఈ కార్యక్రమం పూర్తి చేయకుండా, అతడు తన పరిశోధనలో ముందుకు సాగలేడు.

చరిత్ర పరిశోధకుడు తనకు ప్రవేశం, ఆసక్తి ఉన్న రంగంలో సరైన అవగాహనతో తగిన పరిశోధక విషయాన్ని జాగ్రత్తగా ఎంచుకున్నాక, గ్రంథాలయాల్లో విద్యావిషయాల, గ్రంథ శీర్షికల, రచయితల జాబితాలను, సంబంధిత జీవిత చరిత్రలు, విజ్ఞాన సర్వస్వాలు, మోనోగ్రాఫుల సూచికలు, అట్లాసులు మొదలైన వాటిని పరిశీలించి, వాటి సహాయంతో తన పరిశోధనా విషయానికి అవసరమైన గ్రంథాల, వ్యాసాల, ఇతర అనేక ఆధారాలపై ఒక జాబితాను తయారుచేస్తాడు. దీన్నే, 'గ్రంథ సూచి' (bibliography) అంటారు. ఇది చరిత్ర పరిశోధకునికి పరిశోధించాల్సిన సామగ్రి పరిధిపై ఒక అవగాహనను కలిగిస్తుంది. పరిశోధనలో ముందుకు సాగే కొద్దీ, ఈ జాబితాలో అవసరాన్ని బట్టి మార్పులు, చేర్పులు వస్తాయి. అందుచేత, మొదట రూపొందించుకొన్నది ప్రాథమిక గ్రంథ సూచి మాత్రమే. ఈ గ్రంథ సూచిని తయారుచేశాక, పరిశోధకుడు తన మొత్తం రచనను సూచించే విధంగా, ఒక నమూనా సంక్షిప్త స్థూల వివరణ (Synopsis or outline) ను రూపొందిస్తాడు. మాధ్యమిక ఆధారాలను అధ్యయనం చేసేటప్పుడు అతనికి యింకా పరిశోధించాల్సినదేమిటో, ఒక అవగాహన ఏర్పడుతుంది. దీన్నిబట్టి మొత్తం పరిశోధక ప్రణాళికకు ఒక బ్లూప్రింట్ లేదా, నమూనా, తార్కికంగా ఒక తాత్కాలిక సంక్షిప్త వివరణను అతడు రూపొందిస్తాడు. అయితే, విషయ పరిశోధనకిదేమీ అడ్డు కాదు.

BRAOU

## 2.13 చరిత్ర ఆధారాల సమీకరణ, వాటిని భద్రపరచటంలో ఆయా సంస్థల పాత్ర

ఈ విధంగా, తన పరిశోధనాంశానికి అనుగుణంగా రూపొందించుకున్న సంక్షిప్త వివరణ, గ్రంథ సూచీల ప్రాతిపదికపై చరిత్రకారుడు అనేక రూపాల్లో లభిస్తున్న మౌలిక, మాధ్యమిక చారిత్రకాధారాలను (సాక్ష్య పత్రాలను) సమీకరించటం ఆరంభిస్తాడు. చారిత్రక సంఘటనలతో ప్రత్యక్షంగా సంబంధం కలిగినవారో, లేదా, ఆ సంఘటనలకు ప్రత్యక్ష సాక్షులైన వారో రచించిన గ్రంథాలు, లేదా, రూపొందించిన యితర సాక్ష్యాలు 'మౌలిక ఆధారాలు'. ఇక సంఘటనలతో ప్రత్యక్షంగా సంబంధం లేనివారు ప్రత్యక్ష సాక్షుల కథనం సహాయంతో రూపొందించిన ఆధారాలను, మాధ్యమిక ఆధారాలుగా పేర్కోవచ్చు. చరిత్రకారుని కథనానికి సాక్ష్యమైన ఈ మౌలిక, మాధ్యమిక ఆధారాలు అనేకం ఉన్నాయి. ఇవి పనిముట్లు, సమాధులు, నగర నిర్మాణాలు, కట్టడాలు, శిల్పాలు, చిత్రలేఖనాలు, మట్టిపాత్రలు, శాసనాలు, నాణేలు మొదలైన భౌతిక వస్తువులు కావచ్చు; లేదా, లిఖిత పూర్వక ఆధారాలు, లేదా, పత్రాలు కావచ్చు. ప్రాచీన భారతదేశ చరిత్ర పునర్నిర్మాణానికి పత్రాలకంటే, భౌతికావశేష చిహ్నాలే చాలా ప్రాముఖ్యం వహించాయి. వీటిని శోధించి సమీకరించటం, భద్రపరచటం విషయంలో, భారత పురాతత్వ సర్వే, ఆయా రాష్ట్రాల పురాతత్వ శాఖలు విశేషంగా కృషిచేస్తున్నాయి. ఈ శాఖలు ఎప్పటికప్పుడు వార్షిక నివేదికలను ప్రచురిస్తున్నాయి. ప్రాచీన భారత చరిత్రలో ఏదైనా విషయాన్ని తన పరిశోధక అంశంగా ఎన్నుకొన్న చరిత్రకారుడు, ఈ నివేదికలను ఇతర ప్రచురణలను తప్పనిసరిగా చూడాల్సిందే.

ఇక లిఖిత పూర్వక ఆధారాలంటే, పత్రాల విషయానికి వస్తే కథా గేయాలు, జానపద వీర గాథలు, యక్షగానాలు, పదాలు, అధికార నివేదికలు, న్యాయస్థానాల తీర్పులు, జ్ఞాపకాలు, స్వీయ చరిత్రలు, డైరీలు, ఉత్తరప్రత్యుత్తరాలు, ఒడంబడికలు, దస్తావేజులు, వీలునామాలు, అనుజ్ఞా పత్రాలు, ధృవ పత్రాలు, రేఖా పటాలు, చిత్ర పటాలు, గ్రంథాలు, కరపత్రాలు, జాబితాలు, వర్ణ చిత్రాలు, నదులు, హక్కుల పత్రాలు, గజెటీర్లు మొదలైనవన్నీ ఈ కోవకు చెందినవే. ఇవి గాక, వార్తాపత్రికలు, సైనిక, దౌత్య సంబంధమైన రహస్య నివేదికలు, డిస్పాచ్‌లు, ప్రశ్నావళులు, ప్రజా వాణిని ప్రతిబింబించే పత్రికల సంపాదకీయాలు, ప్రజాభిప్రాయ ఎన్నికలు, సామెతలు, మౌఖిక సంప్రదాయాలు, ముఖాముఖీ ఇంటర్వ్యూలు మొదలైనవి కూడా, ఆధునిక భారతదేశ చరిత్రలో పరిశోధనకు మనకు ఎంతోకొంత ఉపయోగపడే ఆధారాలే. వీటిలో దేన్ని పూర్తిగా విస్మరించలేం. ఈ పత్రాలను సమీకరించి, భద్రపర్చడంలోను, వాటి జాబితాలను, సమాచార వివరణలను తయారు చేయటంలోను, జాతీయ అభిలేఖనాలయం (National Archives), ఆయా రాష్ట్రాల విభాగాలు, ఎనలేని కృషి చేస్తూ, చరిత్ర పరిశోధకులకు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయి. వీటితోబాటు, చరిత్ర దేవతా నిలయమైన విజ్ఞాన మందిరాలు, గ్రంథాలయాలు కొన్ని ప్రత్యేకంగా ఆయా వ్యక్తుల, ఉద్యమాల, వ్యవస్థల పరిణామాలను తెలుసుకోడానికి, అవసరమైన విజ్ఞాన సాధన సంపత్తిని మనకందిస్తున్నాయి. ఇటువంటి వాటిలో, న్యూఢిల్లీలోని నెహ్రూ మ్యూజియం గ్రంథాలయం, గాంధి స్మారక నిధి, లక్నోలోని ఆచార్య నరేంద్రదేవ్ గ్రంథాలయం, డెహ్రాడూన్‌లో ఎం.ఎన్.రాయ్ సేకరణలు, సిమ్లా, మన రాష్ట్రంలో, ప్రకాశం జిల్లాలోని వేటపాలెం గ్రంథాలయాలు మొదలైన వాటిని ప్రధానంగా పేర్కోవచ్చు. ఇవిగాక, భారత జాతీయ

BRAOU

కాంగ్రెస్ గ్రంథాలయం, పార్లమెంట్ గ్రంథాలయం, ఇంకా అనేక ప్రైవేట్ గ్రంథాలయాలు ఈ కోవకే చెందుతాయి. మధ్య యుగ భారతదేశ చరిత్ర ఆధారాలకు అలిగడ్ ముస్లిం విశ్వవిద్యాలయం ఒక సంపన్న విజ్ఞాన నిలయం.

ఈ రకంగా పలు మార్గాల్లో సేకరించిన ఆధారాలను, చరిత్రకారుడు ఒక క్రమపద్ధతిలో సమర్థవంతంగా అధ్యయనం చేయటానికి వీలుగా ఒక వ్యవహార సరళిని నిర్దేశించుకుంటాడు. ఈ ఆధారాల్లో ఏవి ఉపయోగమో, ఏవి నిరుపయోగమో, ఏ సామగ్రి ఎంతమేరకు తన పరిశోధనాంశానికి యుక్తమో, సేకరించేటప్పుడే ఒక అవగాహనకు వచ్చి ఉంటాడు. మొదట్లో, అపరిమితంగా ఆధారాల నుండి నోట్స్ తీసుకొనే పరిశోధకుడు పోనుపోను అనుభవం మీదట ఆ ఆధారాల విలువను అంచనా వేస్తూ, ఆత్మ విశ్వాసంతో సమర్థవంతంగా అవసరమైన మేరకే, ఆయా అంశాలను తీసుకుంటూ ముందుకు సాగుతాడు. ఇక చరిత్రాధారాల ప్రామాణికత, విలువలను అతడు పరిశీలించాలి, పరీక్షించాలి అంటే, తన పూర్వీకులు అందించిన వివరాలను పరీక్షించటం, అందిన సమాచారం అసంపూర్ణ భాగాల వాస్తవికతనో, లేదా, వాటి సంభావ్యతనో అతడు విమర్శన ప్రక్రియలో నిర్ణయిస్తాడు. సాక్ష్య పత్రాల్లోని లొసుగులను, దోషాలను తొలగించి, ఏది ఎంతవరకు అంగీకార యోగ్యమో నిర్ణయిస్తాడు. ఒక్కొక్క ఆధారం, దానిలోని అంశాలను విడివిడిగా విశ్లేషిస్తే, యదార్థాలు వెలుగు చూస్తాయి. మరి ఈ యదార్థాలే చరిత్రకు ముడిసరుకు. కనకనే, సేకరించిన పత్రాల ప్రామాణికతకు ప్రాముఖ్యం యివ్వాలి. సాక్ష్య పత్రాలు అసలైనవో, నకిలీవో, కాలపరిగణనలో పొరపాట్లేమైనా వచ్చాయో లేదో, వ్యాఖ్యానాలు (Interpolations), చేర్పులు ఉన్నాయో లేదో, చరిత్రకారుడు అపరాధ పరిశోధకునిలా, అనేక పరీక్షలను నిర్వహించాలి. ఈ విషయంలో పురాతత్వ శాస్త్రం, ప్రాచీన లిపి శాస్త్రం, భూవిజ్ఞాన శాస్త్రం, సమాజ శాస్త్రం, మనోవిజ్ఞానం వంటి అనేక అనుషంగిక శాస్త్రాలు, చరిత్ర ప్రమాణాల నిజ స్వభావాన్ని స్పష్టీకరించి, నిరూపించటానికి సహాయపడుతున్నాయి. సాక్ష్య పత్ర కర్తృత్వం, ఆ పత్రం లభించిన చోటు, అది ఏ కాలానికి చెందింది – ఇవి చరిత్రాధారాల బాహ్య రూపాలు. వీటిని బాహ్య విమర్శలో నిర్ధారించి, చరిత్రాధారాల విషయ విశ్వసనీయతను చరిత్రకారుడు అంతర్విమర్శ ప్రక్రియ ద్వారా నిర్ణయిస్తాడు. సాక్ష్య పత్రాల రచయితల విశ్వసనీయత, విషయ ప్రామాణికతలను నిర్ధారిస్తేగాని, అసలు సిసలు యదార్థాలు వెలుగులోకి రావు. ఈ విధంగా, విమర్శన ప్రక్రియ చరిత్రకారునికి యదార్థాల విశ్వసనీయతను, ప్రామాణికతను తెలుసుకోడానికి సహాయపడుతుంది. ఇలా నిగ్గుతేలిన యదార్థాల సరైన సమన్వయీకరణం, వర్గీకరణం, సంఘటనల మధ్య సంబంధాల గూర్చిన అవగాహన, ఈ యదార్థాల తుది కథనం, చరిత్ర రచనలో అనంతర ప్రక్రియలు.

హ్యూరిస్టిక్స్, విమర్శనల ద్వారా సేకరించి, నిర్ధారించిన చారిత్రక యదార్థాల సహాయంతో, ఎప్పుడు ఏ పరిణామం ఎందుకు వచ్చిందో, ఆ పరిణామానికి వెనుకనున్న చరిత్ర చోదక శక్తులు ఏమిటో, ఆ చోదక శక్తులు ఏ విధంగా గత పరిణామాన్ని ప్రభావితం చేశాయో, చరిత్ర పరిశోధకుడు అధ్యయనం చేయాలి. వాటి ఫలితంగా, సామాజిక రంగంలో వచ్చిన మార్పులను విశ్లేషించాలి. ఈ మార్పులను శాస్త్రీయ దృక్పథంతో, నిష్పక్షపాత ధోరణిలో చారిత్రక ఆభాసలకు, దోషాలకు తావు లేకుండా, చారిత్రక గమనంలో అంతర్భాగంగా అధ్యయనం చేసి, ఏమి జరిగింది, ఎలా జరిగింది, ఎందుకు జరిగింది వివరించినప్పుడు సమగ్రమైన, నిర్దిష్టమైన చరిత్ర లభిస్తుంది.

BRAOU

## 2.14 సంగ్రహంగా

చారిత్రక యదార్థాలు, అవి లభ్యమయ్యే సాక్ష్య పత్రాలను సమీకరించటం, భద్రపరచటం - చరిత్ర రచనలో వీటి ప్రాముఖ్యం గురించి తక్కువగా అంచనా వేయరాదు. గతం గురించిన యదార్థాలన్నీ, చారిత్రక యదార్థాలు కావు. చరిత్రకారుడు తన పరిశోధనాంశానికి అనుగుణంగా, సమకాలీన భావాలను ప్రతిబింబిస్తూ, యదార్థాలకు ప్రాధాన్యతను ఆపాదించటంవల్ల, అవి చారిత్రక యదార్థాలవుతున్నాయి. అయితే, అందరు చరిత్రకారులకు సామాన్యమైన మౌలిక యదార్థాలు వేరు. చరిత్రకారుడు, చారిత్రక యదార్థాలు ఒకదానికొకటి పరస్పరం అవసరం. యదార్థాలు లేని చరిత్రకారుడు మూలరహితుడు. నిష్ఫలుడు. చరిత్రకారుడు లేని యదార్థాలు మృతప్రాయం, అర్థరహితం. యదార్థాల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని చరిత్రకారులు, చరిత్రను వివిధ కోణాల్లో వీక్షించారు. కొందరు చరిత్రను పునరావృతమౌతుందన్నారు. మరికొందరు కాదన్నారు. క్రోస్ వంటివారు చరిత్ర మొత్తం సమకాలీనమేనని వ్యాఖ్యానించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, గతాన్ని వ్యాఖ్యానించటం జరుగుతుందనేది నేమియర్ దృష్టి.

చరిత్ర రచనలో మొదటి దశ, పరిశోధకాంశానికి సంబంధించి చరిత్రకారుడు యదార్థాలు లభించే సాక్ష్య పత్రాలను సేకరించటం, వాటిని భద్రపరచటం ముఖ్యమైంది. దీన్నే హీరిస్టిక్స్ అని పేర్కొంటారు. చరిత్ర ఆధారాలను అనేక రూపాలలో సమీకరించి, భద్రపరచటం, వీటిపై ఎప్పటికప్పుడు నివేదికలు, యితర ప్రచురణలు చేయటంలో, జాతీయ అభిలేఖనాలయం (National Archives), ఆయా రాష్ట్రాల శాఖలు, యితర సంస్థలు ఎనలేని సేవలందిస్తున్నాయి.

BRAOU

## 2.15 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. "చరిత్ర అంటే చరిత్రకారునికి, అతని యదార్థాలకు మధ్య అవిచ్ఛిన్నంగా జరిగే కార్య విధానం; వర్తమానానికి, గతానికి మధ్య జరిగే అనంతమైన సంభాషణ". వివరించండి.
2. చారిత్రక పద్ధతిలో హీరిస్టిక్స్ ప్రాధాన్యాన్ని విశ్లేషించండి.
3. చరిత్ర ఆధారాల సేకరణ కుపయోగించే మార్గాలను పేర్కొని, వాటిని భద్రపర్చడంలో ఆయా సంస్థల పాత్రను విశ్లేషించండి.

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చారిత్రక యదార్థాలంటే ఏమిటి?
2. ధ్రువీకృత యదార్థాల సముదాయమే చరిత్రా?
3. చరిత్ర పునరావృతమౌతుందా?
4. 'హీరిస్టిక్' అంటే ఏమిటి?

## 2.16 ఉపయుక్త గ్రంథాలు


| | |
|---|---|
| Barzun, J. and Graff, Henry F. | : **The Modern Researcher** |
| Butterfield, Herbert | : **Man on His Past** |
| Carr, E.H. | : **What is History?** |
| Clark, Kitson | : **The Critical Historian** |
| Collingwood, R.G. | : **The Idea of History** |
| D'Arcy, S.J.M.C. | : **The Sense of History:Secular and Sacred** |
| Elton, G.R. | : **The Practice of History** |
| George, H.B. | : **Historical Evidence** |
| Gustarson, Carl G. | : **A Preface to History** |
| Hook, Sidney (ed). | : **Philosophy and History** |
| Langlois, C.V. and Seinobos, Ch. | : **Introduction to the Study of History** |
| Marwick, Arthur | : **The Nature of History** |
| Oakeshott, Michael | : **Experience and Its Modes** |
| Renier, G.J. | : **History : Its Purpose and Method** |
| Shafer R.J. | : **A Guide to Historical Method** |
| Teggart, Frederick J. | : **Theory and Processes of History** |
| Thomson, David | : **The Aims of History** |


రచయిత : జాస్తి దుర్గాప్రసాద్

BRAOU

# భాగం-3 : కార్యకారణ సంబంధం

విషయ క్రమం

3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 చరిత్రకారుడు - కారణాలు

3.3 కారణాలు - వాటి సమస్యలు

3.3.1 అసాధారణ పరిస్థితులు (Abnormalities)

3.3.2 స్వచ్ఛంద సిద్ధాంతం

3.4 నిశ్చయతా వాదం (Determinism)

3.4.1 అనివార్యత (Inevitability)

3.5 యాదృచ్ఛికత

3.5.1 యాదృచ్ఛికత - ప్రాముఖ్యత

3.5.2 యాదృచ్ఛికత - వ్యతిరేక వాదం

3.5.3 యాదృచ్ఛికత - సాధారణీకరణ

3.6 కారణాలు - హేతువులు

3.7 కారణాల సాపేక్షత (Relativity of Causes)

3.8 సంగ్రహంగా

3.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

3.10 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 3.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- చరిత్రలో కార్యకారణ సంబంధ ఆవశ్యకతను గూర్చి వివరించగలగాలి.
- కార్యకారణ సంబంధంపై అనేకమంది చరిత్రకారుల సిద్ధాంతాలను గూర్చి విశ్లేషించగలగాలి.

## 3.1 పరిచయం

చరిత్రలో జరిగిన ప్రతి సంఘటనకూ కొన్ని కారణాలు ఉంటాయి. ఆకారణాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించడం, చరిత్రకారుని విధి. అంతేగాక, అనేక సంఘటనలకు సంబంధించిన ఒకే రకమైన కారణాలను గుర్తించి, సాధారణీకరణ చేయడం కూడా, చరిత్రకారుని విధియే. అయితే, 'కారణం' ప్రాముఖ్యత పట్లనూ, దాన్ని చరిత్రకారుడు ఉపయోగించే పద్ధతి పట్లనూ, చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. వారు ఈ విషయాల్లో అనేక సిద్ధాంతాలను ప్రతిపాదించారు. కొందరు చరిత్రకారులు చరిత్రలోని కారణాల గూర్చికాక, వివరణ గురించి మాట్లాడతారు. వీరు సంఘటన ఎందుకు జరిగింది అని ఆలోచించడాన్ని వదిలిపెట్టి, సంఘటన ఎలా జరిగింది అన్నదానికే ప్రాధాన్యత నిస్తారు. కాని, చరిత్ర రచనలో కార్యకారణ సంబంధం గురించి ఆలోచించడం తప్పనిసరి. చరిత్రకారునికీ, వాస్తవాలకూ ఉన్న సంబంధం లాంటిదే, చరిత్రకారునికీ, కారణాలకూ ఉన్న సంబంధం. మాంటెస్క్యూ అనే చరిత్రకారుడు ప్రతి రాజవంశాన్ని ఉన్నతికి తెచ్చి, పోషించి, పడదోసే, సాధారణ, అసాధారణ కారణాలుంటాయనే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ, "ఆ కాలంలో జరిగే అన్ని సంఘటనలూ" ఆ కారణాల మీద ఆధారపడి ఉంటాయని అన్నాడు. అంతేకాక, మానవ ప్రవర్తనకు ప్రకృతి సహజమైన సూత్రాలున్నాయని అన్నాడు. మాంటెస్క్యూ తర్వాత, అనేకమంది చరిత్రకారులు ఇటువంటి సూత్రాలు యాంత్రికమైనవిగా, జీవశాస్త్ర సంబంధమైనవిగా, మనస్తత్వ సంబంధమైనవిగా, భావించారు. కాని, కార్యకారణ సంబంధాన్ని నిరూపిస్తూ, సంఘటనలను ఒక పద్ధతిలో అమర్చడమే చరిత్ర రచన అన్న సూత్రాన్ని, దాదాపు అందరూ అంగీకరించారు. మార్క్ బ్లాక్ అనే చరిత్రకారుడు చాలా ప్రత్యేకమైన, అది ఉద్భవించిన ప్రభావాల మిశ్రమంలో వేరుగా, లేక ప్రత్యేకంగా ఉండే కారకమే కారణమని పేర్కొంటాడు. ఇ.హెచ్. కార్ అభిప్రాయంలో, కారణాలు అతని చారిత్రక వ్యాఖ్యానాన్ని నిర్ణయిస్తే, అతని వ్యాఖ్యానం కారణాలను ఎన్నుకొనే పద్ధతిని నిర్ణయిస్తుంది. కారణాల్లోని భేదాలు కారణాల మధ్యనున్న సంబంధాలను, అతని వ్యాఖ్యానమే నిర్ణయిస్తుంది.

BRAOU

## 3.2 చరిత్రకారుడు - కారణాలు

కారణాలను పరిశీలించే చరిత్రకారునికి కొన్ని లక్షణాలు ఉంటాయని ఇ.హెచ్. కార్ అంటాడు. అందులో మొదటిది, ఆ సంఘటనకున్న అనేక కారణాలను గూర్చి ఆలోచించడం. ప్రతి సంఘటనకూ ఒకే కారణం ఉండదు. అది అనేక కారణాలపై ఆధారపడి ఉంటుంది. అందుకని, చరిత్రకారుడు అనేక కారణాలను గూర్చి ఆలోచిస్తాడు. ఇక రెండోది, ప్రధానమైన కారణాలన్నీ తెలియజేయడం. సంఘటనకు అనేక కారణాలను చూపించి వదిలి వేయడం, చరిత్రకారునికి ఉండాల్సిన లక్షణం కాదు. నిజమైన చరిత్రకారుడు ఈ అనేక కారణాలను ఒక పద్ధతిలో అమర్చుకొని, అందులో ఏది ప్రధానమో, ఏది చిట్టచివరి కారణమో తెలుపుతాడు. ఈ కారణాల మధ్యనున్న సంబంధాలను తెలుసుకొని, వీటిలో ఏది అత్యంత ప్రధానమైన కారణమో (అన్ని కారణాలకూ కారణం) తెలియజేస్తాడు. అందువల్ల, చరిత్రలోని ప్రతి వాదమూ, కారణాల ప్రాధాన్యత చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది.

చరిత్రకారుడు తన పరిశోధనను విస్తృతం చేయడం, లోతుగా పరిశీలించడం ద్వారా, "ఎందుకు"? అనే ప్రశ్న వేసుకుని, దానికి సమాధానంగా అనేక కారణాలను కనుక్కొంటాడు. చరిత్ర పరిధి పెరిగినందువల్ల ఆర్థిక, సామాజిక, న్యాయ చరిత్రలను కూడా, చరిత్రకారుడు పరిశీలించాల్సి ఉన్నందున, ఎందుకు అనే ప్రశ్నకు అనేక జవాబులు లభిస్తున్నాయి.

కార్ల్ పాపర్, ఇసయా బెర్లిన్‌లు, కారణాల ఆధారంగా, సంఘటనలను వ్యాఖ్యానించరాదన్నారు. దీనివల్ల, మానవుని స్వయం నిర్ణయాసక్తిని నిరాదరించినట్లవుతుందని అన్నారు. అంతేగాక, వీరు మార్క్స్, హెగెల్‌ను విమర్శిస్తూ, వీరిద్దరూ చరిత్రలో యాదృచ్ఛికతను గుర్తించలేదన్నారు.

## 3.3 కారణాలు - సమస్యలు

కారణాలను గుర్తించడంలో, చరిత్రకారుడు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అనేక మంది చరిత్రకారులు, అనేక విధాలుగా కారణాలను పేర్కొన్నారు. చరిత్రకారునికి ఎదురయ్యే ముఖ్య సమస్యలేమంటే:

1. చరిత్రకారుడు గణిత శాస్త్రజ్ఞుని లాగే, ఖచ్చితమైన కారణాలను చూపించలేడు. అనేక ముక్కలుగా ఉన్న ఆధారాలతోటి, మానవ ప్రవర్తనాధారంగా కారణాలను కనుక్కోవాల్సి ఉంటుంది.

2. కారణీకరణ భావనకన్నా, దాన్ని విచారించటంలోనే ఎక్కువ సమస్యలు ఉన్నాయని, కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. కొంత మంది కారణాన్ని అతి సామాన్యీకరణ కాదని అన్నారు.

3. యం. ఆర్. కొహెన్ (Cohen) అనే అతడు, ఏ సంఘటన అయినా జరగడానికి, కావాల్సినవి, సరిపోయిన పరిస్థితుల (Conditions) మొత్తాన్ని కారణమని అంటాడు. ఈ వాదాన్నే అనుకూలవాదులు (Positivists) అంగీకరిస్తారు.

4. ఒక సంఘటన జరగటానికి అనేక పరిస్థితులు (Conditions) ఉన్నా, అన్నీ కారణాలు కావు. ఉదాహరణకు, భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి, మహాత్మా గాంధీ ఆరోగ్యవంతంగా ఉండి ఉద్యమంలో పాల్గొనటం అనేది కారణం కాదు. అది ఒక పరిస్థితి (Condition) మాత్రమే. అయితే, కారణాలకూ, ఇటువంటి పరిస్థితులకూ తేడా ఉంటుంది. ఆ తేడా కనుక్కొని అసలైన కారణం తెలుసుకోడమే, చరిత్రకారుని పని. కారణం ఎప్పుడూ దాని కార్యానికి సరైన స్థితిగా ఉంటుందనే విషయాన్ని గుర్తించాలి. కొన్ని సందర్భాల్లో చరిత్రకారుడు కారణమని తలచింది, దాని కార్యానికి (Effect) సరైన స్థితి (Condition) కాకపోవచ్చు. ఉన్న పరిస్థితుల్లో ఆ కారణం ఉంటే, ఆ సంఘటన అనివార్యం అని గుర్తించాలి. కాబట్టి, ఆర్.జి. కాలింగ్‌ఉడ్ అభిప్రాయాల్లో, సాధారణ సూత్రాలను తయారుచేయుట కొరకు సంఘటనకు సరైన కారణాలను వెదకాలి.

హెచ్.ఎల్.ఎ. హార్ట్, ఎ.ఎం. హనర్ అనే చరిత్రకారుల అభిప్రాయంలో, చరిత్రలోకాని, రోజువారీ జీవితంలోకానీ, పరిస్థితులు రెండు రకాలు. అవి అసాధారణ కారణాయుత (abnormalities) పరిస్థితులు, స్వచ్ఛంద మానవ చర్యలు. స్వచ్ఛంద మానవ చర్యలకు కారణాలు ఉండవు.

BRAOU

### 3.3.1 అసాధారణ పరిస్థితులు

వీరిరువురి ఉద్దేశ్యంలో, మానవులకు సంబంధించిన సంఘటనలన్నీ ఒకే రకంగా, ఒక సంప్రదాయమైన, కొన్ని పద్ధతుల్లో పోతూ ఉంటాయి. అయితే, ఒక్కొక్కసారి అవి తమ అసలు (Original) పద్ధతి నుండి మార్పు చెందుతూ ఉంటాయి. ఈ విధమైన తమ సంప్రదాయ పద్ధతి నుండి పక్కకు పోవడం అనేది, అసాధారణం (Abnormality) గా పేర్కొంటూ, ఆవిధంగా, సంప్రదాయ పద్ధతిని రక్షించే విధానం నుండి పక్కకు పోయిన దాన్ని, దాని కారణంగా చెప్పారు. ఉదాహరణకు, ఒక తోటలో పూలు ఎండిపోయినట్లైతే, అది తోటమాలి నీరు పోయక పోవటం వల్లనే, అని చెప్పటం జరుగుతుంది. అంటే, తోటమాలి పూలచెట్లకు నీళ్లు పోయడం అనేది సాంప్రదాయమైందనీ, నీళ్లు పోయక పోవడమనేది, సంబంధిత అసాధారణమనీ, (Abnormality) చెప్పవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం, ఒక సంప్రదాయ పద్ధతిని తప్పడమే, 'కారణం'. సంఘటన జరిగిందీ అంటే, అక్కడ సంప్రదాయ పద్ధతి తప్పినట్లుగా గుర్తించాలి.

## 3.2 స్వచ్ఛంద సిద్ధాంతం

హార్ట్, హానర్ ప్రతిపాదించిన ఇంకో సిద్ధాంతం, స్వచ్ఛంద సిద్ధాంతం. ఇది, కారణం ఒక చైతన్యవంతమైందనే మన సాధారణ భావనకూ, కారణాలను జోక్యాలుగా గుర్తించే మన విధానానికి దగ్గరగా ఉంటుందని. విలియం. హెచ్. డ్రే అనే చరిత్రకారుడు పేర్కొంటాడు. ఒక వ్యక్తి, ఇంకో వ్యక్తి డబ్బు పోగొట్టుకోవడానికి కారణమౌతాడు. అంటే, అనేక సంబంధిత మానవ చర్యల నుండి, స్వచ్ఛందమైన వాటినే కారణాలుగా పేర్కోవాలని, ఈ సిద్ధాంతం తెలుపుతుంది.

BRAOU

## 3.4 నిశ్చయుతా వాదం (Determinisim)

ప్రతి సంఘటన జరగటానికి కొన్ని ప్రత్యేక కారణాలుంటాయి. ఆ సంఘటన వేరు విధంగా జరగాలంటే, కారణాలు కూడా వేరు విధంగా ఉండాలని నమ్మడమే, నిశ్చయుతా వాదం. ఇది, మానవ ప్రవర్తనకు సంబంధించిన విషయం.

మానవ ప్రవర్తనకు ఖచ్చితంగా కారణాలు ఉంటాయి. ఇ.హెచ్.కార్ అభిప్రాయంలో, ప్రతి సంఘటనకు ఒక కారణం ఉంటుందన్న సిద్ధాంతమే, మన పరిసరాలను అర్థం చేసుకోడానికి ఆధారం. కాని, ఇసయా బెర్లిన్ అభిప్రాయంలో, మానవ ప్రవర్తన కారణాల మీద కాక, మానవుని స్వయంనిర్ణయ శక్తి మీద ఆధారపడి ఉంటుందని అన్నాడు.

కానీ, మానవ ప్రవర్తనలో ఇచ్ఛ, నిశ్చయుత రెండూ ఉంటాయి. ఇచ్ఛకు కూడా కారణాలు ఉంటాయి. మానవ ప్రవర్తనకు కారణాలు ఉంటాయనీ, వాటిని తెలుసుకోడానికి వీలుంటుందని చరిత్రకారుడు నమ్ముతాడు. చరిత్రకారుని బాధ్యత కారణాలను పరిశీలించడం. అతనికి కారణాలచేత నిశ్చితమైన మానవ ప్రవర్తనలో, ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది.

### 3.4.1 అనివార్యత (Inevitability)

ఒక సంఘటన జరగటానికి బలమైన కారణాలు కనిపించినపుడు, కొందరు చరిత్రకారులు ఆ సంఘటన జరగటం, "అనివార్యం" అని చెప్పడానికి తొందరపడతారు. ఆ సందర్భంలో, ఆ సంఘటన జరగటానికి బలమైన కారణాలు ఉన్నాయని మాత్రమే పేర్కొనాలి. కానీ, ఫలానా సంఘటన అనివార్యం అని పేర్కొనరాదు. సంఘటనలు జరగటానికి ముందే, అవి అనివార్యం అని పేర్కొనటం, చరిత్రకారుడు చేయరాదు. కానీ, ఇక్కడ ఒక సంఘటన జరగటానికీ కొన్ని కారణాలు ఉన్నాయనీ, ఆ సంఘటన వేరే విధంగా జరగటానికి వేరే కారణాలు ఉండాలని మాత్రం, చరిత్రకారుడు గుర్తించాలి.

## 3.5 యాదృచ్ఛికత

### 3.5.1 యాదృచ్ఛికత ప్రాముఖ్యత

క్లియోపాత్రా ముక్కు కాస్త పొడవుగా ఉంటే, చరిత్ర మరో రకంగా ఉండేదన్న విశ్వాసాన్నాధారంగా ఏర్పడిందే, యాదృచ్ఛికతా సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం, చరిత్రలో, ముందుగా ఊహించలేని యాదృచ్ఛిక సంఘటనలు మాత్రమే ఉంటాయి. కానీ, నిశ్చితమైన కారణాలుండవు. వీరి దృష్టిలో ఆక్టియమ్ యుద్ధంలో ఆంటోనీ ఓడిపోవడానికి, క్లియోపాత్రపై అతనికున్న వ్యామోహమే కారణం. వీరు ఇటువంటి అనేక ఉదాహరణలు చెబ్తారు. వీరి ఉద్దేశంలో, యాదృచ్ఛిక సంఘటన చరిత్రగతినే మార్చివేస్తుంది. ఇ.హెచ్. కార్ అభిప్రాయంలో, చరిత్రలోని ఈ యాదృచ్ఛిక సంఘటనల కార్యకారణ క్రమం, చరిత్రకారుని పరిశోధనా క్రమాన్ని ఆటంకపరుస్తుంది. బెర్రీ అనే చరిత్రకారుడు దీన్ని విభిన్నమైన, రెండు కార్యకారణ సంబంధాల సంఘర్షణ అని వర్ణించాడు.

20 వ శతాబ్దంలో, ఈ విషయం పట్ల మొదటిసారిగా శ్రద్ధ వహించింది బెర్రీ అనే బ్రిటీష్ చరిత్రకారుడు. ఇతడు తన రచనల్లో, సామాజిక పరిణామంలో, చారిత్రక సంఘటనలను ప్రధానంగా నిర్ణయించే యాదృచ్ఛికతను, కాకతాళీయతను ప్రస్తావించాడు. ఈ సందర్భంలోనే, 1916లో "క్లియోపాత్రా ముక్కు" అనే వ్యాసం రాశాడు.

### 3.5.2 యాదృచ్ఛికతకు వ్యతిరేక వాదన

చరిత్రలో యాదృచ్ఛికతను తీవ్రంగా వ్యతిరేకించిన మాంటెస్క్యూ అభిప్రాయం ప్రకారం, సాధారణ కారణాలు, ప్రత్యేకమైన యాదృచ్ఛిక కారణాలు, ప్రతి సంఘటనకూ ఉంటాయి. మార్క్స్ కూడ యాదృచ్ఛిక కారణాల ప్రాముఖ్యతను తోసిపుచ్చాడు. మార్క్స్ దృష్టిలో, యాదృచ్ఛిక సంఘటనలు చారిత్రక పరిణామంలో మౌలికమైన మార్పులు తీసుకొని రావు. అంతేకాక, ఈ సంఘటనలు ఒకదాని ఫలితాన్ని మరొకటి సరిదిద్దుతుంది. కాబట్టి, వాటి ప్రభావం చివరకు ఏమీ మిగలదని పేర్కొంటాడు.

ఇ.హెచ్. కార్ అభిప్రాయం ప్రకారం, చరిత్రలో యాదృచ్ఛికతకు స్థానం ఉంది. కానీ, దానివల్ల చారిత్రక పరిణామం తీవ్రం కావడమో, మందగించడమో జరగదు. అంతేగాక, ఒక యాదృచ్ఛిక సంఘటన, ఫలితాలను సరిదిద్దుతుందని కూడా చెప్పలేం. ఆ విధంగా, సరిదిద్దడం వల్ల చరిత్ర గతి

మారకుండా సాగుతుందని నమ్మటానికి కూడా ఆధారాలులేవు. కొన్ని సందర్భాల్లో, అర్థంకాని పరిణామాలకు యాదృచ్ఛికత అన్న పేరుపెట్టే పొరపాటును, చరిత్రకారుడు చేసే అవకాశం ఉంది. అర్థంకాని విషయాన్ని లోతుగా పరిశీలించే కష్టమైన బాధ్యత చూపి తప్పించుకోవాలనే ఉద్దేశంతో, ఆ పరిణామాన్ని యాదృచ్ఛికం అని అంటారు. ఇటువంటి పరిణామాలను సహేతుకంగా నిరూపించి, ఆనాటి పరిస్థితులను అన్వయింపజేసి, అది యాదృచ్ఛికం కాదని నిజమైన చరిత్రకారుడు తెలుసుకుంటాడు. ఈ యాదృచ్ఛికత అనే భావన, కేవలం క్లిష్ట పరిస్థితుల నుండి మాత్రమే వస్తుందని, కార్ అభిప్రాయపడ్డాడు. అయితే, చరిత్ర గతిని మార్చిన యాదృచ్ఛిక సంఘటనల ప్రాముఖ్యతను కాదనరాదు. కాని, అవి చరిత్రకారుని తార్కిక వ్యాఖ్యానంలో చోటు చేసుకోలేవు. ఇసయా బెర్లిన్ వంటి చరిత్రకారుల అభిప్రాయంలో, యాదృచ్ఛికత అనేది మొత్తం చారిత్రక అనుభవాన్ని, కొన్ని సూత్రాల కింద వర్గీకరించే వీలు కలుగజేయదు. కానీ, చరిత్రకారుడెప్పుడూ మొత్తం అనుభవాన్ని పరిగణలోకి తీసుకోకుండా, కొంత భాగాన్ని మాత్రమే తీసుకొంటాడు. హేతుబద్ధతకు నిలబడే అంశాలను, భాగాలను మాత్రమే తీసుకొని, అందులో నుండి కొన్ని పరిస్థితులను (Conditions) చరిత్రకారుడు రూపొందించుకొంటాడు. అందుకని, తనకనుకూలంగా ఉండే కారణాలను, యాదృచ్ఛిక సంఘటనలను మాత్రమే, చరిత్రకారుడు తీసుకోవాలి. ఇ.హెచ్.కార్ అభిప్రాయంలో, మహాసముద్రం లాంటి కారణాల నుండి చరిత్రకారుడు తనకు అవసరం అనిపించిన వాటిని ఎన్నుకొన్నట్లు, అనంతంగా ఉన్న కార్యకారణ సంబంధాలనుండి, చారిత్రకంగా ప్రత్యేకమైన వాటిని మాత్రమే, అతను ఎన్నుకొంటాడు. అందుచేత, ఇతర కార్యకారణ సంబంధాలను యాదృచ్ఛికాలుగా భావించిన వాటిని ఖచ్చితంగా తిరస్కరించాలి.

### 3.5.3 యాదృచ్ఛికత, సాధారణీకరణ

యాదృచ్ఛికత నాధారంగా సూత్రాలను, సిద్ధాంతాలను లేక, సాధారణీకరణను చేయలేం. అందుకని, నిజమైన కారణాలను గుర్తించి, వాటి ద్వారానే సాధారణీకరణ చేయాలి. చరిత్రలో నిజమైన కారణాలను తెలుసుకోడానికి, ఏదో ఒక ప్రయోజనం గురించి ఆలోచించడమనే ప్రక్రియ ఉపయోగపడుతుంది. ప్రయోజనాన్ని గూర్చి ఆలోచించడమే, చరిత్రలో కార్యకారణ సంబంధాన్ని అర్థం చేసుకోడానికి కీలకం. ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించే కదా, మనం కారణాలను అన్వేషించేది. దీని ద్వారా, హేతుబద్ధ కారణాలు, యాదృచ్ఛిక కారణాలను గుర్తించి, హేతుబద్ధ కారణాలు అన్ని దేశాలు, కాలాలకు వర్తిస్తాయి. కాబట్టి, వాటి ద్వారా సాధారణీకరణ చేయాలి. యాదృచ్ఛిక కారణాలవల్ల ఇది సాధ్యపడదు. ఏదో ఒక ప్రయోజనం గూర్చి ఆలోచించడం వల్లనే, కార్యకారణ సంబంధం తెలుసుకోగలుగుతాం. కాబట్టి, కార్యకారణ సంబంధం కూడా, విలువకు సంబంధించిన తీర్పులతో ముడివడి ఉంటుంది. ఇ.హెచ్. కార్ అభిప్రాయంలో, గతం దృష్టితో వర్తమానాన్ని, వర్తమానం దృష్టితో గతాన్ని అర్థం చేసుకోడమన్న చరిత్ర ద్వంద్వ ప్రయోజనాన్ని, ఇది జ్ఞాపకం చేస్తుంది.

## 3.6 కారణాలు - హేతువులు

కాలింగ్‌ఉడ్ అనే చరిత్రకారుడు కారణాన్ని ఒక ప్రత్యేక విధంగా గుర్తించ ప్రయత్నించాడు. ఇతని అభిప్రాయంలో, చరిత్రకారులు ప్రత్యేక భావనతో కారణాన్ని ఉపయోగిస్తారు. అతని అభిప్రాయంలో, సంఘటనకు కారకుడైన వ్యక్తి (agent) ఉద్దేశాలతో, కారణం ముడివడి ఉంది. అదే విధంగా,



BRAOU

కారణాలు వ్యక్తిని, ఆవిధంగా చర్య తీసుకోమని ప్రోత్సహిస్తాయి. అంతేకాని, చరిత్రలో ప్రతి కారణానికి కార్యం ఉండకపోవచ్చు. ఉదాహరణకు, ఒక వ్యక్తి తన స్నేహితుని ఆకారణంగా దూషించినట్లైతే, దానికి తగు విధంగా ప్రతిస్పందించడమన్నది, ఆ స్నేహితుని హేతువుపైనే ఆధారపడి ఉంది. అతడు తిరిగి దూషించవచ్చు, కొట్టవచ్చు, లేక మౌనంగా సహిస్తూ ఉండవచ్చు. అందువల్ల, సంఘటన పట్ల ప్రతిస్పందించడం, పూర్తిగా చారిత్రక వ్యక్తి (Agent) హేతువుపై ఆధారపడే ఉంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, ఏ చర్య తీసుకోవాలనేది అతని హేతువుపైనే ఆధారపడి ఉన్నది. ఒకవేళ ఆ వ్యక్తి (Agent) ఒక కారణానికి ప్రతిస్పందిస్తే, ఆ కారణాన్ని చారిత్రక కారణమని పేర్కొనాలి. కాలింగ్ ఉడ్ ఉద్దేశంలో, చరిత్రలో చర్యలకు కారణం ఒక అవసరమైన పరిస్థితి (necessary condition) అనుకున్నట్లైతే, అదిలేకుండా చర్య జరపబడ్డందున, కారణం అవసరం అనేకన్నా అదిలేకుండా, ఒక చర్యకు సరైన హేతువు ఉండదు. కాబట్టి, కారణం అవసరమని అనుకొనాలి. అదే విధంగా, చర్యలకు కారణం ఒక సరిపోయిన పరిస్థితి (Condition) అనుకున్నట్లైతే, అది ఒక చర్యను తప్పనిసరిగా జరుపుతుందనే భావనలో కాకుండా, అది చర్యల సరళిని హేతుబద్ధంగా ఉంచుతుందని అనుకొనాలి. అంతేకాక, అవి చర్యల కారణాలు కాబట్టి, వాటికి కార్యాల (effects) తో సంబంధం ఉండదు. ఇది పూర్తిగా అనుకూల వాదుల (Positivists) వాదానికి వ్యతిరేకం. ఈ వాదం అన్ని సందర్భాల్లోను నిజం కాదు. ఈ కారణాల సాపేక్షతా సిద్ధాంతం, చారిత్రక విషయాలకు అన్వయించలేని పరిస్థితులు కూడా ఉంటాయి. చరిత్రకారుడు కారణాలను బట్టి, ఒక సంఘటనను (ఉదాహరణకు నెపోలియన్ ఓటమి, లేక అమెరికా అంతర్యుద్ధం వంటివి) సృష్టించలేడు, ఆపలేడు కాబట్టి, కాలింగ్ ఉడ్ సిద్ధాంతం అన్ని సందర్భాల్లోనూ నిజం కాదు.

## 3.7 కారణాల సాపేక్షత (Relativity of causes)

కాలింగ్ ఉడ్ పై విషయాల్లోనే కాక, కారణాలకూ, చర్యలకూ అవసరమైన దశ (Condition) కు తేడాను వివరించాడు. ఇతని అభిప్రాయంలో, కారణం గురించి మన 'సాధారణ భావన', మన పరిసరాలను అనుకూలంగా మలచుకొనే (Manipulate) ఒక పరిసరం వంటిది. కారణం అనేది, మానవ ప్రవర్తనకు సంబంధించిన భావనను తెలియజేస్తుంది. ఏ వ్యక్తికైనా ఆవ్యక్తి ఉత్పత్తి చేయగలిగే, లేక, ఆపగలిగే పరిస్థితులే ఒక విషయం కారణంగా ఇతను పేర్కొన్నాడు. ఈ సందర్భంలోనే, కాలింగ్ ఉడ్ కారణాల సాపేక్షత (Relativity of Causes) గూర్చి పేర్కొన్నాడు. అతని ఉద్దేశంలో, ఒకే చర్యకు వివిధ కోణాల్లో, వివిధ రకాల కారణాలు కనబడతాయి. ఉదాహరణకు, నడుస్తున్న బస్సును ఎక్కబోతూ ఒక వ్యక్తి క్రిందపడి గాయపడ్డాడనుకొందాం. అప్పుడు పడ్డ వ్యక్తి దృష్టిలో, తాను సరిగా ఎక్కలేక పోయినందునే పడ్డాననీ, అందువల్ల, ఇకముందు మరింత జాగ్రత్తగా ఎక్కాలని అనుకుంటాడు. ఆ బస్సుకు సంబంధించిన అధికారుల దృష్టిలో డ్రైవర్, బస్ స్టాపులో తగినంత సేపు ఆపలేదని, ఇక ముందు తగు సమయాన్ని ప్రతి స్టాపుకు కేటాయించాలనీ అనుకుంటారు. అదే బస్సు తయారీదార్లు ఫుట్ బోర్డుకు తలుపులు లేనందునే, నడుస్తున్న బస్సులను ఎక్కే ప్రయత్నం చేస్తున్నారనీ, అందుకని ఇక నుండి బస్సులకు ఖచ్చితంగా తలుపులు ఉండేటట్లు చూడాలని అనుకుంటారు. ఈ విధానాన్ని బట్టి, మనుషుల సంబంధాలను బట్టి కారణాలు ఉంటాయని తెలుస్తుంది. అంటే, ఒక ప్రేక్షకుడికి

BRAOU

కారణమే లేకుండా ఉంటుందని అతని ఉద్దేశం కావచ్చు. కాలింగ్‌ఉడ్ సిద్ధాంతం ప్రకారం జరిగిన సంఘటనకు ఏదో ఒకటి తప్పనిసరి పరిస్థితి (Condition) ఉంటుంది. అదే సందర్భంలో, ఆ పరిస్థితి (Condition) ఇతర వ్యక్తుల దృష్టిలో అవసరమైన పరిస్థితులకు భేదాన్ని తెలియజేస్తుంది.

ఈ విధంగా, కారణాలను వివరించడంలో, చరిత్రకారులు వివిధ రకాలుగా, తమ అభిప్రాయాలను పేర్కొన్నారు. ఈ అభిప్రాయాల పరిశీలన తదుపరి తేలిన విషయమేమంటే, చరిత్రకారుడు సంఘటనకు గుర్తైన కారణాలు తెలుసుకొని, వాటిని సాధారణీకరణ చేసినప్పుడే, చరిత్ర ఉపయోగం ఈ సమాజానికి ఉంటుంది. ఆ సాధారణీకరణల ద్వారా, చారిత్రక సంఘటనను గుణపాఠంగా ఈ సమాజం స్వీకరిస్తుంది. ఈ విధమైన కర్తవ్యాన్ని నిర్వహించినప్పుడే, చరిత్ర శాస్త్రంగా పరిగణింపబడుతుంది.

## 3.8 సంగ్రహంగా

చరిత్రలో సంఘటనలు జరగటానికి అనేక కారణాలు ఉంటాయి. కానీ, కొన్ని మాత్రమే ప్రత్యేక కారణాలు. ఈ కారణాలను చరిత్రకారులు అనేక రకాలుగా సిద్ధాంతీకరించారు. అసమగ్ర, స్వచ్ఛంద కారణాలే, చరిత్రలో ప్రధానమనే హార్ట్, హానర్‌ల వాదన, సంఘటన వేరుగా ఉండాలంటే, కారణాలు వేరుగా ఉండాలనే నిశ్చయతా వాదం, చరిత్రలో యాదృచ్ఛిక సంఘటనలు మాత్రమే ఉంటాయని యాదృచ్ఛిక వాదం. సంఘటనలు జరగాలంటే, ఆ సంఘటనల్లో ఉన్న వ్యక్తి హేతుబద్ధతే ముఖ్యమనే కాలింగ్‌ఉడ్ వాదం, కార్యకారణ సిద్ధాంతాల్లో ముఖ్యమైనవి.

BRAOU

## 3.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చరిత్రలో యాదృచ్ఛికత ప్రాముఖ్యతను వివరిస్తూ, దానిపై వచ్చిన వ్యతిరేక వాదాన్ని గురించి రాయండి.

2. కారణాలకూ, హేతువుకూ ఉన్న సంబంధాన్ని వివరిస్తూ, కాలింగ్‌ఉడ్ కారణాల సాపేక్షతా సిద్ధాంతాన్ని గూర్చి రాయండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. చరిత్రలో అసాధారణల నుండి కారణాలనే విధంగా గుర్తించవచ్చో వివరించండి.

2. నిశ్చయతా వాదం గురించి రాయండి.

3. కారణాలను పరిశీలించడానికి చరిత్రకారునికి ఉండాల్సిన లక్షణాలను పేర్కొనండి.

## 3.11 ఉపయుక్త గ్రంథాలు


Carr E.H. : **What is History?**

Collingwood R.G. : **An Essay on Metaphysics**

Marc Bloch : **The Historian's Craft**

Rajayyan, K. : **History in Theory and Method**

William H. Dray : **Philosophy of History**


రచయిత : ఆచార్య వై. వైకుంఠం

BRAOU

# భాగం-4 : సాధారణీకరణ

విషయ క్రమం

4.0 లక్ష్యాలు

4.1 పరిచయం

4.2 సాధారణీకరణలో రకాలు

4.2.1 మొదటి రకం : "నిరుపమాన వర్గం"

4.2.2 రెండో రకం : "ఖండితమైన పరిమిత సాధారణీకరణ వర్గం"

4.2.3 మూడో రకం : "సహసరళి సాధారణీకరణ వర్గం"

4.2.4 నాల్గో రకం : "ఉపమానాల ప్రాతిపదికపై చేసే సాధారణీకరణ వర్గం"

4.2.5 ఐదో రకం : "ప్రాగుక్తీకరణకు, కట్టుబాటుకు చెల్లుబాటయ్యే సాధారణీకరణ వర్గం"

4.2.6 ఆరో రకం : "చరిత్ర విశ్వతత్వాల వర్గం"

4.3 యదార్థాలు, సాధారణీకరణలు

4.4 నియమాలు, నియమాల వంటి సాధారణీకరణలు

4.5 సార్వత్రిక వివరణలు

4.6 ముగింపు : సాధారణీకరణల కాలానుగుణ్యత

4.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

4.8 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 4.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- సాధారణీకరణల్లో ముఖ్యమైన రకాలను వివరించి, చరిత్ర రచనలో విషయ నిష్ఠత గురించిన సమస్యతో, వీటికి గల సంబంధాన్ని విశ్లేషించగలగాలి.
- చరిత్ర రచనా శాస్త్రంలో సాధారణీకరణ రకాలకు సంబంధించి, సర్వసాధారణ వివరణలు, సంఖ్యాపరిశీలక నిరూపణల పాత్రను వివరించగలగాలి.
- సాధారణీకరణల కాలానుగుణ్య స్వభావాన్ని గూర్చి వివరించగలగాలి.

## 4.1 పరిచయం

మానవాళి చరిత్రలో చర్యలు, సంఘటనలకు వివరణలను చారిత్రక భావంతో గ్రహించినట్లు, "తెలివిగల, బాధ్యతాయుతమైన ప్రతినిధులు", "కారణాల" ద్వారా లభిస్తారు. (ఆర్.జీ.కాలింగ్‌వుడ్). చరిత్రలో వివరణలు భౌతిక శాస్త్రాల్లో మాదిరిగానే, కార్యకారణ భావ సంబంధమైనవి. చారిత్రక సంఘటనలు ఒక దాంతో మరొకటి విభేదించవచ్చు. కాని, వీటి వెనుక అంతర్నిహితంగా ఒక రీతి ఉంటుంది. దీన్నే, సాధారణీకరణ చేస్తారు. చరిత్రతో అంతర్నిహితంగా ఉండే ఈ రీతిని గుర్తించటమే, సాధారణీకరణమని వ్యవహరిస్తాం. ఇ.హెచ్.కార్ వాదించినట్లు, చరిత్రకారుడు నిజానికి నిరుపమాన విషయంలో కాక, నిరుపమానంలోని సాధారణాంశంలో ఆసక్తిని కనబరుస్తాడు". సాధారణీకరణల ద్వారా మాత్రమే, మనిషి చేతలకు గల చారిత్రక ప్రమాణాన్ని విషయానుగతంగా మదింపు వేయటంగాని, ఒక అర్థాన్ని కల్పించటంగాని జరుగుతుంది. ఒక చారిత్రక సంఘటనను నమోదు చేయటం అనే చర్యలోనే, సాధారణీకరణ ఉంది. ఎందుకంటే, యదార్థం, సాధారణీకరణ రెంటికీ అవినాభావ సంబంధం ఉంది. కనుక, చారిత్రక గత సారాన్ని రాబట్టడానికి, చరిత్రకారునికి విధి నిర్వహణలో సృజనాత్మకమైన భావనా శక్తి కావాలి. చెస్టర్ జి. స్టార్ వంటి చరిత్రకారులకు చారిత్రక వివరణ, కార్యకారణ సంబంధాల భావాల గురించి చరిత్రకారుడు చేసే సంకలనమే, సాధారణీకరణలు. కనుకనే, ఈ భావాలను ఏ వ్యక్తి అయితే కలిగిఉంటాడో, ఆవ్యక్తి ఆత్మగత ప్రవృత్తిని బట్టి, సాధారణీకరణలుంటాయి. చారిత్రక వివరణ, కార్యకారణ సంబంధం గురించి, చరిత్రకారుని భావాల సుదీర్ఘ అధ్యయనం తర్వాత చేసే సంకలనం, కనిపించే సాధారణీకరణాలైతే, అంతగా సర్వసాధారణం కాని, ప్రాధాన్యంలేని, పరిగణననుండి తప్పించుకునే సాధారణీకరణలు కూడా ఉంటాయి. కనుక, చరిత్రకారుడు అన్ని స్థాయిల్లోని సాధారణీకరణను పరిగణనలోకి తీసుకోవాలి.

BRAOU

## 4.2 సాధారణీకరణల్లో రకాలు

లూయీ గోషక్ చారిత్రక సాధారణీకరణలను ఆరు రకాలుగా వర్గీకరించాడు. పాఠకునికి మరింత విశదమయ్యేలా, ఈ సాధారణీకరణల వర్గాలను సోదాహరణ పూర్వకంగా ఇక్కడ వివరించడమైంది.

### 4.2.1 మొదటి రకం : "నిరుపమాన వర్గం"

తెలియని వాటిని చేయటం తప్పించి, సాధారణీకరణలను తెలివిగా వర్ణించే చరిత్రకారులను, ఈ వర్గం క్రింద పరిగణించవచ్చు. 'నిరుపమాన వర్గం'గా వర్గీకరించబడ్డ ఈ చరిత్రకారులు తులనాత్మక, సాధారణ ధోరణిని మినహాయించే పర్యంతం, అంతరాల ప్రాధాన్యతను పరిగణిస్తారు.

రాంకె సంప్రదాయాన్ని అనుసరిస్తూ, ఈ చరిత్రకారులు యదార్థాలను కాలక్రమానుగతంగా మాత్రమే చిత్రిస్తారు. వీరు విషయాలు లేదా, యదార్థాల్లో ఎటువంటి ఎంపికా చేయరు. ఉపమానం, సమాచార సాధారణ ఎంపికలో ఆత్మగతమైన కార్యాన్ని వర్ణించటానికి ఈ చరిత్రకారులు పరిపాటి అయిన యదార్థాల సంకలన పద్ధతినే అనుసరిస్తారు. అయితే, ప్రజ్ఞ లేకున్నా, విమర్శనాత్మకం కాకున్నా, సాంప్రదాయబద్ధమైన పద్ధతులన్నింటిలోను ఏదో రూపంలో సాధారణీకరణలు కలగలిసి ఉంటాయి.

ప్రాచీన చరిత్ర పరిశోధనలో నిష్ణాతుడైన ఎం.ఐ.ఫిన్లే చరిత్రకారుని కర్తవ్యం, చారిత్రక వాస్తవాలను ప్రజలు, సంస్థలు, వర్తకం, వ్యవసాయం వంటి అంశాల ఆధారంగా వర్గీకరించటమని పేర్కొంటాడు. కాబట్టి, మొదటి తరహా సాధారణీకరణ వర్గీకరణాత్మకమైందని గ్రహించొచ్చు.

చరిత్ర రచనా విధానం సామాన్యంగా సంపుటీకరణకో, సంపాదకీకరణకో చెందింది కాదు. అది వివరణాత్మకమైంది, కథనాత్మకమైంది, వ్యాఖ్యానాత్మమైంది కూడా. అందువల్ల, భాషను ఉపయోగించటంలో, ఎంతో మెళుకువ అవసరం. భాష వివిధ సాధారణీకరణ నమూనాలను, వర్గాలను సూచిస్తుంది. ఉదాహరణకు, జాతీయవాదం, స్వేచ్ఛావాదం, సామ్యవాదం వంటి పదాలు, ఒక ప్రత్యేకమైన చారిత్రకతత్వం, సాధారణీకరణ ద్వారా పరిణామం చెందాయని చెప్పొచ్చు. ఇది, చరిత్రకారులను సామాన్యంగా సాధారణీకరణ నుండి వేరుచేయని కొన్ని ఆచరణాత్మక భావాలకు ప్రతీక. అంతేగాక, ఈ సంబంధమే, మానవ చరిత్రలో సాధారణీకృతమైన వ్యాఖ్యానానికి, ఒక తులనాత్మక లక్ష్యాల ఏర్పాటుకు తోడ్పడింది.

## 4.2.2 రెండో రకం : సాధారణీకరణ

ఖచ్చితంగా ఇది పరిమితమైన సాధారణీకరణల సముదాయం. ఒక కథనాత్మక, వర్ణనాత్మక శైలిని అనుసరించటం ద్వారా, ఈ చరిత్రకారులు పరిశీలిత చారిత్రక సంఘటన లాధారంగా సాధారణీకరిస్తారు. పరిశోధన పరిధిలోకిరాని అంశాలను సూచించటానికి, సాధారణీకరణనే ఉపయోగించటానికి వీరు పూర్తిగా వ్యతిరేకులు. ఇంకో రకంగా చెప్పాలంటే, పరిశీలితమౌతున్న భావాలను రోచిష్మంతం చేయటానికి, సాధారణీకరణలు చాలా అవసరం. కాని, ఈ పరిమితి అరువు తెచ్చుకున్న సాధారణ భావాలను తమ పరిధిలోని అనిర్వచిత, అపరిష్కృత సందర్భాలను నిర్వచించి, పరిష్కరించటానికి, వాడుకోడానికని అంటున్నారు. చారిత్రక సంఘటనకు, స్ఫుటమైన ఆధారానికి తప్పనిసరిగా, వ్యక్తిత్వ భావనకు మధ్యగల స్ఫుటంగాని సందర్భాలను పూరించే విధానాన్ని, గోషక్ 'చారిత్రక సంభావనత్వం' అంటే, ఫిన్లే అదే అంశాన్ని 'అవస్థితత్వమైన ఊహ' అంటాడు. ఫిన్లే ప్రకారం, ప్రాచీన చరిత్రకారులు చాలామంది యితరేతర చరిత్రకారులకన్నా, తక్కువ ఆధారాలున్నవారు. వారు ప్రధానంగా, పురావస్తు ఆధారాల మీద, శిలాక్షరాలమీద ఆధారపడ్డట్టు, రాత ప్రతులమీద ఆధారపడటమనేది, అంగీకరించదగ్గ అంశం. వారెక్కువగా వాస్తవికాంశాలకు, కథనాత్మక విమర్శకు సంబంధించినట్లు, ఆధార ప్రామాణికతను నియంత్రించలేరు. అంతేగాకుండా, తరచుగా వారు ఏదో ఒక రచయిత రాసిన ఏదో ఒక మాట మీద ఎక్కువగా ఆధారపడటం, వస్తు పరంపరలో ఎక్కువ ఖాళీలుండటం, తరచుగా వారు ఊహించటానికి అవకాశం ఉండి తీరుతుంది. ఈ పరిస్థితిలో, ఎక్కువ, లేదా, తక్కువ ప్రామాణికత ఉన్న సాధారణీకరణల అనుగమ్యతతో ఏం చేయగలరు? దక్షిణ అమెరికాలోని చరిత్రకారుల కన్నా, ప్రాచీన చరిత్రకారులు బానిసత్వం గూర్చి ఎక్కువ సాధారణీకరించగలరా? కాని, వారు ఒక్కోసారి కొన్ని అసంబద్ధమైన సాధారణీకరణలను వస్తువులోని పరిమితాత్మకత ద్వారా సాధించగలరు. ఈ పరిస్థితిలో, అవస్థితత్వమైన ఊహకు, సాధారణీకరణకు గల సంబంధం గూర్చి తికమకపడకూడదు. ప్రజల గురించి, ధరల గురించి, ఇటువంటి ఇతర అంశాల గూర్చి ప్రాచీన చరిత్రకారుడు, చాలాసార్లు తగ్గ ఆధారాలను పొందలేడు. అందువల్ల, అతడు ఎంతో స్వేచ్ఛగా ఊహకు అవస్థితిని కల్పిస్తాడు. కాని, దాన్ని స్వేచ్ఛగా సాధారణీకరించాడనటం సబబు కాదు.

BRAOU

ఒక విధంగా చెప్పాలంటే, అవస్థితత్వమైన ఊహను తులనాత్మకమైన సంఘటన, సందర్భాల నుండి సాధారణీకరించటానికి వీలుకల్గుతుంది. అప్పుడు, వస్తువుల మధ్య సాన్నిహిత్య మేర్పడుతుంది. పరిమిత సాధారణీకరణ శైలి నవలంబించే చరిత్రకారులు, ఒక వ్యక్తి జీవిత కథనాత్మక అంశం నుండి మారి, ఉద్యమాల్లోను, విప్లవాల్లోను వ్యక్తి పాత్ర చిత్రీకరణ వంటి మార్పుకు లోనవుతారు. అప్పుడు, వారు తమను తాము పరిమితాత్మక సాధారణీకరణ శైలికి చెందిన వారుగాక, తులనాత్మక సాధారణీకరణ శైలికి మార్పు పొందినట్లుగా గుర్తింపు పొందుతారు.

### 4.2.3 మూడో రకం : సహసరళి సాధారణీకరణ

ఈ రకంలో, వ్యాఖ్యానాత్మక చరిత్రకారులు సరళ ప్రాతిపదిక ద్వారా సాధారణీకరణ చేసేవారు. వీరు, ఏదో ఒక సిద్ధాంతంతోకాని, ఉపకల్పన (hypothesis) తోకాని, వివిధ అంతర్నిష్ట చారిత్రక సంఘటనలను వర్ణిస్తారు. గోషక్ మాటల్లో వారు, తమ వద్దగల చారిత్రకాంశాన్ని, దాని అనుక్రమణ తోను, సంబంధత్వంతోను, తర్వాతి అంశాలతోను గల అంతర్నిహిత సంబంధాలను సూచించటానికి, స్పష్టంగా ఆ పరిధిని అతిక్రమిస్తారు. వారు ఎంతగా విస్తృతమైన, వ్యాఖ్యానాత్మకమైన సంశ్లేషణను చేసినా, తమ వ్యాఖ్యానాలను అంతర్నిహితమైన సరళులకు పరిమితం చేసుకుంటారు.

ఈ చరిత్రకారులు గతంలోని అంతర్నిహిత సంఘటనలను సంశ్లేషించటంలో ఎంత ధైర్యాన్ని చూపినా, వారు తమ ఉపకల్పనా భావాన్ని గతంలోని పరిమిత వర్గానికి చెందిన సంఘటనల సామాన్య సరళిని, దాని అనువర్తిత్వాన్ని ఇతర గత సంఘటనలకుగాని, భవిష్యత్తులోని కొన్ని సంఘటనలకుగాని అనువర్తింపజేస్తారు. ఉదాహరణకు, ప్రొటెస్టాంట్ మతంలోని నైతికతకు, పెట్టుబడిదారీ భావన ఆవిష్కరణకుగల సంబంధం దృష్ట్యా, మాక్స్ వెబర్ చేసిన సిద్ధాంతం, చరిత్రకు వ్యాఖ్యానాత్మక సాధారణీకరణ విధానానికి చెందిందిగా గుర్తింపబడింది. సంస్కృతికిగల చారిత్రకాభివృద్ధికి, ఆర్థిక జీవనానికి గల సంబంధాన్ని సూచించే, చారిత్రాత్మక శైలికి చెందిన అర్థ శాస్త్ర సరళి వల్ల ప్రోత్సహింపబడి, వెబర్ 1904-05ల్లో ప్రొటెస్టాంట్ నైతికతకుగల ఉపప్రకరీకరణ భావనను ప్రతిపాదించాడు. అతని సిద్ధాంతం, కాల్విన్ మతానికి, వ్యవస్థీకరణ విధానాలకుగల పరస్పర సంబంధాన్ని సూచించటమే గాక, పెట్టుబడిదారీ కార్యక్రమాలపై, ప్యూరిటన్ మత ప్రభావానికి చెందిన కారణాత్మక విశ్లేషణతోబాటు, ఆధునిక పాశ్చాత్య సమాజంలో మౌలికమైన అంశాల ఆవిష్కరణకు, అంతరార్థానికి ఒక వ్యాఖ్యానం కూడా.

"మామూలు స్వేచ్ఛాయుత శ్రమకు సంబంధించిన వివేచనాబద్ధమైన వ్యవస్థ" ద్వారా, సంపదను కూడబెట్టడానికి, హేతుబద్ధమైన పెట్టుబడిదారీ వ్యాపార సంస్థ పనిజేస్తుంది. తర్ఫీదైన శ్రమ శక్తి, సక్రమమైన పెట్టుబడులను, ఇది సూచిస్తుంది. సాంప్రదాయిక పద్ధతుల్లో నడిచే సంస్థకు, పెట్టుబడి క్రమ పునరుత్పత్తి - అంటే, ఆర్థిక సామర్థ్యాన్ని పెంచేందుకు తరచు పెట్టుబడి పెట్టడం, వచ్చిన దాన్ని మళ్ళీ పెట్టుబడిగా మార్చే ప్రక్రియ - అనేది అంతగా తెలియదు. సంపద, సంపదను పెంచడానికే పోగవుతుందనే దృక్పథంతో ఇది ముడిపడివుంది. మాక్స్ వెబర్ రాసినట్లు, జీవిత పరమార్థాన్ని కూడబెట్టడం ద్వారా ధనాన్ని పోగుచెయ్యటం అనే ఆలోచన, మానవునిపై ప్రాబల్యాన్ని చూపుతుంది. తన భౌతికావసరాలను సంతృప్తిపరచుకోడానికి ఆర్థిక సముపార్జన మార్గం అనే



BRAOU

ఆలోచనకు, అతడేమాత్రం లోబడలేదు. ఇదే వెబర్ దృష్టిలో, ఆధునిక పెట్టుబడిదారీ విధాన భావనా సారం. ప్రొటెస్టాంట్ నీతితోగల సంబంధం దృష్ట్యా, పెట్టుబడిదారీ విధాన మూలాన్ని వివరించటానికి వెబర్ ప్రయత్నించాడు. అందుచేతనే, అతని కృషి 'సహసరళి సాధారణీకరణ' వర్గం కిందికి వస్తుంది.

## 4.2.4 నాలుగో రకం : ఉపమాన ప్రాతిపదిక 'సాధారణీకరణ'

ఇది పరస్పర సంబంధం ఉన్న, సంబంధంలేని సంఘటనల పోలికల ప్రాతిపదికగా చేసే సాధారణీకరణ. ఈ విధంగా చేసే చరిత్రకారులను, 'తులనాత్మక' లేదా, 'ఉపమానాత్మక' చరిత్రకారులుగా వర్గీకరించవచ్చు. సాధారణీకరణల ప్రయోజనాన్ని ఇతర కాలాల, ప్రదేశాల సంఘటనలకు విస్తరించటంలో, ఈ చరిత్రకారులు సాదృశాలు, సమాంతరాల పద్ధతిని ఉపయోగిస్తారు. పరస్పర సంబంధంలేని సంఘటనలను వివరించటానికి, పరస్పర సంబంధం ఉన్న సంఘటనలను వివరించే సమన్వయాలనే, తరచూ వీరు ఆశ్రయిస్తారు. మళ్ళీ ఇక్కడ కూడా, పాశ్చాత్యేతర సమాజాల చరిత్రలోని ఇతర ఉపాఖ్యానాలను వివరించటంలో, మాక్స్ వెబర్ పెంపొందించిన పరికల్పన ఉపయోగాన్నే, ఈ ప్రక్రియకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. డార్విన్, సిగ్మండ్ ఫ్రాయిడ్‌ల పరికల్పనలు, దీనికి ఇతర ఉదాహరణలు.

## 4.2.5 ఐదో రకం : "ప్రాగుక్తీకరణకు, కట్టుబాటుకు" చెల్లుబాటయ్యే "సాధారణీకరణ"

BRAOU

ఈ వర్గం చరిత్రకారులను"నొమోథిటిక్ చరిత్రకారు" (Nomothetic historians) లంటారు. ప్రాగుక్తీకరణకు - అంటే, జరగబోయే దాన్ని ముందుగా ఊహించడానికి - కట్టుబాటుకు చెల్లుబాటయ్యే సాధారణీకరణలను ఈ చరిత్రకారులు చేస్తుంటారు కనక, వీరిని అలా వ్యవహరిస్తారు. ఈ చరిత్ర రచనా సంప్రదాయంలో, ప్రతిపాదనలు అనేవి భావి సంఘటనలను వివరించే, ప్రత్యక్ష, లేదా పరోక్ష సూచిత గత సరళుల గురించి తెల్పే న్యాయం వంటి సాధారణీకరణలు. ఇంకో విధంగా చెప్పాలంటే, ఈ వర్గం చరిత్రకారులు చారిత్రక సాదృశాలను గ్రహించటం ద్వారా, గత ప్రవర్తన క్రమాలను చిత్రించటానికి, లేదా, తెలిసిన గతం (అంటే సంఘటనల పరంపర) ద్వారా తెలియని భవిష్యత్తును ఊహించటానికి నిష్కపటంగా ప్రయత్నిస్తారు. చరిత్ర నుండి శాశ్వత గుణపాఠాలను నేర్చుకోడానికి, లేదా, సార్వత్రిక ప్రవర్తనకు సంబంధించిన సూత్రాలను రాబట్టడానికి ప్రయత్నిస్తారు. లేదా, కనీసం జరగబోయేదాన్ని ముందుగా ఊహించటానికి కొంత ప్రాతిపదికను ఏర్పరుస్తారు. భావి కాల ప్రవర్తనకు సాధ్యమైన అదుపును ఏర్పర్చ ప్రయత్నిస్తారు. విస్తృత పరిధిలో చూస్తే, ఈ చరిత్రకారుల్లో రెండు వర్గాలు కనిపిస్తాయి. పరస్పర సంబంధం ఉన్న సంఘటనల సాధారణాన్వయానికి తగ్గ గుణపాఠాలను, లేదా, సూత్రాలను వెతికే వర్గం ఒకటైతే, సృష్టి పరమార్థం, సంకల్పాలను అనుసరించే ప్రాణుల సృష్టి వికాసాలు జరుగుతాయనే చరమ కారణ సిద్ధాంతం, లేదా, మరణోత్తర విద్యా రంగును అద్దుకున్న చరిత్ర ప్రగాఢ విశ్వతత్వాలను రాబట్టే వర్గం మరొకటి.

## 4.2.6 ఆరో రకం : "చరిత్ర విశ్వతత్వాల వర్గం"

చరిత్ర తత్వవేత్తలనేవారు చరిత్ర విశ్వతత్వాల వర్గానికి చెందిన చరిత్రకారులే. గతంలో జరిగిన సంఘటనల, రాబోయే పరిణామాల గతిపై ఒక సార్వత్రికమైన అవగాహనను కల్గించటానికి ఉద్దేశించిన తత్వాలను వీరు ప్రతిపాదిస్తారు. యదార్థాలకు, సాధారణీకరణలకు మధ్యనున్న సంబంధాన్ని విశ్లేషించాక, ఈ చివరి మూడు రకాల సాధారణీకరణలను విపులంగా పరిశీలిద్దాం.

## 4.3 యదార్థాలు, సాధారణీకరణలు

విల్హెలం విండెల్బాండ్ (Wilhelm Windelband) 1894లో, చరిత్ర అనేది నొమోథిటిక్ సహజ శాస్త్రాల వంటిది కాదనీ, కానీ అది "భావాత్మక" (Ideographic) (ప్రత్యేక, స్పష్టమైన, వ్యక్తిగతమైనటువంటి వాటిని చరిత్ర ప్రత్యేకంగా వివరించుట) మైందని, చరిత్రకారుడు ప్రత్యేకమైన, నిరుపమానమైన వాటిని పట్టించుకోవాలని కాని, సాధారణమైనదాన్ని కాదని వక్కాణించాడు. జి. ఆర్. ఎల్టన్ (G.R. Elton) వంటి చరిత్రకారుల అభిప్రాయంలో, ప్రత్యేకమైంది గణాంక సాధారణీకరణ చేసేంత వివరాలున్నప్పుడు, చరిత్ర ఒక భావాత్మక శాస్త్రంగా నొమోథిటిక్ (Nomothetic) అవుతుంది. కాని, ఇక్కడ సమాచారం అందుబాటులో లేనందున, చరిత్రకారులకు స్వల్ప నమూనాతో చరిత్ర తీవ్ర ప్రతిబంధకం అవుతుంది. అయినప్పటికీ, ప్రాథమిక దశలో పైన పేర్కొన్న 6 వర్గాలకు సంబంధించిన చరిత్రకారులందరూ - చేతనలోగానీ, లేక అచేతనలోగానీ, చారిత్రక యదార్థాలను అమర్చడంలో సిద్ధాంతాలను, సాధారణీకరణలను ఉపయోగిస్తారు. ఒకవేళ చరిత్ర నొమోథిటిక్ (Nomothetic) కానట్లైతే, గతంలో వాస్తవంగా ఏం జరిగిందో తెలుసుకోడం మాత్రమే దాని లక్ష్యమైనట్లైతే, చరిత్రకారుడు యదార్థాలను గుర్తించే పనికే, బద్ధుడై ఉంటాడు. అప్పుడు, ఈ చారిత్రక యదార్థాలు ఎటువంటి సాధారణీకరణలు లేకుండా స్వచ్ఛమైనవా? ఈ తరహా శాస్త్రాలు అనుమతు (Inference) లను, సాధారణీకరణలు చేయటానికి అనుమతిస్తాయా?

చెస్టర్ జి. స్టార్ (Chester G. Starr), విలియం ఒ. ఐడిలోట్ (Willam O Aydelote), డేవిడ్ ఎం. పోటర్ (David M. Potter) వంటి చరిత్రకారుల దృష్టిలో, "యదార్థ ప్రకటనలు, సాధారణీకరణల మధ్య ఉన్న భేదం కేవలం ఒక్క స్థాయికి చెందింది మాత్రమే. అక్కడ నిజానికి చారిత్రక యదార్థానికీ, చారిత్రక సాధారణీకరణకు తేడా ఉండదు. రేమండ్ ఆర్యన్ (Raymond Aryon) ఉద్దేశంలో, దత్తాంశానికి (Data), ఊహలకీ (inference) మధ్య తేడా, ఒక తప్పుడు స్పష్టతను కల్గిస్తున్నది. అతని దృష్టిలో, "సిద్ధాంతాలు, యదార్థాలు, వాటిని విడదీయటానికి ఎంత తీవ్ర ప్రయత్నం జరిగినా విఫలమయ్యే పద్ధతిలో, అవి సంఘటితమై ఉండవు." సిడ్నీ హూక్ (Sidney Hook) చెప్పినట్లు, "చరిత్రకారుడు నిరూపించే ప్రతి యదార్థం ఎంతో కొంత సైద్ధాంతిక నిర్మాణాన్ని ముందుగా సూచిస్తుంది. బహుశా అందుకనే, చారిత్రక వివరణలు పూర్తిగా 'నుండి', 'అందువల్ల', 'ఎందుకంటె' వంటి విశదీకరించే వ్యక్తీకరణలతో వ్యక్తమౌతున్నాయి. చరిత్రకారుడు తప్పనిసరిగా సాధారణీకరిస్తాడు. అంటే, ప్రత్యేకతల నాధారంగా దీర్ఘ నిర్ణయాలను వ్యక్తీకరిస్తాడు. ఇంకో మాటలో చెప్పాలంటే, చరిత్ర ఇంకా సహజ శాస్త్రాల సూత్రాలకు భిన్నమైన వివరణాత్మక, విశ్లేషణాత్మక శాస్త్రాల విధిని సాధిస్తుంది.

## 4.4 నియమాలు, నియమాలవంటి సాధారణీకరణలు

"నియమాలు" అనేవి అన్ని సామాజిక వర్గాలకు, లేక, చారిత్రక సంఘటనలకు ఎప్పుడైనా గాని, ఎక్కడైనాగాని సంభవించిన ఒకే రకంగా అనువర్తింపజేయగలిగేటువంటి ఒక సామాజిక వర్గం, లేక చారిత్రక సంఘటనకు సంబంధించిన సాధారణీకరణలు. ఇంకో పక్క "నియమాల వంటి"

BRAOU

సాధారణీకరణలనేవి, "నియమాల" నిశ్చితమైన వివరణల వలె కాక, కేవలం నిబంధనాయుత నిజాలైన పరిశీలనలు. సాధారణీకరణలు, ఇచ్చే కాలం, స్థలానికి చెల్లుబాటు అవుతాయి. ఎందుకంటే, అవి అన్ని కాలాలకు, అన్ని స్థలాలకు చెల్లుబాటయ్యే పరిస్థితులు ఉన్నప్పుడు, వాటిని కేవలం, "నియమాల వంటి" సాధారణీకరణలని అంటారు. భౌతిక శాస్త్రవేత్తల లాగే కూడా, చరిత్రకారులు ముఖ్యంగా, నియమాలవంటి సాధారణీకరణలతోనే వ్యవహరిస్తారు. చరిత్రకారుల సాధారణీకరణలు ఏకరీతిగా, నిర్నిబంధ సంబంధాలను తెలియజేయవు. ఇవి, నిబంధనాయుత ప్రకటనలు. ఒకవేళ పెట్టుబడిదారీ విధానం, ఆర్థిక సంబంధాలు, భౌతిక ఉత్పత్తులపై కార్ల్ మార్క్స్ వివరణలు అన్ని సమాజాలకు వర్తించినట్లైతే, అవి కొన్ని సంబంధిత పరిస్థితుల సమక్షం నుండి తీసుకున్న కొన్ని సహజ న్యాయాల వల్ల నిజమౌతాయి. విషయాన్ని మరింత ఉదహరించే మార్క్స్ కొన్ని అభిప్రాయాలను ఎన్నుకోడం ద్వారా, మనం ఈ విషయాన్ని మరింత వివరంగా చూడొచ్చు.

కార్ల్ మార్క్స్ 1859 లో తాను రాసిన 'ఎ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' (A Contribution to the Critique of Political Economy) పీఠికలో ఈ విధంగా రాస్తాడు: "మనుషులు, వారి ఉనికి, సామాజిక ఉత్పత్తిలో తప్పనిసరిగా ఉండి, స్వతంత్రంగా ఉంటాయి. అవే, వారి ఉత్పత్తి భౌతిక రూపాల అభివృద్ధి క్రమంలో ఇచ్చిన స్థితికి తగ్గవిధంగా ఉండే, ఉత్పత్తి సంబంధాలు. ఈ ఉత్పత్తి సంబంధాల మొత్తం, నిజమైన పునాది అయిన సమాజపు ఆర్థిక నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. దీని మీదనే న్యాయ, రాజకీయ ఉపరి నిర్మాణం ఉద్భవిస్తుంది. ఇదే, సామాజిక చైతన్య ఖచ్చితమైన రీతులకు అనుగుణంగా ఉంటుంది. భౌతిక జీవనం, ఉత్పత్తి విధానం, సామాజిక, రాజకీయ మేధోపర జీవిత సాధారణ ప్రక్రియను నియంత్రిస్తుంది. మనుషుల చైతన్యం వారి ఉనికిని నిశ్చయించదు కానీ, వారి సామాజిక ఉనికి వారి చైతన్యాన్ని నిశ్చయిస్తుంది. ఏదో ఒక అభివృద్ధి దశ వద్ద సమాజ భౌతిక, ఉత్పాదక శక్తులు, అప్పుడు కొనసాగుతున్న ఉత్పత్తి సంబంధాలతో, లేక న్యాయపరిభాషలో ఇది కేవలం ఈ విషయాన్నే చెబుతుంది. అప్పటివరకూ, వారు కొనసాగిస్తూ ఉన్న ఆస్తి సంబంధాలతో ఘర్షణ పడతాయి. ఉత్పాదక శక్తుల అభివృద్ధి రీతుల నుండి ఈ సంబంధాలు, వారి సంకెళ్లగా మారతాయి. అప్పుడు, సామాజిక విప్లవ శకం ప్రారంభమౌతుంది."

పై ప్రకటనలో, మార్క్స్ కొన్ని సహజ న్యాయాల (Laws of Nature) ను రూపొందించాడు. కాని, సంబంధిత పరిస్థితులు ఏ సమాజంలోనైనా ఉన్నప్పుడే, అతని సాధారణీకరణలు చెల్లుబాటవుతాయి. అందువల్ల, మార్క్స్ తన సాధారణీకరణలను సహజ న్యాయాల నుండి గ్రహించినప్పటికీ, నిజానికి అవి కేవలం కొన్ని పరిస్థితుల్లోనే నిజమైనందున, అవి "నియమాలు" కావు. కానీ, అవి నియమాలవంటి సాధారణీకరణలు. సి. బెహం మెక్ కుల్లాగ్ (C. Beham Mc Cullagh) అనే అతడు తన గ్రంథం 'జస్టిఫైయింగ్ హిస్టారికల్ డిస్క్రిప్షన్స్' (Justifying Historical Descriptions)లో చరిత్రకారుడు ఒక సాధారణీకరణ "నియమం వంటి" దాన్ని చెప్పటాన్ని సమర్థించడానికి నాలుగు మార్గాలున్నాయని గుర్తిస్తాడు. "మొదట, ఒకవేళ ఒక సాధారణీకరణను సహజ న్యాయం నుండి చూపగలిగినప్పుడు, దానిని అన్ని సాధ్యమైన సంఘటనలకు ప్రమాణంగా తీసుకోవచ్చు. రెండోది, ఒకవేళ ఒక సాధారణీకరణ కనీసం ఒక సమాజ యాదృచ్ఛిక నిజమని అప్పటికే తెలిసినట్లైతే, మనిషి, సమాజం గురించి ఒక ఆమోదిత సాధారణ సిద్ధాంతాన్ని ఉదహరిస్తున్నట్లైతే, అది నియమం వంటి దాన్నిగా గుర్తించవచ్చు. మూడోది, ఒకవేళ ఒక సాధారణీకరణ వివిధ కాలాల్లో చాలా సమాజాలకు నిజం అని

BRAOU

తెలిసినప్పుడు, దాన్ని సాధ్యమైన సంఘటనలకు ఒక వాస్తవంగా అంగీకరించొచ్చు. చివరగా, ఒకవేళ ఒక సాధారణీకరణ, ఒక సమాజ సంప్రదాయాల గూర్చి, లేక ఒక వ్యక్తి అలవాట్ల గురించి, లేక అతని మానసిక స్థితి గూర్చి చేసే, ఒక విశ్వసనీయ ప్రకటన ద్వారా సూచింపబడినట్లైతే, దాన్ని 'నియమం వంటి' దాన్నిగా తీసుకోవచ్చు. "

ఈ అన్ని రకాల్లో, చరిత్రకారులు మానవ ప్రకృతిపై ఉండే అప్పటి సూత్రాల నుండి, లేక ఆర్థిక, రాజకీయ అభివృద్ధి, సాంస్కృతిక సంఘటనలు మొదలైన వాటి సిద్ధాంతాల నుండి చరిత్రకారులు స్వేచ్ఛగా తీసుకుంటున్నందున, వారి సాధారణీకరణలు సార్వత్రిక లక్షణాన్ని సంతరించుకున్నాయి. మనం "కొంత సార్వత్రికం" అని మాత్రమే చెప్పాల్సి ఉంది. ఎందుకంటే, అన్ని సమాజాలు ఒక ప్రత్యేక ఆర్థిక రాజకీయ పరిణామాన్ని అనుసరిస్తున్నా, ఒక సమాజ అభివృద్ధి ఇంకో దానికి ఖచ్చితంగా అనుగుణంగా ఉండాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు, 19వ శతాబ్దం నుండి ప్రపంచం పెట్టుబడిదారీ విధాన తత్వం పైన్నే పరిణామం చెందుతున్నా, భూస్వామ్య విధానం నుండి పెట్టుబడిదారీ విదానానికి జరిగే ప్రపంచ వాస్తవ పరిణామం, ఒకే విధంగా లేదు. ఈ చారిత్రక సంఘటనల మధ్యనున్న అసమానతలే, సాధారణీకరణలను "నియమాలవంటి", షరతులతో కూడినది (Conditional)గా తయారుచేస్తుంది. అంటే, దానర్థం, చరిత్రలో సార్వత్రిక వివరణలు, సాధారణీకరణలూ ఉండవనా?

## 4.5 సార్వత్రిక వివరణలు

BRAOU

నిజమైన ప్రతి వివరణ కూడా సార్వత్రికమైనదనుటలో ఎటువంటి మినహాయింపు లేదు. కొన్ని చారిత్రక సాధారణీకరణలు, అవి మానవ చరిత్ర సాధారణ నమూనాలను, ముఖ్యంగా, ఉత్పత్తి విధానాల్లో మార్పుల గూర్చి వివరించినప్పుడు, అవి సార్వత్రికమయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ, మానవ ప్రవర్తన గూర్చి వ్యవహరించేటప్పుడు, చరిత్రకారుల సాధారణీకరణలు సార్వత్రికమైనవిగా గుర్తింపబడవు. ఎందుకంటే, అవి జీవశాస్త్రాల్లో లాగే, ప్రామాణికమైన సహజ న్యాయాల నుండి గ్రహింపబడలేదు.

ఆర్నాల్డ్ జె. టాయెన్‌బీ (Arnold J. Toynbee), కార్ల్ మార్క్స్ వంటి ప్రఖ్యాత చారిత్రక తత్వవేత్తలు కూడా, మానవ చరిత్ర సాధారణ వివరణతో, లేక పొరపాటు లేని మొత్తంతో, పురోగమించలేక పోయారు. మానవ చర్యలు, ప్రవర్తనలు, నాగరికతల్లోని మార్పుల గూర్చి, వారి అనుకూల సార్వత్రిక సాధారణీకరణలు తప్పనిసరిగా అనేక మినహాయింపులకు గురౌతున్నాయి. ఉదాహరణకు, నాగరికతల అభివృద్ధి, పతనాన్ని నియంత్రించే సూత్రాలను కనుక్కోవడంలో, టాయన్‌బీ చేసిన కృషిని చరిత్రకారులు ఎంతోకాలం అంగీకరించలేదు. ఎందుకంటే, ఇతని సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉండే అనేక ఉదాహరణలున్నాయి. అదే విధంగా, బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ సమాజాల్లోనే కార్మిక విప్లవం మొట్టమొదటగా వస్తుందనే, ఎంతో ప్రజాదరణ పొందిన కార్ల్ మార్క్స్ సాధారణీకరణ, విమర్శలకు గురైంది. ఎందుకంటే, వెనుకబడ్డ సమాజాలైన రష్యా, చైనాల్లోనే సామ్యవాద విప్లవాలు మొట్టమొదటగా వచ్చాయి. అయినా, ఈ సాధారణీకరణలకు సార్వత్రిక విలువ లేదని దానర్థం కాదు.

ఆసక్తికర, ఉపయోగకర సాధారణీకరణలు, మినహాయింపులకు గురౌతాయి. వారి ఉద్దేశంలో, ఒక ప్రత్యేక యుగంలో కొన్ని లక్షణాలు నిజమౌతాయి. అందువల్ల, అనుమిత వివరణల ప్రయోజనాల కొరకు, చరిత్రకారుడు విస్తృత దృష్టితో, సార్వత్రికమైన సాధారణీకరణలకే ప్రాముఖ్యతనివ్వాలి.

ఒక ఆసక్తికరమైన విషయమేమంటే, జి. ఎ. కోహెన్ (G.A. Cohen) తన గ్రంథం 'కార్ల్ మార్క్స్ థియరీస్ ఆఫ్ హిస్టరీ; ఎ డిఫెన్స్' (Karl Marx's Theories of History; A Defence)లో మార్క్స్ సైద్ధాంతిక ప్రకటనలను సమర్థించే ప్రయత్నంలో ఉన్నప్పుడు, అతను మానవ ప్రకృతికి సంబంధించిన పూర్వ కల్పనల నుండి ఎలా గ్రహించవచ్చో, దాన్ని ఉదహరించే అనేక విషయాలను ఎలా సమర్థించవచ్చో, చూపించాడు. అతని ఉద్దేశంలో, సాధారణీకరణలు మినహాయింపులేని నిజాలు కావు కాని, ధోరణులను సూచించే వివరణలు అన్ని సమాజాలకు వర్తిస్తాయి. ఆ విధంగా, "ఉత్పత్తి శక్తులు చరిత్ర అంతటా అభివృద్ధి చెందుతూ ఉంటాయి" అనే మార్క్స్ సిద్ధాంతం, కోహెన్ ఉద్దేశంలోని అప్పుడప్పుడూ పరిస్థితులు కొంతసేపు అభివృద్ధిని నిరోధించవచ్చనేదాన్ని అనుమతిస్తుంది. ఈ విధమైన భావంతో, చరిత్రకారులు సార్వత్రిక వివరణలకు రావచ్చు.

## 4.6 సంగ్రహంగా

చారిత్రక సాధారణీకరణలు కాలానుగుణ్యామైనవి, అస్థిరమైనవి. తరచూ మార్పులకు లోనయ్యేవి. చరిత్రలో వివరణలు మానవ చరిత్ర, ప్రతి యుగ అవసరాలకు తగ్గట్లుగా మారుతుంటాయి. ఇ. హెచ్. కార్ సరిగ్గా చెప్పినట్లు, చరిత్ర గతానికి, వర్తమానానికే మధ్య జరిగే అనంతమైన సంభాషణ. వివిధ కాలాల్లోని చారిత్రక యుగ విశ్లేషణలు, ఒక రీతికి వ్యతిరేకంగా చాలా సందర్భాల్లో, సంఘర్షించే విధంగా ఉండే సాధారణీకరణ పరంపరను పునర్విచారిస్తుంది. విశ్లేషణల్లోని ఈ విధమైన మార్పు, ప్రతి చారిత్రక యుగంలోని మారుతున్న రాజకీయ, సైద్ధాంతిక, ఆర్థిక సామాజిక - సాంస్కృతిక వాతావరణం వల్ల వస్తుంది. చరిత్రను సాధారణీకరించటంలో కొందరు, కేవలం నైతిక తీర్పులు ఇవ్వడంలోనే లీనమైతే, ఇంకొందరు సమకాలీన రాజకీయ పోరాటాల్లో ప్రయోగాత్మకంగా ఉపయోగపడే విధంగా, మానవ చరిత్ర మార్పు సరళిని గతితార్కిక పద్ధతిలో అర్థం చేసుకోడానికి అత్యంత శ్రద్ధ చూపించారు. ఇంకో మాటలో చెప్పాలంటే, సాధారణీకరణలనేవి సమకాలీన వాస్తవాలను, సంక్షోభాలను తెలుసుకునే అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, గత చారిత్రక అభివృద్ధి నుండి చేసే ఊహలు (Inferences).

తాత్వికంగా, చరిత్ర అనేది, స్వాభావికంగా ఉండే చరిత్రను సాధారణీకరించే సరళిపై వెలుగును చూపిస్తూ, చరిత్రను భిన్నమైన విధంగా తెలుసుకోవడం జరుగుతుంది. లియోనార్డ్ క్రీగర్ (Leonard Kriegar) "చరిత్ర తప్పక నిజమైంది, అది తప్పక భావాన్ని తయారుచేస్తుందని" చెబితే, రేమండ్ ఆరన్ అనే తత్వవేత్త "మనుషులు ఇష్టపడే చరిత్ర, చరిత్రకారులు రూపొందించే చరిత్ర, చరిత్రకారులు రూపొందించిన దాన్ని తత్వవేత్తలు ప్రత్యామ్నాయంచేసే చరిత్రకూ మధ్య సంబంధాలను గుర్తించాల్సి ఉంది" అని వాదిస్తాడు. ఇది చరిత్రలో చరిత్ర "వివేకం చేసే" (make sense) విధంగా ఉన్న సాధారణీకరణల క్రమం. ఇది చరిత్ర, మానవుల మధ్య గల సంబంధాన్ని గుర్తించే అంతః సంబంధాల కలయికను బహిరంగ పరుస్తుంది.

BRAOU

అందువల్ల, చరిత్రకారులు తాము యదార్థాలను సంకలనం చేస్తున్నామని చెప్పుకున్నా, వారు సాధారణీకరణ చేయటం జరుగుతుంది. "యదార్థాలు" వాటంతటవి మాట్లాడవు. యదార్థిక ప్రకటనలని చెప్పుకునే అన్నీ కూడా పోల్చి చూడ్డం, ప్రాక్కల్పన ధృవపర్చుకోడం వంటి జటిలమైన వాటిపై ఆధారపడి ఉన్నాయి. "రచించిన చరిత్ర", విలియం ఒ ఐడెలోట్ వాదనలో, ఏ ఇతర పొందికయైన, వివేకవంతమైన వివరణల వంటివాటివలె, ఇది సామాన్యమైన రికార్డు కాదు. కానీ, ఇది అతి సంక్లిష్టమైనటువంటిది." ఈ విధమైన సంక్లిష్టత, చరిత్రకారుడు సాధారణీకరణ చేసినప్పుడు మాత్రమే, స్వచ్ఛమైందిగా, అర్థవంతమైందిగా తయారౌతుంది. మానవులు అనుసరించే భవిష్యత్ చారిత్రక విధానాల చిరానుభవ ఉదాహరణల ద్వారా, సాధారణీకరణల సముదాయంతో ఎవరు అంగీకరించినా, అంగీకరించపోయినా, చరిత్ర నుండి సాధారణీకరణలను తయారుచేయాల్సిన ఆవశ్యకత ఉందని తప్పక అంగీకరించాలి.

## 4.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. సాధారణీకరణాల్లోని రకాలను వివరించండి.
2. నియమాల వంటి సాధారణీకరణలు అంటే ఏమిటి? ఇవి చరిత్రకారునికి ఏవిధంగా ఉపయోగపడ్తాయో తెల్పండి.

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. యదార్థాలకు, సాధారణీకరణకు గల సంబంధాన్ని తెల్పండి.
2. సార్వత్రిక వివరణలు అంటే ఏమిటి?
3. 'సాధారణీకరణలు కాలానుగుణ్యమైనవి'. దీనితో నీవు అంగీకరిస్తావా?

## 4.8 ఉపయుక్త గ్రంథాలు


| | |
|---|---|
| Aron, Raymand | : **Introduction to Philosophy of History** |
| Cohen G.A. | : **Karl Marx's Theories of History; A Defence** |
| Cullager, C. Beham Mac | : **Justifying Historical Description** |
| Elton G.R. | : **The Practice of History** |
| Hook Sydney (ed) | : **Philosophy and History** |
| Karl Marx | : **A Contribution to the Critique of Economy** |



రచయిత :డా. అట్లూరి మురళి



BRAOU

# భాగం-5 : విషయ నిష్ఠత

విషయ క్రమం

5.0 లక్ష్యాలు

5.1 పరిచయం

5.2 విషయ నిష్ఠత అంటే ఏమిటి?

5.3 ఆత్మాశ్రయం

5.4 దురభిమానం, పక్షపాతం

5.5 విషయ నిష్ఠతను సాధించడం ఎలా?

5.6 సంపూర్ణ విషయ నిష్ఠత సాధ్యమా?

5.7 చారిత్రక ఆభాసలు-దోషాలు

5.8 ముగింపు

5.9 సంగ్రహంగా

5.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

5.11 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 5.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడంవల్ల ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

- విషయ నిష్ఠత, చరిత్ర రచనలో దాని ప్రాముఖ్యత.
- చరిత్రకారుని పక్షపాత వైఖరి, చరిత్ర రచనకు ఎలాంటి నష్టాలను కలుగచేస్తుంది.
- విషయ నిష్ఠతను సాధించడానికి ఉన్న పరిమితులు, ఎదుర్కొనే సమస్యలు.
- చారిత్రక ఆభాసలు - దోషాలు చరిత్ర రచనలో ఎలా చోటు చేసుకుంటాయి?

## 5.1 పరిచయం

విషయ నిష్ఠత (Objectivity) అనేది చరిత్ర రచనలో ఉన్నత ప్రమాణాలను సాధించడానికి ఉపయోగించే ఒక ముఖ్య సాధనం. గతంలో వివిధ సమయాల్లో, వివిధ ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు

చరిత్రలో చోటుచేసుకొన్నప్పుడు వాటి యదార్థతను తెలియచేయడంలోను, వాటిపై వ్యాఖ్యానం చేయడంలోను, రచయిత అనేక ప్రభావాలకులోనై, తన రచనల్లో ఆ సంఘటనల స్వభావాన్నే మార్చివేసే అవకాశం ఉంది. భారతదేశ చరిత్రను మనం ఉదాహరణగా తీసుకొంటే, మనం ఎన్నో అంశాలను చరిత్రకారులు సమకాలీన పరిస్థితుల ప్రభావాలకులోనై చేసినటువంటి రచనల్లో చూడొచ్చు. ప్రత్యేకంగా, వలస కాలం నాటి భారతదేశ చరిత్రలో, ఏ అంశంపై పరిశోధన చేయాలన్నా, పరిశోధకుడు ఎదుర్కొనే క్లిష్ట సమస్య ఏమిటంటే, ఆధారాల ప్రామాణికత. ఎందుకంటే, దాదాపుగా ఆనాటి భారతదేశ చరిత్రను రచించిన వారు బ్రిటీష్ ఉన్నతాధికారులు, లేక ప్రభుత్వం నియమించిన చరిత్రకారులు. వీరు తమ రచనల ద్వారా, పక్షపాత వైఖరి నవలంబించి, భారతదేశ చరిత్రను ఎన్నో రకాలుగా వికృతీకరించడం జరిగింది.

ఈ విధమైన పరిస్థితి కాలక్రమేణ వస్తున్న మార్పుల వల్ల, హెరోడోటస్, వోల్టేర్, రాంకె లాంటి వారు చేసిన సేవల వల్ల, ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి, చరిత్ర ఒక శాస్త్రీయ సంబంధమైన అంశంగా అభివృద్ధి చెందడమే కాకుండా, చరిత్ర రచనలో విషయ నిష్ఠత ప్రాముఖ్యతను గూర్చి నొక్కి చెప్పడం జరిగింది. కాబట్టి, చారిత్రక విషయ నిష్ఠత యదార్థతకు ఆదర్శంగా నిలుస్తుంది. నిష్పాక్షికతతో అంశాన్ని పరిశీలించి, పక్షపాతం, దురభిమానం లాంటి వాటికి తావివ్వకుండా, చరిత్ర రచన చేయగలిగినపుడు, రచయితకు గాని, రచించిన అంశానికి గాని, సరైనటువంటి గౌరవం లభించడమే కాకుండా, ముందు తరాల వారికి మార్గదర్శకులవుతారు.

## 5.2 విషయ నిష్ఠత అంటే ఏమిటి?

విషయ నిష్ఠత, విషయాత్మకత, విషయగత తత్వం ఈ పదాలన్నీ ఒకే అర్థాన్ని సూచిస్తాయి. చరిత్ర తత్వంలో, విమర్శనాత్మక ధోరణికిది మరో ప్రతీక. ముఖ్యంగా, చరిత్ర స్వభావాన్ని అవగాహన చేసుకోవడంలో దానికి ప్రాధాన్యత ఉంది. ఆరోగ్యదాయకంగా చరిత్రాధ్యయనం అభివృద్ధి చెందడానికి ఈసమస్యకు చరిత్రలో ప్రాముఖ్యత ఇవ్వబడింది. విషయ నిష్ఠత, విలువకు సంబంధించిన తీర్పు (Value Judgement) కు సన్నిహితంగా ఉంటుంది. సత్యమైనదానికి, వాస్తవికమైనదానికి ప్రతీకగా ఈ విషయ నిష్ఠత నిలుస్తుంది. వ్యక్తిగత పక్షపాతానికి, భావుకతకు దూరంగా ఉండే స్థితిని, ఇది సూచిస్తుంది. ఏ విధంగా అయితే ఒక న్యాయాధిపతి ఎటువంటి భయపక్షపాతాలు లేకుండా, అత్యంత నిష్పాక్షిక బుద్ధితో తన తీర్పును ప్రకటిస్తాడో, అదే విధంగా, ఒక చరిత్రకారుడు గత సంఘటనలను చిత్రీకరించేటప్పుడు ఉద్వేగరహితంగా, నిరాసక్తంగా, శాస్త్రీయంగా ఆ సంఘటనలన్నింటిపట్ల వ్యవహరించే తీరే, విషయ నిష్ఠత అని భావించొచ్చు.

## 5.3 ఆత్మగత తత్వం లేక ఆత్మాశ్రయత (Subjectivity)

మానవ నైజం తెలిసి కూడా విషయ నిష్ఠత అసలు సాధ్యమవుతుందా? అనేది ప్రశ్న. ఎందుకంటే, దురభిమానం అనేది కొంతవరకు మానవునిలో అంతర్గతంగా ఉండే ఒక విధమైన మానసిక స్థితి. ప్రతి చరిత్రకారుడు ఎంతో విశ్వాసంతో, యదార్థంతో ప్రతి అంశాన్ని ప్రకటిస్తూంటాడు. కాని, ఈ ఆరోపిత యదార్థాలు చాలవరకు అతని స్వీయాభిప్రాయాలు, పరిశీలనలు, వ్యాఖ్యానాలు తప్ప

BRAOU

మరేం కాదు. అవి యదార్థాల మూలంగా వచ్చిన తీర్పుల ఫలితాలు కాక, గ్రంథకర్త మానసిక స్థితి నుండి ఆవిర్భవించినవి కావచ్చు. చరిత్రకారుడు విషయగతం అని భావించే అంశం, కేవలం అతని వ్యక్తిగతమైనదానికి ప్రతిబింబం కావచ్చు. అదే, ఆత్మాశ్రయం, లేక ఆత్మగతం (Subjective) అన్నమాట.

చారిత్రక అంశం వ్యక్తి ఆలోచనను ప్రతిబింబిస్తుంది. కాబట్టి, కొంత ఆత్మగతం అనివార్యం. ఈ విషయంపై వోల్టేర్ ఇలా అంటాడు. 'అది గతించిన వారిపై మనం ప్రయోగించే ఉపాయాల సమూహం' (That it is a pack of tricks we play upon the dead). గతించిన సంఘటనలు వర్తమానంలో చరిత్రకారుని ఆలోచనలో తప్ప, వాస్తవంగా ఉండవు. అందువల్ల, ఇక్కడ పరిశీలించ బడుతున్న విషయం, పరిశీలిస్తున్న వ్యక్తి ఒకే శ్రేణి కిందికి వస్తారు. అంటే, గత సంఘటనల అస్థిత్వం అతని ఆలోచన మీద ఆధారపడి ఉంది. అతడు ఇచ్చే ప్రాధాన్యతను బట్టే, యదార్థాలు చారిత్రక యదార్థాలుగా మారతాయి. అంటే, అతని వ్యక్తిత్వం పరోక్షంగానైనా అతడు పరిశీలించే అంశాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ, ట్రెవెల్యన్ ఇలా అంటాడు: "ఎవరైనా రచన చేస్తున్నప్పుడు రచయిత నైజం, వివేకం, వర్గ చైతన్యాలతో సహా, పూర్తి వ్యక్తిత్వంతో అతని ఉనికి ఆ రచనలో ఉంటుంది."

## 5.4 దురభిమానం, పక్షపాతం

చరిత్రకారులు వ్యక్తులను, ఇతివృత్తాలను యదార్థంగా కాక, భిన్నంగా చిత్రీకరించిన ఉదాహరణలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. తన మనస్సులోనే గతాన్ని పునర్జీవింపచేసే చరిత్రకారుడు, అలా చేసేటప్పుడు గత సంఘటనలపై తన భావాలను కొంతవరకైనా అధ్యారోపితం చేస్తాడు. ఇది నిజానికి ఒక ప్రేరక ప్రక్రియ. ఆత్మాశ్రయతకు దారితీసే ఈ ప్రేరణకు కారణాలు అనేకం ఉండవచ్చు. దురభిప్రాయం అంటే, పరిశీలన చేయకుండానే ఏర్పర్చుకొన్న అభిప్రాయం, అనేక రూపాలతో ఆత్మాశ్రయతకు దారితీస్తుంది. చరిత్ర రచనలో ఉన్న భిన్న ప్రక్రియలే, ఆత్మాశ్రయతకు అవకాశం ఇస్తున్నాయి. అశోకుని యుద్ధ విరమణ గురించి రాస్తూ, ఒకే చరిత్రకారుడు ప్రస్తుత ప్రపంచంలో మానవాళి మనుగడకు అణ్వాయుధాలనుండి కల్గుతున్న ముప్పునుండి కాపాడడానికి, అశోకుని విధానం ఎంత అవసరమో, చెప్పేటంత భావ ఉద్రిక్తతకు (Temptation) కు లోనవుతాడు. రచనా విషయం ఎంపిక దశ నుండి, ఆ విషయాన్ని పాఠకులకు రసజ్ఞంగా అందించే దశ వరకు, ఈ అభిమానం, పక్షపాతం అనేవి తప్పించుకోలేని అంశాలయ్యాయి. సైద్ధాంతిక పరిశీలనకు గాని, రాజకీయ నిబద్ధతకు గాని, వర్గ దురభిమానానికి గాని, తీవ్ర జాతీయాభిమానానికి, స్వదేశాభిమానికి గాని, గుడ్డిగా ఒక పక్షాన్ని అవలంబించే వైఖరికిగాని, చరిత్రకారుడు ఎరయ్యే అవకాశం ప్రతి దశలోను ఉంది. సైద్ధాంతిక పరిశీలనకు మూలం, ఒక ప్రత్యేక ఆలోచనా మార్గంలో దృఢ విశ్వాసం. అది మత, ధర్మ సంబంధమైంది కావచ్చు. లేదా, భౌతికవాద సంబంధమైంది కావచ్చు, లేదా, మరే ఇతర మేధా సంబంధమైంది కావచ్చు. అది వోల్టేర్, మార్క్స్, హెగెల్, టాయన్బీల్లో ఎవరైనా కావచ్చు. వీరెవ్వరూ, తమ తమ దృక్పథాలనుండి వైదొలగి, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా చారిత్రక సంఘటనలను వీక్షించ లేదు. రాజకీయ నిబద్ధతకు కారణం, వ్యక్తిగత విశ్వాస పాత్రత, లేదా కృతజ్ఞతాభావం. ఇది, మనం బాణుడు రచించిన 'హర్షచరిత', అబుల్ ఫజల్ రచించిన 'అక్బర్ నామా'లో చూస్తాం. అలాగే,



BRAOU

ఫెరిస్తా, ఇతర చరిత్రకారులను కూడ చూడొచ్చు. ప్రభువుల ఆదరణలో సాంఘికంగా ఉన్నత స్థాయికి చేరిన వీరు, ఆ ప్రభువుల గురించి రాసేటప్పుడు కూడా, ఆ కృతజ్ఞతా భావాన్ని తమ రచనల్లో ప్రతిబింబించడం సహజం. కొన్ని సందర్భాల్లో, చరిత్రకారుల వ్యక్తిగత దురభిమానం కూడా, చరిత్ర రచనను ప్రభావితం చేస్తుంది. అయితే, చాల విస్తృత పరిధిలో ఉన్న వర్గ దురభిమానాలను వేరుచేసి, అధ్యయనం చేయడం చాల కష్టం. ఆ వర్గ దురభిమానాలకు మత విశ్వాసాలు, జాతి విభేదాలవంటి కారణాలు అనేకం ఉండవచ్చు. కాథలిక్, ప్రొటస్టెంట్ వర్గాల మధ్యన ఘర్షణ, మధ్య యుగ ఐరోపా చరిత్రకారుల రచనలను ప్రభావితం చేశాయి.

దేశాభిమానం, జాతీయవాదం, సామ్రాజ్యవాదం చరిత్ర రచనను ప్రభావితం చేశాయి. ప్రాంతీయాభిమానం, భాషాభిమానాలుకూడ, చరిత్రకారులపై ఇదే రకమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. చరిత్రకారుల చరిత్ర రచనల్లో ప్రతిబింబించి, ఈ వ్యక్తిగత వర్గ, దురభిమానాలకు, పక్షపాతానికి, చరిత్రనిండా ఎన్నో దృష్టాంతాలు ఉన్నాయి. 19వ శతాబ్ది ఆంగ్ల చరిత్రకారుడు గ్రోట్ (Grote) తన గ్రీస్ చరిత్రలో, ఏథెన్స్ అనుకూల వైఖరిని అవలంబించించాడు. మిర్‌ఫర్డ్ (Mirford) అనే మరో రచయిత స్పార్టా అనుకూల వైఖరిని ప్రదర్శించాడు. జర్మన్ చరిత్రకారుడు మాంసెన్ (Mommsen) ప్రజాస్వామ్య వ్యతిరేక భావాలను వ్యక్తం చేశాడు. బ్రిటీష్ చరిత్రకారులు తరచుగా తమ రచనల్లో, భారతదేశం పట్ల అనుచిత వైఖరి ప్రదర్శించారు. జాతీయవాదులైన భారతీయ చరిత్రకారులు, బ్రిటీష్ వ్యతిరేక వైఖరిని అవలంభించారు. పైన ఉదహరించినవన్నీ, ఆయా వ్యక్తుల వ్యక్తిగత, వర్గ పక్షపాత, దురభిమానాల పర్యవసానంగానే జరిగింది.

BRAOU

చరిత్రలో ఒకే రచనా విషయం మీద విభిన్న వర్ణనలున్నాయి. కొన్ని సమయాల్లో ఇవి, పరస్పర విరుద్ధంగా ఉంటాయి. ఇందులో, ఒక్కొక్కటి ఒక్కొక్క దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. దీనికి ఉదాహరణగా, భారతదేశ చరిత్రలో అత్యంత ఉత్తేజాన్ని రేకెత్తించిన 1857 సంఘటనలను తీసుకొంటే, అవి అనేక కోణాలనుండి పరిశీలించబడ్డట్లు తెలుస్తుంది. ఈ సంఘటనలపై ఎన్నో రచనలు రాయబడ్డాయి. ఈ సంఘటనలపై రాసిన బ్రిటీష్ భారతీయ చరిత్రకారులు వర్గ దురభిమానాలను, పక్షపాత ప్రభావానికి లోనవటం వల్లనే, వీరి రచనలలో భిన్న దృక్పథాలు చోటు చేసుకున్నాయి. బ్రిటీష్ చరిత్రకారులు సైనిక, రాజకీయ, ఉద్వేగ కోణాలనుండి 1857 సంఘటనలను పరిశీలించారు. ఈ రచయితలలో చాలమంది కంపెనీ అధికారులుగా నాటి సంఘటనల్లో పాలుపంచుకోటమో, వ్యక్తిగతంగా వాటికి గురికావడమో జరిగింది. అందువల్లనే, కేమి, మాలెసన్, ట్రెవెల్యన్, లారెన్స్, హోమ్స్ కేరీలు ఆసంఘటనను సైన్యానికి పరిమితమైన కలహంగా చిత్రించగా, క్రైస్తవులకు వ్యతిరేకంగా జరిగిన మత యుద్ధంగా, రీస్ భావించాడు. ఇంకో చరిత్రకారుడు జాతి ఆధిక్యతకై సాగిన పోరాటమని పేర్కొన్నాడు. మరికొంతమంది భారతీయ, పాశ్చాత్య నాగరికతా సంస్కృతుల మధ్య, పోరాటంగా వర్ణించారు. భారతీయ రచయితల విషయానికొస్తే, రమేష్‌చంద్ర మజుందార్ దాన్ని కేవలం సిపాయి తిరుగుబాటుగా పేర్కొంటే, జవహర్‌లాల్ నెహ్రూ అధికారం కోల్పోయి, తీవ్ర అసంతృప్తితో ఉండిన జమీందారుల కుట్రగా వర్ణించాడు. మరి అశోక్ మెహతా వంటి జాతీయవాదులు, 1857 సంఘటనలను 'జాతీయ మహా విప్లవంగా' వివరించగా, సావర్కర్ లాంటివారు దాన్ని ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా వర్ణించాడు. మార్క్సిస్టుల అభిప్రాయంలో అది, బ్రిటీష్ ప్రభుత్వం, భారతీయ జమీందారులకు వ్యతిరేకంగా, రైతులు చేసిన తిరుగుబాటు.

ఈ సంఘటనలపై అందరికీ లభించే సమాచారం ఒక్కటే. అయితే, ఒకే సంఘటనపై విభిన్న అభిప్రాయాలు చరిత్రకారుల వ్యాఖ్యానాల్లోనే (Interpretations) అని చెప్పారు. ఈ వ్యాఖ్యానాలకు కారణమైన చరిత్రకారుల వ్యక్తిగత, వర్గ దురభిమానాలు, పక్షపాత వైఖరుల్లోనే అని చెప్పవచ్చు. ఇదే విధంగా, ప్రాంతీయవాద దురభిమానానికి ఉదాహరణలు కోకొల్లలు. చరిత్రలో ప్రసిద్ధి వహించిన రాజవంశాల మూలం (Origin) గురించిన వివాదాలు, చరిత్రకారులు తమ ప్రాంతీయ పక్షపాతాన్ని వెలిబుచ్చడానికి అవకాశాన్నిచ్చాయి. రాజవంశాల పుట్టుపూర్వోత్తరాలను నిర్ణయించడంలో, భూమి పుత్రుల సిద్ధాంతం (Son of the Soil Theory) బాగా ప్రచారంలోకి వచ్చింది. విజయనగర స్థాపకులు కన్నడిగులా? ఆంధ్రులా? వంటి వివాదాల్లో, ఆంధ్ర చరిత్రకారులు వారిని ఆంధ్రులని, కర్ణాటక చరిత్రకారులు వారిని కన్నడిగులని, సిద్ధాంతాలను సమర్థనీయంగా ప్రతిపాదించారు. అలాగే, శాతవాహనులు ఆంధ్రులా? మహారాష్ట్రులా? అనే వివాదంపై, ఆంధ్ర చరిత్రకారులు వారిని ఆంధ్రులని, మహారాష్ట్ర చరిత్రకారులు వారిని మహారాష్ట్రులని వాదించడం జరిగింది. చారిత్రక సంఘటనలను అస్తవ్యస్తం చేయడంలోను, చరిత్రను వికృతంగా చిత్రించడంలోను, చరిత్రకారుల ఆత్మాశ్రయతకు దోహదం చేస్తున్న అంశాల్లో, పక్షపాతం, దురభిమానాలేకాక, చరిత్రకారుల అజ్ఞానం, భయం, ప్రేరణలవంటి ఇతర కారణాలూ ఉండవచ్చు. అయితే, ట్రెవెల్యన్ అన్నట్లు, చరిత్రకారుడు గతంలో జీవించిన ప్రజల భావాలను, అనుభూతులను సానుభూతితో అర్థం చేసుకోడానికి, కొంతవరకు పక్షపాత వైఖరి తోడ్పడుతుంది. అయితే, ఇది అంతర్గతంగా ఉంటేనే అందం. అంతేగాక, చరిత్ర రచనను ఊహాత్మకంగాను, మనోహరంగాను తీర్చిదిద్దేది ఇదే. చరిత్ర రచనలో ఇదే లేకపోతే, ఆ రచన జీవరహితం అవుతుంది.

## 5.5 విషయ నిష్ఠతను సాధించడం ఎలా?

చరిత్రలో ఖచ్చితంగా ఏంజరిగిందో చెప్పటం చరిత్రకారుని కర్తవ్యం. చరిత్రకారుడు కేవలం గతానికి సంబంధించిన వర్ణన ఇవ్వటం లేదు. గతం గురించిన ఒక వివేకవంతమైన చిత్రాన్ని మన కళ్లముందు నిలబెడుతున్నాడు. అయితే, కార్ అభిప్రాయంలో సాంఘిక శాస్త్రజ్ఞుని పరిశీలనలు అన్నింటిలోకి, అతని పక్షపాతం ప్రవేశిస్తుంది. అంతేకాకుండా, అతని పరిశీలనా పద్ధతి అతని పరిశీలనా విషయంలో కూడా ప్రభావం చూపిస్తుంది. మార్పును తెస్తుంది. అది రెండు పరస్పర భిన్న మార్గాల్లో జరుగుతుంది. పరిశీలన ఫలితాలను ఊహించి, వ్యక్తులు తమ ప్రవర్తనను మార్చుకోవచ్చు. అటువంటప్పుడు ఆ పరిశీలన వృథాఅయ్యే ప్రమాదముంది. లేదా, గతంలో ఒక చారిత్రక సంఘటన ఎలా ముగిసిందో, తర్వాత తరాలవారికి తెలిసినప్పుడు, వారి ప్రవర్తన మారిపోవచ్చు. కాని, సత్యాన్వేషణ ఏ పరిశోధన అంశానికైనా లక్ష్యం కనక, విషయ నిష్ఠత లేని సత్యాన్వేషణ వ్యర్థం కనక, శాస్త్రజ్ఞునిలాగా, చరిత్ర కారుడూ నిష్పాక్షికతతో పరిశీలన కొనసాగించాలి. అది చారిత్రక ఆదర్శం.

ఆత్మాశ్రయం ఉనికికి రాజీపడి, ఊహకు తావివ్వడం చరిత్రను కట్టుకథగా దిగజార్చడం అవుతుంది. అందువల్ల, చరిత్రకారుడు సాధ్యమైనంతవరకు యదార్థాలను ఖచ్చితంగా వెలికితీయడం, తన లక్ష్యంగా పెట్టుకోవాలి. తగు పరిశోధనకు చేపట్టిన అంశాన్ని సూక్ష్మంగా పరిశీలించాలి. ఆ అంశంపై తనకు లభించే ఆధారాలను విస్తృతంగా సంప్రదించడం ద్వారా, యదార్థాలను వెలికితీయడానికి దోహద

BRAOU

పడుతుంది. యదార్థాన్ని వెలికితీయడంలో, విజ్ఞాన శాస్త్రజ్ఞునికంటె చరిత్రకారునికి అవకాశం ఎక్కువ. ఎందుకంటే, ఈ విషయాలన్నీ ఎప్పుడో ఒకప్పుడు జరిగినవికాబట్టి. అయితే, కొన్ని సందర్భాల్లో వాటిని ఒక క్రమపద్ధతిలో సిద్ధపరచడం, ఇప్పుడు సాధ్యంకాని పని. చరిత్రలో యదార్థాలు పూర్తిగా వస్తుపరంగా ఉండే అవకాశాలు లేవు. వాటికి చరిత్రకారుడు ఇచ్చే ప్రాధాన్యతను బట్టి మాత్రమే, అవి చారిత్రక యదార్థాలుగా మారతాయి. కార్ ఇలా అంటాడు: "ఒక ప్రక్రియ ద్వారా గతానికి సంబంధించిన ఒక నిజం, చారిత్రక నిజంలా పరిణామం చెందుతుంది. (Here is a process by which a mere fact about the past is transformed into a fact of History.)

1850 లో ఒక దౌర్జన్యకరమైన గుంపుచేత చంపబడ్డ ఒక వ్యక్తి ఉదాహరణనిస్తూ, చారిత్రకంగా ఒకప్పుడు ప్రాముఖ్యత లేని ఆ సంఘటనను ఒక గ్రంథంలో చర్చించారు కాబట్టి, అది కొంత మేరకు చారిత్రక నిజంగా అంగీకరించబడింది. ఇంకా కొన్ని గ్రంథాల్లో చర్చిస్తే, అది పూర్తి స్థాయి చారిత్రక నిజంగా అంగీకరించబడుతుంది. మరోమాటలో చెప్పాలంటే, మనం శోధించినవి, విశ్లేషించినవి, చర్చించినవి ఒకప్పుడు వాస్తవంగా జరిగిన విషయాలు. అప్పటి సమాజానికి ఏమి జరిగిందో తెలియకపోవచ్చు. అయితే, చారిత్రక వ్యాఖ్యానం (Historical interpretation), తీర్పు (Judgement) న్యాయబద్ధమైన కార్యకలాపాలు. చరిత్రకారునికి తాను కనుగొన్న వాటిని గురించి వ్యాఖ్యానించే హక్కు ఉంది. అంతేకాదు; కనుపించని వాస్తవాలను వెలికితీసి, వాటి ప్రాముఖ్యతను తెలియచేసే అవసరం మరెంతో ఉంది. చరిత్రలో విషయ నిష్ఠత ఈ యదార్థాలకు మాత్రమే పరిమితం కాదు. ఇది యదార్థాలకు, వ్యాఖ్యానానికి మధ్య ఉన్న సంబంధానికి సంబంధించింది. అంటే, గతానికి, వర్తమానానికి, భవిష్యత్తుకు మధ్య ఉన్న సంబంధానికి సంబంధించింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోడం ద్వారానే, చరిత్రకారుడు గతాన్ని వర్తమాన పరిధిలో క్రమబద్ధంగా పరిశీలించి, వ్యాఖ్యానించగలడు. కాలంగడిచే కొద్దీ, గతాన్ని గురించిన అతని వ్యాఖ్యానం, లక్ష్యశుద్ధి మారుతూ, ప్రగతిశీల పరిణామం చెందుతూ ఉంటాయి. దీన్ని ఆధారంగా చేసుకొనే, చరిత్రకారుడు గతానికి విలువకడతాడు. ఎల్లప్పుడూ, అన్ని విషయాలు ఒకటిగానే ఉంటాయన్న విశ్వాసం మీద, మన కొలబద్దలు ఆధారపడి ఉండవు. భవిష్యత్తుపై ఉన్న భావన ద్వారానే, గతాన్ని సక్రమంగా పరిశీలించి వ్యాఖ్యానించగలం. చరిత్రకారుని బాధ్యత ఇదే. అందుకే, కార్ చరిత్రను గత కాలపు సంఘటనలకు, క్రమక్రమేణా రూపొందే భవిష్యత్ లక్ష్యాలకు, మధ్య జరిగే సంభాషణ కూడా అని అంటాడు. ఈ దృష్టితో మాత్రమే, చరిత్రకారుడు తన మేధాశక్తిని భవిష్యత్ కోసం ఉపయోగించగలడు. ఈ కారణంగానే, నేమియర్ "చరిత్రకారులు గతాన్ని ఊహిస్తారు. భవిష్యత్తును జ్ఞాపకం ఉంచుకుంటారు"ని వ్యాఖ్యానించాడు. అంటే, భవిష్యత్తు మాత్రమే, గత కాలం ద్వారాలను తెరిచే, తాళం చెవి అన్నమాట. ఈ దృష్టితో మాత్రమే, మనం చరిత్రలో విషయ నిష్ఠతను గురించి చర్చించగలం. గతం భవిష్యత్తును, భవిష్యత్తు గతాన్ని స్పష్టం చేస్తాయన్న సూత్రం, చరిత్రకు వివరణ మాత్రమే కాదు, సార్థకత కూడా.

BRAOU

అయితే, ఒక చరిత్రకారుడు అతని విషయ నిష్ఠతకు ప్రశంసించబడుతున్నాడంటే అర్థం ఏమిటి? లేదా, ఒక చరిత్రకారుడు మరొక చరిత్రకారునికంటే ఎక్కువ విషయాత్మకంగా ఉన్నాడంటే, అర్థం ఏమిటి? అతడు స్పష్టమైన వాస్తవాలను సంపాదిస్తాడని కాదు. అతడు న్యాయమైన వాస్తవాలను ఎన్నుకుంటాడు కాబట్టి. మరో మాటలో చెప్పాలంటే, అతడు నిర్ణీత ప్రాధాన్యత కల ప్రమాణాన్ని

అనువర్తింపచేస్తాడని అర్థం. సమాజంలో, చరిత్రలో తన స్వీయ స్థితి పరిమితులను దాటి, ఏ విషయాన్నైనా చూడగల సామర్థ్యం, గతం గురించి ఎక్కువ బుద్ధిసూక్ష్మత కల, ఎక్కువ శాశ్వతమైన అంతర్‌దృష్టిని తనకు ప్రసాదించేలా, భవిష్యత్తులోకి తన దృష్టిని సారించే సామర్థ్యం కలవాడైతే, ఆ చరిత్రకారుడు విషయ నిష్ఠగా ఉన్నాడని భావించవచ్చు.

చరిత్రలోని నిష్పాక్షికత, విషయాత్మకత ఏవో అచంచలమైన ప్రమాణాలమీద ఆధారపడి ఉండవు. ఆ ప్రమాణాలు కాలక్రమేణా చరిత్ర గతిలో రూపొంది, వాటి ఆధారంతో, గతానికి, భవిష్యత్తుకు హేతుబద్ధమైన లంకె ఏర్పాటు చేయగలిగినప్పుడు, చరిత్ర ఒక అర్థాన్ని, నిష్పాక్షికతను, విషయ నిష్ఠతను సంతరించుకుంటుంది.

## 5.6 సంపూర్ణ విషయ నిష్ఠతను సాధించడం సాధ్యమా?

సంపూర్ణ విషయ నిష్ఠత చరిత్రలో సాధ్యం కాదు. దీన్ని సాకుగా తీసుకొని, చరిత్రకారుడు పక్షపాత ధోరణిలో, అర్థంలేని అంశాన్ని చరిత్రగా చిత్రీకరిస్తే, దానికి విలువ ఉండదు. అయితే, చరిత్రలో పరిశీలించబడే విషయం, పరిశీలకుడు రెండూ ఒకే రకానికి చెందుతాయి. ఈ రెండు పరస్పరం ఒకదాన్ని మరొకటి ప్రభావితం చేసుకుంటాయి. చరిత్రకారుడు తను పరిశోధన చేసే అధ్యయనంలో, తన వ్యక్తిగత అభిప్రాయాలను వెలిబుచ్చకుండా ఎందుకు ఉండలేడో చెబుతూ, పైరేన్ "సమాజమే చరిత్రకారుని అంశం. తన లాంటి వ్యక్తుల గురించి, తన దేశం లాంటి దేశాలు కారకాలు (factors) గా ఉన్న సంఘటనలను అర్థంచేసుకొని, వివరించి చెప్పడం అతని విధి. ఎంత నిష్పక్షపాతి అయినప్పటికీ, అతడు సంపూర్ణ విషయ నిష్ఠతను సాధించలేడు. ఎంత దృఢ సంకల్పుడైనప్పటికీ, అతడున్నటువంటి సామాజిక వాతావరణం నుండి అతడు తప్పించుకోలేడు. అతడున్న కాల పరిస్థితుల ప్రభావం, అతని రచనలో ప్రతిబింబిస్తుంది. అతడు భాగమైనటువంటి సంఘం, దాని నాగరికతను బట్టి, అతని అభిప్రాయం నిర్ణయించబడుతుంది" అని అభిప్రాయపడ్డాడు. అధిక తాత్విక ధోరణి కూడా, చరిత్రను వికృతీకరిస్తుంది. ఒక జర్మన్ చరిత్రకారుడు ప్రపంచంలో క్రైస్తవ మతాన్ని గొప్ప మతంగా, ప్రష్యాను గొప్ప దేశంగా, హెగేలియనిజమ్‌ను గొప్ప సిద్ధాంతంగా ఏవిధంగా భావించాడో, మనకు బ్యూరీ (Bury) వివరిస్తాడు.

అలాగే, అన్ని ప్రాంతాల్లో, అన్ని సమయాల్లో చరిత్రకారుడు ఎంత చిత్తశుద్ధితో, విషయ నిష్ఠతతో ఉండాలన్నా సాధ్యం కాకపోవచ్చు. ఉదాహరణకు, నాజీ ప్రభుత్వం వాక్‌స్వాతంత్ర్యాన్ని నిరాకరించడం వల్ల, జర్మనీలో చరిత్రకారులు ప్రభుత్వ పంథాను అనుసరించారు. రష్యా, చైనాల్లో అధికార పక్షం కమ్యూనిస్ట్ సిద్ధాంతాన్ని అనుసరించడంవల్ల, చరిత్రకారులు తప్పనిసరిగా ఒక వైఖరిని అనుసరించాల్సి వచ్చింది. భారత స్వాతంత్ర్య సమరంలో, బ్రిటిష్ ప్రభుత్వం వాస్తవాలను వెల్లడి చేసే రచనలు, పత్రికలు కానివ్వండి, గ్రంథాలు కానివ్వండి, చాలా కఠినంగా వ్యవహరించి, ఆంక్షలు విధించడమో, రద్దుచేయడమో చేసేది. సంపూర్ణ విషయ నిష్ఠతకు ఎంత ప్రాముఖ్యత ఉందో, దాన్ని సాధించడం అంత కష్టం. చరిత్రలోని సర్వసాధారణమైన వాస్తవాలను మాత్రమే, పూర్తిగా తప్పనో, ఒప్పనో నిర్ణయించటానికి వీలౌతుంది. రష్యన్ విప్లవానికి కారణం, జార్ రెండో నికలస్ మూర్ఖత్వమనో, లేక లెనిన్ మేధాశక్తి అనో చెప్పటం ఎంత మాత్రం సబబు కాదు. అది తప్పుదారి పట్టించేదిగా

BRAOU

కూడా ఉంటుంది. అయితే, ఇది పూర్తిగా తప్పకూడా కాదు. అందుచేత, చరిత్రకారుడు సంపూర్ణ సత్యాలను, అసత్యాలను, వివిధ కోణాలనుండి పరిశీలిస్తాడు. ఒక సంఘటన జరగడానికి అసలు కారణాలను, యాదృచ్ఛిక (Accidental) కారణాలను విభజించి, వివరించడానికి చరిత్రకారునికి కూడ ఒక సూత్రం అవసరం. దాని సహాయంతోనే అతడు, వివిధ కారణాల ప్రాముఖ్యతను నిర్ధారించి వివరించగలడు. అదే సూత్రం, అతని విషయ నిష్ఠతకు ప్రమాణంగా ఉంటుంది. అంటే, చరిత్ర గతానికి దర్పణం పట్టాలంటే, చరిత్రకారుడు సాధ్యమైనంతవరకు విషయనిష్ఠుడై ఉండాలి. అయితే, సంపూర్ణ విషయ నిష్ఠత అసాధ్యం. కొద్దిగా ఆత్మాశ్రయం అనివార్యమే కాకుండా, వాంఛనీయం కూడా. అందుకే, ట్రెవెల్యన్ ఒక అంశంపై అధ్యయనం చేసేటప్పుడు, కొద్దిగా ఆత్మాశ్రయం, గతంలో జీవించిన ప్రజల అనుభూతులను సానుభూతితో పరిశీలించడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డాడు. అంతేకాకుండా, అది చారిత్రక రచనను ఆసక్తికరంగా రచించడానికి తోడ్పడుతుంది.

## 5.7 చారిత్రక ఆభాసలు - దోషాలు (Historical fallacies and errors)

చరిత్ర రచనలో మొదటి నుండి తుది వరకు ఏదశలోనైనా, ఎక్కడైనా ఎప్పుడైనా, ఏదోరకమైన దోషం దొర్లే అవకాశం ఉంది. ఇంతవరకు మనం చెప్పుకున్నట్లుగా, చరిత్రకారుని ఆత్మాశ్రయత, పక్షపాత వైఖరి, అనేక రూపాల్లో అతని రచనలో ప్రతిబింబించవచ్చు. చరిత్రకారుడు అసంఖ్యాకమైన పొరపాట్లు చేయగలడని, డి. హెచ్. ఫిషర్ తన గ్రంథంలో పేర్కొన్నాడు. చరిత్ర రచనా సంవిధానంలో కనిపించే ఒక ప్రధాన లోపం, చారిత్రక రచనల్లో పక్షపాత రాహిత్యం, విషయ నిష్ఠతలు లేకపోవడం.

వాస్తవిక విశ్లేషణను నిర్లక్ష్యం చేయడం కూడ, చారిత్రక రచనల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా, ప్రాచీన భారతదేశంలో యదార్థాలను, సంఘటనలను గ్రంథస్థం (Record) చేయాలన్న శ్రద్ధ ఉండేది కాదు. పురాణాల ప్రభావాల వల్ల, చారిత్రక సంఘటనలు కట్టుకథలయ్యాయి. గత కాల సంఘటనలను వాటికి సంబంధించిన పురాతన అవశేష చిహ్నాల, పత్రాల సహాయంతో, చరిత్రను పునర్నిర్మించే ప్రయత్నం జరిగింది, జరుగుతూంది. చరిత్రకారుడు లిఖితపూర్వకమైన గ్రంథాలు, ప్రమాణ పత్రాలు, నివేదికలు, వంశ చరిత్రలు మొదలైనవాటి సహాయంతో, చరిత్రను పునర్నిర్మించ ప్రయత్నించినప్పుడు, మరింత కష్టాన్ని ఎదుర్కొంటున్నాడు. ఎందుకంటే, వాటిలోని విషయాలు విశ్వసనీయం కాకపోవచ్చు. లభించిన ఆధారాలు ప్రమాణ పూర్వకమైనవి కాకపోవచ్చు. ప్రాచీన భారతదేశ చరిత్రను తీసుకొంటే, మనకు ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. ఎన్నో ఖాళీలతో, ఎన్నో సంశయాలతో, ఖచ్చితమైన, యదార్థమైన ఆధారాలు లేక, రకరకాల వ్యాఖ్యానాలు, అభిప్రాయాలతో అయోమయంగా ఉంటుంది. కొంతమంది చరిత్రకారులు తాము చెప్పదలచుకున్న పాఠాలను, చరిత్రలో కనుగొనే ప్రయత్నం చేస్తారు. దీన్ని ఉపదేశాత్మక దోషం (didactical error) అని పిలవొచ్చు. విషయాలను ఒక ప్రత్యేక దృక్పథం నుండి చూడ్డానికి ప్రయత్నించే ఈ దోషం, చరిత్ర గ్రంథాల్లో అత్యంత సాధారణమైంది. చరిత్రకారుడు స్వదేశాభిమానంతో గతాన్ని చూసినప్పుడు, అతని రచన పక్షపాతంతో కూడుకున్నదవుతుంది. ఈ స్వదేశాభిమాన దోషం స్వదేశీ లోపాలను, ఇతరుల సుగుణాలను విస్మరించేలా చేస్తుంది. ఈ దోషానికి గురైన చరిత్రకారుడు అన్ని గొప్పవి, మంచివి అయిన అంశాలను తన స్వదేశ గతంలోనే కనుగొనే ప్రయత్నం చేస్తాడు.

BRAOU

మరికొంతమంది చరిత్రకారులు దోషానికి దూరంగా ఉండటం, వారితత్వానికే విరుద్ధంగా భావిస్తారు. యదార్థ నిరూపణకు అవకాశం ఉన్నవారు దాని జోలికి వెళ్లరు. తప్పులు దొర్లించడం వీరికి అలవాటు. ఈ దోషాన్ని 19వ శతాబ్ది ఆంగ్ల చరిత్రకారుడు ఫ్రాయిడ్ పేరు మీద, ఫ్రాయిడ్ రుగ్మత (Frouide's Disease) అని వర్ణించారు. దీనికి కారణం, ఫ్రాయిడ్ మంచి రచయిత అయినా, అతడు చెప్పే ప్రతి విషయం తప్పులతో కూడుకొని ఉండేది. చరిత్రకారుడు సరైన ఆధారాలను సొంతంగా అధ్యయనం చేసి, వాటి ప్రమాణికతను రుజువుచేసుకోవాలి. ఊహలను, ఆధారాలు లేని భావనలను చరిత్రలో చొప్పించకుండా, నియమాలను అనుసరించి, అత్యుత్తమమైన చరిత్రను రాసి, సమాజం ముందు ఉంచడానికి ప్రయత్నించాలి.

## 5.8 ముగింపు

మనం ఇంతవరకు చరిత్ర రచనలో విషయ నిష్ఠత అవసరం, దాని ప్రాముఖ్యత గురించి పరిశీలించాం. అంతేకాకుండా, ఆత్మాశ్రయత ప్రభావం ఏవిధంగా ఉంటుందో తెలుసుకున్నాం. అలాగే, సామాజిక, రాజకీయ పరిస్థితుల ప్రభావం వల్ల, కొందరు చరిత్రకారులు పక్షపాత వైఖరి నవలంబించడం కూడ గమనించాం. వీటన్నింటిని పరిశీలించిన తర్వాత, చరిత్రకారుడు తన రచనలో సంపూర్ణ విషయ నిష్ఠతను సాధించలేడని తెలుసుకున్నాం. అందుకే, ఆత్మాశ్రయం అనివార్యమే కాకుండా, వాంఛనీయం కూడా, అంటాడో చరిత్రకారుడు. అది పరిమితమైన పాళ్లలో ఉండి, ప్రాథమిక యదార్థాలను కావాలని వర్గీకరించి, చరిత్రకు నష్టం చేయడానికి ప్రయత్నించనంతవరకు, హానికరమైంది కాదు.

అలాగే, తెలిసో, తెలియకో, చరిత్రలో దోషాలు చోటుచేసుకుంటాయి. అన్నిటికంటే ముఖ్యమైంది, చరిత్రకారుని మనస్తత్వం. దృఢ సంకల్పంతో పరిస్థితుల ప్రభావాన్ని తట్టుకొని, మంచి ఆధారాలను పరిశీలించి, అవగాహన చేసుకొని, సాధ్యమైనంతవరకు నిష్పక్షపాతంతో రచనలు చేసినపుడు, వాటికి అర్థం, పరమార్థం, గౌరవం, ఆదరణ లభిస్తాయి. అందుకే, రాంకే 'చరిత్ర గతాన్ని గురించిన వ్యాఖ్యానంతో, భవిష్యత్తుకు మార్గదర్శకం కావాలి' అని ఉద్ఘాటించాడు.

BRAOU

## 5.9 సంగ్రహంగా

1. చరిత్ర రచనలో విమర్శనాత్మక ధోరణికి, విషయ నిష్ఠత మరో ప్రతీక. ఆరోగ్యదాయకంగా చరిత్రాధ్యయనం అభివృద్ధి చెందడానికి, ఈ అంశానికి చరిత్రలో ప్రాముఖ్యత ఇవ్వబడింది.
2. చరిత్రకారుడు చరిత్ర రచనలో విషయ నిష్ఠతను సాధించడానికి చేసే కృషిలో, ఎన్నో రకాల ఇబ్బందులకు గురౌతాడు.
3. దురభిమానం (Prejudice) అనేది, కొంతవరకు మానవునిలో ఉండే అంతర్గత మానసిక స్థితి. దీని ప్రభావానికి లోనవకుండా, చరిత్ర రచన చేయడం, చరిత్రకారుడు ఎదుర్కొనే అతి క్లిష్ట సమస్య.
4. చారిత్రక దోషాలు చరిత్ర రచనలో సాధారణంగా దొర్లుతాయి. వీటిని నివారించకపోతే, చారిత్రక సంఘటనలు కట్టు కథ లౌతాయి.

## 5.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. విషయ నిష్ఠత అనగానేమి? చరిత్రలో సంపూర్ణ విషయ నిష్ఠతను ఎలా సాధించాలి?
2. విషయ నిష్ఠతను సాధించటంలో చరిత్రకారుడు ఎదుర్కొనే సమస్యలను వివరించండి.
3. చరిత్రకారుని పక్షపాత వైఖరి చరిత్ర రచనకు ఎలాంటి నష్టాన్ని కలుగచేస్తుంది?

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ఆత్మాశ్రయం అనగానేమి?
2. చరిత్రలో సంపూర్ణ విషయ నిష్ఠతను సాధించడం సాధ్యమా?
3. చారిత్రక దోషాలను గురించి రాయండి.

## 5.11 ఉపయుక్త గ్రంథాలు


Carr, E.H. : **What is History?**

Collingwood, R.G. : **The Idea of History**

Devahuti (ed) : **Bias in Indian Historiography**

Elton, G.R. : **The Practice of History**

Marwick, Arthur : **The Nature of History**

Renier, G.J. : **History, its Purpose and Method**

Schaff, Adam : **History and Truth**

Sheik Ali, B. : **History: its Theory and Method**

Thaper, R., Mukhia. H., and Chandra, Bipan. : **Communalism and the Writing of Indian History**

Tosh, John : **The Pursuit of History**

ఇ.హెచ్.కార్ : చరిత్ర అంటే ఏమిటి? (తెలుగు అనువాదం)

జె. దుర్గాప్రసాద్ : చరిత్ర రచనా శాస్త్రం


రచయిత : జి. సుదర్శన్ రెడ్డి

BRAOU

# భాగం-6 : సంశ్లేషణ

విషయ క్రమం


6.0 లక్ష్యాలు

6.1 పరిచయం

6.2 సంశ్లేషణ విధి

6.3 సంబంధిత యదార్థాలను గుర్తించటం

6.3.1 ఐక్యతా ప్రతిజ్ఞా వాక్యం

6.3.2 ప్రశ్నా విధాన ప్రాక్కల్పన

6.4 యదార్థాల సామూహికీకరణ

6.4.1 కాలక్రమ (Chronological) సామూహికీకరణ

6.4.2 భౌగోళిక సామూహికీకరణ

6.4.3 విషయ ప్రధాన సామూహికీకరణ

6.4.4 సామూహికీకరణలో సమస్యలు

6.5 థీసిస్‌ను రచించటంలో జాగ్రత్తలు

6.6 నిర్మాణాత్మక వివేచన

6.6.1 ప్రతికూల వివేచన

6.6.2 అనుకూల వివేచన

6.7 నిర్మాణాత్మక వివేచనలో తీసుకునే జాగ్రత్తలు

6.8 సంగ్రహంగా

6.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

6.10 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 6.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివినందువల్ల మీరు,

- చరిత్ర రచనలో సంబంధిత యదార్థాలను గుర్తించగలగాలి.

- యదార్థాల సామూహికీకరణాన్ని విశ్లేషించగలగాలి.
- నిర్మాణాత్మక వివేచనను గూర్చి వివరించగలగాలి.

## 6.1 పరిచయం

విశ్లేషణా ప్రక్రియలో యదార్థాలను పరిశీలించి, అవి యదార్థాలనే విషయాన్ని, అనేక పరీక్షల ద్వారా తెలుసుకుని, వాటిని సేకరించుట జరుగుతుంది. ఈ విధంగా సేకరించిన యదార్థాలను మనం తీసుకున్న అంశానికి తగ్గట్లుగా అమర్చుకోవాల్సి ఉంటుంది. అప్పుడే, మనం తీసుకున్న అంశాన్ని సరిగ్గా వివరించగలం. యదార్థాలను (facts) అమర్చుకొన్న తర్వాత, ఇంకా ఉన్న విచ్ఛేదాల (gaps)ను, నిర్మాణాత్మక వివేచన (Constructive reasoning) ద్వారా పూరించుకోవాలి. ఈ విధంగా, సిద్ధాంత వ్యాసాన్ని రాయడానికి ముందు, సేకరించిన యదార్థాలను తగ్గ విధంగా అమర్చుకోటమే, సంశ్లేషణ (Synthesis) అని అంటారు.

## 6.2 సంశ్లేషణ ముఖ్య విధి

సంశ్లేషణ చేసే ముఖ్యమైన పని ఏమంటే, అనేక రకాల విషయాలను ఒక దగ్గర చేర్చి, నూతన విషయాన్ని నిర్మించటం. విజ్ఞాన శాస్త్రంలో అనేక రకాల మూలకాల (Elements) ను ఏ విధంగానైతే, తగు పాళ్లలో కలిపి, నూతన మిశ్రమా (Compound) న్ని తయారుచేస్తామో, ఆ విధంగానే, అనేక రకాల భావాలను ఒక పద్ధతిలో అమర్చుకొని, నూతన విషయాలన్నీ చెప్పాల్సి ఉంటుంది. ఈ విషయంలో ప్రత్యేక సిద్ధాంతమేదీ లేకపోయినా, కొన్ని సాధారణ సూత్రాలను పాటించడం, చరిత్రకారునికి ఎంతో అవసరం. వీటిలో మొదటిది, ఒకేరకమైన యదార్థాలను గుర్తించి, వాటిని ఒక దగ్గర చేర్చటం, ఆ తర్వాత ఆ యదార్థాలను గురించి సరిగ్గా వివరించేంతగా సంశ్లేషణా ప్రక్రియను చేపట్టే ముందు, సంబంధిత యదార్థాలను గుర్తించాలి.

## 6.3 సంబంధిత యదార్థాలను గుర్తించటం

యదార్థాల సామూహికీకరణ చేయటానికి ముందు, ఒకే రకమైన యదార్థాలను గుర్తించాల్సి ఉంటుంది. యదార్థాల సామూహికీకరణకు ముందు, తీసుకున్న పరిశోధనాంశానికి సంబంధించి, సాధ్యమైనంత వరకు, యదార్థాలన్నింటినీ సేకరించినట్లు నిర్ధారించుకోవాలి. ఎందుకంటే, తక్కువ యదార్థాల సామూహికీకరణ, సంశ్లేషణకు పూనుకున్నట్లైతే, అనేక పొరపాట్లు జరిగే అవకాశం ఉంది. ఈ సేకరించిన సమాచారమంతా అతి సూక్ష్మమైన యదార్థాలుగా, అక్కడక్కడా వెదజల్లినట్లుగా విభజించుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా, ఈ సమాచారమంతా మూడు రకాలుగా ఉంటుంది. అవి: 1. భౌతికమైనవి; ఉదాహరణకు, భవనాలు, కట్టడాలు, కళలు, పరిశ్రమలు, అంటే బయటకు కన్పించేవి; 2. మానవ చర్యలు; ఇందులో వ్యక్తులు చేసిన పనులు, వారి వైఫల్యాలు, వారి ఘన కార్యాలు; 3. వ్యక్తుల చర్యల వెనుక ఉన్న ఉద్దేశాలు. ఇవి పూర్తిగా మానసిక సంబంధమైనవి. ఇవి బయటకు కన్పించవు. వీటిలో తిరిగి మూడు రకాలు ఉన్నాయి. అవి: (a) రచయితల అభిప్రాయంలో వ్యక్తుల ఉద్దేశాలు, ప్రత్యయాత్మకాలు (Conceptions); (b) రచయితలు, వారి సమకాలీన

BRAOU

వ్యక్తులకు అంటగట్టిన ఉద్దేశాలు (Motives); (C) పత్రంలోని యదార్థాలను ప్రభావితం చేసే రచయిత ఉద్దేశాలు. ఈ విధంగా, భౌతికమైన యదార్థాలు, మానవ చర్యలు, మానసిక యదార్థాలు (Psychic facts) కలసి, చారిత్రక జ్ఞానంగా పేర్కొనొచ్చు. వీటిని దృష్టిలో ఉంచుకొని, యదార్థాలను గుర్తించాలి. భిన్న (Conflicting) సమాచారం లభించినప్పుడు, దాన్ని సాధారణీకరణ (Generalisation) చేయటానికి ప్రయత్నించాలి. ఈ సందర్భంలో, అందరికీ ఆమోదయోగ్యమైన భావననే, పరిగణనలోకి తీసికోవాలి. ప్రతి యదార్థం ఏదో ఒక ప్రాంతానికి, ఒక కాలానికి సంబంధించినదై ఉంటుంది. అందువల్ల, ప్రాంతీయత, కాలం ఆధారంగా కూడా, యదార్థాలను గుర్తించొచ్చు. వీటిని నిర్లక్ష్యం చేస్తే, యదార్థాల చారిత్రక లక్షణాన్ని కోల్పోవటం జరుగుతుంది.

## 6.3.1 ఐక్యతా ప్రతిజ్ఞా వాక్యం

సంబంధిత యదార్థాలను గుర్తించటానికి రెండు రకాల మార్గాలున్నాయి. అవి: 1. ఐక్యతా ప్రతిజ్ఞా వాక్యం (Unifying Proposition); 2. ప్రశ్నా విధాన ప్రాక్కల్పన (Interrogative Hypothesis). ఐక్యతా ప్రతిజ్ఞా వాక్య పద్ధతిలో మనం తీసుకున్న విషయాన్ని ఒక అంశం (topic) గా కాకుండా, ఒక వాక్యంగా తీసుకోవాలి. అప్పుడు ఆ వాక్యానికి సంబంధించిన యదార్థాలను గుర్తించటం సులభమౌతుంది. చాలావరకు, చారిత్రక అంశాలు వాక్యంగా ఉండవు. అవి, ఉదాహరణకు 'వలస పాలనలో భారతదేశ ఆర్థిక పరిస్థితి' అనో, లేక "భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర" అనో ఉంటుంది. వీటిని వాక్యాలుగా మార్చినప్పుడు, "వలస పాలనలో భారతదేశ పరిస్థితి దిగజారి, భారత ప్రజలు దయనీయ పరిస్థితి ననుభవించారు" అని, లేక "బ్రిటీష్ పాలకులను ఎదిరించి, భారతీయ ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమాన్ని చేపట్టారు", అని అవుతుంది. ఇటువంటి ప్రతిజ్ఞా వాక్యాలు నిజం కావచ్చు, అబద్ధం కావచ్చు. ఒక ప్రాక్కల్పన (Hypothesis) గా దీన్ని తీసుకొన్న ఎడల, దీనికి సంబంధించిన యదార్థాలను సులభంగా గుర్తించ వీలౌతుంది.

BRAOU

## 6.3.2 ప్రశ్నా విధాన ప్రాక్కల్పన

యదార్థాలను గుర్తించడంలో, ఇంకో విధానం ఉంది. ఈ పద్ధతే, ప్రశ్నా విధాన ప్రాక్కల్పన (Interrogative hypothesis). ఈ పద్ధతిలో మనం తీసుకున్న చారిత్రక అంశాన్ని, ప్రశ్న రూపంలో నున్న ఒక ప్రాక్కల్పన (Hypothesis) గా ఏర్పర్చుకోవాలి. ఆవిధంగా చేసినప్పుడు, ఆ ప్రశ్నకు సమాధానంగా కన్పించిన యదార్థాలను సులభంగా గుర్తించొచ్చు. పైన ఉదహరించిన అంశాన్నే తీసుకున్నట్లైతే, అప్పుడు "వలస పాలనలో భారతదేశ ఆర్థిక పరిస్థితి ఎందుకు దిగజారింది?; ఆ కాలంలో, భారత ప్రజలు దయనీయ స్థితిలో ఎందుకు ఉన్నారు?; దానికి, ఆర్థిక పరిస్థితులు ఏ మేరకు కారణం?; బ్రిటీష్ వారి విధానాలు ఎంతవరకు కారణం?" వంటి ప్రశ్నల రూపంలో, ప్రాక్కల్పనలను తయారుచేసుకోవాలి. ఈ ప్రశ్నలకు సమాధానంగా మనకు లభించిన యదార్థాలన్నిటినీ, సులభంగా గుర్తించ వీలౌతుంది. ఆ ప్రశ్నలకు సమాధానం కాని యదార్థాలను నిర్దయగా తొలగించొచ్చు.

ఈ విధంగా, ఐక్యతా ప్రతిజ్ఞా వాక్యాన్ని, ప్రశ్నా విధాన ప్రాక్కల్పనను ఉపయోగించటం, అన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. ఇవి పూర్తిగా ఏక విషయక రచనా (Monographic) అంశాల్లోనే

బాగా [illegible]. ఎందుకంటే, ఏక విషయక రచనా (Monographic) అంశాలు ఏక ప్రతిజ్ఞా వాక్యంపై ఆధారపడి ఉన్నందువల్ల. అయినా, మనం తీసుకున్న అంశాన్ని అనేక అధ్యాయాలుగా చేసుకొని, ప్రతి అధ్యాయానికి ఈ పద్ధతులను ప్రయోగించ ప్రయత్నించాలి. ఒక ప్రత్యేక పద్ధతినే అనుసరించాలనే నియమమేదీ లేనందున, యదార్థాలను గుర్తించటంలో చరిత్రకారుడు తన వ్యక్తిగత నిర్ణయమే, అంతిమ తీర్పుని గుర్తించాలి.

## 6.4 యదార్థాల సామూహికీకరణ

ప్రాచీన కాలంలో చరిత్ర రచనల్లో, యదార్థాల సామూహికీకరణ జరగలేదు. చాలామంది రచయితలు దండయాత్రలు, యుద్ధాల తోటి, వరదలు, అంటువ్యాధులను కలిపివేశారు. ఇది, శాస్త్రీయమైన పద్ధతి కాదు. 19వ శతాబ్దం నుండి ఒక పద్ధతిలో యదార్థాల సామూహికీకరణను చేయడం ప్రారంభమైంది. చారిత్రక నిర్మాణం కేవలం పత్రాలు, కాలక్రమాలపై ఆధారపడిలేదు. వాటిని ఎంపిక చేయడం, అమర్చడం, సామూహికీకరణ చేయడం పైనే ఉంది. తన వద్ద ఉన్న యదార్థాలన్నింటినీ పరిశీలించిన పిదప, వాటిని దృష్టిలో ఉంచుకొని, శీర్షికలు (Headings), ఉప శీర్షికలు (Sub-headings), విభాగాలు, ఉప విభాగాలుగా విభజించుకోవాలి. దీనికి ఒక ప్రత్యేక సూత్రమంటూ ఏదీ లేదు. పరిశోధకుడే, ఈ విషయంలో ఒక సూత్రాన్ని ఏర్పర్చుకోవాలి. అయితే, ఈ విభజనలో కొన్ని అతి చిన్న లేదా, కొన్ని అతి పెద్ద శీర్షికలుగా విభజించకుండా, సమతౌల్యాన్ని పాటించడానికి ప్రయత్నం చేయాలి.

చారిత్రక అంశం నాలుగు కోణాల్లో (aspects) ఉంటుంది. అవి: జీవిత చరిత్ర (biographical), భౌగోళిక, కాలక్రమ (Chronological), విధ్యుక్త (functional). వీటిని గుర్తించి, యదార్థాలను సేకరించేటప్పుడు, ఆయా విషయాల కనుగుణంగా యదార్థాలను సేకరించిన ఎడల, యదార్థాలను గుర్తించటం సులభమౌతుంది.

BRAOU

యదార్థాల సామూహికీకరణలో, ఒక ప్రత్యేక ప్రణాళికను ఏర్పర్చుకోవాలి. ఉదాహరణకు, మనం తీసుకున్న చారిత్రక అంశం, కుతుబ్‌షాహి పాలకుల చరిత్ర అయినట్లైతే, యదార్థాలను ఈ క్రింది విధంగా అమర్చుకోవచ్చు.

1. రాజకీయ పరిస్థితులు : వరస క్రమంలో కుతుబ్‌షాహి రాజుల చరిత్ర, ప్రతి రాజు కాలంలో జరిగిన దండయాత్రలు, యుద్ధాలు, వైఫల్యాలు, ఘన కార్యాలు, వారి రాజనీతి, ఇతర రాజులతో సంబంధాలు మొదలైనవి.

2. భౌతిక పరిస్థితులు : ఆ కాలంలోని వాతావరణ పరిస్థితులు, భౌతిక లక్షణాలు, భౌగోళిక వనరులు, నదులు, జనాభా, జనన మరణాలు, రోగాలు.

3. మేధోపర అలవాట్లు: ఇందులో భాష, కళలు, విజ్ఞాన శాస్త్రాలు, మతం, నీతినియమాలు, తత్వం మొదలైనవి.

4. సామాజిక సంస్థలు : కుటుంబం, సంప్రదాయాలు, అభిరుచులు, అలవాట్లు, ఆహారం, వస్త్రధారణ మొదలైనవి.

5. ఆర్థిక పరిస్థితులు : వ్యవసాయం, భూమిశిస్తు, భూకమతాలు, రైతులు, ఉత్పత్తి, పంపిణీ, వినిమయం, రవాణా, వ్యాపార వాణిజ్యాలు, పరిశ్రమలు, ఆదాయ వ్యయాలు, చేతి వృత్తులు మొదలైనవి.

ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. ఈ విధంగానే, పరిశోధకులు యదార్థాలను విభజించాలనే నియమం ఏదీ లేదు. పరిశోధకుడు తన ఆసక్తి, తన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, సామూహికీకరణ చేయొచ్చు.

## 6.4.1 కాలక్రమ సామూహికీకరణ

యదార్థాలను కాల క్రమ, లేక భౌగోళికంగా, లేక విషయపరంగా విభజించొచ్చు. ఒకే అంశాన్ని ఈ మూడు రకాలుగా కూడా సామూహికీకరించవచ్చు. కాలక్రమాన్ని బట్టి, అంశాన్ని విభజించటం ఎంతో సులువైంది, ఉపయోగకరమైంది. ఒక వేళ మనం కాలక్రమంలో సామూహికీకరించిన ఎడల, కాలక్రమాన్ని ఖచ్చితంగా పాటించాలి. మనం తీసుకున్న అంశం, "ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర" అయిన ఎడల, దానిని 1885 నుండి 1905, 1905 నుండి 1921, 1921 నుండి 1942, 1942 నుండి 1948 గా విభజించాలి. ఆకాలంలో జరిగిన సంఘటనలపై విపులంగా రాయాల్సి ఉంటుంది. ఈ విధమైన కాలక్రమ సామూహికీకరణ (Chronological Grouping) చేయటం, ఎంతో ఉపయోగకరమైనదైనా, చారిత్రక ఆలోచనలు (Ideas), ఉద్యమాలను బట్టి యుగ విభజన చేయటం, మంచి ఫలితాల నివ్వదు. దీనికి ఉదాహరణ, సాంస్కృతిక పునరుజ్జీవనం, పారిశ్రామిక విప్లవం మొదలైనవి. ఈ రకమైన యుగ విభజన, తీసుకున్న విషయం పట్ల, స్పష్టమైన అవగాహనను ఏర్పర్చదు. ఆ యుగ ప్రత్యేక లక్షణాలు వేరే యుగంలో లేనట్లుగా చెప్పినట్లవుతుంది. అందువల్ల, ఇది చరిత్రకారుని తప్పుదోవ పట్టిస్తుంది. ఏ యుగం కూడా, ఒకే ప్రత్యేక లక్షణాన్ని సంతరించుకోలేదు. అదే విధంగా, మనం చరిత్రను ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలుగా విభజిస్తాం. ప్రాచీన యుగంలో ఉన్న కొన్ని లక్షణాలు, మధ్య యుగంలో, లేక ఆధునిక యుగంలో కన్పిస్తాయి. అదే విధంగా, ఆధునిక యుగంలో ఉన్న లక్షణాలు, మిగిలిన యుగాల్లో కన్పిస్తాయి. 'ప్రాచీన', 'మధ్య', 'ఆధునిక' అనే పదాలు, ఖచ్చితమైన అర్థాన్ని ఇవ్వవు. ఈ సందర్భంలో, థామస్ ఆర్నాల్డ్ ఆఫ్ రగ్బీ (Thomas Arnold of Rugby) ఈ విధంగా అన్నాడు: "మనం ప్రాచీనమని పిలుస్తున్న చరిత్రలో చాలా భాగం, ఇప్పటి దానికి సాదృశ్యమైన సమాజంనే వివరిస్తుంది. కాబట్టి, అది ప్రయోగాత్మకంగా ఆధునికమైంది. అదే విధంగా, మనం ఆధునిక చరిత్ర అని దేన్ని పిలుస్తున్నామో, అది జరిగిపోయిన విషయాలకు సంబంధించి ఉంటుంది కాబట్టి, అందులో చాలావరకు ప్రాచీనమైంది." కాబట్టి, ఈ విధమైన యుగ విభజన వల్ల అంతగా ఉపయోగముండదు.

BRAOU

## 6.4.2 భౌగోళిక సామూహికీకరణ

అదే విధంగా, భౌగోళికపరమైన సామూహికీకరణ చేయాలనుకున్నప్పుడు, విషయాన్ని భౌగోళికంగా విభజించాలి. ఇంతకు ముందు తీసుకున్న అంశాన్నే ఉదాహరణగా తీసుకున్నట్లైతే, కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణాలో స్వాతంత్ర్యోద్యమ వివిధ దశలను పేర్కొనాల్సి ఉంటుంది. వీలైతే, జిల్లాల వారీ విభజన కూడా చేయవచ్చు. ఈ విధమైన సామూహికీకరణ వల్ల, యదార్థాలను ప్రాంతీయ

పరంగా వివరించటం చాలా సులభం. [illegible] ఒక ప్రాంతానికి చెందినవై ఉంటాయి.

### 6.4.3 విషయ ప్రధాన సామూహికీకరణ

విషయ ప్రధానంగా సామూహికీకరించాల్సి వచ్చినప్పుడు, ప్రధాన విషయాలు, లేదా సంఘటనలాధారంగా చారిత్రక అంశాన్ని విభజించాలి. దాని ప్రకారం, పైన ఉదహరించిన అంశాన్ని, జాతీయోద్యమానికి ముందు సాహిత్య వికాసం, ఉద్యమంలో పాల్గొన్న వివిధ రాజకీయ సంస్థలు, స్వాతంత్ర్యోద్యమం లోని వివిధ ఘట్టాలు, ఉద్యమంలో ప్రజల పాత్ర, సాహిత్యం పాత్ర, ఉద్యమం పట్ల పాలకుల ధోరణి, మొదలైన భాగాలుగా విభజించుకోవాలి.

నిజానికి, పై పద్ధతుల్లో ఏ ఒక్క పద్ధతి ననుసరించినా, వేరే పద్ధతిలోని విషయాలు కూడా వస్తాయి. కాలానుక్రమంగా విభజించినప్పుడు, అందులో భౌగోళికంగా విడివిడిగా, అంటే ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణాల్లో జరిగిన ఉద్యమాలు, విషయపరమైన పాలకుల ధోరణి, సాహిత్యం పాత్ర, రాజకీయ పార్టీల పాత్ర మొదలైన విషయాలను పేర్కొనాల్సి ఉంటుంది. ఏ విధంగా సామూహికీకరణ జరిగినా, ప్రతి ఉప విభాగంలో కాలక్రమం (Chronological order) ను తప్పక పాటించాలి.

అందువల్ల, సామూహికీకరణకు ఒక ప్రత్యేక పద్ధతి అంటూ లేదు. అయినా, ఒక పద్ధతిని ఏర్పరుచుకున్నప్పుడే, సరైన చారిత్రక నిర్మాణం జరుగుతుంది. ఏ విధమైన సామూహికీకరణ చేయాలనేది, పూర్తిగా పరిశోధకుని ఇష్టం పైనే ఆధారపడి ఉంది. ఇది, పూర్తిగా పరిశోధనాంశ స్వభావం, పరిశోధకుని ఆసక్తిని బట్టి ఉంటుంది.

BRAOU

### 6.4.4 సామూహికీకరణలో సమస్యలు

యదార్థాల సామూహికీకరణ కొన్ని సమస్యలతో కూడుకున్నది. కొన్ని రకాల యదార్థాలు సామాజికపరమైనవిగా కన్పించినా, వాస్తవానికి అవి సాంస్కృతికమైనవే అయి ఉండొచ్చు. చరిత్రలో వ్యక్తుల చర్యలు, సంఘటనలు, వ్యక్తుల పాత్రను భాగాలుగా వర్గీకరించినప్పుడు, రచనలో ఒక భాగమంతా సంఘటనల వివరణకు సంబంధించినదై, ఇంకో భాగం, మానవ అలవాట్లకు సంబంధించినదై ఉంటుంది. చరిత్రకారుల్లో అనేక మందికి, వీటిలో దేన్ని అనుసరించాలనే విషయంపై, ఏకాభిప్రాయం లేదు. మార్క్సిస్టులు, భౌతికవాదులు సంస్థలకు ప్రాధాన్యతనిస్తే, ఆదర్శవాదులు (Idealists) మానవ అభీష్టాని (human will)కి విలువ నిచ్చారు. ఏది ఏమైనా, చరిత్ర అనేది వ్యక్తుల చర్యలతో బాటు, సంప్రదాయాలు, ప్రవర్తనలు, సంస్థలు, సంస్కృతులు మొదలైన వాటి గురించి చెప్పే, ఒక సమగ్రమైన విషయం.

ఒక ప్రత్యేక అలవాటుపై మన పరిశోధనాంశం ఉన్నప్పుడు, దీన్ని వర్గీకరించడం కొంత కష్టమైన పని. ఈ అలవాట్లనేవి, కాల, స్థలాల్లో విస్తరించివున్న యదార్థాల సముదాయం. సాధారణంగా, ఒక జాతి ఒకే భాషను, ఒకే రకమైన ఆచార సంప్రదాయాలు, అలవాట్లను కల్గివుంటుందనే సాధారణ నమ్మకం ఉన్నా, ఏ సమాజం కూడా మొత్తంగా సజాతీయతగా ఉండదు. ఉదాహరణకు,

భారతదేశంలో భిన్న ఆచారాలు, అనేక రకాల భాషలు, మతాలు ఉన్నాయి. అదే విధంగా, క్రైస్తవ, లేదా మహమ్మదీయ మతాలకు చెందిన వారు ప్రపంచంలో వేరు వేరు ప్రదేశాల్లో జీవిస్తూ, వారి ప్రాంతాలకు సంబంధించిన ఆచార సంప్రదాయాలను, అలవాట్లను కూడా పాటిస్తూ ఉంటారు. అందువల్ల, ఒకే రకమైన అలవాట్లున్న వర్గాలను గుర్తించటం కష్టమైన పని.

అదే విధంగా, రాజకీయ, లేక సాంఘిక అలవాట్లలో కూడా, వర్గాలను గుర్తించటం కష్టమైన పని. ఎందుకంటే, ఒకే రాజకీయ పార్టీకి చెందిన వారైనా, ఒకే రకంగా ప్రవర్తిస్తారనడానికి వీల్లేదు. అదే విధంగా, సామాజిక వర్గాలు కూడా. ఇటువంటి సందర్భంలో సరైన పరిశోధన (investigation) అవసరం. సమాజంలో ఆ అలవాటు ఎలా ఉత్పన్నమైందో, తెలుసుకో ప్రయత్నించాలి. దాని కొరకు, అతి చిన్న విషయాన్ని కూడా, పరీక్ష చేయాల్సి ఉంటుంది.

ఈ విధంగా, యదార్థాల సామూహికీకరణ అనేది, యదార్థాలను సరైన పద్ధతిలో వర్గీకరించుకొని, అమర్చుకోవాల్సిన అతి ముఖ్యమైన పనిని వివరిస్తుంది. దీని ద్వారా, ఒక రకానికి చెందిన యదార్థాలను ఒక దగ్గర చేర్చుతుంది.

## 6.5 సిద్ధాంత వ్యాసాన్ని రచించటంలో జాగ్రత్తలు

BRAOU

యదార్థాలను సామూహికీకరించిన తర్వాత, చరిత్రకారుడు సిద్ధాంత వ్యాసాన్ని రాయటానికి ఉపక్రమించాలి. సంబంధిత భావాలను ఒక దగ్గర చేర్చి, పాఠకులకు ఆసక్తికరంగా రచించటమనేది ఒక కళ. దీనికి, ప్రతి పేరాలో పటిష్టమైన ఆరంభం, ముగింపు ఉండాలి. పటిష్టమైన ఆరంభం, పాఠకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఆ తర్వాత, ఆ పేరాలో చెప్పదలచుకున్న అంశాన్ని తార్కికంగా విశ్లేషిస్తూ, ఒక క్రమ పద్ధతిలో చెప్పాలి. అయితే, ఇది మనం తీసుకున్న పరిశోధనాంశ ప్రధాన భావం (Central idea) నుండి ఎప్పుడూ ప్రక్కకు పోరాదు. ఆ పేరాలో చెప్పదల్చుకున్న అంశాన్ని, పేరా ప్రారంభంలోనే సూచనగా చెప్పాలి. ముఖ్యమైన యదార్థాలను చర్చించేటప్పుడు, సాధారణీకరణ (Generalisation) చేయడం కంటే, ఖచ్చితమైన వివరాలు, ప్రత్యేకమైన యదార్థాలను పేర్కొనటం ఉత్తమం. ఈ విధంగా రాయడానికి ఎంతో అభ్యాసం కావాలి. దీనికి ముందు, పరిశోధకుడు అనేక మంది చరిత్రకారుల రచనలను చదివి, వారి శైలిని తెలుసుకోవాలి. అందులో, తనకు ఉపయోగపడే ఒక శైలిని ఎంపిక చేసుకుని, దాన్ని నమూనాగా చేసుకొన్న ఎంతో లాభకరం.

మనం సేకరించిన యదార్థాలన్నింటినీ, సిద్ధాంత వ్యాసంలో పొందుపర్చటం సాధ్యం కాదు. అన్ని యదార్థాలనూ ఈ వ్యాసంలో పొందుపర్చిన, అది చాలా అనాసక్తంగా ఉంటుంది. అందుకని, సంబంధంలేని యదార్థాలను ఒక ప్రక్క తొలగిస్తూ, ఇంకొక ప్రక్క సంబంధం ఉన్ననూ, ఇంతకు మునుపు చెప్పిన అంశాన్నే చెబుతుందని భావించినప్పుడు, అటువంటి యదార్థాలను కూడా తొలగించాలి. ఉదాహరణలు అధికంగా ఉన్నట్లైతే, సిద్ధాంత వ్యాసం దెబ్బతిని, చెప్పాలనుకున్న విషయ ప్రాధాన్యత తగ్గిపోతుంది. అయితే, అసలు ఉదాహరణలే లేకుంటే, ఉన్న అంశం, చాలా నిరాసక్తంగా ఉంటుంది. అందుకని, అతి జాగ్రత్తగా సంబంధిత యదార్థాలను గుర్తించి, సిద్ధాంత వ్యాసాన్ని పొందుపర్చాలి.

ప్రతి ముఖ్య యదార్థానికి ఆధారాన్ని సూచించాలి. ఇది పాద సూచిక (Foot note) రూపంలో ఉండాలి. దీన్ని అధ్యాయం చివరగానీ, లేక ప్రతి పేజీ కింద భాగాన కానీ, సూచించాలి. ప్రతి వ్యాఖ్య (quotation), ప్రతి ముఖ్య యదార్థం, ఇతర రచయితల అభిప్రాయాలకు, తప్పక పాద సూచికల నివ్వాలి. కొన్ని సందర్భాల్లో పరిశోధకులు పాద సూచికలను అపసవ్యంగా వాడటం జరుగుతుంది. ముఖ్యంగా, అంశానికి సంబంధించినదనటంలో అనుమతమున్న యదార్థాలను, ఈ పాద సూచికల్లో పొందుపర్చటం జరుగుతుంది. ఈ విధంగా చేయటం, సిద్ధాంత వ్యాసాన్ని బలహీనపరుస్తుంది. సంబంధమున్న యదార్థాలను ప్రధాన అంశాల్లో చేర్చి, సంబంధం లేని దాన్ని వదలివేయాలే గాని, పాద సూచికల్లో సూచించరాదు.

## 6.6 నిర్మాణాత్మక వివేచన

సంశ్లేషణా ప్రక్రియలో ఇంకో ముఖ్యమైన అంశం, నిర్మాణాత్మక వివేచన (Construction Reasoning). యదార్థాలన్నీ సామూహికీకరణ చేసిన తర్వాత, ఇంకా అనేక విచ్ఛేదాలు (gaps) ఉంటాయి. ఈ విచ్ఛేదాలు ఉండటం చాలా సహజం. ఎందుకంటే, మనకు లభించిన చారిత్రక ఆధారాలు, మనం తీసుకున్న అంశానికి సరిపోయేంతగా ఎప్పుడూ లభించవు. ఉదాహరణకు, "ఇందిరా గాంధీ హత్య" వంటి రాజకీయ అంశాన్ని తీసుకున్నప్పుడు, ఎంతటి సమర్థవంతమైన న్యాయ కమీషన్ (judicial commission) ను నియమించినా, అన్ని ఆధారాలు లభించటం అసాధ్యం. హంతకులను పట్టుకొన్నా, కొన్ని అంశాలు వెలుగులోకి రావు. చారిత్రక రచనలో కూడా, ఈ విధంగా అందుబాటులో ఉన్న అన్ని రకాల చారిత్రక ఆధారాలను పరిశీలించినా, కొన్ని యదార్థాలు వెలుగులోకి రావు. ఈ విధంగా వెలుగులోకి రాని చారిత్రక అంశాలను బయటికి తేవటం కొరకు, చరిత్రకారుడు వివేచన (Reasoning) ను ఉపయోగించాలి. దీన్నే, 'నిర్మాణాత్మక వివేచన' (Constructive Reasoning) అని అంటారు. ఇందులో, రెండు రకాల వివేచనలున్నాయి. అవి, ప్రతికూల వివేచన (negative reasoning), అనుకూల వివేచన (positive reasoning).

BRAOU

### 6.6.1 ప్రతికూల వివేచన

ప్రతికూల వివేచననే, "నిశ్శబ్దం నుండి హేతువాదన" (argument from silence) అని అనవచ్చు. ఇది, అనుకూల వివేచన కంటే సులువైన పద్ధతి. ఏదైనా ఒక విషయం రికార్డుల్లో లభించనప్పుడు, ఆ అంశం జరగలేదని అనుమానించటం, ప్రతికూల వివేచన కిందకు వస్తుంది. ఇది, పూర్తిగా మానవ స్వభావంపై ఆధారపడి ఉంది. ఏ వీధిలోనైనా పెద్ద కొట్లాట జరిగిందని తెలిసినప్పుడు, అది ఆ వీధిలో ఉన్న వ్యక్తులందరికీ తెలుస్తుంది. ఆ వీధిలోని వ్యక్తి ఎవరైనా తనకా విషయం తెలియదన్నప్పుడు, అది జరిగినా, జరగలేదని చెప్పొచ్చు. అదే విధంగా, చరిత్రలో అతి ముఖ్యాంశాలు నమోదై ఉంటాయి. నమోదు కానట్లైతే, అది జరగలేదని చెప్పుకోవాలి.

ప్రతికూల వివేచన చేసేటప్పుడు, చరిత్రకారుడు రెండు నియమాలను పాటించాలి. అందులో మొదటిది, ప్రతి యదార్థం గుర్తించబడిందనీ, నమోదు చేయబడిందనీ, భద్రపరచబడిందనీ, తాను సంతృప్తి చెందాలి. తాను "నిశ్శబ్దహేతువాదన"ను ఉపయోగిస్తున్నాడు కాబట్టి, అంటే, తాను ఒక

యదార్థాన్ని, అది లేకపోవటం ద్వారా గుర్తిస్తున్నాడు కాబట్టి, ఆ యదార్థాన్ని ఎవరూ గుర్తించలేదని నిర్ధారించుకోవాలి. ఎందుకంటే, ముఖ్యమైన విషయమైతే, ప్రతి ఒక్కరూ దాన్ని గుర్తిస్తారు. అంతేగాక, ఆ యదార్థాన్ని నమోదు చేస్తారు. జాగ్రత్తగా భద్రపరుస్తారు. అందుకని, ఆ యదార్థాన్ని నమోదు చేయలేదనీ, దాన్ని జాగ్రత్తగా భద్రపర్చలేదనీ నిర్ధారించుకోవాలి. చాలా సందర్భాల్లో, భద్రపరచడం చాలా కష్టమైన పని. ఇది ప్రాచీన, మధ్యయుగ కాలానికి సంబంధించిన విషయాల్లో, చాలా స్పష్టంగా కన్పడుతుంది. అందువల్ల, ఈ వివేచనను ఈ కాలానికి సంబంధించిన విషయాలపై ప్రయోగించటం, ఎంతో ఉపయోగకరమైంది.

ఇక రెండో నియమం, తాను నిర్ధారించదలచిన యదార్థ స్వభావాన్ని (nature) తెలుసుకోవాలి. ఒక యదార్థం అందరూ గుర్తించేది, సహజంగానే నమోదు చేయబడేదీ, భద్రపరచేదీ అని తాను గుర్తించాలి. వరదలు, కరువులు అల్లర్లు, విప్లవాలు, యుద్ధాలు, అలవాట్లు సంప్రదాయాలవంటి యదార్థాలను అందరూ విషయాలపైనే భద్రపరచడం కూడా జరుగుతుంది. కాని, కొన్ని రకాల యదార్థాలను వాటి స్వభావ రీత్యా వాటిని భద్రపరచరు. అటువంటి యదార్థాలను నమోదు చేసే వారు. ప్రాధాన్యతనివ్వరు. అటువంటి యదార్థాలు నాడు అప్రధానమైనా, నేడు ఎంతో ముఖ్యమైనవి కావచ్చు. అందువల్ల, నమోదు చేయనంత మాత్రాన అవి జరగలేదని చెప్పలేని అంశాలు కూడా, కొన్ని ఉన్నాయి. అటువంటి వాటిపట్ల అప్రమత్తతతో ఉండాలి. ఈ సందర్భంలోనే, యదార్థాల స్వభావాన్ని తెలుసుకొని, అవి నమోదు అయ్యే యదార్థాలా? కావా? అని తెలుసుకోవాలి. రాజకీయ అవినీతి, పాలకులు చేసే దుర్మార్గాలు, ప్రజల బాధలు మొదలైనవి వీటిలో చెప్పుకోదగ్గవి. వీటిని నమోదు చేయకుండా, ఎవరూ ఎక్కడా ప్రస్తావించకుండా, పాలక వర్గాలు జాగ్రత్తపడ్డాయి. అందువల్ల, ఆ విషయాలను నమోదు చేయనందువల్ల, "నిశ్శబ్ద హేతువాదన" ద్వారా అవి లేవనటానికి వీల్లేదు. అందువల్ల, ప్రతికూల వివేచనను కొన్ని రకాల విషయాలపైనే ప్రయోగించాలి. మొదట పత్ర (document) రచయిత అన్ని యదార్థాలను జాగ్రత్తగా తన పత్రంలో పేర్కొన్నాడో, లేదో గుర్తించాలి. ఆ తర్వాత, ఏ యదార్థం ఆ రచయిత దృష్టి నుండి తప్పించుకోలేదని గుర్తించాలి. ఆ తర్వాతనే, రచయిత పేర్కొన్న విషయం జరగలేదని నిర్ధారించుకోవాలి.

BRAOU

### 6.6.2 అనుకూల వివేచన

అనుకూల వివేచన చాలా సంక్లిష్టమైనదైనా, చరిత్రకారులకు ఎంతో ఉపయోగకరమైంది. పత్రంలో ఉన్న యదార్థాన్ని ఆధారంగా చేసుకొని, పత్రంలో లేని యదార్థాన్ని గ్రహించటమే, (infer) "అనుకూల వివేచన" అని అంటారు. చారిత్రక యదార్థాలన్నీ, ఒకదాని కొకటి సంబంధాన్ని కల్గి ఉంటాయి. అందువల్ల, ఒక యదార్థాన్ని ఆధారంగా చేసుకొని వేరొక యదార్థాన్ని నిర్ధారించవచ్చు. ఉదాహరణకు, మన వద్ద సంస్కృతి మీద, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల మీద యదార్థాలు ఉండి, అవి ఒక కాల ప్రజల అభివృద్ధిని సూచించినట్లైతే, ఆ కాలంలో మత సహనం కూడా ఉండి ఉంటుందని భావించొచ్చు. ఉదార మత విధానం లేకుండా, శాంతి సౌభాగ్యాలు గతంలో ఎప్పుడూ లేవు. ఈ విధంగా, ఒక యదార్థం ఇంకో యదార్థంతో ముడిపడి ఉంటుంది. ఎందుకంటే, ఇందులో ఒక యదార్థం ఇంకో యదార్థానికి కారణమైగానీ, లేక ఈ రెండు యదార్థాలు ఒక కారణానికి కార్యం (effect)గా గానీ, ఉండి ఉంటాయి. అందువల్ల, ఈ వివేచనను అన్ని రకాల యదార్థాల

నిర్ధారణకు ఉపయోగించొచ్చు. ఇది పూర్తిగా మానవ అనుభవాల స్వభావాన్ని బట్టే ఉంటుంది. అందువల్ల, అనుకూల వివేచన అనేది తెలియని విషయాలను వెలుగులోకి తీసుకురావడానికి బాగా ఉపయోగపడుతుంది. ఇందులో చరిత్రకారుడు నిగమన తర్కం (deductive logic)ను ఉపయోగించి, వెలుగులోకి రాని అంశాలపై ఉపయోగించాలి. తనకు లభ్యమైన యదార్థాలను ఉపయోగించి, అనుమాన ప్రక్రియ (inferential method) ద్వారా, సత్యాన్ని రాబట్టడానికి ప్రయత్నించాలి.

అనుకూల వివేచనలో హేతువాదన, లేక అనుమానత (inference) రెండు ప్రతిజ్ఞా వాక్యాలపై ఆధారపడి ఉంది. అందులో మొదటి ప్రతిజ్ఞా వాక్యం, మానవ అనుభవాలపై ఆధారపడి ఉంటుంది. రెండో ప్రతిజ్ఞా వాక్యం, చరిత్రకారుడు సేకరించిన పత్రాల నుండి తీసుకోవాలి. సాధారణ ప్రతిజ్ఞా వాక్యం ఖచ్చితంగా నిజమైంది అయి ఉండాలి. ఉదాహరణకు,

మనుషులందరూ మర్త్యులు
సోక్రటీస్ ఒక మనిషి
కావున సోక్రటీస్ మర్త్యుడు

ఇందులో మొదటిది, సాధారణ ప్రతిజ్ఞా వాక్యం. మానవ అనుభవాల నుండి ఏర్పడ్డ ఈ ప్రతిజ్ఞావాక్యం పూర్తిగా సత్యమైంది. దీన్ని బట్టి, మనుషులందరూ ఎప్పుడో ఒకప్పుడు చనిపోయేవారే. రెండో ప్రతిజ్ఞా వాక్యం, మనకు లభ్యమైన ఆధారాల ద్వారా తీసుకున్న యదార్థం. మూడో వాక్యం, మొదటి రెంటినీ అనుకూల వివేచన ద్వారా, నిర్ధారించుకున్న వాక్యం. మొదటి సాధారణ ప్రతిజ్ఞా వాక్యం నిజమైనప్పుడే, మన నిర్ధారిత వాక్యం నిజమౌతుంది. లేకపోతే, తప్పౌతుంది. అంతేకాక, సాధారణ ప్రతిజ్ఞా వాక్యం సార్వత్రిక అనువర్తనం (Universally Applicable) అయిఉండాలి. ఈ ప్రక్రియ పూర్తిగా తర్కానికి సంబంధించింది. ప్రతిజ్ఞా వాక్యానికి, సార్వత్రికత (universality) కు ఉన్న విడదీయరాని సంబంధం వల్ల, కొన్ని నూతన విషయాలు వెలుగులోకి వస్తాయి. కానీ, చరిత్రలో ఇటువంటి ప్రతిజ్ఞా వాక్యాలు దొరకడం కష్టం. కాబట్టి, చరిత్రకారుడు జాగ్రత్తతో ప్రతిజ్ఞా వాక్యాలను ఏర్పాటు చేసుకోవాలి.

BRAOU

## 6.7 నిర్మాణాత్మక వివేచనలో తీసుకునే జాగ్రత్తలు

వివేచనను తప్పులు దొర్లకుండా ఉపయోగించటం, చాలా క్లిష్టమైన పని. తరచూ తప్పులు దొర్లే అవకాశముంది. ఎందుకంటే, ఒక ప్రతిజ్ఞా వాక్యాన్ని తీసుకుని, ఏదో అనుమానించి, నూతన విషయాన్ని ప్రతిపాదిస్తున్నాం. ఇది పూర్తిగా మనకు లభ్యమైన ఆధారాలను బట్టి కాక, మానవ అనుభవాల దృష్ట్యా ఏర్పడింది. అందుకని, ఈ నిర్మాణాత్మక వివేచనం ఎంతో అవసరమైతేనే, అతిజాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవి ఏవంటే:

1. వివేచనను ఎప్పుడూ విశ్లేషణగా పొరపాటుపడరాదు. విశ్లేషణ అనేది, మనకు లభ్యమైన అంశాన్నే అనేక రకాలుగా విమర్శించి, వివరించి, పరీక్షచేసి, కొన్ని నిర్ణయాలను (Judgements) చేయటం జరుగుతుంది. కానీ, వివేచనలో ఒక ప్రతిజ్ఞా వాక్యాన్ని ఎటువంటి ఆధారాలతో సంబంధం లేకుండా, మానవ అనుభవాల ద్వారా, నూతన విషయం చెప్పటం జరుగుతుంది.

2. వివేచన ద్వారా మన ఆధారాల్లో లేని విషయాన్ని చెప్తాం. కానీ, అది పూర్తిగా మన అంశం పరిధి అవతల ఉన్నది కాదు. అంతేగాక, ప్రతిజ్ఞా వాక్యాలను మన కనుకూలంగా ఎప్పుడూ మలచుకోరాదు. మన అవరోధాలను అధిగమించటానికి తప్పులు చేయరాదు.

3. పత్రా (Document)న్ని ప్రత్యక్షంగా పరిశీలించినప్పుడు వచ్చిన యదార్థాలతో, వివేచనా ఫలితాలను పోల్చి, అయోమయపడకూడదు. ఇటువంటి పరిస్థితి ఏర్పడినప్పుడు, మనం ఏవిధంగా వివేచనను ఉపయోగించిందీ తెలపాలి.

4. వివేచన అనేది చివరి ప్రక్రియ. అన్ని రకాల ఆధారాలను పరిశీలించినా, సమాధానం లభించనప్పుడే దీన్ని ఉపయోగించాలి. అందుకని, దీన్ని పరధ్యానంగా ఉపయోగించరాదు. పరిధ్యాన వివేచన వల్ల, అనేక తప్పులు జరిగే అవకాశం ఉంది.

5. వివేచనను ఉపయోగించేటప్పుడు ఏమాత్రం సందేహమన్పించినా, వివేచనను ఉపయోగించరాదు.

6. సాధారణ ప్రతిజ్ఞా వాక్యాన్ని గుర్తించటంలో, తొందరపాటు నిర్ణయాలు చేయకూడదు. ఏ ప్రతిజ్ఞా వాక్యమైనా, ఊహ ఆధారితమైనట్లైతే, వివేచనను ఉపయోగించరాదు. చరిత్రలో జరగని దాన్ని చరిత్రకారుడు సృష్టించడు. లభ్యమైన ఆధారాలను, వివేచనను ఉపయోగించి, చరిత్రలో జరిగిన విషయాలను చెప్పటయే అతని పని. దాని కొరకే తర్కాన్ని ఉపయోగించాలి. ఏ విషయమైనా లభించనట్లైతే, ఊహాజనిత నిర్ధారణకు వచ్చేటటువంటి తొందరపాటుకు గురికాకూడదు. తాను తీసుకున్న అంశానికి ఎక్కువ ఆధారాలు సేకరించినప్పుడు, ఈ విధమైన ఊహాత్మక నిర్ధారణకు రాలేదు.

7. సాధారణ ప్రతిజ్ఞా వాక్యాన్ని ఉపయోగించేముందు, మనం తీసుకున్న యదార్థం పట్ల, పూర్తి అవగాహన ఉండాలి. ఇంతకు ముందు ప్రయోగించిన న్యాయ ప్రయోగం (Syllogism) లో 'సోక్రటీస్ ఒక మనిషి' అనే ప్రతిజ్ఞా వాక్యం, మన దగ్గర ఉన్న యదార్థాల్లోని విషయమైనప్పుడు, సోక్రటీస్ గురించి మనకు క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. లేకుంటే, మనకు సరైన ఫలితం లభించదు.

ఈ విధంగా, నిర్మాణాత్మక వివేచనను జాగ్రత్తగా ఉపయోగించినట్లైతే, అది చరిత్ర రచనలో మిగిలిన విచ్ఛేదాల (gaps) ను భర్తీచేయడానికి ఉపయోగపడుతుంది.

పైన పేర్కొన్న విధంగా, సంశ్లేషణా ప్రక్రియ ద్వారా సంబంధిత యధార్థాలను గుర్తించి, వాటిని సామూహికీకరించి, ఇంకా మిగిలిన విచ్ఛేదాలను నిర్మాణాత్మక వివేచన ద్వారా పూరించిన ఎడల, ఉత్తమ చరిత్ర రచన జరుగుతుంది.

## 6.8 సంగ్రహంగా

ఈ భాగం ద్వారా మనం సంబంధిత యదార్థాలను గుర్తించి, వాటిని వివిధ రకాలుగా సామూహికీకరించి, నిర్మాణాత్మక వివేచన ద్వారా, ఇంకా మిగిలిన విచ్ఛేదాలను పూరించటం గురించి తెలుసుకున్నాం.

BRAOU

## 6.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. యదార్థాల లక్షణాలను వివరించి, సంబంధిత యదార్థాలను ఏవిధంగా గుర్తించవచ్చో తెల్పండి.

2. యదార్థాల సామూహికీకరణ ఏ విధంగా చేయవచ్చో విశ్లేషిస్తూ, సామూహికీకరణలో ఎదురయ్యే సమస్యల గురించి రాయండి.

3. నిర్మాణాత్మక వివేచన ఏ విధంగా చేయవచ్చో వివరించండి.

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ఐక్యతా ప్రతిజ్ఞా వాక్యమంటే ఏమిటో సోదాహరణంగా తెల్పండి.

2. ప్రశ్నా విధాన ప్రాక్కల్పనను వివరించండి.

3. కాలక్రమ సామూహికీకరణ ప్రాముఖ్యతను వివరిస్తూ, యదార్థాల సామూహికీకరణలో దాని ఉపయోగాన్ని తెల్పండి.

4. నిర్మాణాత్మక వివేచనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పేర్కొనండి.

## 6.11 ఉపయుక్త గ్రంథాలు


Gottschalk, Louis : **Understanding History - A Premier Historical Method.**

Hocket, C. Homer : **The Critical Method in Historical Research and Writing**

Rajayyan, K. : **Historiography - History in Theory and Method**

Sheik Ali, B. : **History: its Theory and Method**

దుర్గాప్రసాద్, జె. : **చరిత్ర రచనా శాస్త్రం**


రచయిత : ఆచార్య వై. వైకుంఠం

BRAOU

# ఖండం-II : చరిత్ర ఆధారాలు

ఈ ఖండంలో, 7,8,9,10,11 భాగాలున్నాయి. ఏడో భాగంలో, చరిత్ర రచనకు పురావస్తు ఆధారాలు, శాసనాలు, నాణేల ప్రాధాన్యతను విపులంగా చర్చించబడింది. ఎనిమిదో భాగంలో, వాఙ్మయ ఆధారాలను గూర్చి వివరించడమైంది. తొమ్మిదో భాగంలో, పరిపాలనా సంబంధమైన రికార్డులు చరిత్ర పునర్నిర్మాణానికి ఏ విధంగా సహాయపడతాయో, చర్చించడమైంది. పదో భాగంలో, వార్తాపత్రికల పాత్ర, పదకొండో భాగంలో, మౌఖిక సాంప్రదాయం చారిత్రక ఆధారంగా ఎలా ఉపకరిస్తుందో, విశ్లేషించడమైంది.

BRAOU

BRAOU

# భాగం-7 : పురావస్తు ఆధారాలు, శాసనాలు, నాణేలు

విషయ క్రమం

7.0 లక్ష్యాలు

7.1 పరిచయం

7.2 చరిత్ర ఆధారాలు - ఆవశ్యకత

7.3 మౌలిక, మాధ్యమిక ఆధారాలు

7.4 భారతదేశ చరిత్ర పునర్నిర్మాణం - ఆవశ్యకత

7.5 చరిత్ర రచనలో ఎదురౌతున్న ఇబ్బందులు

7.6 పురావస్తు శాస్త్రం

7.7 భౌతిక అవశేషాలు (material remains)

7.8 శాసనాలు

7.9 నాణేలు

7.10 సంగ్రహంగా

7.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

7.12 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 7.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- చరిత్ర ఆధారాల ప్రామాణికత, ఖచ్చితత్వం, విశ్వసనీయతపై, చారిత్రక వివరణ ఏ విధంగా ఆధారపడి ఉందో వివరించగలగాలి.
- చరిత్ర రచనలో పురావస్తు అవశేషాలు, శాసనాలు, నాణేల ప్రాముఖ్యతను విశ్లేషించగలగాలి.

## 7.1 పరిచయం

మానవుడు భూమిపై అడుగు పెట్టిన నాటి నుండి, అతడు తన సృజనాత్మక శక్తిచే నిర్మించి, ఉపయోగించి, వదలి వెళ్లిన అవశేష దృశ్య చిహ్నాలను చారిత్రక ఆధారాలంటాం. ఈ అవశేష దృశ్య చిహ్నాలే, మానవ వికాస పరిణామాన్ని వివరించేందుకు చరిత్రకారునకు సహాయపడతాయి. వీటి

సహాయంతోనే అతడు తార్కికమైన చరిత్ర వివరణ ఇస్తాడు. ప్రాచీన యుగ భారతదేశ చరిత్ర పునర్నిర్మాణానికి తోడ్పడుతున్న పురావస్తు ఆధారాలు, శాసనాలు, నాణేలు అనేకం ఉన్నాయి.

## 7.2 చరిత్ర ఆధారాలు - ఆవశ్యకత

చరిత్ర అంటే నడత. గ్రీక్ భాషలో ఈ పదానికి అర్థం 'అన్వేషణ' అయితే, అన్వేషణ ఫలితంగా లిఖిత రూపం పొందిన వర్ణన కూడా, ఆ తర్వాత కాలంలో చరిత్రగానే వ్యవహారంలోకి వచ్చింది. గతంలో జరిగిన సంఘటనలు వాస్తవికమే అయినప్పటికీ, ఇప్పుడవి మన కంటికి కనిపించేవి కావు. ఆ సంఘటనలు వదలి వెళ్ళిన అవశేష దృశ్య చిహ్నాలే, (traces) అంటే, మానవుడు ఈ సృష్టిలో అవతరించినప్పటినుండి, అతడు తన సృజనాత్మకతతో నిర్మించి, ఉపయోగించి వదలివెళ్ళిన సామాగ్రి, గత కాల సంఘటనల వాస్తవికతను నిర్ధారించే మూలాధారాలు. వీటి సహాయంతోనే, చరిత్రకారుడు తన మనోఫలకంలో గతాన్ని వీక్షిస్తాడు. ఆ గతంలో జీవిస్తాడు. అతడు జరిపే అన్వేషణ ఈ అవశేషాల కోసమే. చరిత్రకారుడు తన పరిశోధనలో ఈ అవశేష దృశ్య చిహ్నాలనే వెదకి, వాటి సహాయంతోనే గతంలో ఏం జరిగిందో, ఎందుకు జరిగిందో వివరించి, విశ్లేషించి, వ్యాఖ్యానించడం ద్వారా, చరిత్రను పునర్నిర్మించి, గతాన్ని మన కళ్ళముందు నిలబెడుతున్నాడు. మానవ వికాస పరిణామాన్ని వివరిస్తున్నాడు. అంటే, చరిత్ర నిర్మాణంలో గత కాల అవశేషాలు చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నాయని చెప్పవచ్చు. చరిత్ర నిర్మాణంలో పనికివచ్చే, చరిత్రకారుడు ఉపయోగించే ఈ సామాగ్రినే, చరిత్ర ఆధారాలంటారు. ఈ ఆధారాల ప్రామాణికత, ఖచ్చితత్వం, విశ్వసనీయతపైనే చారిత్రక వివరణ ఆధారపడి ఉంది. వీటి మూలంగానే, చరిత్రకారుడు గత కాల సంఘటనల గురించి ఆలోచిస్తాడు. ఈ ఆధారాల సహాయంతోనే, ఆ సంఘటనలకు సంబంధించి అతడు క్రమబద్ధమైన, తార్కికమైన చరిత్ర కథనాన్ని పునర్నిర్మిస్తాడు. చరిత్ర పరిశోధనలో గతకాల మానవుల ఆలోచనలకు, చేతలకు ప్రతీకలుగా మిగిలి, అనేక రూపాల్లో లభించే ఈ చరిత్ర ఆధార సామాగ్రిని, లేదా సాక్ష్య పత్రాలను శోధించడం, సమీకరించడమే, చరిత్రకారుని ప్రథమ కర్తవ్యం. ఈ పని నెరవేరకుండా చరిత్ర పరిశోధన, రచనా వ్యాసంగం ముందుకు సాగవు.

## 7.3 మౌలిక, మాధ్యమిక ఆధారాలు

చరిత్ర ఆధారాలను స్థూలంగా, 'మౌలిక', లేదా ప్రాథమిక (Primary), 'మాధ్యమిక' (Secondary) అని రెండు రకాలుగా విభజించవచ్చు. మౌలికమైన ఆధారాలంటే, గత కాల సంఘటనలతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారు, లేదా ఆ సంఘటనలకు ప్రత్యక్ష సాక్షులైన వారు ఇచ్చిన వర్ణనలు, లేదా వివరణలు. ఈ మౌలికాధారాలు ఒకే చోట కుప్పగా లభించేవి కావు. అనేక చోట్ల, అనేక రూపాల్లో చెల్లాచెదురుగా ఉండే వీటిని, చరిత్రకారుడు శోధించి, సమీకరించడం చరిత్ర పరిశోధనలో అతని ప్రథమ కర్తవ్యం. చరిత్రకారుని రచనా వ్యాసంగంలో ఈ కర్తవ్యాన్ని మొదట నిర్వర్తించకుండా, అతడు తన పరిశోధనలో ముందుకు సాగడం అసాధ్యం. సమర్థవంతుడైన చరిత్రకారునిగా ఎవరైనా రాణించాలంటే, మౌలిక ఆధారాలపై తనకు తానుగా కృషి చేసి, వాటిపై అధికారం కలిగి ఉండాలి. ఇక గత కాల సంఘటనలతో ప్రత్యక్షంగా సంబంధం లేకుండా, ఆ సంఘటనలకు దేశ, కాలాల రెంటి దృష్ట్యా,



BRAOU

దూరంగా ఉన్నవారు ప్రత్యక్ష సాక్షుల కథనం సహాయంతో రూపొందించిన ఆధారాలను, 'మాధ్యమిక ఆధారాల'ని పేర్కొంటారు. సంఘటనకు సంబంధించిన కాలంతో గాని, ప్రదేశంతోగాని ప్రత్యక్ష సంబంధం లేని వ్యక్తులు, తాము విన్నదాన్నో, చదివినదాన్నో వివరించినపుడు, అది మాధ్యమిక ఆధారం అవుతుంది. ఇటువంటి మాధ్యమికాధారాలు కూడా, మౌలిక ఆధారాలపై ఆధారపడ్డవే.

మౌలిక, మాధ్యమిక చరిత్ర ఆధారాల మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టం చేస్తూ ఆర్థర్ మార్విక్, మౌలికాధారాలు, నిపుణుడైన చరిత్రకారునికి ఎంతో అర్థవంతమైన, అవసరమైన ముడిసరుకన్నాడు; అదే ఒక కొత్త అంశంపై పరిశోధనకు సాహిసిస్తున్నపుడో, లేదా తన సామాన్య చారిత్రక పరిజ్ఞానాన్ని మరింత పెంచుకోడానికి ప్రయత్నిస్తున్నప్పుడో, చరిత్రకారుడు ప్రాతిపదికగా, చేసుకొనే చరిత్ర గ్రంథమో, లేదా వ్యాసమో, మాధ్యమికాధారం అవుతుందని అతడు చెప్పాడు. ఈ విధమైన మౌలిక, మాధ్యమిక ఆధారాల సహాయంతో, విమర్శనాత్మకంగా, విషయ నిష్ఠతతో చరిత్రకారుడు సహేతుకంగా నిర్మించే ఊహాత్మక కథనమే, 'చరిత్ర'.

మనకు ఎక్కువగా లభించే మౌలికాధారాలు వాఙ్మయేతర (non-literary) మైనవే. ప్రాచీన శిలా యుగం నుండి లభిస్తున్న సమాధులు, హరప్పా, వైశాలి, పాటలీపుత్రం, విజయపురి వంటి ప్రాచీన నగర నిర్మాణాలు, మట్టి పాత్రలు, పనిముట్లవంటి పురావస్తువులు, శాసనాలు, నాణేలు మొదలైనవి ఈ కోవలోకే వస్తాయి. మౌఖికం, (Oral) లేదా లిఖిత రూపంలో ఉన్న కథాగేయాలు, ఐతిహ్యాలు, జానపద వీరగాథలు, యక్షగానాలు, పదాలు, ఆటవిక జాతుల ప్రజలతోను, ఆయా చారిత్రక సంఘటనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నవారితోను, లేదా 'సాక్షులతోను' జరిపే ముఖాముఖీ సంభాషణలు, లిఖిత పూర్వక రాజ్యాంగాలు, సనదులు (Sanads), హక్కుపత్రాలు (Charters), న్యాయస్థానాల తీర్పులు, అధికార నివేదికలు, స్వీయ చరిత్రలు, డైరీలు, ఉత్తరప్రత్యుత్తరాలు, దస్తావేజులు, వీలునామాలు, ఒడంబడికలు, అనుజ్ఞాపత్రాలు, అధికార ప్రకటనలు, నిషేధాజ్ఞలు, ధృవపత్రాలు, చిత్రపటాలు, సచిత్ర సంచికలు, వార్తాపత్రికలు, రేఖాపటాలు, వర్ణచిత్రాలు, కరపత్రాలు, చలన చిత్రాలు, జాబితాలు, పరిశోధనా నివేదికలు, మౌలిక ఆధారాలుగానే ప్రాధాన్యతను పొందాయి.

BRAOU

ఈ మౌలికాధారాల సహాయంతో, చరిత్ర పరిశోధకులు చేసిన రచనలు, ప్రామాణికతను పుణికి పుచ్చుకొన్న మాధ్యమిక ఆధారాలుగా వ్యవహరింపబడ్డాయి. చరిత్రలో కొత్తగా ఏదైనా విషయంపై పరిశోధన చేబట్టిన వ్యక్తి సాధారణంగా, మొదట మాధ్యమికాధారాలను అధ్యయనం చేస్తే, అతనికి తన పరిశోధనాంశంపై నేపథ్యానికి సంబంధించి సరైన అవగాహన ఏర్పడుతుంది. ఈ విధంగా ఏర్పడే అవగాహనతో, అతడు మౌలికాధారాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకొని, తన అధ్యయనం ద్వారా ప్రామాణికమైన, విశ్వసనీయమైన, ఖచ్చితమైన చరిత్రను నిర్మించొచ్చు.

## 7.4 భారతదేశ చరిత్ర పునర్నిర్మాణం - ఆవశ్యకత

భారతీయ చరిత్ర రచనా మూలం, క్రమ వికాస పరిణామాన్ని గూర్చి సూక్ష్మ శాస్త్రీయ అధ్యయనం చేసిన అనేకమంది మేధావులు ప్రాచీన కాలంలో, భారతీయుల చారిత్రక దృష్టి, ఈనాడు చరిత్ర అంటే, అర్థం చేసుకొంటున్న పాశ్చాత్య రీతిలో, రచనా సాంప్రదాయం లేదనే అభిప్రాయాన్ని

పెట్టుబచ్చారు. ఫ్లీట్, పార్గిటర్, కీత్ మొదలైన పాశ్చాత్యులేగాక, రమేశ్‌చంద్ర మజుందార్ వంటి మన చరిత్రకారులూ, ఈ విధమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చినవారిలో ఉన్నారు. దాదాపు వేయి సంవత్సరాలకు పూర్వమే, మన దేశం మీదకి అనేక మార్లు దండెత్తి వచ్చిన గజనీ మహమ్మద్‌తో బాటు వచ్చి, ఈ దేశాన్ని సందర్శించి, నాటి మన దేశ శాస్త్ర విజ్ఞాన, సాహిత్య ప్రక్రియలను, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోడానికి, నిష్పక్షపాత ధోరణితో నిజమైన ప్రయత్నాన్ని ప్రారంభించిన అల్‌బెరూని, చారిత్రక క్రమంలో విషయాలను పొందుపరచటంలో హిందువులు పెద్దగా శ్రద్ధ వహించరనీ, కాలక్రమాన్ని అనుసరించి, విషయాలను వివరించటంలో, చాలా నిర్లక్ష్యంగా ఉండేవారనీ, సమాచారం కోసం ఒత్తిడి ఎక్కువైనపుడు ఏం చెప్పాలో తెలియని అయోమయ స్థితిలో, తప్పనిసరిగా వారు కథలు చెప్పేవారనీ పేర్కొన్నాడు. భారతదేశ చరిత్రకారుల్లో, శాసన శాస్త్ర నిపుణుల్లో రాజకుమారుడుగా గౌరవం పొందిన డా.జె.ఎఫ్.ఫ్లీట్ విస్తృతమైన విమర్శనాత్మక దిశలో సిసలైన చరిత్రను రూపొందించేలా, ప్రాచీన హిందువులకు ఎప్పుడైనా నిజమైన చారిత్రక దృక్పథం ఉందా? అనేది ప్రశ్నార్థకమేనన్నాడు. సంస్కృత వాఙ్మయ చరిత్రకారుడైన ఎ.బి. కీత్ కూడా, సాహిత్యం అపారంగా ఉన్నప్పటికీ, చరిత్ర పాత్ర ప్రతిబింబించిందంటే, మహోన్నత సంస్కృత సాహిత్యం మొత్తంలో, నిశిత దృష్టి కల్గిన చరిత్రకారుడుగా నిజంగా పరిగణింపదగ్గ రచయిత ఒక్కరు కూడా లేడని చెప్పాడు. ఇక మన సమకాలీన భారతీయ చరిత్రకారుల్లో విశిష్ట స్థానాన్ని పొందిన రమేష్‌చంద్ర మజుందార్, చరిత్ర రచనల పట్ల భారతీయులకు ఉన్న అనిష్టత మన సంస్కృతికే గొప్ప లోపమని వక్కాణించాడు. హెరోడోటస్, థూసిడైడ్స్, లివీ, టాసిటస్ మొదలైన ప్రాచీన గ్రీక్, రోమన్ చరిత్ర రచనా సాంప్రదాయ ప్రతినిధులవంటివారు, మనకు ప్రాచీన కాలంలో లేకపోవడం, విచారకర విషయమే. అయితే, ప్రాచీన కాలంలో భారతీయులకు చారిత్రక దృక్పథం లేదని ఈ విధంగా చెప్పటం, సమంజసం కాదనే వారూ ఉన్నారు. ఆ చారిత్రక దృక్పథమే వారికి లేకుంటే, ఈనాడు మనకు పుంఖానుపుంఖాలుగా అనేక రకాల చరిత్ర ఆధారాలు లభించి ఉండేవి కాదని, అయితే, మన ప్రాచీనుల మనస్తత్వం, ధోరణి, విశ్వాసాలు, నమ్మకాలు పాశ్చాత్యుల ధోరణికి భిన్నం కావడం వల్ల, మనవారి చారిత్రక దృక్పథం కూడా భిన్నమేనని వీరి వాదన. ఈ వాదనలెలా ఉన్నా, పాశ్చాత్యులకు ఉన్న మాదిరిగా మనకు సమగ్రమైన చరిత్ర రచనలు లేవనేది వాస్తవం. అందుచేతనే, లభించిన, లభిస్తున్న అనేక రకాల చరిత్ర ఆధారాల సహాయంతో, భారతదేశ చరిత్రను సమగ్రంగా, సహేతుకంగా, విషయ నిష్టతతో పునర్నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

## 7.5 చరిత్ర రచనలో ఎదురౌతున్న ఇబ్బందులు

భారతదేశ చరిత్ర రచనలో, అనేక ఇబ్బందులు ఎదురౌతున్నాయి. అందులోనూ, ప్రాచీన కాలానికి సంబంధించైతే, ఈ ఇబ్బందులు అపారం, అనూహ్యం. మన ప్రాచీన సాహిత్యం, సంస్కృతం, పాళీ, ప్రాకృత భాషల్లో లెక్కకు మిక్కుటమే అయినా, కల్హణుని రాజతరంగిణీ వంటి సమగ్ర చరిత్ర గ్రంథాలు కన్పించడం అరుదు. లభిస్తున్న చరిత్ర రచనా సామాగ్రిలోనైనా, విషయం ప్రధానంగా, మతపరంగానో, తాత్విక చింతనతోనో, పౌరాణికంగానో, సాహితీపరంగానో ఉండి, చారిత్రక అంశాలు అప్పుడప్పుడు కన్పించడమో, లేదా అన్యాపదేశంగా ఉదహరించబడటమో కన్పిస్తుంది. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ధర్మశాస్త్రాలు, మంత్రాక్షరాలు, పుక్కిటి పురాణాల ఆధారంగా, చరిత్రను

BRAOU

రూపొందించడం అసాధ్యం. అభూత కల్పనలతో నిండిన కథలు, పురాణ గాథల్ని చారిత్రక యదార్థాలుగా పరిగణించలేం. బహుశా మత విశ్వాసాలు, పారమార్థిక చింతనలపైనే, దృష్టిని కేంద్రీకరించడం వల్ల, ప్రాచీన భారతీయులకు చారిత్రక మనస్తత్వం అలవడలేదేమో. అందుచేతనే, చరిత్ర రచన వంటి లౌకిక విషయాలకు ప్రాధాన్యత లభించలేదనుకోవాలి. నలంద, తక్షశిల, వారణాసి, ఉజ్జయిని, వల్లభి వంటి ప్రాచీన విశ్వవిద్యాలయాల్లో, తత్వ శాస్త్రం, మతం, నీతి శాస్త్రం, న్యాయం, రాజనీతి, చిత్రకళ, గణితం మొదలైనవి నిర్ణీత పాఠ్యక్రమంలో భాగమైనా, అందులో చరిత్ర ఒక అధ్యయన విషయంగా లేకపోవడం, ఈ అంశాన్నే సూచిస్తుంది.

ప్రాచీన కాలంలో భారత ఉపఖండంలో రాజకీయంగా సమైక్యత లేకపోవడం కూడా, సమగ్రమైన చరిత్ర రచనకు ప్రతిబంధకమైంది. మౌర్య చంద్రగుప్తుడు, అశోకుడు, సముద్రగుప్తుడు, రెండో చంద్రగుప్తుడు, యశోధర్ముడు, రెండో పులకేశి మొదలైనవారు, విశాల సామ్రాజ్యాలను పాలించినా, మొత్తం భరత ఖండాన్ని ఏకఛత్రాధిపత్యం కిందికి తీసుకురావడంలో, వీళ్ళు విఫలులయ్యారు. అనేక సంవత్సరాలు దేశం చిన్నచిన్న రాజ్యాలుగానే విభాజితమై, పరస్పర మత్సరాలకు, కలహాలకు ఆలవాలమైంది. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకొని, విదేశీయులైన గ్రీకులు, సిథియన్లు, పార్థియన్లు, కుషాణులు ఆయా కాలాల్లో, ఈ గడ్డపై తమతమ రాజ్యాల నేర్పర్చుకొని పాలించారు. బలవంతుడిదే రాజ్యంగా, రాజాస్థానాల్లో తిరుగుబాట్లు, యుద్ధాలు సర్వసాధారణమయ్యాయి. దేశంలో ఈ విధంగా రాజకీయ సమైక్యత లోపించడంతో, చరిత్రను రికార్డ్ చేయటంలో అనేక ఖాళీలు ఏర్పడ్డాయి. దీనికి తోడు, సుసంపన్న చరిత్ర సామగ్రి ఉన్న కొన్ని గ్రంథాలు, కాలగతిలో కనుమరుగవటం మన దురదృష్టం. 'ఇండికా', 'దేవీ చంద్రగుప్తమ్' వంటి రచనల గూర్చి, ఆ గ్రంథాల్లోని విషయాల గూర్చి, ఆ తర్వాత కాలంలో ఇతరులు చేసిన ప్రతినిర్దేశాల (references) ద్వారా మాత్రమే తెలుస్తున్నాయి. కౌటిల్యుని 'అర్థశాస్త్రం', 1909 లో గాని లభించలేదు. నలందా విశ్వవిద్యాలయంలోని తొమ్మిది అంతస్థుల 'రత్నదధి' భవనం అగ్నిప్రమాదంలో నాశనమైనప్పుడు, అందులో చాలా విలువైన చరిత్ర రచనా సామగ్రిని కోల్పోవడం జరిగింది. ఇంతవరకూ లభించిన, లభిస్తున్న ఆధారాలు కూడా, సమగ్రంగా లేకపోవడంతో, చరిత్ర రచన మరింత కష్టతరమౌతూంది. విక్రమ, శక, గుప్త, మాళ్వ, వల్లభి, చురీ, చేది వంటి నూతన శకాలు ఎప్పుడు ఆరంభమయ్యాయో, ఎవరెవరు ఆయా శకాల కర్తలో, ఏ సందర్భాల్లో ఆరంభించారో, ఇంకా వివాదాస్పదమే. అలాగే, కొన్ని చరిత్ర ఆధారాలు పరస్పర విరుద్ధమైన సాక్ష్యాన్నివ్వడం కూడా కద్దు. ఉదాహరణకు, రెండో చంద్రగుప్తుని కాలంలో భారతదేశాన్ని దర్శించిన చైనా యాత్రికుడు పాహియాన్ నాడు చోర భయం లేదని పేర్కొంటే, సమకాలీనుడైన కాళిదాసు అనేక రచనల్లో దొంగలు, దారి దోపిడిగాండ్ర గురించి చెప్పాడు. ఇదే విధంగా, బౌద్ధ గ్రంథాలు పుష్యమిత్ర శృంగుడు బౌద్ధ ద్వేషియని, బౌద్ధులను హింసించినాడని, బౌద్ధ ఆరామాలను కూలదోయించాడనీ వివరిస్తుంటే, బార్హుత్‌లోని బౌద్ధ స్థూపం, సాంచి లోని స్థూప తోరణాలు (gateways), ఆ కాల నిర్మాణాలుగా, పురావస్తు శాస్త్రం ఆధారంగా రాయ్‌చౌదరి మొదలైన చరిత్రకారులు నిర్ధారిస్తున్నారు.

అసమగ్ర చరిత్ర ఆధారాలు, చరిత్ర అవిచ్ఛిన్నతను (Continuity) కూడా దెబ్బతీస్తున్నాయి. మగధలో శృంగులు, కాణ్వుల పాలన, అనంతరం తిరిగి గుప్తులు ప్రాబల్యానికి వచ్చేవరకూ, మధ్య ఏమి జరిగిందనేది అగమ్యగోచరమే. అలాగే, గుప్తుల పతనానంతరం హర్షుడు ప్రాబల్యానికి వచ్చే ముందు

BRAOU

Dr. BRAOU LIBRARY Acc. No. 115054 Class No. 954 CHE

పరిస్థితులేమిటి? హర్షుని అనంతరం మాటేమిటి? ప్రాచీన భారతదేశ చరిత్ర రచనలో ఈ విధంగా, అనేక రకాలుగా ఇబ్బందులు ఎదురౌతున్నా, చరిత్రకారుడు వీటిని అధిగమిస్తూ ముందుకు సాగి, విజయవంతంగా సమగ్రమైన చరిత్రను విషయ నిష్టతతో అందించాలని కృషిని కొనసాగిస్తున్నాడు. భారతదేశ చరిత్రను ప్రధానంగా, చరిత్ర పూర్వయుగం, చారిత్రక సంధి (Proto - historic) యుగం, చారిత్రక యుగంగా విభజించొచ్చు. ఇందులో చారిత్రక కాలానికి సంబంధించి, సౌలభ్యం కోసం ప్రాచీన యుగం, మధ్య యుగం, ఆధునిక యుగంగా వర్గీకరించవచ్చు. వాఙ్మయ ఆధారాలు లభిస్తున్న ఆర్యుల కాలం నుండి, క్రీ.శ. 8వ శతాబ్దం వరకూ ప్రాచీన యుగంగా, క్రీ.శ. 9వ శతాబ్దం నుండి క్రీ.శ. 18 వ శతాబ్ది మధ్య వరకు మధ్య యుగంగా, అనంతర కాలాన్ని ఆధునిక యుగంగా, పరిగణించొచ్చు.

వీటిలో చరిత్ర పూర్వయుగం, చారిత్రక సంధి యుగాలే కాక, చారిత్రక కాలానికి సంబంధించిన ప్రాచీన, మధ్య యుగాల చరిత్ర పునర్నిర్మాణానికి, మనకు నాటి మానవుడు వాడిన భౌతిక అవశేషాలే, ప్రధాన ఆధారం. అయితే, ప్రాచీన యుగం నుండే లభిస్తున్న వాఙ్మయాధారాలు, ఆ తర్వాత కాలం నుండి చరిత్రను సుసంపన్నం చేస్తున్నాయి. ఈ చరిత్ర ఆధారాలను, వీటి స్వరూప, స్వభావాలను దృష్టిలో ఉంచుకొని, సమకాలీన, అసమకాలీన, దేశీయ, విదేశీయ ఆధారాలుగాను, మత, లౌకిక ఆధారాలుగాను చరిత్రకారులు అనేక రకాలుగా విభజిస్తున్నారు. వీటి స్వరూప స్వభావాలే, ఆయా చరిత్ర ఆధారాల విలువను నిర్ణయిస్తున్నాయి. అయితే, ఇక్కడ ఈ చరిత్ర ఆధారాలను మనం స్థూలంగా పురావస్తు, శాసన, నాణె శాస్త్రాలుగాను, వాఙ్మయ, పరిపాలనా సంబంధమైన రాతప్రతులు (records), వారపత్రికలు, మౌఖిక సాంప్రదాయమని వర్గీకరించి, విపులంగా ఆయా ఆధారాల ప్రాధాన్యతను చర్చించొచ్చు.

## 7.6 పురావస్తు శాస్త్రం

చరిత్రకు పునాది పురావస్తు శాస్త్రం. పురావస్తు, లేదా పురాతత్వ శాస్త్రం అనగానే, మనకు సాధారణంగా గుర్తుకు వచ్చేవి, పాత రాతి పనిముట్లు, కుండ పెంకులు, ఎముక ముక్కలు, విరిగిన లోహ సామగ్రి, శిథిల నిర్మాణాలు. పురావస్తు శాస్త్రాన్ని ఆంగ్లంలో, 'ఆర్కియాలజి' (Archaeology) అని వ్యవహరిస్తున్నారు. నిజానికి ఈ ఆంగ్ల పదం, 'ఆర్కియో లోగస్' (Archaeos logos) అనే గ్రీక్ పదాల నుండి ఆవిర్భవించింది. ఈ గ్రీక్ పదాలకు ప్రాచీన, లేదా పురాతన జ్ఞానమని అర్థం. జీవరాసుల్లో మిక్కిలి ఆలోచనాశీలి అయిన మానవుడు, తన తెలివితేటలతో జీవన విధానాన్ని సులభతరం చేసుకోడానికి, సుఖమయం చేసుకోడానికి, అనువైన సాధనాలను సృష్టించుకొంటూ, వాటిని ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకొంటూ, ఆదిమ కాలం నుండి ఈ నాటి వరకూ, ముందంజ వేస్తూ ప్రగతిపథంలో పయనిస్తున్నాడు. అతడు తన సృజనాత్మకతతో నిర్మించి, ఉపయోగించి వదలి వెళ్ళిన సామాగ్రియే, గత కాల సంఘటనల వాస్తవికతను నిర్ధారించే మూలాధారం. ఈ పురాతన వస్తు సముదాయాన్ని (Artefacts) సమూలంగా పరిశీలించి, వ్యాఖ్యానం చేసే శాస్త్రీయ అధ్యయనాన్నే, పురావస్తు శాస్త్రమంటారు. వస్తువులను ఆధారంగా చేసుకొని, వాటి కర్తల కార్యకలాపాలను, జీవన విధానాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నమే ఇది.



BRAOU

వాఙ్మయాధారాలు లభ్యం కాని చరిత్ర పూర్వయుగానికి సంబంధించిన, చారిత్రక సంధి యుగానికి సంబంధించిన కొన్ని సందర్భాల్లో, చరిత్రకందని మానవ సమాజాలను గురించి విశదీకరించడమే, పురావస్తు శాస్త్ర లక్ష్యం. అయితే, చారిత్రక యుగానికి సంబంధించిన కొన్ని సందర్భాల్లో సైతం, లోపభూయిష్టంగా ఉన్న లిఖిత పూర్వక ఆధారాలు మౌనం దాల్చినప్పుడో, వివాదాస్పదంగా ఉన్నప్పుడో, పురావస్తుశాస్త్రమే చరిత్రకు ఆలంబనమౌతుంది. అంటే, లిఖితాల మూలంగా తెలియని అనేక అంశాలు, పురావస్తు పరిశోధన వల్ల, వెలుగును చూస్తున్నాయన్న మాట. శాసనాలు లిఖిత రూపాలే అయినప్పటికీ, అవి లభించే సందర్భాలు ఎలాగూ, వస్తు శాస్త్రానికి సంబంధించి ఉంటాయి. అదే విధంగా, నాణేలూ. అందుచేతనే, వీటి రెంటినీ కూడా పురావస్తు శాస్త్ర అధ్యయనంలో అంతర్భాగంగానే పరిగణించవచ్చు. అయితే, ఇవి ఈనాడు శాస్త్రీయ అధ్యయనంలో ప్రత్యేక అధ్యయన విషయాలుగా (Epigraphy & Numismatics) రూపొందాయి. ఈ కారణం వల్ల, పురావస్తు ఆధారాలను భౌతిక అవశేషాలుగాను, శాసనాలను, నాణేలను వాటివాటి చారిత్రక ప్రాముఖ్యతను గూర్చి వేరువేరుగాను చర్చించడం జరిగింది.

## 7.7 భౌతిక అవశేషాలు (Material Remains)

పురావస్తు సముదాయాలైన పనిముట్లు, మృణ్మయ పాత్రలు, ఆయుధాలు, నిర్మాణ శిథిలాలు, శిల్పాలు, చిత్రలేఖనం మొదలైనవి, చరిత్రను పున్నర్మించడానికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఇంతకు ముందే చెప్పినట్లు, చరిత్ర పూర్వయుగానికి, చారిత్రక సంధి యుగానికి ఈ పురావస్తు సంపదే, ముఖ్యాధారం. ఆదిమ మానవుడు పనిముట్లను తయారుచేయడంతో, మానవ సంస్కృతి ప్రారంభమైంది. అతడు వదిలిపెట్టిన పనిముట్ల ఆధారంతోనే, నాటి జీవన విధానాన్ని నిర్ణయించగలం. ఎముక, దంతం, కొమ్ము, ఆ తరువాత శిల, మొదలైన వాటితో, అతడు ఈ పనిముట్లను తయారు చేశాడు. అయితే, వీటిలో కాలగర్భంలో కలిసిపోకుండా మనకు లభించేవి రాతి పనిముట్లు. కాలం తెచ్చిన మార్పులకు అనుగుణంగా, పనిముట్లలో ముడిసరుకు, వస్తువు నాణ్యత కన్పిస్తుంటాయి. ప్రాచీన శిలా యుగపు గులకరాతి పనిముట్లు, చేతి గొడ్డళ్ళు, గోకుడు రాళ్ళు (Scrappers) , మొనలు (Points), ఛిద్రకాలు, ఛేదకాలు మొదలైన అవశేషాలు, శివాలిక్ కొండ సమీపంలోని సోహన్ నదీ లోయ లోను, రాయఘర్ లోను, చెవాస లోను, దక్షిణాన పల్లవరం, మధురై, తంజావూరు బళ్ళారి, కర్నూలు, కడప, చిత్తూరు, గోదావరి, కృష్ణానదీ లోయల్లోను, లభించాయి. బ్రూస్‌ఫుట్, బెండపూడి సుబ్బారావు, హెచ్.డి. సంకాలియా, బర్కిట్, కమ్మియాడ్ తదితరుల పరిశోధనలు, ఈ దిశలో వెలుగును ప్రసరించినాయి.

దేశమంతటా దొరికిన మధ్య శిలా యుగపు, లేదా సూక్ష్మ రాతియుగపు అవశేషాలు మానవుడు నాగరికతను అలవర్చుకొనడాన్ని తెలియచేస్తున్నాయి. పంటలు పండించి, ధాన్యాన్ని నిలవచేయడం, దంతాలు, గవ్వలు మొదలైన వాటితో తయారైన ఆభరణాలను ధరించడం, ఎద్దు, దున్న, గేదె, కుక్క మొదలైన జంతువులను మచ్చిక చేసి పెంచటం, మత విశ్వాసాలు ప్రారంభమవటం, ఈ యుగపు పరిణామాలు.

గృహ నిర్మాణం, మృణ్మయ పాత్రల తయారీ, వ్యవసాయం, పశుపోషణ, నేత, వస్త్రధారణ, లోహాలతో ఆభరణాలు, పనిముట్లు, ఆయుధాల తయారీ, సముద్ర యానం, నౌకా నిర్మాణం,

BRAOU

వాణిజ్యం, పితృదేవతారాధన, సమాధుల నిర్మాణం, తదితర విశేషాలను తెలిపే, నవీన శిలా యుగపు అవశేషాలు సేలం, కడప, బళ్ళారి, అనంతపురం, తెలంగాణా, గుజరాత్, కథియవాడ్ మొదలైన ప్రాంతాల్లో లభించాయి.

తామ్ర శిలా యుగానికి (Chalco-lithic period) చెందిన అవశేషాలు, దేశం ఉత్తర, మధ్య భాగాల్లో బయల్పడ్డాయి. ఈ యుగపు ప్రాథమిక దశలోనే, హరప్పా నాగరికత వెలసినట్లుగా, సింధూ-గంగామైదాన ప్రాంతమంతా లభించిన అనాగరికులూ, భౌతిక అవశేషాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఈ నాగరికత కనుగొనబడటం, మన దేశ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టం. పురావస్తు శాస్త్రం మనదేశ చరిత్ర పరిశోధనలో, విప్లవాత్మక పరిణామాలకు నాంది పలికింది. ఆర్యుల రాకపోకలతోనే, మనదేశ చరిత్ర ప్రారంభమైందన్న విశ్వాసం, దీంతో వమ్మైంది. దాదాపు మరో పదిహేనువందల సంవత్సరాల కాలం, మన దేశ చరిత్రలో చోటు చేసుకొంది. ఎంతో ముందంజలో ఉన్న హరప్పా నాగరికతకు పూర్వ స్థితిని, బెలుచిస్థాన్ కొండల్లోని గ్రామీణ ప్రాంతాల్లో విలసిల్లిన, నల్ సంస్కృతి, సింధూ నదీ ముఖ ద్వారానికి పశ్చిమంగా మక్రాన్ తీరపు కుల్లీ సంస్కృతి, అలాగే, రాజస్థాన్, పంజాబ్‌లలో నదీ తీరాల వెంబడి నివసించిన కొన్ని గ్రామీణ తెగలు విశదం చేయడం, పురావస్తు అన్వేషణ, త్రవ్వకాల వల్లనే తెలుస్తున్నాయి.

హరప్పా, మొహెంజొదారోలలో బయల్పడ్డ పట్టణ నాగరికత, ఆ తర్వాత జరిగిన తవ్వకాల వల్ల, కోట్‌డిజి (సింధ్) కాలిబంగన్ (రాజస్థాన్), రూపర్ (పంజాబ్) లోథాల్ రేవు పట్టణం (గుజరాత్), ఉత్తరభారతంలోని అనేక ఇతర ప్రాంతాలకు విస్తరించిన విషయం స్పష్టమైంది. ప్రణాళికాబద్ధమైన పట్టణ నిర్మాణం, మంచినీటి వసతులు, మురుగు కాలవల సౌకర్యం, ఇతర అనేక సంస్కృతి విశేషాలను తెలియచేసే భౌతికావశేషాలు, అపారంగా బయల్పడినాయి. హరప్పా ముద్రలపై ఉన్న చిత్రరూపక లిపిని చదవగలిగిననాడు, మరిన్ని విశేషాలు తెలియగలవు. గంగా నదీ లోయ పశ్చిమార్థంలో, బూడిద రంగులో ఉన్న మట్టి పాత్రలు లభించాయి. పశుపోషణ, గుఱ్ఱాలను గురించి, రాగి ఉపయోగం తెలిసిన వ్యవసాయక తెగల జీవన విధానం, ఆర్య సంస్కృతి గురించి, వైదిక వాఙ్మయంలో చేయబడిన వర్ణనతో సరిపోతున్నది. ఇదే విధంగా, చారిత్రక యుగానికి సంబంధించి పురావస్తు తత్వవేత్తలు తక్షశిల, పాటలీపుత్రం, స్థానేశ్వరం, నలంద, సారనాథ్, హస్తినాపురం, గయ, అమరావతి, నాగార్జునకొండ మొదలైన అనేక ప్రాంతాల్లో జరిపిన త్రవ్వకాల్లో బయల్పడిన భౌతికావశేషాలు, సమకాలీన మత, సాంఘిక జీవనాన్ని, భారతీయ వాస్తు, శిల్పకళా నైపుణ్యాన్ని, పరిణామాలను ప్రతిబింబిస్తున్నాయి. పాటిదిబ్బల రూపంలో, అనేక ప్రాచీన నివేశనా స్థలాలు దేశమంతటా కన్పిస్తాయి. వీటినే మనం, లంజల దిబ్బలు, బోగందాని మెట్టలు, పాండవుల మెట్టలు, అని వ్యవహరిస్తుంటాం. వీటిలో అధిక భాగం, ప్రాచీన బౌద్ధ స్థావరాలు.

మనదేశ చరిత్రలో ఆయాకాలాల్లో నిర్మింపబడ్డ స్థూపాలు, ఆలయాలు, గృహాలు, పట్టణాలు, దుర్గాలు మొదలైనవాటి ప్రస్తుత శిధిలాలు, నాటి వాస్తు, శిల్ప, చిత్రలేఖనాల అభివృద్ధికి, పరిణామాలకు ప్రతీకలుగా ఉండటమే కాక, సమకాలిక సంస్కృతికి నిదర్శనంగా నిలబడినాయి. హరప్పా సంస్కృతి స్థావరాల్లో లభించిన అవశేషాలు, అప్పటి ప్రజల వాస్తు, శిల్ప కళాకౌశలానికి తార్కాణం. మన ప్రాచీన వాస్తు, శిల్ప, చిత్ర కళా రీతులు చాలావరకూ మతపరమైనవి. అశోకుని కాలం నుండి

బౌద్ధ స్తూపాల, చైత్యశాలల, సంఘారామాల నిర్మాణం ఆరంభమైంది. ఇటువంటి వాటిలో చాలా ప్రసిద్ధికెక్కిన స్తూపాలు సాంచి, అమరావతి, గుడివాడ, నాగార్జునకొండ మొదలైనచోట్ల బయల్పడ్డాయి. సాంచి, సారనాథ్, లౌరియా, నందన్‌ఘర్ మొదలైనచోట్ల కనిపిస్తున్న అశోకుని ఏక శిలా స్తంభాలు, ఆనాటి వాస్తు, శిల్పకళారీతులకు అద్దం పడుతున్నాయి. శుంగుల కాలం నాటి బార్హుత్ స్తూప ప్రాకార తోరణాలు, శిల్ప సంపదకు నిలయాలు. ఆంధ్ర శాతవాహనుల కట్టడాలు, మన రాష్ట్రంలోని గుంటుపల్లి, అమరావతి, గుడివాడ, ఘంటసాల, ఆదుర్రు, గుమ్మడిదుర్రు, ధూళికట్ట, గోలి మొదలైన ప్రాంతాల్లోనే కాక, మహారాష్ట్రలోని గుహాలయాలైన భాజ, బేడ్స, నాసిక్, కార్లే, కన్హేరి, అజంతాలోని 9,10 గుహలు ముఖ్యమైనవి. అమరావతీ స్తూపం చిత్రరూప సమన్వితం. ప్రజల మత, సాంఘిక, జీవనాన్ని ప్రతిబింబించే కళారూపం. చైతన్యం మూర్తీభవించిన లావణ్య స్త్రీ రూపాలు, అమరావతి శిల్పంలో రూపుదిద్దుకొన్నాయి.

మధుర - గాంధారాలలోని కళాఖండాలు, కుషాణుల కాలం నాటి కళా సృష్టికి నిదర్శనాలు. దేశీయ విషయాలకు రోమన్ కళారీతి తోడవటంతో, కాబూల్, పెషావర్, తక్షశిల మొదలైనచోట్ల, గాంధార సంప్రదాయం ఆ కాలంలో విలసిల్లింది. బుద్ధుణ్ణి మానవ రూపంలో చిత్రించటం, కుషాణుల శిల్పాలలోనే క్రీ.శ. మొదటి శతాబ్దంలో ప్రారంభమైంది. వైష్ణవ పక్షపాతులైన గుప్తుల కాలంలోనూ, వారి పరమత సహనం వల్ల, బౌద్ధ నిర్మాణాలు కొనసాగినాయి. సారనాథ్‌లో ధామేక్ స్తూపం, అజంతా, ఎల్లోరా మొదలైన చైత్యశాలలు, విహారాలు దీనికి నిదర్శనం. బుద్ధ గయలో లభించిన భోధిసత్వ విగ్రహం, అంతర్భావనారూపంగా తీర్చిదిద్దబడింది. ధ్యాన నిమగ్నమై ఉన్న ఈ మూర్తిలో, ఏకాగ్రత ప్రస్ఫుటమౌతుంది. సారనాథ్‌లోని ధర్మచక్రప్రవర్తన ముద్రలో ఉన్న బుద్ధుని ప్రతిమ, సుందర తేజోరూపంతో, ముఖంలో నిశ్చలత్వం, నిర్మలత్వం, ప్రసన్నత ప్రతిఫలిస్తూ ఉన్న, ఒక అత్యద్భుతమైన అలౌకిక సృష్టి.

గుప్తుల కాలంలోనే, హిందూ మతం పునరుజ్జీవితం కావటంతో, దేవాలయాల నిర్మాణం ఊపందుకొంది. సమతలమైన ఆచ్ఛాదనతో, చిన్న కట్టడంగా సాంచీలో ఆరంభమైన దేవాలయ నిర్మాణం, దేవఘడ్ దశావతార ఆలయానికి వచ్చేసరికి, ఆచ్ఛాదనం శిఖర రూపాన్ని ధరించడం, ఆలయం నలువక్కల విష్ణువు అవతారాలు కళా రూపాలుగా చోటుచేసుకోవటం కన్పిస్తుంది. ఇక్కడి నరనారాయణ, అనంతశాయి, విష్ణువు శిల్పాలు, ఉదయగిరి గుహల్లోని వరాహ విష్ణువు, బృహత్స్వరూపం, అద్భుత శిల్పకళా విన్యాసానికి ఉదాహరణలు.

ఐహోల్, బాదామి, పట్టడకల్‌లోను, అలంపురంలోను, పశ్చిమ చాళుక్యులు నిర్మించిన దేవాలయాలున్నాయి. బెజవాడ, మొగల్రాజపురం, ఉండవల్లి, భైరవకొండ, మండగపట్టు, మహాబలిపురం, కంచి మొదలైనచోట్ల కనిపిస్తున్న గుహాలయాలు, మంటపాలు, రథాలు, విష్ణుకుండినుల, పల్లవుల కళాభిమానానికి, నాటి వాస్తు, శిల్పకళారీతులకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిల్చాయి. అలాగే, చోళులు తంజావూరులో నిర్మించిన బృహదీశ్వరాలయం, నటరాజ విగ్రహాలు, కాంస్య ప్రతిమలు; చిదంబరం, కుంభకోణం, తిరువన్నామలై, శ్రీరంగం, మధురల్లో పాండ్యులు నిర్మించిన ఆలయాల ప్రాకారాలు, గోపురాలు; బేలూర్, హాలెబిడ్‌లోని హొయసలుల ఆలయాలు, విజయనగర పాలకులు నిర్మించిన హంపీ లోని విఠల, హజార రామకృష్ణ ఆలయాలు, గణేశ ఉగ్రనరసింహ విగ్రహాలు, రాతిరథం,

B RAO U

కల్యాణమంటపం, వీరి ఇతర చోట్ల నిర్మాణాలు. ఇవిగాక కోణార్క్, ఖజురహో, అబూపర్వతంపై ఉన్న దిల్‌వారా దేవాలయాలు, ఆయా కాలాల శిల్ప కళారీతుల్ని చాటడమే కాక, మన ఆర్థిక, సాంఘిక, పరిస్థితుల్నీ పరోక్షంగా విశదం చేస్తున్నాయి.

మహమ్మదీయ వాస్తు నిర్మాణాలు, ఢిల్లీ సుల్తాన్ కుతుబుద్దీన్‌తో ఆరంభమయ్యాయి. కుతుబ్ మినార్ నిర్మాణాన్ని, అతని అల్లుడు చాలా వరకు నిర్వహించాడు. ఆ తర్వాత కాలంలో, ఎక్కువగా నిర్మాణమైనవి మసీదులు, సమాధులు. దక్కన్‌లో సుల్తాన్‌లు, ఇతరులు నిర్మించిన కట్టడాలు, బీదర్, గుల్బర్గా, బీజాపూర్, గోల్కొండల్లో దర్శనమిస్తాయి.

వాస్తు కళలో కొత్త పోకడను షేర్షా ప్రారంభించాడు. అతడు ప్రవేశపెట్టిన భారతీయ - ముస్లిమ్ పద్ధతికి, ఢిల్లీ లోని షేర్షా దర్వాజాలు, పురానా ఖిల్లా, సస్రామ్ లోని అతని సమాధి, ఉదాహరణలు. అక్బర్ కాలంలో అనేక మార్పులు వచ్చాయి. ఆగ్రా లోని జహంగీర్ మహల్ గోడలు, హిందూ, జైన పద్ధతుల్లో అలంకరించబడ్డాయి. ఫతేపూర్ సిక్రీ కోట, దాని లోని జోధ్‌బాయి ప్రాసాదం, పాంచ్ మహల్, దీవానే ఆమ్, దీవానే ఖాస్‌లు, సికింద్రా లోని అక్బర్ సమాధి, ఢిల్లీ, లాహోర్, అల్హాబాద్ కోటలు, ఆనాటి కళా పోషణకు, కళా రీతులకు, మత సామరస్యానికి నిదర్శంగా నిలిచాయి. జహంగీర్, ఇత్మద్‌ఉద్దౌలా సమాధులు, షాజహాన్ తాజమహల్ వంటి అద్భుత నిర్మాణాలే కాక, ఇతర ప్రాంతాల్లో చక్రవర్తుల ఆదరణలో నిర్మించబడ్డ కోటలు, అనేక భవనాలు, ఉద్యాన వనాలు, సమాధులు, మొగలుల వాస్తు శిల్పకళలకు, చిత్రలేఖనానికి నిదర్శనాలుగానే కాక, అప్పటి అభిరుచులకు, సాంఘిక, మత పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.

అజంతా, బాగ్, బాదామి, సిత్తన్నవాసల్, సోమనాధపురం, లేపాక్షి, త్రిపురాంతకం మొదలైన చోట్ల ఉన్న కుడ్య వర్ణ చిత్రాలు, సమకాలీన చిత్రకళా నైపుణ్యంతోబాటు, మత, సాంఘిక పరిస్థితులన్నిటినీ వెల్లడిస్తున్నాయి. ఇవేకాక, విదేశాలలో ఉన్న పురావస్తు సంపద కూడా, మన చరిత్ర నిర్మాణానికి దోహదం చేస్తున్నది. జావాలోని బోరోబుదూర్, కంబోడియాలోని ఆంగ్‌కర్‌వాట్ వైష్ణవాలయం మొదలైనవి, భారతీయ సంస్కృతీ సామ్రాజ్యం ఆగ్నేయాసియా ప్రాంతాలకు విస్తరించిన విషయాన్ని వివరిస్తున్నాయి.

## 7.8 శాసనాలు

రాజులు కాని, వారి అనుయాయులు కాని, లేదా సామాన్యులైనా తాము చేసిన గణనీయమైన పనులను తెలియచేస్తూ, లిఖించిన ప్రకటనలను శాసనాలంటారు. ఈ విధంగా చేసే ప్రకటనలు శిథిలమవకుండా, చిరకాలం ఉండేలా, శిలల మీదనో, లోహాల మీదనో లిఖింపబడేవి. చిరకాలం నిలిచి ఉంటాయి. కాబట్టే శిలలను, లోహాలను, రాజ శాసనాలకు, దాన విక్రయాదులకు సంబంధించిన పట్టాలకు ఉపయోగించేవారు. శిలా నిర్మితాలైన గుడి గోడల మీద, స్తంభాల మీద, వేల సంఖ్యలో శిలా శాసనాలు లభించాయి. లేఖనం కోసం వాడిన లోహాల్లో, మనకు విస్తారంగా కనిపించేది రాగి. ఈ తామ్ర పత్రాలను సాధారణంగా, దాన పట్టాల విషయంలో ఉపయోగించేవారు. అరుదుగా కంచు, వెండి, బంగారం కూడా శాసన లేఖనానికి ఉపయోగపడేవి. వీటితోబాటు, భూర్జ తాళపత్రాలు, కర్ర

BRAOU

చెక్కలు, వస్త్రాలు, చర్మాలు కూడా, రాత సాధనాలుగా ఉపయోగపడేవి. ఈ విధంగా లిఖించబడ్డ శాసనాల్లో, భౌగోళిక, సమకాలిక, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు, పాలక వంశం పేర్లు, వారి పరిపాలనా కాలం, దండయాత్రలు, యజ్ఞయాగాదులు, పాలనా వ్యవస్థ మొదలైన అనేక విషయాలను గూర్చి సమాచారం లభిస్తున్నది. ఈ శాసనాలను శాస్త్రీయంగా అధ్యయం చేసేదే, శాసన శాస్త్రం. ఆంగ్లంలో దీన్ని ఎపిగ్రఫీ (Epigraphy) అంటారు. అంటే, ప్రాచీన లేఖనమని అర్థం. లేఖనం అంటే, రాత ప్రారంభం కావటమే, చరిత్ర పూర్వ యుగం ముగిసిందనటానికి సంకేతం. అదే చరిత్రకు నాంది. ప్రాచీన మానవుడు రాత పూర్వకమైన సంకేతాల రూపంలో ఉచ్చారణ తోడు చేసి, తన భావాలను వ్యక్తీకరించటం నేర్చినపుడే, లిపి రూపొందింది. శాసన లేఖనం ఆరంభమైంది. నాగరిక సమాజానికిది ఒక ముఖ్య లక్షణం. భారతదేశంలో ఇంతవరకూ లభ్యమైన వాటిలో మొట్టమొదటి లిపి రూపం, హరప్పా ముద్రలపై కన్పించేదే. ఇది చిత్రరూపక లిపి. దీనిని చదివి అర్థం చేసుకోడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఈ ప్రయత్నాలింకా సఫలం కాలేదనే చెప్పాలి.

లిపి పరిణామంలో తర్వాత దశను, మన దేశమంతా విస్తరించిన మౌర్య అశోకుని శిలాశాసనాలు ప్రతిబింబిస్తున్నాయి. కలకత్తాలో ఈస్టిండియా కంపెనీ ఉద్యోగి అయిన జేమ్స్ ప్రిన్సెప్ ఖరోష్టి, గ్రీక్ రెండు భాషల్లోనూ ఉన్న శాసనాలను ప్రాతిపదికగా తీసుకొని, ఈ శాసనాలమీద ఉన్న బ్రహ్మీ లిపిలోని ప్రాకృత భాషను చదవగలగడంతో, శాసన పరిశోధనకు మార్గం సుగమమైంది. తదనంతరం, అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్, జె. ఎఫ్, ఫ్లీట్, హూల్ట్జ్, జె. బర్జెస్, బూలర్, కీల్‌హార్న్ మొదలైన పాశ్చాత్య పరిశోధనలే కాక, అనేక మంది భారతీయ పండితులు సైతం, శాసనాల క్రోడీకరణ ద్వారా, భారతదేశ చరిత్ర పునర్నిర్మాణాన్ని సులభతరం చేశారు. మనకు-గల చరిత్ర ఆధారాలన్నిటిలోకి చాలా ముఖ్యమైనవి, ప్రామాణికమైనవి శాసనాలే. వాఙ్మయాధారాలలో అయితే, మార్పులకు, చేర్పులకు అవకాశం ఉంది. కాని, అదే శాసనాల్లో అయితే, ఒకసారి లిఖించబడింది మార్చడానికిగాని, మరికొంత సమాచారాన్ని చేర్చటానికిగాని, అవకాశం లేనట్లే. శాసన ఉనికి, రాసే విధానం, లిపి లక్షణాలు - ఇలా ప్రతి విషయం చరిత్ర ఆధారాలన్నింటిలోకి శాసనాలే విశ్వసనీయం అనే అంశాన్ని ధృవీకరిస్తున్నా, కవిత్వపు వాసనలతో అతిశయోక్తులకు, ఉత్ప్రేక్షలకు అవకాశం ఉన్నప్పటికినీ, కొన్ని సందర్భాల్లో, అసమగ్రంగా పేర్కొన్న అంశాల కారణంగా, పండితుల మధ్య వాగ్వివాదాలకు అవకాశం ఉన్నప్పటికినీ, మరే ఇతర లోపాలున్నా, శాసనాలు మన ప్రాచీన చరిత్రకు ముఖ్యాధారాలుగా ఉన్నాయి.

శాసనాలను వాటి కర్తలను బట్టి రాజశాసనాలుగా, సామాన్యుల శాసనాలుగా విభజించవచ్చు. రాజులు కాని, వారి తరపున వారి ప్రతినిధులెవరైనా కాని ప్రకటించినవి, రాజ శాసనాలు; రాజుల పరాక్రమ ఔదార్యాలను చాటే ప్రశస్తులు. అశోకుని శాసనాల వంటి ప్రబోధకాలు, రాజులు బ్రాహ్మణులకో, దేవాలయాలకో, ఇతర మత ధర్మ సంస్థలకు, చేసిన దానాదులను ప్రకటించే క్షేత్రాలు, ఈ రాజ శాసనాల కిందికి వస్తాయి. ఇక సామాన్యులు ఏ దేవాలయానికో, మఠానికో చేసిన దానాదులను గూర్చి ప్రకటించేవి, రెండో రకం శాసనాలు. వీటిలో దాత గురించి, సమకాలీన పాలకుని గురించి ప్రసక్తి ఉండవచ్చు. ఇవి నాటి ఆర్థిక, సాంఘిక, మత పరిస్థితులను కొంతమేరకు తెలియచేస్తాయి. మనకు లభించిన లక్షకుపైగా శాసనాల్లో కాని, ప్రతి ఏటా లభిస్తున్న శతాధిక శాసనాల్లోకాని, ఎక్కువ ఈ రెండో రకానివే. అయితే, చరిత్ర రచనకు ఎక్కువ ఉపయోగపడేవి రాజ శాసనాలే.

BRAOU

శాసనాలను, వాటిలో చెప్పిన విషయాలను బట్టి, ప్రశస్తులు (Eulogies), ఉపదేశాత్మకాలు (didactic records), దాన విక్రయాది పత్రాలు (Donative charters), స్మారకాలు అని వర్గీకరించొచ్చు. కాని, కొన్ని శాసనాలను ఖచ్చితంగా వర్గీకరించటం సాధ్యం కాకపోవచ్చు. శాసన రచనలో ముఖ్యంగా, తామ్ర శాసనాల విషయంలో సాధారణంగా ఒక క్రమపద్ధతిని అనుసరించడం కనిపిస్తున్నది. మొదట మంగళ వాచకం, దైవస్తుతులు, ఆ తర్వాత, వంశ ప్రశస్తి, విషయ ప్రస్తావన, దీవెన, శాపం, శాసన కాలం వరసగా కనిపిస్తుంటాయి. కాని, ప్రతి శాసనంలో ఇవన్నీ ఉండాలని కాని, ఇదే వరసలో ఉంటాయనికాని నియమమేమీ లేదు. వీటిలో, వంశ ప్రశస్తి, విషయ ప్రస్తావన, శాసన కాలం చరిత్ర నిర్మాణానికి ముఖ్యం. శాసనం దాన శాసనం అయితే, దానిలో, దాత, దాన స్వీకర్త, దానం, దాన కాలం, శాసన ఆజ్ఞ, లేఖకుని వివరాలు పూర్తిగా లభ్యం కావచ్చు.

భారతదేశ చరిత్ర నిర్మాణంలో, అత్యంత ప్రామాణికమైన ఆధారాలు పురావస్తు ఆధారాలైతే, అందులో ముఖ్యమైనవి శాసనాలు. ఇవి చరిత్ర రచనకు ఏవిధంగా తోడ్పడుతున్నాయనే విషయానికి వస్తే, ప్రాచీన భారత రాజకీయ చరిత్ర పునర్నిర్మాణానికి సహాయపడుతున్న శాసనాల్లో, మౌర్య అశోకుని శిలా శాసనాలు, కలింగ ఖారవేలుని హథిగుంఫా శాసనం, ఆంధ్ర శాతవాహన చక్రవర్తి రెండో శాతకర్ణి రాణి నాగానిక నానేఘాట్ శాసనం, అదే వంశంలో 23వ పాలకుడైన గౌతమీపుత్ర శాతకర్ణి గూర్చి అతని తల్లి బాలశ్రీ వేయించిన నాసిక్ శాసనం, పశ్చిమ క్షత్రప రుద్రదమనుని జునాఘడ్ శాసనం, గుప్త చక్రవర్తి సముద్రగుప్తుని అలహాబాద్ ప్రశస్తి, చంద్రుని మెహ్రౌలి స్తంభ శాసనం, స్కందగుప్తుని జునాగఢ్ శాసనం, కుమారగుప్తుని మందసోర్ శాసనం, హూణ మిహిరగులునిపై విజయాన్ని సాధించిన యశోధర్ముని మందసోర్ శాసనం, కదంబ శాంతివర్ముని తలగుండ శిలా స్తంభ శాసనం, వాతాపి చాళుక్య, రెండో పులకేశుని ఐహోల్ శాసనం మొదలైనవి ముఖ్యమైనవి. దక్షిణాపథంలో ఆంధ్ర శాతవాహనుల పతనానంతరం, వివిధ భాగాలను పరిపాలించిన ఇక్ష్వాకులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు, ఆనందగోత్రజులు, చూతునాగులు, విష్ణుకుండినులు, దుర్జయులు, తూర్పు వేంగీ చాళుక్యులు మొదలైన రాజ వంశాల్లోని పరిపాలకుల పేర్లు, వారి వారసత్వ క్రమం, పరిపాలనా కాల సంవత్సరాలు, పాలనా విశేషాలను తెలుసుకోడానికి వారి, శిలా తామ్ర శాసనాలే ఆధారం.

శాసనాల ఉనికినిబట్టి, వాటిలోని విషయాలను బట్టి, అశోకుడు, ఖారవేలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, రుద్రదమనుడు, సముద్రగుప్తుడు, రెండో పులకేశి మొదలైన పరిపాలకుల వ్యక్తిగత గుణగణాలు, వారి విజయవంతమైన సైనిక దండయాత్రలు, రాజ్య విస్తీర్ణతలను నిర్ణయించ వీలౌతున్నది. కాంచీపురం కైలాసనాథ ఆలయంలో, సంస్కృత, తమిళ, తెలుగు, భాషలు మూడింటిలో వేయబడ్డ ఒక శాసనం, (క్రీ.శ. 1102-03) మొదటి రాజరాజ చోళుడు తెలుగు చోళుడైన జటాచోడ భీముణ్ణి ఓడించి, బందీని చేసిన విషయాన్ని తెలియచేస్తున్నది. అలాగే, దక్షిణ ఆర్కాట్ జిల్లాలోని త్రివెందిపురం శిలా శాసనాలు, (క్రీ.శ. 1231) సేండమంగళం వద్ద మూడో రాజరాజుని కొప్పెరుంజింగుడు బందీని చేసి, చోళ దేశాన్ని నాశనం చేయడం, పైపెచ్చు, ఒక హిందువై ఉండి, దేవాలయాలను పాడుచేయడం, ఇది విన్న హోయసల రాజు వీరసింహుడు ద్వారసముద్రం నుండి సైన్యాలను పంపి, కొప్పెరుంజింగుని శిక్షించి, చోళ పరిపాలనను పునరుద్ధరించిన విశేషాలను విశదం చేస్తున్నాయి. ఇదే విధంగా, శాసనాల్లో కానవస్తున్న 'వాతాపి కొండ', 'గంగైకొండ చోళ' వంటి బిరుదులు, పల్లవ

BRAOU

మొదటి నరసింహవర్మ, మొదటి రాజేంద్ర చోళ చక్రవర్తుల సైనిక విజయాలను సూచిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో, శాసనాలు ఆయా రాజులు సింహాసన మధిష్టించిన సంవత్సరాలను, ఖచ్చితమైన తేదీల వంటి వివరాలతో సహా, తెలియచేస్తున్నాయి. ఇటువంటి వాటిలో, రెండో చంద్రగుప్తుని మథుర శిలా స్తంభ శాసనం, వేంగి చాళుక్య మొదటి భీముని అత్తిలి తామ్ర శాసనం, రాజరాజ నరేంద్రుని పలు తామ్ర శాసనాలను ఉదహరించొచ్చు. ఒక్కొక్క సందర్భంలో, శాసన లిపి లక్షణాలను బట్టి, సాపేక్ష కాల (relative chronology) నిర్ణయాన్ని చేయొచ్చు.

మహమ్మద్‌బిన్ తుగ్లక్ క్రీ.శ. 1325 లో, ఢిల్లీ సింహాసనం అధిష్ఠించాడనీ, అందరూ నమ్ముతున్న విషయం. కాని, ఒక సంస్కృత శాసనం అతడ్ని క్రీ.శ. 1324 జూన్ నాటికే, ఢిల్లీ పాలకునిగా పేర్కొంటున్నది. నాజరుద్దీన్ బుగ్రాఖాన్ కుమారుడైన కైకాటస్ బెంగాల్‌ను పరిపాలించాడనే విషయాన్ని, కేవలం శాసనాలే చెబుతున్నాయి తప్ప, పారశీక చరిత్రకారులు సూచించ లేదు. విజయనగర రాజ్య స్థాపకుడైన మొదటి హరిహరుని బాఘాపల్లి తామ్ర శాసనం (క్రీ.శ. 1336), రెండో సంగముని బిట్రగుంట తామ్ర శాసనం (క్రీ.శ. 1356), సంగమ సోదరుల వంశ క్రమాన్ని తెలియజేస్తున్నాయి. మొదటి బుక్కరాయల కుమారుడు కుమారకంపనకు ఆపాదించబడ్డ దాదాపు 132 శాసనాలు, తమిళ ప్రాంతాలను అతడు జయించి, రాజ ప్రతినిధిగా పరిపాలించిన వివరాలను వెల్లడిస్తున్నాయి. ఇమ్మడి నరసింహుని దేవులపల్లి శాసనం, అతని తండ్రి సాళువ నరసింహుడు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించటం, ఆ వంశ క్రమం వివరాలను తెలియజేస్తున్నది. తుళువ శ్రీకృష్ణదేవరాయల పరిపాలనా కాలానికి సంబంధించి, ప్రతి సంవత్సర విశేషాలను తెలియచెప్పేంతగా శాసనాలు లభించాయి. షిమోగా, సంగ్లీ మ్యూజియం, క్రిస్నిపాడు, సెట్టూరు, రుద్రపుర, పెయ్యాలబండ మొదలైన తామ్ర శాసనాలు, కృష్ణరాయలు సింహాసనానికి రావటం, అతని పట్టాభిషేకం, సైనిక దండయాత్రలు, తీర్థయాత్రలు, కట్టడాల నిర్మాణం, ప్రజోపయోగకర కార్యాలను గురించి వివరాలిస్తున్నాయి. హంపీ, అమరావతి, మంగళగిరి, కొండవీడు, సింహాచలం వంటి శిలా శాసనాలు అతని తూర్పు దిగ్విజయ యాత్రను, దాన విశేషాలను, విధించిన సుంకాలను పేర్కొంటున్నాయి. అచ్యుతదేవరాయల కదలాడి తామ్ర శాసనం, అతడు సింహాసనాసీనుడైన సందర్భంలోని కొన్ని సందేహాలను తొలగిస్తున్నది. తుళువ రాజ వంశం లాగే, ఆరవీటి రాజ వంశ క్రమాన్ని, శాసనాలే తెలియజేస్తున్నాయి.

తంజావూరు బృహదీశ్వరాలయంలో ఉన్న ఒక సుదీర్ఘ మరాఠీ శాసనం (1803), భాన్స్లే రాజ వంశంలో షాజీ, శివాజీల ఘన కార్యాలు మొదలుకొని, రెండో సర్ఫోజీ (శాసనకర్త) కాలం వరకు, దాదాపు 20 తరాల గురించి, ఇతర ఆధారాల్లో కన్పించని, ఆసక్తికరమైన వివరాలను ఇస్తున్నది. ఇదే తంజావూరును పాలించిన మరాఠా పాలకుడైన ఈ సర్ఫోజియే, ఐరోపాలో బ్రిటిష్ వారు నెపోలియన్‌ను ఓడించిన జ్ఞాపకంగా, సముద్ర తీరానికి దగ్గరలోనున్న సాళువ నాయకన్పట్టినం వద్ద ఒక కట్టడాన్ని నిర్మించి, ఇదే విషయాన్ని ఆంగ్ల, తమిళ, తెలుగు, మరాఠీ, పారశీక భాషల్లో వేయించిన శాసనాల్లో చాటాడు.

పాలనా వ్యవస్థలోని పరిపాలనా విభాగాలనూ, వివిధ స్థాయిల్లోని అధికారులనూ, శాసనాలు పేర్కొంటున్నాయి. అశోకుని శిలా శాసనాలు మంత్రి పరిషత్ గూర్చి, ధర్మమహామాత్రుల నియామకం గూర్చి, వారి విధుల గూర్చి తెలుపుతున్నాయి. అతని ధౌళి, జౌగడ శాసనాలు, కళింగ

BRAOU

దండయాత్రకు సంబంధించిన విశేషాలే కాక, మౌర్య పాలనా విధానంలో పైతృక తత్వాన్ని (Paternal attitude), ప్రవేశపెట్టడాన్ని కూడా వివరిస్తున్నాయి. శాతవాహనుల శాసనాలు 'ఆహార', 'రాష్ట్ర' విభాగాలతోబాటు, మహారథి, మహాభోజ, మహాదండనాయక, మహాతలవర వంటి ఉద్యోగులనూ పేర్కొంటున్నాయి. శాలంకాయన, విష్ణుకుండిన, వేంగి చాళుక్యుల శాసనాల్లో, రాష్ట్రకూట ప్రముఖులు, పల్లవులు, చోళుల శాసనాల్లో 'నాడు', 'మండలం' వంటి పాలనా విభాగాలు గుప్తుల శాసనాల్లో 'భుక్తి', 'విషయ' వంటి విభాగాలు కన్పిస్తున్నాయి. దామోదర్‌పూర్ వంటి తామ్ర శాసనాలు, వైశాలి ముద్రలు, గుప్తుల పరిపాలనా వివరాలను ఇస్తున్నాయి. అలాగే, కాకతీయుల, రాష్ట్రకూటుల, చాళుక్యుల, హోయసాల, విజయనగర పాలకుల శాసనాలు, ఆయాకాలాల పరిపాలనా పద్ధతులను, వివిధ సుంకాలను తెలియచేస్తున్నాయి.

మన ప్రాచీనుల దాతృత్వాన్ని, ధర్మచింతననూ, సమకాలీన ఆర్థిక, సాంఘిక, మత సంబంధమైన అనేక విషయాలను తెలిపే శాసనాలు ఎక్కువగానే లభిస్తున్నాయి. అశోకుని శిలా శాసనాలు మత, ధర్మ ప్రబోధకాలు కూడా. అతని లుంబినీ యాత్రను కూడా, అక్కడి అతని శాసనమే తెలియచేస్తున్నది. ఆంధ్ర శాతవాహన చక్రవర్తులు గౌతమీపుత్ర శాతకర్ణి, అతని కుమారుడు పులోమావిల నాసిక్ శాసనాలు, వారి భూదాన విశేషాలను, ధన, గోదానాల వంటి విశేషాలను, నాగానిక నానేఘాట్ శాసనం, ఋషభదత్తుని నాసిక్, కార్లే, జున్నార్ శాసనాలు ఇస్తున్నాయి. మందసోర్ శాసనం, పట్మశాలీ సంఘం సూర్యదేవాలయాన్ని నిర్మించడం గూర్చి, ఉదయగిరి శాసనాలు రెండో చంద్రగుప్తుని సామంతాధికారి గునకానీక మహారాజు ఉదయగిరి గుహాలయాన్ని తొలిపించడం గురించి, వివరిస్తున్నాయి. యవనులు, శకులు, కుషాణులపై హైందవ ప్రభావాన్ని, యవన రాజు ఆంటియాల్కిడాస్ రాయబారిగా శుంగరాజు భాగభద్రుని ఆస్థానానికి వచ్చిన హీలియోడోరస్ వేయించిన బిస్నగర్ గరుడ శిలా స్తంభ శాసనం, పశ్చిమ క్షాత్రప క్షహరాట సహపాణుని అల్లుడు ఋషభదత్తుని నాసిక్ శాసనం, కార్ధమక రుద్రదమనుని, కుషాణ వాసుదేవుని శాసనాలు నిర్ధారిస్తున్నాయి. కనిష్కుడు బౌద్ధాన్ని అభిమానించి ఆదరించటం, విజయపురి ఇక్ష్వాకుల అంతఃపుర స్త్రీజనం అదే విధంగా బౌద్ధాన్ని ఆరాధించటం, వారివారి శాసనాలే తెలియచేస్తున్నా, ఇక్ష్వాకు రాజులు మొదలుకొని, సామాన్యుల వరకు, దేవాలయాలకు, లేదా ఇతర మత సంస్థలకు అఖండ దీపారాధనకు గాని, ప్రత్యేక సేవల నిమిత్తమో, లేదా పండగలకు కాని, సన్యాసుల పోషణకుగాని, ఆలయాల మరమ్మత్తులకుగాని, కొంత భూమినో, ధనాన్నో, పశువులనో దానంగా ఇవ్వడమే, ఎక్కువ శాసనాల్లో ప్రధాన విషయంగా కనిపిస్తున్నది. ఆలయ అధికారుల పర్యవేక్షణలో, పఠనానికో, ఇతరములకో ఇచ్చిన దానాలను ఉంచటం జరిగేది. వీటికి భిన్నంగా, శ్రీరంగం ఆలయంలో ఒక ఆసక్తికరమైన శాసనం ఉంది. ఆలయ పూజా కార్యక్రమాల్లో చోటుచేసుకొన్న లోపాలకు నిరసన తెలపడానికి, ఒక భక్తుడు ఆలయ శిఖరం నుండి దూకి, ఆత్మహత్య చేసుకోడం, ఈ శాసనంలో చెప్పబడింది. పర్యవసానంగా, ఆలయంలో పూజా విధానం, సజావుగా పునరుద్ధరించబడిందట.

దాన శాసనాల్లో కన్పిస్తున్న వివిధ వర్గాలకు చెందిన దాతల, దాన స్వీకర్తల ఆర్థిక వైరుధ్యాలను బట్టి, ఆయావర్గాల సామాజిక స్థాయిని అంచనా వేయవచ్చు. వృత్తిపరమైన శ్రేణులు శాతవాహనుల కాలం నుండి, మధ్య యుగం వరకు, సామాజిక కార్యకలాపాల్లోను, పరిశ్రమల ప్రగతిలోను, ఆర్థికా

భివృద్ధిలోను, నిర్వహించిన పాత్రను శాసనాలే తేటతెల్లం చేస్తున్నాయి. ఆయాకాలాల్లో, ప్రభుత్వాలు ప్రజలపై విధించిన అనేక రకాల సుంకాలు, కొన్ని సందర్భాల్లో వీటిలో వచ్చిన రాయితీలు, శాసనాల్లో వివరంగా పేర్కొనబడ్డాయి. వ్యవసాయోత్పత్తులను పెంచడానికి నీటిపారుదల సౌకర్యాలను కల్పించడం, మౌర్యుల కాలం నుండీ ఉందన్న విషయం, కార్దమక రుద్రదమనుని జునాగఢ్ శాసనం నిరూపిస్తున్నది. దక్షిణాదిన కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర పాలకులు, తటాకాలు, కాలువలు, ఆనకట్టల నిర్మాణాల ద్వారా, ఈ మార్గంలో మరింత ముందంజ వేయడం, మధ్య యుగంలోని శాసనాలు మరింత స్పష్టం చేస్తున్నాయి.

ప్రాచీన కాలం నాటి సాహితీపరమైన చరిత్ర రచనకూ, శాసనాలు తోడ్పడుతున్నాయి. సంస్కృత, ప్రాకృత, ద్రావిడ భాషలు, లిపులు, వాటి పరిణామాలు, ప్రగతిని, శాసనాలు విశదం చేస్తున్నాయి. మామూలుగా, ఆస్థాన కవులు శాసన పాఠాలను రచించేవారు. వీటిని బట్టి రాజుల సాహితీ కళాపోషణ, రాజాదరణ పొందిన నాటి కవులు, వారి కావ్య శైలిని అర్థం చేసుకోవచ్చు. వీటికి ఉదాహరణగా, హరిసేనుని అలహాబాద్ ప్రశస్తి (సుమారు క్రీ.శ. 350 నాటి సముద్రగుప్తునిది), రవికీర్తి ఐహోల్ శాసనం (క్రీ.శ. 634 నాటి చాళుక్య యుద్ధమల్లుని బెజవాడ శాసనం, రెండో పులకేశిది), కుబ్జుని తలగుండ శాసనం, (క్రీ.శ. 460 నాటి కదంబ శాంతివర్మనిది) వత్సభటి మందసోర్ శాసనం (క్రీ.శ. 473 నాటి కుమార గుప్తునిది), వాగూలుని మందసోర్ శాసనం (క్రీ.శ. 532 నాటి యశోధర్మనిది) లాంటివి, అనేకం పేర్కొనొచ్చు. తెలుగు భాషా పరిణామ ప్రగతికి నిదర్శనంగా, ఆనాటి చోళుల శాసనాలు, జయసింహుని విప్పర్ల శాసనం, పండరంగని అద్దంకి శాసనాన్ని చెప్పొచ్చు.

శాసనాలు మన ప్రాచీనుల సంగీత, నాట్య, చిత్ర, వాస్తు కళాభిమానాన్ని, వాటి రీతుల్ని తెలియచేస్తున్నాయి. కళింగ ఖారవేలుడు గాంధర్వ విద్యలో ఉద్దండుడనీ, నాట్యసంగీతాలతో (గాత్ర వాయిద్యాలు) కళింగ నగరాన్ని ఆహ్లాదపరిచాడనీ, హాథిగుంఫ శాసనం తెలియచేస్తున్నది. కార్దమక రుద్రదమనుడు సంగీతంలోని పారవా (reciting), సాధారణ, ప్రయోగాలలో (application) ఎంతో నేర్పరని, గిర్నార్ (జునాగఢ్) శాసనంలో ఉంది. అలహాబాద్ శాసనంలో, సముద్రగుప్తుడు గాత్ర వాయిద్యాలలో తుంబుర, నారదుల్ని మించినవాడని వర్ణించబడ్డాడు. ప్రాచీన, మధ్య యుగాల నాటి దేవదాసి విధానాన్ని అధ్యయనం చేయుటంలో, శాసనాల సాక్ష్యం నిరుపమానం.

పల్లవ మొదటి మహేంద్రవర్మన్ని కుడిమియామిలై శాసనంలో, వీణ మీద సాధనకు ఉద్దేశించిన, అతడే రచించిన సంగీత పాఠాలు చెక్కబడ్డాయి. ఇదే విధంగా, సోమదేవుని లలిత విగ్రహరాజ నాటకం, చహమణ విగ్రహరాజు హరకేళ నాటకంలోని కొన్ని భాగాలు, అజ్మీర్‌లో శిలా స్తంభాల మీద చోటుచేసుకొన్నాయి. భరతుని నాట్య శాస్త్రం నుండి 108 నాట్య భంగిమలను వర్ణిస్తూన్న సంస్కృత పద్యాలు, చిదంబరంలోని నటరాజ దేవాలయంపై లిఖించబడ్డాయి.

విదేశాల నుండి లభిస్తున్న కొన్ని శాసనాలు, ప్రాచీన భారత చరిత్ర పునర్నిర్మాణానికి సహాయపడుతున్నాయి. 'బోఘజ్‌కుయీ' కి చెందిన మిత్తని శాసనాలు (క్రీ.పూ. 1400) ఆర్య దేవతలైన ఇంద్ర, వరుణ, రుద్రుల పేర్లను పేర్కొంటున్నాయి. దీన్నిబట్టి, ఆర్యులు ఏమార్గం ద్వారా, ఎప్పుడు సప్త సింధు ప్రాంతానికి వచ్చారో గ్రహించవచ్చు. పారశీక చక్రవర్తి మొదటి డేరియస్, క్రీ.పూ. 6వ

BRAOU

శతాబ్దంలో తన అధికారాన్ని భారత వాయవ్య ప్రాంతానికి విస్తరింపజేయటాన్ని, అతని బెహిస్తాన్, నూసా ప్యాలస్, పెర్సెపోలిస్ శాసనాలు ధృవీకరిస్తున్నాయి. ఆగ్నేయాసియా ప్రాంతాల్లో లభించిన కొన్ని శాసనాలు, ఆ ప్రాంతాల్లో మన సంస్కృతి ప్రభావాన్ని తెలియజేస్తున్నాయి.

## 7.9 నాణేలు

నిశ్చితమైన ఆకారం, తూకం కలిగి, ప్రామాణికతకు నిదర్శనంగా, అధికార లాంచనం ఉన్న లోహఖండాలనే, నాణేలు, లేదా టంకాలు అని వ్యవహరిస్తారు. నాణేల ఆవిర్భావానికి ముందు, వర్తక వ్యాపారాల్లో ఇచ్చిపుచ్చుకోడం, వస్తు మార్పిడి ద్వారా జరిగేది. అయితే, ఇందులో లోటుపాట్లను గుర్తించాక, మార్పిడి కోసం, ఒక ప్రత్యేక ప్రమాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని, వస్తువు విలువను మదింపు వేసుకొనేలా, ఆ ప్రమాణం ఉండాలని అనుకున్నారు. వైదిక కాలంనాటి ఆర్యులు గోవును ప్రామాణిక సాధనంగా తీసుకున్నారు. కానీ, చిన్న వస్తువుల మార్పిడి సమస్య ఏర్పడటంతో, కళాత్మకంగా బంగారంతో నిశ్చితమైన ఆకారం, తూకం కల్గిన 'నిష్క' అనే సాధనం ప్రవేశపెట్ట బడింది. గుండ్రని ఆకారంలో ఉన్న లోహ ముద్రికను, 'శతమాన' మని తైత్తిరీయ సంహితలోను, శతపథ బ్రహ్మణంలోను వ్యవహరించారు. దీని ప్రామాణికతను నిర్ధారించటానికి, దీని మీద అధికార లాంఛనాన్ని ముద్రించటం జరిగింది. ఇంక బౌద్ధ జాతక కథల్లోనూ, పాణిని అష్టాధ్యాయిలోనూ, సువర్ణాల ప్రసక్తి ఉంది. అయితే, ఎక్కువగా 'కార్షాపణ'మనే పదమే, వాడుకలో ఉంది.

కొనుగోలు సాధనంగా భావింపబడుతున్న ఈ నాణేల పుట్టుపూర్వోత్తరాలను, కాలక్రమేణా వాటిలో వచ్చిన మార్పులను, తత్సంబంధమైన విషయాలను గురించి చేసే శాస్త్రీయ అధ్యయనమే, నాణె శాస్త్రం. దీన్నే ఆంగ్లంలో 'న్యూమిస్మాటిక్స్' (Numismatics) అని వ్యవహరిస్తారు. ఈ ఆంగ్ల పదం లాటిన్ భాషలోని 'న్యూమిస్మా' (Numisma) అనే పదం నుండి ఉద్భవించింది. 'న్యూమిస్మా' (Numisma) అంటే, చలామణిలో ఉన్న ద్రవ్యమని అర్థం. నాణె శాస్త్రాన్ని మన ప్రాచీనులు 'పౌరాణ శాస్త్రం' (పురాణమనేది ప్రాచీన వెండి నాణెమనీ) లేదా, 'ముద్రా విద్య' లేదా, ముద్రాతత్వంగాను వ్యవహరించేవారు.

జేమ్స్ ప్రిన్సెప్ వంటి పాశ్చాత్యులు, ప్రాచీన భారతీయులకు నాణేలను ముద్రించే నేర్పు స్వత స్సిద్ధం కాదనీ, వారది గ్రీకుల నుండి నేర్చుకొన్నారనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కాని, 1853 లోనే బైలే అనే అతడు గ్రీకుల నాణేల కన్నా, ప్రాచీన భారతీయ నాణేలను తక్షశిల మొదలైన చోట్ల గుర్తించటంతో, ఈ వాదన తప్పని స్పష్టమైంది. అలాగే, పారశీకుల తులామానాన్ని అనుసరించి, భారతీయులు నాణేలు ముద్రించారనే ఆలన్ పండితుని వాదం కూడా, ఆ నాణేల ఆకారం, తూకాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు తప్పని ఋజువవుతున్నది.

మన దేశంలో అమలులోకి వచ్చిన అతి పురాతన నాణేలను, 'విద్ధాలక నాణేలు' (Punch - Marked Coins) అంటారు. మన ప్రాచీన గ్రంథాలు ప్రస్తావించే కార్షాపణాలు ఇవే కావచ్చు. వీటిలో, వెండివి ధారణాలుగా, రాగివి పణాలుగా వ్యవహరింపబడేవి. ఈ విద్ధాలక నాణేలు జంతువులు, చెట్లు, మనుష్యులు, ఆయుధాలు మొదలైన బొమ్మలతో, క్రీ.పూ. 4-2 శతాబ్దాల మధ్యకాలానికి సంబంధించి, దేశమంతటా విస్తరించి, లభించాయి. ఆయా జనపదాలు, మహాజనపదాలచే జారీ కాబడి, మౌర్యుల కాలానికి అమల్లో ఉన్న ఈ నాణేలకు, మౌర్యులు మరింత ప్రచారాన్ని కల్పించి ఉండొచ్చు.

మౌర్యుల పతనానంతరం, భారత వాయువ్య ప్రాంతంలో పాలించిన ఇండో-గ్రీకులు, సిథియన్లు, పార్థియన్లు, కుషాణులు, శుంగులు, కాణ్వులు, శాతవాహనులు, పశ్చిమ క్షాత్రపులు, రాజన్య, శిబి, త్రిగర్త, యౌధేయ, గణతంత్ర రాజ్యాలు, వివిధ లోహాల్లో వైవిధ్యంతో కూడిన నాణేలను అమల్లోకి తెచ్చారు. ఇంక తర్వాత వచ్చిన గుప్తుల నాణేలు వైవిధ్యాన్ని, కళాకౌశలాన్ని ప్రతిబింబిస్తూ, 'నభూతో నభవిష్యతి' అన్న రీతిలో ఉన్నాయి. ఈ నాణేల మీద ఉన్న ఆఖ్యలూ, (legends) అత్యంత ఆకర్షణీయమైనవే. శాతవాహనుల అనంతరం, దక్షిణాదిన నాణేలను జారీచేసిన ప్రముఖులు, చాళుక్యులు, పాండ్య, చోళ, యాదవ, హోయసాల, కాకతీయ, పాలకులు, విజయనగర చక్రవర్తులు. విజయనగర సామ్రాజ్యం క్షీణించాక తంజావూరు, మధుర, తిరునల్వేలి నాయకులు, రామ్‌నాథ్ సేతుపతులు సొంత నాణేలను జారీచేసినవారే. అలాగే, ఢిల్లీ సామ్రాజ్య పాలకులు, సుల్తానులు, మొగల్ చక్రవర్తులు, వీరి సమకాలీన స్వతంత్ర పరిపాలకులు. ఆయా కాలాల స్థితిగతుల కనుగుణంగా, అనుకరణలతో, మార్పులతో, నూతన పంథాల్లోనూ, అనేక రకాలుగా నాణేలను ముద్రించి చెలామణి చేశారు.

మార్పిడి ప్రమాణంగా, కొనుగోలు సాధనంగా రూపొంది, కాల గతిలో అనేక పరిణామాలకు లోనై, ఆయా స్థితిగతులను ప్రతిబింబిస్తున్న నాణేలు, చరిత్రకారులకు మన దేశ ప్రాచీన చరిత్ర రచనకు సాధనాలుగా కూడా, ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా, చారిత్రక యుగ తొలి దశలకు సంబంధించి, ఇది మరీ స్పష్టంగా గోచరిస్తుంది. సాధారణంగా, ధృవీకరణ సాక్ష్యంగానే నాణేలు చరిత్ర రచనకు ఉపయోగపడతాయి తప్ప, చరిత్ర పునర్నిర్మాణంలో ప్రత్యేకంగా ఇవే ఏకైక ఆధారంగా తోడ్పడతాయని ఎవరూ విశ్వసించే వారు కాదు. కాని, చరిత్ర రచనలో నాణేలు విషయ ధృవీకరణకేగాక, శాసనాల మాదిరిగానే, కొన్ని చారిత్రక విషయాలను ప్రత్యేకంగా తెలియజేసి, చరిత్ర పునర్నిర్మాణానికి దోహదం చేస్తున్నాయనడానికి అనేక ప్రబల నిదర్శనాలున్నాయి. మన దేశం వివిధ ప్రాంతాల్లో జరిపిన అన్వేషణల్లో, తవ్వకాల్లో, రాసులు రాసులుగా లభించిన ఆయాకాలాలకు చెందిన నాణేలు, అనేక చారిత్రక విశేషాలకు ముఖ్యమైన ఆధారంగా ఉన్నాయి.

BRAOU

ప్రాచీన భారతదేశ రాజకీయ చరిత్రలో మౌర్యుల పాలన అంతరించాక, గుప్తుల ప్రాబల్యానికి రాక పూర్వం, దేశ వాయువ్య, పశ్చిమ ప్రాంతాల్లో పరిపాలించిన ఇండో- గ్రీక్‌లు, సిథియన్లు, పార్థియన్లు, కుషాణులు, క్షాత్రపుల వంటి విదేశీ రాజ వంశాల చరిత్రను తెలుసుకోటానికి, వారి నాణేలే ప్రధాన ఆధారం. ఇండో-గ్రీక్ రాజులకు సంబంధించి, జస్టిన్, స్ట్రాబో మొదలైన రచయితల రచనల వల్ల, ఆ పాలకుల్లో, ఒక అర్ధ శతాబ్ది కాలం పరిపాలించిన నలుగురు, లేదా అయిదుగురి పేర్లే తెలిశాయి. కాని, వారి నాణేలు లభించటంతో, మొత్తం 37 గురు రాజులు సుమారు 250 సంవత్సరాలు పరిపాలించిన విషయం తెలుస్తున్నది. ఈ నాణేలే లభించకుంటే, ఇక వీరి సమకాలీనులైన ఇండో-సిథియన్ పాలకుల స్థితి, మరింత దయనీయం. వారి నాణేలే లభించకుంటే, వోనేనెస్, స్పాలిరైజేస్, స్పాలాహోరెస్, స్పాలాగడామెస్, మొదటి ఏజెస్, ఎజిలెసెస్, రెండో ఏజెస్ మొదలైన ఇండో-సిథియన్ రాజుల పేర్లే, మనం విని ఉండే వారం కాదు. ఎందుకంటే, ఏ చరిత్రకారుడూ, ఏ యాత్రికుడూ -- స్వదేశీయుడైనా, విదేశీయుడైనా --- ఈ పాలకుల గురించి ఈషణ్మాత్రం పేర్కొనలేదు. అంతేగాక, ఈ ఇండో-గ్రీక్‌ల ఇండో-సిథియన్ల నాణేల వల్లనే, ఆ

రాజుల పేర్లు తెలుసుకోగలగటమే గాక, ఎవరి తరవాత ఎవరు సింహాసనం అధిష్ఠించారన్న వారసత్వ క్రమాన్ని కూడా, నిర్ణయించటానికి వీలౌతున్నది

భారత వాయవ్య ప్రాంతంలో, ఇండో-సిథియన్ల పాలనకు స్వస్తి చెప్పి, వారి స్థానాన్ని అలంకరించిన ఇండో -పార్థియన్ల చరిత్ర విషయంలో, మన పరిజ్ఞానం కొంత మెరుగే. కారణం, ఈ రాజ వంశ స్థాపకుడైన గండోఫర్నెస్ (Gondopharnes) కి సంబంధించిన శాసనం ఒకటి, క్రైస్తవ మతాచార్యుడు థామస్‌కి చెందిన గాథ ఒకటి, కొంత సమాచారాన్ని తెలుపుతున్నాయి. కాని, అతని అనంతరం పాలించిన అబ్‌డ్గాసెస్, ఆర్థాగ్నెస్ పాకోరెస్ మొదలైన వారి మాటేమిటి? వారి నాణేలే దొరకక పోయుంటే, వారి గురించి ఎవరికి మాత్రం ఏమి తెలిసేది? అలాగే, కుషాణులకు సంబంధించి, కనిష్కుడు, హువిష్కుడు, వాసుదేవుడు మొదలైన వారి శాసనాలు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే లభించాయి. వారి గురించి సమాచారం విశేషంగానే, ఈ శాసనాల ద్వారా తెలుస్తున్నది. కాని, కనిష్కునికి పూర్వం పరిపాలించిన తొలి కుషాణ రాజైన కుజుల కాడ్‌ఫిసెస్, వీమా కాడ్‌ఫిసెస్‌ల గూర్చి తెలుసుకోటానికి ఉన్న ఏకైక ఆధారం, నాణేలే.

ఆంధ్ర శాతవాహనుల సమకాలీనులైన పశ్చిమ క్షాత్రపుల్లో, క్షహరాటులు, కార్దమకులు ఉన్నారు. క్షహరాట వంశంలో మొదటి పాలకుడు భూమకుడనే విషయం, గుజరాత్, మాళ్వాల్లో దొరికిన అతని నాణేలు తెలియజేస్తున్నాయి. అదే విధంగా, కార్దమక రాజవంశ స్థాపకుడైన చష్టనుడు, అతని మనుమడు రుద్రదమనులు కాక, ఆ వంశంలో ఇంచుమించు క్రీ.శ 2వ శతాబ్దం ద్వితీయార్థం నుండి, క్రీ.శ. 4వ శతాబ్దం చివరి వరకు పరిపాలించిన కార్దమక క్షాత్రప రాజుల, పేర్లు, బిరుదులు, వారసత్వ క్రమం, ఎవరెవరు ఎంతెంత కాలం పరిపాలించిందీ, ఒక్కొక్క సందర్భంలో, ఆయారాజులు సింహాసనాన్ని అధిష్ఠించిన సంవత్సరాలను నిశ్చితంగా తెలుసుకోటానికి, వారి నాణేలే ఆధారంగా ఉన్నాయి.

క్రీస్తు శక ఆరంభ శతాబ్దాల్లోనే ఉత్తర భారతంలో, వివిధ ప్రాంతాలను పరిపాలించిన యౌధేయులు, అర్జునాయనులు, మాళ్వులు, ఔదుంబులు, కుణిందులు మొదలైన గణ రాజ్యాల వారి చరిత్రలను తెలుసుకోటానికి కూడా, వారి నాణేలే ప్రధాన ఆధారం. నాణేలను బట్టి ఆయా తెగలను, వారి ఆక్రమణ ప్రాంతాలను గుర్తించ వీలవుతున్నది. ఈ గణతంత్ర తెగల్లో, సుప్రసిద్ధులైన యౌధేయుల నాణేలు సట్లెజ్ ప్రాంతంలో లభించాయి. దీంతో, సట్లెజ్ నది కిరువైపులా నివాసాన్ని ఏర్పాటు చేసుకున్న జోహియులే యౌధేయులనీ, ఆ ప్రాంతం ఆ తర్వాత కాలంలో, జోహియ బార్‌గా ప్రసిద్ధికెక్కిందనీ, అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ వెలిబుచ్చిన అభిప్రాయానికి ప్రాతిపదిక లభించినట్లైంది. యౌధేయుల నాణేల సహాయంతోనే, వారు కుషాణులకు కొంతకాలం లోబడి ఉండి, క్రీ.శ. 2వ శతాబ్దంలో బలోపేతులై, కుషాణ రాజ్య పతనానికి కూడా, కారకులై ఉంటారని చరిత్రకారులు నిర్ణయిస్తున్నారు. మాళ్వుల విషయాన్ని తీసుకుంటే, మధ్య భారతంలో ఉన్న ప్రస్తుత మాళ్వా ప్రాంతం వారక్కడ నిలదొక్కుకున్నాక, ఆ పేరుతో ఆ ప్రాంతం వ్యవహారం లోకి వచ్చిందనీ, వారు నిజానికి పంజాబ్ ప్రాంతం నుండి వలస వచ్చారనీ, పంజాబ్‌లో లభించిన వారి నాణేలను బట్టి, చరిత్రకారులు నిర్ధారించారు. అదే విధంగా, శిబి తెగ రాజస్థాన్‌లోని చిత్తోడ్‌గఢ్ ప్రాంతంలో ఉన్న నగరీ పురవాసులని గుర్తించబడింది.

తొలి శాతవాహన రాజుల నాణేలు ఇటీవలి సంవత్సరాల్లో, తెలంగాణా ప్రాంతాల్లో బయల్పడ్డాయి. అటువంటి వాటిలో, 'సాద్వాహన' అనే ఆఖ్యతో ఉన్న కొండాపూర్ నాణేలు, ముఖ్యమైనవి. లిపి పరిణామ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఈ కొండాపూర్ నాణేలు క్రీ.పూ. మూడో శతాబ్దానికి చెందినవిగా భావింప వీలౌతున్నది. పి.వి. పరబ్రహ్మ శాస్త్రి కరీంనగర్ జిల్లాలో గోదావరీ నది కుడి వైపు తీరంలోగల కోటిలింగాల గ్రామ సమీపంలో ఉన్న మునుల గుట్ట నుండి, సుమారు వందపైగా నాణేలను సేకరించగా, అందులో ఏడు నాణేలు శాతవాహనుల్లో మొదటి రాజైన శ్రీముకుడివి. ఈ నాణేలపై ఉన్న అఖ్యను ప్రాతిపదికగా చేసుకొని, కొండాపూర్ నాణేలపై శాతవాహనుడు శ్రీముకుడేననీ, ఇతడే, నానాఘాట్ లేబుల్ శాసనంలో, శ్రీముక శాతవాహనుడిగా వ్యవహరింపబడినాడని గుర్తింపబడింది.

జైన గ్రంథాలు పేర్కొంటున్న మొదటి ఆంధ్ర రాజు శాతవాహనుడు, కథాసరిత్సాగరం గాథలో చెప్పబడ్డ శాతవాహనుడు, ఈ కొండాపూర్, కోటిలింగాల నాణేల సాద్వాహన, సిముక శాతవాహను లొక్కరే అనీ, అతడే ఆంధ్ర సామ్రాజ్య మూల పురుషుడనీ, అతని పేరు మీదే, అతని తరువాత పరిపాలించిన రాజులు శాతవాహనులుగా వ్యవహరింపబడినారని నిర్ధారించబడింది. అంతేగాక, శాతవాహనులు తొలినుండీ, 'ఆంధ్ర ప్రాంతంతో అనుబంధం ఉన్నవారే' నన్న విషయం, ఈ కోటిలింగాల, కొండాపూర్ నాణేలు బయల్పడటం వల్ల నిరూపిత మవటంతో, శాతవాహనులు ఆంధ్రులేననే వాదానికి, మరింత బలం చేకూరినట్లైంది.

మహారాష్ట్రలోని జోగెల్ తంబి ప్రాంతం నుండీ లభించిన నాణె రాసిలో, అధిక సంఖ్యలో ఉన్న శాతవాహన చక్రవర్తి గౌతమీపుత్ర శాతకర్ణి ప్రతిముద్రిత (restruck) క్షహరాట క్షాత్రప నహపాణుని నాణేలు, శాతవాహనుల చేతిలో నహపాణుడు ఓడినాడనే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. అదే విధంగా, కుమారదేవి - చంద్రగుప్తుల ప్రతిమతోపాటు 'లిచ్ఛావయః' అనే ఆఖ్య ఉన్న గుప్తుల నాణేలు, గుప్త రాజ్య ప్రాబల్యానికి లిచ్ఛవీయులు నిర్వహించిన ప్రధాన పాత్రను నొక్కి చెప్తున్నాయి. సముద్రగుప్తుడు తన సైనిక విజయాల అనంతరం, అశ్వమేధయాగం చేసిన విషయాన్ని తెలియజేస్తున్న సమకాలీన సాక్ష్యం, అతని అశ్వమేధ రక నాణేలే. రెండో చంద్రగుప్తుడు గుజరాత్‌లో చిరకాలం నుండి పాలిస్తున్న కార్దమక క్షాత్రపులను (శకులను) తుద ముట్టించి, ఆ ప్రాంతంలో చలామణీకి క్షాత్రపుల నాణేల పోలికల్లోనే, వెండి నాణేలను జారీ చేసాడు. కచ, రామ గుప్తుల నాణేలు, వారి చారిత్రకత పై వెలుగును ప్రసరిస్తున్నాయి. విజయనగర చక్రవర్తి కృష్ణదేవరాయలు బాల కృష్ణుని ప్రతిమ గల నాణేలను ముద్రింప జేసాడు. ఇవి, అతని ఉదయగిరి విజయాన్ని ధృవపరుస్తున్నాయి.

కొన్ని సందర్భాల్లో, నాణేలు ఆయా రాజుల వ్యక్తిత్వాన్ని, వ్యక్తిగత అభిరుచుల్నీ అంచనా వేయడానికి తోడ్పడుతున్నాయి. గుప్త చక్రవర్తి సముద్రగుప్తుని వివిధ రకాల నాణేలు అతనికి వేటలో, విలు విద్యలో, యుద్ధ క్రీడలో, వీణావాదనంలో గల ఆసక్తిని, అభినివేశాన్ని, ఇతర గుణగణాలను వ్యక్తం చేస్తున్నాయి. నాణేలు కేవలం రాజ వంశాలు, రాజుల పేర్లు, బిరుదులు, వంశ క్రమం, పరిపాలనా కాల సంవత్సరాలు, సైనిక విజయాలు, పరిపాలన, రాజుల వ్యక్తిత్వం, వారి వ్యక్తిగత అభిరుచులు మొదలైన అంశాలకే పరిమితం కాక, ఆయా పాలకులు అనుసరించిన మత సంప్రదాయాలనూ తెలియజేస్తున్నాయి. ఇండో-గ్రీక్‌ల నాణేలపై ముద్రించిన కొంతమంది గ్రీక్ దేవతల ప్రతిమల

BRAOU

చిత్రీకరణలో, కొన్ని హైందవ రీతులు కన్పిస్తున్నాయని నిపుణుల భావన. ఈ నాణేల మీద వాడిన అనేకమైన బిరుదుల్లో, కొన్ని హిందూ పదాలు కూడా ఉన్నాయని వీరి అభిప్రాయం. ఇండో-పార్థియన్ రాజు గండోఫర్నెస్ నాణేలపై శివుని ప్రతిమ, 'దేవవ్రత', 'సుదేవవ్రత' అనే పదాలున్నాయి. కుషాణ వీమాకాడ్‌ఫిసెస్ ప్రవేశపెట్టిన బంగారు నాణేలు కొన్నిటి మీద, 'మహేశ్వర' అనే పదం కనిపిస్తున్నది. ఇతని నాణేలకు మరోవైపున త్రిశూలం, నంది, శివుని ప్రతిమలు చిత్రించబడ్డాయి. కనిష్కుడు, హూణుడైన మిహిరకులుడు తదితరుల నాణేలూ, హైందవ చిహ్నాలతోనే ఉన్నాయి. వీటినిబట్టి, విదేశీయుల హైందవీకరణ, వారి హైందవ మత ధర్మానుసరణ స్పష్టమవుతున్నాయి. ఇదే విధంగా, గుప్తుల నాణేలపై చెక్కిన గరుడ లాంఛనం, లక్ష్మి మొదలైనవి, వారి వైష్ణవ మతాభిమానాన్ని చాటుతున్నాయి. శివుణ్ణి పూజించటం, లింగాన్ని పూజించటం రెండూ ఒకటేననే విషయం, వాసుదేవ కుషాణుడి కాలాన్ని గుర్తింప వీలుపడింది. నాణేలపై చిత్రించిన శివుడు, పార్వతి, లక్ష్మి మొదలైన ప్రతిమలు, ప్రతిమా లక్షణ శాస్త్ర చరిత్ర అధ్యయనానికి తోడ్పడుతున్నాయి. విగ్రహారాధన పద్ధతుల్ని, పరిణామాలనూ తెలియజేస్తున్నాయి. కార్తికేయుణ్ణే స్కంధ, విశాఖ, కుమార, మహాసేన అనే పేర్లతో మనం ఇపుడు వ్యవహరిస్తుంటే, ఈ నాలుగు పేర్లూ ప్రాచీన కాలంలో భిన్నమైన నలుగురు దేవతలవనే విషయం, నాణేలే స్పష్టం చేశాయి.

నాణేలు, ఆయా రాజ్యాల ఆర్థిక స్థితిగతుల్ని కూడా ప్రతిబింబిస్తాయి. గుప్త సామ్రాజ్యం ఉచ్ఛ దశలో ఉండగా, ప్రకటించిన బంగారు నాణేల్లో అపద్రవ్యం (Alloy) పది శాతం మాత్రమే ఉండేది. అయితే, స్కంద గుప్తుడు, నరసింహగుప్త బాలాదిత్యుల కాలంలో, హూణులతోనూ, తదితరులతోనూ జరిగిన యుద్ధాల వల్ల, ప్రభుత్వ ఆర్థిక స్థితి దిగజారటాన్ని, వారి కాల బంగారు నాణేల్లోని అపద్రవ్యం ఇరవై ఎనిమిది శాతం వరకూ, కొన్నింటిలో నలభై ఆరు శాతం వరకూ ఉన్న పెరుగుదల నిరూపిస్తున్నది. పశ్చిమాసియా ప్రాంతాల్లో దొరికిన హరప్పా ముద్రలు, దక్షిణ భారతదేశంలో అరికమేడు, గుడివాడ మొదలైన ప్రాంతాల్లో లభించిన రోమన్ బంగారు నాణేలు, బర్మా, ఆరకాన్ ప్రాంతాల్లో లభించిన తూర్పు వేంగి చాళుక్య పాలకులైన, 'చాళుక్య చంద్ర' మొదటి శక్తివర్మ, రాజరాజ నరేంద్రుల బంగారు నాణేలు విదేశాలతో, మనకున్న వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలను వెల్లడిచేస్తున్నాయి.

BRAOU

నాణేలపై చెక్కిన ప్రతిమలు, లాంఛనాలు, ఇతర చిహ్నాలు, నాణేల స్వరూపం, ఆయా కాలాల పరిపాలకుల, ప్రజల కళా దృక్పధానికి సాక్ష్యాలు. అవే, ప్రతిమా లక్షణ శాస్త్ర అధ్యయనానికి సాధనంగా కూడా, సహాయపడుతున్నాయి. నాణేల మీద ఉన్న ఆఖ్యలు నాటి ప్రజల సాహితీ ప్రియత్వాన్ని చాటుతున్నాయి. గుప్తుల నాణేలపై ఉన్న ఛందోబద్ధ కవిత్వం, నాటి పాలకుల అభిరుచికి నిదర్శనం. వివిధ భాషల విపుల పరిణామాలను నాణేలు ప్రస్ఫుటం చేస్తున్నాయి.

మొగల్ చక్రవర్తుల నాణేలు వివాదాస్పదమైన తేదీలను నిర్ధారించటంలోను, నాటి ఆర్థిక స్థితిగతులను, చక్రవర్తుల గుణగణాలను తెలుసుకోడానికి ఉపయోగపడుతున్నాయి. షేర్షా, అక్బర్‌లు నాణేల ముద్రణలో ఎన్నో మార్పులను తెచ్చారు. అక్బర్ ప్రారంభించిన 'దైవీ శకం' అతనితోనే అంతరించినట్లు, నాణేలు తెలియజేస్తున్నాయి. జహంగీర్‌కు నూర్జహాన్ మీద, మద్యం మీద ఉన్న ప్రేమాతిశయాన్ని, అతని నాణేలు వెల్లడిస్తున్నాయి. లోపాలు ఎన్ని ఉన్నా, ప్రాచీన భారతదేశ చరిత్ర రచనలో, నాణేలు ఒక ముఖ్య ఆధారంగా సహాయ పడుతున్నాయనేది నిర్వివాదాంశం.

## 7.10 సంగ్రహంగా

చరిత్ర నిర్మాణంలో చరిత్ర ఆధారాలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. భారతదేశ చరిత్ర పునర్నిర్మాణంలో, అనేక యిబ్బందులు ఎదురవుతున్నాయి. అయితే, వీటి నధిగమించి, పురావస్తు ఆధారాలు, శాసనాలు, నాణేల సహాయంతో, మన దేశ ప్రాచీన చరిత్రను సమగ్రమైన, సమరస రూపంగా తీర్చిదిద్దటం జరుగుతున్నది.

## 7.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. చరిత్ర రచనలో ఎదురౌతున్న ఇబ్బందులను గూర్చి చర్చించండి.
2. ప్రాచీన, మధ్య యుగ భారతదేశ చరిత్ర పునర్నిర్మాణానికి పురావస్తు ఆధారాల తోడ్పాటును వివరించండి.
3. ప్రాచీన భారతదేశ చరిత్ర పునర్నిర్మాణంలో శాసనాల ప్రాముఖ్యతను చర్చించండి.
4. ప్రాచీన, మధ్యయుగ భారతదేశ చరిత్ర పునర్నిర్మాణానికి నాణేలెలా ఉపకరిస్తున్నాయి?

II. **క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చరిత్ర ఆధారాల ఆవశ్యకతను తెల్పండి.
2. చరిత్ర ఆధారాల్లోని ముఖ్య రకాలేవి?

BRAOU

## 7.12 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Majumdar, R.C. & Pusalkar, A.D. (eds) | : | **The Vedic Age, Bharatiya Vidya Bhavan Series, Vol-I** |
| Sen, S.P. (ed) | : | **Sources of Indian History, Vol-I** |
| Neelakanta Sastry, K.A. | : | **Sources of Indian History with special reference to South India** |
| Neelakanta Sastry, K.A. | : | **History of India, Vol-I** |
| Neelakanta Sastry, K.A. | : | **A History of South India** |
| Sathianatha Aiyar, R. | : | **History of India, Vol-I** |
| Romila Thapar | : | **History of India, Vol-I** |

Sankalia, H.D. : An introduction to Indian Archaeology

Sircar B.C : Indian Epigraphy

Rajbali Pandey : Indian Epigraphy

Ramesh K.V. : Indian Epigraphy

Ojha G.S. : ప్రాచీన భారతీయ లిపిమాల

Siva Rama Murthy, C. : Indian Epigraphy and South Indian Scripts.

Bhandarkar, D.R. : Lectures on Ancient Indian Numismatics

Sircar D.C. : Studies in Indian coins

రచయిత :జొన్ని దుర్గాప్రసాద్

BRAOU

# భాగం-8 : సాహిత్యం

విషయ క్రమం


8.0 లక్ష్యాలు

8.1 పరిచయం

8.2 సాహిత్యం - చరిత్ర

8.3 సాహిత్య విశ్లేషణా పద్ధతి

8.4 సాహిత్యాధారాలు

8.4.1 సంప్రదాయ సాహిత్యం

8.4.2 భారతీయ, ఇతరేతర వాఙ్మయంలోని చారిత్రక ప్రస్తావనలు

8.4.3 జీవిత చరిత్రలు

8.4.4 స్వీయ చరిత్రలు

8.4.5 దిన చర్యలు - ఉత్తరప్రత్యుత్తరాలు

8.4.6 స్మృతులు, జ్ఞాపకాలు

8.4.7 భారతదేశ చరిత్రకు ఉపకరించే విదేశీయుల రచనలు

8.5 సంగ్రహంగా

8.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

8.7 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 8.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- చరిత్ర ఆధారాలను పేర్కొనగలగాలి.
- చరిత్రకు, సాహిత్యానికి వున్న సంబంధాన్ని విశ్లేషించగలగాలి.
- చరిత్ర రచనకు సాహిత్య ఆధారాలను వివరించగలగాలి.

## 8.1 పరిచయం

చరిత్ర రచనకు ఆధారాలు కావాలి. ఇవి వివిధ రకాలు. చరిత్ర పునర్నిర్మాణానికి గల ముఖ్య ఆధారాల్లో, సాహిత్యం ఒకటి. సాహిత్యంలో అనేక ప్రక్రియలున్నాయి. దేశీయుల, విదేశీయుల రచనలు

వున్నాయి. ప్రాచీన సాహిత్యం నుండి, ఆధునిక సాహిత్యం వరకూ వచ్చిన మొత్తం సాహిత్యాన్ని భిన్న రూపాల్లో విభజించి, వాటిలోని చారిత్రకాంశాల్ని చరిత్రకారుడు ఉపయోగించుకొంటాడు.

## 8.2 సాహిత్యం - చరిత్ర

సాహిత్యం, చరిత్ర రెండూ పరస్పర సన్నిహిత సంబంధం కలిగి, 19వ శతాబ్దం వరకు, సాహిత్యంలో చరిత్ర ఒక భాగంగా పరిగణించబడింది. చరిత్ర మానవ జీవితాన్ని రికార్డ్ చేస్తుంది. సాహిత్యం అదే మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ రెండూ వెలుగునీడల్లాగా ఒకదాన్నొకటి కలసి ఉండటాన్ని గమనిస్తాం. సమాజంలోని మానవుడే, ఈ రెంటికి కేంద్ర బిందువు. ప్రముఖ చరిత్రకారులైన గిబ్బన్, మెకాలే తదితరులు, చరిత్రకు అనూహ్యమైన రీతిలో సాహిత్య ప్రతిపత్తిని, రూపాన్ని కల్గించారు. ఈ క్రమంలోనే, సాహితీపరులుగా ఉండి, ప్రముఖ చారిత్రక నవలలను రచించిన వోల్టేర్, స్కాట్, అలెగ్జాండర్ డ్యూమా, విక్టర్ హ్యూగో, టాల్‌స్టాయ్ మున్నగువారు అటు సాహిత్యాన్ని, ఇటు చరిత్రను సంపన్నం చేశారు. తెలుగు సాహిత్యంలో కూడా, అనేక చారిత్రక నవలలు వచ్చాయి. మధ్య యుగాల చరిత్రకు చెందిన 'రుద్రమ దేవి' నవలను నోరి నరసింహశాస్త్రి రచించారు. ఆధునిక కాలానికి చెందిన సాంఘిక నవలలు అనేకం ఉన్నా, వాటిలో పేరెన్నికగన్నది, ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన 'మాలపల్లి'.

చరిత్ర పరిధి కాలక్రమంలో మారుతూ, పెంపొందుతూ వచ్చింది. నేడు మనం చరిత్రకిస్తున్న నిర్వచనం ప్రకారం, ప్రజా జీవితాన్ని అది మరింతగా చిత్రించగలగాలి. కేవలం రాజకీయాంశాలు మాత్రమే కాకుండా, సమాజ జీవిత అన్ని కోణాలను విశ్లేషించాలి. గతానుభవంతో, చరిత్ర వర్తమానంలోని సమస్యలకు సరైన పరిష్కార మార్గాలను సూచించాలి. మార్లే అన్నట్టు, " I do not in the least want to know what happened in the past except as it enables to see my way more clearly through what is happening today". అంటే, "చరిత్ర గతాన్ని గురించి అధ్యయనం చేసినా, అది వర్తమానాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడాలి." ఇ.హెచ్ కార్ అన్నట్లు, 'చరిత్ర మొత్తం వర్తమాన చరిత్ర". చరిత్ర వల్ల లభించే ప్రయోజనాల్లో, మానవ సమాజాన్ని గురించిన పరిజ్ఞానాన్ని అది మనకందివ్వడం అనేది, ఒక ముఖ్యాంశం. ఒక యుగాన్ని, లేదా ఒక భాగాన్ని చరిత్రలో మనం అధ్యయనం చేస్తున్నప్పుడు, అప్పటి పరిస్థితులకు ఆ అధ్యయనాన్ని అన్వయించుకోవాలి. అంటే, ఆనాటి సమాజాన్ని, అందులోని మానవుల్ని, యుగ పరిస్థితులతో అన్వయించడమేకాక, వాటితో మేళవించి అర్థం చేసుకోవాలి. గతకాల అనేకానేక సామాజిక సంస్థల్ని, ఇప్పటి ఆధునిక వెలుగులో పరిశీలించడం సరైంది కాదు. గతాన్ని బేరీజు వేస్తున్నప్పుడు దాని కవసరమైన పరికరాల్ని, ఆధారాల్ని నిక్కచ్చిగా ఎంచుకోవాలి. అంటే, చరిత్రకారుడికి నిర్దుష్టమైన శాస్త్రీయ దృష్టి అవసరం.

సాహిత్యంతో చరిత్రకారుడికి సామాన్య పరిచయమైనా ఉండాలి. ప్రాచీన కవిత్వం, ఇతిహాసాలు, యాత్రా గ్రంథాలతో పాటు, భాషా శాస్త్రానికి సంబంధించిన పరిచయం కూడా కొంత అవసరం. లలితకళలను గూర్చిన పరిచయం, వాటిని గూర్చి కొంత రాయడానికి తత్వశాస్త్ర పరిచయం, మానవుల భౌతిక, నైతిక పరిణతి క్రమాన్ని తెలియజేయడానికి తోడ్పడుతుంది. అలాగే, ఇతర దేశాల చరిత్రలతో పరిచయం తులనాత్మక చరిత్రను రచించడానికి ఉపయోగపడుతుంది.

BRAOU

## 8.3 సాహిత్య విశ్లేషణా పద్ధతి

మానవ జీవితాన్ని మేధావరంగా వ్యక్తీకరించేది సాహిత్యం. చరిత్ర గతిలో సామాజిక చైతన్యాన్ని సాహిత్యం ప్రతిబింబిస్తుంది. అందువల్ల, చారిత్రక గతి పునర్నిర్మాణంలో అప్పుడున్న ప్రబలమైన సాంస్కృతిక పరిస్థితులను మాత్రమే కాక, ఆనాటి ప్రజల ప్రాపంచిక దృక్పథాన్ని కూడా, సాహిత్యం తెలియచేస్తుంది. సాంప్రదాయిక, సాహిత్య - సంస్కృతీ సిద్ధాంతాల్లో, సాహిత్య చరిత్రను కేవలం, కొంతమంది సాహిత్య సృష్టిగానే పరిగణించారు. ఈ అవగాహన ప్రకారం, సాహిత్య చరిత్ర, వ్యక్తుల దృక్పథాలను, వారి రచనలను, ప్రయోగాలను మాత్రమే గణనలోకి తీసుకొంటుంది. ఇలాంటి రచనలు కొంత సాహిత్య ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నా, అవి కేవలం సాహిత్య ఉత్పత్తిలో భాగంగా, సాహిత్యం కోసమే జరిగాయన్న వాదనను బలపరుస్తాయి. అలా కాకుండా, ఈ క్రమాన్ని ఒక బృహత్తర చారిత్రక క్రమంలో సాహిత్యోత్పత్తి ఒక ముఖ్య భాగమేనన్న విషయాన్ని విస్మరించాయి. 'కళ కళ కోసమే' అనే ఈ ధోరణి, ఆనాటి మేధావులు శ్రమ చుట్టూ ఉన్న సామాజిక వాతావరణానికి దూరంగా ఉండిపోయి, సమాజంలో సామరస్యాన్ని సాధించకపోవడం వల్ల కలిగింది.

ఈ సాంప్రదాయ సాహిత్య దృక్పథం, రాజకీయంగా, సైద్ధాంతికంగా, చరిత్రలో సాహిత్యం నిర్వహించే పాత్రను తగ్గిస్తుంది. అంతేకాక, సాహిత్యం ఏ విధంగా పాలక వర్గాల అభిరుచులను, అభిప్రాయాలను, ఆకాంక్షలను తెలియచేస్తుందన్న ముఖ్యాంశాన్ని మరుగున పెడ్తుంది. అందువల్ల, మనం సాహిత్య సృష్టిని, సంప్రదాయిక రీతి నుండి పరిశీలించే పద్ధతిని విడనాడాలి. ప్రత్యామ్నాయ సాహిత్య విశ్లేషా పద్ధతి ద్వారా, సామాజిక క్రమంలో సాహిత్యం నిర్వహించే పాత్ర గురించి, అర్ధవంతమైన అవగాహనను అలవర్చుకోవాలి. చారిత్రక, భౌతికవాద ప్రభావంలో రూపొందిన సాహిత్య, కళా సిద్ధాంతాల ఒరవడిలో, సాహిత్య ఉత్పత్తిని అర్థంచేసుకునే పద్ధతిలో, విశ్లేషణలో గణనీయమైన మార్పు వచ్చింది. కార్ల్‌మార్క్స్ సాహిత్యాన్ని ఒక సామాజికాంశంగా, ఒకానొక చారిత్రక యుగంలో ప్రతిఫలించే సామాజిక క్రమంగా పేర్కొన్నాడు. ఏంజెల్స్ తన నిశితమైన సాహిత్య పరిశీలనలో, ఫ్రెంచ్ విప్లవంనాటి ఫ్రాన్స్ సమాజాన్ని సాహితీకారుడు బాల్ జాక్ (Balzac) రాసిన తీరు, అప్పటి చరిత్రకారుల రచనల కంటే ఎంతో వాస్తవంగా, క్షుణ్ణంగా, స్పష్టంగా ఉందన్నాడు. ఈ సందర్భంలోనే ప్రముఖ ఆంగ్ల నవలాకారుడు థామస్ హార్డ్ రాసిన నవల, ట్రంపెట్ మేజర్ (Trumpet Major) కు బార్బరా హార్డీ రాసిన ఉపోద్ఘాతం గమనించదగ్గది. ఇందులో, అనేక చారిత్రక అంశాలు చోటుచేసుకొన్నాయి. చరిత్రకారులు రాయకూడనివి, నవలాకారులు రాయాల్సినవి కొన్ని ఉన్నాయని, ఈ ఉపోద్ఘాతంలో ఆమె పేర్కొన్నారు. ఆమె ఉద్దేశంలో, ఏ సామాన్య మానవుల జీవితాన్ని గూర్చి చరిత్రకారులు రాయాలనుకొంటున్నారో, వారి జీవిత చిత్రికల్ని నవలాకారుడు ఊహాజనితమైన పాత్రలను సృష్టించడం ద్వారా చెప్పగలడు. కానీ, చరిత్రకారుడు ఊహాజనిత పాత్రలను, వ్యక్తులను సృష్టించలేడు కదా! సృష్టించ కూడదు కదా! కాబట్టి, సాహిత్యం, చరిత్ర - ఈ రెండూ అటు చరిత్రకారులకు, ఇటు సాహిత్యకారులకు పనికొచ్చే చక్కని కార్య రంగం. ఇందులో, వీరిద్దరూ పరస్పర ప్రయోజనాల్ని పొందవచ్చు. మానవాళి అనుభవ స్వభావాన్ని, సారాన్ని వీరు మరింతగా ప్రకాశింప చేయగలరు.

BRAOU

సాహిత్యంలో రెండు పొరలున్నాయి. ఒకటి సమాజంలో వస్తున్న అతి ముఖ్య, లేక, ప్రాథమిక పరిస్థితులను తెలియచేయడం. ఇది, ఆనాటి పాలక, బలీయ వర్గాలు సృష్టించే సాహిత్యం. రెండోదైన తద్వ్యతిరేక భిన్న సాహిత్యంలో, సమాజంలోని వైరుధ్యాలు, వర్గ కలహాలు చోటుచేసుకొంటాయి. సాహిత్య సృష్టి ఆ కాల ఉత్పత్తి, మార్పిడి విధానంపై, సామాజిక నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది. ఒకానొక సామాజిక నిర్మాణంలో ఏ వర్గమైతే బలమైన భౌతిక శక్తిగా, పాలక వర్గంగా ఉంటుందో, అదే, సంఘటితమైన మేధాశక్తిగా రూపొంది, ఆ వర్గ భావజాలాన్ని, అసమాన సాంఘిక సంబంధాలు, సాహిత్య సృష్టి ద్వారా సమర్థించి, దృఢతరం చేస్తుంది.

ఇటీవలి కాలంలో, పై సిద్ధాంతానికి మరికొన్ని వివరణలను గ్రామ్సి (Gramsci), రేమండ్ విలియమ్స్ (Raymond Williams) అనే చరిత్ర, సాహిత్య, సిద్ధాంతకారులు చేర్చారు. వీరి అభిప్రాయంలో, సాహిత్యం పాలక వర్గాలకు మాత్రమే, ఒక బలమైన సాంస్కృతిక శక్తిగా ఉండదు. అది, అణచబడ్డ శక్తులకు, లేక వర్గాలకు కూడా బలమైన ఆయుధం. సమాజంలో పెత్తనం చెలాయిస్తున్న భావజాలాన్ని మాత్రమే వ్యక్తీకరింపక, ప్రచారం చేయకుండా, పునఃసృష్టి చేయకుండా, వీటికి ప్రత్యామ్నాయ భావజాలాన్ని, ప్రాపంచిక దృక్పథాన్ని, సాంస్కృతిక విలువలను కూడా, సాహిత్యం వ్యక్తీకరిస్తుందన్న కొత్త భావాలను వీరిద్దరూ ప్రాచుర్యంలోకి తెచ్చారు. అందువల్ల, ఏకాల సాహిత్యంలోనైనా, అప్పటి సమాజంలో పెత్తనం వహించే భావజాలం, ఆ పెత్తనాన్ని సవాలు చేసే ప్రతి - భావజాలం, ఈ రెంటిని సాహిత్యం ద్వారా, మనం చూడగలగాలి. ఏ కళా రూపం కూడా, సామాజిక క్రమం నుండి విడివడి ఉండలేదన్న సామాన్య సూత్రాన్ని, మనం అర్థం చేసుకుంటే, భిన్న భావాల మధ్య, సాంస్కృతిక పద్ధతుల మధ్య, నిరంతర పోరాటం సాగుతూ ఉంటుందన్న విషయం అర్థమౌతుంది. కాబట్టి, చురుకైన ఈ సామాజిక క్రమాన్ని ప్రతి చారిత్రక దశలోను ఉత్పత్తి అయ్యే సాహిత్యంలో చూడగలగాలి. ఆ విధంగానే, సాహిత్యాన్ని కూడా, ఇదే సామాజిక క్రమంలో పరిశీలించినపుడు, చరిత్ర రచనకు సాహిత్యం ఒక బలమైన పనిముట్టుగా ఉపకరిస్తుంది.

BRAOU

## 8.4 సాహిత్యాధారాలు

సాహిత్యధారాలను క్రింది విధంగా విభజింపవచ్చు.

1. సంప్రదాయ సాహిత్యం
2. భారతీయ, ఇతరేతర వాఙ్మయంలోని చారిత్రక ప్రస్తావనలు
3. జీవిత చరిత్రలు
4. స్వీయ చరిత్రలు
5. దినచర్యలు - ఉత్తర ప్రత్యుత్తరాలు
6. స్మృతులు, జ్ఞాపకాలు
7. భారతదేశ చరిత్రకు ఉపకరించే విదేశీయుల రచనలు

## 8.4.1 సంప్రదాయ సాహిత్యం

జానపద సాహిత్యం, కళలు ప్రధానంగా మౌఖిక సాంప్రదాయానికి చెందినవి. క్రమేపీ, అక్షర రూపం దాల్చుతాయి. భారతదేశం లోని ఇతిహాసాలకు, పురాణాలకు, జైన, బౌద్ధ మత సాహిత్యానికి, అలాగే, హోమర్ రాసిన 'ఇలియడ్' ఇతిహాసానికి, బైబిల్‌కు, మధ్య యుగాల ఆర్థర్ వీరుని గూర్చిన ప్రాచీన గాధలకు ఇది వర్తిస్తుంది. వీటిలో, చారిత్రక సత్యం కొద్దిగానే ఉన్నా, చరిత్ర రికార్డు కాని ముందు కాలానికి ఈ ఆధారాలు ముఖ్యంగా పనికొస్తాయి. పురాణాల్లోని విషయాలు మత సంబంధమైనవైనా, అవి రాజ వంశాలను గూర్చి, ఆ వంశాల్లో రాజుల గూర్చి, చారిత్రక సమాచారాన్ని అందిస్తాయి. రాజకీయ చరిత్ర రచనకు ఇవి నిస్సందేహంగా పనికొస్తాయి. ఇటీవలి కాలంలో పురాతన తవ్వకాల ద్వారా, చారిత్రకాధారాలు ఎన్నో లభించాయి. కాని, అవి లభ్యంకాని దశలో, అలెగ్జాండర్ దండయాత్రకు ముందున్న భారతదేశ చరిత్రకు చాలావరకు, పైన ఉదహరించిన మత సాహిత్యాధారాలు ఎంతగానో ఉపకరించాయి. పురాణాలపై విశేష పరిశోధన జరిపిన పార్గిటర్ పండితుని అభిప్రాయంలో, ఇతిహాసాల్లో, పురాణాల్లో లభ్యమయ్యే రాజ వంశాల సమాచారంలో, కాల క్రమానుసార చరిత్రను నిర్మించడం సాధ్యం. ఉదాహరణకు, అశోకుని వారసుల్లో ఒకడుగా పురాణాలు చెప్పిన శాలి శుకుడు చారిత్రక వ్యక్తిగా గార్గిసంహితలో చెప్పడం వల్ల నిర్ధారింపబడింది. అందువల్ల, ఈ ఆధారాలు అందించిన అంశాలను, ఇతర చారిత్రక ఆధారాలతో సరిపోల్చి, చరిత్రకారుడు నిజాన్ని నిగ్గుతేల్చాల్సి ఉంటుంది.

## 8.4.2 భారతీయ, ఇతరేతర వాఙ్మయంలోని చారిత్రక ప్రస్తావనలు

చారిత్రక కాలక్రమంలో రాసిన సాహిత్య ఆధారాల్లో, గత కాల ఘటనలు జరిగినవి జరిగినట్లుగానే రాయబడ్డాయి. వాటికి, ఒక క్రమం ఉండదు. ఆ క్రమాన్ని కలిగించాల్సిన బాధ్యత చరిత్రకారుడిది. అంతేకాదు; వాటిని సక్రమంగా కార్యకారణ సంబంధాలతో జోడించి, చరిత్రను రాయాల్సి ఉంటుంది. చారిత్రక వాస్తవాలను వర్ణించడంలోను, కాలక్రమానుసారాన్ని పాటించడంలోను, సాహిత్యకారుడు పొరబాట్లు చేయవచ్చు. పాలకులను, వారి డాంబిక దర్పాలను అతిగా వర్ణించడం వల్ల, చారిత్రక ఘటనలు తప్పుగా చిత్రించబడతాయి. అంతేకాక, ఆర్థిక సాంఘికాంశాలు విస్మరించబడే ప్రమాదం ఉంది. ఉదాహరణగా, గ్రీక్ చరిత్రకారుడు హెరడోటస్ రాసిన చారిత్రక గ్రంథాలను చెప్పుకోవచ్చు. అవాస్తవికాంశాలు ఎన్నో ఇందులో చోటుచేసుకున్నాయి. దీనికి కారణం, ఈ గ్రంథాలు అప్పటి రాజులను స్తుతించడం కోసమో, లేక మత ప్రయోజనాలను ఉద్దేశించి రాయడమో జరిగింది. భారతదేశానికి సంబంధించి దీనికొక ప్రబలమైన మినహాయింపు, కల్హణుని 'రాజతరంగిణి'. కాశ్మీర దేశ చరిత్రకు సంబంధించిన ఈ గ్రంథం, ఆ దేశ రాజుల వంశావళిని గూర్చి సరైన సమాచారాన్ని ఇవ్వడమేకాక, కాశ్మీర్ వెలుపల జరిగిన ఘటనలను గూర్చి కూడా, పేర్కొనడం గమనార్హం. ఈ క్రమంలోనే, హతిగుంఫ గుహ శాసనాన్ని గురించి కూడా చెప్పుకోవాల్సి ఉంటుంది. ఖారవేలుని పరిపాలనకు సంబంధించిన విశ్వసనీయమైన సమాచారం, మనకిందులో లభిస్తుంది. ఇదే కోవకు చెందిన మరో గ్రంథం, జాన్ విల్లె (Join Ville) రచించిన 'క్రానికల్ ఆఫ్ క్రూసేడ్ ఆఫ్ సెయింట్ లూయిస్' (Chronicle of Crusade of St. Louis). ఇది ఫ్రాన్స్ దేశపు రాజు 9వ లూయీకి సంబంధించింది.

BRAOU

పై తీరుకు చెందిన రచనల్లో, మరికొన్ని ముఖ్య గ్రంథాలను గూర్చి తెలుసుకుందాం. అరిస్టాటిల్ రాసిన 'కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఏథెన్స్' (Constitution of Athens) అనే గ్రంథాన్ని, 1891లో కనుగొన్నారు. ఏథెన్స్‌ను గూర్చిన తొలి కాల చరిత్రను తెలియచేసే గ్రంథాల్లో, ఇది ప్రాథమికమైంది. ఐరోపా ఖండంలో, సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలోని రాచరిక వ్యవస్థపై కొండంత వెలుగును ప్రసరించే గ్రంథం, మాకియవెల్లి రాసిన 'ప్రిన్స్' (Prince) గ్రంథం. రూసో గ్రంథం, 'సోషల్ కాంట్రాక్ట్' (Social Contract) ఫ్రెంచ్ విప్లవ భూమికను సిద్ధం చేసింది. థామస్ పెయిన్ గ్రంథం 'రైట్స్ ఆఫ్ మాన్' (Rights of Man) అమెరికా స్వాతంత్ర్య సంగ్రామాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన రచన.

భారతదేశ ప్రాచీన చరిత్ర సరిగ్గా గ్రంథస్తం కాని దశలో, మత సాహిత్యం చారిత్రకాధారాల్ని అందించిందని ముందే చెప్పుకున్నాం. దక్షిణ భారత చరిత్రకారుడు నీలకంఠ శాస్త్రి ఉద్దేశంలో, స్థల పురాణాలకు ప్రాధాన్యం లేకున్నా, 'పెరియ పురాణం లాంటి చరిత్రలు ఎంతో విలువైన సమాచారాన్ని అందించాయి. ఈ సందర్భంలో, రాజకీయ ప్రాముఖ్యాన్ని, ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలను సవివరంగా అందించిన, కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని చెప్పుకోవాల్సి ఉంటుంది. దీని కర్తృత్వంపై, కాలంపై చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేకున్నా, మౌర్యుల కాలానికి చెందిన ముఖ్యాంశాలను తెలిపే ఈ గ్రంథం, భారతదేశ ప్రాచీన చరిత్ర నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడింది. భారతీయ సాహిత్యంలోని 'స్మృతులు' ముఖ్యంగా, 'యాజ్ఞ వల్క్య', 'నారద' స్మృతులు రాజనీతిని గురించి, సామాజిక వ్యక్తి న్యాయాన్ని గురించి, సాంఘికాచారాలు, కట్టుబాట్లను గురించి, విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి.

BRAOU

విశాఖదత్తుని 'ముద్రా రాక్షసం' సంస్కృతంలో రాసిన ముఖ్య చారిత్రక నాటకం. సమకాలీన ఘటనలకు వాస్తవ రీతిలో ఇది అద్దం పట్టింది. చారిత్రకం కాకున్నా, కాళిదాసుని 'మాళవికాగ్నిమిత్రం', అనేక ఇతర సాహిత్య ప్రధానమైన నాటకాలు కూడా, అప్పటి రాజాస్థాన వివరాలను, కొంత మేరకు ప్రజా జీవితాన్ని గూర్చి తెలియచేస్తాయి. శుంగ రాజ వంశానికి విదిశ రాజ్యంతో లావాదేవీలుండేవన్న విషయాన్ని, 'మాళవికాగ్నిమిత్రం' ధృవీకరించింది.

ఆంధ్రదేశానికి సంబంధించి, ముఖ్యంగా మధ్య యుగాల కాలం నుండి ఆధునిక యుగం వరకు వచ్చిన ప్రబంధ, శతక, పద, వచన, నాటక సాహిత్యాలు, అప్పటి సామాజిక, సాంస్కృతిక విషయాలతోబాటు, ఆర్థిక అంశాలను కూడా తెలియచేస్తున్నాయి. 'ఆముక్త మాల్యద', 'కృష్ణ విజయం', 'రాయవాచకం', దక్షిణాత్య నాయక రాజుల యక్షగానాలు, సాంఘిక నిరసనను, భక్తి తత్వాన్ని ప్రబోధించే లెక్కలేనన్ని శతకాలు, వీరబ్రహ్మం, ఎడ్ల రామదాసుల తత్వాలు, అన్నమయ్య, క్షేత్రయ్యల పద వాఙ్మయం, వీటికి ఉదాహరణలు. ఆధునిక కాలంలో, ముఖ్యంగా, 19వ శతాబ్ది మధ్యకాలం లోని భారతీయ భాషల్లో, వైవిధ్యంతో కూడిన నూతన సాహిత్య ప్రక్రియలు రావడంతో, నవల, నాటకం, వచనం, సాహిత్య మాధ్యమాలుగా రూపుదిద్దుకున్నాయి. తెలుగులో సామినేని ముద్దు నరసింహనాయుడి 'హిత సూచని', ఏనుగుల వీరాస్వామి 'కాశీయాత్ర చరిత్ర', వీరేశలింగం, చిలకమర్తి, గురజాడల సాహిత్య సృష్టి, ఆధునిక ఆంధ్రదేశ తొలి దశాబ్దాల చరిత్రకు ఎంతగానో ఉపకరిస్తాయి.

గత కాల పద్య, గద్య సాహిత్యం, అప్పటి సాంఘిక, ఆర్థిక పరిస్థితిని గూర్చి కొంత మేరకు సమాచారాన్ని ఇవ్వడమే కాక, ఒక్కోసారి రాజకీయ ఘటనల ఆచూకీని కూడా తెలియచేస్తాయి. క్రీస్తు శకపు తొలి దశలోని తమిళ రాజ్యాల రాజకీయ చరిత్ర, 'సంగం' యుగ తమిళ సాహిత్యం నుండి గ్రహించిందే! ఇక్కడే, మరికొన్ని ఉదాహరణలివ్వడం సముచితంగా ఉంటుంది. బాణుడి నవల 'కాదంబరి', న్యాయశాస్త్రానికి చెందిన విజ్ఞానేశ్వరుని 'మితాక్షర', ఖగోళ శాస్త్రమైన 'గార్గి సంహిత' (శుంగుల కాలంలో గ్రీక్ దండయాత్ర గూర్చి), తుదకు పతంజలి 'మహాభాష్యం' లాంటి వ్యాకరణ శాస్త్రం కూడా, చరిత్రకారులకు కావాల్సిన ఉపయోగకర సమాచారాన్ని అందించాయి. కొన్ని కావ్యాల్లో చారిత్రకత ఏమాత్రం లేకున్నా, వాటి పీఠికల్లో, ఉపసంహారాల్లో, గ్రంథకర్తల, కావ్యగ్రహీతల పుట్టుపూర్వోత్తరాలు, గుణగణాలు రాసి ఉండటం రివాజు. మతపరమైన గ్రంథమైన హేమాద్రి విరచిత, 'చతుర వర్గ చింతామణి' మొదటి భాగంలో, దేవగిరిని పాలించిన యాదవ వంశాన్ని గూర్చిన చారిత్రక వర్ణన ఉంది. అలాగే, కావ్యాలపై వచ్చిన వ్యాఖ్యానాల్లో కూడా, అడపా దడపా చారిత్రక సమాచారం లభిస్తుంది.

### 8.4.3 జీవిత చరిత్రలు

ప్రముఖుల జీవిత చరిత్రలు ఆకాల సమాజాన్ని గురించి, రాజాస్థానాల్లో జరిగే నిత్య వ్యవహారాలు, కుట్ర కూహకాల గూర్చి, కొంతవరకు తెలియజేస్తాయి. ఆధునిక కాలానికి ముందు వెలువడ్డ జీవిత చరిత్రలు, ముఖ్యంగా, రాజాశ్రయం పొందిన కవులు రాసిన వాటిల్లో అతి పొగడ్తలు, వాస్తవాతీత విషయాలు చోటుచేసుకున్నాయి. దీనికి చక్కని ఉదాహరణలు, బాణుడి 'హర్ష చరిత్ర', హేమచంద్రుని 'కుమారపాల చరిత్ర', 'పృథ్వీరాజ రసో', అబుల్ ఫజల్ రాసిన 'అక్బర్ నామా' లను పేర్కొనొచ్చు.

ఆధునిక యుగంలోని జీవిత చరిత్రకారుల రచనల్లో వ్యక్తిగత ఇష్టాయిష్టాలు చోటుచేసుకున్నా, ఎంతో శ్రమతో, పరిశోధనా కృషితో రాయబడ్డవిగా పరిగణించాలి. మోర్లే రాసిన 'లైఫ్ ఆఫ్ గ్లాడ్‌స్టోన్' (Life of Gladstone) (2 సంపుటాలు,) లీ వార్నర్ రచించిన 'లైఫ్ ఆఫ్ ది మార్క్వెస్ డల్హౌసి' (Life of the Marquess of Dalhousie) (2 సంపుటాలు) ఈ కోవకు చెందినవి. లిట్టన్ స్ట్రాచీ రాసిన విక్టోరియా మహారాణి జీవిత చరిత్ర, అభిమానంతో, సానుభూతితో కూడిందిగా, విమర్శకులు నిర్ధారించారు. మహాత్మా గాంధి జీవితాన్ని ఎంతో నేర్పుతో చిత్రించిన ఫ్రెంచ్ రచయిత, రోమారోలా అందరి ప్రశంసలకు పాత్రుడయ్యాడు. ఇటీవలి కాలంలో వచ్చిన సమగ్ర జీవిత చరిత్రల్లో రెండింటిని ఇక్కడ పేర్కొనాలి. క్రిస్టఫర్ హిల్ రాసిన 'గాడ్స్ ఇంగ్లీష్ మాన్' (God's Englishman) (ఆలీవర్ క్రాంవెల్ గూర్చి), సర్వేపల్లి గోపాల్ జవహర్‌లాల్ నెహ్రూపై రాసిన మూడు సంపుటాలు, వారి జీవిత విశేషాలను కూలంకషంగా వివరించడమే కాక, అప్పటి సమకాలీన సమాజాన్ని గూర్చి వివరించాయి. ఒక మహా వ్యక్తి జీవితాన్ని ఆనాటి సామాజిక నేపథ్యంలో నిలబెట్టడంలో, ఆ వ్యక్తి జీవిత చరిత్రకు నిండుదనం చేకూరడమే కాక, అప్పటి దేశ, కాల పరిస్థితుల్ని ఇవి మన ముందుంచాయి.

### 8.4.4 స్వీయ చరిత్రలు

సాహిత్యాధారాల్లో ఇవి ఒక ప్రత్యేక కోవకు చెందుతాయి. మరెక్కడా లభ్యంకాని సమాచారాన్ని అందించడం ద్వారా, వీటి విలువ మరింతగా పెరిగింది. అయినా, ఇవి నిర్దోషాలు కావు. తమ గుణ

BRAOU

గణాలను, విజయాలను అతిగా చెప్పుకోడం, ఇతరుల దోషాలను భూతద్దంలో చూడ్డం మనం తరచూ గమనిస్తుంటాం. జీవితాంతంలో రాసిన స్వీయ చరిత్రల్లో జ్ఞాపక శక్తి క్షీణించడంవల్ల, తీవ్ర పొరపాట్లకు దారితీయవచ్చు. తమ జీవితాల్లో అనుసరించిన విధానాలు, పాటించిన పద్ధతుల్ని సమర్థించుకొనే రీతి, వీటిలో సాధారణంగా చోటుచేసుకుంటుంది. ముఖ్య ఉదాహరణలు, నెపోలియన్, బిస్మార్క్‌ల స్వీయ చరిత్రలు. మహాత్మా గాంధీ స్వీయ చరిత్ర ఇప్పటికీ ఎంతో విలువైంది. నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా రాసుకున్న ఈ గ్రంథాన్ని, రూసో స్వీయ చరిత్రతో పోల్చొచ్చు. ఈ దారి లోనే వచ్చిన రచనల్లో, జవహర్‌లాల్ నెహ్రూ స్వీయ జీవిత చరిత్ర, వీరేశలింగం 'స్వీయ చరిత్రం' ఎన్నదగ్గవి.

### 8.4.5 దినచర్యలు - ఉత్తర ప్రత్యుత్తరాలు

స్వీయ చరిత్రల్లో భాగం కాకున్నా ఆ రీతికి చెంది, సమగ్ర జీవిత చిత్రాన్ని కాక, ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిత్వ భిన్న కోణాలపై, సమకాలికులపై, సమకాలీన ఘటనలపై ముఖ్యమైన అంశాలు వీటిలో లభిస్తాయి. అయితే, వీటికి సరైన మదింపు, క్రమం ఉండవు. ఫ్రెంచ్ గవర్నర్ డూప్లే దగ్గర దుబాషీగా పనిచేసిన ఆనందరంగ పిళ్లై డైరీలు, 1736-60 మధ్యకాలంలో, దక్షిణ భారతదేశంలో జరిగిన అనేక ముఖ్య ఘటనలను రికార్డ్ చేశాయి. ఇ.ఎస్. మాంటేగ్ రాసుకున్న "మై ఇండియన్ డైరీ" (My Indian Diary) ఎంతో ఉపయోగకరమైంది. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావుల డైరీలు తెలుగులో చెప్పుకోదగ్గవి.

BRAOU

ఉత్తర, ప్రత్యుత్తరాలు రాజ్య యంత్రాంగం లోని అంతర్గత మెళకువల గూర్చి, రాజ్య నిర్వహణలో భాగస్వాములైన వ్యక్తుల గుణగణాలను గూర్చి, సూక్ష్మంగా తెలియచేస్తాయి. రోమన్ సామ్రాజ్య కాలానికి చెందిన సిసిరో మహాశయుని ఉత్తరాలు (45 B.C - 44 B.C) ఆ కాల రోమన్ పాలక వర్గాల గూర్చి సమాచారాన్నిస్తాయి. క్రాంవెల్ ఉత్తరాలు అతడు అనుసరించిన విధానాలను, వ్యక్తిత్వ వైశిష్ట్యాన్ని తెలియచేస్తాయి. ఫ్రెంచ్ విప్లవ కాలంలోని అతివాది మిరాబు, రహస్య ఉత్తర, ప్రత్యుత్తరాల్లో అతడి ద్వంద్వ ప్రవృత్తిని గమనించగలం. ఫ్రెంచ్ ఆస్థానంతో రహస్యంగా సాగించిన మంతనాలు, ఫ్రెంచ్ రాజును రక్షించడానికి పన్నిన పన్నాగాలను ఇవి తెలియపరుస్తున్నాయి. ఇదే క్రమంలో, విక్టోరియా మహారాణి ఉత్తరాలు ఆవిడ రాచరికాన్ని ఏ విధంగా ప్రస్తుతించిందో తెలియచేస్తాయి. ప్రాచీన భారతదేశానికి సంబంధించి, ఉత్తర ప్రత్యుత్తరాలు లభించవు. అయితే, కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం' లో ఉటంకించిన పుష్యమిత్రుడు అగ్నిమిత్రునికి రాసిన ఉత్తరం, ఈ కోవకు చెందిందే. అలాగే, ఔరంగజేబ్, శివాజీ ఉత్తరాలు కూడా. ఆధునిక యుగానికి సంబంధించి, ఇటీవలి కాలంలో అనేక మంది గవర్నర్‌జనరల్స్, వైస్రాయ్‌లు, స్వాతంత్ర్య వీరులు, ప్రసిద్ధ వ్యక్తుల వ్యక్తిగత పత్రాలను (Private Papers), ఉత్తర ప్రత్యుత్తరాలను సేకరించి, పరిశోధకుల అందుబాటులోకి తెచ్చారు. నిజానికి ఇవి అందిస్తున్నంత చారిత్రక సమాచారం, ఏ ఇతర ఆధారమూ అందించలేదేమో అనిపిస్తుంది. పెక్కు సంపుటిల రూపంలో వెలువడ్డ, వెలువడుతున్న మహాత్మాగాంధీ, పండిత నెహ్రూ, వల్లభాయ్ పటేల్, రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రి మొదలైన వారి వ్యక్తిగత పత్రాలు, దీనికి ఉదాహరణలు.

### 8.4.6 స్మృతులు - జ్ఞాపకాలు

స్వీయ చరిత్రలతో, డైరీలతో పోల్చిచూస్తే, స్మృతులు, జ్ఞాపకాల్లో పక్షపాత దృష్టి తక్కువగా ఉండటానికి వీలుంది. సమకాలీన చరిత్రకారుల రచనలు, అప్పటి చారిత్రక ఘటనలకు మరీ దగ్గర్లో ఉన్నవి కావడంవల్ల, వాటిని ఖరాఖండిగా అంచనా వేయడంలో జరిగే లోపమే, స్మృతి గ్రంథంలో కూడా కన్పిస్తుంది. ఆధునిక కాలంలో వెలువడ్డ ఈ తరహా గ్రంథాల్లో చెప్పుకోదగ్గవి, స్లీమన్ రాసుకున్న 'రాంబుల్స్ ఇన్ ఇండియా' (Rambles in India); లార్డ్ కర్జన్ 'లీవ్స్ ఫ్రమ్ ఎ వైశ్రాయ్‌స్ నోట్‌బుక్' (Leaves From a Viceroy's Notebook), విన్‌స్టన్ చర్చిల్, 'వరల్డ్ క్రైసిస్' (World Crisis). తెలుగులో వెలువడ్డ ముఖ్య గ్రంథాల్లో ప్రముఖ సాహితీవేత్త, కథకుడు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి 'అనుభవాలు - జ్ఞాపకాలూను' (3 సంపుటాలు), ఆచంట జానకిరామ్, 'నా స్మృతి పథంలో', 'సాగుతున్న యాత్ర' చెప్పుకోదగ్గవి.

### 8.4.7 భారతదేశ చరిత్రకు ఉపకరించే విదేశీయుల రచనలు

భారతదేశాన్ని సందర్శించిన విదేశీయులు తమ అనుభవాలను గ్రంథస్తం చేశారు. విదేశీయులు కావడం వల్ల, భారతీయులకు సాదాసీదాగా కన్పించే విషయాలు, వారికి భిన్నంగా కన్పించడంలో ఆశ్చర్యం లేదు. చరిత్రకారుడికి ఇవి ఎంతగానో ఉపకరిస్తాయి. వారు విదేశీయులు కావడం వల్ల, వారి దృక్పథం నిష్పాక్షికంగా ఉండే అవకాశం ఉంది. వారి దృష్టి సునిశితంగా ఉండి, వారి పరిశీలన సమాజంలోకి చొచ్చుకుపోయినందువల్ల, వారందించే సమాచారం నిర్దుష్టంగా ఉండటానికి అవకాశం ఉంది. అయినా, విదేశీయుల రచనల్లో ఎన్నో లోపాలున్నాయి. విషయ గ్రాహ్యత లోపించినందువల్ల, పరిశీలన తప్పుదారి పట్టవచ్చు. రాజ్య సంబంధమైన పత్రాలకు, అప్పటి రాజ్యాధినేతలకు వీరికి సన్నిహితత్వం ఉండకపోవడంవల్ల, ముక్కలు పురాణాల మీద వీరు ఆధారపడాల్సి వస్తుంది. స్థానికుల భాష తెలియకపోవచ్చు. అందువల్ల, వారు సేకరించిన సమాచారాన్ని రాత ప్రతుల సమాచారంతో సరిపోల్చి చూసే అవకాశం ఉండదు.

మార్కోపోలో తన యాత్రా చరిత్ర రచన ద్వారా, తూర్పు దేశాలపై ఐరోపావాసులకు ఆసక్తిని కల్గించాడు. ఇతడు చైనాలో పదిహేడేళ్ళున్నాడు. కుబ్లేఖాన్ నిర్మించిన పెకింగ్ (బీజింగ్) నగరాన్ని, ఖాన్ ప్రభుత్వం లలిత కళల్లో సాధించిన అపూర్వ విజయాలను, సమాజంలోని శాంతిని, అభివృద్ధిని వర్ణించాడు. ఇటలీకి చెందిన ఈ యాత్రికుడు దక్షిణ భారతాన్ని, ఆంధ్ర ప్రాంతాన్ని సందర్శించాడు. అప్పటి వర్తక, వాణిజ్యాలను, రేవు పట్టణాలను, వర్ధిల్లుతున్న చేనేత, వజ్ర పరిశ్రమలను గూర్చి, వివరంగా పేర్కొన్నాడు. అదే విధంగా, ఇటలీకి చెందిన నికోలోకాంటి, (Nikolokonti) , పర్షియాకు చెందిన అబ్దుల్ రజాక్, పోర్చుగల్‌కు చెందిన న్యూనిజ్ (Nuniz), డామింగో పేస్ (Damingo Paes), తమ రచనల్లో విజయనగర సామ్రాజ్య వైభవాన్ని, మత పరిస్థితులను, ప్రజల జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణించారు.

ప్రాచీన భారత చరిత్రకు కూడా, విదేశీయుల రచనలు ఎంతగానో ఉపకరిస్తాయి. అలెగ్జాండర్ దండయాత్రను వర్ణించిన గ్రీక్, రోమన్ చరిత్రలు, అప్పటి భారతదేశ వాయవ్య ప్రాంత రాజకీయ

BRAOU

పరిస్థితులను విపులంగా తెలియచేస్తాయి. నిజానికి, భారతదేశ కాలక్రమానుసార చరిత్ర నిర్ధారణకు ఇదే పునాది. వారు చెప్పిన 'శాండ్రకోటస్' ను చంద్రగుప్తునిగా గుర్తించినందువల్లనే, అది ప్రాచీన భారతదేశ కాలక్రమానికి ప్రథమ సోపానమైంది. మెగస్తనీస్ 'ఇండికా' పాటలీపుత్ర నగరాన్ని గూర్చి, చంద్రగుప్తుని రాజ ప్రాసాదం, ప్రభుత్వాల గూర్చి విలువైన సమాచారాన్నిచ్చింది. చైనా యాత్రికులు పాహియాన్, హ్యూయాన్‌త్సాంగ్, ఇత్సింగ్ మిగిల్చిపోయిన రచనలు, మనకు గుప్తుల సామ్రాజ్యాన్ని గురించి, హర్ష చక్రవర్తిని గూర్చి, ఆనాటి బౌద్ధమత పరిస్థితులను గురించి, సమాజంలోని సాధారణ పరిస్థితులను గూర్చి తెలియచేస్తున్నాయి.

మధ్య యుగ భారతదేశ రాజ్యాల గూర్చిన సమాచారం, మనకు విరివిగా, అరబ్ యాత్రికుల రచనల్లో లభిస్తుంది. గజనీ మహమ్మద్‌తో వచ్చిన ఆల్‌బెరూని సంస్కృతాన్ని నేర్చుకొని, సంస్కృత గ్రంథాల్లోని సంస్కృతిని గూర్చి, భారతీయ సమాజాన్ని గూర్చి రాశాడు. ఇదే విధంగా, ఢిల్లీ సల్తనత్ చరిత్రకు ఉపయోగపడే ముఖ్య గ్రంథం, మిన్హాజుద్దీన్ రాసిన 'తబకాత్-ఇ-నాసిరీ', అల్లాఉద్దీన్ సమకాలికుడైన అమీర్ ఖుస్రూ, జియావుద్దీన్ బరనీ ఫిరోజ్‌షాను గురించి రాసిన గ్రంథాలు, అప్పటి చరిత్ర నిర్మాణానికి దోహదపడుతున్నాయి. అయితే, కొందరి విదేశీ యాత్రికుల రచనల్లో, పక్షపాత భావం, సత్యాన్ని వక్రీకరించే ధోరణి కనిపిస్తుంది. ఉదాహరణకు, దక్షిణ భారతదేశంలో, 1792-1832 మధ్య కాలంలో క్రైస్తవ మిషనరీగా పనిచేసిన అబీదుబాయి, విపులమైన సమాచారాన్నిచ్చే, 'హిందూ మానర్స్, కస్టమ్స్ అండ్ సెరిమోనీస్' (Hindu Manners, Customs and Ceremonies) అనే గ్రంథాన్ని రచించాడు. అప్పటి దక్షిణ భారత సమాజంలోని ఎన్నో ముఖ్యాంశాలు ఇందులో ప్రస్తావించబడ్డా, ఈ గ్రంథం పక్షపాత రహితమని పేర్కొనే వీల్లేదు. 1942 క్విట్ ఇండియా ఉద్యమారంభంలో, అమెరికన్ పాత్రికేయుడు లూయీ ఫిషర్ సేవాగ్రామ్ ఆశ్రయంలో ఒక వారం రోజులు మహాత్మా గాంధీతో గడిపి రాసిన, 'ఏ వీక్ విత్ గాంధీ' (A Week With Gandhi) అనే గ్రంథం, అప్పటి రాజకీయ పరిస్థితులను చిత్రించిన ఉత్తమ గ్రంథంగా పేరొందింది.

BRAOU

## 8.5 సంగ్రహంగా

చరిత్రకుపకరించే సాహిత్యాధారాల గూర్చిన పై సమీక్షలో, సాహిత్యం, చరిత్రల మధ్యనున్న సంబంధాన్ని గూర్చి, సంప్రదాయ సాహిత్యం, విదేశీయుల రచనలు, జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు, దిన చర్యలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, స్మృతులు, జ్ఞాపకాలను గూర్చి మనం స్థూలంగా తెలుసుకున్నాం. కాలక్రమంలో, మనకు కొత్త సాహిత్యాధారాలు లభిస్తూంటాయి. అలాగే, ఇపుడు లభిస్తున్న సాహిత్యంపై సరికొత్త వ్యాఖ్యానాలు వెలువడుతుంటాయి. వీటివల్ల, మనకున్న చరిత్ర పరిజ్ఞానం పెరుగుతూ ఉంటుంది. సత్యాన్వేషణ దృష్టితో వీటిని బేరీజు వేసుకుంటూ, చరిత్ర రచనను కొనసాగించాల్సి ఉంటుంది.

## 8.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. సాహిత్య విశ్లేషణా పద్ధతి గూర్చి వివరించి, అది చరిత్ర రచనకు ఎట్లు ఉపకరిస్తుందో తెల్పండి.

2. భారతీయ సంప్రదాయ సాహిత్యంలో, యితర వాఙ్మయంలోనున్న చరిత్ర ప్రస్తావనల గూర్చి తెలిపి, వాటి చారిత్రక ప్రాముఖ్యాన్ని వివరించండి.

3. భారతదేశ చరిత్రకు ఉపయోగపడే విదేశీయుల రచనల ప్రాముఖ్యాన్ని గూర్చి విశ్లేషించండి.

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. సాహిత్యం - చరిత్రకు గల పరస్పర సంబంధాన్ని తెల్పండి.

2. సంప్రదాయ సాహిత్యంలో చరిత్ర రచనకుపకరించే అంశాలను వివరించండి.

3. జీవిత చరిత్రల ప్రాముఖ్యాన్ని చరిత్రలో సమన్వయించి వివరించండి.

4. స్వీయ చరిత్రలు, స్మృతులు, జ్ఞాపకాలు చరిత్రకు ఏ విధంగా ఉపయోగపడతాయి?

5. దిన చర్యలు, ఉత్తరప్రత్యుత్తరాలను, చారిత్రకాధారాలుగా పరిగణించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

## 8.7 ఉపయుక్త గ్రంథాలు


Arthur Marwick : **The Nature of History**

Nilakantha Sastry K.A. : **A History of South India**

Raymond Williams : **Marxism and literature**

Sathianatha Aiyer, R. : **History of India, Vol- I**

Sen, S.P (ed) : **Sources of the History of India, Vols-I & II**

Venkataratnam, T.K. : **Methodology in History**

దుర్గాప్రసాద్ జె. : చరిత్ర రచనా శాస్త్రం



రచయిత :ఆచార్య వి. రామకృష్ణ



BRAOU

# భాగం-9 : పాలనా రికార్డులు

విషయ క్రమం

9.0 లక్ష్యాలు

9.1 పరిచయం

9.2 పాలనా రికార్డులు ఏర్పడ్డ విధం

9.2.1 శాఖా పాలనా రికార్డులు

9.2.2 సాధారణ పాలనా రికార్డులు

9.3 ప్రభుత్వానికి పాలనా రికార్డుల ఉపయోగం

9.4 స్వదేశీ సంస్థానాల్లో పాలనా రికార్డులు

9.5 సాధారణ పాలనా రికార్డుల్లోని అంశాలు

9.5.1 సాధారణ, రాజకీయ విషయాలు

9.5.2 భూమి వ్యవహారాలు

9.5.3 రక్షణ (Protection)

9.5.4 ఉత్పత్తి, పంపిణీ

9.5.5 ఇతర అంశాలు

9.6 చరిత్ర పరిశోధనకు పాలనా రికార్డుల ఉపయోగం

9.7 పాలనా రికార్డుల పరిమితులు

9.8 పాలనా రికార్డులు లభ్యమయ్యే చోటు

9.9 సంగ్రహంగా

9.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

9.11 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 9.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- ప్రభుత్వానికి పాలనా రికార్డుల అవసరం, వాటిని తయారుచేసే విధానాన్ని వివరించగలగాలి.

- పాలనా రికార్డులలో లభించు సమాచారం, చరిత్ర పరిశోధనలో దాని ప్రాముఖ్యతను విశ్లేషించగలగాలి.
- పాలనా రికార్డులకుండే పరిమితులను పేర్కొనగలగాలి.

## 9.1 పరిచయం

వలస కాలంలో భారతదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, లేక ఏ ఇతర విషయాలపైనా పరిశోధనలు చేయాలంటే, పాలనా రికార్డులు ఎంతో ఉపయోగపడతాయి. ఈ రికార్డుల్లో అన్ని విషయాలపై ప్రాథమిక సమాచారమే కాకుండా, కొన్ని సందర్భాల్లో అత్యంత కీలక సమాచారం లభిస్తుంది. అందువల్ల, ఈ రికార్డులను సంప్రదించకుండా చేసిన చారిత్రక పరిశోధన అసంపూర్తి పరిశోధనయనే చెప్పవచ్చు. లండన్‌లోని బ్రిటీష్ ప్రభుత్వ సూచనల మేరకు, ఈ రికార్డులు భారతదేశంలోని అన్ని ప్రెసిడెన్సీల్లో, 19వ శతాబ్ది మధ్యభాగం నుండి వెలువడటం ప్రారంభించాయి.

## 9.2 పాలనా రికార్డులు ఏర్పడ్డ విధం

బ్రిటీష్ వారు భారతదేశాన్ని ఆక్రమించిన తర్వాత, ప్రతి ప్రెసిడెన్సీలో వారికవసరమైన ఒక విస్తృత పరిపాలనా వ్యవస్థ నేర్పాటు చేశారు. ఈ వ్యవస్థలో, అనేక ప్రభుత్వ శాఖలున్నాయి. వీటిలో, రెవెన్యూ, ఆర్థిక, న్యాయ, పబ్లిక్, విద్యా, రాజకీయ, మత, శాసనసంబంధమైన, నౌకాయాన, ప్రజోపయోగ శాఖలు ముఖ్యమైనవి. అయితే, ఈ శాఖలన్నీ, సమర్థవంతంగా తమ అవసరాలకనుగుణంగా పనిచేస్తున్నాయా, లేదా, అని తెలుసుకోడానికీ, తమ విధాన నిర్ణయాలు సత్ఫలితాల నిస్తున్నాయా, లేదా అని తెలుసుకోడానికీ, బ్రిటీష్ వారికి ప్రతి శాఖ నుండి ఒక సమగ్రమైన నివేదిక అవసరమైంది. దాంతో, ప్రతి శాఖ తన కింద పనిచేసే పరిపాలనా యంత్రాంగ సహాయంతో, తన శాఖ ఆ సంవత్సర పని తీరుతెన్నుల వివరాలను కూలంకషంగా చర్చించి, ఒక సవివరమైన నివేదికను సమర్పించే వారు. అన్ని శాఖలనుండి వచ్చిన నివేదికలను, ఇంకా ఇతర నివేదికల సహాయంతో, ప్రెసిడెన్సీలోని ప్రభుత్వ కార్యకలాపాల వివరాలు, వాటిపై ప్రజల ప్రతిస్పందనలతో, ఒక సమగ్రమైన రికార్డును ప్రభుత్వం తయారుచేస్తుంది. వీటినే, పాలనా రికార్డులు అని అంటారు. ఇవి ప్రతి సంవత్సరం క్రమం తప్పక వెలువడుతుండేవి.

### 9.2.1 శాఖాపరమైన పాలనా రికార్డులు

ఈ విధంగా ఏర్పడ్డ పాలనా రికార్డులు రెండు రకాలని చెప్పవచ్చు. ఒకటి, శాఖాపరమైన పాలనా రికార్డులు. రెండు, సాధారణ పాలనా రికార్డులు. ప్రభుత్వ శాఖలు ప్రతి ఒక్కటి తమ శాఖలో జరుగు పని తీరు, సాధించిన పురోగతి, లేక, ఎదుర్కొన్న అవరోధాలను తమ సాంవత్సరిక పాలనా రికార్డుల్లో పేర్కొనడం జరిగింది. ఇందులో, ఆ శాఖకు సంబంధించిన సమాచారం తప్ప, వేరే ఏ విషయాలు ఉండవు. ఆ శాఖకు సంబంధించిన అతి సూక్ష్మ సమాచారం, ఈ రికార్డుల్లో లభించును. శాఖాపరమైన సమాచారం ఈ రికార్డుల్లో లభించినంతగా, సాధారణ పాలనా రికార్డుల్లో లభించదు. అయితే, శాఖాపరమైన రికార్డుల విషయంలో ఒక లోపం ఏమిటంటే, కొన్ని శాఖల రికార్డులు ఏ కారణం చేతనో ముద్రింపబడటం లేదు.

BRAOU

శాఖాపరమైన పాలనా రికార్డుల్లో ముఖ్యమైంది, రెవెన్యూ శాఖకు చెందినవి. 19వ శతాబ్దంలో బ్రిటీష్ వారి పరిపాలన, ముఖ్యంగా, వారి రెవెన్యూ విధానం చుట్టూనే తిరుగుతూ ఉండిందని చెప్పొచ్చు. అందులోనూ, భూమి శిస్తు విధానానికి వారు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. అందుకని, వారు తప్పనిసరిగా ప్రతి సంవత్సరం రెవెన్యూ రికార్డులను తయారుచేశారు. కాని, వీటిని ముద్రించలేదు. దీనికి కారణం, వారు ప్రతి సంవత్సరం భూమిశిస్తు సెటిల్‌మెంట్ సాంవత్సరిక నివేదికలు లేక, జమాబందీ నివేదికలు తయారుచేసి, అందులో రెవెన్యూకు సంబంధించిన విస్తృత సమాచారం పొందుపర్చడం జరిగింది. దీంతో, రెవెన్యూ రికార్డులకు ప్రాధాన్యత తగ్గి, జమాబందీ నివేదికలకు ప్రాముఖ్యత హెచ్చి, వాటిని తప్పనిసరిగా ముద్రించడం జరిగింది. సాధారణ పాలనా రికార్డుల్లో, చాలవరకు సమాచారం వీటి ద్వారానే లభిస్తుంది. ఈ రెవెన్యూ రికార్డులు కానీ, జమాబందీ నివేదికలు కానీ, వివిధ దశల్లోని అధికారులు సేకరించిన సమాచారం ద్వారా తయారౌతున్నాయి. జిల్లా కలెక్టర్లు, స్థానిక తహసీల్‌దార్లు తయారుచేసిన పట్టికలను సేకరించి, వాటి ఆధారంగా నివేదికలను తయారుచేసి, నాటిని 'బోర్డ్‌ఆఫ్ రెవెన్యూ' ద్వారా, రెవెన్యూ శాఖకు పంపేవారు. బోర్డ్ ఆఫ్ రెవెన్యూ, కలెక్టర్ల నివేదికలను సమీక్షించి, తమ సొంత నివేదికను తయారుచేస్తుంది. ఈ పూర్తి స్థాయి నివేదిక జిల్లా కలెక్టర్ల నివేదికలు బోర్డ్‌ఆఫ్ రెవెన్యూ సమీక్షలతో, రెవెన్యూ శాఖ రికార్డుగా తయారయ్యేవి. జమాబందీ రికార్డులు కూడా, ఇదే విధంగా తయారయ్యేవి. ముద్రించిన జమాబందీ రికార్డుల్లో, రెవెన్యూ శాఖ సమీక్ష కూడ ఉంటుంది.

ఇతర శాఖల్లోని పాలనా రికార్డులు కూడ, ఆయా శాఖల్లోని కింది అధికారుల సమాచార సేకరణ ద్వారానే తయారయ్యేవి. వీటిలో ముఖ్యమైనవి, వ్యవసాయం, పరిశ్రమలు, నౌకాయానం, వాణిజ్యం, న్యాయ శాఖలు.

### 9.2.2 సాధారణ పాలనా రికార్డులు

ఇక సాధారణ పాలన, పాలనా రికార్డుల విషయానికొస్తే , మిగతా శాఖల్లో జరిగినట్లు వీటికి ప్రత్యేక యంత్రాంగంచే సమాచార సేకరణ చేయకున్నప్పటికీ, అన్ని శాఖల్లోని పాలనా రికార్డుల ద్వారా, సమగ్ర సమాచారాన్ని ఇవి మనకందించేవి. ఈ రికార్డుల తయారీలో ఆయా శాఖల ప్రభుత్వ రికార్డులేకాక, ఇతర ప్రత్యేక నివేదికలు కూడ ఉపయోగింపబడ్డాయి. పురావస్తు, పురపాలక, శాసన సంబంధమైన శాఖల రికార్డులు, సాధారణ పాలన రికార్డులు తయారయ్యే శాఖలోనే తయారుచేస్తారు. భూమి వ్యవహారాలు, వ్యవసాయం, భూమిశిస్తు, పంటలు, రుతువులు (season) ధరలు, కూలీరేట్లు మొదలైన అంశాలను జమాబందీ నివేదికలు, రెవెన్యూ నివేదికల నుండి సేకరించబడేవి. అడవుల గురించి కన్సర్వేటర్ నివేదిక నుండి వర్తకంపై, బోర్డ్‌ఆఫ్ రెవెన్యూ వర్తక, నౌకాయాన సాంవత్సరిక సమీక్ష నుండి, పోలీస్ వ్యవస్థను గురించి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నివేదిక నుండి, పౌర న్యాయం, క్రిమినల్ న్యాయం గురించి ఉన్నత న్యాయస్థాన నివేదికల నుండి, పారిశుధ్యం, జనన మరణాల సమాచారం పారిశుధ్య కమీషనర్ నివేదిక నుండి, విద్యను గురించి, విద్యా సంచాలకుల నివేదిక నుండి, ప్రజోపయోగ కార్యక్రమాల విషయాల గురించి, ప్రజాపనుల శాఖా నివేదిక నుండి సంగ్రహించడం జరిగింది. అయితే, వివిధ శాఖల నుండి సేకరించిన సమాచారాన్నంతా పరిశీలించి, అవసరమైన సమాచారం మాత్రమే, రికార్డుల్లో పొందుపర్చడమైంది.

BRAOU

ఈ విధంగా తయారైన రికార్డులను అన్ని ప్రెసిడెన్సీలు ప్రతి సంవత్సరం తప్పనిసరిగా కలకత్తాలోని భారత ప్రభుత్వానికి, లండన్‌లోని బ్రిటీష్ ప్రభుత్వానికి పంపించేవారు. అన్ని ప్రెసిడెన్సీల నుండి వచ్చిన ఈ పాలనా రికార్డులను తిరిగి సమీక్షించి, ఆ సమీక్షను భారతదేశ నైతిక, భౌతిక ప్రగతి, పరిస్థితులను తెలియజేసే నివేదిక. (Statement Exhibiting Moral and Material Progress and condition of India) అనే పేరుతో, బ్రిటీష్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేవారు. తదుపరి, వీటిని ముద్రించడం జరిగేది.

## 9.3 ప్రభుత్వానికి పాలనా రికార్డుల ఉపయోగం

ప్రభుత్వానికి పాలనా రికార్డుల ఉపయోగం ఎంతైనా ఉంది. ఈ రికార్డుల్లో ప్రతి సంవత్సరం వారు ప్రతి శాఖకు కేటాయించిన ధనం, సక్రమంగా వినియోగమైందా? సరైన ప్రతిఫలం లభించిందా? అలా జరగకపోతే, వాటికి కారణాలేమిటి? ఇలాంటి అనేక విషయాలను దర్శించి, మరుసటి సంవత్సరం క్రితంసారి జరిగిన పొరపాట్లు జరగకుండా, చర్యలు తీసుకొనేవారు. ఉదాహరణకు, ఒక ప్రాంతంలో కరువు వచ్చిందీ లేనిదీ, కరువు ఎంతమేరకు నష్టం కలుగజేసిందీ, ఈ రికార్డుల ద్వారా, చాలా స్పష్టంగా తెలుస్తుంది. దానివల్ల, వెంటనే తగుచర్యలు తీసుకొనే అవకాశం ఏర్పడుతుంది. ఏవైనా కొత్త విషయాలపై సమాచారం కావాల్సి వస్తే, వాటిని ప్రత్యేక నివేదికల ద్వారా సేకరించి, అవసరమైతే, పాలనా రికార్డుల్లో పొందుపర్చడం జరుగుతుంది.

## 9.4 స్వదేశీ సంస్థానాల్లో (Princely States) పాలనా రికార్డులు

పాలనా రికార్డులు ప్రాంతాన్నిబట్టి, కొన్ని తేడాలు ఉన్నా, ప్రధాన విషయాలపై సమాచారం అన్ని ప్రాంతాల్లో, ఒకే మాదిరిగా ఉంటుంది. ఈ రికార్డులు మొదట బ్రిటీష్ ప్రభుత్వానికే పరిమితమైనా, వీటి ఉపయోగాన్ని దృష్టిలో ఉంచుకొని, స్వదేశ సంస్థానాలుకూడ తయారుచేయడం ప్రారంభించాయి. నైజాం నవాబ్‌ల కాలంలో హైదరాబాద్ సంస్థానంవారు, మొదటి పాలనా రికార్డును 1294 ఫస్లి (7th October 1884 to 6th Otober 1885) లో తయారుచేసి, ముద్రించడం జరిగింది. ఈ మొట్టమొదటి పాలనా రికార్డులో విస్తృత సమాచారం ఉంది. హైదరాబాద్ సంస్థాన రాజకీయ చరిత్ర కాకుండా ప్రతి శాఖ ఎప్పుడు ప్రారంభమై, ఏ విధంగా మార్పులు చెందుతూ వచ్చిందో, ఈ రికార్డులో పొందుపర్చడం జరిగింది. అయితే, ఈ విధమైన విస్తృత సమాచారం, మొదటి కొన్ని రికార్డుల్లో మాత్రమే పొందుపర్చడం జరిగింది. అంతేకాకుండా, ఈ రికార్డులు 1911 వరకు నాలుగు సంవత్సరాల కొకసారి మాత్రమే తయారయ్యేవి. దీనికి ప్రధాన కారణం, బ్రిటీష్ ప్రభుత్వానికున్నట్లు, వీరికి పటిష్టమైన పాలనా యంత్రాంగం లేకపోవడమే. బ్రిటీష్ అధీనంలోని ప్రాంతాల్లో, సమాచార సేకరణకు కింది స్థాయి పాలనా యంత్రాంగం అద్భుతంగా పనిచేసిందని చెప్పొచ్చు. ఇందువల్ల, రికార్డుల తయారీలోను, విషయాలను పొందుపర్చడంలోను, బ్రిటీష్ ప్రభుత్వ రికార్డులకు స్వదేశీ సంస్థానాల రికార్డులకు తేడా కొట్టొచ్చినట్లు కనబడుతుంది. సంస్థానాల రికార్డుల్లో సమాచారాన్ని పొందుపర్చడంలో, లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి.

BRAOU

## 9.5 సాధారణ పాలనా రికార్డుల్లోని అంశాలు

శాఖాపరమైన పాలనా రికార్డుల్లో, ఆయాశాఖల కార్యకలాపాల వివరాలు ఉంటాయని, ఇంతకుముందే తెలుసుకున్నాం. ఇక సాధారణ పాలనా రికార్డుల్లోని విషయాల గురించి వివరంగా తెలుసుకుందాం. సాధారణంగా, ప్రతి పాలనా రికార్డులో 8 నుండి 10 అధ్యాయాల వరకు ఉంటాయి. ఒక అధ్యాయం ఒక ప్రత్యేక అంశాన్ని చర్చిస్తుంది. ఈ అధ్యాయాలేవనగా, (1) సాధారణ రాజకీయ విషయాలు General and Political) (2) భూమి వ్యవహారాలు ( Administration of the Land) (3) రక్షణ (Protection) (4) ఉత్పత్తి, పంపిణీ (Production and distribution) (5) రెవెన్యూ, ఆర్థిక (Revenue and Finance) (6) జనన మరణాలు, వైద్య సర్వీసులు (Vital Statistics and Medical Services) (7) బోధన (Instruction) (8) ఇతరాలు (Miscellaneous).

### 9.5.1 సాధారణ, రాజకీయ విషయాలు (General and Political)

ఈ అధ్యాయంలో, ఆప్రాంతపు భౌగోళిక పరిస్థితులు, చరిత్ర, రాజకీయ పరిస్థితులు, పరిపాలనలో ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు, ఇంకా ఇతర స్వతంత్ర్య రాజ్యాలతో గల సంబంధాలు, ఇంకా ఇతర సాధారణ పరిస్థితులపై చర్చించడం జరిగింది.

### 9.5.2 భూమి వ్యవహారాలు (Administration of the Land)

ఈ అధ్యాయంలో, భూకమతాలు, భూమి సర్వే, పన్నుల విధింపు, వసూళ్లు, పన్ను మాఫీలు సాగుచేయబడ్డ భూమి విస్తీర్ణం తీరు, మెట్ట భూముల వివరాలు, నీటిపారుదల మొదలైన విషయాలు ఇందులో చర్చించడం జరిగింది. అనేక కారణాల వల్ల, ముఖ్యంగా కరువు కాటకాలు, అధిక పన్నుల వల్ల భూములు వదిలి వెళ్లిన వారి వివరాలకు సంబంధించిన విషయాలుకూడ, ఇందులో చర్చించడం జరిగింది.

### 9.5.3 రక్షణ (Protection)

ఇందులో పోలీస్ వ్యవస్థ పని తీరును వివిధ రకాల నేరాలు, నేరస్థులు, శిక్ష పొందినవారు, నేరాల తగ్గుదల, పెరుగుదల లాంటి అంశాలను చర్చించారు. సివిల్, క్రిమినల్ నేరాలను విడిగా చర్చించారు. వీటితోబాటు, జైళ్లు, సైన్యం శాసన సంబంధమైన విషయాలు ముఖ్యంగా, ఆ సంవత్సరం చేసిన చట్టాలను (Acts) ఈ అధ్యాయంలోనే వివరించారు.

### 9.5.4 ఉత్పత్తి, పంపిణీ (Production and Distribution)

ఈ అధ్యాయం చాలా ముఖ్యమైంది. ఇందులో, మొదట ఆ సంవత్సరంలో వర్షపాత వివరాలు, పంటల పరిస్థితిని కూలంకషంగా చర్చించటం జరిగింది. దీనివల్ల, ఏయే ప్రాంతాల్లో ఏమేరకు వర్షపాతం ఉందీ, కరువు పరిస్థితి, పంటలు బాగా పండిందీ, లేందీ తెలుస్తుంది. వీటితోబాటు, వివిధ పంటల విస్తీర్ణం, వాటి దిగుబడి వివరాలు తెలుస్తాయి. కాని, దిగుబడెంత మేరకు ఉంది, కొలతలతో



BRAOU

వివరాలను, 20వ శతాబ్ది కొన్ని రికార్డుల్లో మాత్రమే పొందుపరచడం జరిగింది. అంతకుముందు, ప్రభుత్వం ఈ వివరాలను సేకరించక పోవడం వల్ల, వాటిని రికార్డుల్లో చేర్చడం జరగలేదు. ఆ సంవత్సరం ఒకవేళ కరువు వచ్చినట్లైతే, వాటి వివరాలు దాన్ని ఎదుర్కొనడానికి తీసుకొన్న చర్యలు, ఇతర వివరాలు కూడ లభిస్తాయి. కూలీ వేతన వివరాలు, వ్యవసాయ పంటల ధరలు, వివిధ ప్రాంతాల్లో ఏ మేరకు ఉన్నాయో కూడా, ఈ అధ్యాయంలో విపులంగా చర్చించటం జరిగింది. అన్ని రకాల పరిశ్రమలు, అవి తయారుచేసే వస్తువులు, ఉత్పత్తి వివరాలు, ఒక ప్రత్యేక ఉప అధ్యాయం (Sub-Chapter) ద్వారా చర్చించారు. పై అంశాలన్నీ జిల్లాల వారీగా చర్చించినా, ఇంకో ముఖ్యమైన అంశం, వర్తకం మాత్రం జిల్లాలవారీగా కాకుండా, మొత్తం ప్రెసిడెన్సీలో జరిగిన వర్తక వివరాలు ముఖ్యంగా, వివిధ సరుకుల ఎగుమతి దిగుమతుల గూర్చి చర్చించడం జరిగింది. వీటితోబాటు, అడవులు, వాటి విస్తీర్ణం, నీటిపారుదల వివరాలు, రహదారులు, రైల్వేలు, తంతితపాలా వివరాలు కూడా, ఇందులో పొందుపర్చడమైంది.

### 9.5.5 ఇతర అంశాలు

రెవెన్యూ, ఆర్థిక అధ్యాయంలో, ప్రభుత్వ ప్రధాన గుణగని (Accountant General) నివేదిక ఆధారంగా, ప్రభుత్వ ఆదాయ వ్యయాల గూర్చి చర్చించటం జరిగింది. జనాభా విషయాల (Vital Statistics) అధ్యాయంలో జననాల సంఖ్య, అనేక కారణాల వల్ల మరణించిన వారి వివరాలు, అనేక రకాల వ్యాధిగ్రస్తుల వివరాలు, ప్రభుత్వం కల్పించిన వైద్య సదుపాయాలు మొదలైన విషయాలను పొందుపర్చారు. బోధన (Instruction) అధ్యాయంలో, ప్రభుత్వం విద్యాభివృద్ధి కొరకు తీసుకొన్న చర్యలు, పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థుల సంఖ్యా వివరాలు ఇందులో చర్చించారు. ఇతరాల (Miscellaneous) అధ్యాయంలో, మత సంబంధ విషయాలు (Ecclesiastical) స్థానిక సంస్థలు, సామాను (Stationary), మొదలైన విషయాలు కలవు. ఈ అధ్యాయాలతోపాటు, వాటికి అనుబంధంగా, అనేక గణాంక ( Statistics) వివరాలున్నాయి. ఇవి చరిత్ర పరిశోధనలో అత్యంత ముఖ్యమైనవి. పైన పేర్కొన్న అనేక అధ్యాయాల్లోని విషయాల నాధారంగా, ఈ గణాంక వివరాలు ఉంటాయి. ఈ వివరాలన్నీ, క్రితం సంవత్సర వివరాలతో పోల్చిచూడబడతాయి. దీనివల్ల, ఒక పాలనా రికార్డులో రెండు సంవత్సరాల గణాంక వివరాలు మనకు లభిస్తున్నాయి.

BRAOU

## 9.6 చరిత్ర పరిశోధనకు పాలనా రికార్డుల ఉపయోగం

వలస కాలం నాటి భారతదేశ చరిత్రలో, ఏ అంశంపై పరిశోధన చేసినా, ఆకాలం నాటి పాలనా నివేదికలను తప్పనిసరిగా పరిశీలించాలి. పైన వివరించినట్లుగా, అత్యంత కీలక సమాచారాన్ని ఈ రికార్డులందిస్తాయి. ముఖ్యంగా, ఆర్థిక, సామాజిక, రంగాల్లో పరిశోధన చేసేవారికి, ఈ పాలనా రికార్డులు ఎంతో ఉపయోగపడతాయి. కొన్ని పాలనా రికార్డుల్లో, రాజకీయ చర్చకూడ ఉండటం వల్ల, అవి రాజకీయ అంశంపై పరిశోధన చేసే వారికి కూడ ఎంతో ఉపయోగపడతాయి. అనేక అంశాల గణాంక వివరాలు లభ్యమవడం వల్ల, కొన్ని సంవత్సరాల గణాంక వివరాలను పోల్చి చూడ్డం ద్వారా, వివిధ విషయాల అభివృద్ధి లేక, కుంటుపడ్డం గురించి తెలుసుకోవడమే కాకుండా, అలా జరగడానికి దారితీసిన పరిస్థితులను కూడా, ఈ రికార్డుల్లో లభించే సమాచారం ద్వారా తెలుసుకోవచ్చు.

## 9.7 పాలనా రికార్డుల పరిమితులు (Limitations)

ఈ పాలనా రికార్డులకు అనేక పరిమితులున్నాయి. ఇవి ప్రభుత్వం తయారుచేసిన రికార్డులు కాబట్టి, ఇవి ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటాయి. ఏ సందర్భంలోను ప్రభుత్వ వ్యతిరేక కార్య కలాపాలను, ఉద్యమాలను గురించి ఈ రికార్డుల్లో చేర్చడం జరగదు. అంతేకాకుండా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసిన వారిని నేరస్తులుగాను, దుర్మార్గులుగాను ముద్రవేయడం జరిగింది. అటువంటి వారిలో చాలామంది, జాతీయయోద్యమం ద్వారా ప్రభావితమవడమో, లేక ప్రభుత్వ వ్యతిరేక విధానాల ద్వారా స్పందించటంమో జరిగి ఉండవచ్చు. కాబట్టి, చరిత్ర పరిశోధకుడు ఈ విషయాలను సేకరించేటప్పుడు, తగిన జాగ్రత్త వహించాలి.

కొన్ని సందర్భాల్లో ఈ పాలనా రికార్డుల్లోని సమాచారం తప్పులతో ఉండొచ్చు. ఇది విషయ సేకరణలో, క్రింది స్థాయి ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఎదురయ్యే సమస్య. ఈ పాలనా రికార్డుల కోసం, సమాచారాన్ని ప్రత్యేక పట్టికల ద్వారా సేకరించటం జరుగుతుందని తెలుసుకున్నాం. ఈ పట్టికలను పంపేటప్పుడు, ఒక్కోసారి క్రింది స్థాయి అధికార్లు, ఆ సంవత్సర వివరాలను సేకరించకుండా, క్రిందటిసారి పంపిన పట్టికను ఏమార్పులు లేకుండా పంపొచ్చు. ఇటువంటి పొరపాట్లు, పై అధికారులు గుర్తించే సరికి, చాలాకాలం గడిచిపోతుంది. ఉదాహరణకు, 1885లో గంజాం కలెక్టర్ జె. జి. హోర్స్‌ఫాల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు ఒక లేఖ రాస్తూ, అంతకుముందు 7 సంవత్సరాల క్రితం, తహసీల్దారుల నుండి రప్పించిన వేతనాల పట్టికను ఏ మార్పులు లేకుండా, యధాతధంగా, 1883-84 సంవత్సరం వరకు పాలన రికార్డుల్లో పొందుపర్చారని, వేతనాల్లో వచ్చిన అనేక మార్పులను అందులో పొందుపర్చలేదని తెలిపాడు.

అదే విధంగా, 1872 లో నెల్లూర్ కలెక్టర్ సరుకుల ధరల్లో అనేక మార్పులు వచ్చినా, అనేక సంవత్సరాలు ఒకే విధమైన ధరలను కొన్ని తాలుకాల తహశీల్దారులు సూచించటాన్ని గుర్తించి, బోర్డ్ఆఫ్ రెవెన్యూకు తెలియపర్చాడు. కాలానుగుణంగా, ఒక్కోసారి ప్రభుత్వ అవసరాల దృష్ట్యా, పాలనా రికార్డుల్లో అకస్మాత్తుగా మార్పులు చోటుచేసుకొనవచ్చు. కొన్ని కొత్త విషయాలను చేర్చడమో, లేదా ఉన్న వాటిలో కొన్నిటిని తొలగించడమో, పట్టికల విషయంలో అయితే, ఆ పట్టిక నమూనాను, మార్చడమో జరుగుతుంది. ఈ విధమైన మార్పుల వల్ల, ఒక్కోసారి పరిశోధకునికి కావాల్సిన సమాచారం, అకస్మాత్మ్గా కనబడకుండా పోవడమో, కొత్త మార్పుల వల్ల ఇంతకు ముందు సేకరించిన సమాచారానికి పొంతన లేకుండా పోవడమో జరుగుతుంది. అటువంటప్పుడు, పరిశోధకుడు అధైర్యపడక సమాచారానికి సంబంధించిన ఆయా శాఖల రికార్డులను సంప్రదించడం ద్వారా, తనకు కావాల్సిన సమాచారాన్ని సేకరించటానికి ప్రయత్నించాలి.

## 9.8 పాలనా రికార్డులు లభ్యమయ్యే చోటు

ఈ పాలనా రికార్డులు ఆయా రాష్ట్రాల అభిలేఖాభాండాగారాల్లో (Archives) లభిస్తాయి. బ్రిటీష్ వారు ఈ రికార్డులను విస్తృతంగా ముద్రించి, వాటిని భారత ప్రభుత్వానికి, బ్రిటీష్

BRAOU

ప్రభుత్వానికి పంపించటం వల్ల, ఇవి భారత రాజధాని, ఢిల్లీలోని జాతీయ అభిలేఖాభాండాగారం (National Archives) లోనూ, లండన్‌లోని ఇండియా ఆఫీస్ లైబ్రరీ (India Office Library) లోను భద్రపర్చబడ్డాయి. కొన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలలో కూడ ఇవి లభిస్తున్నాయి.

## 9.9 సంగ్రహంగా

1. వలస కాలం నాటి భారతదేశంలో ఏ అంశంపై పరిశోధన చేయాలన్నా, పాలనా రికార్డులు ఎంతో ఉపయోగపడతాయి.
2. పాలనా రికార్డులను తయారుచేసి ప్రతి సంవత్సరం ముద్రించడం ద్వారా, ప్రభుత్వం వివిధ శాఖల్లోని లోటుపాట్లను తెలుసుకొని, పరిపాలనా యంత్రాంగాన్ని పటిష్టపరిచే వీలు కలుగుతుంది.
3. పాలనా రికార్డులు కీలక సమాచారాన్ని అందించినప్పటికి, అవి ప్రభుత్వంచే తయారుచేయబడతాయి. కాబట్టి, ప్రభుత్వ అనుకూల సమాచారమే, ఇందులో చోటుచేసుకొంటుంది. కాబట్టి, వీటిని జాగ్రత్తగా పరిశీలించాలి.

## 9.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. సాధారణ పాలనా రికార్డుల్లోని అంశాలను వివరించండి.
2. పాలనా రికార్డులను తయారుచేసే విధానాన్ని తెలపండి.

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. శాఖా పాలనా రికార్డులను గురించి వివరించండి.
2. చరిత్ర పరిశోధనకు పాలనా రికార్డుల ఉపయోగాన్ని తెలియజేయండి.
3. ప్రభుత్వానికి పాలనా రికార్డులు ఎలా ఉపయోగపడ్తాయి?
4. పాలనా రికార్డులకు గల పరిమితులెవ్వి?

## 9.11 ఉపయుక్త గ్రంథాలు

Baliga B.S. : **Studies in Madras Administration**

Maclean, C.D : **Manual of Administration of Madras Presidency , 3 Vols.**

**Standing Information on the Administration of Madras Presidency**

రచయిత: **జి. సుదర్శన్ రెడ్డి**

BRAOU

# భాగం-10 : వార్తాపత్రికలు

విషయ క్రమం

10.0 లక్ష్యాలు

10.1 పరిచయం

10.2 చరిత్ర రచన-వార్తాపత్రికల ప్రయోజనం

10.3 భారతదేశంలో వార్తాపత్రికలు - ఆవిర్భావం - పరిణామం

10.4 భారతీయ భాషా పత్రికల పుట్టుక

10.5 తెలుగు పత్రికల అవతరణ

10.6 ప్రభుత్వ విధానాలు - వార్తాపత్రికలు

10.7 సాంఘిక సంస్కరణలు - వార్తాపత్రికలు

10.8 ఆర్థిక వ్యవస్థ - వార్తాపత్రికలు

10.9 జాతీయోద్యమం - వార్తాపత్రికలు

10.10 అంతర్జాతీయ సంఘటనలు - వార్తాపత్రికలు

10.11 ముగింపు

10.12 సంగ్రహంగా

10.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

10.14 ఉపయుక్త గ్రంథాలు

## 10.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- వార్తాపత్రికలు ప్రారంభమైన విధాన్ని వివరించగలగాలి.
- భారతదేశంలో వార్తాపత్రికలు-ఆనాటి పరిస్థితులను విశ్లేషించగలగాలి.
- భారతదేశంలో పత్రికలు-వివిధ అంశాలను పేర్కొనగలగాలి.

BRAOU

- భారతీయ భాషా పత్రికలు-జాతీయ చైతన్యాన్ని వివరించగలగాలి.
- చరిత్ర రచనకు వార్తాపత్రికల ఉపయోగాన్ని వివరించగలగాలి.

## 10.1 పరిచయం

నవీన యుగంలో పత్రికా రంగం ఒక బలమైన శక్తిగా అవతరించింది. అది అన్ని రంగాల్లో వివిధ అభివృద్ధికరమైన విషయాలకు సహాయం చేస్తుంది. పత్రికా రంగాన్ని, 'ఫోర్త్ ఎస్టేట్, ఎల్లప్పుడూ సమావేశంలో ఉండే ప్రజా పార్లమెంట్' అని వర్ణించడం ద్వారా, దానికి నవీన యుగంలో ఎంత ప్రాముఖ్యం ఉందో మనం తెలుసుకోవచ్చు. ప్రపంచంలో ప్రజాస్వామ్య స్థాపనలో పత్రికా రంగ పాత్ర విశిష్టమైంది. అధిక జనాభాకు అందుబాటులో ఉంటూ, వార్తాపత్రికలు వివిధ విషయాలపై సమాచారాన్ని అందించడమేకాక, వారి ఆలోచనా సరళిని ప్రభావితం చేస్తాయి. అంతేకాక, వార్తా పత్రికలు రాజకీయ, రాజకీయేతర విషయాలను విమర్శనాత్మకంగా రాస్తూ, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తాయి. వార్తాపత్రికలు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తాయి. అల్లే, ప్రభుత్వ విధానాలపై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయి. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితులను చేస్తాయి. ప్రజాభిప్రాయాన్ని సేకరించి, పరిపాలనా వ్యవస్థ సక్రమ పద్ధతిలో నడిచే విధంగా, దోహదం చేస్తాయి. అంతేకాక, అంతర్జాతీయ విషయాలను ప్రజల ముంగిట ఉంచి, వారిని చైతన్యవంతులను చేయడానికి ప్రయత్నం చేస్తాయి. నెపోలియన్ చక్రవర్తి 'వెయ్యి తుపాకుల కంటే, నాలుగు ప్రతికూల వార్తాపత్రికలకు భయపడాల్సి వస్తుంది' (Four hostile newspapers are more to be feared than a thousand bayonets) అని అంటాడు. అలాగే, వార్తాపత్రికల ప్రాముఖ్యత ఎలాంటిదో అమెరికా మాజీ అధ్యక్షుడు థామస్ జెఫర్సన్ వ్యాఖ్యల నుండి తెలుసుకోవచ్చు. 'మనకు వార్తాపత్రికలు లేని ప్రభుత్వం కావాలా, లేక ప్రభుత్వంలేని వార్తాపత్రికలు కావాలా, అని నన్నడిగితే, మరో ఆలోచన లేకుండా నేను ప్రభుత్వంలేని వార్తాపత్రికలు కావాలంటాను' అని అంటాడు. వార్తాపత్రికలు ప్రపంచానికి అద్దం పట్టేవి. వాటర్‌గేట్ ఉదంతాన్ని వెలికితీసి, అంతర్జాతీయంగా సంచలనాన్ని సృష్టించి, మాజీ అమెరికా అధ్యక్షుడు నిక్సన్ రాజీనామాకు కారణమైన పరిస్థితులను కల్పించాయి. ఇది అమెరికాలోని పత్రికా రంగానికి గొప్ప విజయం.

BRAOU

కంపెనీ పాలనలో భారతదేశానికి అచ్చు యంత్రం వచ్చింది. మొదటి వార్తాపత్రిక ఆంగ్లంలోనే వెలువడింది. బ్రిటీష్ అధికారిక ఉద్దేశాలను ప్రచారం చేయడానికీ, ప్రపంచమంతటా జరుగుతున్న నూతన విషయాలను భారతదేశంలో నివసిస్తున్న ఐరోపీయులకు తెలియపర్చడానికి, పత్రికలను ప్రారంభించారు. అయితే, 19వ శతాబ్దాంతానికి భారత రాజకీయ మేధావి వర్గం వార్తాపత్రికను ఒక ప్రచార సాధనంగా అంగీకరించింది. అయితే, ఒక ముఖ్య విషయం ఏమిటంటే, దాదాపుగా 1940 వరకు భారతీయ పత్రికాధిపతులు వార్తాపత్రికలను ప్రారంభించి, నడిపించటంలో ముఖ్యోద్దేశం ఏమిటంటే జాతీయోద్యమం; రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వికాసం. అంతేకాని, పత్రికలను స్థాపించి, లాభాలను ఆర్జించడం వారి ఉద్దేశం కాదు.

పత్రికల ఆవిర్భావంతోనే భారతదేశంలో ఆధునిక యుగం ప్రారంభమైందని చెప్పటంలో, అతిశయోక్తిలేదు. ఆధునిక భావ వ్యాప్తికి పత్రికలు సాధనాలయ్యాయి. ఈకాలంలోనే, భారతదేశంలో

సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం, సంఘసంస్కరణోద్యమం ప్రారంభమైనాయి. జాతీయ చైతన్యం బాగా వ్యాప్తిచెందింది. వీటన్నింటికీ పత్రికలు బాగా కృషిచేశాయి. అంతేకాకుండా, జాతీయోద్యమ వ్యాప్తికి, దేశ స్వాతంత్ర్యం కొరకు విశేష కృషి చేస్తున్న నాయకులకు, పత్రికలు అండగా నిల్చి, ప్రముఖ పాత్రను నిర్వహించాయి. అందుకే, ప్రముఖ చరిత్రకారుడు ఎస్. గోపాల్ 'పత్రికలు నిర్వహించిన పాత్రను పరిధిలోకి తీసుకోకుంటే, భారత జాతీయోద్యమ చరిత్ర అసంపూర్తిగా ఉంటుంది' అని వ్యాఖ్యానించాడు. (A History of Indian nationalism would be incomplete without taking into account the contribution of news papers). ఇప్పుడు మనం భారతీయ పత్రికల తొలి చరిత్ర ఎటువంటిది? ఆంగ్లం, స్వదేశీ భాషలలో ఆ పత్రికలు చేసిన సేవ ఎటువంటిది? చరిత్ర పునర్నిర్మాణానికి అవి ఎంతవరకు దోహదపడ్డాయి? అనే విషయాలను పరిశీలిద్దాం.

## 10.2 చరిత్ర రచన - వార్తాపత్రికల ప్రయోజనం

చరిత్ర రచనకు వివిధ రకాలైన ఆధారాలను ఉపయోగించడం జరుగుతోంది. ప్రాథమిక, మాధ్యమిక ఆధారాల సహాయంతోనే, చరిత్రకారుడు తాను చేపట్టిన అంశంపై సరియైన పరిశోధన జరిపి, మంచి ఫలితాలను సాధించగలడు. ఇంతవరకు మనం వివిధ ఆధారాలు చరిత్ర రచనలో ఏ విధంగా ఉపయోగపడతాయో తెలుసుకున్నాం. అంటే, సమకాలీన సమాజంలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను విమర్శనాత్మకంగా విశ్లేషించి, భవిష్యత్తులో చరిత్ర రచనకు ఒక ప్రామాణికమైన ఆధారంగా వార్తాపత్రికలు ఉపయోగపడతాయి. అట్లే, సమకాలీన సమాజంలోని మంచి, చెడ్డలను విమర్శనాత్మకంగా వివరిస్తూ, సామాజిక మార్పుకు దోహదం చేస్తాయి. ప్రభుత్వ విధానాల్లోని లోపాలను ఎత్తిచూపి, ప్రజావసరాలకు అనుగుణంగా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకునేటట్లు చేస్తాయి. అంతేకాకుండా, విద్యా రంగంలో బాగా వెనుకబడ్డ, రాజకీయ చైతన్యం లేక, పరాయి పాలనలో మగ్గుతున్న భారతీయుల్లో, రాజకీయ అవగాహనను ప్రేరేపించటంలో ప్రముఖ పాత్ర వహించి, భారత స్వాతంత్ర్య సమరంలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాయి. అదే విధంగా, అంతర్జాతీయ సంఘటనల విషయానికొస్తే, ఎన్నో అంశాలను విశ్లేషించి రాయడం ద్వారా, ప్రజల అవగాహనను పెంపొందించి, వారి విజ్ఞానాన్ని వృద్ధిచేసుకోడానికి దోహదం చేస్తాయి. అందుచేత, కాలక్రమేణ భారతదేశంలోను, అంతర్జాతీయంగాను వార్తాపత్రికలు ఒక పట్టుకొమ్మగా, ఒక బలవత్తరమైన సాధనంగా అభివృద్ధి చెంది, ప్రభుత్వ వైఖరిని మార్చడంలోను, వివిధ విధానాలపై ప్రజాభిప్రాయాన్ని తయారుచేయటంలోను, విశిష్టమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. అందువల్ల, చరిత్ర రచనలో, ప్రత్యేకంగా నవీన యుగ చరిత్రకు సంబంధించిన ఏ అంశంపై పరిశోధన చేయాలన్నా, వార్తాపత్రికలను తప్పనిసరిగా సంప్రదించాల్సి ఉంటుంది. వార్తాపత్రికలు ఒక ఉన్నత ప్రమాణాలున్న ప్రాథమిక ఆధారంగా చరిత్ర రచనకు ఎంతో ఉపయోగకరంగాను, ప్రయోజనకరంగాను ఎలా తోడ్పడతాయో, తదితర విషయాలను తెలుసుకుందాం.

BRAOU

## 10.3 భారతదేశంలో వార్తాపత్రికల ఆవిర్భావం - పరిణామం

భారతదేశంలో 1780 లో ముద్రితమైన వార్తాపత్రిక వెలువడింది. అప్పటి నుండి దాదాపుగా 1830 వరకు, ఆంగ్లో-ఇండియన్ పత్రికలే ప్రాముఖ్యం వహించాయి. ఆధునిక ప్రయాణ సాధనాలు, **తంతి-తపాలా సౌకర్యాలు** లేని కాలంలో, భారతదేశంలో వార్తా ప్రసారం జరిగిన విధానాన్ని పరిశీలిస్తే, చాల ఆసక్తిదాయకంగా ఉంటుంది. ప్రాచీన కాలంలో భారతదేశాన్ని పరిపాలించిన రాజుల్లో, అశోకుడు

గొప్ప చక్రవర్తి. ఆయన కాలంలో, భారతదేశం లోని సువిశాల ప్రాంతం ఆయన ఆధిపత్యంలోకి వచ్చింది. అయితే, అంత సువిశాల ప్రాంతంలో ఒక చోట నుండి మరో చోటకి వెళ్లటానికి చెప్పుకోతగ్గ ప్రయాణ సాధనాలుగాని, వార్తలు చేరవేసే సాధనాలుగానీ ఉండేవికావు. అశోక చక్రవర్తి రాతి ఫలకాల పైన, రాతి స్తంభాలపైన, రాజకీయ ప్రకటనలను రాయించి, వాటిని రాజ్యంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రతిష్ఠించాడు. తర్వాత కాలంలో, కొందరు రాజులు గోడలపై రంగుల ద్వారా, చిత్రలిపి వార్తలను రాసే ఏర్పాటు చేశారు. రోజు వాటిని తుడిచివేసి, తాజా వార్తలను రాసేవారు.

అయితే, వార్తా ప్రసారంలో మొగల్ రాజుల కాలం ఒక నూతన శకాన్ని ప్రారంభించింది. ఆకాలంలో, వార్తా లేఖలు వ్యాప్తిలో ఉండేవి. ప్రతి మండల రాజధానిలో వార్తా సేకరణ కేంద్రాలు ఉండేవి. అక్కడ విలేకరులు కూడ ఉండేవారు. వారిని 'వాకియా -ఇ -నవీస్' అని పిలిచేవారు. ఆయా మండలాల నుండి వార్తలను వార్తాలేఖల ద్వారా రాజధానికి అందజేసేవారు. ఈ వార్తా లేఖలను రాత్రి తొమ్మిది గంటలప్పుడు అంతఃపుర కాంతలు, ఔరంగజేబ్ చక్రవర్తికి వినిపించేవారని వెనీషియాకు చెందిన యాత్రికుడు నికోలా మనుక్కి తెలియజేస్తున్నాడు. ఈ వార్తాలేఖల్లో పదోన్నతి, చక్రవర్తి మసీదులను, ఇతర పవిత్ర స్థలాలను సందర్శించడం, చక్రవర్తి వేటకు వెళ్లడం, చక్రవర్తికి సందర్శకుల ద్వారా వచ్చిన బహుమానాల వివరాలు, ఇతర విషయాలపై సమాచారం లభ్యమౌతుంది. పాలకులు దేశంలో జరిగే విషయాలను తెలుసుకోవటానికి, ఈ విధానం ఎంతగానో తోడ్పడేది.

కాగితం ఉపయోగంలోకి రాక పూర్వం, మృగాల చర్మాలు, రాతి ఫలకలు, లోహం రేకులు, మొదలైన వాటిపైన రాసేవారు. చైనా దేశస్థులే మొట్టమొదట కాగితాన్ని కనుగొన్నారు. క్రీ.శ. 105 లోనే ట్రామ్‌లన్ అనే చైనా దేశస్థుడు మల్బరీ చెట్ల కాడల సహాయంతో, కాగితాన్ని తయారుచేశాడు. ఏడవ శతాబ్దంలో, కాగితాన్ని తయారుచేసే పద్ధతిని చైనా బౌద్ధ భిక్షువుల ద్వారా, జపాన్‌లో నేర్చుకున్నారు. మొట్టమొదట ముద్రణ విధానాన్ని కూడా, చైనీయులే కనుగొన్నారు. క్రీ.శ. 868 లో చైనా దేశంలో, "వజ్రసూత్ర" అనే బౌద్ధ వాఙ్మయ గ్రంథాన్ని ముద్రించారు. ప్రపంచంలో మొట్టమొదట ముద్రితమైన గ్రంథం ఇదే అని చెప్పారు. అలాగే, జర్మనీకి చెందిన గూటెన్‌బర్గ్ (1400-1468) ను ఆధునిక ముద్రణా కళ పితామహుడుగా భావిస్తారు. ఇతడు 15వ శతాబ్దంలో లాటిన్ భాషలో "మజారైన్ బైబిల్" అనే గ్రంథాన్ని ముద్రించాడు.

భారతదేశ విషయానికి వస్తే, పాశ్చాత్య దేశాల వారికి క్రైస్తవ మత ప్రచారం కోసం, దేశ భాషల్లో మత గ్రంథాలను రచించి, ముద్రించాల్సిన అవసరం ఏర్పడింది. అంతేకాకుండా, వలస రాజ్యాధిపత్యం ఏర్పడ్డ తర్వాత, పరిపాలనావసరాలు, స్థానిక ప్రజలతో సంబంధాల కోసం, అధికారులు దేశ భాషలను అభ్యసించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ అవసరాలను గుర్తించిన క్రైస్తవ మిషనరీలు, వలస రాజ్యాధినేతలు భారతదేశంలో ముద్రణ కళను అభివృద్ధి చేశారు. భారతదేశంలో క్రైస్తవ మత ప్రచారకులే, మొట్టమొదట ముద్రణా శాల (Printing Press)ను స్థాపించారు. క్రీ.శ. 1556 లో జెసూట్ మిషనరీలు గోవాలో ముద్రణా శాలను నెలకొల్పారు. అక్కడ 'డాక్ట్రినా క్రిష్టా' అనే గ్రంథాన్ని ముద్రించారు. ఇదే, భారతదేశంలో ముద్రితమైన మొదటి గ్రంథం. ఆ తర్వాత, క్రైస్తవ మత ప్రచారకులు, ఇతర విదేశీ అధికారుల కృషి వల్ల, భారతీయ భాషల్లో ఒక దాని తర్వాత ఒకటి ముద్రణా శాలలను ఏర్పర్చి, గ్రంథాలను ముద్రించడం ప్రారంభమైంది.

BRAOU

భారతదేశంలో వెలువడ్డ మొదటి పూర్తి స్థాయి వార్తాపత్రిక, "బెంగాల్-గజెట్". దీన్ని "కలకత్తా జనరల్ అడ్వర్టయిజర్" అని కూడ పిలిచేవారు. ఈ పత్రిక మొదటి సంచిక, 1780 జనవరిలో వెలువడింది. దీన్ని కలకత్తాలో జేమ్స్ ఆగస్టస్ హికీ అనే ఆంగ్లేయుడు ప్రారంభించాడు. ఇది ఒక ఆంగ్ల భాషా వారపత్రిక. ఈ పత్రికను 'హికీస్ గజెట్' అని పిలిచేవారు. ఎందుకంటే, హికీ ఒక్కడే వ్యవస్థాపకుడుగా, సంపాదకుడుగా, ముద్రాపకుడుగా ఈ పత్రిక నడిచింది. ఈ పత్రికలో సంచలనాన్ని పుట్టించే వార్తలను ప్రచురించేవాడు. హికీ సాహసికంగా, స్వతంత్ర పౌరునిగా తన వార్తాపత్రికలో నగ్నంగా వార్తలను ప్రచురించడం జరిగేది. తూర్పు ఇండియా వర్తక సంఘంలోని ఉన్నతోద్యోగుల అంతరంగిక, బాహ్య జీవితాలను అరమరిక లేకుండా విమర్శించాడు. అంతేకాకుండా, అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఎలిజా ఇంపీని విమర్శించడం ప్రారంభించాడు. చివరకు, గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ భార్యపైకూడ, విమర్శలను ప్రారంభించాడు. ప్రభుత్వం హికీపై కఠినంగా వ్యవహరించడం ప్రారంభించింది. ప్రభుత్వం హికీని అరెస్ట్ చేసింది. జరిమానా కట్టమంది. చివరకు, 1782 లో హికీ ముద్రణాశాలను స్వాధీనపర్చుకుని, ఖైదు చేసి, దేశం నుండి పంపివేశారు. చివరకు, ఇంగ్లాండ్‌లో హికీ పేదరికంతో చనిపోయాడు. శారీరకంగా చితికి పోయినా, పత్రికా స్వాతంత్ర్యాన్ని నొక్కి చెప్తూ, తూర్పు ఇండియా కంపెనీ దోపిడిని ఎత్తి చూపిన హికీ, పాత్రికేయులకు చిరస్మరణీయుడు. 1780 నవంబర్‌లో కలకత్తాలో 'ఇండియా గెజెట్' అనే మరో వార పత్రిక ఆంగ్లంలో ప్రారంభమైంది. అయితే, ఈ వార పత్రిక ప్రభుత్వాన్ని సమర్థిస్తూ, అనేక రాయితీలను అనుభవించింది. మూడో వార్తాపత్రిక 'కలకత్తా గెజెట్', ఆంగ్లంలో వార పత్రికగా 1784 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. దీనికి కూడ ప్రభుత్వం సహాయం చేసింది. ఇందులో వార్తలు ఆంగ్లంలోను, వ్యాపార ప్రకటనలు వంగ, పారశీక భాషల్లోను ఉండేవి. తర్వాతి కాలంలో, ఇది ప్రభుత్వ అధికార గెజెట్‌గా మారి, ప్రచురితమైంది. భారతదేశంలో వెలువడ్డ నాలుగో పత్రిక, 'బెంగాల్ జర్నల్', 1785 ఫిబ్రవరిలో థామస్ జోన్స్ ప్రారంభించాడు. ఇది కూడ ఆంగ్ల భాషా వార పత్రిక. 1785 లోనే 'ఓరియంటల్ మ్యాగజైన్' లేక, 'కలకత్తా ఎమ్యూజ్‌మెంట్' అనే పత్రిక ప్రచురణ ప్రారంభమైంది. ఇది భారతదేశంలో వెలువడ్డ మొదటి మాస పత్రిక. 'కలకత్తా క్రానికల్' 1786 జనవరిలో భారతదేశంలో ప్రారంభమైన అయిదో పత్రిక. ఆంగ్లేయుల సంపాదకత్వంలో ఆంగ్లంలో ప్రచురించిన పై పత్రికలన్నిటినీ ఎక్కువగా కంపెనీ ఉద్యోగులు చదివేవారు. పత్రికల్లో ఎక్కువ భాగం, వ్యర్థ ప్రసంగాలు, సరదా కబుర్లూ ఉండేవి. ప్రసార సాధనాలు లేని ఆకాలంలో, విదేశాల నుండి వార్తలు భారతదేశానికి రావడానికి రెండు, మూడు నెలలు పట్టేది. అందువల్ల, భారతదేశంలోని అప్పటి వార్తాపత్రికలు ఎక్కువగా అధికార, అనధికార వ్యక్తుల కుంభకోణాల గురించి రాస్తూ, వ్యక్తిగత ద్వేషాలను ప్రజా సమస్యలుగా మార్చి, పత్రికలలో ప్రచురించేవారు. ఏది ఏమైనా, ఈ పత్రికలు భారతీయ పత్రికా రంగానికి పునాదులుగా పనిచేశాయి. ఇదే సమయంలో, మద్రాస్‌లో కూడ ఆంగ్ల వార్తాపత్రికలను నెలకొల్పారు. ప్రభుత్వ ముద్రాపకుడైన రిచర్డ్ జాన్సన్ 1785 అక్టోబర్‌లో 'మద్రాస్ కొరియర్' అనే పత్రికను ప్రారంభించాడు. దీనికి ప్రభుత్వ గుర్తింపు కూడా లభించింది. బాయ్డ్ అనే వ్యక్తి 1791 లో 'హరకారు' అనే పత్రికను నడిపాడు. అయితే, రెండేళ్ల తర్వాత బాయ్డ్ మరణించడంతో, ఈ పత్రిక ఆగిపోయింది. 1785 లో రాబర్ట్ విలియమ్స్ 'వీక్లీ మద్రాస్ గెజెట్' అనే పత్రికను స్థాపించాడు. అదే సంవత్సరం, హంఫ్రియస్ అనే ఆంగ్లేయుడు, 'ఇండియన్ హెరాల్డ్' అనే పత్రికను స్థాపించాడు. ఆయనకు పత్రికను

BRAOU

స్థాపించడానికి ప్రభుత్వం అనుమతి నీయకపోయనప్పటికీ, పత్రికను ప్రారంభించడంతో ప్రభుత్వం నిర్బంధించి, స్వదేశానికి పంపే ఏర్పాట్లు చేసింది. అయితే, ఇతడు మధ్యలోనే మాయమయ్యాడు.

ఇక బొంబాయి విషయానికొస్తే, 1789 లో మొదటిసారిగా 'బాంబే హెరాల్డ్' అనే ఆంగ్ల వార పత్రిక వెలువడింది. ఇక్కడి నుండి వెలువడ్డ రెండో పత్రిక, 'బాంబే కొరియర్'. దీన్ని, 1790 లో బాకాష్ బర్నర్ అనే ఆయన స్థాపించాడు. ఇప్పటి టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికకు, ఈ కొరియర్ పత్రిక ప్రాతిపదిక. 1839లో అప్పటి కొరియర్ పత్రిక సంపాదకుడు రాబర్ట్‌సైట్ ఆ పేరును మార్చి, 'బాంబే టైమ్స్' అని పేరు పెట్టాడు. ఈ పత్రికలో, గుజరాతీ భాషలో వ్యాపార ప్రకటనలను ముద్రించేవారు. 1791 జూన్‌లో 'బాంబే గెజెట్' అనే పత్రిక వెలసింది. అప్పటి పోలీస్ కమీషనర్ని విమర్శించాడనే ఆరోపణతో, ఈ పత్రిక ప్రూఫ్‌లను ప్రభుత్వ పర్యవేక్షణకు సమర్పించాలని ఆజ్ఞాపించాడు. 1792 లో 'బాంబే హెరాల్డ్', 'బాంబే గెజెట్' పత్రికలు విలీనమయ్యాయి. ప్రభుత్వ గుర్తింపు పొంది, ప్రభుత్వ పత్రికగా మారింది.

బ్రిటీష్ వారు భారతదేశంలో ముద్రణా యంత్రాన్ని ప్రవేశ పెట్టడం, గొప్ప సంఘటనగా చెప్పుకోవచ్చు. భారత ప్రజల్లో జాతీయ చైతన్యం పెరిగి, జాతీయ భావాలు ఉన్న పత్రికా రంగం ఏర్పాటు కావడానికి దోహదం చేసింది. రాజారామ్‌మోహన్‌రాయ్‌ని జాతీయ భావాలు ఉన్న పత్రికా రంగ స్థాపకుడుగా, మనం చెప్పుకోవచ్చు. 1861 భారత కౌన్సిళ్లచట్టం తర్వాత, భారతీయుల్లో రాజకీయ చైతన్యం పెరిగి, భారతదేశంలో పత్రికా రంగ అభివృద్ధికి కారణమైంది. తర్వాత కాలంలో, చాల మంది జాతీయ భావాలు కల భారతీయులు, ఆంగ్లంలో దిన పత్రికలను ప్రారంభించారు. 1861 లో బొంబాయిలో 'టైమ్స్ ఆఫ్ ఇండియా'; 1865 లో 'పయొనీర్' అలహాబాద్‌లో; 1868 లో 'మద్రాస్ మెయిల్' మద్రాస్‌లో; 1875లో 'స్టేట్స్‌మాన్' కలకత్తాలో; 'సివిల్ అండ్ మిలిటరీ గజెట్' 1876 లో లాహోర్‌లో ప్రారంభించబడ్డాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా సాధారణంగా, బ్రిటీష్ ప్రభుత్వ విధానాలను సమర్థించేది. పయొనీర్ భూస్వామ్య, వ్యాపార వర్గాలకు మద్దతును పలికేది. మద్రాస్ మెయిల్ ఐరోపా వ్యాపార వర్గానికి వత్తాసు పలికేది. స్టేట్స్‌మాన్ మాత్రం, ప్రభుత్వ విధానాలను, భారత జాతీయ వర్గాలను విమర్శించేది. సివిల్ అండ్ మిలిటరీ గెజెట్ పత్రిక, బ్రిటీష్ సంప్రదాయవాద అభిప్రాయాలకు మద్దతును పలికేది.

ఈ కాలంలో, జాతీయ భావాలున్న పత్రికల సంఖ్య బాగా పెరిగింది. 1868 లో హేమేంద్ర కుమార్, శిశిర్ కుమార్, మోతీలాల్ ఘోష్ సోదరులు కలకత్తాలో, అమృత బజార్ పత్రిక పేరిట, ఒక ఆంగ్ల- బెంగాలీ వార పత్రికను స్థాపించారు. అయితే, 1878 స్వదేశీ పత్రికల చట్టం నుండి రక్షించుకోడానికి వీరు, తమ పత్రికను ఆంగ్ల వారపత్రికగా మార్చడం జరిగింది. 1891లో ఇదే పత్రికను ఆంగ్ల దిన పత్రికగా మార్చడం జరిగింది. అమృత బజార్ పత్రిక గట్టి జాతీయ భావాలను ప్రచారం చేసింది. ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించడంతో, ఈ పత్రికపై ప్రభుత్వం ఎన్నో ఆంక్షలను విధించింది. భారత స్వాతంత్ర్య సమరంలో ప్రముఖ పాత్ర వహించిన సురేంద్రనాథ్ బెనర్జీ స్వీయ సంపాదకత్వంలో, 'బెంగాలీ' అనే ఆంగ్ల పత్రికను ప్రచురించాడు. బెంగాలీ పత్రిక మిత భారత రాజకీయాల్లో, మితవాద విధానానికి మద్దతును పలికేది. లార్డ్ లిట్టన్ కాలం లోని అణచివేత విధానాలు భారతీయులను తీవ్ర అసంతృప్తికి గురిచేయడమేకాక, పత్రికా రంగం మరింత

BRAOU

పటిష్టపడేటట్లుగా చేసింది. దీని ఫలితంగా, మద్రాస్‌లో జి.వి. సుబ్రమణ్య అయ్యర్, వీరరాఘవాచారి, ఇతర దేశభక్తులు 'హిందూ' అనే ఆంగ్ల వార పత్రికను 1878లో ప్రారంభించారు. దీన్ని 1889 నుండి దిన పత్రికగా ఆంగ్లంలో ప్రచురించారు. 1889 తర్వాత, ఉధృతమౌతున్న జాతీయ పోరాట ప్రభావం, పత్రికా రంగంపై కూడ పడింది. ఫలితంగా, అతివాద, మితవాదాలు ప్రచారంలోకొచ్చాయి. తిలక్ ఆంగ్ల వార పత్రిక ఇటువంటి విధానాలను బాగా సమర్ధించింది.

అంతేకాకుండా, ఈ కాలంలో జాతీయ చైతన్యం సంఘ సంస్కరణకు దారితీసింది. ఫలితంగా, కేవలం సంఘ సంస్కరణలను ప్రచారం చేయడానికి, 'ది ఇండియన్ సోషల్ రిఫార్మర్' అనే ఆంగ్ల వార పత్రికను 1890 లో బొంబాయిలో ప్రారంభించారు. ఈ కాలంలోనే, కొన్ని ఆంగ్ల మాస పత్రికలను పారంభించారు. దీంట్లో ప్రముఖమైంది, 1907 లో కలకత్తాలో ప్రారంభించిన 'ది మోడరన్ రివ్యూ'. దీన్ని రమానంద్ ఛటర్జీ స్థాపించి, సంపాదకత్వం నిర్వహించాడు. ఈ పత్రిక సాంఘిక, రాజకీయ, చారిత్రక, వైజ్ఞానిక విషయాలకు ఎక్కువ స్థలాన్ని కేటాయించేది. అంతేకాకుండా, ఈ పత్రిక అంతర్జాతీయ విషయాలపై ఉపయోగకరమైన సమాచారాన్ని ప్రచురించేది. 1913 ఫిరోజ్ షా మెహతా 'బాంబే క్రానికల్' అనే పత్రికను స్థాపించాడు. దీనికి బి.జి. హార్డిమాన్ సంపాదకుడు. మద్రాస్‌లో అనీబిసెంట్ 'మద్రాస్ స్టాండర్డ్' అనే ఆంగ్ల పత్రికకు సంపాదకత్వాన్ని చేపట్టి, దాని పేరును 'న్యూ ఇండియా' గా మార్చింది. మొదటి ప్రపంచ యుద్ధం, దాని తర్వాత పరిణామాలు, ఇంకా కొన్ని జాతీయ భావాలున్న పత్రికలు ప్రారంభంకావడానికి దోహదం చేశాయి. గాంధీ సంపాదకత్వంలో 1919లో 'యంగ్ ఇండియా'ను స్థాపించి, దాన్ని తన సిద్ధాంతాలకు, విధానాలకు ప్రతినిధిగా తయారు చేశాడు. 1933లో 'హరిజన్' అనే పత్రికను ఆంగ్ల, హిందీ, ఇతర స్వదేశీ భాషలలో గాంధీ ప్రారంభించాడు.

పండిట్ మోతీలాల్ నెహ్రూ 1991లో 'ది ఇండిపెండెంట్' అనే ఆంగ్ల దిన పత్రికను, అలహాబాద్‌లో ప్రారంభించాడు. ఇది కాంగ్రెస్ పార్టీ రాజకీయ సిద్ధాంతాలను ప్రచారం చేసే అధికార పత్రికగా పేరు గాంచింది. సహాయ నిరాకరణోద్యమం తర్వాత, జాతీయ కాంగ్రెస్ ఒక వర్గం మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్‌దాస్ నాయకత్వంలో వేరుగా చీలి, కౌన్సిల్ బహిష్కరణను వ్యతిరేకించారు. వీరు 1922 లో 'హిందుస్థాన్ టైమ్స్' పేరిట, కె. యమ్. పణిక్కర్ సంపాదకత్వంలో ఢిల్లీలో ప్రారంభించారు. 1920 తర్వాత సామ్యవాద, కమ్యూనిస్ట్ భావాలు దేశంలో మెల్లగా వ్యాప్తిచెందడం జరిగింది. కార్మికులు, కర్షకులు సంఘటితమై, ఉద్యమాలను నడిపారు. వీరి భావాలు మెల్లగా కాంగ్రెస్ లోని యువకులను ఆకర్షించి, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ స్థాపనకు దారితీసింది. ఫలితంగా, ఒక ఆంగ్ల వార పత్రిక 'కాంగ్రెస్ సోషలిస్ట్' పేరిట ప్రారంభించడం జరిగింది. కమ్యూనిస్ట్‌లు 'నేషనల్ ఫ్రంట్' తర్వాత 'పీపుల్స్ వార్' పేరిట ఆంగ్లంలో వార పత్రికలను స్థాపించారు. యమ్. యన్.రాయ్, అతని అనుచరులు కమ్యూనిస్ట్‌లనుండి విడిపోయి, 'ఇండిపెండెంట్ ఇండియా' అనే ఆంగ్ల వార పత్రికను స్థాపించారు. అలాగే, 1930 లో 'ది ఫ్రీ ప్రెస్ జర్నల్' అనే పేరుతో ఒక ఆంగ్ల దిన పత్రికను ప్రారంభించారు. ఇది కాంగ్రెస్‌కు గట్టి మద్దతుదారే కాకుండా, భారత జాతీయ పోరాటాన్ని బాగా సమర్ధించింది. కాలక్రమేణా, భారతదేశం లోని అన్ని ప్రాంతాల్లో, వివిధ ప్రాంతీయ భాషల్లోనే కాకుండా, ఆంగ్ల, హిందీ, ఉర్దూ భాషల్లో వార్తాపత్రికలను విస్తృతంగా ప్రచురించారు. వివిధ అంశాలపై వార్తాపత్రికలు స్థాపించబడ్డాయి. వివిధ రాజకీయ పార్టీలు, సాంస్కృతిక, వైజ్ఞానిక

సంఘాలు, సాంఘిక, ఆర్థిక వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, భూస్వాములు, కార్మికులు, కర్షకులు, అలాగే, సామాజిక వర్గాలైన విద్యార్థులు, స్త్రీలు, దళిత వర్గాలు, కుల సంఘాలు తమ సొంత వార్తాపత్రికలను ప్రచురించి, తమ అభిప్రాయాలను, విధానాలను ప్రచారం చేయడం జరిగింది. మత తత్వ సంస్థలు, ముస్లిం లీగ్, హిందూ మహాసభ కూడా, తమ సొంత వార్తాపత్రికలను ప్రచురించారు. 1941 వరకు భారతదేశంలో 17 భాషల్లో, దాదాపుగా 4,000 వార్తాపత్రికలు, సంకీర్ణ పత్రికలు (Magazines) ప్రచురించబడ్డాయి.

## 10.4 భారతీయ భాషా పత్రికల పుట్టుక

19వ శతాబ్దం మొదటి భాగానికి భారతదేశ చరిత్రలో చాలా ప్రాముఖ్యం ఉంది. 1800 నాటికి, కంపెనీ పాలన సుస్థిరమైంది. పత్రికా రంగంలో ఒక కొత్త శకానికి నాంది జరిగింది. ఈ శతాబ్దం ప్రారంభంలోనే, భారతీయ భాషా పత్రికల స్థాపన జరిగింది. భారతీయ భాషల్లో వెలువడ్డ మొదటి పత్రిక, బెంగాల్లో 1816 లో గంగాధర భట్టాచార్య 'బెంగాల్ గెజెట్' అనే వంగ భాషా పత్రికను స్థాపించాడు. ఇదే, భారతీయుడు స్థాపించిన మొదటి పత్రిక. తొలి దేశ భాషా పత్రిక కూడా ఇదే. 1818 ఏప్రిల్‌లో సేరంపూర్ మిషనరీలు 'దిగ్దర్శన్' అనే బెంగాల్ మాస పత్రికను స్థాపించారు. అదే సంవత్సరం, 'సమాచార దర్శణ్' అనే బెంగాలి వార పత్రిక మార్ష్‌మాన్, వార్డ్‌ల కలయికతో ప్రారంభమైంది.

BRAOU

రాజారామ్‌మోహన్‌రాయ్ కృషి వల్ల, మొదట 'బ్రాహ్మణ పత్రిక' (Brahmanical Magazine) అనే పత్రిక స్థాపించబడి, కొంతకాలం తర్వాత ఆగిపోయింది. తర్వాత ఆంగ్ల, వంగ భాషల్లో, 'బ్రాహిణ్ సేవాధి'ని ప్రారంభించి, మిషనరీలు చేసే భారతీయ వేదాంత విమర్శలకు, ప్రతివిమర్శలను ప్రచారం చేశాడు. 1821 లో ఇతడు 'సంవాద కౌముది' అనే వంగ భాషా వార పత్రికను ప్రారంభించాడు. రామ్‌మోహన్‌రాయ్ ఇందులో ఉచిత విద్య కొరకు ఒక పాఠశాల అవసరమనీ, బెంగాల్‌నుండి ఇతర దేశాలకు బియ్యం ఎగుమతి చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇంగ్లీష్ వైద్యులతో చికిత్స చేయించుకోడానికి దేశీయులకు కూడ అవకాశం ఉండాలని, క్రైస్తవులు, ఇంగ్లీష్ దొరలు కలకత్తాలో స్త్రీలు, పిల్లలు అనే విచక్షణ లేకుండా హింసిస్తున్నారని, వీటిపై, ప్రజల ఆర్థిక సంక్షేమాన్ని గూర్చి, రాజకీయ హక్కులను గూర్చి నిర్భయంగా రాసేవాడు. 1822 ఏప్రిల్‌లో 'మిరాతుల్ అక్బర్' అనే పారశీక వార పత్రికను కూడ ఇతడు ప్రారంభించాడు. ఈ పత్రికలో, సంచలనాత్మక వ్యాసాలను ప్రచురించడంతో ప్రభుత్వం రెచ్చిపోయి, ఆంక్షలు విధించడంతో, ఈ పత్రిక ప్రచురణను రామ్‌మోహన్‌రాయ్ ఆపివేశాడు. 1822లో ఫుర్దోన్జీ మర్జబాన్ 'ముంబాయి-నా-సమాచార్' అనే గుజరాతీ వార పత్రికను స్థాపించాడు. ఇది 1832, లో దిన పత్రిక అయింది. 1826లో యుగల్ కిశోర్ శుక్లా అనే ఆయన హిందీలో మొదటి పత్రిక కలకత్తా నుండి 'ఉదంత్ మార్తాండ్' అనే పేరుతో ప్రారంభించాడు. తర్వాతి కాలంలో, వివిధ స్వదేశీ భాషల్లో పత్రికలు అధిక సంఖ్యలో ప్రచురించబడ్డాయి. వీటిలో 'జనశక్తి', 'ఆనందబజార్ పత్రిక', 'యుగంతర్', 'వందే మాతరం' బెంగాలీలో, 'కేసరి', 'క్రాంతి', 'నవకాల్,' 'లోక్‌మాన్య', 'కిర్లోస్కర్; మరాఠి భాషలో', 'బొంబాయి సమాచార్', 'జన్మభూమి', 'హిందూస్థాన్', 'ప్రజామిత్ర', 'సందేశ్', 'వందేమాతరం' గుజరాతీ భాషలోను; 'మాతృభూమి', మళయాళంలోను, తమిళంలో 'స్వదేశమిత్రన్' అనే పత్రికలు ప్రాముఖ్యతను పొందాయి.

## 10.5 తెలుగు పత్రికల అవతరణ

ఇక తెలుగు పత్రికల విషయానికొస్తే, ఇతర దక్షిణ దేశ భాషా పత్రికలు అవతరించిన కాలంలోనే, అంటే, 19వ శతాబ్దం మొదటి భాగంలో తెలుగు పత్రికలు ప్రారంభమయ్యాయి. ఈ ఆరంభానికి 18 వ శతాబ్దం రెండో అర్థంలో ప్రారంభమైన ఆంగ్లో-ఇండియన్ పత్రికల ఆవిర్భావమే మార్గదర్శకం. తెలుగులో ప్రారంభమైన మొదటి పత్రిక ఏది? అనేది వివాదాస్పదమైన విషయం. మొదటి తెలుగు పత్రిక 'సత్యదూత' అనీ, ఇది 1835 లో బళ్లారి క్రైస్తవ సంఘం వారు ప్రచురించారంటారు. అయితే, దీనికి సరైన ఆధారాలు లేవు. 1838 లో ఒక గుర్తు తెలియని ప్రముఖ వ్యక్తి 'వృత్తాంతిని' అనే పత్రికను ప్రారంభించాడని దాఖలాలు ఉన్నాయి. ఈ పత్రిక బాగా ప్రజాదరణ పొందిందని తెలుస్తూంది. ఒక చందాదారుడు 'లోక రక్షకుడు' అనే పేరుతో, వివాహాలలో దుబారా ఖర్చును, వినోదం కొరకు నృత్య, సంగీతాలను ఏర్పాటు చేసుకోవడం లాంటి వాటిని విమర్శిస్తూ, లేఖ రాయడం జరిగింది. దీన్ని బట్టి సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాలను రూపుమాపాలనే, ప్రజల్లో ఉన్న కోరికను మనం తెలుసుకోవచ్చు. 1842 జూన్‌లో 'వర్తమాన తరంగిణి' అనే వార పత్రిక మద్రాస్ నుండి ప్రారంభమైంది.

ఈ పత్రికలో ప్రాంతీయ వార్తలేకాక, ఐరోపాలో, చైనాలో జరిగే రాజకీయ కార్యాలను, వర్తక వ్యాపార విషయాలను, భూగోళ, ఖగోళ, ధర్మ శాస్త్ర, నీతి శాస్త్ర విషయాలను ప్రచురించేవారు. సివిల్, మిలిటరీ ఉద్యోగ నియామకాలను, సెలవులు మొదలైన ముఖ్య సంగతులను, ప్రకటనలు, ఉత్తరాలు, దేశ సమాచారాలు, పండుగలు, వాడల వివరాలు, అప్పుడప్పుడు 'రేవు దినుసులు' అనే శీర్షిక క్రింద ధాన్యం మొదలైన వాటి ధరలను తెలిపేవారు. తర్వాత, 1848 లో ఎడ్మండ్ షార్కీ అనే ఇంగ్లీష్ దొర 'హితవాది' అనే మాస పత్రికను మచిలీపట్నం నుండి ప్రచురించాడు. క్రైస్తవ మత ప్రచారమే, పత్రిక ధ్యేయం. అంతేకాకుండా, దేశ, విదేశ వార్తలు, ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, ప్రకటనలు, మొదలైన ఎన్నో ఆసక్తికరమైన విషయాలుండేవి. సుప్రసిద్ధ సంఘ సేవకుడు గాజుల లక్ష్మీనరసుచెట్టి, 1844 లో 'క్రిసెంట్' అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించాడు. దేశీయుల అభివృద్ధికి ఈ పత్రిక బాగా కృషిచేసింది. మిషనరీలు, ప్రభుత్వోద్యోగుల అన్యాయాల గురించి, ఈ పత్రిక తీవ్రంగా విమర్శించటం ప్రారంభించింది. అందువల్ల, ప్రభుత్వం ఈ పత్రికపై కక్షబూనింది. అయినా, చెట్టిగారు నష్టాల కోర్చి, ఈ పత్రికను నడిపారు. తర్వాత, 1863 లో 'శ్రీయక్షిణి', 1864 లో 'సుజన రంజని', 1871 లో 'ఆంధ్ర భాషా సంజీవని' మొదలైన ప్రముఖమైన పత్రికలను ప్రారంభించారు.

వీరేశలింగం గారితో, తెలుగులో పత్రికా రంగం కొత్త పుంతలు తొక్కింది. ఆంధ్రలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి పితామహుడు కందుకూరి. ఈయన, 1874 లో 'వివేకవర్ధని', 1876లో 'హాస్య సంజీవని', 1883 లో 'సతీహితబోధిని', 1891 లో 'సత్య సంవర్ధని'ని నిర్వహించాడు. ఆంధ్ర దేశంలో సంఘ సంస్కరణోద్యమాన్ని ప్రారంభించి, వెల్లువ లాగా ప్రవహింపజేసి దురాచారాలకు, ఛాందస భావాలకు వ్యతిరేకంగా పోరాడి, ఆంధ్ర జాతీయ, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి వీరు నాయకత్వం వహించారు. ఈ ఉద్యమాలకు పత్రికలు ప్రధాన స్థానాలయ్యాయి. పందొమ్మిదో శతాబ్దం సంస్కరణోద్యమాలకు ప్రాధాన్యం వహిస్తే, ఇరవయ్యో శతాబ్దం రాజకీయోద్యమాలకు ప్రాధాన్యం

BRAOU

వహించింది. భారత జాతీయోద్యమం ఉధృతమౌతుండగా, ఆంధ్రలో ప్రముఖ పత్రికలు జాతీయోద్యమానికి మద్దతును పలికి, తమ వంతు పాత్రను నిర్వహించాయి. 1885లో 'ఆంధ్ర ప్రకాశిక'ను మద్రాస్‌లో ఎ.సి. పార్థసారథి నాయుడు స్థాపించాడు. ఇది తెలుగులో తొలి రాజకీయ ప్రాధాన్యం ఉన్న వార పత్రిక. నాయుడుగారు దీన్ని అవిచ్ఛిన్నంగా 42 సంవత్సరాలు నడిపారు. 1902 లో ప్రారంభమైన 'కృష్ణాపత్రిక', 1907 లో 'వందేమాతరం' , 1908లో గాడిచర్ల హరిసర్వోత్తమరావు సంపాదకుడుగా, బెజవాడ నుండి వెలువడ్డ 'స్వరాజ్య' వార పత్రిక, 1908 లో కాశీనాధుని నాగేశ్వరరావు ఆధిపత్యంలో వార పత్రికగా బొంబాయి నుండి వెలువడ్డ 'ఆంధ్రపత్రిక', వివిధ అంశాలతో, జాతీయ భావాలతో, భారత స్వాతంత్ర్య సమరాన్ని సమర్థించాయి. ఆంధ్రపత్రికను 1914 లో బొంబాయ్ నుండి మద్రాస్‌కు తరలించి, వార పత్రికను దిన పత్రికగా ప్రచురించడం జరిగింది. మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో, 1922 లో రాజమండ్రిలో ప్రారంభించబడ్డ 'కాంగ్రెస్' వారపత్రిక కూడ, జాతీయోద్యమంలో బాగా పనిచేసింది.

ఇదే సమయంలో, స్త్రీల సమస్యలను చర్చించడానికి ప్రత్యేక పత్రికలను ప్రారంభించారు. వీటిలో 'హిందూ సుందరి' 1902లో మాస పత్రికగా, 'గృహలక్ష్మి' 1903 లో, 'సావిత్రి', 1904 లో, 'అనసూయ', 1914 లో, 'స్త్రీధర్మ' 1917 లో, గాడిచర్ల హరిసర్వోత్తమరావు భార్య రమాబాయి సంపాదకత్వంలో 1919 లో మద్రాస్ నుండి 'సౌందర్యవల్లి' అనే మాస పత్రిక, 1923 లో 'భారతి' మాస పత్రికను మద్రాస్ నుండి, 1923 లోనే 'హిందూ యువతి' అనే పక్ష పత్రికను యామినీ పూర్ణ తిలకం మద్రాస్ నుండి వెలువరించగా, ప్రాముఖ్యత వహించాయి.

మరి నైజాం రాష్ట్రంలో పత్రికల పరిస్థితి మనం పరిశీలిస్తే, కొంత భిన్నంగా ఉంటుంది. 19వ శతాబ్దంలో అక్కడ తెలుగు పత్రికలు వెలువడలేదు. 'పబ్లిక్ ఒపీనియన్' 'దక్కన్ టైమ్స్' లాంటి ఆంగ్ల పత్రికలు, 'ముషీరేపంచ్', 'అఫ్సరుల్ అక్బర్' అనే ఉర్దూ పత్రికలు ఉండేవి. 1891 లోనే, అక్కడ నైజాం ప్రభుత్వం పత్రికలపైన కఠిన ఆంక్షలను విధించింది. 1913 లో మొదటి తెలుగు పత్రిక 'హితబోధిని'ని, బి. శ్రీనివాసరావు అనే వ్యక్తి, మహబూబ్‌నగర్ నుండి ప్రారంభించాడు. ఇందులో వ్యవసాయం, పారిశ్రామికీకరణ, సంఘ సంస్కరణలు మొదలైన విషయాలను చర్చించేవారు. 1922 లో వెంకట నరసింహారావు గారు, నల్లగొండ నుండి 'నీలగిరి' అనే వార పత్రికను ప్రారంభించారు. తర్వాత కొద్దిరోజులకే, వరంగల్లు జిల్లా మహబూబాబాద్ తాలూకా, ఇనుగుర్తి అనే గ్రామం నుండి ఇద్దరు సోదరులు, 'తెనుగు పత్రిక' అనే వార పత్రికను ప్రారంభించారు. ఈ రెండు పత్రికలు ఆంధ్రోద్యమానికి గొప్ప కృషి చేశాయి. ఆంధ్ర ప్రాంతంలో చెలరేగిన జాగృతిని తెలంగాణా కందించాయి. ఈ ప్రాంతంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషిచేశాయి. ఐదేళ్లు కొనసాగింతర్వాత, 'గోలకొండ పత్రిక' ప్రారంభంలో, ఈ రెండు పత్రికలు అంతరించాయి. తర్వాతి కాలంలో, నైజాం రాష్ట్రంలో చిన్న చిన్న పత్రికలు కొన్ని ప్రారంభించబడి, వివిధ సమస్యల నెదుర్కొని, కొన్నాళ్ల పాటు నడిచి, మూతపడ్డం జరిగింది. ఈ సమయంలో, నిజాం కఠోర పాలనలో పత్రికా స్వాతంత్ర్యం కరువై, సాంఘిక, రాజకీయ చైతన్యం లేక, ప్రజలు, చీకటి జీవితం గడుపుతున్న రోజులు. ఆ పరిస్థితుల్లో, 1926 మే నెల్లో హైదరాబాద్ నుండి 'గోలకొండ పత్రిక' అర్థ వార పత్రికగా వెలువడింది. నిజామాంధ్రులకు సాంఘిక, భాషా చైతన్యాన్ని కల్గించడమే కాకుండా, రాజకీయ చైతన్యంతోపాటు వారిని స్వాతంత్ర్య పిపాసువులను చేసింది. రెండున్నర దశాబ్దాల పాటు, ఈ పత్రికకు సంపాదకుడుగా ఉన్నారు, సురవరం ప్రతాపరెడ్డి. ఎన్నో సమస్యలు, మరెన్నో అడ్డంకులు వాటన్నిటినీ ఎదుర్కొని, గోలకొండ పత్రికను

BRAOU

నడిపారు. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలనెన్నిటినో ఈ పత్రికలో ప్రచురించేవారు. విమర్శనాత్మక వ్యాసాలు, ఉత్తేజపర్చే సంపాదకీయంతో, పత్రికా రచనకే ఒక కొత్త ఒరవడిని దిద్దుకొని, మంచి ఆదరణను పొందింది ఈ పత్రిక. 1947 లో, గోలకొండ పత్రిక దిన పత్రికగా మారింది.

## 10.6 ప్రభుత్వ విధానాలు - వార్తాపత్రికలు

భారతదేశంలో తెల్లవారి పాలన కింద, పరిపాలనా వ్యవస్థ, ప్రభుత్వ విధానాలు తీవ్ర విమర్శకు గురయ్యాయి. వివిధ రంగాల్లో ప్రభుత్వ విధానాలను, చేపట్టిన పథకాలను, వార్తాపత్రికలు తీవ్రంగా విమర్శించాయి. బ్రిటీష్ పరిపాలనా వ్యవస్థలో ఒక ముఖ్యాంగం, పోలీస్ శాఖ. ఈశాఖ పనితీరును, ఆనాటి వార్తాపత్రికలు బాగా విమర్శించాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాద విధానాలకు, ఆనాటి పోలీస్ శాఖ ఒక ప్రతీకగా పరిగణించబడింది. ప్రజా ఉద్యమాలను అణచివేయడంలో, పోలీస్ శాఖ ప్రవర్తన, తీరుతెన్నులు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. జాతీయోద్యమాన్ని సమర్థిస్తున్న వార్తాపత్రికలు, పోలీస్ శాఖ వ్యవహరిస్తున్న తీరును గర్హించాయి. అసమర్థత, లంచగొండితనం, సంఘవ్యతిరేక శక్తులతో చేతులు కలవడం, జాతీయోద్యమ నాయకులతో అమర్యాదగా ప్రవర్తించడం లాంటి విషయాలపై, వార్తాపత్రికలు బాగా విమర్శలు చేసేవి. వందేమాతరం ఉద్యమంలో భాగంగా, కాకినాడలో ఒక కుర్రవాడు డాక్టర్ కెంప్ అనే మెడికల్ ఆఫీసర్ ముందు వందేమాతరం నినాదాం ఇవ్వగా, కెంప్ ఆకుర్రవాడిని కొట్టగా, పురప్రజలు కెంప్‌పై దాడి చేశారు. కాకినాడ పట్టణ ప్రజలను శిక్షించడానికి ప్రభుత్వం, జూన్ 1907లో ఒక పోలీస్ బలగాన్ని పంపింది. ఈ నిర్ణయాన్ని అన్ని వార్తాపత్రికలు ఖండించాయి. బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎప్పుడూ చాలా సున్నితంగా విమర్శించే, 'హిందూ' పత్రిక కూడ, చాల తీవ్ర పదజాలంతో విమర్శించింది. జూన్, 13, 1907 హిందూ పత్రిక సంపాదకుడు తన సంపాదకీయంలో, ఈ విధంగా వ్యాఖ్యానించాడు. "మద్రాస్ ప్రభుత్వం, బెంగాల్‌లో ఫుల్లర్ ప్రభుత్వం, పంజాబ్‌లో ఇబ్బెట్‌సన్ (Ibbetson) ప్రభుత్వం అడుగు జాడల్లో నడవాలనుకుంటుందా? ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయం, ఏ విధంగాను సమర్థనీయం కాదు". జూన్ 14, 1907 'ఆంధ్రకేసరి' కాకినాడకు పోలీస్ బలగాన్ని పంపడం, అహంకారంతో కూడుకున్న చర్యగా, అనుచితం, న్యాయ విరుద్ధం, అక్రమం అని వర్ణించింది.

కృష్ణాపత్రిక కూడ ఈ చర్యను తీవ్రంగా గర్హిస్తూ, ఇది రెచ్చగొట్టే చర్యగా, దీనివల్ల, ఆంధ్ర 'రెండవ బెంగాల్‌గానో, లేక పంజాబ్‌గానో మారుతుంది" అని వ్యాఖ్యానించింది. శాంతియుత ఊరేగింపులపై పోలీసులు దౌర్జన్యం జరపడం, ప్రజా నాయకులపై క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను ఉపయోగించడం, సహాయ నిరాకరణోద్యమంలో. అణచివేత చర్యలకు పాల్పడ్డం లాంటి చర్యలను, వార్తాపత్రికలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

నవంబర్ 26, 1921 'కృష్ణాపత్రిక' 'ఆంధ్ర ప్రాంతం' అనే శీర్షికన, సంపాదకీయంలో ఆంధ్ర ప్రాంతంలో ప్రభుత్వ అణచివేత చర్యలను వివరిస్తూ, ప్రజలను తమ సహనాన్ని కోల్పోవద్దని కోరుతూ, ఈ చర్యల ద్వారా ప్రజా ఉద్యమాన్ని అణచివేయలేరని హెచ్చరించింది. ఇదే పత్రిక, మార్చి 11, 1922వ రోజు గుంటూర్‌లో అధిక సంఖ్యలో పోలీస్ బలగాన్ని మోహరించడంపై వ్యాఖ్యానిస్తూ,

BRAOU

"గుంటూర్ జిల్లాలో క్రూరత్వం పరిపాలిస్తుంది" అని వ్యాఖ్యానించింది. మద్రాస్ నగర పోలీస్ అహంకార చర్యలను విమర్శిస్తూ, మార్చి 24, 1930 నాటి 'హిందూ' పత్రిక, ఉద్యమాలు, ఊరేగింపుల సమయంలో ప్రజల సహకారాన్ని పొందవల్సిందిగా, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అలాగే, 'కాంగ్రెస్', 'సత్యాగ్రహి' పోలీస్ చర్యలను తీవ్రంగా విమర్శించాయి. కాంగ్రెస్ పత్రిక పోలీస్ చర్యలను రాక్షస చర్యలుగా, పోలీస్ వారిని దుశ్శాసనులుగా వర్ణించింది.

అంతేగాక, కొన్ని సమయాల్లో, పోలీస్ శాఖను అసమర్థ శాఖగా విమర్శించేవారు. దీనికి కారణం, అసమర్థులైన వారిని పోలీస్ శాఖలో నియామకం చేస్తున్నారని, వార్తాపత్రికలు విమర్శించేవి. దీనికి ఉదాహరణగా, సీతారామరాజు నాయకత్వంలోని రంపా తిరుగుబాటును పత్రికలు పేర్కొనేవి. శ్రీ రామరాజును అరెస్ట్ చేయలేక పోవడం, పోలీస్ శాఖ అసమర్థతకు నిదర్శనంగా పేర్కొనేవి. 'మద్రాస్ మెయిల్', 'ఆంధ్రపత్రిక' ఈ విషయంలో ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించాయి. ఇక్కడ ఒక విషయాన్ని చెప్పుకోవాలి. ఏమంటే, సమకాలీన వార్తాపత్రికలు శ్రీ రామరాజు చర్యలను ఎప్పుడూ సమర్థించ లేదు. అతడు చనిపోయిన కొద్ది సంవత్సరాలకు, పత్రికలు శ్రీ రామరాజును ప్రశంసించడం ప్రారంభించాయి. జైళ్ళ నిర్వహణ మరొక అంశం. ఈ విషయంపై కూడ, వార్తాపత్రికలు ప్రభుత్వాన్ని తీవ్ర విమర్శలకు గురిచేశాయి. మద్రాస్ ప్రెసిడెన్సీలో ప్రత్యేకంగా రాజకీయ ఖైదీలను అగౌరవపరచడం, కొందరిని నేరస్తులుగా చూడడం, మరియు జైళ్ళలో పరిస్థితులు బాగా లేకపోవడం లాంటి విషయాలను, పత్రికలు బాగా విమర్శించేవి. 'ఆంధ్రపత్రిక' ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ, "కేవలం భారతదేశం" లోనే రాజకీయ ఖైదీలను నేరస్తులుగా పరిగణిస్తున్నారని రాసింది. ప్రస్తుత రాజకీయ ఖైదీల భవిష్యత్తులో ఈ దేశపు పాలకులు కాబట్టి, వారి పట్ల మర్యాదతో వ్యవహరించమని చాలా వార్తాపత్రికలు ప్రభుత్వాన్ని కోరాయి. 'ఆంధ్రపత్రిక' ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. 'స్వరాజ్య పత్రిక' ఈ విషయంపై రాస్తూ, "రాజకీయ ఖైదీలు ఉన్నత శ్రేణికి చెందిన, గౌరవమైన దేశభక్తులు; అందువలన, వారి పట్ల మర్యాదతో వ్యవహరించమని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అంతేకాకుండా, రాజకీయ ఖైదీలను నేరస్తులతో ఉంచడం, వాళ్ళను కొట్టడం, వారికి ఇచ్చే భోజనం చెడ్డగా ఉండటం లాంటి విషయాలను, పత్రికలు బాహాటంగా విమర్శించాయి.

అలాగే, జాతీయోద్యమం ప్రారంభమైనప్పటినుండి భారతీయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది ఏమంటే, శాసనాధికారం, న్యాయాధికారాన్ని ఒకే వ్యక్తికి ఇవ్వకూడదని, ఈ రెండు అధికారాలను జిల్లా రెవెన్యూ అధికారులకు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ, రాజకీయ సమావేశాలు, వార్తాపత్రికలు తీర్మానించేవి. శశిరేఖ పత్రిక ఈఅంశాన్ని ప్రస్తావిస్తూ, "ఏ నాగరిక దేశంలోను శాసన, న్యాయాధికారాలను ఒకే వ్యక్తికి ఇవ్వలేదు. భారతదేశంలో ఇవ్వడం, బ్రిటీష్ పరిపాలనకు ఒక కళంకం" అని వ్యాఖ్యానించింది. ఈ విషయంపై ప్రతిస్పందిస్తూ ప్రభుత్వం, దేశంలో అశాంతి నెలకొని ఉన్నందున ఈ సంస్కరణను ప్రవేశపెట్టడం సాధ్యం కాదు అని పేర్కొన్నది. శాసన సభల్లో ఈ అధికార విభజనను చేయకోరుతూ, ఎన్ని తీర్మానాలు ప్రవేశపెట్టినప్పటికీ, ప్రభుత్వం లెక్కచేయలేదు. సత్యాగ్రహి పత్రిక, కృష్ణా పత్రిక ఈ విషయంపై "ప్రభుత్వం అన్ని అధికారాలు జిల్లా కలెక్టర్లకు ఇచ్చింది. ఎందుకంటే, ప్రజలపై నమ్మకం లేదు కాబట్టి" అని వ్యాఖ్యానించాయి.

BRAOU

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో, ప్రభుత్వం ఆంధ్రులను సైన్యంలోకి చేర్చుకోలేదు. ఆంధ్రులను సైనిక తెగల (Martial races) జాబితా నుండి తొలగించడమే కాకుండా, వారిని సైన్యంలో చేరకుండా నిషేధించడమైంది. ఈ చర్య, ఆంధ్రులను అవమానపర్చడమే కాకుండా, తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఆంధ్ర దేశంలోని వార్తాపత్రికలు ఆంధ్రుల నిరసనను తమ రాతల ద్వారా, వెల్లడి చేయడం జరిగింది. ఆంధ్రులు ప్రాచీన కాలం నుండి సైన్యంలో పనిచేస్తూ, యుద్ధాల్లో ఎంతో ధైర్యసాహసాలను ప్రదర్శించారు. కాబట్టి, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పత్రికలు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఏప్రిల్ 28, 1914 నాటి ఆంధ్రపత్రిక మెగస్తనీస్ ఆంధ్రుల ధైర్యాన్ని మెచ్చుకున్నాడని, అలాగే, హర్షుని ఓడించిన రెండో పులకేశి సైన్యంలో ఆంధ్రులు ఉన్నారని పేర్కొంది. అంతేకాకుండా, రాబర్ట్ క్లైవ్, డూప్లేల సైన్యంలో కూడ ఆంధ్రులున్నారని తెలుపుతూంది.

బ్రిటీష్ ప్రభుత్వ విద్యా విధానాలను కూడ, వార్తాపత్రికలు తీవ్రంగా దుయ్యబట్టాయి. విద్యా రంగంలో అభివృద్ధి లేకపోవడం, విదేశీ స్వభావం ఉన్న విద్యను ప్రోత్సహించడం, స్వదేశీ భాషల్లో విద్యను ప్రోత్సహించకపోవడం లాంటి అంశాలపై, ప్రభుత్వాన్ని పత్రికలు విమర్శకు గురిచేశాయి. జాతీయోద్యమానికి మద్దతును పలుకుతున్న పత్రికలు, జాతీయ విద్యావిధానాన్ని ప్రచారంలోకి తేవడం, వందేమాతరం ఉద్యమంలో భాగంగా, జాతీయ విద్యా విధానం బహుళ ప్రచారం పొందడం జరిగింది. తెలుగులో 'కృష్ణాపత్రిక', 'ఆంధ్రపత్రిక', ఆంగ్లంలో 'న్యూ ఇండియా' జాతీయ విద్యా విధానాన్ని ప్రచారం చేయడమే కాకుండా, దాన్ని ఒక పథకం ప్రకారం పటిష్ఠంగా అమలు జరిగేటట్లు చేయడంలో, ప్రముఖ పాత్ర వహించాయి. జాతీయవాద పత్రికలన్నీ కూడ, జాతీయ విద్యా విధానం సర్వరోగ నివారిణిలా దేశంలోని అన్ని సమస్యలను తీరుస్తుందని అభిప్రాయపడ్డాయి.

వందేమాతర ఉద్యమ కాలంలో, ప్రముఖ తెలుగు పత్రిక 'ఆంధ్రకేసరి' ఈ విధంగా పేర్కొంది. 'భారతదేశంలోని 30 కోట్ల ప్రజలకు జాతీయ విద్యను విస్తరిస్తే, కరువుకాటకాలు, ఇతర సమస్యలు ఉండవు. అప్పుడు దేశం భూతల స్వర్గం కాదా' అని జాతీయ విద్యను వ్యాప్తి చేయడానికి విరివిగా విరాళాలు ఇవ్వమని, పత్రికలు ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. కొంతకాలం తర్వాత, జాతీయ విద్య అవసరమా? లేక స్వరాజ్యం అవసరమా? అనే విషయంపై కొంత వివాదం తలెత్తినా, జాతీయ విద్యా వ్యాప్తి కొరకు అన్ని వర్గాల వారు కృషి చేశారు.

దేశం మొత్తంలో జాతీయ విద్యకు, అనీబిసెంట్ 'న్యూ ఇండియా' విశేష కృషిని జరిపింది. జి. యస్. ఆరండేల్ అనే మేధావి సహాయంతో, తన పత్రిక ద్వారా ఆమె జాతీయ విద్యపై సప్లిమెంట్స్‌ను ప్రచురించి, మేధావుల ద్వారా రచనలు చేయించి, ప్రచారం చేసింది. జాతీయ విద్య ఆదర్శాలను ఆమె, 'న్యూ ఇండియా'లో ప్రముఖంగా ప్రచురించేది. ఉదాహరణకు, "జాతీయ విద్య కాని ఏ విద్య కూడా విద్య కాదు. భారతదేశం కొరకు కాని ఏ విద్య కూడ జాతీయ విద్య కాదు. భారతీయుల అధీనంలో లేని ఏ విద్య కూడ భారతదేశం కొరకు కాదు". ఇంకా ప్రముఖంగా ప్రచురించిన అంశం ఏమిటంటే, "రేపటి భారతదేశం నేటి పాఠశాలలు, కళాశాలల్లో ఉంది". ఆనాటి జాతీయ వాద పత్రికలు, ప్రభుత్వం, ప్రజలు స్వదేశీ భాషల్లో విద్యావ్యాప్తిని ప్రోత్సహించమని కోరాయి. సెప్టెంబర్ 2, 1919ల నాటి ఆంధ్రపత్రిక "స్వదేశంపై ప్రేమ, మాతృభాష" అనే శీర్షికన సంపాదకీయం రాస్తూ, "మాతృదేశంపై ప్రేమ కలగడానికి మాతృ భాష ఒక విత్తనం" అని

BRAOU

రాస్తూ, ఆంధ్రులను తెలుగు భాషాభివృద్ధికి కృషిచేయమని సలహా ఇచ్చింది. త్రిలింగ పత్రిక ఆగస్ట్, 1914 లో రాస్తూ, "స్వదేశీ భాషల్లో విద్యను నేర్పడం ద్వారానే దేశాన్ని పైకి తేగలం. ఆంగ్లం మన దేశ భాష ఎప్పుడూ కాజాలదు" అని పేర్కొంది. ఆగస్ట్ 11, 1916 నాటి న్యూ ఇండియా కూడ సంపాదకీయం ద్వారా, "భారతీయ భాషలను నిర్లక్ష్యం చేసి, విదేశీ భాషల్లో విద్యావ్యాప్తికి కృషిచేసిన వ్యర్థం" అని వ్యాఖ్యానించింది.

ఈ విధంగా, ఆనాటి పత్రికలు బ్రిటీష్ ప్రభుత్వ విధానాలను, సామ్రాజ్యవాద వైఖరిని ఎత్తి చూపుతూ, ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రధాన ప్రతిపక్షంగా పనిచేసింది.

## 10.7 సాంఘిక సంస్కరణలు - వార్తాపత్రికలు

1858 లో భారతదేశం కంపెనీ పరిపాలన నుండి బ్రిటీష్ పార్లమెంట్ ప్రత్యక్ష పాలన కిందికి వచ్చింది. విక్టోరియా మహారాణి భారతీయులను సంతృప్తిపర్చడం కోసం, ఒక గొప్ప ప్రకటన చేసింది. పరిపాలనా రంగంలో ఎన్నో మార్పులు ప్రవేశపెట్టబడ్డాయి. దేశంలో రాజకీయంగా శాంతిభద్రతలు ఏర్పడ్డాయి. ఇంగ్లీష్ చదువును ప్రవేశపెట్టడం వల్ల, భారతీయుల్లో పాశ్చాత్య భావాలు అంకురించి, స్థిరపడ్డాయి. లార్డ్ మెకాలె ప్రకటన 1835 లో వెలువడి, భారత దేశంలో ఆంగ్ల విద్యను సుస్థిరం చేసింది. ఆంధ్ర దేశంలో ఇంగ్లీష్ చదువులు నేర్పే విద్యా సంస్థలు, గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, నరసాపురం, మచిలీపట్నం విజయనగరం మొదలైన చోట్ల స్థాపించబడ్డాయి. 1854 లో వచ్చిన కంపెనీ వారి "ఎడ్యుకేషనల్ డిస్పాచ్" భారతదేశంలో, ఇంగ్లీష్ చదువులకు మాగ్నాకార్టా లాంటిదంటారు. దీనివల్ల, భారతదేశంలో విద్యారంగంలో, విప్లవాత్మకమైన మార్పులకు పునాదులు వేయడం జరిగింది. అంతేకాకుండా, 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాస్ విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయి. దీంతో, ఆంగ్ల విద్యా విధానం మన దేశంలో సుస్థిరపడటమే కాకుండా, దేశ వ్యాప్తంగా పాశ్చాత్య సభ్యత్వ, సంస్కృతుల ప్రభావం పాకింది. మేధావంతుల దృక్పథమే మారిపోయింది. మన దేశ విద్యల్లో లేని ఎన్నో భావాలు, పాశ్చాత్య విద్యల్లో మన వారికి కన్పించాయి. స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం, ప్రజా ప్రభుత్వం, జాతీయత మొదలైన వాటికి, ఆ భావాలు ప్రాధాన్యతను కల్పించాయి. గుడ్డిగా దేన్ని అనుసరించరాదని, హేతువాద దృష్టితో విమర్శించి, అనుసరించదగ్గ వాటిని మాత్రమే అనుసరించాలనే భావం, ప్రజల్లో వ్యాప్తిచెందింది. పాశ్చాత్య సంపర్కం వల్ల ఏర్పడ్డ ఈ నవీన భావ వ్యాప్తికి, పత్రికలు చాలా తోడ్పడ్డాయి.

విద్యావంతుల మానసిక జీవితంలో వచ్చిన భావ విప్లవం ఫలితంగానే, భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రారంభమైంది. అనేక ఉద్యమాల్లో ముందడుగు వేసిన వంగ దేశమే, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి దారిచూపింది. రామ్‌మోహన్‌రాయ్ దీనికి పితామహుడు. ఆయన 1818లో వంగ భాషా పత్రికైన 'బెంగాల్ గెజెట్' లో సతీసహగమన దురాచారాన్ని ఖండిస్తూ, వ్యాసాన్ని రాశారు. తర్వాతి కాలంలో ఆయన నడిపిన సంవాదకౌముది అనే పత్రిక, భారతదేశంలో జరిగిన సాంఘిక సంస్కరణలకు అండగా నిలిచింది. ఈ సాంఘిక, మత సంస్కరణోద్యమాల్లో భాగంగా, రామ్‌మోహన్‌రాయ్ అడుగుజాడల్లో నడుస్తూ, బ్రహ్మ సమాజం ఆదర్శంగా, తర్వాతి కాలంలో, దేవేంద్రనాథ ఠాగూర్, కేశవచంద్రసేన్, పండిత శివనాథశాస్త్రి మొదలైన వారు కృషిచేశారు.

BRAOU

దయానందుడి ఆర్య సమాజం, వివేకానందుడు ప్రబోధించిన సనాతన మత పునరుద్ధరణ మహోద్యమం, అనీబిసెంట్ దివ్యజ్ఞాన సమాజం, ఆత్మారామ్ పాండురంగ్, జస్టిస్ రనడేల ప్రార్థనా సమాజం మొదలైనవి, భారతీయ సమాజంలో మత, సాంఘిక సంస్కరణోద్యమాలను నడిపి, సతీసహగమనం, బాల్య వివాహాలు, కరుడుగట్టిన వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, సముద్ర యానాల నిషేధం, పర్దా, స్త్రీలను తక్కువగా చూడ్డం, అస్పృశ్యత లాంటి దురాచారాలనుండి, ఆనాటి హైందవ సమాజాన్ని విముక్తం చేయడానికి కృషిచేశారు. ఈ సంస్కర్తలు పత్రికలను స్థాపించి, వాటి ద్వారా ప్రచారాన్ని సాగించారు. ఆంధ్రలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి వీరేశలింగం నాయకత్వం వహించారు. ఈయన 1874 లో 'వివేకవర్ధని', 1876 లో 'హాస్యసంజీవని', 1883 లో 'సతీ హితబోధిని' పత్రికలను స్థాపించారు. 1891 లో 'సత్యసంవర్ధని'ని నిర్వహించారు. తర్వాత 'చింతామణి' 'జనానా పత్రిక', 'సత్యవాది' అనే పత్రికలను ఇతరుల సహాయంతో సంయుక్తంగా నిర్వహించాడు. పత్రికల ఆధారంగా, సాంఘిక, సారస్వత, భాషా సేవలను కొనసాగించారు. అట్లాగే, జాతీయ స్థాయిలో సంస్కరణోద్యమాన్ని నడపడానికి 'ఇండియన్ సోషల్ రిఫార్మర్' అనే ఆంగ్ల వార పత్రికను 1890లో బొంబాయిలో ప్రారంభించాడు. ఇది సంస్కరణలను వ్యాప్తి చేయడంలో, గొప్ప కృషి చేసింది. సాంఘిక సంస్కరణలను సమర్థిస్తున్న పత్రికలన్నీ, చట్టాల ద్వారా వాటికి గట్టి పునాదులు వేయాలని కోరాయి. ప్రభుత్వం సంఘ సంస్కరణకు ఏ చట్టాన్ని ప్రవేశపెట్టినా, పత్రికలు మద్దతును పలికాయి. 1911లో కేంద్ర శాసన సభలో భూపేంద్రనాథ్ బసు ప్రవేశపెట్టిన 'సివిల్ మ్యారేజి బిల్'కు అన్ని పత్రికలు మద్దతును పలికాయి. ఆగస్ట్ 25, 1911 నాటి 'కృష్ణాపత్రిక' సంపాదకీయంలో ఈ బిల్లుకు మద్దతును పలుకుతూ, "ప్రాచీన భారతదేశంలో వివిధ కులాల మధ్య వివాహాలు జరిగేవి. ఆ సంప్రదాయాన్ని చట్టపరంగా తిరిగి ప్రవేశపెట్టడం, హిందూ మతానికి విరుద్ధం కాదు" అని రాసింది. ఆగస్ట్ 9, 1911 నాటి 'దేశమాత' వ్యాఖ్యానిస్తూ, "భారతదేశం అభివృద్ధికి ఈ చట్టం ఒక మార్గాన్ని చూపుతుంది" అని రాసింది. బ్రిటీష్ మద్దతుదారులైన క్రైస్తవ మిషనరీలు నడిపే, 'రవి' అనే పత్రిక కూడ ఈ బిల్లుపై వ్యాఖ్యలు, ఉత్తరప్రత్యుత్తరాలను ప్రచురించడమే కాకుండా, తన వంతుగా ఈ బిల్లుకు, మద్దతును పలికింది. అట్లాగే, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కూడా, పత్రికలు తీవ్రంగా ప్రతిస్పందించాయి. ఆంగ్ల పత్రికలైన 'హిందూ', 'న్యూ ఇండియా' తెలుగు పత్రికలు, 'కృష్ణాపత్రిక', 'ఆంధ్రపత్రిక', స్త్రీల పత్రికలైన 'హిందూ సుందరి', 'గృహలక్ష్మి', 'వివేకవతి', 'స్త్రీవిద్య', ఈ దురాచారాన్ని రద్దుచేయడానికి మద్దతును ప్రకటించాయి. ఆగస్ట్ 1912న 'హిందూ సుందరి' ఈ అంశంపై రాస్తూ, 1911 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 40,000 మంది బాలికా వితంతువులు ఉన్నారని, దీనికి కారణం, బాల్య వివాహాలని, అప్పటివరకు 90 లక్షల బాల్య వివాహాలు జరిగాయని తెలిపింది. బాల్య వివాహాలపై వ్యాసం రాస్తూ, అక్టోబర్ 26, 1912న 'కృష్ణాపత్రిక' జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్ర దేశంలో కూడ బాల్య వివాహాలు పెరిగాయని వ్యాఖ్యానించింది. యువతీ యువకులు యుక్తవయస్సు వచ్చిన తర్వాత, వివాహాలు చేసుకోడాన్ని చట్టం చేయాలనీ, మద్రాస్ శాసన సభలో వి.యస్. శ్రీనివాస శాస్త్రి బిల్లును ప్రవేశపెట్టడాన్ని, అన్ని పత్రికలు గట్టిగా సమర్థించాయి. ఆనాటి వార్తాపత్రికలన్నీ ఈ బిల్లును వ్యతిరేకిస్తున్న సంప్రదాయవాదులను తీవ్రంగా విమర్శించాయి. జనవరి 30, 1918 నాటి 'కృష్ణాపత్రిక' సంపాదకీయంలో ఈ బిల్లును సమర్థిస్తూ, దీని వల్ల, సమాజంలోని ఒక దురాచారాన్ని రూపుమాపి, ప్రజలకు మేలు చేయవచ్చని, అందువల్ల,

BRAOU

దీన్ని ప్రజలందరు సమర్థించాలని విజ్ఞప్తి చేసింది. ఆనాటి పత్రికలు, పిన్న వయస్కులైన బాలికలకు, వయసు మళ్లిన పురుషులకు జరిగే వివాహాలను గూడ దుయ్యబట్టేది. జూలై, 1, 1916 నాటి 'కృష్ణాపత్రిక' ఒక వ్యంగ్య చిత్రాన్ని ముద్రించి, 'భార్యా? లేక మనుమరాలా!' అని రాయడం జరిగింది. అలాగే, వితంతు వివాహాలను సమర్థిస్తూ, ఆనాడు పత్రికలన్నీ ఈ ప్రోత్సాహకరమైన వ్యాసాలను ముద్రించడం జరిగింది. స్త్రీలను ప్రోత్సహించి, వారి పరిస్థితిని మెరుగుపర్చడం, ఆనాటి సంస్కర్తలకు, పత్రికలకు మరొక బాధ్యత. అనీబిసెంట్ 'న్యూ ఇండియా' ఈ విషయంలో గొప్ప కృషి చేసింది. ఏప్రిల్ 9, 1915 సంపాదకీయంలో 'న్యూ ఇండియా' "భారతదేశంలో స్త్రీలను చిన్నచూపు చూడడమే, అన్ని సమస్యలకన్నా ప్రధాన సమస్య. దీన్ని అన్ని వర్గాలవారు కలిసికట్టుగా ఎదుర్కోవాలి" అని వ్యాఖ్యానించింది. స్త్రీ పరిస్థితిని చక్కదిద్దడానికి, స్త్రీవిద్యను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తూ, 'న్యూ ఇండియా' డిశంబర్ 5, 1914 నాటి సంపాదకీయంలో, "ప్రభుత్వం స్త్రీవిద్య పట్ల చిన్నచూపు చూడ్డానికి కారణం, భారతీయులు తమ కుమార్తెలను, భార్యలను విద్యావంతులను చేయడానికి ఆసక్తి కనబర్చకపోవడమే" అని వ్యాఖ్యానించింది. అదే విధంగా, 'హిందూ సుందరి', 'ప్రబోధిని', 'జనానా పత్రిక' 'ఆంధ్రపత్రిక', 'కృష్ణాపత్రిక' కూడ, స్త్రీవిద్యను సమర్థించాయి. సంగీత నృత్యాలను ఆలపించే 'కళావంతు'లనే స్త్రీలను సమాజం వేశ్యా వృత్తిలో దింపి, దేవదాసీలుగా అవమానాలు పొందుతున్నా, నిర్లక్ష్యం చేయబడ్డ వారిని సంస్కరించాలని, వారికి మద్దతుగా సంస్కర్తలు, పత్రికలు నిలిచాయి. 1911 లో ప్రభుత్వం చిన్న వయస్కులైన బాలికలు నృత్యాలు చేయడాన్ని నిషేధిస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు దాదాపుగా, అన్ని పత్రికలు మద్దతును పలికాయి. ముత్తు లక్ష్మీరెడ్డి చేస్తున్న కృషిని కూడ ప్రశంసించాయి. డిశంబర్ 9, 1922 'సత్యాగ్రహి', 'శ్రీసాధన', 'జస్టిస్', 'గృహలక్ష్మి' తమ పత్రికల్లో వ్యాసాలను ప్రచురించడమేకాక, ఈ దురాచారాన్ని నిర్మూలించడానికి ముత్తు లక్ష్మీరెడ్డి ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతునివ్వాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 'న్యూ ఇండియా', 'హిందూ' పత్రికలు కూడా ఎన్నో రకాలుగా, ఈ దురాచారాన్ని నిర్మూలించడానికి దోహదం చేశాయి. అట్లే, ఆనాటి సమాజంలోని అనేక రకాలైన ఇతర దురాచారాలైన కన్యాశుల్కం, వరశుల్కం, అంటరానితనం, మత్తు పదార్థాల అలవాటు, వివాహాది శుభకార్యాల్లో సంగీత, నృత్యాలను ఏర్పాటు చేసుకోవడం, సముద్ర ప్రయాణాలపై నిషేధం, ఇత్యాది సమస్యలను ఎత్తిచూపి, విమర్శించి, వాటిపై ఉద్యమాలను చేపట్టిన సంస్కర్తలకు అండగా నిల్చి, సమకాలీన వార్తాపత్రికలు భారతీయ సమాజం, దానిలో అంతర్భాగమైన ఆంధ్ర సమాజం, కొత్త వెలుగు చూడ్డానికి దోహదం చేసాయి.

BRAOU

## 10.8 ఆర్థిక వ్యవస్థ - వార్తాపత్రికలు

19 వ శతాబ్దం మొదటి భాగంలో, భారతదేశం లోని మేధావులు బ్రిటీష్ ప్రభుత్వంపై మంచి వైఖరిని ప్రదర్శించారు. ఆనాటి ప్రపంచ దేశాల్లో ఆర్థికంగాను, పారిశ్రామికంగాను గొప్ప దేశమైన బ్రిటన్, నూతన వైజ్ఞానిక, సాంకేతిక పద్ధతుల ద్వారా, భారతదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తుందని భావించారు. అయితే, వారు భావించినట్లుగా భారతదేశ ఆర్థిక రంగం ఎటువంటి అభివృద్ధిని సాధించకపోగా, 1860 తర్వాత దాదాపుగా అన్ని రంగాల్లో తిరోగమనం చూడ్డం జరిగింది. ఈ ఆర్థిక రంగం కుంటుపడ్డంలో వలస రాజ్య విధానాల పాత్ర ఏవిధంగా ఉందన్న అంశంపై, ముగ్గురు మేధావులు పరిశోధన జరిపి, దానికి బాధ్యురాలు బ్రిటీష్ ప్రభుత్వం అని నిర్ణయించడం జరిగింది. వీరు

దాదాభాయి నౌరోజీ, మహాదేవ్ గోవింద్ రెనడే, రమేష్‌చంద్ర దత్. వీళ్ళతోపాటు, ఇతర రాజకీయ నాయకులు, పత్రికా విలేకరులు, ఇతరులు భారతదేశ ఆర్థిక వ్యవస్థను విశ్లేషించి, వలసవాద విధానాలే, భారతదేశం పేదరికంతో బాధపడ్డానికి కారణమని తెలిపారు. భారతదేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే, అది భారతీయుల పెట్టుబడితోనే జరగాలి. విదేశీ పెట్టుబడులతో కాదు. ఎందుకంటే, 1840 నుండి భారత దేశంలోని వివిధ రంగాల్లో విదేశీ పెట్టుబడులు పెట్టి, విపరీతంగా లాభాలను ఆర్జించి, భారతీయులను దరిద్రులుగా మార్చడం జరిగింది. విదేశీ పెట్టుబడులపై 'హిందూస్తాన్ రివ్యూ', 'కాయస్థ సమాచార్ ' సంపాదకులు వ్యాఖ్యానిస్తూ, "అది ఒక అంతర్జాతీయ దోపిడీ" అంటారు. విదేశీ పెట్టుబడిదారుల ప్రాముఖ్యత పెరిగి, "సామ్రాజ్యం ప్రమాదంలో ఉంది" అనే విదేశీ పెట్టుబడిదారుల నినాదంలో, భారత జాతీయ కాంగ్రెస్ గొంతు చిన్నదై పోయిందని, సెప్టెంబర్ 23, 1889 నాటి 'హిందూ' ఆంగ్ల పత్రిక వ్యాఖ్యానించింది. సెప్టెంబర్ 15, 1905 నాటి 'శశిలేఖ', భారతదేశం లోని ప్రస్తుత పేదరికం బ్రిటీష్ పరిపాలన వల్ల కలిగిందని రాసింది. ఇదే పత్రిక, 1913లో "పేద దేశంగా మారిపోతుంది" అని రాసింది. అట్లాగే జనవరి, 7, 1905 నాటి 'ఆంధ్ర ప్రకాశిక' భారతదేశం ఆర్థికంగా సంపన్నమౌతుందన్న వైస్రాయి ప్రకటనను సవాల్ చేస్తూ, దుర్భిక్ష కమీషన్ వివరాల ప్రకారం, గత 6 సంవత్సరాల్లో భారతదేశం 300 కోట్లు నష్టపోయిందని తెల్పింది. అలాగే, డిశంబర్ 14, 1907 నాటి 'దేశాభిమాని' భారతదేశంలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితికి బ్రిటీష్ ప్రభుత్వం కారణమని రాస్తూ, దుర్భిక్ష పరిస్థితుల వల్ల భారతదేశంలో, ప్రాణాలు కోల్పోయిన 50 లక్షల మంది, ఐర్లండ్ జనాభా కంటే ఎక్కువని పేర్కొంది. మే 16, 1925 నాటి 'ఆంధ్రపత్రిక' దుర్భిక్ష పరిస్థితులపై వ్యాఖ్యానిస్తూ, 1769 – 1925 మధ్యకాలంలో భారతదేశంలో 60 సార్లు క్షామం వచ్చిందనీ, ఫలితంగా, 3 కోట్ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని తెల్పింది. అదే విధంగా జాతీయవాద వార్తాపత్రికలు భారతీయ చేనేత పరిశ్రమ పతనం కావడానికి బ్రిటీష్ ప్రభుత్వమే కారణమనీ, దేశం ఆర్థికాభివృద్ధి చెందాలంటే, పారిశ్రామికీకరణ జరగాలని కోరాయి. అట్లాగే, భారతీయ పరిశ్రమలకు రక్షణ అవసరమని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించకూడదని కోరాయి. భారతీయ వార్తాపత్రికలు సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలను దుయ్యబడుతూ, ప్రస్తుత భారతదేశంలో రైతాంగం పరిస్థితికి బ్రిటీష్ ప్రభుత్వమే కారణమని రాశాయి. చాలా సంవత్సరాల పాటు, 'కృష్ణాపత్రిక', 'రైతుల ఇక్కట్లు' అనే శీర్షిక కింద, ఆంధ్ర రైతుల సమస్యలను వెలుగులోకి తెచ్చి, ప్రభుత్వాన్ని దుయ్యబట్టేది. అధిక పన్నుల భారం, రుణ భారం రైతులకు ప్రధాన సమస్యలని తెలియచెప్పింది. ప్రభుత్వ మద్దతుదారైన 'రైతుపత్రిక' రైతాంగ సమస్యలను గూర్చి రాస్తూ, పన్నుల భారం అధికమయ్యే రైతులు పేదరికంలో మగ్గుతున్నారని, దీనికి కారణం, బ్రిటీష్ ప్రభుత్వ విధానాలేనని వ్యాఖ్యానించింది. అదే పత్రిక, నవంబర్ 14, 1920 రోజున 'భూమి పన్ను' అనే శీర్షికన రాస్తూ, 75% రైతులకు రెండు పూటలా భోజనం లభించడం లేదని వ్యాఖ్యానించింది. అట్లాగే, డిశంబర్ 31, 1913 'ఆంధ్ర ప్రకాశిక' ప్రభుత్వ పన్నుల విధానాన్ని దుయ్యబడుతూ, "ప్రభుత్వం రైతుకు ఎలాంటి మినహాయింపులు ఇవ్వకుండా, వ్యవసాయం అభివృద్ధి చేసుకోడానికి ఎలాంటి ప్రోత్సాహం చేయక, పంటలు పండక పోయినప్పటికి ఎలాంటి సహాయం చేయక, కేవలం పన్నులు వసూలు చేయడమే తమ బాధ్యతగా వ్యవహరిస్తుంది. రోజురోజుకు పన్నుల భారంతో, రైతు పరిస్థితి 50 సంవత్సరాల క్రితం ఏ విధంగా ఉండిందో, ఇప్పుడు కూడ అదే విధంగా ఉందని" పేర్కొంది.

BRAOU

ఇదే విషయంపై వ్యాఖ్యానిస్తూ, అక్టోబర్ 15, 1929 నాటి 'కాంగ్రెస్' పత్రిక, రైతు దేశానికి వెన్నెముక; రాజకీయ, సామాజిక గౌరవానికి, పారిశ్రామికాభివృద్ధికి రైతు ఒక బలం; వలస రాజ్య పాలన నుండి విముక్తి పొందాలంటే, రైతు బాగోగులను మెరుగుపర్చడం తప్పనిసరని రాసింది. అట్లాగే, జమీందారీల ప్రాంతాల్లో ఉన్న రైతుల సమస్యలను కూడ ఆనాటి పత్రికలు చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేశాయి. ఉదాహరణకు, 1928 నుండి వెలువడ్డ 'జమీన్‌రైతు' పత్రిక, వెంకటగిరి జమీందారీలో రైతుల సమస్యలను బాగా చర్చించేది. అంతేకాకుండా, ఆనాటి పత్రికలు, ఇతర పన్నులు, స్వదేశీ ఉద్యమం, రైల్వే విస్తరణ, వర్తక, వ్యాపారం ఇత్యాది అంశాలను కూడ చర్చించి, ప్రభుత్వ విధానాలను విమర్శించి, వివిధ వర్గాలకు న్యాయం కూర్చడానికి కృషిచేశాయి.

## 10.9 జాతీయోద్యమం - వార్తాపత్రికలు

పందొమ్మిదో శతాబ్దం సంస్కరణోద్యమాలకు ప్రాధాన్యం వహిస్తే, ఇరవయ్యో శతాబ్దం రాజకీయోద్యమాలకు ప్రాధాన్యం వహించింది. ఈ కాలంలో, వార్తాపత్రికలు భారతీయుల్లో జాతీయ చైతన్యం కలిగించడంలోను, విదేశీ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలను చేపట్టడంలోను, విశేషమైన కృషి చేశాయి. 20 వ శతాబ్ది ప్రారంభంలో, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా, బెంగాల్ విభజన జరిగింది. దీంతో, ప్రభుత్వానికి, ప్రజలకూ మధ్య ఒక అగాతం ఏర్పడింది. బెంగాల్ రాష్ట్రమంతా, తీవ్ర ఆందోళనకు గురిచెందింది. దేశమంతా కూడ రాజకీయ వాతావరణంతో వేడెక్కింది. ప్రభుత్వం ప్రజా ఉద్యమ తీవ్ర అణచివేతకు పూనుకొంది. అప్పటి వరకు, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిస్పందించని కాంగ్రెస్, ఇప్పుడు ప్రజల పక్షం వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి నడుం కట్టింది. ఈ శతాబ్ది ప్రారంభం నాటికే, సామ్రాజ్యవాద బ్రిటీష్ పాలనను ఎదుర్కొనే శక్తి, భారతీయుల్లో ఏర్పడింది. ఈ మహత్తర ప్రజా శక్తిని తయారుచేయడంలో, వార్తాపత్రికలు ప్రముఖ పాత్ర వహించాయి. కలకత్తా నుండి వెలువడే 'సంజవాణి' అనే వార పత్రిక, జూలై 6, 1905 న మొట్టమొదటిసారిగా విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని సూచించింది. క్రమక్రమంగా, ఇతర పత్రికలు కూడా, ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఈ విధంగా, విదేశీ వస్తు బహిష్కరణోద్యమానికి పత్రికలు నాంది పలికాయి. 'స్వరాజ్య' పత్రికా విలేఖరి మార్చి 26, 1908 రోజు బహిష్కరణోద్యమంపై రాస్తూ, ఆయుధాలులేని భారతీయులకు విదేశీ వస్తు బహిష్కరణ నారాయణ మంత్రం లాంటిదని వ్యాఖ్యానించాడు. ఆనాటి పత్రికలు విదేశీ వస్త్ర బహిష్కరణే కాకుండా, విదేశీ బిరుదులు, పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలు, శాసన సభలు, ఆంగ్లో-ఇండియన్ పత్రికలను కూడ బహిష్కరించాలని ప్రజలకు, న్యాయకులకు విజ్ఞప్తిచేశాయి. జనవరి 5, 1908 నాటి కృష్ణాపత్రిక బహిష్కరణ గురించి రాస్తూ, 'స్వరాజాన్ని సాధించటానికి ఒకటే మార్గం. అది బహిష్కరణోద్యమం ద్వారా' అని సూచించింది. 'బెంగాలీ', 'అమృతబజార్ పత్రిక', 'న్యూ ఇండియా', 'హిందూ'లాంటి పత్రికలు, వందేమాతర ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ ఉద్యమాలను బాగా ప్రచారం చేశాయి. సెప్టెంబర్ 19, 1905 'హిందూ' సంపాదకీయంలో, స్వదేశీ ఉద్యమం బెంగాల్ నుండి అన్ని ప్రాంతాలకు త్వరితగతిన వ్యాప్తి చెందడమే కాకుండా, అది ప్రజానీకంపై పట్టును సాధించిందని పేర్కొంది. అలాగే, భారతీయ పత్రికలు స్వరాజ్యం, జాతీయ విద్య లాంటి అంశాలను కూడ బాగా ప్రచారం చేశాయి. ఇదే సమయంలో, ప్రభుత్వ అరాచక చర్యలకు నిరసనగా, తీవ్ర వాదాన్ని ప్రచారం

BRAOU

చేసే పత్రికలు స్థాపించబడ్డాయి. వాటిలో ముఖ్యంగా 'యుగాంతర్', 'సంధ్య', 'వందేమాతరం'. ఉదాహరణకు, ప్రభుత్వ క్రూర చర్యలను నిరసిస్తూ, 'యుగాంతర్' ఈ విధంగా వ్యాఖ్యానించింది: 'ముప్పయి కోట్ల భారతీయులు తమ అరవై కోట్ల చేతులను ఎత్తి పోరాడాలి. బలాన్ని బలంతోనే ఎదుర్కొనాలి'.

అంతేకాకుండా, భారతీయులను, భారతజాతీయోద్యమాన్ని హాస్యాస్పదం చేస్తున్న ఆంగ్లో- ఇండియన్ పత్రికలైన 'పయొనీర్' 'మద్రాస్ మెయిల్' వంటి పత్రికలను, జాతీయవాద పత్రికలు తీవ్రంగా విమర్శించాయి. అలాగే, హోంరూల్ ఉద్యమ కాలంలో కూడ, భారతీయ పత్రికలు ప్రముఖ పాత్ర వహించాయి. హోంరూల్ ఉద్యమాన్ని అనీబిసెంట్ ప్రారంభించింది కాబట్టి, ఆమె నడిపే పత్రిక 'న్యూ ఇండియా' ఈ ఉద్యమానికి బాగా ప్రచారం చేసింది. ఈ పత్రిక హోంరూల్ ఉద్యమం పై ఎన్నో వ్యాసాలను, సంపాదకీయాలను ప్రచురించింది. ఏప్రిల్ 16, 1915 నాటి 'న్యూ ఇండియా'లో భారతదేశం సొంతంగా పరిపాలించుకోడానికి ఎంతవరకు సమర్థురాలో, బ్రిటీష్ ప్రభుత్వం నిర్ణయించడం, వారి అహంకారానికి నిదర్శనం. తమ దేశాన్ని తాము ఏలుకొంటామని కోరడం, భారతీయుల జన్మ హక్కు. ఇంగ్లీషువారు వారి దేశంలో స్వేచ్ఛగా ఎలా ఉంటారో, భారతీయులు గూడ తమ దేశంలో స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటున్నారని వ్యాఖ్యానించింది. 'కృష్ణాపత్రిక' కూడ అనీబిసెంట్ హోంరూల్ ఉద్యమాన్ని సమర్థించింది. హోంరూల్ లీగ్ శాఖలను ఆంధ్రదేశమంతటా ప్రారంభించాలని కోరింది. 'ఆంధ్రపత్రిక' మాత్రం, కాంగ్రెస్ పార్టీ ఉండగా హోంరూల్ లీగ్‌ని స్థాపించడం అనవసరం కాబట్టి, లీగ్‌ను కాంగ్రెస్‌కు అనుబంధ శాఖగా ఏర్పాటు చేసుండాల్సిందని అభిప్రాయపడింది. ఇతర పత్రికలు, 'ఆంధ్రప్రకాశిక', 'రవి', 'శశిలేఖ', 'ఆంధ్రచంద్రిక', ఆంగ్ల పత్రిక 'మద్రాస్ మెయిల్' హోంరూల్ ఉద్యమాన్ని వ్యతిరేకించాయి. 1915లో దక్షిణ ఆఫ్రికానుండి భారతదేశానికి తిరిగి వచ్చిన మహాత్మా గాంధీ, జాతీయోద్యమ నాయకత్వాన్ని స్వీకరించి, 'యంగ్ ఇండియా' అనే ఆంగ్ల పత్రిక, 'నవజీవన్' అనే గుజరాతీ పత్రికలను నడిపారు. అచిర కాలం లోనే, 'యంగ్ ఇండియా' జాతీయ పత్రికగా పేరుగాంచింది. 1919 ఏప్రిల్ 13న పంజాబ్‌లో అమృతసర్ పట్టణంలోని జలియన్ వాలాబాగ్ దారుణకాండకు అనేకమంది బలయ్యారు. ఈ వార్తలు బయటికి ప్రాకనివ్వకుండా, ప్రభుత్వం జాగ్రత్త వహించింది. ఈ మారణహోమాన్ని జాతీయవాద పత్రికలు తీవ్రంగా విమర్శించాయి. 'బాంబే క్రానికల్', 'హిందూ' లాంటి పత్రికలపై ప్రభుత్వం విరుచుకుపడింది. ఈ కాలంలోనే, మోతీలాల్ నెహ్రూ 'ఇండిపెండెంట్' అనే ఆంగ్ల దిన పత్రికను స్థాపించాడు. బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మాంటేగ్ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను జాతీయవాద పత్రికలు విమర్శించాయి. ఇంగ్లీష్‌వారు నడిపే పత్రికలు మాత్రం సమర్థించాయి. సహాయ నిరాకరణోద్యమం జాతీయవాద పత్రికలనుండి బాగా ప్రచారాన్ని పొందింది. ఈ ఉద్యమంపై రాస్తూ, 'ఆంధ్రపత్రిక' సహాయ నిరాకరణోద్యమంతో భారతదేశ చరిత్రలో, ఒక నూతన యుగం ప్రారంభమౌతుందని వ్యాఖ్యానించింది. అంతేకాకుండా, ఈ పత్రిక ఈ ఉద్యమానికి మద్దతుగా ఎన్నో సంపాదకీయాలు, వ్యాసాలు, వార్తలు, ఉత్తరాలను అచ్చువేసింది. అలాగే, 'కృష్ణాపత్రిక' 'కాంగ్రెస్' పత్రిక కూడ, ఈ ఉద్యమానికి పూర్తి మద్దతును పలికాయి. ఆగస్ట్ 29, 1920 నాటి 'దేశాభిమాని' మహాత్మా గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం, జీవంలేని భారతదేశంలో కొత్త ఊపిరిని పోసిందని చెపుతూ, "కృష్ణ పరమాత్ముని వలె గాంధీగారు కూడ ప్రపంచాన్ని రక్షించడానికి సహాయ నిరాకరణ శంఖాన్ని పూరించాడ"ని పేర్కొంది. ఆంగ్ల పత్రికలైన 'జన్మ భూమి', 'హిందూ' కాలంలోనే

BRAOU

ప్రారంభమైన ప్రకాశంగారి 'స్వరాజ్య' పత్రిక, ఈ ఉద్యమానికి మద్దతుగా బాగా ప్రచారం చేశాయి. మొదట్లో, హిందూ సంపాదకుడు రంగస్వామి అయ్యంగారు ఈ ఉద్యమం పట్ల ఆసక్తి కనపర్చలేదు. అయితే, నాగపూర్ కాంగ్రెస్ మహాసభ తర్వాత, గాంధీ మద్దతుదారుగా మారి, ఈ ఉద్యమానికి బాగా ప్రచారం చేశాడు. ఈ ఉద్యమంపై రాస్తూ, 'హిందూ' పత్రిక ఇది ప్రజా ఉద్యమమని, మాతృభూమిని కాపాడుకోవడానికి పిరికితనం, బానిస మనస్తత్వం వదిలిపెట్టి, దేశ భక్తితో పోరాడాలని విజ్ఞప్తి చేసింది. 'జన్మభూమి' అనే సంపాదకీయంలో, "ప్రజల సహకారంతోనే ప్రభుత్వాలు నడుస్తాయి; ఈ ప్రభుత్వానికి ఆ సహకారాన్ని ఉపసంహరించండి. ఈ సైన్యం కాని, పోలీస్ కాని శాంతిభద్రతలను కాపాడలేవు" అని వ్యాఖ్యానించింది. ఫిబ్రవరి 5, 1921 నాటి 'కృష్ణాపత్రిక' సి. ఆర్. దాస్. గారి ఉత్తేజపూరితమైన సందేశాన్ని ప్రచురించింది. "మేలుకొండి! విద్యార్థులారా! మేలుకోండి"! అనే శీర్షిక కింద, విద్యార్థులను దేశం కొరకు వారి చదువులను వదలి వేయమని కోరడం జరిగింది. అలాగే, ఆనాటి వార్తాపత్రికలు వేల్స్ రాకుమారుని భారతదేశ యాత్రను బహిష్కరించమని ప్రజలకు పిలుపునిచ్చాయి. జనవరి 12, 1922 నాటి, 'హిందూ' పత్రిక 'రేపు' అనే శీర్షికన సంపాదకీయం రాస్తూ, వేల్స్ రాకుమారుని మద్రాస్ పర్యటనను బహిష్కరించమని కోరింది. అలాగే, విదేశీ వస్త్ర బహిష్కరణతోపాటు, ఖద్దర్‌ను ఉత్పత్తి చేసి ధరించమని వార్తాపత్రికలు కోరాయి. 'కాంగ్రెస్' పత్రిక తన సంపాదకీయంలో, ఖద్దర్ పేదరికాన్ని నిర్మూలించి, సుఖశాంతులను, ఆత్మగౌరవాన్ని కలిగిస్తుంద"ని పేర్కొంది. సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా, అంటరానితనం నిర్మూలనం, మత్తు పదార్థాల నిషేధంపైకూడ, వార్తాపత్రికలు బాగా ప్రచారం చేశాయి. బ్రిటీష్ మద్దతుదారులైన కొన్ని వార్తాపత్రికలు మాత్రం, ఈ ఉద్యమాన్ని తీవ్రంగా విమర్శించాయి. వీటిలో, 'దర్బార్', 'రవి', 'న్యాయదీపిక' ప్రముఖమైనవి. 'న్యూ ఇండియా', మద్రాస్ 'మెయిల్', 'ఇండియన్ రెవ్యూ' లాంటి భారతీయ ఆంగ్ల పత్రికలు కూడ, ఈ ఉద్యమాన్ని విమర్శించాయి. 'దర్బార్' ఈ ఉద్యమంపై వ్యాఖ్యానిస్తూ, ఇది ధనవంతుల ఉద్యమం; దీని వల్ల, పేదవారు ఇక్కట్ల పాలవుతారని పేర్కొంది. సెప్టెంబర్ 1920, సంచికలో 'హానికరమైన విధానం' అనే శీర్షికన సంపాదకీయం రాస్తూ, గాంధీగారి కార్యక్రమాలతో సహాయ నిరాకరణ తీర్మానాన్ని చేపట్టడం ద్వారా, భారత జాతీయ కాంగ్రెస్ దేశాన్ని విపత్కర పరిస్థితుల్లో పడవేసిందని విమర్శించింది. మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు, భారతీయులను తృప్తిపరచకపోవడంతో, ప్రభుత్వం ఈ సంస్కరణల్లో మార్పులు సూచించడానికి 'సైమన్' కమీషన్‌ను నియమించింది. అయితే, ఈ కమీషన్ భారతదేశంలో ఎక్కడికి వెళ్ళినా, అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు బహిష్కరించడం జరిగింది.

జాతీయ వారపత్రికలు ఈ బహిష్కరణ వార్తలను ప్రముఖంగా ప్రచురించాయి. 'కాంగ్రెస్', 'సత్యాగ్రహి', 'ఆంధ్రపత్రిక, 'కృష్ణాపత్రిక' ఈ బహిష్కరణ పిలుపుకు మద్దతును పలికాయి. అలాగే, ఆంగ్ల పత్రికలైన 'స్వరాజ్య', 'హిందూ' సమర్థించాయి. కాంగ్రెస్‌ను విమర్శించే 'న్యూ ఇండియా' పత్రిక కూడా, ఈ కమీషన్‌ను బహిష్కరించమని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. 1929 లో ఇంగ్లాండ్‌లో 'లేబర్ పార్టీ' అధికారానికి వచ్చింది. వైశ్రాయ్ అయిన ఇర్విన్ ప్రభువును లండన్‌కు పిలిపించి, భారతదేశానికి సంబంధించిన రాజ్యాంగ పరిషత్తును గురించి చర్చించారు. ఇర్విన్ భారతదేశానికి తిరిగివచ్చి, భారతీయులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో పాల్గొనడానికి తిరస్కరించింది. 1930 ఏప్రిల్ 5న గాంధీ "దండి యాత్రను" ప్రారంభించాడు. జాతీయవాద పత్రికలు దండి యాత్రకు గొప్ప ప్రచారాన్ని కలుగచేశాయి. అదే సంవత్సరం మే నెల్లో,

BRAOU

ఇండియన్ ప్రెస్ ఆర్డినెన్స్‌ను ప్రకటించడం వల్ల, పత్రికలెన్నో కఠిన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ కాలంలోనే, 'కాంగ్రెస్ బులెటిన్' అనే పత్రిక బొంబాయి నుండి రహస్యంగా వార్తలందిస్తూ, స్వాతంత్రోద్యమానికి అండగా నిల్చింది. తర్వాత, 1930 లో 'ఫ్రీ ప్రెస్ జర్నల్' అనే ఆంగ్ల దిన పత్రిక బొంబాయిలో స్థాపించబడి, అనేక నూతన శీర్షికలతో, జాతీయోద్యమ ప్రచార సాధనంగా ఉండేది. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం లండన్‌లో జరిగినపుడు, 'అమృత బజార్' పత్రిక, 'బాంబే క్రానికల్', 'హిందూ', 'లీడర్', 'మెయిల్' మొదలైన పత్రికల విలేఖరులు సమావేశానికి హాజరయ్యారు. సి.వై.చింతామణి, బి. శివరావు లాంటి ప్రముఖ పాత్రికేయులు ప్రత్యేక ప్రతినిధులుగా హాజరయ్యారు. జాతీయ కాంగ్రెస్ తరపున మహాత్మా గాంధీ రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యాడు. ఫలితం మాత్రం శూన్యం. ఈ సమయంలో, బెంగాల్‌లో జరిగిన హింసాకాండకు కొందరు బ్రిటీష్ వారు బలికాగా, ప్రభుత్వం ఆర్డినెన్స్‌లను జారీచేసి, తీవ్రవాద చర్యలను ప్రబోధించే రచనలనూ, పత్రికలనూ నిషేధించింది. స్వాతంత్ర్యోద్యమం ఉధృతం అయ్యేకొద్దీ, వార్తాపత్రికల సంఖ్య కూడ పెరిగింది. అంతేకాకుండా, జాతీయోద్యమాన్ని సమర్థించే వార్తాపత్రికలు కూడ పెరిగాయి. కలకత్తా నుండి 'ఫార్వర్డ్', 'అమృత బజార్ పత్రిక', బొంబాయి నుండి 'ఇండియన్ డెయిలీ మెయిల్', 'బాంబె క్రానికల్', లాహోర్ నుండి 'ట్రిబ్యూన్', ఢిల్లీ నుండి 'హిందూస్థాన్ టైమ్స్', అలహాబాద్ నుండి 'లీడర్', మద్రాస్ నుండి 'హిందూ', - ఈ పత్రికలన్నీ జాతీయోద్యమాన్ని బలపర్చాయి. భారతీయ భాషా పత్రికల్లో, హిందీలో 'ఆజ్', తమిళంలో 'స్వదేశ మిత్రన్', కన్నడంలో 'విశ్వకర్ణాటక', 'సంయుక్త కర్ణాటక', మరాటీలో 'కేసరి', మళయాళంలో 'మాతృభూమి', తెలుగులో 'ఆంధ్రపత్రిక' మొదలైనవి స్వాతంత్ర్య సమరానికి అండగా నిల్చాయి. అట్లే, 1933 లో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఆంగ్లంలోను, 'దినమణి' తమిళంలోను స్థాపించబడ్డాయి. ఈ సమయంలోనే, 1933లో బిర్లా సహాయంతో గాంధీజీ అంటరానితనం నిర్మూలనకు కృషిచేయడానికి, 'హరిజన్' అనే ఆంగ్ల వార పత్రికను ప్రారంభించాడు. 1935 చట్టాన్ని గూర్చి రాష్ట్ర శాసన సభలకు జరిగిన ఎన్నికల్లో, ఆరు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన ఏర్పడి, వార్తాపత్రికలపై ఉన్న ఆంక్షలను తొలగించడం జరిగింది. ఆగస్ట్ 1938 లో లక్నో నుండి 'నేషనల్ హెరాల్డ్', కోటంరాజు రామారావు సంపాదకత్వాన ప్రారంభమైంది. 1936లో బొంబాయి నుండి 'సండే స్టాండర్డ్' ప్రారంభమైంది. 1937 లో జిన్నా ముస్లిం లీగ్ నాయకత్వాన, 'డాన్' పత్రికను ఢిల్లీ నుండి వెలువరించాడు. 1941 లో బొంబాయి నుండి 'బ్లిట్జ్', 1942 లో భారత కమ్యూనిస్ట్ పార్టీ వారు 'పీపుల్స్ వార్' పత్రికను ప్రారంభించారు. 1938 లో 'ఆంధ్రప్రభ' దినపత్రిక ప్రారంభమైంది. 1942 ఆగస్ట్‌లో చరిత్రాత్మకమైన క్విట్ ఇండియా ఉద్యమం గాంధీ నాయకత్వంలో ప్రారంభమై, విప్లవ రూపం దాల్చింది. జాతీయవాద వార్తాపత్రికలు ఈ ఉద్యమానికి పూర్తి మద్దతును ప్రకటించాయి. ప్రభుత్వం తీవ్ర అణచివేతకు పాల్పడింది. ప్రభుత్వం ఎన్నో పత్రికలను నిషేధించింది. 'నేషనల్ హెరాల్డ్' తీవ్ర నిర్బంధానికి గురైంది. 1943 జనవరి లో ఆంక్షలను తొలగించినా, దేశ వ్యాప్తంగా పత్రికలు సమ్మెను ప్రారంభించి, ప్రభుత్వ ప్రకటనలు అచ్చువేయకూడదని నిర్ణయించాయి. ఇది పత్రికా రంగ చరిత్రలో అపూర్వ సంఘటనే. ఆరు రోజుల తర్వాత నిషేధాలను తొలగించారు. రెండో ప్రపంచ యుద్ధం పూర్తయ్యే నాటికి, స్వాతంత్ర్యోద్యమం ఉధృతమైంది. కాని, దురదృష్టవశాత్తు, ముస్లిం లీగ్ దేశ విభజనకై ప్రచారాన్ని ప్రారంభించింది. కొన్ని ముస్లిం పత్రికలు, మరి కొన్ని హిందు పత్రికలు మత దురహంకారాన్ని రెచ్చగొట్టే వ్యాసాలను ప్రచురించాయి. ఫలితంగా, దేశంలో అనేక ప్రాంతాల్లో మత ఘర్షణలు

BRAOU

ప్రారంభమైనాయి. ఇంగ్లాండ్‌లో ఎన్నికలు జరిగి, అట్లీ ప్రభుత్వం పదవీ స్వీకారం చేసి, వివిధ ప్రభుత్వాల ద్వారా, గాంధీజీ వ్యతిరేకించినప్పటికీ, ముస్లిం లీగ్ కోరినట్లుగా దేశాన్ని విభజించి, స్వాతంత్ర్యాన్ని ఇవ్వడం జరిగింది. దీన్ని ముస్లిం పత్రికలు సమర్థించాయి. ఈ విధంగా, జాతీయోద్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో వార్తాపత్రికలు చేసిన కృషి చాలా గొప్పది, గర్వించదగ్గది.

## 10.10 అంతర్జాతీయ సంఘటనలు - వార్తాపత్రికలు

అంతర్జాతీయ వార్తలను, సంఘటనలను గూర్చి కూడా, వార్తాపత్రికలు ప్రచురించేవి. భారతీయులు అంతర్జాతీయ పరిస్థితిని అర్థంచేసుకోడానికి, విదేశాల్లో జరిగే సంఘటనలపై సరైన అవగాహన కలగడానికి వార్తాపత్రికలు ఎంతో దోహదం చేశాయి. భారతదేశంలోని ఆంగ్ల పత్రికలు, భారతీయ భాషా పత్రికలు, 20వ శతాబ్ది ప్రథమ భాగంలో జరిగిన సంఘటనలపై, విశేషంగా చర్చించడం జరిగింది. 1905 లో రష్యా, జపాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో, గొప్ప దేశమైన రష్యా, ఆసియాలో చిన్న దేశమైన జపాన్ చేతిలో ఓడిపోవడం పై ఎన్నో వ్యాసాలు, వ్యంగ్య చిత్రాలు, సంపాదకీయాలను రాయడం జరిగింది. భారతీయ పత్రికలు జపాన్ విజయాన్ని ఉదాహరణగా తీసుకొని, భారతీయులందరు సంఘటితమై, బ్రిటీష్ వారిని భారతదేశం నుండి తరిమివేసి, స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవాలని తెల్పాయి. అదే విధంగా, 1914లో ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధం అంతర్జాతీయంగా గొప్ప భయాందోళనలను సృష్టించింది. ఈ యుద్ధంపై వ్యాఖ్యానిస్తూ, భారతీయ పత్రికలు వలస ప్రాంతాలపై ఆధిపత్యం కోసం, సామ్రాజ్యవాద దేశాల మధ్య ప్రారంభమైన పోటీ దీనికి కారణమని పేర్కొన్నాయి. ఈ మహా సంగ్రామం సాగినన్నాళ్ళు, పత్రికలు దీనిపై ఎన్నో రకాలైన వార్తలతో, చిత్రాలతో, వ్యాసాలతో ఆసక్తికరంగా ముద్రించడం జరిగింది. విశ్లేణతో కూడుకున్నటువంటి అంశాలను రచించడం జరిగింది. ఈ కాలంలోనే ప్రారంభమైన రష్యా విప్లవం కూడా, ప్రపంచమంతటా ఆసక్తిని కల్పించింది. లెనిన్ నాయకత్వంలో రాజరిక వ్యవస్థను కూలదోసి, ప్రపంచంలో మొట్టమొదటిసారిగా కమ్యూనిస్ట్ ప్రభుత్వాన్ని రష్యాలో ఏర్పాటుచేయడాన్ని, భారతీయ వార్తాపత్రికలు విశేషంగా ప్రచారాన్ని చేశాయి. ఈ సంఘటన ప్రభావం, భారతదేశంలో వామ పక్ష పార్టీ ఏర్పడడానికి, వామ పక్ష పత్రికలను స్థాపించడానికి కారణమైంది. అదే విధంగా 1929లో ప్రారంభమైన ఆర్థిక మాంద్యం (Great Economic Depression) ప్రపంచమంతటా వ్యవసాయ ఉత్పత్తుల (ఆహార ధాన్యాల) ధరలు పడిపోవడానికి, వలస రాజ్యాల ఎగుమతుల్లో, తీవ్ర సంక్షోభాన్ని కల్గించింది. దీని ప్రభావం వల్ల, భారతదేశంలో కూడ తీవ్ర ఆర్థిక సంక్షోభం ఏర్పడి, పండించిన పంటలకు ధరలు లేక, ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు. పత్రికలు ఈ అంశంపై కూడ వివిధ రకాల వార్తలను ప్రచురించి, భారతదేశ ఆర్థిక పరిస్థితి దిగజారడానికి బ్రిటీష్ ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని దుయ్యబట్టాయి. అట్లే, 1935 నుండే ఇటలీ, జర్మనీలు నియంతల పాలనలో, సామ్రాజ్యవాద విభేదాలను ప్రారంభించి, వివిధ దేశాలపై అన్యాయంగా దాడులు చేయడం ప్రారంభించాయి. 1938 లో హిట్లర్ జెకొస్లవేకియాపై అన్యాయంగా దాడి చేసి, ఆక్రమించుకోగా, ప్రపంచ దేశాధినేతలు, ప్రజాస్వామ్యవాదులు, వార్తాపత్రికలు తీవ్రంగా ఖండించడం జరిగింది. 'హరిజన్' పత్రికలో, గాంధీజీ 'జెక్ ప్రజల' ఇక్కట్లు మాకు ఎంతో బాధను కలిగిస్తున్నాయి; అక్కడ జరిగే సంఘటనలు నాకు శారీరకంగాను, మానసికంగాను ఎంతో వ్యధను కలిగిస్తున్నాయని రాశాడు. అంతేకాకుండా, 'మాన్‌చెస్టర్ గార్డియన్' కు ఉత్తరం రాస్తూ,

BRAOU

జెకొస్లవేకియాలో ఈ మధ్య జరిగిన సంఘటనలు, బ్రిటన్ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఆదేశాన్ని బెదిరించడం నాకు జుగుప్సను కలిగిస్తుందని రాశాడు. జెకొస్లవేకియా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలు మ్యూనిక్‌లో చేసుకున్న ఒప్పందంపై, గాంధీజీ అక్టోబర్ 5, 1938న 'నేషనల్ హెరాల్డ్' పత్రికలో రాస్తూ, బ్రిటన్, ఫ్రాన్స్‌లు జెకొస్లవేకియాను బలవంతంగా పట్టుకొని, జర్మనీ చేత బలాత్కారం చేయించినట్లుగా ఉందని వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో, పాలస్తీనా విమోచన కూడ, ఒక ప్రధాన సమస్యగా తయారైంది. పాలస్తీనా అరబ్బులు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే, జర్మనీలో చాలా మంది యూదులను (Jews) హిట్లర్ ఊచకోత కోసి, చంపడం జరిగింది. ప్రజాస్వామ్యవాదులు, మానవతావాదులు, వార్తాపత్రికలు ఈ దారుణాన్ని, తీవ్రంగా ఖండించడం జరిగింది. డిశంబర్, 1938 లో 'హరిజన్' పత్రిక సంపాదకీయంలో, గాంధీజీ ఈ విధంగా వ్యాఖ్యానించాడు: 'యూదులపై నాకు జాలి కలుగుతుంది. కాని, అరబ్బులపై యూదులను రుద్దడం కూడ తప్పు. అరబ్బులను నాశనం చేయడం మానవత్వానికి విరుద్ధం అని చెపుతూ, యూదులు వాస్తవాన్ని తెలుసుకొని, బ్రిటీష్ వారి మోసాన్ని గ్రహించి, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశాడు". అలాగే అని, ఆ ఖండాన్నంతటిని కబళించాలని ప్రయత్నిస్తున్న జపాన్‌కు గుణ పాఠాన్ని చెప్పడానికి, అమెరికా హీరోషిమా, నాగసాకి పట్టణాలపై ఆటం బాంబులను వేసి, లక్షలాది ప్రజల ప్రాణాలను బలిగొన్న సంఘటన, ప్రపంచాన్నంతటిని కలచివేసింది. ఈ మారణహోమాన్ని అందరు ఖండించారు. వార్తాపత్రికలు ప్రపంచ వ్యాప్తంగా, దీన్ని ఖండించాయి. భారతదేశంలో పత్రికలు ఈ సంఘటనపై ఎన్నో వ్యాసాలు, సంపాదకీయాలను రాయడం జరిగింది. అట్లే, రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ, దాని మిత్ర పక్షాలు ఓటమిని పొందటాన్ని, ఎంతో హర్షనీయాంశంగా పత్రికలు ప్రకటించాయి. ప్రజాస్వామ్యాన్నిదే అంతిమ విజయంగా, పత్రికలు వర్ణించాయి. అలాగే, రెండు ప్రపంచ యుద్ధాల వల్ల కలిగిన నష్టం తిరిగి జరగకుండా, భవిష్యత్తులో యుద్ధాలు జరగకుండా ఆపడానికి, ఐక్యరాజ్య సమితి అనే ఒక శాంతి సంస్థను ఏర్పాటు చేయడానికి అగ్రరాజ్యాధినేతలు తీసుకొన్న నిర్ణయం పట్ల, ప్రపంచ మంతటా హర్షం వెలిబుచ్చడం జరిగింది. భారతదేశంలో వార్తాపత్రికలు ఈ అంశాన్ని డబ్బాల్లో ప్రచురించి, మంచి ప్రాముఖ్యత నివ్వడం జరిగింది. ఈ విధంగా వార్తాపత్రికలు అంతర్జాతీయ విషయాలకు కూడ తగిన ప్రాముఖ్యత నిచ్చి, భారతీయుల విజ్ఞానాన్ని పెంపొందించడానికీ, అంతర్జాతీయ అంశాలపై అవగాహన పెరగడానికీ దోహదం చేశాయి.

## 10.11 ముగింపు

ఇంతవరకు మనం వార్తాపత్రికలను గురించి, వివిధ విషయాలను తెలుసుకున్నాం. భారతదేశంలో వార్తాపత్రికలు ప్రారంభమైన తర్వాత, ఎన్నో ఒడిదుడుకులను, మరెన్నో సవాళ్లను ఎదుర్కొని, పత్రికా రంగంలోనే కాకుండా, సమాజంలోనే ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసికొన్నాయి. అయితే, పత్రికలు సమకాలీన ప్రపంచంలో జరిగే ఎన్నో విషయాలను సేకరించి, వాటిపై విశ్లేషణతో కూడిన వ్యాసాలు, సమీక్షలు రాయడం ద్వారా, భవిష్యత్తులో ఏ అంశంపై రచనలు చేయాలన్నా, వార్తాపత్రికలను తప్పనిసరిగా సంప్రదించాలి. అయితే, వార్తాపత్రికల స్వభావాన్ని గూర్చి తెలుసుకోవడం ఎంతో అవసరం. ఎందుకంటే, ఆనాటి నుండి ఈ నాటి వరకు భారతదేశంలో సిద్ధాంతపరమైన అభిప్రాయాలు

BRAOU

బలంగా ఉన్నాయి కాబట్టి. మితవాద పత్రికలు, వామ పక్ష పత్రికలు, తీవ్రవాద పత్రికలు, మత తత్వ పత్రికలు భారతదేశంలో ఎన్నో ఉన్నాయి. ఒకే అంశంపై వివిధ పత్రికలు వివిధ రకాలైన రచనలు చేస్తాయి. అందువల్ల, చరిత్ర రచనలో వార్తాపత్రికలను ప్రామాణిక ఆధారంగా తీసుకొన్నప్పుడు, చాలా జాగ్రత్తగా పరీక్షించుకోవాలి. ఈ విషయంలో ప్రత్యేకించి, మత తత్వ ధోరణి ఉన్న పత్రికలను సంప్రదించాల్సి వచ్చినపుడు, వాటిలోని అంశాలను మిగతా ఆధారాలతో పోల్చి చూసి, వాటి ప్రామాణికతను రుజువుచేసుకొని, ఆ తర్వాతనే, వాటిలోని అంశాలను సేకరించాలి. తద్వారా, ఆ వార్తాపత్రికలు చరిత్ర రచనలో ఉన్నత ప్రమాణాలుగల ఆధారంగా ఉపయోగపడతాయి.

## 10.12 సంగ్రహంగా

1. భారతదేశంలో ముద్రణ శాలలు, వార్తాపత్రికలను మొట్టమొదట విదేశీయులే ప్రారంభించారు.
2. చరిత్ర రచనలో ప్రథమ ఆధారంగా, పత్రికల ప్రయోజనం ఎంతగానో ఉంది.
3. భారతదేశంలో ఆంగ్ల పత్రికలు భారతీయుల్లో రాజకీయ చైతన్యాన్ని తీసికొని రావడంలో, ప్రముఖ పాత్ర వహించాయి.
4. తెలుగు పత్రికలు స్థానిక విషయాలే కాకుండా, దేశానికి సంబంధించిన విషయాలను కూడ బాగా రాసేవి.

## 10.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. భారతదేశంలో వార్తాపత్రికల పుట్టుక గురించి రాయండి.
2. తెలుగు పత్రికల అవతరణను తెల్పండి.
3. సంస్కరణోద్యమాల్లో పత్రికలు ఎట్టి పాత్రను నిర్వహించాయి?
4. జాతీయోద్యమంలో భారతీయ పత్రికల పాత్రను అంచనావేయండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చరిత్ర రచనకు వార్తాపత్రికలు ఏవిధంగా ఉపయోగపడతాయి?
2. భారతదేశ ఆర్థిక వ్యవస్థలోని లోపాలను, వార్తాపత్రికలు ఎలా ఎత్తిచూపాయి?
3. ప్రభుత్వ విధానాలపై వార్తాపత్రికల ప్రతిస్పందన ఎట్టిది?

BRAOU

## 10.14 ఉపయుక్త గ్రంథాలు


Desai A.R. : **Social Background of Indian Nationalism.**

Isrrael Milton : **Communications and Power: Propaganda and the Press in the Indian Nationalist Struggle, 1920 -1949**

Kesavan B.S. ; **History of Printing and Publishing in India, Vols. I & II**

Krishnamurthy, Nadig : **History of Indian Journalism**

Moitra, Mohit : **A History of Indian Journalism**

Natarajan, J. : **A History of Indian Journalism**

Parthasarathy, R. : **A Hundred Years of the Hindu**

Sarkar, Sumit : **Modern India, 1885 - 1947**

Seshagiri Rao, K.R. : **Studies in the History of Telugu Journalism**

Subramanyam, K. : **The Press and the National Movement in South India: Andhra, 1905 - 1932**

లక్ష్మణరెడ్డి, వి. : **తెలుగు జర్నలిజం - అవతరణ - వికాసం**


రచయిత: జి. సుదర్శన్ రెడ్డి

BRAOU

# భాగం-11 : మౌఖిక సాంప్రదాయం

విషయ క్రమం


11.0 లక్ష్యాలు

11.1 పరిచయం

11.2 మౌఖిక సంప్రదాయం - చరిత్ర రచన

11.3 మౌఖిక ఆధారాలకు ఉన్న పరిమితులు

11.4 మౌఖిక ఆధారాల ప్రయోజనం

11.5 సంగ్రహంగా

11.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

11.7 ఉపయుక్త గ్రంథాలు


## 11.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- మౌఖిక సంప్రదాయం చరిత్ర రచనకు ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించగలగాలి.
- ఈ మధ్య కాలంలో ఐరోపా, ఆఫ్రికా, భారతదేశ చరిత్రల పునర్నిర్మాణంలో, మౌఖిక సంప్రదాయాల ప్రాముఖ్యతను వివరించగలగాలి.
- చరిత్ర పునర్నిర్మాణంలో మౌఖిక ఆధారాలను ఉపయోగించటంలో పరిమితులను విశ్లేషించగలగాలి

BRAOU

## 11.1 పరిచయం

ఏదైనా ఒక జాతి ఆచారాలు, నమ్మకాలు అక్షరాస్య సంస్కృతికి భిన్నంగా ఉండి, తరాల తరబడి మౌఖిక మార్గాల్లోనే అవి కొనసాగుతూ వచ్చినట్లైతే, అది ఒక సంప్రదాయంగానే స్థిరపడిపోతుంది. అదే మౌఖిక సంప్రదాయం అని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా చెబుతుంది. ఈ సంప్రదాయంలో జీవించే వారి సాహిత్యం, మౌఖిక వాఙ్మయం అవుతుంది. సాహిత్యం ప్రజల్లో చలనాన్ని, చైతన్యాన్ని, సంస్కారాన్ని కలిగిస్తుందని భావిస్తే, ఈ విషయంలో లిఖిత సాహిత్యం కంటే, మౌఖిక వాఙ్మయమే ఎక్కువ చురుకుగా పనిచేస్తుంది. ఇది, గతకాల స్మృతి చిహ్నం కాదు. అది, నేటికీ సజీవమై, నిత్యనూతనమై, ప్రయోజనకారిగా ఉంది. జాతి సంస్కృతికి ప్రతీక, మౌఖిక సంస్కృతేనని భావించవచ్చు. ఇది అనేక తరాలుగా నోటిమాటగా కొనసాగుతూ ఉన్నది. గత కాల ప్రజలు, సంఘటనల గురించిన వర్ణన ఇందులో మనకు కనిపిస్తుంది.

చరిత్ర రచనకు మౌఖిక ఆధారాలు ఒక ముఖ్య ఆధారమనే విషయం, 20వ శతాబ్ది ద్వితీయార్ధంలో మాత్రమే గుర్తింపబడింది. ఈ మౌఖిక ఆధారాలు చారిత్రక ఆధారాలుగాకంటే, సమాజ శాస్త్రం, సామాజిక మానవ శాస్త్రం మొదలైన విభాగాలకు సంబంధించిన విషయంగానే, మొదట్లో పరిగణించారు. చరిత్ర అంటే, రాజకీయ చరిత్రగానే భావించినంత కాలం, ఆధునిక మౌఖిక ఆధార పద్ధతి, చరిత్ర రచనతో పెద్దగా సంబంధం ఉన్న విషయంగా గుర్తించబడలేదు. ఐరోపాలో పారిశ్రామిక విప్లవానంతరం, ముఖ్యంగా, మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత, చరిత్ర అంటే, ప్రభువుల చరిత్రతోబాటు సామాన్యుల చరిత్ర కూడా అని, భావించారు. సామాన్యుని జీవితం గురించి తెలుసుకోవాలంటే, సమకాలీన రచనలు, ఆచారవ్యవహారాలు, జ్ఞాపకాల పునశ్చరణలు తప్పనిసరి అని గ్రహించారు. నిజానికి ఏవో కొద్ది విషయాల్లో తప్పించి, ప్రపంచ చరిత్ర రచన శ్రుత రూపంలోగాని, అక్షర రూపంలోగాని దొరికిన ఆధారాలే, అతి ప్రాచీన చరిత్రకు కూడా ఆధారం. అంటే, నేడు చరిత్రకారులు ఉదహరించే అనేక లిఖిత పూర్వక ఆధారాలు కూడా, నిజానికి మూలంలోకి వెళ్తే, మౌఖ్యమేనని స్పష్టమవుతుంది. ఈ దృష్ట్యానే వేదాలను, పాత నిబంధనను, తదితర వాఙ్మయాధారాలను, మౌఖిక ఆధారాల జాబితాలోకి చేర్చొచ్చు.

## 11.2 మౌఖిక సాంప్రదాయం - చరిత్ర రచన

BRAOU

ఋగ్వేదం ఎక్కడ జరిగిన విషయాల గురించి, ఎక్కడి పరిస్థితుల గూర్చి వివరించిందో చెప్పటం, ఇంకా పూర్తిగా సాధ్యపడలేదు. కాని, మానవ నాగరికతా వికాసంలో ఒక గొప్ప ఘట్టాన్ని అది తెలియజేస్తుందనేది స్పష్టం. ఇంద్రుడు, రుద్రుడు, అగ్ని, వాయువులు దేవుళ్ళా? వారి అంశయా? అనేది మనకు చర్చనీయాంశం కాదు. ఆనాటి జీవన విధాన పరిస్థితులు తెలుసుకోడానికి, అది ఎంతగానో తోడ్పడుతుంది. పాత నిబంధనలోని అంశాల వలెనే, పురావస్తు శాస్త్రజ్ఞులు ఋగ్వేద ప్రాంతాలను కూడా పూర్తిగా గుర్తించగలిగినప్పుడు, వైదిక వాఙ్మయానికి కూడా చరిత్ర ఆధారంగా, మరింత ప్రాముఖ్యం ఏర్పడుతుంది. క్రీస్తు పూర్వం మూడు వేల సంవత్సరాల నుండి వున్న నాగరికతలు వెలుగులోకి వచ్చేముందు, వాటిని గురించి ప్రజలు నోటిమాటగా చెప్పుకునే గాథలే ఆధారం. అందువల్ల, కట్టడాలు, నాణేలు, శాసనాలు, తదితర భౌతిక అవశేషాల రూపంలో బయల్పడిన అనేకమైన చరిత్ర ఆధారాలకు మూలం, కథలు, జానపద గీతాలు, నానుడులు మొదలైన మౌఖిక ఆధారాలే.

ఇతిహాస-పురాణ యుగానికి వస్తే, యీ రచనలు వేదాల వలె కాదు. వేదం అపౌరుషేయం. ఇతిహాస పురాణాలు ఒకరు చెప్పగా, మరొకరు విని రాయబడినాయి. వీటిలో, ఒక క్రమ పద్ధతిలో రాజులు, రాజ్యాలు, పాలనా పరిమితులు, విధానాలు మొదలైనవి, సుమారు రెండువేల సంవత్సరాలకు సంబంధించి కన్పిస్తాయి. ఇందులో, ఎంత వాస్తవం అనేది, ప్రస్తుతం మన సమస్య కాదు. ఇవి చరిత్రలో కాల నిర్ణయానికి బాగా ఉపకరించాయి. అదే విధంగా, ఇతర చరిత్ర ఆధారాలకు స్పష్టతను చేకూర్చాయి. రామాయణ మహాభారతాలు, అష్టాదశ పురాణాలు ముఖ్యమైనవే అయినా, పురాణాలను పోలిన అనేక చిన్న గాథలు, రాజుల చరిత్రలు కూడా వెలువడ్డాయి. ఇవన్నీ, మౌఖిక ఆధారాల్లోకే వస్తాయి. ప్రాచీన భారతదేశంలో ఏకైక చరిత్ర రచన అని చెప్పబడే, కల్హణుని 'రాజతరంగిణి' కూడా, మూలంలోకి చూస్తే, మౌఖిక ఆధారం కిందికే వస్తుంది.

బుద్ధుని జాతక కథలు ప్రత్యేకంగా ఒక రాజు గురించో, ఒక దేశం గురించో కాకపోయినా, సుమారు వేయి సంవత్సరాల దేశ, కాల పరిస్థితులను విశ్లేషించటానికి తోడ్పడ్డాయి. ఇవి కూడా, ఒకరి ద్వారా ఇంకొకరు తెలుసుకున్నవే. వంశావళులు, పురాణాల నుండి స్ఫూర్తి పొందిన వాటిగా భావించొచ్చు. కొంత ప్రాధాన్యం పొందిన వ్యక్తులు వారి గూర్చి, వారి పూర్వీకుల గూర్చి ప్రకటించుకొన్న విషయాలుగా, వీటిని పరిగణించొచ్చు. ఇందులో కొన్ని లిఖితం కాగా, అనేకం అలిఖితం. వీటిని తెలుగులో భట్రాజులు, పిచ్చుగుంటలవారు మొదలైన జానపదులు పరిరక్షించారు. ఈ వంశావళుల్లోనే, గోత్ర ప్రవర నామాలను కూడా చేర్చవచ్చు. ఇవి స్థానిక చరిత్ర రచనల్లో, ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తాయి.

ప్రాచీన కాలంలోనే, భారతదేశానికి విదేశీ యాత్రికులు వచ్చేవారు. పారశీక చక్రవర్తి మూడో డేరియస్ పంపగా వచ్చిన స్కైలాక్స్, గ్రీక్ చక్రవర్తి అలెగ్జాండర్‌తోబాటు వచ్చిన అరిస్టోబ్యులస్, ఒనెసిక్రిటస్ మొదలైన వారు, మన దేశ పరిస్థితులను గూర్చి మొదటిసారిగా తెలియజేశారు. తర్వాత బౌద్ధ మతం అంతర్జాతీయంగా పరివ్యాప్తి చెందటంతో, బౌద్ధాన్ని స్వీకరించిన చైనీయులు కొందరు, బుద్ధుని జన్మభూమిని దర్శించాలన్న కుతూహలంతోను, బౌద్ధ మత గ్రంథాలను అధ్యయనం చేయాలన్న ఆకాంక్షతోను, మన దేశంలో పర్యటించి కొందరు విద్యార్థులుగా తక్షశిల, నలంద, వల్లభి, నాగార్జునకొండ మొదలైన విశ్వవిద్యాలయాల్లో ఉండి వెళ్లారు. తమ పర్యటనల అనుభవాలను, భావి తరాల వారికి అందించిన పాహియాన్, యువాన్‌చ్వాంగ్, ఇట్సింగ్ మొదలైన ఈ యాత్రికుల రచనలు మౌఖిక ఆధారాలుగానే, పరిగణనలోకి వస్తాయి. మన దేశానికి దండయాత్రికులుగా వచ్చి, పాలకులుగా మహమ్మదీయులు స్థిరపడ్డ మధ్య యుగంలో, అల్‌బెరూనీ, ఫిర్దౌసి, మిన్హాజ్-ఉస్-సిరాజ్, అమీర్ ఖుస్రూ, ఇబన్ బటూటా, బరనీ, ఫెరిస్తా, నిజాముద్దీన్, అబుల్ ఫజుల్ మొదలైన అనేకులు సమకాలీన చరిత్ర నందించారు. ఇందులో కొందరు, వారి మత దృక్పథంతో సంఘటనలను వర్ణించగా, మరికొందరు వారి ఏలికను కేంద్రంగా చేసుకుని వివరించారు. వీరేగాక, అనేక దేశాల నుండి వర్తకం కోసం వచ్చిన మార్కోపోలో, నికిటిన్, పేస్, న్యూనిజ్ వంటి వారూ తాము చూసినవీ, విన్నవీ ఆధారంగానే, తమ తమ అనుభవాలను గ్రంథస్థం చేశారు.

16, 17 శతాబ్దాల్లో, ప్రపంచ వ్యాప్తంగా, కొత్త రవాణా మార్గాలను కనుగొనటం, కొత్త వ్యాపార సంఘాలు ఏర్పడటం జరిగింది. ఇదే సమయంలో, ఐరోపాలో క్రైస్తవ మతంలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. వాణిజ్యాభివృద్ధి, నూతన మతావేశం కలసి, ఆసియా, అమెరికా ఖండాల్లో ముందు ప్రవేశిస్తే, ఆఫ్రికా, ఆస్ట్రేలియాల్లో ఆ తర్వాత కాలంలో ప్రవేశించాయి. వీటికి తోడు, 18 వ శతాబ్దాంతానికి ఐరోపాలో పారిశ్రామిక విప్లవంతో, మరిన్ని కొత్త పోకడలు చోటుచేసుకున్నాయి. ఐరోపావాసులు భారతదేశంలో వ్యాపార కేంద్రాలను ఏర్పాటుచేసి, వాటి కార్యకలాపాలను, వ్యాపార గణాంకాలను, వారికెదురైన సమస్యలను ఎప్పటికప్పుడు ఐరోపాలోని కేంద్ర కార్యాలయానికి నివేదించేవారు. వీటి ద్వారా, ఆనాటి పరిస్థితులను గ్రహించొచ్చు. 18వ శతాబ్దంలో డెన్మార్క్‌కు చెందిన క్రైస్తవ మిషనరీలు బెంగాల్‌లోని సేరంపూర్ పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని, మత ప్రచారం చేస్తూ, అనేక సంక్షేమ కార్యక్రమాలను బెంగాల్, మద్రాస్, ప్రెసిడెన్సీల్లో నిర్వర్తించేవారు. వారి కార్యకలాపాల రికార్డులు, ముఖ్యంగా, వారు మనదేశంలోకి అచ్చు యంత్రాన్ని ప్రవేశపెట్టి, క్రైస్తవ మత ప్రచారం

BRAOU

కోసం అనేక భాషల్లో బైబిల్‌ను ముద్రించటం, వీటి ద్వారా, ఆయా భాషల్లో అక్షరాలకు స్థిరత్వాన్ని కల్పించటం, సాహిత్యాన్ని సామాన్యుని కందుబాటులోకి తేవటం జరిగింది. సేరంపూర్ వివరణలతో బాటు, ఇంకా అనేక క్రైస్తవ మిషనరీలు దేశం వివిధ ప్రాంతాల్లో మత ప్రచారాన్ని, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. వాటన్నిటినీ వారు, వారి చర్చి రికార్డుల్లో పొందుపర్చారు. ఇవన్నీ, ఐరోపా వాసులకు ఆనాడు భారతీయులపై గల అభిప్రాయాలను, అవగాహనలను తెలుసుకోటానికి ఉపయోగపడే, మౌఖిక ఆధారాల కోవకే చెందుతాయి.

1757 లో అనుకోకుండా, ఆంగ్లేయులు బెంగాల్ పై ఆధిపత్యాన్ని సాధించారు. ఇది అవకాశంగా తీసుకుని, ఎంత సంపద ఏ రూపంలో వీలుంటే, ఆ రూపంలో ప్రజల నుండి దోపిడీ చేశారు. బందిపోట్లు దాడి చేసి, ఇళ్లు దోచి, ఊళ్ళు తగుల బెట్టిందానికి, దీనికీ పెద్ద తేడా కన్పించదు. ఇంగ్లీష్ ఈస్టిండియా కంపెనీవారు తాము బెంగాల్ పాలకులమని అనుకోనూ లేదు. అంగీకరించనూ లేదు. ఇటువంటి అరాచకం ఎక్కడా చరిత్రలో లేదని, కంపెనీ ప్రధాన పాలకులే వర్ణించారు. కంపెనీ ఉద్యోగులంతా నవాబులుగా ఇంగ్లాండ్‌లో గుర్తింపు పొందారు. 1757-67 మధ్య కాలంలో, కంపెనీ అధీనంలో ఉన్న ప్రాంతం జనాభాలో, మూడో వంతు మంది ఆకలి చావుకి గురయ్యారు. బెంగాల్‌లోను, కోస్తా ఆంధ్రలోను ఎవరు పాలకులో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. అటువంటి పరిస్థితుల్లో, ఇంగ్లాండ్‌లోని ఈస్టిండియా కంపెనీ పెద్దలు ఇక్కడి ప్రజలకు ఆదాయం ఏమిటి? ఖర్చు ఏమిటి? పాలనా వ్యవస్థ ఏమిటి? ఎంత పన్ను వెయ్యొచ్చు? ఇంతకు ముందు ఎంత పన్ను వేసేవారు? మొదలైన వివరాలన్నీ ఉంటేగాని, తమ పాలనా విధానాన్ని నిర్ణయించలేమని, భారతదేశంలో అనుభవం కల అధికారులతో ముందు, రహస్య సెలెక్ట్ కమిటీలను నియమించి, అనంతరం, సర్క్యూట్ కమిటీలను నియోగించారు. ఇక్కడ మన మౌఖిక చరిత్రకు ముఖ్యమైన అంశం ఏమంటే, ఈ కమిటీలు గ్రామస్థుల నుండి, పెద్దల నుండి, స్థానికాధికారుల నుండి మౌఖిక సాక్ష్యాల్ని సేకరించటం. బహుశా, ఆధునిక మౌఖిక చారిత్రక పద్ధతికి, 19వ శతాబ్ది చివరి దశలో జరిగిన ఈ ప్రయత్నమే, మన దేశంలో మొదటి ప్రయత్నమని చెప్పవచ్చు.

BRAOU

కంపెనీ పరంగా కొన్ని ప్రయత్నాలు జరిగినా, కంపెనీ ఉద్యోగులకు వారి పాలనా ప్రాంతాల్లో అవగాహనకు, స్థానిక పరిస్థితుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇందుకోసం, మెకంజీ వంటి కొందరు అధికారులు స్థానిక చరిత్రను తెలుసుకోటానికి ప్రయత్నం చేశారు. కల్నల్ కాలిన్ మెకంజీ 1783 లో ఇంజనీరుగా చేరి, 1816 నాటికి మొత్తం భారతదేశానికి సర్వేయర్ జనరల్ స్థాయిని పొందాడు. అతడు తన సొంత ధనాన్ని వెచ్చించి, తెలుగు, కన్నడం, తమిళం, మహారాష్ట్ర, పారశీక భాషల్లో, ఉద్దండులైన పండితులను జీతభత్యాలిచ్చి, వివిధ ప్రాంతాలకు పంపి, వారం వారం వారి దిన చర్యలను తెలుసుకుంటూ, వారి ద్వారా, ప్రతి గ్రామం గురించి, చారిత్రక, భౌగోళిక, సామాజిక, ఆర్థిక, మత పరిస్థితుల గురించి లేఖలు రాసి పంపమని, గ్రామాధికార్లను ఆదేశించి, వారి ద్వారా కొన్ని వేల రికార్డులను సేకరించాడు. ఇవన్నీ ఆయా గ్రామాల్లో ఉన్నవీ, అనుకుంటున్నవీను. ఆధునిక సర్వే పద్ధతిలో జరిగిన మౌఖిక విషయ పరిశీలన ఇది. ఈ కార్యక్రమంలో మెకంజీకి సహాయపడ్డ పండితుల్లో, కావలి వెంక బొర్రయ్య, అతని సోదరులు వెంకట లక్ష్మయ్య, వెంకట రామస్వామి తదితరులు ప్రముఖులే.

ఆ తర్వాత కాలంలో, స్వీయ ధనంతో, తెలుగు భాషా సాహిత్యాలపై తనకున్న అభిమానంతో, కంపెనీ ఉద్యోగి సి.పి. బ్రౌన్ అనేక తెలుగు గ్రంథాలను పరిష్కరించి, తెలుగు భాషకు, తెలుగు చరిత్రకు ఎనలేని సేవ చేశాడు. సర్ విలియమ్ జోన్స్ సంస్కృత భాషను, సనాతన సమాజాన్ని పునరుద్ధరించటానికి చేసిన ప్రయత్నమే, అతడు స్థాపించిన 'ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్' (Asiatic Society of Bengal). ఈ సొసైటీ సేకరించి, పునరుద్ధరించిన సాహిత్యం, చారిత్రక పరిశోధనకు ఎంతగానో ఉపయోగపడింది. అనేక మంది బ్రిటీష్ సైనికాధికారులు, I.C.S. లు రాసిన అనుభవాలు, స్వీయ చరిత్రలు, ఫాస్టర్ 'ఏ పాసేజ్ టు ఇండియా' (A Passage to India) వంటి నవలలు మౌఖిక ఆధారాలుగా, చరిత్ర రచనకు ఎంతో ఉపయోగపడ్డాయి. అలాగే, చరిత్ర ఆధారాలతో సంబంధంలేని కల్పిత రచనలు కూడా, చాలా ముఖ్యమైనవి. ఉదాహరణకు, బంకించంద్ర ఛటర్జీ 'ఆనందమఠం' రాహుల్ సాంకృత్యాయన్ 'ఓలాసే గంగా' మొదలైనవి ఈ కోవకు చెందుతాయి. ఒక రకంగా, గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం', కందుకూరి వీరేశలింగం 'స్వీయచరిత్ర'తో బాటు, యిత్తర రచనలు, మౌఖిక ఆధారాలే. అతిముఖ్యమైన మౌఖిక ఆధారాల్లో, జీవిత చరిత్రలకు ప్రత్యేక స్థానముంది. ముఖ్యంగా, స్వీయ చరిత్రల్లో భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం, సురేంద్రనాథ్ బెనర్జీ స్వీయ చరిత్ర 'ఏ నేషన్ ఇన్ మేకింగ్' (A Nation in Making), మహాత్మా గాంధీ స్వీయ చరిత్ర (My Experiments with Truth), జవహర్‌లాల్ నెహ్రూ స్వీయ చరిత్ర 'ఆటోబయోగ్రఫీ' (Autobiography) లను పేర్కొవచ్చు. యిరోపాలో చర్చిల్ జ్ఞాపకాల కున్న ప్రాముఖ్యత, భారతదేశంలో వీటికీ ఉంది. ఆ తర్వాత కాలంలో, వి.పి. మీనన్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ (Transfer of Power), కె.పి. యస్. మీనన్ జీవిత చరిత్ర ట్రావెలోగ్స్ (Travelogues) లను స్వతంత్ర భారతంలో, పాలనాధికారుల రచనలకు ఉదాహరణగా తీసుకోవచ్చు.

మౌఖిక చరిత్ర అనేది రెండో ప్రపంచ యుద్ధానంతరం అభివృద్ధి చెందిన శాస్త్రంగా భావిస్తే, భారతదేశానికి సంబంధించినంత వరకు, భారత స్వాతంత్ర్యోద్యమంలో ఎవరెవరు ఎటువంటి సేవలందించారనేది, ప్రతి రాష్ట్రంలోనూ క్రోడీకరించటం జరిగింది. మౌఖిక చరిత్ర నిర్మాణానికి, ఈ మధ్య కాలంలో జరిగిన అతి పెద్ద ప్రయత్నం ఇదే. దీని తర్వాత అంతకన్నా, సమగ్రంగా స్వాతంత్ర్య యోధుల గురించి, స్వాతంత్ర్య పోరాటం గురించి తెలుసుకోవాలనే ప్రయత్నంలో, ఏ రాష్ట్రానికా రాష్ట్రం మౌఖిక చరిత్ర ప్రాజెక్టులను ఏర్పాటు చేసి, దృశ్య శ్రవణ పరికరాల సహాయంతో, విభిన్న వ్యక్తుల జ్ఞాపకాలను, అనుభవాలను నిక్షిప్తంగా చేస్తున్నాయి. జాతీయ స్థాయిలో జరిగిన ఈ ప్రయత్నాలుకాక, అనేక సమస్యలపై అనేక సర్వేలు జరిగాయి. జమీందారీల రద్దు, సంస్థానాల్లో ప్రజాపాలన, హిందూ కోడ్ బిల్లు మొదలైన వాటిపై అభిప్రాయ సేకరణలు జరిపి, వాటి ఫలితాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. మరో రకమైన వివరాల సేకరణ కూడా జరిగింది. కార్మికుల స్థితిగతులు, రైల్వేలు, కూలీలు, వేశ్యావృత్తి మొదలైన వాటికి వివిధ సంస్థలు, సంఘాలు, ప్రజాభిప్రాయం ద్వారాను, ప్రభుత్వ గణాంకాల ద్వారాను విషయ సేకరణ చేయడమైంది. ఇందులో, చరిత్ర రచనకు మౌఖిక ఆధారాలుగా ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఆఫ్రికాలో మౌఖిక చరిత్ర 1950 తర్వాత మాత్రమే ప్రారంభమైందని ఒక వాదన ఉంది. దీని ప్రకారం, ప్రపంచ మంతటా కూడా, మౌఖిక చరిత్ర అప్పుడే ఆరంభమైందని చెప్పాలి. కాని,

BRAOU

ఆఫ్రికా అంతటి పెద్ద ఖండానికి, పురాతన ప్రజలకు, మౌఖిక చరిత్ర మిగతా ఖండాల్లో మాదిరే అనాది నుండి ఉంది. అయితే, ఐరోపావాసులు 19వ శతాబ్దంలో ఆఫ్రికా నాగ్గరికతను పూర్తిగా నాశనం చేసి, అక్కడ కొత్త సమాజాన్ని నిర్మించారు. కొత్త భాషలు, కొత్త మతం, కొత్త ఆచార వ్యవహారాలను ప్రవేశపెట్టారు. ఎన్ని ప్రవేశపెట్టినా, వేల సంవత్సరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలు, వాటి జ్ఞాపకాలు ఇప్పటికీ, సజీవంగానే ఉన్నాయి. అయితే, 19వ శతాబ్దంలో క్రైస్తవ మిషనరీల రాతలే, ఆఫ్రికా చరిత్రకు ఆధారమనే అభిప్రాయం వల్ల, ఆఫ్రికాకు వేల వందల సంవత్సరాల చరిత్ర లేదేమోననే అపోహ యేర్పడింది. 1950 అనంతరం, మౌఖిక సంప్రదాయాల ఆధారంతో ఉగాండా వారి పూర్వీకులెవరు? కెన్యావారి పూర్వీకులెవరు? వారి చరిత్ర ఏమిటి? అనే అంశాలపై రచనలు వెలువడటం ఆరంభమైంది.

అమెరికా ఖండ చరిత్ర మరింత విషాదకరం. ఐరోపావాసులు అమెరికాలో ప్రవేశించి, చరిత్ర నొక్క మలుపు తిప్పారు. దక్షిణ అమెరికాలో స్థానికుల్ని చంపటమో, జాతి సంకరమో చేసి, వారి ప్రత్యేకతను కోల్పోయేట్లు చేస్తే, ఉత్తర అమెరికాలో మొత్తం స్థానికుల్ని ఇంచుమించు చంపేశారు. మాయా నాగరికత మొదలైన అత్యున్నత నాగరికతలను నిర్మించిన స్థానికులు ఆటవికులుగా వర్ణింపబడి, తుదముట్టబడ్డారు. అందువల్ల, అమెరికా ఖండానికి చరిత్ర 16,17 శతాబ్దాల్లో ప్రారంభమైంది. అక్కడ మౌఖిక చరిత్ర కూడా, ఐరోపా నుండి వలస వెళ్ళిన వారి అనుభవాలు, జ్ఞాపకాలుగానే మిగిలింది. ఈ మధ్య కాలంలో, ఆఫ్రికా నుండి అక్కడికి బానిసలుగా తేబడి, ఇప్పుడు స్వతంత్రంగా ఉన్న నల్లజాతి వారిలో, వారి చరిత్ర గురించి తెలుసుకోవాలనే ఉత్సుకత ఏర్పడింది. దీని పరిణామమే, అలెక్స్ హీలే (Alex Heilay) రాసిన 'రూట్స్' (Roots) అనే పుస్తకం, తన పూర్వీకుల గురించి తెలుసుకుంటూ, ఆఫ్రికా ఖండంలో ఎలా ఉండేవారని తెలుపుతూ రాసిన, ఒక గొప్ప విశ్లేషణాత్మకమైన గ్రంథం. ఇది పూర్తిగా మౌఖిక సంప్రదాయాలపై ఆధారపడిందే. భారతదేశంలో రాహుల్ సాంకృత్యాయన్ రచనలకు, దీనికి పోలికలు కన్పిస్తాయి.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల్లో కూడా, అమెరికా పరిస్థితి కంటే భిన్నం కాకపోయినా, ఇంకా కొన్ని తెగలు అనాగరికులనే పిలువబడుతూ, మనగలుగుతున్నాయి. ఇక్కడి మౌఖిక చరిత్ర కూడా, చాలా వరకు ఐరోపావాసుల అనుభవాలు, జ్ఞాపకాలే.

ఇక ఐరోపా ఖండానికి వస్తే, విజ్ఞాన శాస్త్రం ఆ ఖండంలోనే మొదట అభివృద్ధి చెందటం వల్ల, అక్కడ చరిత్ర రచనకు ఒక నిర్దిష్టత, ఒక సమగ్రత 20వ శతాబ్దంలోనే, పారిశ్రామికీకరణ వల్ల వచ్చిన సమస్యలను పరిష్కరించుకోవడానికి చేసిన ప్రయత్నాల్లో, సర్వేలు, అభిప్రాయ సేకరణలు వంటి మౌఖిక శాస్త్ర పద్ధతుల్ని ప్రయోగించి, పశ్చిమ ఐరోపావాసులు అభివృద్ధి చెందారు. సమస్యను గుర్తించటం, విశ్లేషించటం, నివారణను సూచించటం, ఈ మౌఖిక విధానాల వల్లనే సాధించారు. అందువల్ల, ఐరోపాలో ఆదిమ మానవుని చరిత్ర నుండి ఆధునిక పాఠశాల విద్యార్థుల చరిత్ర వరకూ, మౌఖిక ఆధారాల సహాయంతో విశ్లేషిస్తున్నారు.

మౌఖిక చరిత్ర రచన అనేది పురాతన కాలం నుండీ జరుగుతున్నా, అందులో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకరు చెప్పింది విని జ్ఞాపకం పెట్టుకోటం అనేది, ఒక నాటి పద్ధతి. ఒకరు

BRAOU

చెప్పినంత వేగంగా ఇంకొకరు రాసుకోవటం అనేది, మరో నాటి పద్ధతి. మొత్తానికి జ్ఞాపకంతో ఒక తరం నుండి మరో తరానికి నోటిమాటగా వచ్చిందే ప్రధానమైన మౌఖిక చరిత్రగా, ఇప్పుడు గుర్తిస్తున్నారు. మిగతా భాగం అంతా, అచ్చు యంత్రం ప్రవేశంతో గ్రంథ రూపాన్ని ధరించటం వల్ల, వాఙ్మయాధారంగా విడదీస్తున్నారు. అది సరిగాకపోయినా, నోటిమాట ద్వారా వస్తున్న సంప్రదాయన్నే, మౌఖిక పద్ధతి అనుకుంటే, ఈ పద్ధతిలో విషయ సేకరణకు కూడా, ఎన్నో ఉపకరణలు వచ్చాయి. అందులో, అతి ముఖ్యమైంది టేపు రికార్డర్, దీని తర్వాత వీడియో కెమేరా, కొంతవరకు మూవీ కెమేరాలను చెప్పాలి. వీటి వల్ల, విషయ సేకరణ సులభం కావటమేగాక, సంపాదీకరించుకునే సావకాశం కూడా ఏర్పడింది. ఈ పరికరాలను ఉపయోగించటానికి ముందు చేయాల్సిన పని చాలా ఉంది. ముఖ్యంగా, ప్రశ్నావళి రూపొందించుకోవాలి, విషయ సేకరణ ఏయే విషయంపై చేస్తున్నాం? దేని కోసం చేస్తున్నాం? ఎటువంటి వారి నుండి సేకరించాలి? ఎంతమంది నుండి సేకరించాలి? అనే విషయాలను క్షుణ్ణంగా, స్పష్టంగా తెల్పుకోవాలి. సర్వేలో పాల్గొనే వ్యక్తులు, వారి ఉనికిని బహిరంగ పరచాలా? లేదా? అనేది కూడా, తెల్పుకోవాలి. సర్వేకి కాల పరిమితి గురించి, కొంత కాల వ్యవధిలో రెండు, మూడు సార్లు చేయాలా! వద్దా? అనే దాన్ని గురించి స్పష్టమైన అవగాహన కావాలి. ఈ విధంగా, అనేక కోణాల నుండి తయారు చేసిన ప్రశ్నావళులను, వాటికి సమాధానాలను దృశ్య శ్రవణ సాధనాల సహాయంతో సమీకరించి, పొందుపర్చిన తర్వాత టి.వి. మోనీటర్‌పైగాని, కంప్యూటర్‌తోగాని, మైక్రో ఫిలిం పద్ధతిపై గాని, చరిత్ర పరిశోధకులకు ఈ మౌఖిక ఆధారాలను అందుబాటులోకి తేవచ్చు.

## 11.3 మౌఖిక ఆధారాలకు ఉన్న పరిమితులు

BRAOU

మౌఖిక చరిత్ర ఆధారాలకు ఎంత ప్రాధాన్యత ఉన్నా, వాటి ఉపయోగానికి పరిమితులూ ఎక్కువగానే ఉన్నాయి. ముఖ్యంగా, మౌఖిక ఆధారాలు ఆత్మాశ్రయాలు. అందువల్ల, చరిత్ర ఆధారంపై మౌఖిక ఆధార విషయ సేకరణపై నాటి దేశ కాల పరిస్థితుల ప్రభావం ఉంటుంది. వేదాలు ఏకాలం నాటివో చెప్పటానికి, అందులోని కొన్ని స్థల, వృక్ష ఫల, పుష్పాలు వర్ణనలు పరిగణనలోకి తీసుకున్నారు. ఈ వర్ణనలు ఒకేసారి జరిగినవి కాదని అందరకూ తెలిసిన విషయమే, కర్బనం - 14 పద్ధతి, థెర్మోత్యామినిసెన్స్ పద్ధతి, ప్రామాణిక పోలెన్ క్రమపద్ధతి వంటి ఆధునిక శాస్త్రరీతులు కూడా, కొన్ని విషయాలను అపరిష్కృతంగానే మిగులుస్తున్నాయి. ఈ కారణంగానే, ఆర్యులు అనాదిగా భారతదేశంలోనే నివసించారని పేర్కొన్నా, పూర్తిగా ఖండించటానికి వీలుపడదు. ఇక ఉపనిషత్తులు, బైబిల్, ఖురాన్, బౌద్ధ జైన వాఙ్మయం, కన్ఫ్యూషియస్ సిద్ధాంతాలు, ఇవన్నీ మానవ మేధస్సులో జరిగిన ఒక సంఘర్షణ దశను తెల్పుతాయి. బైబిల్, ఖురానుల్లో పేర్కొనబడ్డ స్థలాల విషయంలో, చాలావరకు నిర్ధారణ చేసుకోగలిగినా, మిగతా వాటి విషయంలో, అంతగా అది జరుగలేదు. ఇదే విషయం కాలానికీ వర్తిస్తుంది. ప్రతివిషయాన్నీ ఒకే విధంగా చెప్పే ఆచారం ఉన్న ప్రాచీన వాఙ్మయంలో, వివిధాంశాలూ మిళితమయ్యాయి. అందువల్ల, వాటి విషయ నిబద్ధతను నిర్ణయించటం కష్టం. ముఖ్యంగా, ఉపనిషత్తులకు సంబంధించి, వాటి రచనా కాలాన్ని తేల్చటం మరీ కష్టం. ప్రతి మేధావీ తాను చేసిన ప్రక్రియలకు దైవత్వాన్ని ఆపాదించటంతో, వాటి కాల నిర్ణయం చాలా కష్టం. మరొక యిబ్బంది ఏమిటంటే, చార్వాకుడు మొదలైన హేతువాదులు, ఆ తర్వాత కాలంలో

పరిమితులున్నాయి. పురావస్తు ఆధారాలవలెనే సారస్వతం ముఖ్యంగా, మౌఖిక ఆధారాలు కూడా ఉపయోగపడ్డాయి. మౌఖిక ఆధారాల ప్రయోజనం ఆధునిక యుగంలో, అందులోనూ ఇటీవలి కాలంలో, ఎనలేని ప్రాముఖ్యతను సంతరించుకుంది. చరిత్ర రచనా పద్ధతిని మార్చేసింది. సామాన్య మానవుని చరిత్రగా, చరిత్రకు కొత్త రూపునిచ్చింది. సమస్యలకు మూలాన్ని అన్వేషించటానికి, పరిష్కారానికి తోడ్పడుతుంది. బహుళ జనులపై ప్రయోగాలు చేసి పొందిన ఆధారాలు గనక, ఈ మౌఖిక ఆధారాలు చరిత్ర రచనను ప్రజాస్వామ్య బద్ధం చేశాయని, కొందరు చరిత్రకారులు వ్యాఖ్యానించారు. సామాన్యుల కష్టసుఖాలను వివరించటానికి, ఈ మౌఖిక పద్ధతి తోడ్పటం వల్ల, ఇది చరిత్ర రచనకు మానవత్వ విలువలను చేకూర్చిందని వారంటారు.

మౌఖిక ఆధారాల ప్రయోజనం గురించి చర్చించేటప్పుడు, మరల వేద కాలం నుండి ప్రారంభిస్తే, వేదాలకు చరిత్ర ఆధారంగా ఎన్నో పరిమితులున్నాయని చెప్పినా, అవి ఒక భాష, ఒక సంస్కృతి, ఒక జీవన విధానం, వేల సంవత్సరాల క్రితం ఎలా ఉండేవి? అని తెలిపే ముఖ్య ఆధారం వేదాలే. లేకుంటే, భారతదేశ సంస్కృతీ పరిణామంలో ఒక ముఖ్య దశ గురించి మనకు తెలిసేది కాదు. ఇదే విధంగా, ఉపనిషత్తులు వేదాల అనంతర కాలంలోని జీవన విధానాన్ని ప్రతిబింబించటమే కాక, మానవ మేధస్సు పరిణామాన్ని కూడా తెలుసుకోడానికి ఉపయోగపడ్డాయి. వీటి ద్వారానే, మానవ నాగరికత ఔన్నత్యం మనకు తెలుస్తున్నది. గ్రీక్ నాగరికతపైన, బైబిల్ ప్రతిబింబించిన నాగరికతపైన జరిగినంతటి పరిశోధనలు, భారతదేశంలో వైదిక నాగరికతపై జరిగిన నాడు, వీటి ఉపయోగం పూర్తిగా గ్రహించగలం. సంస్కరణవాద కాలంలో కూడా, మౌఖికాధారాల ప్రాముఖ్యతను తక్కువగా అంచనా వేయలేం. తీర్థంకరుల ప్రవచనాలు, బుద్ధుని ధర్మసూత్రాలు ఏ అక్రమ విధానాలకు వ్యతిరేకంగా నిర్వచింపబడ్డాయో గ్రహింపజేసే సరైన ఆధారాలు దొరక్క, క్రీస్తు చరిత్రకు వచ్చిన చారిత్రక స్పష్టత వీటికి రాలేదు. జీసస్ తిరుగుబాటును, తర్వాత ఐరోపాలో 16వ శతాబ్ది ప్రొటెస్టెంట్ ఉద్యమాన్ని మాత్రమే తెలిసి, ఐరోపా చరిత్రకారులు ఆ అవగాహనను జైన, బౌద్ధ మతాలకు, కన్ఫ్యూషియనిజమ్‌కు 19, 20 శతాబ్దాల్లో వర్తింప చేయటం వల్ల, వాటిని గురించి మన అవగాహనా పరిధి కుంచించుకుపోయింది. సింధు నాగరికతా కాలం నాటి లిపిని చదవ గల్గిన పరిస్థితి వచ్చి, పురావస్తు శాస్త్రజ్ఞులు నేపాల్ నుండి ఆఫ్ఘనిస్థాన్ వరకు గల ప్రదేశాల చారిత్రక విశేషాలను సమగ్రంగా బయలుపర్చినప్పుడు, బహుశ మన చారిత్రక అవగాహన అనేక మార్పులకు లోను కావచ్చు. దీనికి ముందు, ఇతిహాస కాలం నాటి పరిస్థితి అంతే. మౌఖిక ఆధారమైన వాఙ్మయమే తప్ప, చెప్పుకోదగ్గ ఇతర ఆధారాలు ఇంతవరకు వెలుగులోకి రాలేదు. అయోధ్య, ఇంద్రప్రస్థం వంటి ప్రదేశాల ఉనికిని గురించి మనకు ఇతరత్రా ఆధారాల నుండి తెలుస్తున్నది అంతంత మాత్రమే. మధ్యధరా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు ఉన్న అనేక ప్రాంతాల్లో పరిశోధనలు జరిగితే కాని, ఇతిహాస కాలం, పూర్వ యితిహాస కాలాలకు సంబంధించిన వివరాలకు స్పష్టత చేకూరదు. ఇన్ని యిబ్బందులున్నా, అఖండ భారతదేశంలో అనేక రాజ్యాలు, రాజవంశాలు, పరిపాలనా విధానాలు, జీవన సరళులు, ధర్మాలు వర్ధిల్లినట్లు, ఇతిహాసాల వల్లనే, మనం తెలుసుకోగలుగుతున్నాం. వీటికి హోమర్ రచన **'ఇలియడ్'** కి వచ్చినంత ప్రాముఖ్యత, చారిత్రక నిబద్ధతకు సంబంధించినంత వరకు రాకపోవడానికి కారణం, పురావస్తు శాస్త్ర పరిశోధన ఇంకా లోపభూయిష్టమూ, అసమగ్రమూ కావటమే.



BRAOU

అనంతర కాలంలో, మౌఖిక ఆధారాల్లో మెగస్తనీస్ 'ఇండికా' బ్రాహ్మీ లిపిని చదవగలగడంతోనే, చాలా ప్రాముఖ్యం వహించింది. దీనిని బట్టే, క్రీ.పూ. 4వ శతాబ్దం నుండి భారతదేశానికి సమగ్ర చరిత్ర ఉన్నట్లు భావిస్తున్నాం. కాని, పాటలీపుత్ర పాలనా వ్యవస్థ, కౌటిల్యుని 'అర్థశాస్త్రం'లో పేర్కొన్న వ్యవస్థ వంటి అత్యున్నత పాలనా పద్ధతుల ఆవిర్భావానికి పూర్వం, మానవ నాగరికతా వికాసం ఎంత ఉచ్ఛ స్థాయికి ఎదిగి ఉంటుందనేది, ఇక్కడ గుర్తించాలి. అదే విధంగా, చైనా యాత్రికులు తమ రచనల్లో ఏ దృష్టితో చూసినా, భారతదేశంలో విద్యా వికాసం, బౌద్ధ మతం కొంతవరకు సామాన్య జనుల జీవన విధానాన్ని తెలియజేయడం వల్ల, కొన్ని వందల సంవత్సరాల చరిత్రను కలుపుతూ, అసమగ్రంగానైనా సామాజిక చరిత్రను తెలుసుకోగలుగుతున్నాం. మహమ్మదీయ చరిత్రకారుల రచనలు, కాలానుగత వివరణకు, రాజకీయ చరిత్ర రచనకు ఎంతో ఉపకరించాయి. ఆస్థాన దైనందిన కార్యకలాపాల పట్టికల ద్వారా, పన్నుల గురించి, న్యాయ వ్యవస్థ గురించి, కొంత మేరకు సామాజిక వ్యవస్థ గురించి, అంతర్జాతీయ వ్యవహారాలు, విదేశీ వాణిజ్యం గురించి తెలుసుకోడానికి వీలుపడింది. ఇదే విధంగా, విజయనగర, బహ్మనీ రాజ్యాల చారిత్రక విశేషాలు, విదేశీ యాత్రికులు, వర్తకాలు, మతాచార్యుల రచనల నుండి గ్రహించగలిగాం. ఐరోపా కంపెనీల, కర్మాగారాల రికార్డుల వల్ల, ఆనాటి వాణిజ్యం, ఇతర విషయాలు, ఏవో కొన్ని ప్రాంతాలకు మాత్రమే సంబంధించినవైనా, తెలుసుకోడానికి వీలైంది. ఈస్ట్ ఇండియా కంపెనీవారు పరిపాలకులుగా ఉన్న శతాబ్ది కాలంలో, తయారు జేయించిన నివేదికలు, వారి అధికారులు తయారు చేసిన నివేదికలు, రాసిన గ్రంథాలు, కంపెనీ పాలనలో ప్రజల స్థితిగతుల్ని తెలుసుకోడానికి ప్రాథమిక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయి. బ్రిటీష్ పాలనలో కరువు గురించి, పాలనా సంస్కరణల గురించి తయారుచేయించిన నివేదికలు మొత్తం, భారత ఉపఖండంలో పాలనా పద్ధతులకే ప్రాతిపదిక అయ్యాయి.

స్వాతంత్ర్యానంతరం, భారతదేశంలో మౌఖిక చరిత్ర నిర్మాణం మరో పద్ధతిలో జరిగింది. నిజానికి, దాదాబాయ్ నౌరోజీ కాలం నుండీ, బ్రిటీష్ ప్రభుత్వానికి ప్రతి విషయంపై ప్రజాభిప్రాయాన్ని సేకరించి తెల్పడం, ఒక క్రమ పద్ధతిలో జరిగింది. భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాల్లో, మహజరుల సమర్పణే, ఒక ప్రధానాంశం అయింది. ఆది 1920 తర్వాత ప్రత్యామ్నాయ ప్రతిపాదనల రూపంలో, ప్రజాభిప్రాయాన్ని తెల్పడం ప్రారంభమైంది. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు, మౌఖిక చరిత్ర అంతా ఇంచుమించు రాజకీయ పోరాటానికి సంబంధించిందే.

స్వాతంత్ర్యానంతరం, భారత ఉపఖండంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో, ప్రపంచంలో ఇతరత్రా కూడా మార్పులు వచ్చాయి. సామాన్య మానవునికి ప్రాధాన్యత హెచ్చింది. వయోజన వోటింగ్ అన్ని దేశాల్లోనూ, ఇంచుమించు అమల్లోకి వచ్చింది. 1944 లో 50 దేశాలు మాత్రమే స్వతంత్ర, అర్ధ స్వతంత్ర దేశాలైతే, 1960 నాటికి, ఆ సంఖ్య దాదాపు 140 కి పెరిగింది. ఈ నేపథ్యంలో, భారతదేశం 1950 తర్వాత అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమాలకు సోవియట్ రష్యాలో మాదిరి, ప్రణాళికలను తయారుచేయాలని నిర్ణయించారు. అదే విధంగా, గ్రామీణాభివృద్ధికి కమ్యూనిటీ ప్రాజెక్టులను ఏర్పర్చాలని నిర్ణయించారు. దీని కోసం, ప్రతి రంగంలోను అనేక సర్వేలను నిర్వహించారు. ఈ విధంగా, తర్వాతి దేశ నిర్మాణ కార్యక్రమాలకు సర్వేలుగా మనం భావిస్తున్నా, మౌఖిక చరిత్ర ఆధారాలనే ఉపయోగించాయి. భారతదేశంలో విద్యా

BRAOU

పరిస్థితుల గురించి రాధాకృష్ణన్ కమీషన్ మొదలైనవి తయారుచేసిన నివేదికలే, దేశం లోని విద్యా విధాన చరిత్ర రచనకు ప్రాథమిక మౌఖిక ఆధారమయ్యాయి. ముఖ్యంగా, కార్మిక సంక్షేమం గురించి అనేక కమీషన్ల నివేదికలు, సర్వేలు, ప్రభుత్వమూ, కార్మిక సంఘాలు, విద్యా సంస్థల తరపున జరిగాయి. ఇందులో కొన్ని సాధారణ విషయాలపై జరగ్గా, కొన్ని ప్రత్యేకంగా ఒక ప్రాంతంలో ఒక వృత్తికి సంబంధించో, లేదా వ్యవసాయ కార్మికులనో, చేనేత కార్మికులనో, లేదా స్త్రీల గురించి, పిల్లల గురించి, రాజకీయాల గురించి, ఎన్నికల ముందు సర్వేలు, నివేదికలు ఎన్నో జరుగుతూంటాయి, వస్తూంటాయి. వీటివల్ల, ఇటీవలి కాలంలో, చరిత్ర రచనలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. ఇప్పుడు చరిత్ర సమాజ శాస్త్రానికి, మానవ శాస్త్రానికి, పరిపాలనా శాస్త్రానికి, ఇతర శాస్త్రానికి, విడదీయలేని సాన్నిహిత్యం ఏర్పడింది. ఇంతకు పూర్వం రాజులు, రాజ్యాలు, కాలానుగత రాజకీయ సంఘటనలకు పరిమితమైన చరిత్ర, ఈ సమాజాన్ని ఏయే శక్తులు ఏ విధంగా నడుపుతున్నాయో, పొరబాట్లెక్కడ, ఎలా జరిగాయో, విజయాలెలా సాధించారో, సామాన్యుని యుగం ఎలా ప్రారంభం అయిందో, తెలియజెప్పే పర్యంతం ఎదిగింది.

## 11.5 సంగ్రహంగా

చరిత్ర రచనకు ప్రధాన ఆధారాల్లో, మౌఖిక ఆధారం ముఖ్యమైందే. మౌఖిక ఆధారాల్లో మొత్తం వాఙ్మయాన్ని చేర్చొచ్చు. ఇందులో ఒకరిని ప్రశ్నించి, సమాధానాలు పొందిన భాగం మాత్రమే, ఖచ్చితంగా మౌఖిక ఆధారమనేది సరి కాదు. ఒకరు చెప్పగా వచ్చిందంతా మౌఖిక ఆధారమే. అలాగే, ఒకరు రాసింది మరొకరు చదువగా వచ్చేదీ, మౌఖిక ఆధారమే. అందుచేతనే, కొందరు శాసనాలు, నాణేలు, కట్టడాల గురించి గ్రంథస్థం చేశాక, అవికూడా మౌఖిక ఆధారాల కోవకి వస్తాయని కొందరి అభిప్రాయం. ప్రపంచ వ్యాప్తంగా మౌఖిక ఆధారాల ప్రాముఖ్యత, రెండో ప్రపంచ యుద్ధానంతరం బాగా పెరిగింది. భారతదేశంలో 1950 దశకం నుండి మౌఖిక ఆధారాలకు ప్రాధాన్యత హెచ్చింది. ఈ ఆధారాల వల్ల, చరిత్రలో ప్రాధాన్యతలు మారి, మానవత్వ విలువలకు ప్రాముఖ్యం పెరిగి, సామాన్యుడే కేంద్ర స్థానమై, గుణాత్మకమైన మార్పు వచ్చింది.

BRAOU

## 11.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలివ్వండి.**

1. భారతదేశ చరిత్ర పునర్నిర్మాణంలో తోడ్పడే ముఖ్య మౌఖిక ఆధారాలేవి? వాటి చారిత్రక ప్రాధాన్యతను వివరించండి.

2. మౌఖిక సాంప్రదాయానికి, ఆధారాలకు ఉన్న పరిమితులను వివరించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ఆఫ్రికా, అమెరికా ఖండాల్లో మౌఖిక చరిత్రాభివృద్ధిని వివరించండి.

2. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం జరుగుతున్న మౌఖిక చరిత్రాభివృద్ధిని సమీక్షించండి.

## 11.7 ఉపయుక్త గ్రంథాలు


Alex Heiley : **Roots**

Arthur Marwick : **The Nature of History**

Borraclough G. : **Main Trends in History**

Cuarb, F. Del. Zell (ed) : **The Future of History**

David Henige : **Oral Historiography**

Elten G.R. : **The Practice of History**

Fritz Stern : **The Varieties of History**

George H.B. : **Historical Evidence**

Hook Sydney (ed) : **Philosophy and History**

Howard Fast : **The Last of the Great Brothers**

Martin Ballandcedy : **New Movements in the Study and Teaching of History**

Menon V.P. : **Transfer of Power**

Oabsuott Michael : **Experiences and its Modes**

Paul Thompson : **The Voice of the Past: Oral History**

Surendranath Banerjee : **A Nation in the Making**

Shafer R.S. : **A Guide to Historical Method**

Vasina : **Oral Traditions of History**

నరసింహారావు, జి.వి.బి. : మౌఖిక సాంప్రదాయం


రచయిత :జాస్తి దుర్గాప్రసాద్

BRAOU

BRAOU

పాఠ్య ప్రణాళిక

మాదిరి పరీక్షా పత్రం

అభ్యాసాలు

BRAOU

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

పాఠ్యప్రణాళిక

కోర్స్ - II : చరిత్ర రచనా పద్ధతి

ఖండం - I : చరిత్ర పునాదులు

భాగం - 1 : చరిత్ర ఒక శాస్త్రం

భాగం - 2 : చారిత్రక యదార్థాలు, హీరిస్టిక్స్

భాగం - 3 : కార్యకారణ సంబంధం

భాగం - 4 : సాధారణీకరణ

భాగం - 5 : విషయ నిష్ఠత

భాగం - 6 : సంశ్లేషణ

ఖండం - II : చారిత్రక ఆధారాలు

భాగం - 7 : పురావస్తు ఆధారాలు, శాసనాలు, నాణేలు

భాగం - 8 : సాహిత్యం

భాగం - 9 : పాలనా రికార్డులు

భాగం - 10 : వార్తాపత్రికలు

భాగం - 11 : మౌఖిక సాంప్రదాయం

ఖండం - III : చరిత్ర రచనాభివృద్ధి, ప్రాచీన యుగం

భాగం - 12 : ప్రాచీన యుగం, ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 13 : ప్రాచీన యుగం, భారతీయ చరిత్ర రచనాభివృద్ధి

BRAOU

**ఖండం - IV : చరిత్ర రచనాభివృద్ధి, మధ్య యుగం**

భాగం - 14 : మధ్య యుగం; ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 15 : మధ్య యుగం; పశ్చిమ ఆసియాలో చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 16 : మధ్య యుగం; భారతదేశంలో ముస్లింల చరిత్ర రచనాభివృద్ధి

**ఖండం - V : ఆధునిక ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి**

భాగం - 17 : ఆధునిక ఐరోపా ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్ర రచనా సాంప్రదాయం

భాగం - 18 : ఆధునిక ఐరోపా చరిత్ర రచనాభివృద్ధిలో మార్క్స్‌వాదం

భాగం - 19 : ఆధునిక ఐరోపా చరిత్ర రచనాభివృద్ధి, అనల్స్

**ఖండం - VI : భారతీయ చరిత్ర రచనాభివృద్ధి**

భాగం - 20 : వలసవాద యుగంలో భారత చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 21 : జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 22 : మతతత్వ చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 23 : మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధి

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

మాదిరి పరీక్షా పత్రం

కోర్స్ - II : చరిత్ర రచనా పద్ధతి

సమయం : 3 గంటలు　　　　　　　　　　　　　　　　　　మార్కులు 100

భాగం - A

4 x 15= 60

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చరిత్రపై విజ్ఞాన శాస్త్రాల ప్రభావాన్ని తెల్పి, చరిత్ర శాస్త్రమా అనే వాదాన్ని గూర్చి విపులంగా చర్చించండి.

లేదా

చారిత్రక ఆధారాల సేకరణ కుపయోగించే మార్గాలను పేర్కొని, వాటిని భద్రపర్చడంలో ఆయా సంస్థల పాత్రను విశ్లేషించండి.

2. "ప్రాచీన భారతీయులకు చారిత్రక దృష్టి, చరిత్ర రచనా సంప్రదాయాలు లేవు" దీనితో నీవు అంగీకరింతువా?

లేదా

ప్రామాణిక (గ్రీకో-రోమన్) చరిత్ర రచనాభివృద్ధిలో గ్రీకో-రోమన్ చరిత్రకారులైన హెరో డోటస్, థూసిడైడ్స్, లీవీ, టాసిటస్ పాత్రలను విశ్లేషించండి.

3. మధ్య యుగంలో చరిత్ర రచనపై ఇస్లాం ప్రభావాన్ని తెల్పి, చరిత్ర రచనాభివృద్ధిలో అమీర్ ఖుస్రూ, బరౌని, ఇబ్నబతూతాల సేవలను వివరించండి.

లేదా

ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్ర రచనా సాంప్రదాయాలు, లక్షణాలను వివరించండి.

4. చరిత్ర రచనాభివృద్ధిలో మార్క్స్ వాదాన్ని విశ్లేషించి, చరిత్ర తత్వంపై మార్క్స్ ప్రభావాన్ని అంచనా వేయండి.

లేదా

భారతదేశంలో వలసవాద యుగంలో చరిత్ర రచనాభివృద్ధిని విమర్శనాత్మకంగా పరిశీలించండి.

భాగం - B

5 x 8=40

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

5. చరిత్రలో సాధారణీకరణ అంటే ఏమిటి?

BRAOU

లేదా

ప్రశ్నా విధాన ప్రాక్కల్పన గురించి రాయండి

6. చరిత్ర రచనకు వార్తాపత్రికలు ఏవిధంగా ఉపయోగపడతాయి?

లేదా

భారతదేశ పునర్నిర్మాణంలో తోడ్పడే మౌఖిక ఆధారాల ప్రాముఖ్యతను తెల్పండి.

7. ప్రాచీన భారతీయ చరిత్రకారుల్లో కల్హణుని స్థానాన్ని అంచనా వేయండి.

లేదా

అత్యున్నత చరిత్రకారుల్లో ఒకడుగా థూసిడైడ్స్ ఏల పరిగణింపబడుతున్నాడు?

8. ఆనాల్ చారిత్రక పద్ధతి అంటే ఏమిటి?

లేదా

కమ్యూనిస్ట్ సమాజంలో దశలను పేర్కొనండి.

9. జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధిలో, హెచ్.సి.రాయ్‌చౌదరి, కె.వి.నీలకంఠ శాస్త్రిల సేవ లెట్టివి?

లేదా

భారతదేశ చరిత్ర రచనలో మతతత్వ రచన ఆవిర్భావం ఎలా జరిగిందో తెల్పండి.

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

కోర్స్ - II : చరిత్ర రచనా పద్ధతి

## అభ్యాసం - 1

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చరిత్ర అంటే చరిత్రకారునికి, అతని యదార్థాలకు మధ్య అవిచ్ఛిన్నంగా జరిగే కార్యవిధానం, వర్తమానానికి గతానికీ మధ్య జరిగే అనంతమైన సంభాషణ. వివరించండి.

2. ప్రాచీన, మధ్య యుగ భారత చరిత్ర పునర్నిర్మాణానికి, పురావస్తు ఆధారాలు ఏవిధంగా తోడ్పడ్డాయో వివరించండి.

### భాగం - B

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. చరిత్రలో సంపూర్ణ విషయ నిష్పతను సాధించడం సాధ్యమా?

2. సాహిత్యం, చరిత్రకు గల పరస్పర సంబంధాన్ని తెల్పండి.

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

### చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

### కోర్స్ - II : చరిత్ర రచనా పద్ధతి

# అభ్యాసం - 2

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ప్రామాణిక (గ్రీకో-రోమన్) చరిత్ర సాంప్రదాయ ముఖ్య లక్షణాలను తెల్పి, చారిత్రక చింతనాభివృద్ధికి గ్రీకో-రోమన్ చరిత్రకారుల పాత్రను విశ్లేషించండి.
2. భారతదేశంలో మధ్య యుగంలో జరిగిన ముస్లింల చరిత్ర రచనాభివృద్ధిని వివరించండి.

### భాగం - B

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. మౌఖిక సాంప్రదాయాలకు, ఆధారాలకు ఉన్న పరిమితులను తెల్పండి.
2. ప్రాచీన భారతదేశ చరిత్ర రచనపై ఇతిహాస, పురాణ సంప్రదాయ ప్రభావం ఎట్టిదో చర్చించండి.

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

కోర్స్ - II : చరిత్ర రచనా పద్ధతి

## అభ్యాసం - 3

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ఆధునిక చరిత్ర రచనలో అగస్ట్ కామ్ట్, రాంకేల పాత్రను సమీక్షించండి.
2. భారతదేశంలో జాతీయోద్యమం చేత ప్రభావితమైన జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధిని సమగ్రంగా పరిశీలించండి.

### భాగం - B

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. అనాల్ చారిత్రక పద్ధతిలోని ముఖ్యాంశాలేవి?
2. కార్ల్‌మార్క్స్ ప్రతిపాదించిన గతి తార్కిక పద్ధతిని వివరించండి.

BRAOU

BRAOU

# అందరికీ అందుబాటులో ఉన్నత విద్య




B R A O U

**డా. బి.ఆర్.**
**అంబేద్కర్**
**సార్వత్రిక**
**విశ్వవిద్యాలయం**

జూబ్లి హిల్స్, రోడ్డ్ నెంబర్. 46, హైదరాబాద్

A.H.(P)-2

# చరిత్ర

## చరిత్ర రచనా పద్ధతి




BRAOU

2

BRAOU

# చరిత్ర

## చరిత్ర రచనా పద్ధతి

### ఖండాలు III - VI

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2004

# రచయితల బృందం

సంపాదకుడు

ఆచార్య వై. వైకుంఠం

సహసంపాదకులు

ఆచార్య వి. రామకృష్ణా రెడ్డి

కుమారి ఇ. సుధారాణి

రచయితలు

ఆచార్య వై. వైకుంఠం

ఆచార్య వి. రామకృష్ణ

డా. జె. దుర్గా ప్రసాద్

డా. పి. సుధీర్

డా. అట్లూరి మురళి

డా. జి. సుదర్శన్ రెడ్డి

ముఖచిత్రం

ఎమ్. రమేష్

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్

ప్రథమ ముద్రణ - 1995

పరిష్కృత ముద్రణ - 1999, 2000 **2002** 2003, 2004

1995 డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

BRAOU

© అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నైనా ఉపయోగించదల్చుకుంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం.

ఇతర వివరాలకు:

డైరెక్టర్ (అకడమిక్)

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,

రోడ్ నెం. 46, జూబ్లీ హిల్స్,

హైదరాబాద్ - 500 033, ఆం.ప్ర.

Lr. No. 955/Dr. BRAOU/DMP/PTG/F.No.28/J.O .No. 004 Copies: 350 Books

Printed at Kesava Art Printers, Red Hills, Lakdi-ka-pool, Hyderabad -500 004.

# పరిచయం

చరిత్ర అనే మాటను రెండు భిన్న అర్థాల్లో ఉపయోగించడం జరుగుతూంది. మొదటిది అధ్యయన విషయం గురించి, రెండోది అధ్యయనం గురించి. ఈ రెండో అర్థంలో, చరిత్ర, చరిత్రకారుని పరిశోధన, సంఘటనల గూర్చి సూచింపబడుతూంది. చరిత్ర గ్రంథాల్లో కానీ, చరిత్రాధ్యయనంలో కానీ, చరిత్ర అంటే ఏమిటో, చరిత్రాధ్యయనం ప్రయోజనం ఏమిటో, చరిత్ర రచన ఎలా చేయాలో, అందుకు తత్త్వశాస్త్ర ప్రయోజనమేమిటో, చరిత్రను నిర్మించిన వారెవరో, చరిత్రకారుని మనో దృక్పథాలేమిటో అనే విషయాలపై అవగాహన తక్కువ. ఈ విషయాలపై తెలుగులో వచ్చిన మౌలిక రచనలూ తక్కువే. శాస్త్రీయంగా చరిత్ర రచన చేయాలంటే, చరిత్ర రచనా పద్ధతుల్ని క్షుణ్ణంగా తెలుసుకోవడం అవసరం. చరిత్ర రచనా పద్ధతులను తెలుసుకోకుండా, చరిత్ర విషయాలను చదవడం అసంబద్ధమౌతుందనడం, అతిశయోక్తి కాదు. చరిత్రతో తాత్త్విక దృక్పథం తోడైతే, చరిత్ర పరిధి విస్తృతమవడమే కాక, వైవిధ్యాన్ని సంతరించుకుంటుంది. లౌకికంగా, పక్షపాత రహితంగా, ఉపదేశాత్మకంగా, తాత్త్వికంగా చరిత్ర రూపొందాలనే భావం, ఆకాంక్ష, చరిత్రకారుల్లో ముఖ్యంగా పద్దెనిమిదో శతాబ్ది చివరి కాలం నుండి అధికమైంది. దీంతో, శాస్త్రీయ దృక్పథంలో చారిత్రకాధారాలను నిశితంగా పరిశీలించి, ప్రామాణికతను నిర్ధారించి, గతంలో ఏది ఎందుకు జరిగిందో, క్రమబద్ధమైన, విశ్వజనీనమైన విశ్లేషణలతో కూడిన వివరణ నివ్వడం, చరిత్రకారులకు ఆదర్శంగా మారింది. అయితే, చరిత్రకారుడు చేసేటువంటి విషయ చిత్రీకరణ, అతని అవగాహన, అతని మానసిక దృక్పథంపై చాలావరకు ఆధారపడి వుంటుంది. చరిత్రలో చెప్పేటువంటి విషయాల్ని సరిగ్గా అంచనా వేయాలంటే, చరిత్రకారుని అభిప్రాయం, వ్యక్తిత్వం, మానసిక దృక్పథాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. సమాజంలో నెలకొని వున్న సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, చరిత్ర రచనలను గుణ రీత్యా, పరిణామ రీత్యా చాలా వరకు ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు, బ్రిటీష్ పరిపాలనా కాలంలో మనదేశంలో చేసినటువంటి చరిత్ర రచనల్లో కొన్ని, వలసవాద తత్వంతో ప్రభావితమైతే, మరికొన్ని, జాతీయ భావాల చేత ప్రేరేపితమైనాయి. కాబట్టి, ఏ దేశ చరిత్రనైనా సమగ్రంగా అర్థం చేసుకోవాలనుకుంటే, ఆ రచన వెనుక దాగి ఉన్న చరిత్రకారునికి సంబంధించిన విషయాలు, సమకాలీన పరిస్థితుల స్పష్టమైన అవగాహన ఎంతైనా ఆవశ్యకం.

చరిత్రలో ప్రథమ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, " చరిత్ర రచనా పద్ధతి" కోర్స్‌గా రూపొందించబడింది. చరిత్ర పునాదులు, ఆధారాలతో పాటు, ఐరోపాలో, భారతదేశంలోను, ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక యుగాల్లో జరిగిన చరిత్ర రచనా పరిణామాలను, వివిధ కాలాల్లో, దశల్లో జరిగిన చరిత్ర రచనాభివృద్ధిని విశ్లేషించడం జరిగింది.

ఈ కోర్స్‌లో మొత్తం ఆరు ఖండాలు, ఇరవై మూడు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం, దీన్ని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతుంది. మొదటి పుస్తకంలో, మొదటి రెండు ఖండాలకు సంబంధించిన పదకొండు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో, చరిత్ర శాస్త్రమనే వాదం, చారిత్రక పునాదులైన యదార్థాలు, కార్యకారణ సంబంధం, సాధారణీకరణ, విషయనిష్ఠత, సంశ్లేషణలు, చరిత్ర ఆధారాలైన పురావస్తు శాస్త్రం, శాసన శాస్త్రం, నాణేల శాస్త్రం, సాహిత్యం, రికార్డులు, వార్తాపత్రికలు, మౌఖిక ఆధారాలు వివరంగా చర్చించబడ్డాయి. చరిత్ర రచనా పద్ధతుల గురించి, వీటి అధ్యయనం ద్వారా మీరు గ్రహించగలరని భావిస్తున్నాం.

రెండో పుస్తకంలో చివరి నాలుగు ఖండాలకు చెందిన పన్నెండు భాగాలను పొందుపర్చడం జరిగింది. వీటి ద్వారా, ప్రాచీన మధ్య, ఆధునిక యుగాల్లో, ఐరోపా, పశ్చిమాసియా, భారతదేశాల్లో చరిత్ర రచనాభివృద్ధిని, పరిణామాన్ని గురించి విద్యార్థులకు సరైన అవగాహన ఏర్పడగలదని ఆశిస్తున్నాం.

విద్యార్థుల్లో పరిశీలనాసక్తిని, యోచనా శక్తిని పెంపొందించి, చరిత్ర రచనా పద్ధతుల గురించి క్షుణ్ణంగా తెలుసుకొనేందుకు ఈ పాఠ్య భాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తూంది.

BRAOU

BRAOU

# విషయ సూచిక


| | | పుట.నెం. |
|---|---|---|
| **ఖండం–III:** | **చరిత్ర రచనాభివృద్ధి : ప్రాచీన యుగం** | **1** |
| భాగం - 12 : | ప్రాచీన యుగం : ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి | 3 |
| భాగం - 13 : | ప్రాచీన యుగం : భారతీయ చరిత్ర రచనాభివృద్ధి | 13 |
| **ఖండం -IV:** | **చరిత్ర రచనాభివృద్ధి : మధ్య యుగం** | **24** |
| భాగం - 14 : | మధ్య యుగం : ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి | 26 |
| భాగం - 15 : | మధ్య యుగం : పశ్చిమ ఆసియాలో చరిత్ర రచనాభివృద్ధి | 32 |
| భాగం - 16 : | మధ్య యుగం : భారతదేశంలో ముస్లిం చరిత్ర రచనాభివృద్ధి | 39 |
| **ఖండం-V :** | **ఆధునిక ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి** | **53** |
| భాగం - 17 : | ఆధునిక ఐరోపా : ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్ర రచనా సంప్రదాయం | 54 |
| భాగం - 18 : | ఆధునిక ఐరోపా చరిత్ర రచనాభివృద్ధిలో మార్క్సువాదం | 69 |
| భాగం - 19 : | ఆధునిక ఐరోపా చరిత్ర రచనాభివృద్ధి : అనల్స్ | 77 |
| **ఖండం-VI :** | **భారతీయ చరిత్ర రచనాభివృద్ధి : ఆధునిక యుగం** | **86** |
| భాగం -20 : | వలసవాద భారతీయ చరిత్ర రచనాభివృద్ధి | 87 |
| భాగం -21 : | భారతదేశం : జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి | 104 |
| భాగం - 22 : | భారతదేశం : మతతత్వ చరిత్ర రచనాభివృద్ధి | 117 |
| భాగం - 23 : | భారత మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధి | 131 |
| | పాఠ్య ప్రణాళిక | |
| | మాదిరి పరీక్షా పత్రం | |
| | అభ్యాసాలు | |


BRAOU

BRAOU

## ఖండం : III

# చరిత్ర రచనాభివృద్ధి : ప్రాచీన యుగం

చరిత్ర అనే మాటను సాధారణంగా, రెండు భిన్న అర్థాల్లో ఉపయోగించడం జరుగుతుంది. మొదటిది, అధ్యయన విషయం గూర్చి, రెండోది అధ్యయనం గురించే అయినా, గత మానవాళి సమస్తాన్ని సూచిస్తున్నా, మొదటి భావంలోనే చరిత్ర మాటను ఉపయోగిస్తున్నారు. అధ్యయానికి సంబంధించిన రచన అనే భావంలో కూడా, ఈ మాట ఉపయోగించబడుతున్నది. ఈ రెండో అర్థంలో, చరిత్ర, చరిత్రకారుని పరిశోధన, కథనాలను గూర్చి సూచింపబడుతుంది. ఈ ఖండంలోను, తర్వాత వచ్చే మూడు ఖండాల్లోనూ, చరిత్ర రచనా పరిణామాలను గూర్చి విపులంగా పరిశీలించడం జరుగుతుంది.

ముందుగా ఒక విషయం గుర్తుంచుకోవాలి. అదేమంటే, సమాజంలో నెలకొని వున్న పరిస్థితులు చరిత్ర రచనలను గుణం రీత్యా, చాలా వరకు ప్రభావితం చేస్తాయి. అంతేకాక, చరిత్ర రచనా కళలో క్రమానుగతంగా వచ్చే దశలు విభిన్నమైనవి. ఉదాహరణకు, హోమర్ కాలంలో చరిత్రకారుల రచనలు ఇతిహాస సంప్రదాయానికి లోనైతే, మధ్య యుగంలో మత విశ్వాసానికి, 18వ శతాబ్దంలో హేతువాద ప్రభావానికి లోనయ్యాయి. ఇదేవిధంగా, భిన్న ప్రాంతాల్లో, ప్రజల్లో ఉన్న చారిత్రక మనస్తత్వాన్ని బట్టి, చరిత్ర రచనా సంప్రదాయం కూడా మారుతూ వచ్చింది. ప్రాచీన గ్రీక్‌లు, చైనీయులు, మధ్య యుగ మహమ్మదీయులు ఉన్నత చారిత్రక మనస్తత్వాన్ని కలిగి ఉండగా, ప్రాచీన భారతీయుల్లో ఈ తత్వం లోపించింది. అంటే, ప్రజల అభిలాష మీద చరిత్ర రచనా భావం ఆధారపడి ఉందన్న మాట.

ప్రతి యుగానికి, ప్రతి తరానికి, ప్రతి కాలానికి, ప్రతి ప్రాంతానికి చరిత్ర రచన ఎలా సాగిందీ తెలుసుకున్నట్లైతే, చరిత్ర సిద్ధాంతం, పద్ధతులకు సంబంధించి, మన అవగాహన మరింత పెంపొందుతుంది. ఈ విధమైన అవగాహన ముఖ్యంగా, చరిత్ర పరిశోధకునికి చరిత్ర గూర్చి సరిగ్గా అర్థం చేసుకోటానికి ఎంతో తోడ్పడుతుంది. కొత్తగా పరిశోధనా రంగంలోకి కాలు పెడుతున్న యువ పరిశోధకులకు, గత చరిత్ర రచనలు తప్పనిసరిగా సహాయపడతాయి. పరిశోధకుడు చరిత్ర అంటే, చరిత్రను ఎలా రచించాలో తెలుసుకోడం మాత్రమే కాకుండా, చరిత్ర ఎలా రచించబడిందో కూడా తెలుసుకోడం అవసరం. చరిత్ర రచనకు సంబంధించిన సిద్ధాంతపరమైన అధ్యయనం కంటే, అతనికి ఆ చరిత్ర గూర్చిన ఇటువంటి అధ్యయనమే ఎక్కువ ప్రయోజనకరమైందని, షేక్ అలీ అన్నమాటల్లో ఎంతో నిజం ఉంది. చాలా పురాతనమైన కళల్లో, చరిత్ర రచనా కళ ఒకటి. ప్రజల్లో సాహిత్యం పట్ల మక్కువ పెరిగాక, రచనా పరిజ్ఞానం పెంపొందాక మాత్రమే, చరిత్ర రచన ఆరంభమైంది. ఇందులో, పురావస్తు విశేషాలను చరిత్ర రచనలో అంతర్భాగంగా పరిగణించలేం. చరిత్ర రచన గూర్చి ఈ రచనా రంగలో ప్రముఖులైన కొందరు చరిత్ర రచయితల గూర్చి మంచి పరిజ్ఞానం ఉంటే, చరిత్ర పరిశోధకునికి ఇదే ఎక్కువ ఉపయుక్తమైన శిక్షణౌతుంది. దీన్నే, చరిత్ర రచనా శాస్త్రంగా పండితులు వ్యవహరిస్తారు. ఇది చరిత్రకు సంబంధించిన చరిత్రను తెలియజేస్తుంది. ఇది ఒక విధంగా, చారిత్రక చింతనను గూర్చిన చరిత్ర. కొత్తగా రంగంలో ప్రవేశించిన ఈ ప్రగతిశీలమైన శాస్త్రం, చరిత్రకు సంబంధించి మరో స్వతంత్ర విభాగంగా రూపొందింది. దీన్ని భావ చరిత్రగా పరిగణించొచ్చు. చరిత్రకారుని మనస్తత్వం గురించి తెలుసుకోడం, అతని రచన గూర్చి ఒక అంచనా ఏర్పర్చుకోడం, అతని రచనా పద్ధతిని గూర్చి

BRAOU

తెలుసుకోవడం, చరిత్రకారునిగా అతని కార్యనిర్వహణపై తీర్పునీయటం, దీని లక్ష్యం. సామాన్య ప్రజానీకానికి ఈ చరిత్ర రచనా కళ అధ్యయనంలో ఏమాత్రం ఆసక్తి ఉండక పోవచ్చు. కానీ, చరిత్ర పరిశోధకులకు మాత్రం దీని స్వభావం, విషయ పరిధుల దృష్ట్యా, ఈ అధ్యయనం ఎంతో ప్రయోజనకరమైంది.

ఈ ఖండంలోని 12, 13 భాగాల్లో, ప్రాచీన యుగంలో ఐరోపాలో, భారతదేశంలోను చరిత్ర రచనాభివృద్ధిని విశ్లేషించడమైంది.

BRAOU

# భాగం - 12 : ప్రాచీన యుగం : ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి

విషయక్రమం


12.0 లక్ష్యాలు

12.1 పరిచయం

12.2 గ్రీక్‌ల చరిత్ర రచన

12.2.1 హెరోడోటస్

12.2.2 థూసిడైడ్స్

12.3 రోమన్ల చరిత్ర రచన

12.3.1 లివీ (క్రీ.పూ. 59 - క్రీ.శ. 17)

12.3.2 టాసిటస్ ( క్రీ.శ. 55 - క్రీ.శ. 117)

12.4 సంగ్రహంగా

12.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

12.6 ఉపయుక్త గ్రంథాలు


## 12.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

* ప్రాచీన ఐరోపా చరిత్ర రచనాభివృద్ధికి, గ్రీక్ చరిత్రకారులైన హెరోడోటస్, థూసిడైడ్స్‌ల రచనలు ఏ విధంగా దోహదం చేశాయో వివరించగలగాలి.

* గ్రీక్‌ల చరిత్ర సంప్రదాయాన్ని అనుసరించి రాసిన, రోమన్ల చరిత్ర విధానాభివృద్ధిని విశ్లేషించగలగాలి.

## 12.1 పరిచయం

చరిత్ర రచన గ్రీక్‌ల మేధస్సు నుండి ఆవిర్భవించింది. ఐరోపాలో చరిత్ర రచనకు గ్రీక్‌లు ఆద్యులని పరిగణించబడినప్పటికీ, గ్రీక్ సంస్కృతికి ప్రభావితమైన ఈజిప్ట్ ప్రజలనూ, తూర్పు మధ్యధరా ప్రాంత ప్రజలనూ, ఐరోపా చరిత్ర రచనా సంప్రదాయంలో అంతర్భాగంగానే తీసుకోవచ్చు. ఇంచుమించు, క్రీ.పూ. 2600 నాటి ' పాలెర్మో శిల,' నేటికీ ఈజిప్ట్ వారి చారిత్రక మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తూ ఉంది. ఆధునిక భావంలో వీరు చరిత్రను రాయకపోయినప్పటికీ, పరిపాలిస్తున్న ప్రభువును గూర్చి చిత్రించడంతోపాటు, రాజవంశాల జాబితాలను కూడా ఇచ్చి, చరిత్రకు ఒక రూపాన్ని కల్పించారు. వీరిచ్చిన జాబితాలు కాలాను గతమైన ఈజిప్ట్ చరిత్రకు చాలా ఉపకరిస్తున్నాయి. బాబిలోన్ ప్రజలు, అస్సీరియా ప్రజలు ఈజిప్ట్ వారి కంటె, ఇందులో గొప్ప వారేమీ కాదు. అయితే, బాబిలోన్ చరిత్రకారులు ఏ విషయంలోనైనా మూలం గురించి ఆసక్తి

BRAOU

చూపించారు. దీనికి అనుగుణంగానే, గతకాల రచనల గురించి ఈ చరిత్రకారులు జాగ్రత్త తీసుకున్నారు. ఈ సుగుణాలతో పాటు, విమర్శనా సూత్రాన్ని కూడా వీరు అనుసరించి ఉంటే, నిజమైన చరిత్ర మనకు లభించేది. ఇక అస్సీరియా వారు పూర్వ చరిత్ర సామాగ్రిని శాసనాల రూపంలో భద్రపర్చారు. ఈ శాసనాలు కథనంగా చరిత్ర లక్షణాన్ని పొందాయి. ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఒకటి వుంది. అదేమంటే, అస్సీరియా చరిత్రకారులు బాబిలోన్, అస్సీరియాల్లోని సాదృశ సంఘటనలను తెలిపే, యదార్ధమైన వంశ చరిత్రలను తయారుచేయటం.

పారశీకులు బాబిలోన్ - అస్సీరియా వారి చరిత్ర రచనా సంప్రదాయాన్ని కొనసాగించారు. దీనికి ఉదాహరణగా, వీరి ప్రభువు మొదటి డేరియస్ ప్రకటించిన బెహిస్తాన్ మొదలైన శిలా శాసనాలను చెప్పొచ్చు. ఆసియా మైనర్, సిరియా ప్రాంతాలకు చెందిన ప్రాచీన హిటైట్లు (Hittites) కూడా, చారిత్రక వాఙ్మయాన్ని మరికొంత సంపన్నం చేశారు. మూడో హిట్టూసిల్ చరిత్రలో మొట్టమొదటి స్వీయచరిత్ర, ఈ హిటైట్ల కాలంలోనే రచించబడింది. అయితే, నిర్దుష్టమైన ప్రమాణాలకు, సత్యానికి అనుగుణంగా, మొదటి నిజమైన చరిత్ర రచనను చేశారు, పాలస్తీనాకు చెందిన హీబ్రూలు. దీనికి ఉదాహరణ, బైబిల్ లోని పాత నిబంధన రచనలే. కానీ, హెచ్. ఇ. బర్నెస్ అన్నట్లు, యూదుల పవిత్ర గ్రంథాలను క్రైస్తవులు కైవసం చేసుకునేంత వరకూ, హీబ్రూల చరిత్ర రచనా సంప్రదాయం, చారిత్రక రచనా ధోరణిని ప్రభావితం చేయలేదు. క్రైస్తవులు ఎక్కువగా తమ మత ధర్మ శాస్త్రానికి పవిత్ర గ్రంథాలను ఆధారంగా ఉపయోగించుకోడమే కాకుండా, తమ కాల క్రమణిక (Chronology) కు, తమ గ్తత చరిత్ర సమన్వయానికి, వాటినే పునాదిగా కూడా ఉపయోగించుకున్నారు.

## 12.2 గ్రీక్‌ల చరిత్ర రచన

ప్రజల్లో సాహిత్యాభిలాష, రచనా కౌశలం పెరిగిన తర్వాతనే, చరిత్ర రచన ఆరంభమైంది. అంటే, సాహిత్యం తర్వాతి స్థానం చారిత్రక వాఙ్మయానిదన్నమాట. ఇది చాలా వరకు సామాజిక పరిస్థితుల ప్రభావానికి లోనైందే. ఈ పరిస్థితులే, గ్రీస్‌లో ప్రామాణిక చరిత్ర రచన మొదట ప్రారంభం కావడానికి దోహదపడ్డాయి. ఇటు తూర్పు దేశాలకు, అటు పశ్చిమ దేశాలకు మధ్యలోనున్న గ్రీస్, ఆయా నాగరికతలకు కూడలి అయింది. ఐరోపా, ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని మధ్యధరా ప్రాంతాల్లో జరిగిన పరిణామాలను, తమ స్వస్థలంలో ఉండే గ్రీక్‌లు పరిశీలించగలిగారు. చాలా కొద్ది కాలంలోనే, వారి నాగరికత అభివృద్ధి చెందటం, దీనికి తోడు వారు తరచూ, ఇతర సంస్కృతుల సంపర్కంలోకి రావటం, వారికి బాగా ఉపయోగపడ్డాయి. వీటితోబాటు, భూకంపాలు, సముద్రం వల్ల నేల కోసుకుపోవడం, వీటిమూలంగా, ప్రజా జీవితంలో తరచూ మార్పులు రావడం, ఆ మార్పులు నగర రాజ్యాల రాజకీయ వ్యవస్థల్లో ప్రభావాన్ని చూపించడం, మార్పులేకుంటే ఏమీ లేదనే విషయాన్ని గ్రీక్‌లు బాగా అర్థం చేసుకోడానికి పనికొచ్చాయి. భవిష్యత్తులో తమకు మార్గదర్శకంగా ఉండటానికి, ఈ మార్పులను అధ్యయనం చేయడం తప్పనిసరనుకున్నారు. ఈలోపే వారు, చరిత్ర రచనకు అవసరమైన విశ్లేషణ, విమర్శనం, సత్యాన్వేషణ పద్ధతుల్లో, పరిజ్ఞానాన్ని, శిక్షణనూ పొందారు. అంతేకాక, ఆనాటి తమ సమకాలికులకు భిన్నంగా గ్రీక్‌లు లౌకిక విషయాల్లో ఎక్కువ ఆసక్తిని చూపించారు. చరిత్రకారునికి ఉండాల్సిన కుతూహలం అనే ముఖ్య లక్షణం వారిలో ఉంది. ఈ అంశాలన్నీ, గ్రీస్‌లో ప్రామాణిక చరిత్ర రచనా సంప్రదాయం ఆరంభం కావడానికీ, వృద్ధి చెందడానికీ అనుకూలించాయి.

గ్రీస్ రచయితల్లో మొట్టమొదట చెప్పాల్సింది కవుల గూర్చి. కొంత సిసలైన చరిత్ర రచనను హోమర్ కవికి ఆపాదించొచ్చు. ఆనాటి సమాజం, సంస్కృతి గురించి అతని రచనల్లో చారిత్రక సమాచారం వుంది. గ్రీక్

BRAOU

దేవతలకు గౌరవప్రదమైన ప్రాచీనతను కల్పించినవాడు, హెసియడ్ అనే కవి. ఇటువంటి ప్రాచీనతను, వంశ పారంపర్యతను మహాపురుషులకు కల్పించటంలో, ఇతరులకు ఈకవి మార్గదర్శకుడయ్యాడు. ప్రపంచ చరిత్రను స్వర్ణ, రజిత, కాంస్య, వీరోచిత, అయో (Iron) యుగాలుగా విభజించి, వర్ణించటమే కాకుండా, మనం చరిత్రలో చివరిదైన, చాలా నికృష్టమైన అయో యుగంలో ఉన్నామని చెప్పినవాడు ఇతడే. ఇతని ఈ యుగ విభజన మన భారతీయుల కృత, త్రేత, ద్వాపర, కలి యుగాల భావనను పోలి వుంది. కాని, ఈ హోమర్, హెసియడ్‌ల రచనలను సంపూర్ణమైన చరిత్రగా పరిగణించలేం. ఎందుకంటే, షాట్‌వెల్ పండితుడు అన్నట్లు, వీరి పద్య రచనలు చరిత్ర మార్గాన్ని నిరోధించినా, ఇతరత్రా ఏవిధమైన కథనం వైపైనా గ్రీకుల్ని దృష్టి సారింపనీయలేదు.

అయితే, క్రీ.పూ. 6వ శతాబ్దంలో లోగోగ్రాఫర్ల (Logographers) ఆవిర్భావంతో, గ్రీస్‌లో సరైన చరిత్ర రచన ప్రారంభమైంది. వీరు వచన రచయితలు. సామాజిక పరిస్థితుల్ని వివరించడంలో, పద్య రచన సంతృప్తికరమైన సాధనం కాకపోవటంతో, ఐయోనియా (Ionia) లో ఈ వచన రచయితల ఆవిర్భావంతో, చరిత్ర రచనకు మార్గం సుగమమైంది. పూర్వ రచనల్ని విమర్శించడం, సమాచారాన్ని ప్రత్యక్షంగా సేకరించే పద్ధతిని అనుసరించడం ద్వారా, ఈ లోగోగ్రాఫర్లు చరిత్ర అంటే పరిశోధన అనే భావాన్ని బలంగా పెంచారు.

ఇటువంటి గ్రీక్ వచన రచయితల్లో ప్రసిద్ధుడు, హెకటేయస్ (Hecataeus). క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందిన ఉన్నత గ్రీక్ కుటుంబంలో జన్మించిన ఇతడు ఈజిప్ట్‌లో విస్తృతంగా పర్యటించి, 'ట్రావెల్స్ ఎరౌండ్ ది వరల్డ్' (Travels Around the World), 'బుక్ ఆఫ్ లోకల్ జీనియాలజి' (Book of Local Genealogy) అనే రెండు ప్రముఖమైన రచనలను చేశాడు. మొదటి గ్రంథంలో పారశీక ప్రపంచాన్ని గూర్చి వర్ణించడమైంది. ఇంక రెండో దానిలో, సంప్రదాయానుసారమైన కట్టుకథలను నిశితంగా విమర్శించాడు. అంటే, సత్యాన్వేషణ, పాత కట్టుకథలను నిశితంగా ప్రశ్నించడం ద్వారా, యదార్థాన్ని రాబట్టాలనే రెండు ప్రాథమిక సూత్రాలను, చరిత్ర రచనలో హెకటేయస్ మొదటిసారిగా ప్రవేశపెట్టాడన్నమాట. ఈతని రచనల్ని చరిత్రగా భావించకున్నా, వీటిలోని పరిశోధనా పద్ధతి, ఆ తర్వాత కాలంలో చరోన్ (Charon), డైయొనీసియస్ (Dionysius), స్కైలాక్స్ (Scylax), హెల్లానికస్ (Hellanicus) మొదలైన రచయితల్ని ప్రభావితం చేసింది. ఈ గ్రీక్ వచన రచయితల రచనలు హెరోడోటస్‌కి బాగా ఉపకరించాయి.

BRAOU

## 12.2.1 హెరోడోటస్

గ్రీక్ వచన రచయితలకూ, చరిత్రకారులకూ మధ్య వారధిగా నిల్చినవాడు, హెరోడోటస్. ఆసియా మైనర్ నైరుతీ భాగంలోని సముద్రతీరంలో ఉన్న గ్రీక్ నగరం హాలికర్నాసస్‌లో ఇతడు జన్మించాడు. ఎప్పుడు జన్మించాడో ఖచ్చితంగా చెప్పలేం. బహుశా, క్రీ.పూ. 484 లో కావచ్చు. ఇతని గ్రంథంలో చెప్పిన దాన్ని బట్టి, క్రీ.పూ. 430 నాటికి ఇంకా జీవించే ఉన్నాడు. అయితే, ఆ తర్వాత ఎప్పుడు, ఎక్కడ మరణించాడో తెలియటం లేదు. కాని, క్రీ.పూ. 425కి పూర్వమే ఇతని గ్రంథం ప్రజలకు సుపరిచితమనే విషయం మాత్రం స్పష్టం.

హెరోడోటస్ గ్రీక్ కావ్యాలను అభ్యసించాడు. హోమర్ కావ్యాలు ఇతణ్ణి గాఢంగా ప్రభావితం చేశాయి. హిక్టోమస్ రచనల్ని నిశితంగా అధ్యయనం చేసి, హెరోడోటస్ వచన రచనలో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. తన చుట్టూ ఉన్న ప్రపంచం గురించి తెలుసుకోవాలనే కుతూహలంతో, విస్తృతంగా చాలా ప్రాంతాలను పర్యటించాడు. అయోనియాలో కొంతకాలం ఉన్నాడు. తన నలభైయ్యో ఏట ఏథెన్స్‌లో పెరిక్లిస్ ఆస్థానంలో, నాలుగు సంవత్సరాలు గడిపాడు. థ్రేస్‌ని సందర్శించాడు. ఈజిప్ట్, బాబిలోనియా ప్రాంతాలను పర్యటించాడు. ఈ విస్తృత పర్యటనల్లో, ఆయా ప్రాంతాల రాజకీయ పరిస్థితుల్నీ, వ్యవస్థలనూ అధ్యయనం చేశాడు. సమాచారాన్ని

ప్రత్యక్షంగా సేకరించడం, కట్టుకథల్ని వదలి, ఖచ్చితమైన యదార్థాలను వివరించడమన్న హెకటేయస్ పద్ధతిని ఆదర్శంగా తీసుకున్నాడు. చరిత్ర అంటే అన్వేషణ, లేదా పరిశోధన (ఇస్తొరియా) అన్న అర్థానికి వాస్తవ రూపాన్నిచ్చాడు. చరిత్రకూ, మానవ శాస్త్రానికి (Anthropology), ఇతడు అపారంగా తన సేవలనందించాడు. రెంటికీ పితగా ప్రసిద్ధికెక్కాడు.

హెరోడోటస్‌ను చరిత్ర ఆకాశంలో ధృవతారగా నిలిపింది, ఇతని 'చరిత్ర' (History) అనే గ్రంథం. ఈ గ్రంథం తొలి క్రమబద్ధమైన, సర్వతోముఖమైన చరిత్ర రచన. పారశీక సామ్రాజ్యం పుట్టుక గూర్చి, పారశీకులకు గ్రీక్‌లతో క్రీ.పూ. 499 - 479 మధ్య జరిగిన పోరాటాల గురించి, ముఖ్యంగా, జర్గెజెస్ (Xerxes) సైన్యాలు గ్రీక్‌ల చేతుల్లో పూర్తిగా ఓడిపోవడం గూర్చి, ఈ గ్రంథం వివరిస్తుంది. నిజానికి ఈ రచన ప్రాథమికంగా పారశీక యుద్ధాల గూర్చే అయినప్పటికీ, హెరోడోటస్ ఇందులో క్రీ.పూ. 6,5 శతాబ్దాల్లోని మధ్యధరా, ఆసియా ప్రపంచ ప్రజలను గూర్చి ఆసక్తికరమైన సమాచారాన్ని కూడా అందించాడు. ఈవిధంగా, తన అంశానికే పరిమితం కాకుండా, సమకాలీన చరిత్రనే ఇంచుమించు సమగ్రంగా చిత్రించాడు. కథల్లో ఇతనికి ఉన్న ఆసక్తి, అభిరుచి 'చరిత్ర' ను కథా రూపంలో అద్భుతంగా, ఆకర్షణీయంగా, వర్ణనాత్మకంగా తీర్చిదిద్దడానికి బాగా ఉపయోగపడింది. కథకునిగా ఇతడ్ని మించిన వాడు, బహుశా ఇకముందు కూడా ఉండడనే చెప్పాలి.

ఇంతకు ముందే చెప్పినట్లు, హెరోడోటస్ తన గ్రంథ రచనకు అవసరమైన సమాచారాన్ని సేకరించడానికి, మౌఖిక సంప్రదాయ పద్ధతిని అవలంబించాడు. అంతేగాక, విస్తారంగా చేసిన పర్యటనల్లో ప్రత్యక్షంగా పరిశీలించి, సమాచారాన్ని సేకరించాడు. వీటికితోడు, అంతకు పూర్వం ఉన్న రచనల్ని పరిశీలించాడు. పైగా, తన గ్రంథ రచనకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు. దాని ప్రకారమే రచన సాగించాడు. చరిత్రకారునిగా తన కర్తవ్యం, గ్రీక్‌లు, గ్రీకేతరులైన అనాగరికులు చేసిన పనులను గూర్చి భావి తరాల వారికి తెలియజేయటం, మరీ ముఖ్యంగా, వారు పరస్పరం కలహించుకోటానికి గల కారణాలను చూపించటమని చెప్పుకున్నాడు. అంటే, ఏం జరిగిందో చెప్పటమే కాక, ఎందుకు జరిగిందో కార్యకారణ సంబంధంలో విశ్లేషించటం కూడా, చరిత్రకారుని విధి అని గుర్తించాడన్నమాట. పైగా, తన విషయ పరిధిని రాజకీయ అంశాలకు మాత్రమే పరిమితం చేయక, విస్తృతం చేసి, సామాజిక, సాంస్కృతిక అంశాలను కూడా గ్రంథంలో చేర్చాడు. దీన్నిబట్టి, చరిత్ర అంటే మానవాళి కార్య కలాపాల మొత్తం అనే విషయాన్ని, ఆనాడే హెరోడోటస్ గుర్తించాడని అర్థమౌతున్నది. అంతేగాక, మొదటిసారిగా ఒక దేశ చరిత్రను మరో దేశానికి పరిచయం చేసే సంప్రదాయాన్ని ఆరంభించాడు. వివేచనా పద్ధతిలో ఆధారాలను బాగా ఉపయోగించుకోడం ద్వారా, చరిత్రను పుక్కిటి పురాణం స్థాయి నుండి, శాస్త్ర స్థాయికి పెంచడానికి ప్రయత్నించాడు. షాట్‌వెల్ చెప్పినట్లు, నిశిత పరిశీలనా కౌశలానికి, గొప్ప కళాకారుని సమగ్ర కౌశలాన్ని జోడించాడు. ఎటువంటి స్వదేశాభిమానం కాని, పక్షపాతం కాని కనిపించకపోవడం, హెరోడోటస్ గ్రంథంలో మరో ప్రత్యేకత. కనకనే, ఇతను తన గ్రంథంలో పారశీకుల శౌర్యాన్ని అభినందించగలిగాడు. చరిత్రను మార్గదర్శకంగా నీతిని బోధించేదిగా తీర్చిదిద్దాడు. వీటన్నిటినీ మించి, ఇతని రచనల్లో చివరికంటా కనిపించే ఏకరీతి (Consistency) , అవిచ్ఛిన్నత (Continuity) లు, కథనాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దటానికి ఉపయోగించిన శక్తివంతమైన శైలి, గణనీయమైనవి. ఈ లక్షణాలనన్నింటినీ పురస్కరించుకొనే, హెరోడోటస్ గ్రంథం " చరిత్ర " మొదటి క్రమబద్ధమైన, సర్వతోముఖమైన చరిత్ర గ్రంథంగా పరిగణించబడటం జరిగింది. ఈ కారణంగానే, ఈతడు ' చరిత్ర పిత ' గా ప్రసిద్ధుడయ్యాడు. అయితే, హెరోడోటస్‌లో ఏ లోపాలు లేవని అనలేం. తప్పనిసరిగా కొన్ని బలహీనతలు ఇతనిలోనూ బహిర్గతం అవుతూనే ఉన్నాయి. పారశీక, ఈజిప్ట్ తదితర భాషల పరిజ్ఞానం లేకుండానే, ఆయా ప్రాంతాల్లో పర్యటించడం వల్ల, ఆ ప్రజలను గూర్చి పూర్తి అవగాహన ఈతనికి కలిగే అవకాశం తక్కువనే చెప్పాలి. పైగా, తాను విన్నది నమ్మేసే మనస్తత్వం, ఇతని మరో

BRAOU

బలహీనత. ఆధారాలను పరిశీలించి, సత్యాన్ని నిర్ధారించడంలో అనుసరించిన ధోరణిని, ఇతడు సైనిక సంబంధమైన సంఘటనలను వివరించడంలో కనబర్చలేదు. దీనికి తోడు, అతీత ప్రకృతి శక్తుల్లో (Supernatural forces) ఇతనికి నమ్మకం ఉన్నట్లు కనిపిస్తున్నది. అంతేగాక, ఇతని సమాచార ప్రామాణికతను నిర్ధారించడంలో, భాషాశైలికి ఇతడు ఇచ్చిన ప్రాధాన్యత ఒక ఆటంకంగానే పరిణమించింది. కానీ, ఈ లోపాలు ఆనాడు సర్వసాధారణం కనక, దీనికి ప్రత్యేకించి హెరోడోటస్‌ని తప్పు పట్టాల్సిన పనిలేదు. ఆధునిక యుగం దృష్ట్యా కాకుండా, క్రీ.పూ. 6,5 శతాబ్దాల నాటి ప్రమాణాలను అనుసరించి, ఇతడ్ని ఈతని గ్రంథాన్ని మదింపు చేయాలి. బుద్ధి సూక్ష్మతతో కూడిన ఉబలాటం, అనుకున్నది సాధించాలనే చిత్తశుద్ధి, ఎన్నుకొన్న సమస్య గూర్చి సరైన అవగాహన – ఈ గొప్ప సుగుణాలు హెరోడోటస్‌ని ప్రపంచ చరిత్రకారుల్లో మొదటివానిగానే కాక, ప్రముఖునిగా కూడా నిలబెడ్తున్నాయి .

### 12.2.2 థూసిడైడ్స్

గ్రీక్‌ల చరిత్ర రచనా రంగంలో తన అపారమైన సేవలను అందించిన మరో సుప్రసిద్ధ చరిత్రకారుడు, థూసిడైడ్స్. ఇతని జీవిత విశేషాల గూర్చి మనకు తెలిసిన వివరాలేవో, ఇతని గ్రంథంలో మాత్రమే లభిస్తున్నాయి. ఇంచుమించు క్రీ.పూ. 460 ప్రాంతంలో, ఈతడు ఏథెన్స్ కు చెందిన ఉన్నత కుటుంబంలో జన్మించినట్లుగా తెలుస్తున్నది. సాహిత్యం, కళలను అధ్యయనం చేశాడు. ఏథెన్స్ సైన్యంలో సేనానిగా కూడా పనిచేశాడు. పెలపొనీషియన్ (Pelaponesian) యుద్ధం జరుగుతున్న 8వ సంవత్సరంలో శత్రువుల బారి నుండి త్రేస్ తీర ప్రాంతాన్ని రక్షించటానికి, ఒక నావికాదళాధిపతిగా నియమించబడ్డాడు. ఆ ప్రాంతంల్లో సొంతంగా కొన్ని బంగారు గనులు కూడా ఇతనికున్నాయి. తన సొంత ఆస్తిని కాపాడుకొనే ఆదుర్దాతో, స్పార్టా సైన్యాలు అంఫిపోలిస్‌ని పట్టుకోవటాన్ని నిరోధించలేక పోయాడనే కారణంతో, ఇరవై సంవత్సరాల పాటు దేశ బహిష్కారానికి గురయ్యాడు. ఈ కాలంలో విశేషంగా యాత్రలు చేసి, యుద్ధ గమనాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. క్రీ.పూ. 404 లో యుద్ధం ముగిసి, శాంతియుత వాతావరణం ఏర్పడ్డాక, ఏథెన్స్‌కు తిరిగి వచ్చి, కొంతకాలం తర్వాత మరణించాడు.

B R A O U

థూసిడైడ్స్ రచించిన చరిత్ర గ్రంథం, 'పెలపొనీషియన్ యుద్ధ చరిత్ర' (History of Peloponesian War). ఇది అసంపూర్ణ రచన. కారణం, క్రీ.పూ. 431లో ఆరంభమైన పోరాటంతో రచన ప్రారంభమై, క్రీ.పూ. 411తో అర్థాంతరంగా ఆగిపోయింది. యుద్ధం నిజానికి మరొక 7 సంవత్సరాలు కొనసాగింది. గ్రీస్‌పై ఆధిపత్యం కోసం రెండు నగర రాజ్యాలు ఏథెన్స్, స్పార్టాల మధ్య జరిగిన యుద్ధమిది. పోరాటం ఆరంభం నుంది మొదలుకొని, రోజువారీ యుద్ధ వివరాల్ని థూసిడైడ్స్ గ్రంథస్థం చేయడం మొదలుపెట్టాడు. అంతకు ముందు జరిగిన యుద్ధం కన్నా, ఈ యుద్ధం గొప్పది, గుర్తించుకోదగిందనే నమ్మకంతోనే, తన చరిత్ర రచనకు ఈ విషయాన్ని ఎన్నుకున్నాడు. ఆ తర్వాత జరిగిన సంఘటనలు, ఇతని అంచనా సరైందనే నిరూపించాయి. షుమారు 27 సంవత్సరాల పాటు కొనసాగిన పెలపొనీషియన్ యుద్ధం, ఏథెన్స్ ఓటమితో పెరిక్లిస్ యుగ వైభవం అంతరించటంతో గానీ ముగియలేదు. సమకాలీన సంఘటనలనే, అందులోనూ తానే పాత్ర వహించిన పెలపొనీషియన్ యుద్ధాన్ని థూసిడైడ్స్ తన రచనా విషయంగా ఎన్నుకోవడంతో, తానే తన కథనానికి ప్రత్యక్ష సాక్షి అయ్యాడు. చరిత్రలో సమకాలిక సంఘటనలకే ప్రాధాన్యాన్ని ఇవ్వడంతోపాటు, కాలానుగతంగానే, అంటే, సంవత్సర క్రమంలోనే, ఆ సంఘటనల గూర్చి చర్చించాలనీ, జరిగిన వాటికి మానవ సంబంధమైన కారణాలను మాత్రమే విశ్లేషించాలన్నాడు.

థూసిడైడ్స్ తన యదార్థాలను నిర్ధారించుకోడానికి చాలా శ్రమపడ్డాడు. దీనికితోడు, పూర్తి నిష్పాక్షిక

ధోరణిలో యుద్ధ గమనాన్ని వర్ణించాడు. తన స్వస్థలం ఏథెన్స్ పట్ల అభిమానం ఉన్నా, దాని లోపాల్ని, తప్పుల్ని ఖండించటంలో, ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. విషయాన్ని వివరించేటపుడు ఏథెన్స్, స్పార్టాల మధ్య సమ తూకాన్ని పాటించాడు. ఇతని గ్రంథంలో మరో విశేషం, ఆయా సంఘటనల్లో సందర్భోచితంగా పాత్రధారుల వ్యక్తిత్వాలకు అనుగుణంగా ప్రసంగాలను జొప్పించటం. ఉదాహరణకు, యుద్ధం ఆరంభమైన మొదటి సంవత్సరంలో, చనిపోయిన ఏథెన్స్ సైనికుల అంత్యక్రియల సమయంలో, పెరిక్లిస్ ఇచ్చిన అద్భుతమైన ఉపన్యాసం. ఈ కారణం చేతనే, ఇతడ్ని కాలింగ్‌వుడ్ ' మనో వైజ్ఞానిక చరిత్రకారుడ' ని వర్ణించాడు. చరిత్రకారునిగా థూసిడైడ్స్ హెరోడోటస్ కంటె గొప్పవాడని కీర్తించబడ్డాడు. హెరోడోటస్ తన కావ్య శైలికి ఇచ్చిన ప్రాధాన్యతను, చారిత్రక సత్యానికి ఇవ్వలేదు. దీనివల్ల, అనేక సందర్భాల్లో, చారిత్రక సత్యానికి విఘాతం కలిగింది. థూసిడైడ్స్ ప్రామాణిక సత్యానికి విలువ నిచ్చాడు. ఖచ్చితత్వానికై కృషి చేయటంలో అగ్రగామిగా నిల్చి, ఆధునిక యుగంలో రాంకెకి మార్గదర్శకుడయ్యాడు. హెరోడోటస్ కథలు చెప్పడంలో అందె వేసిన చేయి. ఊహకు ప్రాధాన్యమిచ్చాడు. కాని, థూసిడైడ్స్ ఆధారాలను నిర్ధారించుకోటంలో, అతి సూక్ష్మంగా శ్రద్ధ వహించేవాడు. దేనినైనా విశ్లేషించి చూడటం అతని పంథా. హెరోడోటస్, పరిధిలో విస్తృతమైన గ్రీస్ - పర్షియా యుద్ధాన్ని రచనా విషయంగా తీసుకోగా, థూసిడైడ్స్, ఏథెన్స్ - స్పార్టాల మధ్య జరిగిన పెలపొనీషియన్ యుద్ధానికే పరిమితం చేశాడు. సమాజపరమైన ఇతర విషయాలను పరిశీలించలేదు. హెరోడోటస్‌కి అతీత ప్రకృతి శక్తుల్లో ఉన్న నమ్మకం, థూసిడైడ్స్‌కి లేదు. హెరోడోటస్ పరిశోధన ఏం జరిగిందో తెలుసుకోడానికి పరిమితమైంది. అయితే, థూసిడైడ్స్ దీనికంటే ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో, తెలుసుకోడానికి శ్రద్ధ చూపించాడు. హేతుబద్ధంగా, క్రమబద్ధమైన శాశ్వత రీతిలో పరస్పరం ఒకదానికొకటి కార్యకారణ సంబంధం రీత్యా, అనుసంధించబడ్డ యదార్థ సంఘటనలనీ, వాటి అధ్యయనమే చరిత్ర, అనే చరిత్ర మొదటి ప్రాథమిక సూత్రాన్ని, ఇతడే మనకు బోధించాడు. చారిత్రక యదార్థాలను సమన్వయించి, సాధారణ సూత్రాలను రూపొందించడం ద్వారా, చరిత్రను నీతిబోధకం చేసి, చరిత్రకారునిగాకన్నా, తత్వవేత్తగానే ఇతడ్ని పరిగణించాలేమో, అని భావించేలా చేశాడు.

థూసిడైడ్స్‌లోనూ లోపాలు లేకపోలేదు. యదార్థాల ప్రామాణికతతో చరిత్ర రచనకు పూనుకున్నా, ఆ యదార్థాలను సరైన చారిత్రక అవలోకనంతో పరిశీలించలేకపోయాడని, చారిత్రక పరిస్థితుల్లో భౌగోళిక విషయాల ప్రాముఖ్యాన్ని విస్మరించాడని, తన రచనా విషయాన్ని పరిమితం చేసిన కారణంగా, చరిత్రలో సాంస్కృతిక, సాంఘిక, ఆర్థిక శక్తుల ప్రాధాన్యతను గుర్తించలేకపోయాడని, బర్నెస్ ఇతడ్ని విమర్శించాడు. థూసిడైడ్స్ రచనా శైలి క్లిష్టంగా, అర్థం చేసుకోడానికి కష్టంగా ఉంటుంది. ఇతనిలో మరీ ముఖ్యంగా కన్పించే లోపం, సంఘటనల్ని నిర్దిష్టంగా తేదీల ప్రకారం వివరించకపోవటం. రుతువుల్ని అనుసరించి సంఘటనల్ని వర్ణించడం, పాఠకుల్లో గందరగోళాన్నే సృష్టిస్తుంది. ఈ లోపాలున్నా, యదార్థాల ప్రామాణికతకు, నిష్పాక్షితకు, కార్యకారణ సంబంధంలో సంఘటనల వివరణకు, సాధారణీకరణాలకు, థూసిడైడ్స్ ఇచ్చిన ప్రాముఖ్యం దృష్ట్యా, ఉన్నత ప్రమాణాల్లో చరిత్ర రచనను తీర్చిదిద్ది, ఉత్తమ చరిత్రకారునిగా ప్రసిద్ధికెక్కాడు.

గ్రీకుల చరిత్ర రచనను సుసంపన్నం చేసిన ఇతర చరిత్రకారుల్లో క్జెనొఫన్ (Xenophon), పాలీబియస్ (Polybius) లు ముఖ్యులు. హోమర్, హెసియడ్ కవుల రచనల్లోని కట్టు కథలను మొదట ఖండించినవాడు, క్జెనొఫన్ (క్రీ.పూ. 430 - 354). ఇతని చరిత్ర రచనల్లో, ' అనాబసిస్ ' (Anabasis) ముఖ్యమైంది. ఇందులో, సోక్రటీస్‌పై జ్ఞాపకాలు చాలా ఆసక్తిని రేకెత్తించే అమూల్యమైన విశేషాలు. క్జెనొఫన్ థూసిడైడ్స్ కథనాన్ని ' హెలెనికా '(Hellenica) పేరుతో కొనసాగించాడు. గ్రీక్ రాజకీయాల్లో ఆర్థిక అంశాలను గూర్చి, 'ధన సంపాదనా విధానాలు' (Ways And Means) అనే రచనలో అధ్యయనం చేశాడు. పాలీబియస్

BRAOU

(క్రీ.పూ. 198 - 117) మెగలోపోలిస్ వాసి. యుద్ధ ఖైదీగా రోమ్ కొనిపోబడినపుడు సిపిమోస్ ఆదరణలో, గ్రీక్ భాషలో రోమన్ చరిత్రను ( క్రీ.పూ 164 - 146 మధ్య కాలానికి సంబంధించి) గ్రంథస్థం చేశాడు. చరిత్రకు నేత్రాలు సత్యం కావాలని, చరిత్రకారుడు తప్పనిసరిగా నిష్పాక్షిక ధోరణితో యదార్థాలను బేరీజు వెయ్యాలని నొక్కి చెప్పాడు. చరిత్ర ఆధారాల విశ్వసనీయతకు అధిక ప్రాముఖ్యాన్నిచ్చాడు.

క్రీ.పూ. మొదటి శతాబ్ద గ్రీక్ చరిత్రకారుల్లో పేర్కోదగ్గవారు, స్టాయిక్ పసిడోనియస్, స్ట్రాబో, డైయోడోరస్, సికలస్, డైయోనీషియస్‌లు. వీరిలో డైయోనీషియస్, చరిత్రను ఉదాహరణల ద్వారా బోధించే తత్వశాస్త్రమని నిర్వచించాడు. చరిత్ర రచనలో జీవిత చరిత్రకు స్థానం కల్పించినవాడు, ప్లూటార్క్ ( క్రీ.శ. 50 - 125). ఈతడు తన " సమానాంతర జీవితాలు " (Parallel Lives) గ్రంథం ద్వారా, జీవిత చరిత్ర అంటే ఎలా రచించాలో నిదర్శనమిచ్చాడు.

ఈ విధంగా, ప్రాచీన గ్రీక్ కవులు జ్ఞాన ప్రపంచానికి, ' చరిత్ర ' అనే పదాన్ని ప్రసాదించటమే కాక, దానిలోని వస్తుతత్వాన్ని కూడా సుసంపన్నం చేశారు. హోమర్ కవిత్వంలో, లోగోగ్రాఫర్ల వచన రచనల్లో, చరిత్ర అంటే అన్వేషణగా రూపొందింది. హెరోడోటస్ చరిత్ర గ్రంథంలో భూభాగాల భౌగోళిక లక్షణాలు, ప్రజల జీవన విధానాలు చోటుచేసుకొన్నాయి. థూసిడైడ్స్ చేతిలో చరిత్ర వస్తుగతంగా మారి, మార్గదర్శకత్వంలో వ్యవహారికమైంది. పాలీబియస్ రచనలో అన్వేషణతో పాటు, కథనం ప్రాముఖ్యత పెరిగంది. ఈవిధంగా, ప్రాచీన కాలంలో గ్రీక్ చరిత్రకారుల చేతుల్లో, చరిత్ర అన్ని ప్రధాన లక్షణాలను సంతరించుకొని, మానవీయం (Humanistic) గా, శాస్త్రీయంగా (Scientific), స్వీయ దార్శనికంగా (Self-revelatory) అవతరించింది. చరిత్ర రచనాభివృద్ధికి ప్రాచీన గ్రీక్‌లు ఇలా అపారమైన సేవచేసి, విజ్ఞానశాస్త్రం, తత్వశాస్త్రాల మాదిరిగానే, చరిత్రకూ మూల పురుషులయ్యారు.

## 12.3 రోమన్ల చరిత్ర రచన

BRAOU

రోమన్ల చరిత్ర రచనా సంప్రదాయం, గ్రీక్‌ల సంప్రదాయానికి కేవలం అనుకరణ మాత్రమే. దీనికి వేరే ప్రత్యేక వ్యక్తిత్వమంటూ ఏమీ కన్పించదు. అలాగని, సునిశితమైన ఆలోచన, సహేతుకమైన, విశ్లేషణాత్మక ధోరణి, మనోజ్ఞ రచనా శైలితో, చరిత్ర రచనలో గ్రీక్‌లు నెలకొల్పిన ఉన్నత ప్రమాణాలు, రోమన్ల రచనలలో కనిపిస్తాయా అంటే, అదీ లేదు. రోమన్లలో ఆ నిశిత దృష్టి, స్ఫూర్తి, కార్య దీక్ష కొరవడ్డాయి. దీనికి కారణాలున్నాయి. లేషియమ్ (Latium) రాజ్యాల్లో ముఖ్య నగరంగా గుర్తింపు పొంది, మధ్యధరా ప్రాంతాన్ని జయించటం ప్రారంభించాకనే, రోమ్ ఇతరుల దృష్టిలో పడింది. తామే నాగరికులమనే గ్రీక్‌ల జాత్యహంభావం రోమన్లలో లేదు. ఈ మానసిక స్థితి లేదు కాబట్టి, వీరు ఆంతరంగిక పరిణామాలను మామూలు రోజువారీ కార్యక్రమంగా మాత్రమే భావించారు. పైగా, తమ మతపరమైన నమ్మకాల్లోనూ, సాహిత్య విషయాల్లోనూ జరిగినట్లే, చారిత్రక చింతనలోనూ గ్రీక్‌ల ప్రభావం స్పష్టమౌతుంది. గ్రీక్‌ల్లో కవులు చరిత్ర రచన ఆరంభించాక, దాదాపు 5 శతాబ్దాల కాలం వరకు, రోమ్‌లో చరిత్ర రచయితే కనిపించడు. అటువంటిది, గ్రీక్ చరిత్ర రచనలు చదివిన మీదట, రోమన్లు తమ ఘన కార్యాలనూ గ్రంథస్థం చేయాలనుకొన్నారు. (అంటే, వీరు ముందుగా చరిత్రను సృష్టించి, తర్వాత చరిత్ర రచనకు పూనుకొన్నారన్నమాట). మనదేశంలో ఇప్పటికీ అనేక మంది చరిత్రకారులు తమ రచనలను ఆంగ్లంలోనే రాస్తున్నట్లు, రోమన్లు మొదటి దశలో తమ చరిత్ర గ్రంథాలను గ్రీక్ భాషలోనే రాశారు. దీన్ని బట్టి, వీరిపై గ్రీక్ ప్రభావం ఎంతటిదో ఊహించుకోవచ్చు. ఇందులో మరో విశేషముంది. మనల్ని జయించిన వారి భాషలో మనవారు రాస్తే, రోమన్లు తాము జయించిన వారి భాషలో

మొదట్లో రచనలను చేశారు. కాని, కొద్దికాలం తర్వాత, తమ లాటిన్ భాషలో రచనలను సాగించారు. మొత్తం మీద, చరిత్ర వైపు వీరి దృష్టి మళ్లటం, గ్రీక్‌ల చరిత్ర రచనల ప్రభావ ఫలితమే.

క్రీ.పూ. 201లో రెండో ప్యూనిక్ యుద్ధం ముగిసాక కాని, రోమన్ల చరిత్ర రచన ఆరంభం కాలేదు. ఫెబియస్ పిక్టర్ మొదటి రోమన్ చరిత్రకారుడు. ఇతడు గ్రీక్ భాషలో రోమ్ గాథను తన 'చరిత్ర' (Annals) లో చిత్రించాడు. రోమన్ చరిత్ర రచనకు మూల పురుషుడు 'కాటో ది ఎల్డర్' అని వ్యవహరిస్తున్న పోర్షియస్ కాటో ( క్రీ.పూ. 234 - 149). ఇతని 'మూలం' (Origines), రోమ్ చరిత్రపై లాటిన్‌లో రాసిన తొలి చరిత్ర రచన. అందుచేతనే, ఈ రచన జాతీయ గ్రంథంగా పరిగణించబడింది. దీని తర్వాత, గ్రీక్ నమూనాలపై లాటిన్‌లోనే రాయటం జరిగింది. ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ సైన్యాధిపతిగా వాసికెక్కిన రోమన్ రాజనీతిజ్ఞుడు జూలియస్ సీజర్ ( క్రీ.పూ. 102 - 44) 'గాలిక్ యుద్ధం, అంతర్యుద్ధంపై వ్యాఖ్యానాలు' (The Commentaries on the Gallic War and the Civil War) అనే గ్రంథాన్ని రాసాడు. రోమ్ ప్రజల ముందు ప్రధానంగా తన చర్యలను సమర్థించుకోడానికి సీజర్ ఈ రచన చేసినా, ఇందులో నిష్పాక్షికంగానే యుద్ధం గూర్చి వర్ణించాడు. ప్రజల ఆచార వ్యవహారాలు ఈ గ్రంథంలో చోటు చేసుకొన్నాయి. థూసిడైడ్స్, పాలీబియస్‌ల ప్రమాణాలను రోమన్ చరిత్ర రచనలో ప్రవేశపెట్టినవాడు, సాలస్ట్.

### 12.3.1 లివీ ( క్రీ.పూ. 59 - క్రీ.శ 17)

రోమన్ చరిత్రకారుల్లో సుప్రసిద్ధులు లివీ, టాసిటస్‌లు. వీరిని రోమన్ హెరోడోటస్, థూసిడైడ్స్‌లుగా పరిగణించొచ్చు. రోమ్ గొప్పతనం గూర్చి గట్టి నమ్మకాన్ని పెంచుకొన్నారు. రోమ్ చరిత్రలో నూతన శకం, స్వర్ణ యుగం ఆరంభమైందనే విశ్వాసం బలంగా వేళ్ళూనాయి. జూలియస్ సీజర్ హత్యానంతరం, మొదటిసారిగా రోమన్ ప్రపంచం సమైక్యమైంది. ఇదే వీరికి స్ఫూర్తినిచ్చింది. వీరిలో లివీ, టాసిటస్ కంటె మూడు తరాల ముందువాడు. ఇతడు క్రీ.పూ. 59లో ఇటలీ ఉత్తర భాగంలోని పాడువాలో జన్మించాడు. రోమ్‌లో ఇతని జీవితం ఎక్కువగా గడిచింది. ఉపాధ్యాయుడిగా జీవితాన్నారంభించాడు. కథలు చెప్పడంలో అందెవేసిన చేయిగా ప్రసిద్ధికెక్కాడు. మొదటి రోమన్ చక్రవర్తి అగస్టస్ అభిమానాన్ని సంపాదించాడు. అతని ఆదరణ లోనే, తన రచనలను సాగించాడు.

BRAOU

లివీ రోమ్ చరిత్ర 'అబ్ అర్‌బె కొండిత లిబ్రి' (Ab Urbe Condita Libri) అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథం 142 సంపుటాల్లో, రోమ్ నగర స్థాపన మొదలు, సామ్రాజ్య స్థాపన వరకు - అంటే, క్రీ.పూ. 753 నుండి క్రీ.పూ. 8 వరకు చారిత్రక పరిణామాలను వివరిస్తూ రాయబడింది. కాని, ఈ 142 సంపుటాలకు గాను, 35 సంవత్సరాలు మాత్రమే పూర్తిగా లభిస్తున్నాయి. రోమ్ పతనానికి దారితీసిన అనేక విపత్తులను దృష్టిలో పెట్టుకొంటే, ఇవి లభించడం కూడా చాలా ఆశ్చర్యకరమైన విషయమే. ఇందులో కొన్ని రచనలు మధ్య యుగం వరకూ లభించలేదంటే, పరిస్థితి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అయితే, మొత్తం చరిత్రకు 'పెరియోకె' (Periochae) అని ఒక సంగ్రహ ప్రతిలాంటిది లభించడంతో, కొంతమేరకు గ్రంథంలోని ఖాళీలను పూరించటానికి అవకాశం లభించింది. రోమ్ గత వైభవాన్ని తన సమకాలికులకు చూపించడం, వారి కళ్లముందు వెనుకటి ప్రముఖుల్ని ఆదర్శమూర్తులుగా, మార్గదర్శకులుగా నిలబెట్టడం తన లక్ష్యమని, లివీ తన గ్రంథ పీఠికలో స్పష్టం చేశాడు. యుద్ధాలు, ముట్టడులను గూర్చి వర్ణించడంలో, ఇతడు అందర్నీ అధిగమించాడు. ఇతని రచనలో కన్పించే సమగ్రత నిజంగా అద్భుతం. కాని, రచనా విధానంలో ఆధారాలను పరిశీలించటంలో, విమర్శనా దృష్టి ఏ మాత్రం కనిపించదు. పూర్వ రచయిత చెప్పిన దాన్ని యదాతథంగా అంగీకరించేవాడు. దీంతో, శాస్త్రీయ చరిత్రకారుల్లో లివీకి స్థానం లభించలేదు. అయినా, రోమ్ పూర్వ చరిత్రకు

సంబంధించిన సాంప్రదాయక రచనలన్నింటినీ సమీకరించి, వాటిని సమన్వయం చేసి, ఒక అవిచ్ఛిన్న కథనంగా రూపుదిద్దిన ఘనత, కాలింగ్‌వుడ్ అన్నట్లు లివీదే. నిర్దేశించుకొన్న లక్ష్యానికి తన రచనను పరిమితం చేశాడు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకూ, చక్కటి రచనా శైలికి పేరు పొందాడు.

**12.3.2 టాసిటస్ ( క్రీ.శ. 55 - 117)**

ప్రసిద్ధ రోమన్ చరిత్రకారుల్లో చివరివాడు, టాసిటస్. చరిత్రకారుడిగా లివీ కంటే గొప్పవాడు. ఇతని జీవితానికి సంబంధించిన వివరాలను ఇతని సన్నిహితుడైన ప్లినీ తెలియచేశాడు. క్రీ.శ. 55లో జన్మించిన టాసిటస్ న్యాయవాద విద్యనభ్యసించి, కొంతకాలం న్యాయవాదిగా కూడా పనిచేశాడు. బ్రిటీష్ గవర్నర్ అయిన జూలియస్ అగ్రికోలా కుమార్తెను క్రీ.శ 77లో టాసిటస్ వివాహం చేసుకొన్నాడు. సమాజంలో ప్రోకాన్సల్ వంటి ఉన్నత పదవులను నిర్వహించాడు. జీవితం చివరి దశలో చరిత్ర రచనకు పూనుకొన్నాడు. ఈతని సారస్వత జీవితం, ' అగ్రికోలా జీవితం ' (Life of Agricola) అనే గ్రంథ రచనతో ప్రారంభమైంది. ఈ రచన తన మామగారైన అగ్రికోలా జీవిత చరిత్రయే. ఈ గ్రంథంలో బ్రిటన్‌లో రోమన్ల యుద్ధాల గూర్చి, రోమన్ల పరిపాలనలో బ్రిటన్ ఎలా ఉందీ, అగ్రికోలా పరిపాలన గూర్చి రాశాడు. ఈ వివరాల సంగతి అలా ఉంచి, జీవిత చరిత్ర రచన ఎలా ఉండాలో తెలియచేయడానికి ఇది చక్కని నిదర్శనం. దీని తర్వాత, (Dialogue on Orators) " వక్తృత్వ సంభాషణలను " రచించాడు.

టాసిటస్ ఇతర చరిత్ర రచనల్లో ఒక్కటైన 'జర్మానియా' (Germania) జర్మన్‌ల సంప్రదాయాలను, కట్టుబాట్లను, విశ్వాసాలనూ వివరిస్తుంది. వర్ణనాత్మక సమాజ శాస్త్రానికి సంబంధించిన తొలి రచనల్లో, ఇదొకటి. ' హిస్టరీస్ ' (Histories), ' ఆనల్స్ ' (Annals ) లు టాసిటస్ రాసిన ఇతర చరిత్ర గ్రంథాలు. ఈ రెండు రచనలూ, రోమ్ చరిత్రను అగస్టస్ కాలం నుండి డొమిషియన్ వరకూ ఉపన్యాస ధోరణిలో వర్ణిస్తున్నాయి. అంటే, క్రీ.శ. 14 నుండి క్రీ.శ. 96 వరకు గల రోమ్ చరిత్రను ఈ గ్రంథాలు వివరిస్తున్నాయి.

టాసిటస్ చరిత్ర రచనా విధానంలో, గ్రీక్ చరిత్రకారుడు థూసిడైడ్స్ గోచరిస్తాడు. అయితే, ఇది కొంత మేరకే. ముఖ్యంగా కారణాలను రూపొందించడంలోను, సంఘటనలను వ్యాఖ్యానించడంలోను మాత్రమే, ఈ అనుకరణ కన్పిస్తుంది. టాసిటస్ తన గ్రంథాల రచనకు కష్టపడి సమాచారాన్ని సేకరించాడు. మానవ స్వభావాన్ని లోతుగా పరిశీలించాడు. కొన్ని సాధారణీకరణాలూ చేశాడు. అయితే, ముందే చెప్పినట్లు, ఇదంతా అరకొర ప్రయత్నమే. విమర్శనాత్మక ధోరణి పూర్తిగా రచనలన్నింటా ఏక రీతిలో కనిపించదు. చరిత్రను పరిశోధనగా కాక, కళగా భావించటం ఇతని లోపం. యదార్థాలను నిర్ధారించుకోడంలో, ఇతర రోమన్ల మాదిరిగానే సోమరి. చారిత్రక పరిణామాల అంతరార్థాన్ని కనిపెట్టే నిజమైన ప్రయత్నాన్ని ఇతడు చేయలేదు. భాష కోసం, శైలి కోసం పాకులాటే ఇతనిలో కనిపిస్తుంది. దీనికోసం సత్యాన్ని కూడా త్యాగం చేసేవాడు. చరిత్ర రచనలో పక్షపాత వైఖరిని ప్రదర్శించాడు. ఇతని రచనల్లో సమాజంలోని తోటి ఉన్నత వర్గాలే గోచరిస్తాయి. గణతంత్ర రాజ్యం, దాని సంస్థల పట్ల అనుకూలత కనిపిస్తుంది. మనిషిలోని సుగుణాలను చరిత్ర పెంపొందిస్తుందని టాసిటస్ నమ్మకం. అందుచేతనే, ఇతని రచనల్లో చారిత్రక, నైతిక, ఉపదేశాత్మక ప్రేరకం జరిగింది.

టాసిటస్ తర్వాత కాలంలో, రచనలు చేసిన రోమన్ చరిత్రకారుల్లో ట్రాంక్విలస్, మక్సిమస్, మార్సెలినస్‌లు ముఖ్యులు. ముందే చెప్పినట్లు , ఈ రోమన్ చరిత్రకారులందరూ, గ్రీక్‌ల చరిత్ర రచనను అనుకరించారు. వీరు ఊహాత్మక శక్తిలోను, అందంగా భావాన్ని వ్యక్తీకరించడంలోను, తాత్విక చింతనలోను గ్రీక్‌ల స్థాయిని అందుకొనే ప్రయత్నం చేసినా, వారి నిశిత దృష్టి, స్ఫూర్తి, కార్యదీక్ష వీరిలో కొరవడ్డాయి.

BRAOU

## 12.4 సంగ్రహంగా

ప్రాచీన గ్రీక్‌లు ప్రపంచానికి చరిత్ర అనే పదాన్ని అందించటమే గాక, దానిలోని వస్తుతత్వాన్ని సుసంపన్నం చేశారు. హెరోడోటస్, థూసిడైడ్స్ తదితర గ్రీక్‌ల చేతుల్లో, చరిత్ర మానవ దార్శనికంగా, శాస్త్రీయంగా రూపొందింది. రోమన్లు మొదట్లో గ్రీక్ చరిత్రకారులనే అనుకరించారు. లివీ, టాసిటస్ వంటి రోమన్ చరిత్ర కారుల రచనల్లో భావ వ్యక్తీకరణ, అద్భుత రచనా శైలి కన్పిస్తాయి. ఐరోపాలో ప్రాచీన యుగంలో గ్రీక్‌ల, రోమన్ల సేవలు చరిత్ర రచనాభివృద్ధికి దోహదం చేశాయి.

## 12.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ప్రామాణిక ( గ్రీకో - రోమన్ ) చరిత్ర రచనా సంప్రదాయ ముఖ్య లక్షణాలను వివరించండి.
2. చారిత్రక చింతనాభివృద్ధికి గ్రీక్ రచయితల సేవలను వివరించండి.
3. చరిత్ర రచనా శాస్త్ర ప్రారంభంలోను, అభివృద్ధిలోను హెరోడోటస్, థూసిడైడ్స్‌లను పోల్చి, తేడాలను పేర్కొనండి.
4. రోమన్ చరిత్ర రచనాభివృద్ధికి లివీ, టాసిటస్‌ల సేవలను వర్ణించండి.

II. **క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. గ్రీక్ చరిత్ర రచనా సంప్రదాయంలోని ముఖ్య లక్షణాలను సంక్షిప్తంగా పేర్కొనండి.
2. అత్యున్నత చరిత్రకారుల్లో ఒకడుగా థూసిడైడ్స్ ఏల పరిగణించబడుతున్నాడు ?

BRAOU

## 12.6 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| James T. Shotwell | : | **The History of History** |
| Barnes. H.E. | : | **A History of Historical Writing** |
| Collingwood R.G. | : | **The Idea of History** |
| Thompson J.W. | : | **History of Historical Writing, Vol - I** |
| Toynbee A.J. | : | **The Greek Historical Thought** |
| Usher, Stephen | : | **The Historians of Greece and Rome** |


*రచయిత : డా. జాస్తి దుర్గా ప్రసాద్*

# భాగం - 13 : ప్రాచీన యుగం : భారతీయ చరిత్ర రచనాభివృద్ధి

విషయక్రమం


13.0 లక్ష్యాలు

13.1 పరిచయం

13.2 ప్రాచీన భారతీయుల చారిత్రక దృష్టి

13.3 ఇతిహాస - పురాణ సంప్రదాయం

13.4 బౌద్ధుల, జైనుల చరిత్ర రచన

13.5 భారతీయుల చరిత్ర రచన - విశ్లేషణ

13.5.1 కల్హణుడు

13.6 సంగ్రహంగా

13.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

13.8 ఉపయుక్త గ్రంథాలు


## 13.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- ప్రాచీన యుగంలో, భారతీయుల చారిత్రక దృష్టిని, చరిత్ర రచనా సాంప్రదాయాన్ని వివరించగలగాలి.
- చరిత్ర రచనల ఇతిహాస - పురాణ సాంప్రదాయం గురించి వివరించి, దీనిలో భాగంగా, ఆస్థాన కవుల-ముఖ్యంగా కల్హణుని - సేవలను విశ్లేషించగలగాలి.

BRAOU

## 13.1 పరిచయం

ప్రాచీన యుగంలో భారతీయులకు చారిత్రక దృష్టి, చరిత్ర రచనా సంప్రదాయం లేవని, భారతీయ చరిత్ర రచనల క్రమ వికాస పరిణామాన్ని సునిశితంగా అధ్యయనం చేసిన కొంతమంది మేధావులు అభిప్రాయపడ్డారు. వీరు గ్రీక్, రోమన్ చరిత్ర రచనా సంప్రదాయంలో తులనాత్మక అధ్యయనం చేసి, మన ప్రాచీనుల్లో హెరోడోటస్, థూసిడైడ్స్, లివీ, టాసిటస్ వంటి చరిత్రకారులు కనిపించరని భావించారు. కాని, ప్రతి సమాజానికీ గతాన్ని గూర్చిన భావం ఉండి తీరుతుంది. ఏ సమాజానికీ చారిత్రక దృష్టి లేదని గాని, ఉండదని గాని అనడం, ఆ అనే వ్యక్తుల దృష్టి దోషం అనుకోవాలి. చారిత్రక దృక్పథం అనేది ఆ సమాజానికి పనికొచ్చే, ఆ సమాజం అవసరాలను తీర్చటానికి ఉపయోగపడే కాలాన్వయంతో క్రమబద్ధీకరించబడ్డ, గత సంఘటనల చైతన్యం. ఈ రీత్యా చూస్తే, మన ప్రాచీనులకు ఇతిహాస - పురాణ సంప్రదాయంలో సుసంపన్నమైన, సమగ్రమైన చారిత్రక దృక్పథం ఉందనే విషయాన్ని స్పష్టం చేయొచ్చు.

## 13.2 ప్రాచీన భారతీయుల చారిత్రక దృష్టి

భారతీయుల చరిత్ర రచనావిర్భావం గురించి, దీని పరిణామం గురించి అధ్యయనం చేసిన అనేక మంది మేధావులు, ప్రాచీన కాలంలో భారతీయులకు చారిత్రక దృక్పథంగాని, ఈనాడు చరిత్ర అంటే మనం అర్థం చేసుకుంటున్న భావంలో చరిత్ర రచనా సంప్రదాయంగాని, లేవనే అభిప్రాయపడ్డారు. ప్రాచీన గ్రీక్‌ల, రోమన్ల, చైనీయుల, ముస్లింల చరిత్ర రచనా సంప్రదాయాలతో పోలిస్తే, ప్రాచీన భారతీయ చరిత్రకారుల నదగ్గ వారిలో హెరోడోటస్, థూసిడైడ్స్, లివీ, టాసిటస్, సు - మ - చియెన్, ఇబ్న్ ఖల్దూన్‌లతో సరితూగే చరిత్రకారుడు లేడని చెప్పారు. ఆధునిక యుగం ఆరంభమయ్యేవరకూ, భారతదేశంలో ఎటువంటి విలువైన చరిత్ర రచన వెలువడలేదనీ, నిజానికి, భారత చరిత్ర అధ్యయనాన్ని, విదేశీయులు పరిచయం చేశారని ఈ పండితులు భావించారు. క్రీ.శ. పదకొండో శతాబ్దంలో, మన దేశం పైకి అనేకసార్లు దండయాత్రలుచేసిన గజనీ పాలకుడు మహమ్మద్‌తో బాటు వచ్చి, ఈ దేశాన్ని సందర్శించి, అప్పటి మన దేశ శాస్త్రవిజ్ఞానాన్ని, సాహిత్య ప్రక్రియలను, రాజకీయ పరిస్థితులను నిష్పక్షపాతంగా అర్థం చేసుకోడానికి ప్రయత్నించిన అల్‌బెరూని, చారిత్రక క్రమంలో విషయాన్ని పొందుపర్చటంలో హిందువులు పెద్దగా శ్రద్ధ వహించరనీ, కాలానుగతంగా విషయాలను వివరించటంలో చాలా నిర్లక్ష్యంగా ఉండేవారనీ, సమాచారం కోసం ఒత్తిడి ఎక్కువైనప్పుడు ఏం చెప్పాలో తెలియని అయోమయంలో తప్పనిసరిగా వారు కట్టుకథలు చెప్పేవారనీ ' కితాబ్ - ఉల్ - హింద్ ' అనే గ్రంథంలో పేర్కొన్నాడు. భారతదేశ చరిత్రకారుల్లో శాసనశాస్త్ర నిపుణుల్లో యువరాజుగా ప్రసిద్ధి పొందిన జె.యఫ్.ఫ్లీట్, ' విస్తృతమైన, విమర్శనాత్మక దిశల్లో సిసలైన చరిత్రను రూపొందించేలా, ప్రాచీన హిందువులకు ఎప్పుడైనా నిజమైన చారిత్రక దృక్పథముందా? అనేది ప్రశ్నార్థకమే ' అన్నాడు. సంస్కృత వాఙ్మయ చరిత్రకారుడైన ఏ.బి. కీత్ కూడా, 'సాహిత్యం అపారంగానే ఉన్నప్పటికీ, చరిత్ర ఎంత దారుణంగా ప్రతిబింబించిదంటే, మహోన్నత సంస్కృత సాహిత్యం మొత్తంలో, నిశిత దృష్టి ఉన్న చరిత్రకారునిగా, నిజంగా పరిగణింపదగ్గ రచయిత ఒక్కడు కూడా లేడు ' అని చెప్పాడు.

BRAOU

ఇక మన సమకాలీన భారతీయ చరిత్రకారుల్లో, విశిష్ట స్థానం పొందిన రమేష్ చంద్ర మజుందార్, చరిత్ర రచన పట్ల భారతీయులకు ఉన్న అనిష్టత, మన సంస్కృతికి గొప్ప లోపమని వక్కాణించాడు. సరైన వంశావళులు, కాలానుగతమైన వర్ణనలు లభించక పోవటంతో, ప్రాచీన భారతదేశ రాజకీయ చరిత్రను నిర్మించటం కష్టతరమైంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే, పి.టి. శ్రీనివాస అయ్యంగార్ చరిత్రకు కాలక్రమణిక (Chronology) నేత్రమైతే, ప్రాచీన భారతదేశ చరిత్ర ఎప్పుడూ గ్రుడ్డిదిగానే ఉండిపోక తప్పదని వ్యాఖ్యానించాడు. అనేక ఆధారాలు, నిర్దేశాలను ఉపయోగించుకుని, కొంత సామాజిక చరిత్రను రూపొందించటం జరిగిందనే దాంట్లో, సందేహం లేదు. కాని, దీన్ని రాజకీయ చరిత్రతో ముడిపెట్టక పోవటంతో, రావాల్సిన సువాసన రాలేదు.

ప్రాచీన భారతీయులకు చారిత్రక దృక్పథం, రచనా సంప్రదాయం ఉన్నాయా, లేవా ? అనే సందేహం తీరాలంటే, వారి మనస్తత్వం, ఆలోచనా ధోరణి, నమ్మకాలు, సంప్రదాయాలను తెలుసుకోవాలి. మన పూర్వ సంస్కృతి, చరిత్ర, చరిత్ర కర్తల గూర్చి మనకు ఆంగ్లేయులు తెలియజేసిన దాని కంటే ఎక్కువ తెలియదు. వాటి వివరాలు ఇంకా చాలా తెలుసుకోవాలి. విస్తారంగా ఎక్కువ ఆధారాలను సంపాదించాలి. సరైన అవగాహనను పెంపొందించుకోవాలి. ప్రాచీన భారతీయ పండితులు సాధించిన అభివృద్ధిని గూర్చి రాసారు. కాని, నిర్ధారణగా, ప్రామాణికమైన చరిత్ర, ఆ సాహిత్య ప్రక్రియల్లో ఎంత ఉందో ఇంకా పూర్తిగా తెలియదు. ఏ.కె. వార్డర్ ' భారతీయ చరిత్ర రచనకు ఒక ఉపోద్ఘాతం ' (An Introduction to Indian Historiography) అనే తన గ్రంథంలో, వైదిక కాలం నుండి ఆధునిక యుగం దాకా, భారతీయ చరిత్ర రచనలో అవిచ్ఛిన్నత సూచింపబడిందని సంక్షిప్తంగా వివరించాడు. అయితే, ఈ వివరణ భారతీయ భాషల్లో లభిస్తున్న కొన్ని ఎంపిక చేసుకున్న చారిత్రక

రచనలకు మాత్రమే పరిమితమైంది. ఇంకా బహుశా, అధిక సంఖ్యలో రాత ప్రతుల రూపంలో వెలుగులోకి రాని గ్రంథాలు తప్పకుండా ఉంటాయని వార్డర్ స్పష్టం చేశాడు. మన ఇతిహాసాలు, పురాణాల్లోని చారిత్రక యదార్థతను నిర్ధారించగల ' కాలక్రమణిక ఆధారాల అన్వేషణ ' పూర్తికావాలి. ఈనాడు పురావస్తు శాస్త్రం వంటి ఆనుషంగిక శాస్త్రాల సహాయంతో, ప్రాచీన వాఙ్మయంలోని విషయాలను నిర్ధారించేందుకు, కాల క్రమణికను రూపొందించేందుకు కృషి జరుగుతున్నది. ఈ ప్రయత్నాలు ఫలిచేంత వరకూ, ప్రాచీన భారతీయులకు చారిత్రక దృక్పథం లేదని ఖచ్చితంగా నిర్ధారించలేం.

చరిత్రను, మానవాళి ప్రగతిని ఆధునిక శాస్త్రీయ రీతిలో సమగ్రంగా వివరించే ప్రత్యేక సంఘటనల జాబితా అని నిర్వచించినట్లైతే, ప్రస్తుతం మనకున్న పరిజ్ఞానాన్ని బట్టి, భారతీయుల్లో ఆ విధమైన చారిత్రక దృక్పథం లేదని చెప్పొచ్చు. అలాగే, చరిత్రను, గతాన్ని అర్థం చేసుకోడానికి హేతువాద దృష్టితో, కార్యకారణ సంబంధాల ఫలితాల సహాయంతో శోధించిన వివరణ అని భావించినట్లైతే, అటువంటి చారిత్రక భావన ప్రాచీన భారతీయులకు లేదని అనొచ్చు. మన ప్రాచీనులు, ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి లేని ఆముష్మికవాదులు. వీరిలో గ్రీక్‌లకు, రోమన్లకు ఉన్నటువంటి సామ్రాజ్యవాద కాంక్ష లేదు. విదేశాల్లో వీస్తున్న నూతన భావాల తాకిడి వీరి మీద ప్రభావం చూపించలేదు. సురేంద్రనాథ్ బెనర్జీ చెప్పినట్లు, మన చారిత్రక గ్రంథాలనేకం ఏవో కారణాల మూలంగా కాల గర్భంలో కలిసిపోయాయి. లేదా, ఇంకా ఎన్నో చరిత్ర ఆధారాలు వెలుగుకు నోచుకోక, అజ్ఞాతంలో ఉండి పోయాయి. మొత్తం మీద ఈ పరిస్థితులన్నింటినీ చూస్తే, భారతీయులకు చరిత్ర రచనా సంప్రదాయం లేదని ఒప్పుకోక తప్పదనిపిస్తుంది.

అయితే, ఏ చారిత్రక దృష్టి లేకుండా మన ప్రాచీనులు అనేక రకాల చరిత్ర ఆధారాలను మనకు ఎలా అందించగలిగారు ? ఆర్.సి.మజుందార్, రొమిల్లా థాపర్ లు భావించినట్లు, మన ప్రాచీన సాహిత్యంలో చరిత్ర రచనకు పనికొచ్చే ముడిసరుకు చాలా వుంది. ఇతిహాసాలు, పురాణాలు, బుద్ధుని జాతక కథలు, జైన గ్రంథాలు, వీరశైవ వచనాలు, వైష్ణవ భక్తిగీతాలు, తమిళ సంగమ వాఙ్మయం, సమకాలీన భారతీయుల ఆలోచనా ధోరణిని, కార్య విధానాలను, సామాజిక రుగ్మతలను ప్రతిబింబించేవే. అయినా, గతం గూర్చి ఎటువంటి భావనా లేకుండా, ఏ సమాజం అయినా ఎలా ఉంటుంది ? ఎలా మనగలుగుతుంది ? అందుచేత, ప్రతి సమాజానికీ గతాన్ని గురించి ఏదో ఒక భావన తప్పక ఉంటుంది. అయితే, ఆ చారిత్రక భావన, మనం అనుకుంటున్న భావన, ఒకటే అవ్వాలని లేదు. పైగా, ఆ చారిత్రక భావన ఆ ప్రత్యేక సమాజానికి పనికొచ్చే, అంటే ఆ సమాజ అవసరాలను తీర్చడానికి ఉపయోగపడే కాలక్రమణిక చట్రంలో బిగించబడి ఉండొచ్చు. ఆ గత సంఘటనల చైతన్యమే, వారి చారిత్రక దృక్పథం అయి ఉంటుంది. మన ప్రాచీనుల మనస్తత్వం, ఆలోచనా ధోరణి, విశ్వాసాలు, కార్యవిధానాలు పాశ్చాత్యుల ధోరణికి భిన్నం కావటం వల్ల, మనవారి చారిత్రక దృక్పథం కూడా భిన్నమేనని, రొమిల్లా థాపర్ అభిప్రాయం. ప్రాచీన భారతీయులు ఇతిహాస - పురాణ సాంప్రదాయాన్ని అనుసరించి చరిత్ర రచన సాగించారనీ, ఈ సాంప్రదాయమే, మధ్య యుగం దాకా భారతీయ చరిత్ర రచనను ప్రభావితం చేసిందనీ, ఆమె పేర్కొన్నారు.

## 13.3 ఇతిహాస - పురాణ సంప్రదాయం

ప్రతి సమాజానికీ గతాన్ని గూర్చిన భావన తప్పక ఉంటుందనే నమ్మకాన్ని, మన చరిత్ర, సంస్కృతులను పూర్తి అవగాహనతో విశ్లేషించగల ప్రసిద్ధ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ వెలిబుచ్చారు. అంటే, ఏ సమాజాన్నీ చారిత్రక దృక్పథం లేనిదని అనకూడదనేది, ఆమె అభిప్రాయం. చారిత్రక దృక్పథం, లేదా భావన అనేది ఆ ప్రత్యేక సమాజానికి ఉపయోగపడి, ఆ సమాజ అవసరాలను తీర్చడానికి పనికొచ్చే కాలక్రమణిక చట్రంలో పొందుపర్చబడ్డ గత సంఘటనల చైతన్యమేనని ఆమె నిర్వచించారు. ఈ దృష్ట్యానే, ప్రాచీన భారతీయులు ఇతిహాస - పురాణ సంప్రదాయాన్ననుసరించి, చరిత్ర రచన సాగించారని రొమిల్లా థాపర్ ప్రతిపాదించారు.

BRAOU

ఈ చరిత్ర రచనా సంప్రదాయాన్ని విశదపర్చే ముఖ్య ఆధారం, సంస్కృత వాఙ్మయం. ఇందులో, 'చరిత్ర' అనే అర్థంలో ఉపయోగింపబడ్డ పదం 'ఇతిహాసం'. ఈ పదానికి నిఘంటు అర్థం 'తొల్లిటి కథ' అని. 'ఆవిధంగా' లేదా 'ఈవిధంగా' అని కూడా చెప్పబడింది. ఇతిహాస సూక్తులుగా వర్ణించబడ్డ శ్లోకాలు కనీసం మూడు, ఋగ్వేదంలో కనిపిస్తున్నాయి. వీటి చారిత్రక ప్రాముఖ్యం అంత వివరంగా తెలియనప్పటికీ, ఈ సూక్తులు ఋగ్వేదంలో చెప్పబడ్డ సందర్భాలను, వీటితోపాటు బ్రాహ్మణాలు, ఉపనిషత్తుల్లో ఇతిహాస పదం వాడబడ్డ సందర్భాలను పరిగణనలోకి తీసుకున్నట్లైతే, ఇది ఒక ఉపయోగకరమైన కథనంగా కనిపిస్తున్నది. అంతేగాక, అంతర్గతంగా దాగి ఉన్న ఏదో అర్థాన్ని వివరించే గత సంఘటనల వర్ణనగా ; గుణపాఠాన్ని బోధించే 'ఆఖ్యాన' లేదా 'ఆఖ్యాయికా' కు భిన్నమైందిగా కూడా కనిపిస్తున్నది.

ప్రయోజనకరమైన కథనంగా ఇతిహాసానికి ఇచ్చిన ఈ అర్థాన్ని , మన రామాయణ, భారత గ్రంథకర్తలు సమగ్రమైన భావనగా మరింత విపులీకరించారు. మన ఇతిహాస సంప్రదాయానికి ప్రతీక మహాభారతం. కౌటిల్యుడు దీన్ని పంచమ వేదంగా పేర్కొన్నాడు. ఈతడు తన అర్థశాస్త్ర గ్రంథంలో, పురాణం, ప్రాచీన ఇతివృత్త సంఘటనలు (Ancient Events), 'ఆఖ్యాయికా కథలు (Anecdotes, Tales), ఉదాహరణాత్మక కథలు (Illustrative Stories), ధర్మశాస్త్రం, అర్థశాస్త్రాలు ఇతిహాసంగా రూపొందాయని పేర్కొన్నాడు. కౌటిల్యుని ఈ వ్యాఖ్యానాన్ని బట్టి , ప్రాచీన కాలంలో చరిత్రకు విద్యల్లో అత్యున్నత స్థానమిచ్చినట్లు, దాని ప్రయోజనం, ప్రాముఖ్యతలను పూర్తిగా ప్రజలు గ్రహించినట్లు విశదమౌతున్నది. అంతేగాక, చరిత్ర విషయ పరిధి నిజానికి సమగ్రమైందనీ, అందులో చారిత్రక వ్యక్తులు, సంఘటనలే కాక, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత, నైతిక సిద్ధాంతాలు, సంప్రదాయాలు, న్యాయ వ్యవస్థ - మొత్తం నాగరికత చోటు చేసుకుందని అర్థమౌతున్నది. కొద్ది కాలంలోనే, చరిత్ర స్పష్టమైన నిర్వచనాన్ని ఈ దిగువ చెప్పినట్లు సంతరించుకుంది.

" ధర్మార్థ కామ మోక్షాణామ్ ఉపదేశ సమన్వితమ్

పూర్వ వృత్తమ్ కథాయుక్తమ్ ఇతిహాసమ్ ప్రచక్షతే "

ఈ విధంగా, మన ప్రాచీన భారతీయులు ధర్మార్థ కామమోక్షాలనే పురుషార్థాలకు సంబంధించిన ఉపదేశంతో కూడినపూర్వ వృత్తాంతాన్ని 'కథల రూపంలో' చెప్పటమే, ఇతిహాసమని నిర్వచించారు. అంటే, మానవ జీవిత విలువలను, ఆ విలువలను జీవితంలో కార్యరూపంలోకి తెచ్చే ప్రయత్నాలను, ప్రజల మేధా సంపత్తికి సంబంధించిన ఘన కార్యాలను నొక్కి చెప్పటం, సమగ్రమైన చారిత్రక హిందువులకు ఆదర్శమైందన్నమాట.

చరిత్ర పట్ల ఈ సమగ్ర దృష్టి చాలాకాలం కొనసాగింది. క్రీ.శ. 9వ శతాబ్ది జైన ఆది పురాణం గ్రంథకర్త అయిన జినసేనుడు " ఇతిహాసం చాలా ఆవశ్యకమైన ఒక అధ్యయన విషయం. ఇది నిజంగా ఏమి జరిగిందనే దానికి సంబంధించింది. దీన్ని ఇతివృత్తం, ఇతిహాసం, ఆమ్నాయం (విశ్వసనీయ సంప్రదాయం) అని కూడా అంటారు. ఇది ఋషులు రూపొందించింది కనుక ఆర్షమని, చక్కని ఆహ్లాదకరమైన ఉపన్యాసాల ద్వారా బోధిస్తుంది కనుక సూక్తమని, ధర్మాన్ని నిర్దేశిస్తుంది కనుక ధర్మశాస్త్రమని కూడా వర్ణింపబడుతున్నది " అని పేర్కొన్నాడు. మన రామాయణ భారతాలే కాక, పురాణాలు, కావ్యాలు, శాసనాలు - మొత్తం ఈ భావననే ఊపిరిగా చేసుకున్నాయి. వీటన్నింటినీ ఈ వెలుగులో అధ్యయనం చేసినప్పుడు మాత్రమే, అర్థవంతంగా అగుపిస్తాయి. ఈవిధంగా, ప్రాచీన భారతీయుల దృష్టిలో, ఇతిహాసమే చరిత్ర.

BRAOU

చరిత్రకు మరో వైపున పురాణం ఉంది.

" సర్గశ్చ ప్రతి సర్గశ్చ వంశో మన్వంతరా నిచ
వంశాను చరితమ్ చైవ పురాణమ్ పఞ్చలక్షణా : "

అంటే, సృష్టి (Creation), ప్రతిసృష్టి (Recreation), వంశం (Divine Genealogies), మన్వంతరం (Ages of Manus), వంశానుచరితం (Genealogies of Kings ) అనేవి, పురాణానికున్న అయిదు లక్షణాలు. వీటిలో పురాణం సాంస్కృతిక చరిత్ర మేళవింపును మనకు వివరిస్తుంది. జీవితంలోని అనేక రంగాల్లో ప్రజలు సాధించిన ఘన కార్యాలను, విలువలను ఈవిధంగా నొక్కి చెప్పటం, భారతదేశంలో ప్రాచీన కాలంలో చరిత్ర రచనకు లక్షణంగా మారింది.

' పురాణం ' అంటే ' పురాతనం ' అని అర్థం. అంటే, ' చాలా రోజుల నాటిది ' అని . వేద కాలం నుండి ప్రచారంలో ఉన్న పాటలను, నారసంసీల (నాయకుల పొగడ్తల) ను, కథాగేయాలను, నాటకీయ వర్ణనలను వివిధ తెగలకు చెందిన పురోహిత కవులు సంకలనం చేసి, సమావేశాల్లో పాడేవారు. ఆదిలో సూతులు, మాగధులు అనే వర్గం వారు దేవతల, రుషుల, వీరుల వంశావళులను జాగ్రత్త చేసి, అవసరమైనప్పుడు వినిపించేవారు. ఈ వంశావళులే, చరిత్ర రచనా సంప్రదాయంలో ముఖ్యమైనవి. ఎందుకంటే, ఇవే చట్టబద్ధమైన హక్కులను, సామాజిక స్థాయిని నిరూపించేందుకు, తెగల గుర్తింపును కాపాడేందుకు, ప్రధానాధారమైనాయి. దీంతో, ఇవి క్రీ.శ. 4వ శతాబ్దంలో క్రోడీకరించబడి, గ్రంథస్థం చేయబడ్డాయి. పురాతన కాలం నాటి సంఘటనలను వివరించేవి కావటం చేత, వీటిని పురాణాలని అన్నారు. ఇటువంటి పురాణాల్లో సాంఘిక, మత విషయాలు, సాంప్రదాయిక చరిత్రలు చోటు చేసుకున్నాయి. ఎప్పుడో జరిగిన విషయాలను వంశపారంపర్యంగా జ్ఞాపకం ఉంచుకున్న సూతులు, మాగధులు గ్రంథస్థం చేయక పోవటంతో, ప్రత్యేకంగా చరిత్ర అనీ, చరిత్రకారులని వేరే ఏర్పడలేదు. సూతులు, మాగధులు చెప్పిన విషయాలను ఎందరో రుషులు గ్రంథస్థం చేయగా ఏర్పడ్డ పురాణాలు, మతపరంగా రచించబడ్డాయి. దీంతో, కాలానుగుణ్యంగా క్రమపద్ధతిలో విషయాలను పొందుపర్చటం జరగలేదు. పర్యవసానంగా, పురాణాల చారిత్రక విలువ పరిమితమైంది.

BRAOU

జీవితంలోని పలు రంగాల్లో ప్రజలు సాధించిన ఘన కార్యాలను, సాంస్కృతిక విలువలను నొక్కి చెప్పటం, ప్రాచీన భారతీయ చరిత్ర లక్షణమైందనే విషయాన్ని పైన చెప్పుకున్నాం. ఈ విధమైన సమగ్ర విశ్వజనీన చారిత్రక దృక్పథం, హిందువుల అసదృశమైన ప్రాపంచిక దృష్టి లేదా చరిత్ర తత్వం నుండి ఆవిర్భవించిందని చెప్పొచ్చు. సృష్టి , స్థితి, లయలకు మూలం ' ఈశ్వరుడనే ' హిందువుల విలక్షణ విశ్వాసాన్నే, వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ భారతాలు, ధర్మశాస్త్రాలు, పురాణాలు చాటుతున్నాయి. ఈ నమ్మకమే, ఒక విశిష్టమైన సంకీర్ణ సిద్ధాంతమేర్పడటానికి దోహదం చేసింది. ఇందులో భాగమైన కల్ప - యుగ, కర్మ, అవతార, వర్ణాశ్రమ, పురుషార్థ సిద్ధాంతాలన్నీ , హిందువుల దృష్టిలో చరిత్రను గతానికి సంబంధించిన ఒక మామూలు గాథగా కాక, వర్తమానంలో జీవిస్తున్న, భవిష్యత్తులో కొనసాగుతుందన్న భావనతో కూడిన అర్థవంతమైన కథనంగా రూపుదిద్దాయి.

ఇతిహాస - పురాణ సంప్రదాయంలో, కట్టుకథ (Myth), వంశావళి (Genealogy), చారిత్రక వివరణ (Historical Narrative) అనే మూడు కీలకమైన విషయాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా, చరిత్ర సమాజంలో ఉన్నత వర్గాల వారి కార్యకలాపాలకు సంబంధించింది కావటంచేత, పుట్టుకను బట్టి మన సమాజంలో అంతస్తులు నిర్ణయించబడటం వల్ల , సామాజిక చలనం (Social Mobility) వ్యక్తిపరంగా కాక, వర్గపరంగా జరగటం వల్లను, వంశావళులకు చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. రాజకీయ సంఘటనలను కాలాన్నిబట్టి

వరుసలో చెప్పటానికి బదులుగా, వంశపారంపర్య క్రమానికి ప్రాముఖ్యమివ్వబడింది. రొమిల్లా థాపర్ చెప్పినట్లు, భారతీయ చరిత్ర రచనా సంప్రదాయంలో, రాజకీయ చరిత్ర ప్రధానమైన విషయం కాదు. అయితే, గుప్తుల తర్వాతి కాలంలో, చారిత్రక వాఙ్మయంలో, రాజకీయ చరిత్రకు ప్రాముఖ్యత వచ్చింది.

## 13.4 బౌద్ధుల, జైనుల చరిత్ర రచన

బౌద్ధుల చరిత్ర రచన మౌలికమని, మాధ్యమికమనీ రెండు రకాలు. సమకాలీన సంఘటనలను ప్రత్యక్షంగా గ్రంథస్థం చేసేది, మౌలిక చరిత్ర రచన. త్రిపిటకాలు ఈ కోవకు చెందుతాయి. బౌద్ధులు త్రిపిటకాల ద్వారా, చరిత్ర రచనాభివృద్ధికి దోహదం చేశారు. బుద్ధుని జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలను, అతని సిద్ధాంతాలకు రూపాన్ని కల్పించిన ప్రసంగాలను, బౌద్ధ సంఘం స్థాపనకు సంబంధించిన సంఘటనలను, ఈ త్రిపిటకాలు తెలియజేస్తున్నాయి. బుద్ధుని సమకాలీన భారతదేశం గురించి, ప్రత్యేకించి ప్రజల సాంస్కృతిక, ఆర్థిక జీవనం గురించి ముఖ్యమైన సమాచారాన్ని ఈ గ్రంథాలు అందిస్తున్నాయి. వీటిలో, ఆయా సందర్భాల్లో మాత్రం, కొన్ని రాజకీయ సంఘటనలూ చోటు చేసుకున్నాయి. ఏ.కె. వార్డర్ చెప్పినట్లు, బౌద్ధ సంఘ స్థాపన గూర్చి వర్ణించటం, ఆ సంఘంలో తర్వాత జరిగిన సంఘటనలను కాలానుగతంగా గ్రంథస్థం చేయటం ద్వారా, వినయ పిటకం వాస్తవానికి బౌద్ధ మత చరిత్రను ప్రారంభించిందని భావించొచ్చు. బుద్ధుని పరినిర్వాణం తర్వాత, ఒక వంద సంవత్సరాలు, ఆపైన సంఘంలో జరిగిన సంఘటనలను కూడా, ఈ రచన వివరించింది.

త్రిపిటకాలతో బాటు, బౌద్ధుల చరిత్ర రచనకు మరో ముఖ్యమైన ఆధారం, అవధానాలు. ఇవి రెండో రకమైన మాధ్యమిక ఆధారం కిందికి వస్తాయి. చరిత్ర నుండి పుక్కిటి పురాణం స్థాయికి మారిన సంఘటనలకు సంబంధించింది, మాధ్యమిక చరిత్ర రచన. అవధానాలు బుద్ధుని గత జన్మకు సంబంధించిన కల్పిత గాథలు. ఇటువంటి వాటిని నమ్మేవారికి ఈ అవధానాలూ, వీటితో బాటు, బుద్ధ చరిత వంటి జీవిత చరిత్రలూ, చరిత్రలో అంతర్భాగమే. ఇక సింహళ బౌద్ధ గ్రంథాలైన 'దీపవంశం', 'మహా వంశం' లు మన ప్రాచీన భారతీయ చారిత్రక సంప్రదాయంతో ముడిపడ్డాయని, రోమిల్లా థాపర్ అభిప్రాయం. ఇవి చరిత్ర పట్ల బౌద్ధుల దృక్పథాన్ని, ముఖ్యంగా, థేరవాద బౌద్ధుల దృక్పథాన్ని విశదం చేస్తాయి.

BRAOU

జైనుల చరిత్ర రచన కూడా, బౌద్ధ చరిత్ర రచయితలు వివరించిన చరిత్ర కాలానికి సంబంధించిందే. అయితే, బౌద్ధ చరిత్రకారులతో పోలిస్తే, వారి మాదిరిగా జైనులు మొట్టమొదటి రచనలను అంతగా భద్రపర్చలేదు. జైనుల చరిత్ర రచనాభివృద్ధిని తెలియజేసే ముఖ్యమైన గ్రంథాల్లో, 'వ్యాఖ్యాప్రిజ్ఞప్తి', 'స్థనంగ', 'సమయవాంగ' మొదలైన వాటిని చెప్పొచ్చు. ఈ గ్రంథాలు చారిత్రక సంఘటనలను కల్పిత గాథల రూపంలోనే వివరించాయి. జైన చరిత్ర రచయితలు హిందువుల రామాయణ మహాభారత గాథలను, తమ సిద్ధాంతాలకు అనుగుణంగా హేతుబద్ధం చేశారు. పద్మ చరిత్ర, హరివంశ పురాణ గ్రంథాల్లో, ఈ ధోరణి కనిపిస్తుంది. దీనికి తోడు, జైన ఆచార్యుల జాబితాలను, గాథలను జోడించటంతో, జైనుల చరిత్ర గ్రంథాల్లో కొంత భారతీయ కాలక్రమణిక చోటు చేసుకుంది.

## 13.5 భారతీయుల చరిత్ర రచన - విశ్లేషణ

భారతీయ చరిత్ర రచనాభివృద్ధిలో మొదటి దశ, ఇతిహాస - పురాణ సంప్రదాయ కేంద్రంగా కొనసాగిందని పైన గమనించాం. క్రీ.శ. ఏడో శతాబ్దం నుండి ముఖ్యమైన తర్వాతి దశ ఆరంభమైంది. ఇతిహాస - పురాణ సంప్రదాయం మరికొంత విస్తృతమైంది. ప్రతి రాజ్యం తన పరిపాలకుల వంశావళిని చాలా జాగ్రత్తగా

భద్రపర్చటమే కాక, చరిత్ర రచనా పద్ధతిలో ' చారిత్రక పురుషుల జీవిత చరిత్రలను రచించటం ' అనే ఒక కొత్త ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి అనేక పరిస్థితులు కూడా కారణమయ్యాయి. చిన్న చిన్న రాజ్యాలు ఎక్కువగా ఏర్పడటంతో, ప్రాంతీయ విధేయత పెరిగి, స్థానిక విశేషాలను గ్రంథస్థం చేయాలనే ఆకాంక్ష ఎక్కువైంది. చిన్న ప్రాంతీయ రాజ్యాల అవతరణతో, చరిత్రకారుని దృష్టి తెగ నుండి ప్రభువు మీదికి, అతని ఆస్థానం వైపుకు మళ్లింది. దీంతో, చరిత్ర రచనా సంప్రదాయంలో సూతులు, మాగధులు మరుగున పడ్డారు. ఆస్థాన కవులకు ప్రముఖ స్థానం లభించింది. క్రీ.శ. 600 - 1200 మధ్య కాలంలో, అనేక మంది రాజుల జీవిత చరిత్రలు గ్రంథస్థమయ్యాయి. అయితే, పురాణాల రచయితలు, జీవిత చరిత్రల గ్రంథకర్తలు ఒకే విధమైన ఆలోచనా ధోరణికి, సామాజిక వ్యవస్థకూ చెందినవారు కావటంతో, రచనా విధానంలో మార్పు కన్పించినా, మౌలిక చట్రంలో పెద్ద తేడా లేదు.

ఆస్థాన కవుల విషయం వచ్చినప్పుడు, ప్రాసంగికంగా శాసన కవుల సేవలను చరిత్ర రచనాభివృద్ధిలో భాగం చేయక తప్పదు. శాసన కవులంటే, ఆయా కాలాల్లో ప్రభువులు సాధించిన ఘన కార్యాలను, వారి వ్యక్తిత్వాలను పొగడుతూ, శాసనాల రూపంలో ప్రకటించిన పాఠాలను రచించిన కవులు. వీరి శాసన పాఠాలు ఒక మాదిరి చిన్న తరహా కావ్యాలే. కావ్య శైలిలో తమ ప్రభువుల ఘనతను ప్రస్తుతించారు. ఈ ప్రశస్తి కావ్యాల్లో, సమకాలీన రాజకీయ సంఘటనలను పేర్కొన్నారు. అనుసరించింది కావ్య శైలి కనక, వివరించిన విషయాలు తమను ఆదరించి, పోషించిన ప్రభువుల గూర్చి కనుక, ఆస్థాన కవుల మాదిరిగానే వీరూ, తమ ప్రభువుల పట్ల భక్తి గౌరవాలను, విధేయత, కృతజ్ఞతలను ప్రదర్శించారు. ఫలితంగా, శాసన పాఠాల్లో అతిశయోక్తులకు తావిచ్చారు. అయినా, హరిసేనుడు (సుమారు క్రీ.శ. 350 నాటి సముద్రగుప్తుని అలహాబాద్ శాసనం), కుబ్జుడు ( క్రీ.శ. 460 నాటి కదంబ శాంతివర్మని తాలగుండ శాసనం), వత్సభటి ( క్రీ.శ. 473 నాటి కుమార గుప్తుని మందసోర్ శాసనం), వాసులుడు ( (క్రీ.శ. 532 నాటి యశోధర్ముని మందసోర్ శాసనం), రవికీర్తి (క్రీ.శ. 634 నాటి రెండో పులకేశి ఐహోల్ శాసనం) మొదలైన కవులు సమకాలీన సంఘటనలను వివరించటంలో, ఎంతో చారిత్రక దృష్టిని ప్రదర్శించారు. ఒక విధంగా, ' చారిత్రక పురుషుల జీవిత చరిత్రలను రచించటం ' అనే ప్రక్రియను వీరే ఆరంభించారని చెప్పినా తప్పు లేదు.

B R A O U

ఇక ఆస్థాన కవుల విషయానికొస్తే, ముందుగా బాణభట్టుని పేరు చెప్పాలి. క్రీ.శ. 7వ శతాబ్దం మొదటి పాదంలో, హర్షవర్ధనుని జీవిత చరిత్రను ' హర్షచరిత ' పేరుతో ఈతడు గ్రంథస్థం చేశాడు. అయితే, దీనిలో సంఘటనలను జరిగిన క్రమంలో వివరించటంగాని, హర్షుని జీవితానికి సంబంధించి పూర్తి వివరాలను ఇవ్వటంగాని జరగలేదు. ఇతర కావ్య రచనల మాదిరిగానే, దీనిలో చరిత్ర, కల్పన రెండూ చోటు చేసుకున్నాయి. కాని, హర్షుడు న్యాయ సమ్మతంగా రాజ్య వారసుడైన విషయాన్ని బాణుడు పాఠకులకు వివరించాడు.

ఆస్థాన కవుల్లో మరో సుప్రసిద్ధుడు బిల్హణుడు. క్రీ.శ. 11వ శతాబ్దంలో కాశ్మీరీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఈతడు, కళ్యాణి చాళుక్య ఆహవమల్ల సోమేశ్వరుని ఆదరణకు పాత్రుడై, ' విద్యాపతి ' బిరుదాన్ని పొందాడు. సోమేశ్వరుని అనంతరం, చాళుక్య సామ్రాజ్యాన్ని పరిపాలించిన అతని కుమారుడు ఆరో విక్రమాదిత్యుని జీవిత చరిత్రను, ' విక్రమాంకదేవ చరిత ' గా గ్రంథస్థం చేసి, కొన్ని చారిత్రక యదార్థాల వాస్తవికతను నిరూపించటానికి దోహదం చేశాడు. బిల్హణుడు చెప్పినట్లు, విక్రమాదిత్యుడు ఆహవమల్లుని ముగ్గురి కుమారుల్లో మధ్యముడు. అతని సోదరుడు రెండో సోమేశ్వరుడు అహంభావ ధోరణి, దుష్పరిపాలనతో ప్రజలకు దూరమవటమే కాక, తమ్ముడు విక్రమాదిత్యునికి వ్యతిరేకంగా శత్రువులతో చేతులు కలిపి ప్రాణహాని తలపెట్టినప్పుడు, దుష్ట శిక్షణ కావించి, విక్రమాదిత్యుడు సింహాసనాసీనుడైన విషయాన్ని వివరంగా బిల్హణుడు

తన గ్రంథంలో పేర్కొన్నాడు. అయితే, ఇతడు పేర్కొన్న విషయాలను ఇతర చారిత్రక ఆధారాలు పూర్తిగా ధృవీకరించటం లేదు. సమకాలీన శాసనాలు రెండో సోమేశ్వరుని సమున్నత వ్యక్తిత్వానికి నివాళులర్పించటం మొదలైన అంశాలే, దీనికి నిదర్శనం. అంటే, విక్రమాదిత్యుని పట్ల ప్రదర్శించిన పక్షపాత ధోరణికి గాను, బిల్హణుని రచనను చరిత్రగా పరిగణించలేం. అయినా, సోదరునికి వ్యతిరేకంగా విక్రమాదిత్యుడు చేసిన యుద్ధాల వంటి కొన్ని చారిత్రక యదార్థాలను, ' విక్రమాంకదేవ చరిత ' తెలియజేస్తున్నది. ఆరో విక్రమాదిత్యుని కుమారుడు భూలోకమల్ల మూడో సోమేశ్వరుడు, తండ్రి తర్వాత సింహాసనమధిష్ఠించాడు. ఇతడు ' మానసోల్లాసం ', 'విక్రమాంకాభ్యుదయం' అనే రెండు రచనలను చేశాడు. వీటిలో మొదటిది, రాజరిక విధులు, వినోదాలపై విజ్ఞాన సర్వస్వం. రెండోది, తండ్రి జీవిత చరిత్రపై అసంపూర్ణ గ్రంథం.

బెంగాల్‌ను పరిపాలించిన పాల వంశీయుల్లో, రామపాలుని కాలానికి సంబంధించిన సంఘటనలను ఆతని ఆస్థాన కవి, సాంధ్యకరనంది ' రామచరిత ' గ్రంథంలో వివరించాడు. రచన ఆరంభంలోనే పాల రాజవంశ ఆవిర్భావం గురించి విషయాలు తెలుస్తున్నాయి. ఈ వంశపారంపర్యతను వివరించటంలో, అతి ప్రకృతివాదం (Super - naturalism) తొంగి చూస్తున్నది. చహమణ రాజవంశ పూర్వ చరిత్రను, పృధ్వీరాజు సాహస కార్యాలను, అతని ఆస్థాన కవి జయనాకుడు ' పృధ్వీరాజ విజయం ' లో ప్రస్తుతించాడు. చాంద్ బర్దాయ్ హిందీ రచన ' పృధ్వీరాజరసో ' కూడా ఈ కాలానిదే. కొన్ని సందర్భాల్లో, అమాత్యుల జీవిత చరిత్రలు కూడా రాయబడ్డాయి. మొత్తం మీద, జీవిత చరిత్రల్లో లౌకిక అధికారం మీద పెరుగుతున్న మోజు వ్యక్తమైంది. ఈ గ్రంథాల్లో, ప్రభువుల పొగడ్తకే ప్రాముఖ్యమిచ్చారు. గ్రంథకర్త ప్రభువు ఆదరణ కోరుకుంటే, ప్రభువు తనకు చరిత్రలో శాశ్వత స్థానం కావాలని అభిలషించాడు. దీంతో, రచనలో కొంత చారిత్రక వాస్తవికత లోపించింది. అయితే ఈ గ్రంథకర్తలకు ఇతిహాస - పురాణ సంప్రదాయంతో పరిచయం ఉందనే విషయం, పురాణాలకు, జీవిత చరిత్రలకు గల సంబంధాన్ని స్పష్టం చేస్తుంది. పురాణాల రచయితలు, జీవిత చరిత్రల గ్రంథకర్తలు ఒకేవిధమైన ఆలోచనా ధోరణికి, సామాజిక వ్యవస్థకూ చెందడంచేత, రచనా విధానంలో మార్పు కనిపించినప్పటికీ, మౌలిక చట్రంలో పెద్ద మార్పు లేదు.

BRAOU

### 13.5.1 కల్హణుడు

ఇతిహాస - పురాణ సంప్రదాయానికి చెందినప్పటికీ, కొంత వరకు భిన్నమైంది ' రాజతరంగిణి ' అనే కాశ్మీర రాజుల చరిత్ర గ్రంథం. ఈ గ్రంథాన్ని రచించిన కల్హణుని జీవితం గూర్చి మనకు తెలిసిన వివరాలు, అతని గ్రంథం నుండి సేకరించినవే. ఉన్నత కాశ్మీరీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కల్హణుడు, కాశ్మీర రాజు హర్షుని ' ద్వారపతి ' (Lord of the gate), లేదా సరిహద్దు రక్షణ దళాలకు అధిపతైన కణ్పకుని ( చంపకుని) కుమారుడు. దురదృష్టవంతుడైన హర్షుడు క్రీ.శ. 1101లో పదవీచ్యుతుడై చంపబడ్డాక, కణ్పకుడు రాజ్య వ్యవహారాల్లో ఎటువంటి ప్రముఖ పాత్రను నిర్వహించినట్లు కనిపించదు. కల్హణుడైనా హర్షుని తర్వాత కాశ్మీరాన్ని పాలించిన రెండో లోహార వంశరాజుల ప్రాపకం కోసం ప్రాకులాడినట్లు సాక్ష్యం లేదు. అయినా, ఆర్థికపరంగా వేరే జీవనాధారం కోసం వెతుక్కోవాల్సిన అవసరం అతనికి లేదనేది, గ్రంథం నుండి స్పష్టంగా మనకు అర్థమౌతున్నది. బ్రాహ్మణ మేధావి వర్గానికి చెందినప్పటికీ, శైవ మతావలంబులైనా కాని కల్హణుడు, అతని కుటుంబ సభ్యులు బౌద్ధ ధర్మంపట్ల స్నేహ భావంతో, సహనంతోనే మెలిగారు. శైవ అధిగామి (Transcendental) అంటే, సాధారణ అనుభవ పరిధులను దాటి, విషయాలను అంతర్లీనంగా మరింత విస్తృత పరిధిలో చూడగలిగే సామర్థ్యానికి సంబంధించిన) సిద్ధాంతాలు, వాటికి సంబంధించిన తాంత్రిక ఆరాధన, ఒక బ్రాహ్మణునిగా అతనికి సుపరిచితం. ధర్మ సిద్ధాంతంలోనూ, అతనికి నమ్మకం వుంది. మత తత్వ జాతీయవాద సంకుచితత్వాన్ని

దరిచేరనీయలేదు. వీరారాధనకు పూనుకోలేదు. అతని భాషా పాండిత్యం, సారస్వత శిక్షణ, కవి - చరిత్రకారునిగా సమర్థవంతమైన పాత్రను నిర్వహించటంలో తోడ్పడ్డాయి. సమకాలీన సంఘటనలను అతడు అర్థం చేసుకున్న తీరు, అతని వైయక్తిక రాజకీయాభిప్రాయాలు అభినందనీయం.

కల్హణుడు 'రాజతరంగిణి ' ని సంస్కృతంలో, ఎనిమిది వేల పద్యాల్లో ఎంతో శోభాయమానంగా క్రీ.శ. 1149లో రచించాడు. ఈ గ్రంథంలో, కాశ్మీర్ చరిత్రను మొదటి నుండి క్రీ.శ. 12 వ శతాబ్దం వరకు సమగ్రంగా లిఖించడం అతని ధ్యేయం. అతడు తన రచనకు ఆధారాలుగా, ప్రాచీన చారిత్రక సంప్రదాయాన్నేకాక, ప్రాంతీయ మత, లౌకిక రచనలను, శాసనాలను, ఇతర చారిత్రక అవశేషాలను కూడా ఉపయోగించుకున్నాడు. 'గతానికి సంబంధించిన సంఘటనలను వర్ణించటంలో పక్షపాతాన్ని వదలి, ఒక న్యాయాధిపతిలా వ్యవహరించగల సామర్థ్యం ఉన్న వ్యక్తే చరిత్రకారుడు ' అని కల్హణుడు తను నమ్మిన ప్రమాణానికి తగ్గట్లే, నిష్పాక్షికంగా రచన చేశాడు. రాజతరంగిణి గ్రంథాన్ని మూడు ప్రధాన భాగాలుగా విభజించొచ్చు. గ్రంథంలోని మొదటి మూడు ప్రకరణాలు ఒక భాగం. ఈ భాగంలో రచయిత ఇతిహాస - పురాణ సంప్రదాయంపై ఆధారపడటం చూడొచ్చు. రెండో భాగమైన తర్వాత మూడు ప్రకరణాల్లో, చారిత్రక యదార్థాలను ధృవపర్చటానికి వీలైన వివిధ ఆధారాలను సేకరించటం కనిపిస్తుంది. ఇక చివరి రెండు ప్రకరణాలను మూడో భాగంగా పరిగణించొచ్చు. ఇందులో, క్రీ.శ. 8వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకు గడచిన చరిత్రను వర్ణించటం జరిగింది. ఈ భాగమే, కల్హణునికి విమర్శనాత్మక దృక్పథం గల చరిత్రకారునిగా గుర్తింపునిచ్చింది.

గ్రంథం ఉపోద్ఘాత పద్యాల్లోనే, కల్హణుడు తాను రచన చేయటానికి అనుసరించిన పద్ధతిని పేర్కొన్నాడు. తన రచనకు ఆధారాలను వివరించటమేకాక, వాటి ప్రామాణికతను కూడా చర్చించాడు. తనకు పూర్వం ఉన్న పదకొండు వంశావళులను (Chronicles) పరిశీలించినట్లు, నీలమత పురాణాన్ని , సువ్రతుని రచనలను, క్షేమేంద్రుని కాశ్మీర రాజుల వంశ చరిత్రను, పురావస్తు ఆధారాలను, రాజ్యాధికార పత్రాలను, మౌఖిక సంప్రదాయాలను ఉపయోగించుకున్నట్లు చెప్పుకున్నాడు. వీటితోబాటు, తనకు వ్యక్తిగతంగా తెలిసిన విషయాలను జోడించాడు. పూర్వ రచయితల సమాచారాన్ని సరైందని అంగీకరించక, అందులో నిజమెంతో తెలుసుకోడానికి విమర్శనా ప్రక్రియను అనుసరించాడు. అందువల్లనే, సువ్రతుని , క్షేమేంద్రుని రచనల్లోని దోషాలను గుర్తించి, వాటిని సరిచేయటానికి ప్రయత్నించాడు. ఈ విషయంలో, కల్హణునిపై గ్రీక్‌ల, లేదా మధ్యాసియా తురుష్కుల చరిత్ర రచనా ప్రభావం పడిందని, కొందరు ఆధునిక చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు. గ్రంథంలో ఆధారాల ప్రామాణికతకు ఇచ్చిన ప్రాధాన్యం దృష్ట్యాను, ముచ్చట గొలిపే రచనా శైలి కారణంగాను, ప్రాచీన భారతీయ చరిత్రకారుల్లో కల్హణునికి, చరిత్ర రచనల్లో ' రాజతరంగిణి ' కి ఒక విశిష్ట స్థానం లభించింది.

అయితే, ' రాజతరంగిణి ' లో కొన్ని లోపాలు లేకపోలేదు. అప్పుడప్పుడు కట్టుకథలను విమర్శనాత్మకంగా పరిశీలించకుండానే, కల్హణుడు వాటిని యధాతథంగా పేర్కొన్నాడు. లలితాదిత్యుడు మూడువందల సంవత్సరాలు పరిపాలించాడనీ, అతడు ఇంద్రుని ఉద్యానవనం నుండి భగవత్ప్రసాదమైన పండును తీసుకొచ్చాడని, వరుణుడు సముద్రాన్ని స్తంభింపచేయటంతో, మేఖవాహనుని సైన్యాలు సింహళంపై దండెత్తాయని చెప్పిన కథలే, దీనికి తార్కాణం. మొదట్లోనే చెప్పినట్లు, కల్హణునికి కర్మ, పూర్వజన్మ సిద్ధాంతాల్లో ఉన్న నమ్మకం, అతని వ్యాఖ్యానాల్లో ప్రతిబింబించాయి. భగవంతుడే చరిత్ర గమనాన్ని నిర్దేశిస్తాడని కూడా, అతడు నమ్మాడు. అతీత శక్తుల మీద ఉన్న నమ్మకం, అతని రచనను అక్కడక్కడ ప్రభావితం చేసింది.

ఏమైనప్పటికీ, చారిత్రక యదార్థత, ముచ్చట గొలిపే రచనా శైలి, కల్హణుని రచనకు విశిష్టతను

BRAOU

చేకూర్చాయి. భారతీయ చరిత్ర రచనా పరిణామం దృష్ట్యా చూస్తే, ' రాజతరంగిణి ' భారతీయ సంప్రదాయ పరిధిలోందే అని, రొమిల్లా థాపర్ అభిప్రాయపడ్డారు. కల్హణునిపై పరోక్ష ప్రభావం ఏదైనా ఉంటే, అది గ్రీక్‌ల, తురుష్కుల రచనా ప్రభావం కాక, బౌద్ధ సంప్రదాయ ప్రభావమేమో పరిశీలించాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు. కల్హణుని తర్వాతి కాలంలో, పశ్చిమ భారతదేశంలోని జైన పండితులు రచించిన ' పరిశిష్ట పర్వణం ', ' ప్రబంధ చింతామణి ' ' హమ్మీర ' మహా కావ్యాలు సంస్కృత భాషలో భారతీయ సంప్రదాయాన్ని కొనసాగించాయి.

ఈవిధంగా, ప్రాచీన భారతీయుల చరిత్ర రచనలు, ఆధునిక రచనలకు చాలా భిన్నమైనవి. ప్రాచీన చారిత్రక సంప్రదాయాన్ని ఆనాటి సామాజిక ఆదర్శం, మత విశ్వాసాలు ప్రభావితం చేశాయి. దీని ఫలితంగా, ఆ సమాజానికి అవసరమైన, ప్రయోజనకరమైన ఇతిహాస - పురాణ సంప్రదాయంలో చరిత్ర రచన సాగింది. దీన్ని బట్టి, ప్రాచీన భారతీయులు చరిత్ర తత్వాన్ని సరిగ్గానే అర్థం చేసుకున్నారని చెప్పొచ్చు.

## 13.6 సంగ్రహంగా

విస్తృతమైన, విమర్శనాత్మకమైన దిశల్లో, సిసలైన చరిత్రను రూపొందించేలా, ప్రాచీన హిందువులకు ఎప్పుడైనా నిజమైన చారిత్రక దృక్పథం ఉందా అనేది, ప్రశ్నార్థకమేనని చెప్పిన ఫ్లీట్ వంటి పండితులు, సమరస భావ దృష్టితో చూడలేదని చెప్పాలి. మన ప్రాచీనుల ఇతిహాస – పురాణ సంప్రదాయ రీతులను వారు గ్రహించలేదు. ప్రాచీన భారతీయులు ధర్మార్థ కామమోక్షాలనే పురుషార్థాలకు సంబంధించిన ఉపదేశంతో కూడిన పూర్వ వృత్తాంతాన్ని కథల రూపంలో చెప్పటమే, ఇతిహాసమని చరిత్రను నిర్వచించారు. చరిత్ర పట్ల ఈ సమగ్ర దృష్టిని మన రామాయణ, భారతాలు, పురాణాలు, కావ్యాలు, శాసనాలు ప్రతిబింబించాయి. కల్హణుని ' రాజతరంగిణి ' కూడా దీనికి ప్రతీకయే.

## 13.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. " ప్రాచీన భారతీయులకు చారిత్రక దృష్టి, చరిత్ర రచనా సాంప్రదాయాలు లేవు". చర్చించండి.
2. ప్రాచీన భారతీయ చరిత్ర రచనపై ప్రభావాన్ని నెరపిన ఇతిహాస - పురాణ సంప్రదాయం గురించి వివరించండి.

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ప్రాచీన భారతీయ చరిత్రకారుల్లో కల్హణుని స్థానాన్ని వివరించండి ?
2. ప్రాచీన యుగంలో సమకాలీన భారతదేశాన్ని ప్రతిబింబించిన బౌద్ధుల, జైనుల చరిత్ర రచనను విశ్లేషించండి.
3. ఆస్థాన కవులలో ముఖ్యమైన బాణుని, బిల్హణుని రచనలను పేర్కొనండి.

## 13.8 ఉపయుక్త గ్రంథాలు

A.K. Warder : **An Introduction to Indian Historiography**

BRAOU

| | | |
|---|---|---|
| V.S. Pathak | : | **Ancient Historians of India** |
| Mukherjee, B.N. | : | **' Ideas of History in Ancient India' ; Article in the Quarterly Review of Historical Studies., Vol. IV.** |
| Kulkarni, Chidambara | : | **Studies in Indian History.** |
| Ghoshal, U.N. | : | **The Beginnings of Indian Historiography and other Essays.** |
| Nilakanta Sastri, K.A. and Ramanna, A.S. | : | **Historical Method in Relation to Indian History** |
| Gopal, S. and Thapar, Romilla | : | **Problems of Historical Writing in India** |
| Thaper, Romilla | : | **The Past and Prejudice** |
| Somnath, Dhar | : | **Kalhana** |
| దుర్గాప్రసాద్ . జె. | : | చరిత్ర రచనా శాస్త్రం |

BRAOU

రచయిత : డా. జాస్తి దుర్గాప్రసాద్

## ఖండం : - IV

# చరిత్ర రచనాభివృద్ధి : మధ్య యుగం

మానవుడు పరిసర వాతావరణం వల్ల ప్రభావితమౌతాడు. భౌగోళిక, నైసర్గిక పరిసరాల దృష్ట్యానే అతణ్ణి, అతడి వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలి. అదేవిధంగా, పరిసరాలు అతని చేతుల్లో ఆకారాన్ని పొందుతాయి. ఈ పరస్పర ప్రభావం చైతన్యవంతమైంది. రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో మానవుడు చురుకుగా సాధించే విజయాలు, ఆ చైతన్యం నుండి వచ్చేవే. పరిసరాల వల్లే కాకుండా, తాను జీవించే కాలం వల్ల కూడా, మానవుడు ప్రభావితమౌతాడు. చరిత్ర సారం, లేదా తత్వం ఈ కాలం అనే విషయం పైనే ఆధారపడి ఉంది. చరిత్ర గతం, వర్తమానం, భవిష్యత్తుల్లో ఆనందంగా సాగే వాహిని. కాలం పరిణామశీలమైంది. ప్రకృతి, మానవుడు ఎప్పుడూ ఈ మార్పుకు లోనౌతూనే ఉంటారు. మార్పులేని, శాశ్వతమైన విలువలను సంతరించుకునే సిద్ధాంతం కాని, ఆశయం కాని, సంస్థ కాని ఉండవనే విషయాన్ని, చరిత్ర తేటతెల్లం చేస్తున్నది. ఈ కాలమే, చరిత్రకు అవిచ్ఛిన్నతను కలిగిస్తున్నది. ముందే చెప్పినట్లు, చరిత్ర నిరాటంకంగా సాగే అనంత వాహిని. అయితే, చరిత్రకారుడు మాత్రమే గతం, వర్తమానం, భవిష్యత్తులని కాలాన్ని విభజిస్తున్నట్లే, చరిత్రలో వచ్చిన మార్పులను వివరించటానికి తన సౌలభ్యం కోసం, గతాన్ని ప్రాచీన యుగమని, మధ్య యుగమని, ఆధునిక యుగమనీ, లేదా శకాలనీ విభజన చేస్తున్నాడు. చరిత్ర అనేది, కాల గతిలో మానవులు సాధిస్తున్న అభివృద్ధి క్రమమే.

చరిత్రలో వచ్చిన పరిణామాలను వివరించటానికి యుగాలనీ, శకాలని చరిత్రకారుడు గతాన్ని తన సౌకర్యం కోసం విభజించటం, ఆయా పరిణామాలకు అతడు ఆపాదించే ప్రాధాన్యతలపై ఆధారపడి ఉంది. ప్రాదేశిక పరిస్థితుల్లో వచ్చిన పరిణామాల ప్రభావాన్ని చరిత్రకారులు ఎవరికి తోచిన, లేదా వచ్చిన రీతిలో వారు అంచనా వేస్తారు. రాజకీయ సంఘటనలు ఇతర రంగాల్లో వచ్చే పరిణామాలకు కారణం కావటంచేత, చరిత్రకారులు ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొనే యుగ విభజన చేయటం, సర్వసాధారణంగా చరిత్ర రచనలో మనకు గోచరిస్తుంది. పరిణామాలను విశ్లేషించి, ప్రాధాన్యతలను ఆపాదించి వ్యాఖ్యానించటంలో, చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం కనిపించదు. కనకనే, ఐరోపా చరిత్ర గ్రంథాల్లో కాని, భారతదేశ చరిత్ర గ్రంథాల్లో కాని, మధ్య యుగం ఎప్పుడు ఆరంభమవుతున్నది, ఎప్పుడు ముగుస్తున్నది అనే విషయంలో, వారు భిన్నాభిప్రయాలను వ్యక్తం చేశారు. ఉదాహరణకు, ఐరోపా చరిత్రలో క్రీ.శ. 476లో రోమన్ సామ్రాజ్యం పతనం అవటంతో, మధ్య యుగం ఆరంభమైందనీ అనుకున్నట్లైతే, ఈ యుగం క్రీ.శ. 1453లో తురుష్క పాలకుడు రెండో మహమ్మద్ కాన్‌స్టాంటినోపిల్‌ని ఆక్రమించటంతో ముగుస్తుందని కొంతమంది భావించారు. మరి కొంత మంది క్రీ.శ. 1492లో ఇటలీ దేశస్థుడు కొలంబస్ భారతదేశానికి కొత్త సముద్రమార్గం కనిపెట్టాలనే ఉద్దేశంతో చేపట్టిన నౌకాయానం, కొత్తగా అమెరికా ఖండాన్ని కనుగొనటానికి దారితీసిన సంఘటనతో ముగుస్తుందని, అదే, ఆధునిక యుగానికి నాంది అని చెప్తారు.

అలాగే , భారతదేశ చరిత్రలో క్రీ.శ. 712 లో జరిగిన అరబ్బుల సింధు దండయాత్రతో, మొదటిసారిగా మహమ్మదీయుల పాలన ఆరంభమవటాన్ని మధ్య యుగానికి నాందీగా కొందరు చెప్తుంటే, మరి కొందరు క్రీ.శ.

BRAOU

1206 లో కుతుబుద్దీన్ ఐబక్ సుల్తానై, ఢిల్లీని రాజధానిగా చేసుకొని పాలించటాన్ని సంకేతంగా తీసుకుంటున్నారు. ఈ మధ్య యుగం మొగల్ సామ్రాజ్య పతనంతో ముగుస్తుందని, లేదా వ్యాపారం నిమిత్తం ఇక్కడికి ఐరోపా వాసుల రాకతో మధ్య యుగం ముగిసి, ఆధునిక యుగం ఆరంభమౌతుందని చరిత్రకారులు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. ఇదేవిధంగా, మన ఆంధ్ర దేశ చరిత్రలోనూ, యుగ విభజనకు భిన్న వ్యాఖ్యానాలు వెలువడ్డాయి.

అయితే, చరిత్ర రచనాభివృద్ధిని పరిగణనలోకి తీసుకుంటే, పైన చెప్పిన యుగ విభజనకు ప్రాతిపదిక అయిన రాజకీయాలు, ఇతర కారణాలు చాలా వరకు ఇక్కడ సరిపోవు. చరిత్ర రచనాభివృద్ధిని యుగాల వారీగా వివరించటమంటే, ఆయా దశల్లోని రచనా సంప్రదాయాలే దీనికి ప్రాతిపదికలౌతాయి. ఉదాహరణకు, ఐరోపాలో ప్రాచీన యుగానికి సంబంధించిన చరిత్ర రచనాభివృద్ధిని వర్ణించడమంటే, సర్వోత్కృష్టమైన, ప్రామాణికమైన గ్రీకో - రోమన్ సంప్రదాయ రీతులననుసరించి జరిగిన చరిత్ర రచనలను సమీక్షించటమే ఔతుంది. అదే మధ్య యుగం విషయానికి వస్తే, అటు ఐరోపాలోను, ఇటు పశ్చిమాసియాలోను గ్రీక్‌ల వివేచనాత్మక ధోరణికి, రోమన్ల రాజకీయ సంఘటనలు, ప్రముఖ వ్యక్తుల వర్ణనాత్మక జాబితాల సరళికి భిన్నంగా, మనిషి మేధస్సుపై మతం పట్టును ప్రతిబింబించిన క్రైస్తవుల, అరబ్బుల రచనా సంప్రదాయాలను పేర్కొనాలి. చరిత్రలో వచ్చే మార్పులకు అతీత శక్తుల్ని కారణభూతం చేస్తూ, ఒక తాత్త్విక ధోరణిలో ఆ మార్పుల్ని వివరించే ప్రయత్నం, ఈ రచనా సంప్రదాయాలననుసరించి వెలువడ్డ చరిత్ర గ్రంథాల్లో కనిపిస్తుంది. దాదాపు, క్రీ.శ. 3,4 శతాబ్దాల్లో ప్రారంభమైన ఈ ధోరణి ఎప్పటిదాకా సాగింది, లేదా మధ్య యుగం ఎప్పుడు ముగుస్తుందీ అంటే, మనిషిలో వివేచన తట్టి లేపిన సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం ఐరోపా వైజ్ఞానిక, సామాజిక, సారస్వత, కళారంగాలపై అనూహ్యమైన ప్రభావాన్ని చూపించడంతో, ఈ ప్రభావం చరిత్ర రచనలపైనా ప్రసరించటంతో, ఆధునిక యుగం ఆరంభమైందనీ, అదే మధ్య యుగానికి ముగింపనీ చెప్పొచ్చు.

ఇక, భారతదేశానికి సంబంధించినంతవరకు చరిత్ర రచనల్లో ఇతిహాస - పురాణ సంప్రదాయం ప్రతిబింబించిన కాలం ప్రాచీన యుగం, శాసన కవుల స్తుతులు, సూక్తులు, మాగధుల స్తోత్రాలు, ఆస్థాన కవులు రచించిన ప్రభువుల జీవిత చరిత్రలు, కల్హణుని ' రాజతరంగిణి ' వంటి వంశావళులు, ఇంచుమించు, క్రీ.శ. 15వ శతాబ్దం వరకూ సంస్కృత, ప్రాంతీయ భాషల్లో వెలువడ్డ రచనలు, ఆ సంప్రదాయాన్ని విస్తృత పరిధిలో ప్రతిబింబించేవే. ఇస్లాం మతం, పరిపాలనా వ్యవస్థలు భారతదేశంలో చరిత్ర రచనా విధానాన్ని, సంప్రదాయాన్ని గాఢంగా ప్రభావితం చేసిన కాలాన్ని చరిత్ర రచనాభివృద్ధిలో, మధ్య యుగంగా తీసుకోవచ్చు. భారతదేశానికి ఐరోపా వారైన పోర్చుగీస్‌లు, డచ్‌వారు, ఆంగ్లేయులు, ఫ్రెంచ్‌వారు రావటంతో, భారతీయ చరిత్ర రచనా సంప్రదాయానికి సంబంధించిన, దృక్పథంలో, పరిభాషలో, రచనా వస్తువు ఎంపిక విధానంలో మౌలికమైన మార్పు వచ్చింది. రచనాభివృద్ధిలో ఆధునిక యుగానికిది నాంది పలికింది.

ఈ ఖండం లోని **14,15,16** భాగాల్లో ఐరోపా, పశ్చిమ ఆసియా, భారతదేశాల్లో మధ్య యుగంలో చరిత్ర రచనా సాంప్రదాయ రీతులను గూర్చి విశ్లేషించబడింది.

BRAOU

# భాగం - 14 : మధ్య యుగం : ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి

విషయ క్రమం


14.0 లక్ష్యాలు

14.1 పరిచయం

14.2 క్రైస్తవుల చరిత్ర రచన

14.2.1 తొలి క్రైస్తవ చరిత్రకారులు

14.2.2 సెయింట్ అగస్టీన్ ( క్రీ.శ. 354 - 430)

14.2.3 ఇతర క్రైస్తవ చరిత్రకారులు

14.2.4 క్రైస్తవ రచనల్లో కన్పించే కొన్ని అంశాలు

14.3 లౌకిక చరిత్ర రచనలు

14.4 సంగ్రహంగా

14.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

14.6 ఉపయుక్త గ్రంథాలు


## 14.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- క్రీ.శ. 3వ శతాబ్దం నుండి ఐరోపాలో మానవతీత శక్తులు, క్రైస్తవ మత ధర్మ ప్రభావాన్ని ప్రతిబింబించిన చరిత్ర రచనలను పరిశీలించగలగాలి.
- గోథుల చేతుల్లో రోమన్ సామ్రాజ్యం ఏవిధంగా ఛిన్నాభిన్నం అయిందో వివరించిన అగస్టీన్ రచనలను విశ్లేషించగలగాలి.
- మధ్య యుగంలో వెలువడ్డ లౌకిక చరిత్ర రచనలను గూర్చి వివరించగలగాలి.

## 14.1 పరిచయం

ప్రాచీన కాలంలో గ్రీకుల చేతుల్లో, చరిత్ర రచనలో వివేచనాత్మకత పెద్ద పీట వేసుకుంది. అనంతరం, రోమన్ల చేతుల్లో చరిత్ర రాజకీయ సంఘటనల, వ్యక్తుల వర్ణనాత్మక జాబితా అయింది. ఆ తర్వాత, వేయి సంవత్సరాల కాలంలో, చరిత్ర రచనా సంవిధానంలో మత విశ్వాసానికి ఉన్నతాసనాన్ని వేశారు. క్రీ.శ. 310లో కాన్‌స్టాంటిన్ చక్రవర్తి క్రైస్తవాన్ని అంగీకరించటంతో, ఐరోపా మొత్తం క్రైస్తవ ప్రపంచం (Christendom) గా మారింది. దీంతో, కనిపించే ప్రతిదీ భగవత్ప్రణాళికలో భాగమైంది. చారిత్రక పరిణామం మొత్తం విశ్వ ప్రణాళిక



BRAOU

ఫలితమని, మానవుడు అతీత శక్తుల ముందు నిస్సహాయుడన్న నమ్మకం హెచ్చింది. ఇదే, ఆనాటి చరిత్ర రచనల్లోను ప్రతిబింబించింది.

## 14.2 క్రైస్తవుల చరిత్ర రచన

ప్రాచీన కాలంలో వస్తుతత్వాన్ని సంపన్నం చేసుకొని, అన్ని ప్రధాన లక్షణాలను సంతరించుకొని, గ్రీక్‌ల చేతుల్లో చరిత్ర మానవ దార్శనికంగా, హేతుబద్ధంగా రూపొందగా, రోమన్ల చేతుల్లో రాజకీయ సంఘటనల, ప్రముఖ వ్యక్తుల వర్ణనాత్మక జాబితాకు కుదించబడగా, క్రీ.శ. 3వ శతాబ్దం నుండి అతీత శక్తుల ప్రభావానికి, లేదా క్రైస్తవ ధర్మ ప్రభావానికి లోనైంది. గ్రీక్‌ల చరిత్ర రచనల్లో పెద్ద పీట వేసుకున్న వివేచనాత్మకత, లేదా విమర్శనాత్మకత పూర్తిగా అడుగంటింది. దీని స్థానంలో, క్రైస్తవులు మానవాతీత శక్తుల్లో ప్రగాఢ విశ్వాసాన్ని పెంపొందించటమే, ప్రధాన ఉద్దేశంగా రచనలను సాగించారు. క్రీ.శ. 310లో కాన్‌స్టాంటైన్ చక్రవర్తి క్రైస్తవ మతాన్ని అంగీకరించటంతో, మొత్తం ఐరోపా క్రైస్తవ ప్రపంచం (Christendom) గా మారిపోయింది.

మంచిగానో, లేదా చెడ్డగానో కన్పించే ప్రతిదీ భగవంతుని ప్రణాళికనే పొడవైన గొలుసులో కొక్కెమనే క్రైస్తవుల భావన, వారి చరిత్ర రచనా విధానానికి మూలమైంది. వారికీ అరబ్బులు, యూదుల మాదిరిగానే, ఎక్కువ చారిత్రక పరిజ్ఞానమే ఉన్నప్పటికీ, అది మత అవసరాలకు పరిమితం చేయబడింది. వారు చరిత్ర ప్రక్రియను భగవంతుడు, మానవుడు పాల్గొన్న గొప్ప విశ్వ ప్రణాళికని నమ్మారు. దైవం చేత సృష్టింపబడ్డ మానవుని చేతిలో ఏమీ లేదని, అతడు అతీత శక్తుల చేతిలో కీలు బొమ్మ అనీ, చారిత్రక పరిణామమంతా విశ్వ ప్రణాళికలో భాగమేనని, కనక మానవుడు భూమి మీద అడుగు పెట్టినప్పటి నుండి మోక్షం పొందేవరకు జరుగుతున్న ప్రక్రియను, చరిత్ర అధ్యయనం చేస్తుందని భావించారు. సెయింట్ అగస్టిన్ ఈ చారిత్రక ప్రక్రియను మంచి, చెడ్డల మధ్య, స్వర్గ, నరకాల మధ్య సంఘర్షణగా చిత్రించాడు. దాదాపు పది శతాబ్దాలు క్రైస్తవ చరిత్రకారులు రచనా రంగాన్ని ఏలారు. ఈ రచయితల్లో ప్రతి ఒక్కరూ చర్చిలో ఏదో ఒక పదవిని అలంకరించినవారే. క్రైస్తవేతరుల రచనలు, 14వ శతాబ్దం వరకూ కనిపించవు.

పేగన్ల ( క్రైస్తవేతరులను క్రైస్తవులు పిలిచే పేరు) రచనలు, యూదుల రచనల కంటే ఉన్నతమైనవే. అయినప్పటికీ, క్రైస్తవులు వాటిని సైతాన్ సృష్టిగా భావించి, నిరాకరించారు. ' పాతనిబంధన 'కు గౌరవ స్థానాన్నిచ్చారు. చరిత్రకు క్రీస్తు జననాన్ని కేంద్ర బిందువుగా చేశారు. ఇతర సంఘటనల్నీ దీని చుట్టూ అల్లారు. ఈ మతపరమైన దృక్పథంతో, చరిత్ర రచనకు ముఖ్యమైన ఆధారాలను విమర్శనాత్మకంగా పరిశీలించటం మాని, వాటిలో అంతరార్థాన్ని వెతికే ప్రయత్నం చేశారు. మత వాఙ్మయానికి అనుగుణంగా, చారిత్రక వ్యాఖ్యానాన్ని భావోపదేశం (Allegorise) చేయడానికి ప్రయత్నించారు. గ్రిగొరి (Gregory) , ఇసిడోర్ (Isidore) ల రచనలే, దీనికి చక్కని ఉదాహరణ. చరిత్ర ఆధారాలను ఈ రచయితలు, ' పవిత్రం ', ' అపవిత్రం ' అని రెండు భాగాలుగా విభజించారు. మతానికి సంబంధించిన ఆధారాలు పవిత్రమనీ, లౌకిక విషయాలను తెలియజేసేవి అపవిత్రమనీ భావించారు. దైవిక, అలౌకిక సాధనాల ద్వారా జరిగే అద్భుతాల (Miracles) కు ప్రాధాన్యతనిచ్చారు. యూదుల పవిత్ర గ్రంథాలను అధికార రికార్డులుగా గుర్తించాక, క్రైస్తవ చరిత్రకారులు తమ ధర్మానికి చారిత్రక నేపథ్యాన్ని సమకూర్చటం కోసం, పేగన్లు నిరాకరించిన గౌరవ స్థానాన్ని కల్పించటం కోసం, గత చరిత్రను అధ్యయనం చేశారు.

BRAOU

### 14.2.1 తొలి క్రైస్తవ చరిత్రకారులు

చరిత్రను కాలానుగతంగా వివరించే ప్రయత్నం చేసిన మొదటి క్రైస్తవ రచయిత, ఆఫ్రికానస్ (క్రీ.శ. 180 - 250). ఇతడు రాసిన ' క్రోనో గ్రాఫియా ' అనే గ్రంథంలో, ప్రపంచ కాల పరిమితి క్రీస్తుకు పూర్వం 5499 సంవత్సరాలని, క్రీస్తు జననం తర్వాత, మరో 500 సంవత్సరాలు మనగలుగుతుందని చెప్పాడు. తన గ్రంథ రచనకు ఇతడు మెనెథో, బెరోసాస్, అపోల్లో డోరస్, జస్టస్ మొదలైన పూర్వ రచయితల రచనలను ఉపయోగించుకున్నాడు. చర్చి చరిత్రకు మూల పురుషునిగా యూసేబియస్ పాంఫిలస్ (Eusebius Pamphilus) (క్రీ.శ. 260 - 340)ని పేర్కొంటారు. ఇతని రచనల్లో, ' క్రైస్తవ మత చరిత్ర ' (Ecclesiastical History) ముఖ్యమైంది. దీన్ని కథనంగా కంటే, చరిత్రాధారాల సమీకరణమనొచ్చు. అయితే, అపారంగా ఉన్న రచనా సామగ్రి నుండి ఆధారాలను, యదార్థాలను ఎన్నుకోటంలో, నిజమైన చారిత్రక ప్రవృత్తిని ప్రదర్శించాడు.

### 14.2.2 సెయింట్ అగస్టీన్ ( క్రీ.శ. 354-430)

క్రైస్తవ చరిత్రకారులందరిలోకి ప్రసిద్ధుడైన సెయింట్ అగస్టీన్ ధార్మికుడు, తత్వవేత్త, ఉపాధ్యాయుడు, కవి, రాజనీతివేత్త కూడా. ప్రాచీన కాల పేగన్ల ప్రభావం పోయి, క్రైస్తవ మతం మధ్య యుగంలో అడుగుపెడుతున్న సంధి కాలంలో, ఇతడు జీవించాడు. ఉత్తర ఆఫ్రికాలో మధ్యధరా ప్రాంతంలో, ' తెగాస్టె ' లో రోమన్ కుటుంబంలో జన్మించిన ఇతడు, కార్తేజ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశాడు. మత గ్రంథాల వైపు దృష్టి మళ్లించటానికి ముందు, సాహిత్య మీమాంసలో శిక్షణ పొందాడు. మిలాన్ విశ్వవిద్యాలయంలో, సాహిత్యాచార్యుడుగా పనిచేశాడు. ఆంబ్రోజ్ మత బోధలు ఇతణ్ణి ఆకర్షించాయి. దీంతో, తన జీవితాన్ని చర్చికి అంకితం చేశాడు. హిప్పో బిషప్‌గా పనిచేశాడు.

మత ధర్మం, తాత్విక చింతనలో అగస్టీన్ అనుసరించిన మార్గం విశిష్టమైంది. ఒక ప్రక్క భగవంతునికి ఆత్మార్పణం కావించుకుంటూ, మరో ప్రక్క క్రైస్తవ మత సంస్థకు తన్ను తాను అంకితం చేసుకోటం, ఇతనిలో కనిపిస్తుంది. పవిత్ర బైబిల్ గ్రంథాన్ని కాపాడ్డానికి, వ్యాఖ్యానించటానికి భగవద్దత్తమైన అధికారం ఉన్న సంస్థగా, భగవదనుగ్రహ భూమిగా, పరివర్తనను అలవర్చే శిక్షణా కేంద్రంగా, చర్చి సంస్థను ఇతడు పరిగణించాడు. ఇతని విశుద్ధ వర్తనంలో ముఖ్య లక్షణం, ఈయన సాక్షాత్కార అనుభవం (Mysticism). తన ఆత్మకు భగవంతునితో గల సంబంధం గూర్చి, విస్పష్టమైన జ్ఞానాన్ని ఇతడు సాధించాడు. మానవుని శక్తి చాలా పరిమితమని, దేవుడే మనల్ని నడిపిస్తాడని భావించాడు. మానవాత్మకు దేవునితోనే విశ్రాంతి లభిస్తుందని, ఆత్మ జరిపే సుదీర్ఘ యాత్రకు గమ్యం దేవుడేనని చెప్పాడు.

అగస్టీన్ రాసిన గ్రంథాల్లో, ' భగవన్నగరం ' (The City of God), ' స్వపాపనివేదన ' (Confessions) అత్యంత ప్రధానమైనవి. ' భగవన్నగరం ' చరిత్ర గ్రంథం కాకపోయినప్పటికీ, చరిత్రను ఎలా రాయాలో తెలియజేస్తుంది. రోమ్ గత వైభవానికి కారణమైన దైవం పట్ల గౌరవం, ధార్మిక చింతన లేకపోవడం వల్ల, గోథుల (Goths) చేతుల్లో రోమన్ సామ్రాజ్యం ఛిన్నాభిన్నం అయిందని సమర్థించటానికి, అగస్టీన్ ఈ గ్రంథ రచన, క్రీ.శ. 413 లో చేపట్టాడు. మొత్తం 22 భాగాల్లో దీన్ని పూర్తి చేశాడు. ఇందులో, పేగన్ల విమర్శలను ఖండిస్తూ, క్రైస్తవ మతాన్ని సమర్థించాడు. చర్చిని సమర్థించటానికి చరిత్రాధారాలను ఉపయోగించుకున్నాడు. అశాశ్వతమైన ఐహిక రాజ్యం కన్నా, శాశ్వతమైంది ఆముష్మిక రాజ్యమైన ' భగవన్నగరం ' అని, అదే, ఈ లోకంలో క్రైస్తవ చర్చి అని గట్టిగా నమ్మాడు.

క్రైస్తవ ధార్మిక గ్రంథాల ఆధారంతో, అగస్టీన్ తన అభిప్రాయాలను ఏర్పర్చుకొన్నాడు. ప్లేటో ధర్మ

BRAOU

సిద్ధాంతం, సిసిరో విశ్వమానవ సమాజ భావన, స్టాయిక్ మార్గం వారి విశ్వమానవ సౌభ్రాతృత్వం కూడా, ఇతనిపై ప్రభావాన్ని కనపర్చాయి. సంఘటనలను జరిగినవి జరిగినట్లుగా చెప్పటం కాక, తన పథకానికి ఇమిడేలా వాటిని మలచుకోటం, ఎంతో ప్రసిద్ధి పొందిన ' భగవన్నగరం 'లో చరిత్ర దృష్ట్యా చూస్తే, కనిపించే ముఖ్యమైన లోపం.

### 14.2.3 ఇతర క్రైస్తవ చరిత్రకారులు

అగస్టీన్‌తోబాటు జెరోమ్, ఒరోషియస్‌ల రచనలు కూడా, క్రైస్తవ చరిత్ర రచనాభివృద్ధికి తోడ్పడ్డాయి. జెరోమ్ క్రీ.శ. 391లో రచించిన ' ఎక్లీసియాస్టిసిస్ ' (Ecclesiasticis) లో మొదటి నుండి తన కాలం వరకు, నూట ముప్పై ఐదుగురు క్రైస్తవ రచయితల జీవిత చరిత్రలను తెలియజేశాడు. అయితే, యూసేబియస్ పాంఫిలస్ ' వంశచరిత్ర ' (Chronicle) గ్రంథానికి ఇతడు తన ధోరణిలో చేసిన అనువాదం, మధ్య యుగ, చర్చి చరిత్రలకు ఒక నమూనాగా రూపొందింది. ఒరోషియస్ (క్రీ.శ. 380 - 420) అగస్టీన్ శిష్యుడు. తన గురువు మత భావాల ప్రభావం అతనిపై కన్పిస్తుంది. అతని ' పేగన్ల వ్యతిరేక సప్త చరిత్ర గ్రంథాలు', (Seven Books of History Against the Pagans) లో, ముందుగా తనకున్న పరిజ్ఞానంతో ప్రపంచ భౌగోళిక స్వరూపాన్ని వర్ణించి, తర్వాత సృష్ట్యాదినుండి మానవుని చరిత్రను, బాబిలోనియన్ చరిత్రను, గ్రీస్ - మాసిడోనియాల చరిత్రను, రోమన్ చరిత్రను ( ముఖ్యంగా ప్రబలమౌతున్న క్రైస్తవ చర్చితో రోమ్ అనుబంధాన్ని) వివరించాడు.

### 14.2.4 క్రైస్తవ రచనలలో కనిపించే కొన్ని అంశాలు

ఈ క్రైస్తవ రచనలన్నింటిలో, సర్వసాధారణంగా కొన్ని విషయాలు కనిపిస్తున్నాయి. క్రైస్తవ చరిత్రకారులు ఏసు ప్రభువు రెండో ఆగమనం గల భవిష్యత్తుకి ప్రాధాన్యతనిచ్చారు. చరిత్ర స్వభావ రీత్యా విశ్వజనీనమని, ప్రక్రియ చర్యగా కాక దైవేచ్ఛయని నమ్మారు. వీరి దృష్టిలో దైవం తప్ప మరేదీ శాశ్వతం కాదు. వీరి రచనలు పూర్తిగా మతపరంగా రాయబడ్డాయి. వివేచన కనుమరుగైంది. విమర్శనూ, మానవునికి సంబంధించిన విషయాల్లో ఆసక్తిని వదలి, చరిత్ర మధ్య యుగంలో మతపరమైన, విశ్వజనీన లక్షణాన్ని సంతరించుకొంది. ఈ రకమైన దృక్పథం, కేవలం మధ్య యుగానికే పరిమితం కాలేదు. మత సంస్కరణోద్యమ కాలంలోనూ ప్రభావాన్ని చూపించింది. అంతేగాక, ఆధునిక శాస్త్రీయ పద్ధతిని ఆవిష్కరించిన జర్మన్ చరిత్రకారుడు నీబూర్ (Neibuhr), బటర్ ఫీల్డ్ వంటి వారు కూడా, చరిత్రను ఈ ధోరణిలోనే వ్యాఖ్యానించారు. అయితే, ఆ మత దృక్పథాన్ని మరీ సాగదీస్తే, చరిత్ర నియతవాదానికి పరిమితమై, పరిశోధన అనే అర్థాన్నే కోల్పోయే ప్రమాదం ఉంది.

BRAOU

## 14.3 లౌకిక చరిత్ర రచనలు

ఐరోపా చరిత్ర రచనాభివృద్ధిలో మధ్య యుగ చివరి దశలో, లౌకిక చరిత్ర రచనలు కూడా వెలువడ్డాయి. ఇటలీని పాలించిన ఆస్ట్రో గోథుల రాజు థియొడోరిక్ వద్ద ఉన్నతోద్యోగిగా పనిచేసిన కాసియోడోరస్ ( క్రీ.శ. 480 - 570 ) రచించిన 'వేరియె ' (Variae), ' గోథుల చరిత్ర ' (History of the Goths) గ్రంథాలు, ఈ కోవలోకి వస్తాయి. ఇందులో, ' వేరియె ' ప్రభుత్వ పత్రాల లేఖల సంకలనం. అయితే, ఆస్ట్రో గోథుల రాజ్యానికి సంబంధించిన ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులను తెలుసుకోడానికి ఉపయుక్తమైన సమాచారాన్నిస్తున్నది. 12 భాగాల్లో రాసిన ' గోథుల చరిత్ర ' మూల గ్రంథం మనకిప్పుడు లభించటం లేదు. చరిత్రకారుడిగా కాసియోడోరస్ కంటే, ప్రకోపియస్ ( క్రీ.శ. 500 - 565) మిన్న. ప్రసిద్ధ బైజాంటైన్ సేనాని బెలిసేరియస్‌ని వెన్నంటి ఉండిన ఈతడు, బెలిసేరియస్ అనేక దాడుల గూర్చి విశ్వసనీయమైన వర్ణనను గ్రంథస్తం చేశాడు. ముఖ్యంగా, ఆధారాలను ఉపయోగించుకోటంలో, చాలా జాగ్రత్త వహించాడు. కాని, బైజాంటైన్ సామ్రాజ్యం పట్ల అభిమానాన్ని

ప్రదర్శించకుండా ఉండలేక పోయాడు. 'ఫ్రాంకుల చరిత్ర' అనే గ్రంథంలో, రచయిత గ్రెగొరి (క్రీ.శ. 532 - 594) సమకాలీన సంఘటనలను గూర్చి ప్రత్యక్ష సమాచారాన్నిచ్చాడు. పూర్వ చరిత్ర విషయంలో, తానే ఆధారాల నుండి సమాచారాన్ని స్వీకరించాడో వాటిని స్పష్టంగా పేర్కోటం, ఇతనిలో మెచ్చదగ్గ విషయం. ఇంగ్లాండ్‌లో క్రైస్తవ మత ప్రాబల్యం గురించి, ఆంగ్లో - సాక్సన్ సంస్కృతి స్థాపన గురించి, బీడ్ (Bede) (క్రీ.శ. 672 - 735) 'ఆంగ్ల ప్రజల క్రైస్తవ మత చరిత్ర' (Ecclesiastical History of the English People) లో చక్కగా వివరించాడు. లొంబార్డుల చరిత్రను వార్న్ ఫ్రైడన్ (క్రీ.శ. 730 - 800), షార్లమాన్ చక్రవర్తి (క్రీ.శ. 742 - 874) జీవితాన్ని ఈజిన్‌హార్డ్ (Eigenhard), అతని మనవళ్ళ మధ్య అంతర్యుద్ధాలను నిథర్డ్ (Nithard) లు గ్రంథస్థం చేశారు.

షార్లమాన్ పరిపాలన ముగిసిన తర్వాత, క్రీ.శ. 9, 10 శతాబ్దాల నుండి కొత్త రకం చరిత్ర రచనలు వెలువడ్డాయి. వీటిలో సంవత్సర క్రమంలో జరిగిన సంఘటనలను వర్ణించే 'పంచాంగం పట్టీ లాంటి చరిత్ర' (Annals) ఒక రకం అయితే, ఒక ప్రదేశానికి సంబంధించిన సంఘటనలను వర్ణించే, లేదా ఒక ప్రత్యేక అంశాన్ని నిర్థారించే, 'వంశ చరిత్రలు' (Chronicles) మరో రకం. వంశ చరిత్రలు సాధారణంగా, వాటి రచయితల సమకాలిక సంఘటనలను సంవత్సర క్రమంలో కథనంగా చెప్తాయి. ఇవి సాక్షికంగా నమ్మదగ్గవే. నాగరికత పెరిగినకొద్దీ, వంశ చరిత్ర కూడా కాలమానాన్ని అనుసరిస్తూనే, దాని పరిధుల్ని దాటి, వాస్తవిక చరిత్ర రూపాన్ని దాల్చింది. మత యుద్ధాలు, విజ్ఞానాభివృద్ధి, రాజకీయ, మత సంబంధమైన వివాదాలు తర్వాత కాలంలో, చరిత్ర రచనల పై ప్రభావాన్ని చూపించాయి. ఎక్కువ సంఖ్యలో సూత్ర చరిత్రకారులు (Chronicle Historians) ఇంగ్లాండ్‌లో ఆవిర్భవించారు. ఇటలీలో లాటిన్ నమూనాల పద్ధతిలో రచనలు చేయబడ్డాయి. సాంస్కృతిక పునరుజ్జీవనం కూడా, చరిత్ర రచనను మరింత సంపన్నం చేసింది. రాజకీయాల్లో నిజమైన ఆసక్తి కూడా, ఈ రచయితల్లో పెరిగింది. చరిత్ర రచన మరో అడుగు ముందుకు వేసింది. మధ్య యుగం లోని ఇటువంటి రచనల్లో మాథ్యూ పారిస్ విరచిత 'మహా వంశ చరిత్ర' (Great Chronicle), ఇతరుల 'ఆంగ్లో - సాక్సన్ వంశ చరిత్ర', 'ఫారెన్స్ వంశ చరిత్ర' లు ప్రసిద్ధి వహించాయి. ఈవిధంగా, మధ్య యుగం నాటి చరిత్ర రచనా సంప్రదాయం పూర్తిగా మత ప్రభావానికి లోనైనా, చివరి దశలో మళ్ళీ విజ్ఞానాభివృద్ధి ఫలితంగా, మత ప్రభావం నుండి బయటపడే ప్రయత్నాలను ప్రారంభించింది. ఈ ప్రయత్నాలు ఆధునిక కాలంలో ఫలించాయి. నూతన ప్రమాణాలు, చరిత్ర రచనల్లో చోటు చేసుకున్నాయి.

BRAOU

## 14.4 సంగ్రహంగా

క్రైస్తవులు మానవాతీత శక్తులలో ప్రబలంగా నమ్మకాన్ని పెంపొందించటమే లక్ష్యంగా, చరిత్ర రచనలను సాగించారు. క్రీస్తు జననాన్ని చరిత్రకు కేంద్ర బిందువును చేశారు. ఇతర సంఘటనలన్నీ దీని చుట్టూ అల్లారు. మిరకిల్స్‌కి ప్రాధాన్యత నిచ్చారు. చర్చి చరిత్రకు మూల పురుషుడు పాంఫిలస్. క్రైస్తవ చరిత్రకారులందరిలోకి ప్రసిద్ధుడైన సెయింట్ అగస్టీన్ తన 'భగవన్నగరం' గ్రంథంలో, దైవం పట్ల గౌరవం, ధార్మిక చింతన లేకపోవటం వల్లనే, గోథుల చేతులలో రోమన్ సామ్రాజ్యం చిన్నాభిన్నమైందని విశ్లేషించాడు. జెరోమ్, ఒరోషియస్‌ల రచనలు కూడా, క్రైస్తవ చరిత్ర రచనాభివృద్ధికి తోడ్పడ్డాయి. అయితే, యిదే కాలంలో ప్రధానంగా మధ్య యుగం చివరి దశలో, కాసియోడోరస్, ప్రకోపియస్, గ్రెగొరి, బీడ్ వంటి లౌకిక చరిత్రకారుల రచనలూ వెలువడ్డాయి. మత ప్రభావం నుండి బయటపడే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.

## 14.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. మధ్య యుగ చరిత్ర రచనాభివృద్ధిలో క్రైస్తవ ధర్మ ప్రభావాన్ని వివరించండి.

2. చరిత్ర రచనాభివృద్ధిపై క్రైస్తవ ధర్మ ప్రభావాన్ని తెలిపి, సెయింట్ అగస్టీన్ చరిత్ర రచనకు చేసిన సేవలను వర్ణించండి.

**II. క్రింది వాటిపై లఘు వాఖ్యలను రాయండి.**

1. మధ్య యుగ ఐరోపా చరిత్ర రచనాభివృద్ధిలో, లౌకిక చరిత్ర రచనా ప్రభావమెట్టిది ?

## 14.6 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| James T. Shotwell | : | **A History of History, Vol. I** |
| Barnes, H.E. | : | **A History of Historical Writing** |
| Collingwood R.G. | : | **The Idea of History** |
| Thompson, J.W | : | **History of Historical Writings ( 2 vols.)** |
| Hall, J.R. | : | **The Evolution of British Historiography** |
| Robinson | : | **The New History** |
| Ruse Erice, D. | : | **Towards a Theological Understanding of History** |
| Gardiner, Patrick (Ed) | : | **The Philosophy of History** |
| | | **Encyclopaedia of Social Sciences, Vol. 7 & 8.** |


B R A O U

రచయిత : డా. జాస్తి దుర్గాప్రసాద్

# భాగం - 15 : మధ్య యుగం : పశ్చిమ ఆసియాలో చరిత్ర రచనాభివృద్ధి

విషయ క్రమం

15.0 లక్ష్యాలు

15.1 పరిచయం

15.2 ముస్లింల చరిత్ర రచన

15.2.1 ఆల్ బెరూని (క్రీ.శ. 973 - 1048)

15.2.2 ఇబ్న్ ఖల్దూన్ (క్రీ.శ. 1332 - 1406)

15.3 సంగ్రహంగా

15.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

15.5 ఉపయుక్త గ్రంథాలు

## 15.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- ప్రాచీన గ్రీక్ - రోమన్ చరిత్ర రచనా సాంప్రదాయానికి, ఆధునిక చరిత్ర రచనా సాంప్రదాయానికి మధ్య అనుసంధానకర్త లైన ముస్లిం చరిత్రకారుల పాత్రను వివరించగలగాలి.

- ముస్లిం చరిత్ర రచనా పద్ధతిని సుసంపన్నం చేసి, ఆధారాల సూక్ష్మ పరిశీలన కోసం అభివృద్ధి చేసిన ఇస్నద్ పద్ధతి, ' యాత్రా వర్ణనలు ', ఇబ్న్ ఖల్దూన్ వంటి తత్త్వవేత్తలు మొదలైన మూడు అంశాలను సమగ్రంగా విశ్లేషించగలగాలి.

BRAOU

## 15.1 పరిచయం

ఇస్లాం ఆవిర్భావానికి ముందు అరేబియాలో చరిత్ర రచన సగం కట్టుకథ, సగం వాస్తవం. పద్య రూపంలో ఉండేది. ఇది హెరొడోటస్‌కు పూర్వం గ్రీస్‌లో పరిస్థితి వంటిదే. అయితే, క్రీ.శ. 7వ శతాబ్దంలో మహమ్మద్ ఇస్లాం మతాన్ని స్థాపించాక, పూర్వ సంస్కృతీ విశ్వాసాలకు ఇది మౌలికంగా, భిన్నంగా ఉండటంతో, కొత్త మార్గాన్ని సమర్థించటానికి చరిత్ర రచనలు వెలువడటం ఆరంభమైంది. మొదటి ఖలీఫాలు తమ వారసత్వపు హక్కును నిర్ధారించుకోడానికి తమ వంశ ప్రాచీనతను శోధించి, గ్రంథస్థం చేయించుకోడం కోసం, ఆస్థానాల్లో సూతులను, చరిత్రకారుల్ని ప్రోత్సహించారు. ఈ విధంగా ఆరంభమైన ముస్లింల చరిత్ర రచనా సంప్రదాయం, ఆ తర్వాత కాలంలో, ఇబ్న్ ఖల్దూన్ వంటి తత్వవేత్తల సేవలతో సుసంపన్నమైంది.

## 15.2 ముస్లిం చరిత్ర రచన

ఐరోపాలో మధ్య యుగంలో చరిత్ర రచనను క్రైస్తవ మత ధర్మజ్ఞులు నిర్దేశిస్తున్న సమయంలోనే, మధ్య

ప్రాచ్యంలో ముస్లింలు తమ స్వీయ ధోరణిలో, చారిత్రక రచనను చేపట్టారు. ముస్లింల చరిత్ర రచనా సంప్రదాయం కొన్ని విషయాల్లో మతపరమైందే. అయినప్పటికీ, ఇతరత్రా అనేక విషయాల్లో శాస్త్రీయ పంథాలో కనిపిస్తుంది. మహమ్మద్ ప్రవక్తకు పూర్వం, అంటే ఇస్లాం మతం ప్రాబల్యానికి రాకముందు, చరిత్ర కేవలం కథాగేయం (Ballad) గా ఉండేది. ఇది సగం కట్టుకథ, సగం చరిత్రల సమ్మిళితం. పద్యరూపంలో రాయబడేది. హెరొడోటస్‌కు పూర్వం గ్రీకుల పరిస్థితి ఏమిటో, అదే పరిస్థితి అరేబియాలోనూ నెలకొని ఉంది. అయితే, మహమ్మద్ ఇస్లాం మతాన్ని స్థాపించాక, ప్రధానమైన సంఘటనలను గ్రంథస్థం చేయటం ఆరంభమైంది. ఒక కొత్త మతం స్థాపించబడినపుడు, అందులోనూ, ఆ మతం పూర్వ సంస్కృతి విశ్వాసాలకు మౌలికంగా భిన్నంగా ఉన్నప్పుడు, కొత్త మార్గాన్ని సమర్థించటానికి పాతను ఏవగించుకుంటూ, కొత్తను ప్రస్తుతించే కొత్త రకం చరిత్ర రచనలు వెలువడటం సహజం. బౌద్ధ మతం స్థాపించబడ్డాక త్రిపిటకాలు, అనేక బౌద్ధ చరిత్రలు, జాతక కథలు, నికాయాలు, దీప వంశం, మహా వంశం వంటి గ్రంథాలు వెలువడ్డాయి. అదేవిధంగా, క్రైస్తవ ధార్మికుడు పేగన్లపై విమర్శను తీవ్రం చేశాక ( ఒరోషియస్ చేసినట్లు) క్రైస్తవ దృక్పథం నుండి చరిత్ర రచించబడింది. అలాగే, ముస్లింలు ఇస్లాం దృక్పథం నుండి చరిత్ర రచనలను వెలువరించట మారంభించారు. తొలి ఖలీఫాలు తమ వారసత్వ హక్కును నిర్ధారించుకోడానికి తమ వంశ ప్రాచీనతను కనుగొని, గ్రంథస్థం చేయించుకోవాలని అభిలషించారు. దీనికోసం, తమ ఆస్థానాల్లో వంశ చరిత్ర రచయితల్ని, చరిత్రకారుల్ని ప్రోత్సహించారు. ఈవిధంగా, అరబ్బుల, లేదా ముస్లింల చరిత్ర రచనలు ప్రారంభమయ్యాయి.

ప్రాచీన గ్రీకో - రోమన్ చరిత్ర రచనా సంప్రదాయానికి, ఆధునిక చరిత్ర రచనా సంప్రదాయాలకు మధ్య, ముస్లిం చరిత్రకారులు అనుసంధానకర్తలుగా కనిపిస్తున్నారు. మధ్యయుగంలో అటు క్రైస్తవుల చరిత్ర రచనకు, ఇటు ముస్లింల చరిత్ర రచనకు దైవ సంకల్ప శక్తియే ప్రేరణ అయినప్పటికీ, రెంటికీ మధ్య అగాధమంత తేడా ఉంది. అరబ్బులు లౌకికమైన చరిత్ర అని, భక్తి హీనమైన చరిత్ర అని ఎటువంటి తేడా చూపించలేదు. క్రైస్తవులకు ఉన్నటువంటి వ్యవస్థీకృతమైన చర్చి ముస్లింలకు లేదు. చర్చిలో నిర్దేశించబడ్డ బ్రహ్మచర్యం, పరిత్యాగం వంటి వాటిని, ఇస్లాం ఎప్పుడూ ఆమోదించలేదు. ఇస్లాం ఇహానికి, పరానికి రెంటికీ ప్రాధాన్యతనిచ్చింది. ముస్లింలు మనిషి రుజు ప్రవర్తనే, అతణ్ణి భగవంతుని దరి చేరుస్తుందని నమ్మారు. రుజు ప్రవర్తనలో నమ్మకమే, మనిషికి మోక్షాన్ని కలిగిస్తుందని వీరి విశ్వాసం. ఏసు ప్రభువు ద్వారా నిష్కృతి పొందవచ్చనేది, క్రైస్తవుల నమ్మకం. రెండు మతాల్లోని ఈ మౌలిక తత్వం, వారి వారి చరిత్ర రచనా ధోరణుల్ని చాలా వరకు నిర్దేశించింది. క్రైస్తవులకు ఇహలోకం ముఖ్యమైందే కాని, అసందిగ్ధమైంది కాదు. అదే ముస్లింలకైతే, ఇహలోకం అసందిగ్ధమైందే కాని, అంతిమమైంది కాదు. జీవితం పట్ల ఉన్న ఈ ధోరణి, చరిత్రపై చాలా ప్రభావం చూపించింది. కనకనే, వివేచన ప్రాతిపదికగా రూపొందిన గ్రీక్ సంప్రదాయాల పట్ల, ముస్లింల చరిత్ర ఎక్కువ మొగ్గు చూపింది.

షేక్ ఆలీ చెప్పినట్లు, చరిత్ర రచనకు ముస్లింలు ఇతోధికంగానే సేవ చేశారు. యూదులకున్నట్లే, వీరికి చారిత్రక మనస్తత్వం బలీయంగా వుంది. రోమన్ల లాగే వీరూ ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండాలకు విస్తరించిన విశాలమైన సామ్రాజ్యాన్ని నిర్మించారు. అంటే, చరిత్ర రచనకు పూనుకోకముందే చరిత్రను సృష్టించారన్నమాట. ముస్లింల చరిత్ర రచనా సంప్రదాయంలో, ప్రత్యేకించి మూడు అంశాలు ప్రస్ఫుటమౌతున్నాయి. చరిత్ర రచనను సుసంపన్నం చేసిన ఈ మూడు అంశాల్లో మొదటిది, ముస్లింలు సూక్ష్మాతిసూక్ష్మంగా చరిత్ర ఆధారాలను నిశితంగా పరిశీలించటం. దీనికోసం, వీరు ' ఇస్నద్ ' (Isnad) అనే ఒక ప్రత్యేక కౌశల్యాన్ని అభివృద్ధి చేశారు. ఇది పూర్వ అనేక ప్రామాణిక ఆధారాలను వడపోసి, ఖచ్చితమైన సమాచారాన్ని రాబట్టే పద్ధతి. రెండోది, తమ ప్రత్యక్ష పరిశీలన ద్వారా, స్వభావ రీత్యా ఆహ్లాద పరచే, వస్తువు రీత్యా సమాచారాన్నందజేసే , కళ్లకు కట్టినట్లు చిత్రించే ముస్లింల యాత్రా వర్ణనలు. ఇతర ప్రాంతాల్లో పయనించటంలోను, ఆ అనుభవాలను గ్రంథస్థం

BRAOU

చేయటంలోను, వీరికి చాలా ఉత్సాహం ఉంది. ఇంక మూడోది, ఇబ్న్ రష్డ్, ఇబ్న్ ఖల్దూన్ వంటి ప్రసిద్ధ తత్వవేత్తలు వీరిలో ఆవిర్భవించటం. ఇబ్న్ ఖల్దూన్ సంస్కృతీ శాస్త్రానికి పునాది వేశాడు. మానవునిపై పరిసరాల ప్రభావం, సమాజ మూలం, అభివృద్ధిని గురించి పరిశోధన, మనోవాంఛలు, భౌతిక అవసరాల ఉనికి వంటి కొన్ని సమస్యలను ఇతడు విశ్లేషించాడు.

అరబ్బులు చారిత్రక మనస్తత్వాన్ని పెంపొందించుకోడానికి చాలాకాలం పట్టింది. మొదట్లో వీరు, సంప్రదాయిక గాథలను గ్రంథస్థం చేయటానికి చాలా విముఖత్వాన్ని కనబర్చారు. అయితే, పర్షియాను జయించాక, పారశీకుల ప్రభావంతో మార్పు వచ్చింది. అరబ్బీ భాషలోనే రచనలు సాగినా, ఇస్లాంలో చింతనా ధోరణి, వాఙ్మయం చాలా వరకు పారశీకుల మేధస్సు నుండి ఆవిర్భవించిందే. అరేబియన్ల సాహిత్యంలో క్రీ.శ. 750 - 1000 ల మధ్య కాలాన్ని ప్రామాణిక యుగంగా చెప్పొచ్చు. ఈ కాలంలో, అరబ్బీ భాష లోనే రచనలు సాగినా, రచయితలు కేవలం అరబ్బులే కారు. ముస్లిం చరిత్రలో మొదట మదీనా కేంద్రంగాను, తర్వాత డమాస్కస్ కేంద్రంగాను, ఆ తర్వాత బాగ్దాద్ కేంద్రంగాను భాసిల్లాయి. క్రీ.శ. 1258 లో మంగోల్‌ల దండయాత్రతో ఖిలాఫత్ నాశనం కావటం, ఒక ముఖ్య ఘట్టం. ఉమాయ్యదుల పతనంతో, సిసలైన అరేబియన్ శకం ముగిసింది.

మొట్టమొదటి ముస్లిం చరిత్రకారులు ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్ర పైన, మహమ్మదీయుల వివిధ సైనిక విజయాలపైన, ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించారు. ప్రవక్త జీవితానికి సంబంధించిన ఐతిహ్యాలనేకాక, సంస్కృతీ గాథను, ఖలీఫాల రాజ్య స్థాపన తరువాత సైనికంగా జరిగిన విస్తరణను కూడా, ఈ రచయితలు వర్ణించారు. ఇటువంటి రచనల్లో, ఇబ్న్ ఇషక్ రాసిన 'ప్రవక్త జీవిత చరిత్ర' (The Biography of the Prophet), అబ్బాసైదుల ఆస్థానంలో చరిత్రకారుడైన ఆల్‌వకీది (క్రీ.శ. 747 - 823) రాసిన 'ప్రవక్త యుద్ధాల చరిత్ర, (History of the Wars of the Prophet) లను పేర్కొనొచ్చు. ఆల్ దినావరి గ్రంథం 'అరేబియా, పర్షియాల చరిత్ర' (History of Arabia and Persia), ఇబ్న్ ఆలి తాహిర్ గ్రంథం 'బాగ్దాద్, దాని ఖలీఫాల చరిత్ర' (History of Baghdad and its Caliphs) కూడా, ఈ కోవలోకే వస్తాయి.

ముస్లింల్లో బహుశా ఎక్కువ పేరు ప్రతిష్ఠలు పొందిన చరిత్రకారుడు, ఆల్ తబారి (క్రీ.శ. 838 - 923). ఈతడు 'ప్రవక్తలు, ప్రభువుల చరిత్ర' (The Annals of the Apostles and Kings) అనే గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథ రచనకు ముందు విస్తృతంగా పర్యటించాడు. ముస్లిం న్యాయశాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. తన రచనలో, క్రీ.శ. 915 వరకు గల చరిత్రను అభివర్ణించాడు. చరిత్ర అధ్యయనంలో, సంవత్సర క్రమంలో సంఘటనలను వర్ణించే పద్ధతిని (Annalistic Method) మరుగుపర్చి, ఉపయోగించిన మొదటి ముస్లిం చరిత్రకారుడు ఇతడే. కొంతమంది ఇతణ్ణి 'ముస్లింల లివీ' గా భావించారు. అయితే, ఆధారాలను విస్తృతంగా సేకరించటంలో, నిర్దుష్టంగా వర్ణించటంలో, ఈ పోలిక చెల్లుతుందేకాని క్రమబద్ధంగా సమాచారాన్ని వ్యవస్థీకరించటంలో, రచనా శైలికి లివీతో సరితూగడు. అయినప్పటికీ, ఆల్ తబారి సేకరించిన రచనా సామగ్రి ఆ తర్వాత, రచనలు చేసిన ముస్లిం చరిత్రకారులకు చాలా విలువైందని అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

మధ్య యుగ ముస్లిం చరిత్రకారుల్లో మరో ప్రసిద్ధుడు, ఆల్ మసూది. విజ్ఞాన ఖనియైన ఇతడు 'తన బంగారు మైదానం' (Meadow of Gold) అనే గ్రంథంలో, సంవత్సర క్రమంలో సంఘటనలను వర్ణించే ఆల్‌తబారి రచనా విధానానికి స్వస్తి చెప్పి, సమాచారాన్ని రాజులు, రాజవంశాలు, విషయాల వారీగా పొందుపర్చాడు. కేవలం, రాజకీయ సంఘటనలనేకాక, ప్రజల సాంస్కృతిక, సామాజిక జీవనానికి సంబంధించిన

BRAOU

వివరాలను కూడా ఇచ్చాడు. అరబ్బుల చరిత్ర రచనా పద్ధతి, మిస్కావై (Miskawaihi) గ్రంథాల్లో ఉన్నత స్థాయినందు కున్నది. అసాధారణమైన అవగాహనతో ఇతడు పరిపాలన, సైనిక విషయాల గురించి చాలావరకు ప్రత్యక్ష సమాచారాన్ని ' జాతుల అనుభవాలు ' (Experiences of the Nations) అనే చరిత్ర గ్రంథంలో, నిష్పాక్షికంగా వివరించాడు. అయితే, ఇబ్న్ ఖల్దూన్‌కు ఉన్న చారిత్రక తాత్విక చింతన ఇతనిలో కనిపించదు. మిక్రిజి (Mikrizi) ఈజిప్ట్ భౌగోళిక పరిస్థితులను, అక్కడి ముస్లింల పాలనా చరిత్రను గ్రంథస్థం చేశాడు. పర్షియన్ కవి ఫిర్దౌసి ' షానామా' లో ఇరాన్ పూర్వ చరిత్రను వివరించాడు.

**15.2.1 అల్‌బెరూని ( క్రీ.శ. 973 - 1048)**

మేధావులకే మేధావిగా, విజ్ఞాన ఖనిగా ప్రసిద్ధి వహించిన అల్‌బెరూని ప్రాచీన పర్షియాలోని ఖ్వారిజమ్ ( నేటి ఖివా) నివాసి. క్రీ.శ. 973 లో జన్మించాడు. ఇతని పూర్తి పేరు అబురాయ్ హన్ మహమ్మద్ బిన్ అహ్మద్ అల్‌బెరూని అల్ ఖ్వారిజ్మి. ఘజనీ సుల్తాన్ మహమూద్‌కి సమకాలికుడు. తత్వశాస్త్రం, గణితం, ఖగోళం, భూగోళం, వైద్యం, మతం, ఈశ్వరవాదం, తర్క శాస్త్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. భారతదేశం గురించి, భారతీయుల విజ్ఞాన శాస్త్రాల గురించి ఆసక్తిని కనబర్చాడు. సంస్కృత భాషను అభ్యసించి, అనేక సంస్కృత గ్రంథాలను అరబ్బీ భాషలోకి అనువదించాడు. అంతేగాక, కొన్ని గ్రీక్ గ్రంథాల అరబ్బీ అనువాదాలను సంస్కృతం లోకి మార్చాడు. మొదట గొప్ప ముస్లిం ప్రాచీన చరిత్రకారునిగా (Indologist) గౌరవం పొందాడు.

మేధావిగా గుర్తించబడ్డ అల్‌బెరూని ఖ్వారిజమ్ పాలకునికి సలహాదారుగా నియమించబడ్డాడు. స్వతంత్ర ఖ్వారిజమ్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని, ఆ ప్రాంతాన్ని ఘజనీ సుల్తాన్ మహమూద్, క్రీ.శ. 1017లో జయించటంతో, పదవీచ్యుతులైన రాజకుటుంబీకులు, ఇతర యుద్ధ ఖైదీలతోబాటు బందీగా గజనీ చేరాడు. ఆ తర్వాత పదమూడు సంవత్సరాలు సుల్తాన్ ఆదరానికి పాత్రుడు కాకపోయినా, అతనితోబాటు భారతదేశానికి వచ్చాడు. మహమూద్ మరణించాక అతని కుమారుడు మసూద్ సుల్తానవడంతో, అల్‌బెరూని పరిస్థితిలో మార్పు వచ్చింది. అతనికీ, అతని విద్వత్తుకీ గౌరవ ప్రపత్తులు లభించాయి. దీంతో, 61 సంవత్సరాల వయసులో సుల్తాన్ నుండి ఆర్థిక సౌలభ్యం కూడా లభించటంతో విజ్ఞాన సముపార్జనకు, గ్రంథ రచనకు కాలాన్ని వెచ్చించాడు. 75 సంవత్సరాల వయస్సులో, క్రీ.శ. 1048లో మరణించాడు.

అల్‌బెరూని చారిత్రక కాలక్రమణికకు బలమైన పునాదివేసి, ముస్లింల చరిత్ర రచనా సంప్రదాయానికి ఎనలేని సేవచేశాడు. ఇతని ' ప్రాచీన జాతుల కాల క్రమణిక ' ( అల్ అధర్ ఉల్ బకియా = Chronology of theAncient Nations) అనే గ్రంథమే, దీనికి నిదర్శనం. ఇది తులనాత్మక కాలక్రమణికపై రచన. దీనిలో, ప్రాచీన పర్షియా చరిత్రతో బాటు పురాతన సుఘ్డ్, ఖ్వారిజమ్ మాండలికాల నమూనాలను కూడా పేర్కొన్నాడు. ఈతడు రచించిన గ్రంథాల్లో ఎక్కువ ప్రసిద్ధి చెందినవి, ' కానన్ మాసూదికస్ ' (Canon Masudicas). తనను ఆదరించి గౌరవించిన సుల్తాన్ మసూద్ పేరు మీద ఈ రచన చేశాడు. సుల్తాన్‌కే ఈ గ్రంథాన్ని అంకితం చేశాడు. ' కానన్ మసూదికస్ ' అంటే, 'గత తరం అవశేష చిహ్నం,' (The Surviving Monument of the Past Generation) అని అర్థం. ఇది ప్రధానంగా, ఖగోళశాస్త్ర గ్రంథం. ఇందులో, ఇతడు తన పోషకులను విపరీతంగా మెచ్చుకొన్నాడు. ఇతడు స్వదేశం ఖ్వారిజమ్ చరిత్ర గురించి రాసిన గ్రంథంకాని, ప్రసిద్ధ కార్మాటియన్ మత చరిత్ర పై రాసిన గ్రంథంకాని, ఇప్పుడు లభించటం లేదు.

అల్‌బెరూని భారతదేశంలో గడిపిన కాలంలో, అనేక ప్రాంతాలు పర్యటించాడు. మనదేశ చరిత్ర, సంస్కృతి, మతం, జీవన విధానాల పట్ల ఆసక్తిని చూపాడు. ముందే చెప్పినట్లు, సంస్కృత భాషను అభ్యసించాడు.

BRAOU

సంస్కృత పండితుల సహాయంతో, ఖగోళం, గణితం మొదలైన అనేక శాస్త్ర గ్రంథాలను అరబ్బీ భాషలోకి అనువదించాడు. కొన్ని గ్రీక్ గ్రంథాల అరబ్బీ అనువాదాలను సంస్కృతంలోకి మార్చాడు. మూల గ్రంథాలు, అనువాదాలు, ప్రాచీన పర్షియన్, భారత వాఙ్మయాల నుండి తీసుకున్న కథలు, పురాణ గాథలతో కలిపి, ఇంచుమించు ఇరవై గ్రంథాలను భారతదేశంపై రాశాడు. వీటిలో, క్రీ.శ. 1030లో రచించిన ' తారిఖ్ ఉల్ హింద్ ' (History of India) చాలా ముఖ్యమైంది. ఈ గ్రంథం మొదట అరబ్బీ భాషలో రాయబడింది. తర్వాత, పారశీకం లోకి అనువదించబడింది. ఇది రచనా విషయంలోను, శాస్త్రీయ రచనా విధానంలోను అసదృశమైంది.

ఒక మిత్రుడితో సమకాలీన మతం, తాత్విక వాఙ్మయం గూర్చి చర్చిస్తున్నప్పుడు, భారతదేశంపై గ్రంథం రాయాలన్న ఆలోచన ఆల్‌బెరూనికి వచ్చింది. అప్పటి అరబ్బీ సాహిత్యం హిందువుల నమ్మకాల గురించి కేవలం విన్నటువంటి, విమర్శనారహితమైన సమాచారంతో మాత్రమే రాయడంతో, ఈ లోపాన్ని సరిదిద్ది తాను స్వయంగా చూసిన, సహేతుకమైన, నిష్పాక్షికమైన వివరాలతో గ్రంథాన్ని రాయాలన్న సంకల్పం దీనికి తోడైంది. ఫలితమే, ' తారిఖ్ ఉల్ హింద్ ' రచన. ఆల్‌బెరూని హిందువుల పట్ల సానుభూతినే ప్రదర్శించాడు. వారిని గొప్ప తత్వవేత్తలుగా, చక్కని గణిత, ఖగోళ శాస్త్రజ్ఞులుగా చిత్రించాడు. ఈ శాస్త్ర విజ్ఞానం, సారస్వతాల అభివృద్ధికి ఎంతో ముగ్ధుడయ్యాడు. హిందువులను నాస్తికులుగా భావించి, తన దోపిడీని నిరోధించినందుకు వారిని చంపటమే తగిన చర్య అనే సుల్తాన్ మహమూద్ వైఖరిని నిరసించాడు. సుల్తాన్ ఈ దేశ సంపదను పూర్తిగా నాశనం చేశాడని, తన దండ యాత్రలతో హిందువులను ధూళి రేణువులుగా నాలుగు దిక్కులకు చెల్లాచెదరు చేశాడని వర్ణించాడు. హిందూ సంస్కృతిలోని లోపాలను వేలెత్తి చూపాడు. దానిలోని సుగుణాలను ప్రశంసించాడు. విగ్రహారాధనా ప్రపంచ ఆలోచనలను నిష్పక్షపాత ధోరణితో, హృదయ పూర్వకంగా అధ్యయనం చేశాడు.

### 15.2.2 ఇబ్న్ ఖల్దూన్ ( క్రీ.శ. 1332 - 1406)

మధ్య యుగ చరిత్రకారులందరిలోకి అత్యంత ప్రసిద్ధుడు ఇబ్న్ ఖల్దూన్ . ఉత్తర ఆఫ్రికాలో ట్యూనిస్ పట్టణంలో అక్కడికి వలస వచ్చిన స్పానిష్ కుటుంబంలో జన్మించిన ఇతడు, సుల్తాన్‌ల ఆదరణలో అనేక ఉన్నత పదవులను నిర్వహించాడు. అదే విధంగా, వారి కోపానికి గురైనప్పుడు రెండు సార్లు చెరసాల పాలయ్యాడు. ఈ అనుభవం అతనికి స్పెయిన్, ఉత్తర ఆఫ్రికాల్లోని రాజకీయ జీవితం పట్ల చక్కని అవగాహనను కలిగించింది. తైమూర్‌కు అతిథిగా డమాస్కస్‌లో చాలాకాలం ఉన్నాడు. ఓరన్‌లో ఉండగా ( క్రీ.శ. 1374) నాలుగు సంవత్సరాలు కృషి చేసి, ' కితాబ్ అల్ ఇబర్ ' ( సార్వత్రిక చరిత్ర - Universal History ) అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రాశాడు. క్రీ.శ. 1406లో కైరోలో మరణించాడు.

మొదట్లో, ఖల్దూన్ తన బెర్బర తెగ చరిత్రను రాయాలని సంకల్పించాడు. విషయ పరిధి చాలా పరిమితమని అనిపించి, అరబ్బుల చరిత్రకు దాన్ని విస్తరించాడు. కాని, అది కూడా ఇస్లాం ప్రపంచంలో ఒక భాగం మాత్రమే అన్పించి, ఇస్లాం ప్రజల గూర్చి, సంస్కృతి గూర్చి రాయాలని అభిలషించాడు. అయితే, మానవ జాతి మొత్తంలో వీరు ఒక భాగం మాత్రమే అనే విషయాన్ని అప్పుడు గుర్తించాడు. ప్రపంచ చరిత్ర అతని దృష్టిలో స్థిరపడింది. పర్యవసానమే, ' సార్వత్రిక చరిత్ర ' రచన. ఖల్దూన్ ' సార్వత్రిక చరిత్ర ' ను ఏడు భాగాల్లో రాశాడు. మొదటి భాగంలో మానవునిపై నాగరికత ప్రభావాన్ని విపులంగా చర్చించాడు. ఖల్దూన్ గ్రంథంలో చాలా ముఖ్యమైందిగా, కళా ఖండంగా ' అవతారిక ' ( ' ముకద్దిమా ' = Prolegomena) భాగం పరిగణించబడ్తున్నది. చరిత్ర పట్ల అతని అవగాహనను ఈ భాగం తెలియజేస్తున్నది. అతని దృష్టిలో, చరిత్ర అంటే సమాజం,

BRAOU

నాగరికతల మూలం, పరిణామాలకు సంబందించిన విజ్ఞాన శాస్త్రం. చరిత్ర ప్రగతిలో ఏకత, అవిచ్ఛిన్నతలను అతడు సందర్శించాడు. జ్ఞాన ప్రాప్తి కేవలం తర్కం వల్ల, బుద్ధి వల్ల కలుగదని చెప్పాడు. అనుభవం, ప్రయోగాల ద్వారా మాత్రమే, సత్యాన్ని కనుక్కోవచ్చని స్పష్టం చేశాడు. చరిత్రను అర్థం చేసుకోటంలో కూడా, ప్రకృతిని అధ్యయనం చేసే విధంగానే కార్యకారణ నియమం ప్రయోజనకరమని నమ్మాడు. జరిగిపోయిన సంఘటనల్ని క్రమబద్ధంగా తీసుకొని, ఎటువంటి పక్షపాతం లేకుండా, వాటిలో కార్యకారణ సంబంధాన్ని కనిపెట్టి , చరిత్రను నిర్దేశించే సూత్రాలను అన్వేషిస్తే, చరిత్ర విజ్ఞాన శాస్త్రం అవుతుందని ఖల్దూన్ అభిప్రాయం. సమాజాలు, సంస్కృతులు చిరస్థాయిగా ఉండటానికి గాని, శిథిల మవటానికి గాని ఏవి కారణాలో నిర్ణయించే చరిత్ర సూత్రాలను కనుక్కోవచ్చని అతని సిద్ధాంతం. అనేక దేశాల చరిత్రలను అధ్యయనం చేసిన తర్వాత, అతడు సమాజ వికాసంలో మూడు దశలున్నాయని విశ్లేషించాడు. అవి : (1) ఆహారాన్ని అన్వేషిస్తూ తిరిగే దశ ; (2) స్థిర నివాసాన్ని ఏర్పర్చుకొని, పశుపాలన, వ్యవసాయం చేస్తూ, ఒక సైనిక రాజవంశ అధీనంలో ఉండే దశ ; (3) రాజ్య వ్యవహారానికి నగర నిర్మాణం, నగరంలో శ్రమ విభాగం పరస్పర సహకారం వల్ల, సంపదల వృద్ధి, నాగరికతా వ్యాప్తి జరిగే దశ. నాగరికత పెరగటంతో విలాసాలు, సోమరితనం పెరుగుతాయి. ఉన్నత వర్గం శ్రమపడలేని మానసిక, శారీరక, నిర్వీర్య స్థితికి వస్తుంది. వారికోసం పనిచేసే వారికి శ్రమకు తగ్గ ఫలితం ఉండదు. నిర్వీర్యులైన నాగరికుల్ని అనాగరికులైన ఏ అడవి జాతులో, ఎడారి జాతులో జయించి పాలిస్తాయి. కాలక్రమేణా, ఈ అనాగరికులూ, అతి నాగరికులుగా మారి, సోమరిపోతులైతే వీరికీ అదే గతి పడ్తుంది. ఈవిధంగా, చరిత్ర పునరావృతం అవుతుందని ఖల్దూన్ భావించాడు. అతని చరిత్ర సారాంశం ఇదే.

ప్రపంచ చరిత్రను మానవాళికి సంబంధించిన సంఘటనల వర్ణనాత్మక జాబితాగా రూపొందించటం వల్ల ఉపయోగం లేదని, మానవ ప్రగతికి దోహదపడ్డ ప్రక్రియలను క్షుణ్ణంగా విశ్లేషించి, సహేతుకంగా అంచనా వేసి చూపగలిగితేనే, రచన ప్రయోజనం నెరవేరుతుందనే నమ్మకమే, అతడ్ని ముందుకు నడిపించింది. టాయిన్బీ వంటి ప్రముఖ ఆధునిక చరిత్ర తత్వవేత్త, ఖల్దూన్ చరిత్ర తత్వాన్ని ప్రశంసిస్తూ, ఇంతవరకూ ఏ మేధస్సూ, ఎప్పుడూ, ఎక్కడా, ఇంతటి మహోన్నతమైన చరిత్ర తత్వాన్ని సృష్టించలేదని పేర్కొన్నాడు. జార్జ్ సార్టన్ అనే మరో మేధావి, ఖల్దూన్‌ని అత్యున్నత చరిత్ర సిద్ధాంతకర్తగా, తత్వవేత్తగా ప్రస్తుతించాడు. మానవ స్వభావం, సామాజిక కట్టుబాటు (Social cohesiveness) , దాని మూలం, ఆహారోత్పత్తి, విధానాలు, శీతోష్ణస్థితి, వృత్తి సంబంధమైన ప్రభావాలు, సామాజిక పరిణామానికి సంబంధించిన సూత్రాలు, ఆర్థిక మత నియతివాదం మొదలైన అంశాలన్నిటి గూర్చి, ఖల్దూన్ విశ్లేషించిన ధోరణి అపూర్వంగాను, చాలావరకు ఆధునిక పంథాలోను ఉంది. ఈ కారణంగానే, అతడ్ని అటు సమాజ శాస్త్రానికి, ఇటు చరిత్ర తత్వానికి మూల పురుషునిగా భావించటం జరుగుతున్నది. అయితే, ' సార్వత్రిక చరిత్ర ' అవతారికలో ఏ ప్రమాణాలను నిర్దేశించాడో, వాటికి అనుగుణంగా పూర్తి ప్రపంచ చరిత్రను ఖల్దూన్ మనకు అందించలేక పోయాడు. గుర్తించబడ్డ ఆధారం నుండి సమాచారాన్ని గ్రహిస్తూ , తన తన రచనను సాంప్రదాయికంగా అరబ్బులు, వారి ఇరుగుపొరుగులతో ఆరంభించి, తర్వాత తన బెర్బర తెగ గురించి, ఉత్తర ఆఫ్రికా రాజవంశాల గురించి వర్ణించటంతో ముగించాడు. అయినప్పటికీ. విమర్శనాత్మక వ్యాఖ్యానం, లోతైన ఆలోచన, విశాల దృక్పథం, అద్భుతమైన శైలి, అతని రచనకు అపూర్వ గౌరవాన్ని చేకూర్చాయి. ఇటువంటి గౌరవం ఐరోపాలో ఇటీవలి కాలం వరకు ఏ ఇతర రచనకు దక్కలేదు.

## 15.3 సంగ్రహంగా

ముస్లింలు ఇస్లాం మత దృష్టితో చరిత్ర రచనా సంప్రదాయాన్ని ప్రారంభించారు. మిస్కావే రాతల్లో, అరబ్బుల రచనా విధానం ఉన్నత స్థాయిని చేరింది. అల్‌బెరూని చారిత్రక కాలక్రమణికకు గట్టి పునాదిని వేశాడు.

BRAOU

ఇబ్న్ ఖల్దూన్ విమర్శనాత్మక వ్యాఖ్యానం, లోతైన ఆలోచన, విశాల దృక్పథం, శ్లాఘనీయమైన శైలి, చరిత్ర రచనను అసాధారణ స్థాయికి చేర్చాయి.

## 15.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. మధ్య యుగంలో చరిత్ర రచనాభివృద్ధికి ముస్లింలు, లేదా అరబ్బులు చేసిన సేవ ఎట్టిది ?

2. చరిత్ర రచనపై ఇస్లాం ప్రభావాన్ని తెలిపి, ఆల్‌బెరూని, ఇబ్న్ ఖల్దూన్‌ల సేవలను వివరించండి.

II. **క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. మధ్య యుగ ముస్లిం చరిత్ర రచనాభివృద్ధిలో, ఆల్ తబారీ, ఆల్ మసూదీల పాత్ర ఎట్టిది ?

## 15.5 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Barnes, H.E. | : | **A History of Historical Writing** |
| Thompson, J.W. | : | **A History of Historical Writing, 2 vols.** |
| Aron, Raymond Aran & Irwin, G.J. | : | **An Introduction to Philosophy of History** |
| Dants, Arthur. C | : | **Analytical Philosophy of History** |
| Ernst Breisach | : | **Historiography, Ancient, Medeival and Modern.** |
| Gardiner, Patrick | : | **The Philopophy of History.** |
| Mankel, Frank. E. | : | **Shapes of Philosophical History** |
| Shaik Ali, B | : | **History : Its Theory and Method.** |
| | | **Encyclopaedia Americana, Vol. 14.** |
| | | **విజ్ఞాన సర్వస్వం, 7వ సంపుటం, దర్శనాలు, మతాలు.** |


BRAOU

రచయిత : డా. జాస్తి దుర్గాప్రసాద్

# భాగం - 16 : మధ్య యుగం : భారతదేశంలో ముస్లిం చరిత్ర రచనాభివృద్ధి

విషయక్రమం


16.0 లక్ష్యాలు

16.1 పరిచయం

16.2 తురుష్క యుగం

16.2.1 అమీర్ ఖుస్రూ (1252 - 1325)

16.2.2 జియాఉద్దీన్ బరని (1286 - 1359)

16.2.3 ఇబ్న్‌బతూతా (1304 - 1378)

16.2.4 షమ్స్ ఇ. సిరాజ్ అఫీఫ్

16.2.5 ఇసామి

16.2.6 ఫెరిష్టా ( 1552 - 1623)

16.2.7 అబ్దుల్ రజాక్

16.3 మొగల్ యుగం

16.3.1 బాబర్

16.3.2 అబుల్ ఫజల్ (1551 - 1602)

16.3.3 బదౌని ( 1540 - 1615)

16.3.4 జహంగీర్

16.4 సంగ్రహంగా

16.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

16.6 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 16.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు,

- మధ్య యుగ భారతీయ ముస్లిం చరిత్ర రచనా సాంప్రదాయాన్ని విశ్లేషించగలగాలి.
- ముస్లిం చరిత్రకారులైన అమీర్ ఖుస్రూ, బరని, ఇసామి, బాబర్, అబుల్ ఫజల్, జహంగీర్ సేవలను వివరించగలగాలి.

## 16.1 పరిచయం

మధ్య యుగంలో చరిత్రను సృష్టించటంలో భాగస్వాములైన వారు, పాలకులు, పాలకుల దగ్గర బంధువులు. పాలకుల ఆజ్ఞ మేరకు ప్రభుత్వాధికారులు చరిత్ర రచనకు పూనుకొన్నారు. వీరే కాక, విదేశీ యాత్రికులు, రాయబారులు కూడా చరిత్ర రచనలు చేశారు. దీంతో, చారిత్రక సమాచారాన్ని పోల్చి చూసి, విశ్వసనీయమైన సమాచారాన్ని సంపాదించే అవకాశం కలిగింది. పైగా, హేతువాద ధోరణిలో, లౌకిక దృక్పథంలో చరిత్ర రచనను ప్రామాణికంగా రూపొందించే ప్రయత్నం జరిగింది. అయితే, విమర్శనాత్మక ధోరణిలో అన్ని అంశాలను విశ్లేషించి రాయడం జరగలేదు. చరిత్ర రచనలు పరిశోధనాత్మకంగా కంటే, కథనంగా సాగాయి.

## 16.2 తురుష్క యుగం

భారతదేశానికి ముస్లింల రాక చరిత్ర రచనలో విపరీతమైన మార్పుకు కారణమైంది. క్రీ.శ. పదకొండో శతాబ్దారంభంలో, ఘజనీ సుల్తాన్ మహమ్మద్‌తో ఉత్తర భారతదేశంపై ముస్లింల శక్తివంతమైన దాడులు ప్రారంభమయ్యాయి. ఈ దాడులు రెండు శతాబ్దాల తర్వాత తురుష్క మేమ్‌లూక్ వంశీయుడైన కుతుబుద్దీన్ ఐబక్ ఆధ్వర్యంలో, స్వతంత్ర ఢిల్లీ సల్తనత్ స్థాపనకు దారితీశాయి. ఢిల్లీ సల్తనత్ స్థాపనతో, భారతీయ చరిత్ర రచనలో ప్రాచీన ఇతిహాస - పురాణ సంప్రదాయానికి పూర్తిగా భిన్నమైన, వైవిధ్యంతో కూడుకొన్న, ఒక నూతన రచనా సంప్రదాయం ఆరంభమైంది. ఈ మధ్య యుగ చరిత్ర రచనలో పరిమాణం రీత్యా, గుణం రీత్యా, అసాధారణమైన అభివృద్ధి చోటు చేసుకున్నది. కొత్త భారతీయ వంశ చరిత్రల పరంపర ఉద్భవించింది. డాడ్‌వెల్ చెప్పినట్లు , మధ్య యుగ ఆంగ్లేయుల వంశ చరిత్రల కంటే, ఈ భారతీయ వంశ చరిత్రలు ఎంతో శ్రేష్ఠమైనవి.

ముస్లింలకు ఎప్పుడూ ఉన్నతమైన చారిత్రక మనస్తత్వమే ఉంది. ప్రవక్త మహమ్మద్ కాలం నుండే, వీరు చరిత్ర రచన చేయటమారంభించారు. భారతదేశానికి వచ్చేటప్పటికే వీరు, చరిత్రపై తమ నిర్దిష్టమైన అభిప్రాయాలను రూపొందించుకున్నారు. దీనికి కారణం, కొంత వరకు గ్రీక్‌లు బైజాంటీన్ సామ్రాజ్య ప్రభావాన్ని చూపించటం, మరికొంత టర్కీ, ఇరాన్, ఈజిప్ట్, మధ్య ఆసియాల్లోని తమ తోటి మతస్థుల నుండి జాలువారిన భావాల వెల్లువ. క్రైస్తవ వంశ చరిత్రలను ఆ మత సన్యాసులే రాశారు. అలా కాకుండా, రాజ్య వ్యవహారాల్లో నిమగ్న మైన వారో, జరిగిన చారిత్రక సంఘటనల్లో పాల్గొన్నటువంటి వారో, లేదా, సాధారణంగా ఆ సంఘటనలకు సమకాలీనులు రచనలు చేయటం, ఈ ముస్లింల చరిత్ర రచనా సంప్రదాయానికి ఒక లక్షణం. భారతదేశంలో ప్రాచీన యుగం నాటి పుక్కిట పురాణాలు, మత తత్వం, కట్టు కథల దశ మారి, చరిత్ర రచన మధ్య యుగంలో ముస్లింల ప్రాబల్యంలో వివేచనాత్మకమైన, లౌకికమైన , ఆధికారికమైన స్థాయికి ఎదిగింది. ప్రాచీన యుగానికి సంబంధించి, చరిత్ర పట్ల ఎంతో ఉన్నత భావాలున్న ప్రసిద్ధ చరిత్రకారుడు కల్హణుడు కూడా, రాజతరంగిణి రచనకు పద్యాన్నే సాధనంగా ఉపయోగించాడు. అయితే, ఇస్లాం మాత్రం భారతదేశంలో వేళ్లూనుకోటానికి కొన్ని శతాబ్దాల ముందే, ఈ పద్ధతికి స్వస్తి చెప్పింది. కాని, భారతదేశంలో ఇక్కడి సంప్రదాయాన్ననుసరించి, అమీర్ ఖుస్రూ వంటి ఒకరిద్దరు పండితులు పద్యంలో కూడా, చరిత్ర రచనలు చేయటం కనిపిస్తుంది.

ముస్లింల చరిత్ర రచనలు మొదట్లో ఖురాన్ భాష, అంటే అరబ్బీలోనే చేయబడ్డాయి. కాని, క్రీ.శ. 10వ శతాబ్దం చివర్లో, అరబ్బీ భాషకు ప్రత్యామ్నాయంగా పారశీకం ( పర్షియన్ ) ఉపయోగించబడటం ఆరంభ మైంది. పర్యవసానంగా, భారతదేశానికి ముస్లింలు వచ్చినప్పుడు, వారితోబాటే పర్షియన్ భాషలో చరిత్రను గ్రంథస్థం చేసే సంప్రదాయమూ వచ్చింది. దీంతో, ఆ తర్వాత కొన్ని శతాబ్దాల్లో వంశ చరిత్రలు, జ్ఞాపకాలు మొదలైన

BRAOU

చారిత్రక వాఙ్మయం అపారంగా ఆవిర్భవించింది. అయితే, ముందే చెప్పినట్లు, పశ్చిమ ఆసియాలో మాదిరిగానే భారతదేశంలో కూడా, చరిత్రకారులు చాలా వరకు అనేక మంది రాజులతోను, రాజాస్థానాలతోను సన్నిహితంగా మెలగటంతో, వారు తమ నాదరించిన ప్రభువుల పొగడ్తలతో రచనలను నింపేశారు. అంతేగాక, ఈ రచయితల్లో చాలా మంది ఉన్నత వర్గాలకు చెందినవారు కావటంతోను, ప్రభువులకు దగ్గరగా మెలగటంతోను, వారు సామాన్య ప్రజల జీవన పరిస్థితులను చిత్రించటం మానేశారు. దీని ఫలితంగా, అనేక సంఘటనలను తీర్చిదిద్దటంలో, సామాజిక, ఆర్థిక శక్తులు నిర్వహించిన పాత్రను వారు పూర్తిగా విస్మరించారు. మత ధర్మంలో శిక్షణ పొందని వారు, తమ కందుబాటులో లభిస్తున్న ఆధారాల సహాయంతో చరిత్రను రచించినా, చరిత్ర రచనలో మతం పట్టు కనిపిస్తూనే ఉంది. నీతిని బోధించటానికి చరిత్రే ప్రధానమైన ఆలంబనమైంది. చరిత్రలో జరిగే వాటన్నింటికీ, భగవంతుడే ప్రధాన కారకునిగా చిత్రించబడ్డాడు. ఇస్లాం మత ఆధిక్యతలో వారి గుడ్డి నమ్మకం, చరిత్ర రచనల్లో ఉక్తి వైచిత్రి (rhetoric) కి , అతిశయోక్తులకూ దారితీసింది. మానవతావాదానికి తావు లేకుండా పోయింది.

ఇటువంటి లోపాలున్నప్పటికీ, భారతదేశంలో ముస్లింల చరిత్ర రచనా సంప్రదాయంలో, అభ్యుదయాత్మకమైన అంశాలూ కొన్ని కన్పిస్తున్నాయి. ముఖ్యంగా, ఈ కాలంలో రాసిన చరిత్ర రచనల పరిమాణాన్ని చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. ఈ రచనల సారాంశాన్ని పరిష్కరించి, ఈలియట్, డౌసన్‌లు ఎనిమిది పెద్ద సంపుటాల్లో ప్రచురించారు. ఇంకా అనేకం ప్రచురణ కావాల్సినవున్నాయి. ఈ సంపుటాల్లో విషయం, చాలావరకు రాజకీయ సంబంధమైందే. అయితే, మనకు అపరిమితంగా లభిస్తున్న చారిత్రక వాఙ్మయం నుండి రాజకీయ విషయాలతో బాటు, ప్రజల సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల గూర్చి కూడా, ఎంతో కొంత సమాచారాన్ని రాబట్టొచ్చు. ఈ చరిత్ర రచనా సంప్రదాయంలో మరో సుగుణం ఏమిటంటే, వీలైనంతవరకు నమ్మదగ్గ ఆధారాల సహాయంతోనే, ముస్లింలు చరిత్రను రచించటం. ఈ నమ్మదగ్గ ఆధారాల్లో ప్రత్యక్ష సాక్షుల కథనాలున్నాయి. ప్రభుత్వ ప్రతినిధుల ద్వారానో, సంస్థల ద్వారానో అందిన సమాచారమూ ఉంది. రచయితల స్వీయానుభవమూ ఉంది. దీనికి కారణం, ఈ రచయితలు ఆస్థాన చరిత్రకారులు కావటం. సుల్తాన్ ఆదరణలో చరిత్రను గ్రంథస్థం చేసే పనికోసమే ప్రత్యేకంగా నియోగించబడ్డ ఆస్థాన చరిత్రకారులు, సుల్తాన్ ఘనతను భూతద్దంలో చూపటం ద్వారా, అతని అహాన్ని సంతృప్తి పర్చేవారు. చరిత్ర రచన ఒక వృత్తిగా మారటంతో, ఈ రంగంలో అసమర్థులు పక్కకు గెంటి వేయబడ్డారు. ఆస్థాన చరిత్రకారుల్లో వృత్తి ధర్మంగా పోటీ పెరగటంతో, రచనా కౌశలం అభివృద్ధి చెందింది. దీనికి తోడు, మహమ్మద్ మక్కా నుండి మదీనాకు పోయిన క్రీ.శ. 622 తేదీతో ఆరంభమైన ' హిజరా ' అనే కొత్త నిర్ణీతమైన శకాన్ని ముస్లింలు ఇస్లాం ప్రపంచమంతా ఒకే రీతిలో అవలంబించటంతో, కాలక్రమణిక విషయంలో గందరగోళం తప్పింది. అందులోనూ, అనేక శకాలు వాడుకలో ఉన్న మన దేశంలో, ఒకే రీతిలో ఈ ' హిజరా ' శకాన్ని ముస్లింలు తమ చరిత్రల్లో వాడటంతో, భారతీయ చరిత్ర రచనలో కాలక్రమణికకు సంబంధించిన లోపం తొలగిపోయినట్లైంది.

పాలకుల ఆదరణలో ఆస్థాన చరిత్రకారులు వృత్తి ధర్మంగా పుంఖానుపుంఖాలుగా వంశ చరిత్రలను రూపొందించారు. అయితే, ఈ యుగంలోనే సూఫీ మతాచార్యులు మరో రకం చారిత్రక వాఙ్మయాన్ని సృష్టించారు. ఈ రకం వాఙ్మయం, సాంఘిక, మత ఉద్యమాల గూర్చి వివేకవంతమైన భావాల అభివృద్ధి గూర్చి తెలుసుకోడానికి చాలా సహాయపడుతున్నది. సూఫీల ఉత్తరాలు, ఇష్టాగోష్ఠులు, వారి తత్వ, జిజ్ఞాసాత్మక, నైతిక రచనలు, విశ్వంపై, నీతిపై వారి అభిప్రాయాలు, ఇవన్నీ ఈ రకం వాఙ్మయంలో అంతర్భాగాలే. మధ్య యుగ భారతంలో కుల, మత, వర్గ అంతరాలను భక్తి ఉద్యమాలు ఛేదించిన విషయం మనకు తెలిసిందే. ఇందులో సూఫీల పాత్ర కూడా ఉంది. హిందూ మతంపై ఇస్లాం ప్రభావం, ఇస్లాంపై హిందూ మత ప్రభావం, భారతదేశంలో ముస్లింల చరిత్ర, అల్ప సంఖ్యాకుల ఆశలు, భయాలు, ముస్లిం సమాజంలోకి హిందూ సంప్రదాయాలు,

BRAOU

ఆచారాలు, ఆలోచనా పద్ధతులు చొచ్చుకుపోవటం మొదలైన విషయాలపై కూడా, సూఫీ సాహిత్యం వెలుగును ప్రసరిస్తున్నది. ఈ సాహిత్యంలో మార్మికవాదంపై రచనలు, సూఫీ మతాచార్యుల జీవిత గాథలున్నాయి. ప్రజల్లో పరివ్యాప్తి పొందిన ' వసీయత్ నామాలు ' (Wasiath Namahas) అనే ఇంకో రకం రచనలను కూడా, ముస్లింలు భారతదేశంలో ప్రవేశపెట్టారు. ప్రసిద్ధులైన ప్రభువులు, రాజనీతి విశారదులు తమ వారసులకిచ్చే ఆదేశాలు, లేదా చెప్పే ధర్మ సూత్రాల ( సూక్తుల)నే ' వసీయత్ నామాలు ' అని వ్యవహరిస్తారు. ఈ 'వసీయత్ నామాలు' నాటి పాలకుల విధానాలు, కార్యక్రమాల గురించి లోతుగా పరిశీలించటానికి తోడ్పడతాయి.

ఢిల్లీ సల్తనత్ యుగంగా, లేదా తురుష్క యుగంగా భాసిల్లిన క్రీ.శ. 13, 14, 15 శతాబ్దాల్లోని చరిత్ర రచయితల విషయానికొస్తే, ముందే చెప్పినట్లు వీరు పర్షియన్ల చరిత్ర రచనను భారతదేశంలో నమూనాగా తీసుకొన్నారు. భారతదేశంలో ముస్లింల చారిత్రక రచనకు మొట్టమొదటి ఉదాహరణ, క్రీ.శ. 12వ శతాబ్ది 'చాచ్‌నామా'. ఇది అరబ్బుల సింధూ దండయాత్రకు సంబంధించిన చారిత్రక వీర గాథ. దీని తర్వాత, పర్షియన్ భాషలో రచనల వెల్లువ ప్రారంభమైంది. ఈ యుగ ముస్లిం చరిత్రకారుల్లో మొదటి ప్రసిద్ధుడు, అమీర్ ఖుస్రూ.

## 16.2.1 అమీర్ ఖుస్రూ ( 1252 - 1325)

అమీర్ ఖుస్రూగా ప్రసిద్ధుడైన అబుల్ హసన్ యామినుద్దీన్ ఖుస్రూ, ఉత్తర ప్రదేశ్‌లో జన్మించిన తురుష్క వంశీయుడు. బాల్యం నుండీ కవిత్వంలో ఆసక్తిని కనబర్చిన ఇతడు, ఎనిమిదో ఏటనే కొన్ని పద్యాలను రచించాడు. ఇతని తండ్రి సుల్తాన్ ఇల్‌టుట్‌మిష్ కాలంలోను, అతని వారసుల కాలంలోను, ఉన్నత పదవులను నిర్వహించాడు. ఖుస్రూ కూడా కైకుబాద్, బుగ్రాఖాన్, జలాలుద్దీన్ ఖిల్జీ, అల్లా ఉద్దీన్ ఖిల్జీ, కుత్బుద్దీన్ ముబారక్ షా, ఘియాజుద్దీన్ తుగ్లక్ సుల్తాన్‌ల ఆదరణకు పాత్రుడైనాడు. ఈ సుల్తాన్‌లతో ఏర్పడ్డ సాన్నిహిత్యం,ప్రత్యేకించి మతాచార్యుడు నిజాముద్దీన్ ఔలియాతో ఏర్పడ్డ సాన్నిహిత్య మితనికి సమకాలీన రాజకీయ సంఘటనలను, సామాజిక పరిస్థితులను చాలా సన్నిహితంగా పరిశీలించటానికి అనేక అవకాశాల నిచ్చింది. కనుకనే , ఇతని రచనల్లో, అందులోను ప్రత్యేకించి, ' మస్నవీలు ' (Masnavis) ' దివాన్లు ' (Diwans) సమకాలీన చరిత్రకు అద్దం పడుతున్నాయి. ఫెరిష్టా అంచనా ప్రకారం, ఇతడు 92 రచనలను చేశాడు. ప్రధానంగా కవి అయినప్పటికీ, ఇతని గద్య, పద్య రచనల్లో అప్పుడప్పుడూ చారిత్రక విషయాలను కూడా, రచనా విషయంగా ఎంపిక చేసుకునేవాడు. ఈ రచనల్లో చాలా పోయాయి. అయినా, కొన్ని ముఖ్యమైన రచనలు లభిస్తున్నాయి.

మనకు లభిస్తున్న ఖుస్రూ చారిత్రక రచనలు ఆరు ఉన్నాయి. ఇవి ' కిరాన్ ఉస్ సాబైన్ (1299) , ' మిఫ్తా ఉల్ ఫతూ ' (1291) , ' తారీక్ ఇ ఆలై ' (1311), ' ఆషికా ' (1316), 'నుహ్ సి విహర్ ' (1319), ' తుగ్లక్ నామా' (1325) గ్రంథాలు. మొదటి చారిత్రక గ్రంథం ' కిరాన్ ఉస్ సాబైన్ ' లో, ఖుస్రూ బెంగాల్ గవర్నరైన బుగ్రాఖాన్ వ్యక్తిత్వంతోబాటు, నాటి సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను ఆసక్తికరంగా చిత్రించాడు. ' మిఫ్తా ఉల్ ఫతూ ' లో సుల్తాన్ జలాలుద్దీన్ ఖిల్జీ సైనిక దాడులను, విజయాలను, వివరించాడు. ఖుస్రూ చరిత్ర రచనలన్నింటిలోకి ముఖ్యమైంది, ' తారీక్ ఇ ఆలై ' . ఈ రచనను 1311లో పూర్తి చేశాడు. ఇందులో, సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ మొదటి 16 సంవత్సరాల పరిపాలనకు సంబంధించిన సంఘటనలు, ముఖ్యంగా మాలిక్ కపూర్ దక్షిణ భారత దిగ్విజయ యాత్రలపై వివరాలు, గద్యంలో విశదీకరింపబడ్డాయి. సుల్తాన్ గుజరాత్, చిత్తోడ్‌గఢ్, మాళ్వాలను జయించటం, అతను ప్రవేశపెట్టిన పరిపాలనా సంస్కరణలకు సంబంధించిన వివరాలు కూడా, ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి. సుల్తాన్ సూచన మేరకు రాసిన గ్రంథం కనుక, దీన్ని అధికారిక చిత్రీకరణగానే భావించొచ్చు. 'ఆషికా ' లో, అల్లాఉద్దీన్ కుమారుడు ఖిజ్రాఖాన్ గుజరాత్ పాలకుడైన కర్ణదేవుని కుమార్తె దేవల్దేవిని

BRAOU

ప్రేమించి, వివాహం చేసుకున్న విషయాన్ని ఖుస్రూ వివరించాడు. ఈ కవితా కథనంలో, భారత దేశ అందాలు కూడా చిత్రీకరించబడ్డాయి. ' నుహ్ సిపిహర్ ' గ్రంథంలో, ముబారక్ షా కాలం నాటి సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు ఆసక్తికరంగా, విశ్వసనీయంగా వివరించబడ్డాయి. ఖుస్రూ తన జీవిత చరమ దశలో రాసిన ' తుగ్లక్ నామా ' లో, ఖుస్రౌన్ షాను జయించి, ఘియాజుద్దీన్ తుగ్లక్ ఢిల్లీ సింహాసనాన్ని ఆక్రమించటానికి దారితీసిన పరిస్థితులను, అతని పరిపాలనా తొలి సంవత్సరాల్లో జరిగిన కొన్ని సంఘటనలను వర్ణించాడు. అయితే, ఖుస్రూ చేసిన ఈ రచనల్లో, మనకు వృత్తిపరమైన చరిత్రకారుడు కనిపించడు. కవి మాత్రమే దర్శన మిస్తాడు. ఇతని చరిత్ర తత్వంలో హేతువాదం కాక, ఆధ్యాత్మికతే కనిపిస్తుంది. కాని, ఆ కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చూస్తే, ఖుస్రూ చరిత్ర రచనకు చేసిన సేవను మెచ్చుకోకుండా ఉండలేం. ఖుస్రూ తాను చరిత్రకారుడినని ఎప్పుడూ చెప్పుకోలేదు. పైగా, సుల్తాన్‌ల సూచన మేరకో, వారికి కృతి సమర్పణకో, ఈ రచనలను తాను చేపట్టినట్లు స్పష్టం చేశాడు. ఉదాత్త భావన, రచనా శిల్పాలతో తన రచనల్లో కవిత్వానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చినప్పటికీ, ఖుస్రూ కొన్ని సందర్భాల్లో ఇతరులెవ్వరూ గమనించని చారిత్రక విశేషాలను వర్ణించాడు. అందుచేత, ఇతని రచనలను కేవలం కవిత్వంగా కొట్టి పారవేయలేం.

### 16.2.2 జియాఉద్దీన్ బరని ( 1286 - 1359)

తురుష్క యుగపు ప్రసిద్ధ చరిత్రకారుల్లో మొదటివాడు, మౌలానా జియాఉద్దీన్ బరని. విద్యావంతుల కేంద్రంగా ప్రసిద్ధి పొందిన కైథాల్ కి చెందిన ఒక సయ్యద్ కుటుంబంలో, బరని 1286లో జన్మించాడు. సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ కాలంలో బరని తండ్రి ఉన్నత పదవిలో ఉండేవాడు. బరని కూడా, ఖిల్జీల ఆదరాన్ని పొందాడు. తర్వాత కాలంలో, మొహమ్మద్ బిన్ తుగ్లక్ ఆస్థానంలో పదిహేడు సంవత్సరాలకు పైగా ఉన్నాడు. అతని విస్తృత చారిత్రక పరిజ్ఞానానికి, మేధస్సుకూ మెచ్చి, సుల్తాన్ మహమ్మద్ అతడ్ని అనేక రకాలుగా గౌరవించాడు. క్లిష్టమైన సమస్యల్ని పరిష్కరించటంలో, అతని సలహాలను కూడా స్వీకరించేవాడు. మహమ్మద్ మరణించాక, సుల్తానైన ఫిరోజ్ షా ఆదరణ పొందాలని బరని ప్రయత్నించాడు. కాని, ఫిరోజ్‌షా అతడ్ని పూర్తిగా నిరాదరించటమే కాక, కారాగారం లోకి కూడా నెట్టాడు. బరని తన చివరి రోజుల్లో దుర్భర దారిద్ర్యానికి గురై, దిక్కులేని వాడిగా మరణించాడు.

బరని గొప్ప మేధావి. న్యాయ శాస్త్రంలోను, తత్వ శాస్త్రంలోను ఆసక్తిని పెంపొందించుకోటమే కాక, చరిత్రలో సునిశితమైన శ్రద్ధను కనబర్చాడు. చరిత్ర ఉపయోగాల గురించి, దాని రచనా పద్ధతుల గురించి, విద్యా ప్రణాళికలో దాని స్థానం గురించి, స్పష్టమైన అవగాహన అతనికి ఉంది. మానవుడు జీవిత ప్రయాణంలో వేసే తప్పటడుగుల్ని సరిదిద్దుకోడానికి, చరిత్ర మార్గదర్శకమని భావించాడు. చరిత్ర అధ్యయనం వల్ల మంచీ చెడు విచక్షణా జ్ఞానం అలవడుతుందని, ఇతరుల అనుభవం నుండి గుణపాఠాలను నేర్చుకుంటామని చెప్పాడు. సత్యసంధత, నిష్పాక్షికత, భయరాహిత్యం, మంచి చరిత్రకారునికి ఉండాల్సిన లక్షణాలనే నమ్మకాన్ని వెలిబుచ్చాడు. చరిత్రకారుడు ఖచ్చితత్వాన్ని పాటించాలని, అతిశయోక్తులను తప్పనిసరిగా వర్జించాలని నొక్కి చెప్పాడు.

బరని రాసినట్లు చెప్పబడుతున్న ఎనిమిది చరిత్ర గ్రంథాల్లో, ప్రసిద్ధి పొందిన ' తారీఖ్ ఇ ఫిరోజ్ షాహి' , ' ఫతావా ఇ జహందరి ' లు మాత్రమే మనకు లభించాయి. 1358 ప్రాంతంలో రచన పూర్తైన ' తారీఖ్ ఇ ఫిరోజ్ షాహి ' గ్రంథంలో, సుల్తాన్ బాల్బన్ మొదలుకొని, ఫిరోజ్ షా తుగ్లక్ మొదటి ఆరు సంవత్సరాల పరిపాలన వరకు, చారిత్రక పరిణామాలు వివరించబడ్డాయి. ఇందులో, బాల్బన్, అల్లాఉద్దీన్ ఖిల్జీలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వ బడింది. బరని ఈ గ్రంథంలో, ప్రత్యక్షంగా తన పరిశీలనలో కన్పించిన మహమ్మద్ బిన్ తుగ్లక్ గుణగణాలను, బలహీనతలను విస్పష్టంగా వెలెత్తి చూపించాడు. ఒక పక్క సుల్తాన్ మేధా సంపత్తికి, సకల విద్యాపారంగతకు,

BRAOU

కళాహృదయానికి, ఇతరత్రా విశిష్ట ప్రతిభకు మెచ్చుకోలుగా జోహార్లర్పిస్తూనే, మరో పక్క అతని చపల చిత్తాన్ని, తలబిరుసుతనాన్ని, రాక్షసత్వాన్ని బరని విమర్శించాడు. రాజకీయ చరిత్రేకాక, పరిపాలనా నిబంధనలు, మంగోల్ దండయాత్రల పరంపరలు, దక్షిణ భారత దిగ్విజయ యాత్రలు, అల్లాఉద్దీన్ వస్తువుల ధరల నిర్ణయం, మొదలైన అనేక విషయాలను కూడా, బరని వర్ణించాడు.

అయితే, ఒక చరిత్రకారునికి ఉండకూడని భావ వృత్తిపరమైన బలహీనత (sentimental weakness) బరనిలో వ్యక్తమైంది. అంతేగాకుండా, చారిత్రక మనస్తత్వం ఉండీ, యదార్థాలను సేకరించటానికి, ఆస్థానంలో తనకున్న ప్రాబల్యం ద్వారా అవకాశం ఉండీ, తేదీలు, వివరాల విషయంలో అతని గ్రంథంలో లోపాలెందుకు చోటుచేసుకున్నాయో చెప్పటం కష్టం. అలాగే, ఫిరోజ్‌షాకి దైవత్వాన్ని ఆపాదించి, అతని ఆస్థానాన్ని అల్లా ఆస్థానంగా భావించి, అతని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విపరీతంగా పొగిడి, బరని చరిత్రకారునిగా తన స్థాయిని దిగజార్చుకున్నాడు. ఉత్తమ చరిత్రకారునికి ఉండాల్సిన లక్షణాలంటూ, ' తారీక్ ఇ ఫిరోజ్ షాహి' ఉపోద్ఘాత ప్రకరణంలో వేటినైతే వర్ణించాడో, ఆ విషయాలనే పూర్తిగా విస్మరించాడు.

బరని మరో రచన ' ఫతావా ఇ జహందరి ' లో ఒక ఉత్తమ పాలకునికి ఉండాల్సిన లక్షణాలను, సుగుణాలను, అర్హతలను విశ్లేషించాడు. ఇరాన్ తదితర ముస్లిం దేశాల నుండి నిదర్శనాలను చూపి, పరిపాలనా సూత్రాలను, ప్రభుత్వ ఆదర్శాలను కూడా అభివర్ణించాడు. సుల్తాన్‌ల గూర్చి, వారి ఆస్థానాల గురించి, వారు రూపొందించిన విధానాల గూర్చి, సమకాలీన ప్రజల సాంఘిక, ఆర్థిక జీవనం గూర్చి అతడిచ్చిన వివరమైన వర్ణనలు, మనకు అమూల్యమైనవి. లోపాలెన్ని ఉన్నా, బరని రచనలకు చారిత్రక విలువలేదని అనలేం.

ఖిల్జీల పాలనా కాల రాజకీయ చరిత్రను ' తబాకత్ ఇ నాసిరీ ' లో మిన్హాజ్ సిరాజ్ గ్రంథస్థం చేశాడు. ' తబాకత్ ' అంటే, సేకరణ అని అర్థం. చారిత్రక రచనకు ఈ గ్రంథం ఒక నమూనా కాలేకపోయినా, ముస్లింల ప్రాబల్యంలోని ఉత్తర భారతాన్ని గూర్చి చెప్పుకోదగ్గ సమాచారాన్నే ఇస్తున్నది. వసాఫ్ అనే రచయిత, పర్షియన్ మంగోల్‌ల చరిత్రను ' తారీఖ్ ఇ వసాఫ్ ' పేరుతో రాశాడు. దీనిలో భారతదేశానికి సంబంధించిన కొన్ని సంఘటనలను, ముఖ్యంగా అల్లాఉద్దీన్ ఖిల్జీ దక్కన్ దండయాత్రలను వివరించాడు. మాబార్ ప్రాంత ప్రజల సాంఘిక జీవనంపై వసాఫ్ చెప్పిన విషయాలను, చాలా వరకు మార్కోపోలో ధృవీకరించాడు.

BRAOU

### 16.2.3 ఇబ్న్‌బతూతా ( 1304 - 1378)

భారతదేశాన్ని సందర్శించి తమ దండయాత్రానుభవాలను, సమకాలీన దేశ పరిస్థితులను గ్రంథస్థం చేసిన అరబ్ యాత్రీకుల్లో అబూజైద్, సులేమాన్, ఆల్‌బెరూనీలతో బాటు, ఇబ్న్‌బతూతాని కూడా పేర్కొనాలి. ఉత్తర ఆఫ్రికాలోని మొరాకో దేశస్థుడైన బతూతా, తన 21వ ఏటనే విదేశీ యాత్రలను ప్రారంభించాడు. మక్కా, అలెగ్జాండ్రియా, కైరో, ఉత్తర ఆఫ్రికా, అరేబియా, కాన్‌స్టాంటినోపుల్, పర్షియా, సామర్ఖండ్, ఖురాసాన్, బాల్ఖ్, హీరట్ మొదలైన ప్రాంతాలను సందర్శించి, 1333లో భారతదేశం చేరాడు. ఆ మరుసటి సంవత్సరం మార్చిలో సుల్తాన్ మొహమ్మద్ బిన్ తుగ్లక్‌ను దర్శించాడు. బతూతా పాండిత్యానికి ముగ్ధుడైన సుల్తాన్ అతడ్ని ఢిల్లీ కాజీగా నియమించాడు. అయితే, ఈ పదవిలో బతూతా ఎనిమిది సంవత్సరాలు మాత్రమే ఉన్నాడు. తర్వాత సుల్తాన్ ఆదరాన్ని కోల్పోయి, కారగారంలో బందీ అయ్యాడు. చివరకు సుల్తాన్‌ను ఒప్పించి, కారాగారం నుండి విముక్తుడై, తర్వాత చైనాకు రాయబారిగా పోతూ, దక్షిణ భారతదేశాన్ని సందర్శించాడు. అతడు భారతదేశంలో గడిపిన దాదాపు 14 సంవత్సరాల్లో, ఇక్కడి పరిస్థితులను గూర్చి చాలా సమాచారాన్ని సేకరించాడు. ఈ సమాచారాన్నే, అరబ్బీ భాషలో తాను రచించిన ' రెహ్లా ' (Travels) లో చక్కగా ఉపయోగించుకున్నాడు.

విదేశీయుడు కనుక, ఒక ఆస్థాన చరిత్రకారునిగా సుల్తాన్ అభీష్టాన్ని అనుసరించే రచన చేయాలన్న ఆంక్ష బతూతాపై లేదు. దీంతో, అతడు స్వేచ్ఛగానే రాయగలిగాడు. అందుచేతనే, సమకాలీన రచయితల కథనం కంటే, అతని కథనం నమ్మదగింది.

ఇబ్న్‌బతూతా 'రెహ్లా' గ్రంథంలో, భారతదేశ భౌగోళిక పరిస్థితుల గూర్చి ప్రత్యక్ష సమాచారాన్నివ్వడంతో బాటు, ప్రజల సాంఘిక పరిస్థితులను, దైనందిన జీవితాన్ని బాగా వర్ణించాడు. ఆర్థిక స్థితి, పాలనా విధానంపై కొంత సమాచారాన్నిచ్చాడు. అత్యంత వివాదాస్పదమైన మహమ్మద్ బిన్ తుగ్లక్ పరిపాలనపై, ఈ రచన ఎంతో అమూల్యమైంది. సుల్తాన్ గుణగణాలు, పరిపాలనా తీరుతెన్నులు, ఉలేమాల పాత్ర, తిరుగుబాట్లను సుల్తాన్ ఎదుర్కొన్న తీరు, మొదలైన విషయాలను, విపులంగా రెహ్లా వివరిస్తున్నది. సామాన్య విషయాలను కూడా, బతూతా ఎంత సునిశితంగా పరిశీలిస్తాడో, ఈ గ్రంథాన్ని చూస్తే మనకు విశదమౌతుంది. అయితే, ఎంత ప్రజ్ఞావంతుడైనా, అనుభవజ్ఞుడైనా, ఎంతగా తనకున్న అధికారాన్ని, అవకాశాన్ని వాస్తవం తెలుసుకోడానికి ఉపయోగించుకున్నా గాని, విదేశీయుడైన బతూతాకు స్థానికులైన సామాన్య ప్రజల భాషలో పరిజ్ఞానం లేకపోవటంతో, ప్రత్యక్ష సమాచారాన్ని సేకరించటానికి అది కొంత ప్రతిబంధకమే అయింది. పైగా, సమకాలీన రచయితల్లాగే సంఘటనలను కాల పరిధిలో వరసగా వర్ణించటంలో, బతూతా ఏమాత్రం శ్రద్ధ చూపలేదు.

సుల్తాన్ ఫిరోజ్ షా తుగ్లక్ స్వయంగా కూర్చిన ఒక చిన్న వివరణ (brochure), 'ఫతూహాత్ ఇ ఫిరోజ్ షాహి' (Victories of Firoz Shah). ఇందులో, ఒక సనాతన ముస్లిం పరిపాలకునిగా సుల్తాన్ తనను తాను చిత్రించుకొన్నాడు. తన అనేక ఉదారమైన, ప్రజోపయోగకరమైన కార్యాలను వర్ణించాడు. సుల్తాన్ కూర్చిన ఈ రచననే, విస్తృత కథనంగా ఒక అజ్ఞాత రచయిత 'సీరత్ ఇ ఫిరోజ్ షాహి' పేర మలచాడు. ఈ రచయిత సుల్తాన్ ఆస్థానం లోని వాడేనన్న విషయం, స్పష్టంగా తెలుస్తున్నది. నాలుగు ప్రకరణాల్లో, ఫిరోజ్‌షా తుగ్లక్ పరిపాలనా కాలానికి సంబంధించిన రాజ్య వ్యవహారాలను, అడపాదడపా సందర్భవశాత్తూ, సుల్తాన్ విజయాల ప్రశంసను ఈ గ్రంథమిస్తున్నది.

BRAOU

### 16.2.4 షమ్స్ ఇ సిరాజ్ అఫీఫ్

1356లో పంజాబ్ లోని అబుహార్‌లో జన్మించిన సిరాజ్‌కు, తన తండ్రి సుల్తాన్ ఫిరోజ్‌షాకు ఆంతరంగికుడు కావటంతో, సుల్తాన్‌ను, అతని ఆస్థానంలోని వారిని, చాలా సన్నిహితంగా గమనించే అవకాశం లభించింది. ఇతని చరిత్ర రచనల్లో, 'మనాకిబ్ ఇ ఆబై', 'మనాకిబ్ ఇ సుల్తాన్ ఘియాజుద్దీన్ తుగ్లక్', 'తారీఖ్ ఇ ఫిరోజ్ షాహి' లు ప్రధానమైనవి. వీటిలో, చివరి రచనే అన్నింటిలోకి ముఖ్యమైంది. ఈ 'తారీఖ్ ఇ ఫిరోజ్ షాహి' గ్రంథం, బరని ఇదే శీర్షికతో చేసిన రచనకు కొనసాగింపు. దీన్ని, 90 ప్రకరణాల్లో 15వ శతాబ్దపు తొలి సంవత్సరాల్లో రచించాడు. సుల్తాన్ ఫిరోజ్ షా పాలనా కాల (1351 - 1388) పూర్తి కథనం, ఈ గ్రంథంలో మనకు లభిస్తున్నది. అయితే, ఇందులో ఒక 15 ప్రకరణాలు మాత్రమే ఇప్పుడు లభిస్తున్నా, నాటి రాజకీయ, సాంఘిక జీవనానికి సంబంధించిన విభిన్న అంశాలకు సారాంశంగా దీన్ని భావించొచ్చు. సిరాజ్ సమకాలీన సమాజంలోని స్త్రీ స్థానాన్ని గురించి విపులంగా వర్ణించాడు. ఆడపిల్లల తల్లిదండ్రుల కష్టాలను పేర్కొన్నాడు. కట్న పిశాచాన్ని గూర్చి చెప్పాడు. కొన్ని మధ్యతరగతి ముస్లిం కుటుంబాలకు వారి కుమార్తెల వివాహానికై, సుల్తాన్ ఫిరోజ్ ఎంత ఉదారంగా సహాయం చేశాడో వివరించాడు. సిరాజ్ రచనలో మత దురభిమానం వ్యక్తమైంది. సుల్తాన్ ఫిరోజ్‌ను ఆదర్శ ముస్లిం ప్రభువుగా చిత్రించే తాపత్రయంలో, అతడు సుల్తాన్ లోని లోపాలను విస్మరించటానికో, లేదా సమర్థించటానికో ప్రయత్నించాడు. ఏమైనా, ఫిరోజ్ షా పరిపాలనకు సంబంధించి సమగ్రమైన, విశ్వసనీయమైన రచనగా 'తారీఖ్ ఇ ఫిరోజ్ షాహి' అమూల్యమైందే.

16.2.5 ఇసామి

ఢిల్లీ సుల్తాన్ ఇల్టుట్‌మిష్ పరిపాలిస్తున్న కాలంలో, బాగ్దాద్ నుండి ఖ్వాజా అబ్ద్ మాలిక్ ఇసామి పూర్వీకులు భారతదేశం వచ్చారు. వారు వివిధ సుల్తాన్‌లను అనేక స్థాయిల్లో సేవించారు. 1311లో జన్మించిన ఇసామి, సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ పరిపాలనా సంస్కరణల పేరుతో అనుసరించిన విధానాలవల్ల, తన కుటుంబ సభ్యులతో అనేక కష్టాలకు గురయ్యాడు. 1327లో రాజధాని దౌలతాబాద్‌కి మారినప్పుడు అనుభవించిన బాధలు, ఇసామిని మహమ్మద్ బిన్ తుగ్లక్ పట్ల తీవ్ర విమర్శకునిగా రూపుదిద్దాయి. అతడు బ్రహ్మచారి. సాహిత్యంలో అభిరుచి ఉన్నవాడు. అనుభవించిన బాధల్ని మర్చిపోవాలనే ప్రయత్నంలో, మక్కా యాత్రకు సిద్ధమయ్యాడు. అయితే, 1347లో దక్కన్‌లో బహుమనీ రాజ్యాన్ని స్థాపించిన అల్లావుద్దీన్ బహమన్‌షా ప్రాపకం లభించటంతో, దౌలతాబాద్‌లోనే స్థిరపడ్డాడు.

ఇసామి రచించిన చారిత్రక కావ్యం ' ఫతూఉస్ సలాతిన్ ' (1349) . దీనిలో అతడు ఘజనీ పాలకుడు మహమ్మద్ కాలం నుండి తన రచనా కాలం వరకు, హిందూస్థాన్‌లో ముస్లింల కార్యకలాపాలను వర్ణించాడు. ఫిర్దౌసి ' షానామా ' గ్రంథంలో అనుసరించిన తీరునే, అతడూ అనుసరించాడు. ఇసామి తన రచనకు పూర్వ గాథలపైన, మిత్రులు, సహచరులు అందించిన సాధారణ నివేదికలకపైన ఆధారపడ్డాడు. సంఘటనలకు ప్రత్యక్ష సాక్షులైన వారి నుండి సమాచారాన్ని సేకరించి, మంగోల్ దాడులు, 1294లో దక్కన్‌పై అల్లాఉద్దీన్ ఖిల్జి దండయాత్ర వంటి సంఘటనలకు సంబంధించిన అనేక కొత్త విషయాలను మనకందించాడు. ప్రధానంగా యుద్ధాలు, ముట్టడులపైన దృష్టిని కేంద్రీకరించాడు. సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ అమానుషత్వాన్ని, క్రూరత్వాన్ని చిత్రించటంలో తన అక్కసును వెళ్ళ గక్కాడు. అయితే, బహమనీ సుల్తాన్ పాలనపై నమ్మదగ్గ విశేషాలనే అందించాడు. 14వ శతాబ్దపు ఈ పాలకులు, వీరి పరిపాలనపైనే బతూతా, బరనీలు కూడా తమ రచన లందించటంతో, ఇసామి రచనను వీరి రచనలతో తులనాత్మకంగా పరిశీలించి, ఆధునిక చరిత్రకారుడు సరైన అవగాహన నేర్పర్చుకోడానికి వీలు కలిగింది.

BRAOU

తాష్కెంట్‌కు చెందిన బద్రుద్దీన్ కూడా, మహమ్మద్ బిన్ తుగ్లక్‌పై రచనలు చేశాడు. ముఖ్యంగా, అతని ' షానామా ' కొన్ని సంఘటనలు జరిగిన కాలాన్ని నిర్ణయించటంలో సహాయపడుతున్నది. అయినుల్ ముల్క్ ముల్తాని రచన ' ఇన్షా ఇ మహ్రు' , తుగ్లక్ సుల్తాన్‌ల కాలం నాటి అనేక అధికార పత్రాల సంకలనం. సర్హింది రచించిన ' తారీఖ్ ఇ ముబారక్ షాహి ' గ్రంథం పరిమాణంలో చిన్నదే అయినప్పటికీ, సయ్యద్‌ల వంశ చరిత్రకు చాలా ముఖ్యమైంది. షేక్ రైజ్కుల్లా గ్రంథం ' తారీఖ్ ఇ ముష్తాకి ' సుల్తాన్ బహలాల్ లోడీ పాలనా కాలం నుండి అక్బర్ పరిపాలనా మధ్య కాలం వరకు జరిగిన సంఘటనలను వివరిస్తున్నది. లోడి, సూర్ వంశాల గాథలను మహమ్మద్ కబీర్ ' ' అఫ్సాన్ ఇ షహాన్ ' గ్రంథంలో నిక్షిప్తం చేశాడు.

మధ్య యుగ దక్షిణాపథంలోని రాజవంశాల గూర్చి రచన చేసిన ముస్లిం చరిత్రకారుల్లో, సయ్యద్ ఆలి తబతబ, ఫెరిష్టా, అబ్దుల్ రజాక్‌లు ముఖ్యులు. తబతబ ఇరాక్ నుండి 1505లో భారతదేశం వచ్చి, గోల్కొండ సుల్తాన్ కొలువులో చేరాడు. తర్వాత, అహ్మద్‌నగర్ సుల్తాన్ బుర్హాన్ నిజాం షా వద్దకు చేరాడు. ఇసామి రచనపై ఆధారపడి, బహ్మనీ రాజ్యస్థాపకుడైన అల్లా ఉద్దీన్ హసన్‌కు సంబంధించిన వివరాలను గ్రహించాడు. బహ్మనీ రాజవంశ చరిత్రను, అహ్మద్‌నగర్ నిజాం షాహి రాజవంశ చరిత్రను, తబతబ ' బుర్హాన్ ఇ మాసిర్ లో వివరించాడు. తన నాదరించిన సుల్తాన్ బుర్హాన్‌పై ప్రశంసల వర్షాన్ని కురిపించాడు. ఈ బలహీనత, మధ్య యుగ ఆస్థాన చరిత్ర రచయితలందరిలోనూ మామూలే.

16.2.6 ఫెరిష్టా (1552-1623)

ఫెరిష్టాగా ప్రసిద్ధుడైన మహమ్మద్ కాసిమ్, హిందూ షా ఇరాన్‌లోని ఆస్త్రాబాద్‌లో, 1552లో జన్మించాడు. బాల్యంలోనే అహ్మద్‌నగర్ తీసుకు రాబడ్డాడు. ఆ మరుసటి సంవత్సరమే, బిజాపూర్ చేరాడు. సైన్యంలో చేరి, యుద్ధంలో గాయపడి, శత్రువుల చేతుల్లో బందీ అయ్యాడు. కారాగారం నుండి తప్పించుకుని, మళ్లీ బిజాపూర్ చేరాడు. సుల్తాన్ రెండో ఇబ్రహీం ఆదిల్‌షా అభిమానాన్ని చూరగొన్నాడు. అప్పటి నుండి భారతదేశంలో ముస్లింల పరిపాలన గూర్చి సమాచారాన్ని సేకరించటం ప్రారంభించాడు. 35 గ్రంథాలకు పైగా, దీని కోసం ఉపయోగించుకున్నాడు. ఈ కృషి ఫలితమే, అతని ' తారీఖ్ ఇ ఫెరిష్టా ' గ్రంథ రచన.

'గుల్షన్ ఇ ఇబ్రహీమి ', లేదా ' నౌరస్‌నామా ' గా కూడా వ్యవహరించబడుతున్న ' తారీఖ్ ఇ ఫెరిష్టా ' గ్రంథం, గజనీ సుల్తాన్‌లతో ఆరంభమై, 1609తో ముగించబడింది. దీనిలో ఉపోద్ఘాతం, 12 భాగాలు, ముగింపు ఇవ్వబడ్డాయి. గ్రంథ ఉపోద్ఘాతంలోనే తాను 32 రచనల నుండి సమాచారాన్ని స్వీకరించినట్లు చెప్పటమే కాక, ఆ రచనలను కూడా వివరించాడు. అయితే, వీటిలో ఏ ఒక్కటి బిజాపూర్ అదిల్ షాహి రాజ వంశానికి చెందింది లేకపోవటం, చిత్రంగానే ఉంది. ఫెరిష్టా తన రచనలో మత దురభిమానాన్ని ప్రదర్శించినా, ఉత్తర భారత సనాతన ధోరణికి కొంత భిన్నమైన రీతిలో చరిత్రను పరికించాడు. చరిత్ర నీతి పాఠాలను బోధించే రీతిలో కాక, సంఘటనలను చాలా వివరంగా తెలియచేయటంలో ఆసక్తిని చూపించాడు. భారతదేశంలో ముస్లింల సమగ్ర చరిత్రను అందించటంలో, అతని కృషి చాలా మేరకు ఫలించిందనే చెప్పాలి. అతని రచనలో విజయనగరం పట్ల దురభిమానమే వ్యక్తమౌతుందని విమర్శకులు ఎంత చెప్పినప్పటికీ, ' తారీఖ్ ఇ ఫెరిష్టా ' ని పరిగణనలోకి తీసుకోకుండా వెలువడే ఏ విజయనగర చరిత్ర రచనైనా, అసమగ్రమే అవుతుంది.

16.2.7 అబ్దుల్ రజాక్ (1413 - 1482)

పర్షియా చక్రవర్తి షారుఖ్ రాయబారిగా, క్రీ.శ. 1443లో రజాక్ విజయనగర చక్రవర్తి రెండో దేవరాయల ఆస్థానానికి వచ్చాడు. విజయనగరంలో కొన్ని నెలలు గడిపాడు. ఇతని గ్రంథం ' మత్ల ఉస్ స అద్రైన్' ప్రధానంగా మధ్య ఆసియా చరిత్రను వివరిస్తుంది. అయినా, ట్రాన్స్ - ఇండస్ (trans - Indus) దేశాలకు సంబంధించి, 1335 నుండి 1448 వరకు వివరాలను కూడా రజాక్ పేర్కొన్నాడు. ముఖ్యంగా, విజయనగర వైభవాన్ని స్వయంగా వీక్షించిన ఇతడు, దాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ప్రజల జీవనాన్ని, ఆస్థాన మర్యాదలను, పండుగలనూ, ఇతర విశేషాలను చక్కగా వివరించాడు. ఎంతో అమూల్యమైన రాయల సింహాసనం, గజ బలం, సువాసన భరితమైన గులాబీలు, చక్కని పరిపాలనా వ్యవస్థ, ఏడు ప్రాకారాలతో విరాజిల్లే విజయనగరం, ప్రభుత్వ అనుమతితో నిర్వహింపబడుతున్న వేశ్యావృత్తి, మొదలైన అనేక విషయాలు, గ్రంథంలో చోటు చేసుకున్నాయి.

ఈవిధంగా, మధ్య యుగ తొలి దశలో అంటే, తురుష్క యుగంలో, భారతీయ చరిత్ర రచన పారశీక సంప్రదాయాల ప్రభావానికి విపరీతంగా లోనైంది. ప్రాచీన కాలంలోని లోటు సరిదిద్దబడింది. చారిత్రక వాఙ్మయం అపారంగా వెలువడింది. ఈ యుగంలో, చరిత్రకారులు చాలా వరకు సుల్తాన్‌ల ఆస్థానాల్లో ఉద్యోగులో, వారి ఆదరణకు పాత్రమైన కవులో, చరిత్ర రచయితలో కావటంతో, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను లభించిన సమాచార ఆధారంతో రచనలు చేశారు. అయితే, వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, మత దురభిమానం, దైవ చింతన వంటి లోపాలతో, నిష్పాక్షిక చరిత్ర రచన వెలువడటానికి కొంత ఆటంకమేర్పడింది. ఆధారాల ప్రామాణికతకున్న ప్రాధాన్యతను ఇంకా పూర్తిగా గుర్తించడం జరగలేదు. మానవతావాదం ఇంకా చరిత్ర రచనలో చోటు చేసుకోలేదు.

BRAOU

## 16.3 మొగల్ యుగం

భారతీయ చరిత్ర రచనలో మొగల్ యుగం ఆరంభమవటంతో, ఒక మార్పు స్పష్టంగా గోచరిస్తున్నది. దృక్పథంలో, రచనా విషయంలో, స్పందించే విధానంలో, కౌశలంలో సంపూర్ణ పరివర్తనం వచ్చింది. ఇది తురుష్క యుగం నాటి పరిస్థితికి భిన్నమైంది. వ్యక్తిగత ధన సంపాదనకో, ప్రభువుల నుండి బహుమానం పొందటానికో, ప్రభువుల ఆదరణకు కృతజ్ఞతా పూర్వకంగా రుణం తీర్చుకోడానికో అనే తీరులో, ఆస్థాన చరిత్రకారులు రచన చేసే పరిస్థితి మొగల్‌ల కాలంలో మారింది. వెనుకటి స్వార్థం ఇప్పుడు పెద్దగా లేదనే చెప్పాలి. మొగల్ యుగ చరిత్రకారుల చేతుల్లో, చరిత్ర రచన ఎక్కువ పరిణతిని , నిగ్రహ శక్తిని, హుందాతనాన్ని, విషయనిష్ఠతను సంతరించుకొన్నది. మొగల్‌ల పరిపాలనా కాలం నాటి ప్రజా సంస్థలు, నాగరికత, ప్రగతి, ఆలోచనా పద్ధతుల గురించి సమకాలీన చరిత్రకారుడు విశ్లేషించటం ప్రారంభమైంది. కేవలం రాజకీయ సంఘటనలకో, పరిపాలనా వ్యవస్థకో, చరిత్ర రచన పరిమితం కాలేదు. మతం, సమాజం, వ్యవసాయం, వర్తకం, సంస్కృతి, తదితర విషయాలు కూడా, చరిత్ర రచనలో రాజకీయాలు, పాలనా వ్యవస్థలతోబాటు సమాన ప్రాధాన్యతను పొందాయి. సమగ్ర చరిత్రకు అవకాశమేర్పడింది. రచయితల్లో ఎంత వైవిధ్యం ఉందో, రచనా విషయంలోనూ అంతటి వైవిధ్యం కనిపించటం ఆరంభించింది. వృత్తి ధర్మంగా రచనలు చేసే చరిత్రకారులే కాక, సాహితీ వేత్తలైన మొగల్ చక్రవర్తులు కూడా, చరిత్ర రచనను సుసంపన్నం చేశారు. పారశీక భాషలోనే ఎక్కువ రచనలు చేయబడ్డాయి. చక్రవర్తులు నియమబద్ధంగా ఆస్థానంలో చరిత్రకారులను ప్రోత్సహించి, సమకాలిక అధికార చరిత్రలను రాయించారు. ఆస్థాన చరిత్రకారులకు ప్రభుత్వ రికార్డులు, ఇతర సాక్ష్యపత్రాలు, ( చక్రవర్తుల ఫర్మానాలు, ఆస్థాన ప్రకటనా పత్రికలు, అధికారుల నివేదికలు మొదలైనవి) అందుబాటులో ఉంచబడ్డాయి. సాహితీవేత్తలైన చక్రవర్తులు కొందరు తమ జ్ఞాపకాలను నిక్షిప్తం చేయటంలో, స్వీయ చరిత్రలు, లేదా ఆత్మకథలనే కొత్త రకం చారిత్రక వాఙ్మయాన్ని సృష్టించారు. అధికారం చేతుల్లో ఉండీ, జహంగీర్ వంటి పాలకులు తమ దోషాల్ని, దురలవాట్లని నిస్సంకోచంగా తమ రచనల్లో వ్యక్తం చేశారంటే, దృక్పథంలో ఎంత మార్పు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. బదౌని వంటి చరిత్రకారులు చక్రవర్తులను తమ రచనల్లో తీవ్రంగా ఆక్షేపించినా కూడా, ఎటువంటి నిర్బంధానికి, శిక్షకు గురికాలేదంటే, ఎంతటి స్వేచ్ఛాయుత వాతావరణం, ఉదార భావాలు ఆనాడు నెలకొని ఉన్నాయో తెలుస్తున్నది. చరిత్ర రచనలో లౌకికతత్వం పెరగటం మరో విశేషం. మతతత్వ ధోరణి పూర్తిగా అంతర్ధానమైందని అనలేం గాని, మానవతావాదానికి ప్రాధాన్యత హెచ్చింది. మొగల్ యుగ చరిత్రకారులు చరిత్ర నీతి బోధకమనో, మరొకటో, ఎటువంటి చారిత్రక, తాత్విక చింతననూ ప్రదర్శించక పోయినా, ఈ కాలపు చరిత్ర రచన అసాధారణమైందే కాక, భారతీయ చరిత్ర రచనాభివృద్ధిలో మరో ముందడుగు కూడా.

BRAOU

### 16.3.1 బాబర్

మొగల్ యుగ చరిత్రకారులను, చరిత్ర రచనకు వారి సేవలను విశ్లేషించటమారంభించినప్పుడు ముందుగా, భారతదేశంలో మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించిన బాబర్ పేరును చెప్పాలి. బాబర్ తన స్వీయ చరిత్ర ' బాబర్ నామా ' , 'తుజుక్ ఇ బాబరి ' ( Babur's Dairy ) ని, అసలు మాతృభాషైన చాఘతాయి తురుష్క భాషలో రాశాడు. 1589లో బైరాంఖాన్ కుమారుడైన మీర్జా అబ్దుల్ రహీంఖాన్ ఇ ఖానన్ దీన్ని పర్షియన్ భాషలోకి అనువదించాడు. ఈ రచనను ఎప్పుడు ప్రారంభించాడో, బాబర్ పేర్కోలేదు. బహుశా, అతడు భారతదేశంపై దండయాత్ర చేశాక, రచన ఆరంభించి ఉండొచ్చు. ' బాబర్ నామా' మూడు భాగాలుగా ఉంది. మొదటి భాగంలో, ఫర్గానా సింహాసనాన్ని అధిష్ఠించినప్పటినుండి సామర్ఖండ్‌ను కోల్పోటం వరకు, వివరించబడింది. రెండో భాగంలో, సామర్ఖండ్ నుండి తరిమివేయబడటం మొదలుకొని, భారతదేశంపై చివరిసారి

ండెత్తటం వరకు వర్ణించబడింది. ఇక మూడవ భాగంలో, భారతదేశంలో అతని కార్యకలాపాలు చోటు చేసుకున్నాయి. అయితే, బాబర్ ఈ స్వీయ చరిత్రలో, 1503 - 4, 1508–1519, 1520-1525 మధ్య కాలాలకు సంబంధించిన వివరాల నివ్వలేదు. మొత్తం మీద, అతని 18 సంవత్సరాల జీవిత విశేషాలు, అతని ద్వారానే తెలుస్తున్నాయి. మిగతా కాలానికి సంబంధించిన విశేషాలను, అతని దగ్గరి బంధువైన మీర్జా హైదర్ దుఘ్లత్ రచించిన ' తారీఖ్ ఇ రషీది ' నుండి, ఇతని కుమార్తె గుల్ బదన్ బేగం రాసిన ' హుమాయూన్ నామా ' గ్రంథం నుండి గ్రహించొచ్చు.

స్వీయ చరిత్రలో బాబర్ తన కాలంలో జరిగిన రాజకీయ, సైనిక సంఘటనల గురించి, సమకాలీన ప్రసిద్ధ వ్యక్తుల గురించి చెప్పాడు. భారతదేశ భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి సౌందర్యం, వ్యాపారం, పరిశ్రమలు, సామాజిక పరిస్థితులను విపులంగా వర్ణించాడు. భారతదేశాన్ని ' అద్భుత దేశం ' గా చిత్రించాడు. నిశితమైన పరిశీలన, ఆహ్లాదాన్ని కలిగించే రచనా శైలి, భావాన్ని సూటిగా చెప్పే తీరు అతని రచనకు వన్నె తెచ్చాయి. చాలా చిన్న విషయాలను కూడా ఎంతో జాగ్రత్తగా అతడు వర్ణించిన తీరు, పాఠకులను అతని కాలంలోకి తీసుకు వెళ్తుంది. ప్రత్యక్ష సాక్షిగా, చరిత్రకారునిగా అతని నిజాయితీని, సమర్థతను మెచ్చుకోకుండా ఉండలేం. బెవరిడ్జ్ చెప్పినట్లు, బాబర్ స్మృతులు ఎప్పటికీ అమూల్యమైనవిగానే ఉండిపోతాయి.

పర్షియాలో సంభవించిన కొన్ని పరిణామాల వల్ల, 1527లో భారతదేశం వచ్చిన ఖ్వాన్డమీర్ బాబర్, హుమాయూన్‌ల ఆదరాన్ని పొందాడు. గొప్ప పండితుడు, చరిత్రకారుడైన ఇతడు, 12 చరిత్ర రచనలను చేశాడు. ముఖ్యంగా, హుమాయూన్ కాలంపై ' హుమాయూన్ నామా, ' ' కానూన్ ఇ హుమాయూని ' గ్రంథాల్లో , ఉపయోగకరమైన సమాచారాన్నిచ్చాడు. అయితే, తేదీల విషయంలో ఎటువంటి శ్రద్ధను చూపించలేదు. బాబర్ కుమార్తె గుల్‌బదన్ బీగం ( 1523 - 1603) అక్బర్ కోరిన మీదట బాబర్, హుమాయూన్‌ల జీవిత విశేషాలను 'హుమాయూన్ నామా ' శీర్షికతో, రెండు భాగాల్లో గ్రంథస్థం చేసింది. చాలా సంఘటనలతో ప్రత్యక్ష సంబంధం ఉంది కనుక, ఆమె వర్ణన ఎక్కువ నమ్మదగిందే. అయితే, గుల్‌బదన్ ఇచ్చిన సమాచారాన్ని మీర్జా హైదర్ రాసిన ' తారీఖ్ ఇ రషీది ' లో ఇచ్చిన వివరాల దృష్ట్యా పరిశీలించాలి. జౌహర్, సల్వానీలు కూడా, అక్బర్ కోరికపై చరిత్ర గ్రంథాలను రాశారు.

### 16.3.2 అబుల్ ఫజల్ (1551-1602)

షేక్ అబుల్ ఫజల్ హిజాజి అరబ్ తెగకు చెందినవాడు. ఇతని పూర్వీకులు సింధ్ ప్రాంతానికి వలస వచ్చారు. అక్కడి నుండి అజ్మీర్ సమీపంలోని నాగౌర్‌కు వచ్చి స్థిరపడ్డారు. ఫజల్ 1551లో ఆగ్రాలో జన్మించాడు. విద్యాభ్యాసం అయ్యాక అధ్యాపకునిగా, 20వ ఏటనే నియమించబడ్డాడు. మేధావిగా గుర్తింపు పొందాడు. 1573లో అక్బర్ ఆస్థానంలో ప్రవేశించాడు. తన అసాధారణ మేధస్సుతో, భక్తి శ్రద్ధలతో, విధేయతతో చక్రవర్తిని మెప్పించి, చివరికి ప్రధాని స్థాయికి ఎదిగాడు.

రాజకీయాల్లో, రాజ్య తంత్రజ్ఞతలో, యుద్ధరంగంలో కూడా చాలా ప్రసిద్ధుడైన అబుల్ ఫజల్, ప్రపంచానికి చరిత్రకారునిగానే సుపరిచితుడు. అక్బర్ కోరికపై అతని పరిపాలనకు సంబంధించిన విపులమైన చరిత్ర రచనకు పూనుకొన్నాడు. దీనికోసం, సమకాలీనుల రచనలను, కథనాలను సేకరించాడు. అవసరమైన ప్రభుత్వ వనరులన్నీ వినియోగించుకున్నాడు. అధికారుల నుండి నివేదికలను తెప్పించుకున్నాడు. ప్రసిద్ధి కెక్కిన కుటుంబాల్లోని వృద్ధుల నుండి సమాచారాన్ని సేకరించాడు. పరిపాలన, సాంఘిక పరిస్థితులు, ఆర్థిక జీవనానికి సంబంధించిన ప్రతి విషయంపై, వివిధ ప్రాంతాల నుండి సమాచారం తనకందేలా, అన్ని జాగ్రత్తలూ తీసు

BRAOU

కున్నాడు. దాదాపు ఏడు సంవత్సరాలు, అమిత శ్రద్ధాశక్తులతో దృష్టిని కేంద్రీకరించి, కృషిచేశాడు. అక్బర్ పాలనపై నాలుగు సంపుటాలు, పాలనా సంస్థల గూర్చి ఒక సంపుటాన్ని రాయాలని సంకల్పించాడు. చివరకు, 1598 నాటికి మొగల్ యుగ అధికార చరిత్రల్లో తలమానికంగా, ' అక్బర్ నామా ' ని తీర్చిదిద్దాడు.

'అక్బర్ నామా ' మూడు సంపుటాల్లో రాయబడింది. మొదటి దానిలో, తైమూర్ నుండి హుమాయూన్ వరకు, రెండో దానిలో, 1556లో అక్బర్ పరిపాలనను ప్రారంభించినప్పటి నుండి, 1602 వరకు గల విశేషాలు సవివరంగా వర్ణించబడ్డాయి. ఇక మూడో సంపుటం, ' ఐన్ ఇ అక్బరీ ' గా ప్రసిద్ధి కెక్కింది (ఐన్ ఇ అక్బరీ = Institutes of Akbar ). ఇది, సమకాలీన సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు అద్దం పడుతున్నది. ఈ మూడు సంపుటాల గ్రంథం, అక్బర్ రాజకీయ విధానాలను, పరిపాలనా విషయాలను వివరిస్తున్నది. సమకాలీన పరిస్థితులను తెలుసుకోడానికి ఈ గ్రంథం సమగ్రమైంది. అత్యంత ప్రామాణికమైనదీను. కేవలం యదార్థాలను నమోదు చేయడమే కాక, కార్యకారణ సంబంధాలను విశ్లేషించటం దీనిలో విశేషం. దీని ప్రాధాన్యతను వివరిస్తూ, బి.యన్.లూనియా ' ఇది భారత ప్రజల నియమాలు, చట్టాలు, స్థల వర్ణన, రెవెన్యూ పద్ధతి, సాంఘిక అలవాట్లు, ఆచారాలు, ఇంకా అనేక ఇతర సంగతుల సమాచార ఖని . . . . మొగల్‌ల చరిత్రను రాసే ఏ చరిత్రకారుడూ, ఈ గ్రంథం లేకుండా రాయలేనంతటి ముఖ్యమైంది ' అని చెప్పాడు.

అబుల్ ఫజల్ 'గీత ' ను పర్షియన్ భాషలోకి అనువదించాడు. అతడు రాసిన అనేక లేఖల సంకలనం, ' రుక్ ఆల్ ఇ అబుల్ ఫజల్ ', 'అధికార వార్తల సంకలనం' (Official despatches), ' ఇన్షా ఇ అబుల్ ఫజల్' లు కూడా, చరిత్రకారునిగా అతని కీర్తి ప్రతిష్ఠల్ని ఇనుమడింపజేసేవే.

అక్బర్ పరిపాలనా కాలానికి సంబంధించిన సామాన్య చరిత్ర గ్రంథాల్లో, అతని మీర్ బక్షీ ఖ్వాజా నిజాముద్దీన్ అహ్మద్ (1551-1594) రచించిన 'తబకత్ ఇ అక్బరీ' మూడు భాగాల్లో వెలువడింది. భారతదేశానికి ముస్లింల రాకతో ఆరంభించి, ఢిల్లీ సల్తనత్ యుగం వరకు మొదటి భాగం, బాబర్, హుమాయూన్, అక్బర్ (39 వ పరిపాలనా సంవత్సరం వరకు)ల పరిపాలనను రెండో భాగం, దేశంలోని ప్రాంతీయ రాజ్యాల చరిత్రను మూడో భాగం వివరిస్తున్నాయి. ముఖ్యంగా, అక్బర్ కాలంలోని గుజరాత్ చరిత్రకు ఈ గ్రంథం ప్రధానమైంది.

BRAOU

### 16.3.3 బదౌని (1540-1615)

బదౌనిగా ప్రసిద్ధికెక్కిన ముల్లా అబ్దుల్ కాదిర్, 1540లో బదౌన్‌లో జన్మించాడు. ఇతడు అబుల్ ఫజల్, ఫైజీల సహాధ్యాయి. 1574లో అక్బర్ ఆస్థానంలో ప్రవేశించాడు. అతని మేధస్సును, పాండిత్యాన్ని, మత, ధార్మిక చింతననూ చక్రవర్తి గుర్తించి, గౌరవించాడు. అయితే, అక్బర్ అబుల్ ఫజల్, ఫైజీల పట్ల చూపిన గౌరవాదరాలను తనపట్ల చూపలేదనే కోపంతో, తన సహాధ్యాయులంటే అసూయాద్వేషాలను పెంచుకున్నాడు. అక్బర్ స్వేచ్ఛాయుతమైన ఉదార మత తత్వాన్ని నిరసించాడు.

బదౌని అనేక గ్రంథాలను రచించాడు. వీటన్నిటిలో, బహుశా 1596లో పూర్తి చేసిన ' ముంతఖబ్ ఉత్ తవారిఖ్ ' ఎక్కువ ప్రసిద్ధి పొందింది. దీన్నే, ' తారీఖ్ ఇ బదౌని ' అని కూడా వ్యవహరిస్తారు. ఈ గ్రంథంలో, అక్బర్‌పై తీవ్ర విమర్శ చోటు చేసుకోడంతో, జహంగీర్ పరిపాలనకు వచ్చే వరకు గ్రంథం వెలుగు చూడలేదు. ఇందులో, మూడు భాగాలున్నాయి. మొదటి దానిలో, భారతదేశ చరిత్ర సబక్తజిన్ కాలం నుండి హుమాయూన్ మరణం వరకు, రెండో దానిలో, అక్బర్ మొదటి 40 సంవత్సరాల పాలనకు సంబంధించి, మూడో దానిలో, అక్బర్ ఆస్థానాన్ని అలంకరించిన ప్రముఖ మతాచార్యులు, కవులు, పండితుల జీవిత చరిత్రలు వివరించబడ్డాయి. సున్నీ మతస్థుడైన బదౌని, షియాలను, అక్బర్ ఉదార మత విధానాన్ని దుయ్యబట్టాడు. మోర్లాండ్, బదౌనీ రచనను చరిత్రగా కంటే, పత్రికా రచనకు సంబంధించిన జ్ఞాపకాలుగానే పరిగణించాలని చెప్పాడు.

### 16.3.4 జహంగీర్ (1569-1627)

జహంగీర్ తన స్వీయ చరిత్రను 'తూజుక్ ఇ జహంగీరి ' పేర, రెండు సంపుటాల్లో రాశాడు. దీన్నే, 'తారీఖ్ ఇ సలీం షాహి ', లేదా ' జహంగీర్ నామా ' అని కూడా వ్యవహరిస్తారు. మొదటి దానిలో, జహంగీర్ సింహాసనాసీనుడైన నాటి నుండి, అతని 12వ పరిపాలనా సంవత్సరం వరకు గల విశేషాలు వివరించబడ్డాయి. తర్వాత 17వ పరిపాలనా సంవత్సరం వరకు పొడిగించబడింది. అనంతరం, చక్రవర్తి అనారోగ్యం వల్ల, తాను స్వయంగా రాయలేక, తన పర్యవేక్షణలో ఆ బాధ్యతను ముతామిద్ ఖాన్‌కు అప్పగించాడు. మహమ్మద్ హాది ఈ రచనను జహంగీర్ పాలన ముగిసేవరకు కొనసాగించి, పూర్తి చేశాడు. ఈ గ్రంథం జహంగీర్ శీలం, వ్యక్తిత్వం, సమకాలీన సంఘటనలను వివరించే అతి చక్కని ప్రామాణికమైన రచనగా తీసుకోవచ్చు. అయితే, తనకు అసౌకర్యం అనిపించిన కొన్ని సందర్భాల్లో మాత్రం, ముఖ్యంగా, తండ్రికి వ్యతిరేకంగా తాను చేసిన తిరుగుబాటు, ఖుస్రావ్ మరణానికి దారితీసిన పరిస్థితులు, నూర్జహాన్‌తో తన వివాహం వంటి సందర్భాల్లో, జహంగీర్ విషయాలను మరుగుపర్చటం, మెరుగులు దిద్దటం చేసినప్పటికీ, కల్లాకపటం లేకుండా, స్పష్టంగా, అసాధారణ రీతిలో సంఘటనలను నమోదు చేశాడు. అబుల్ ఫజల్‌ని తానేవిధంగా హత్య చేయించాడో కూడా వివరించటం, దీనికి నిదర్శనం. అద్భుతమైన అతని వ్యక్తిత్వం, మన కళ్ల ముందు సజీవంగా నిలుస్తుంది.

షాజహాన్ పాలనలో చారిత్రక వాఙ్మయం మరింత సుసంపన్నమైంది. అతని ఆజ్ఞానుసారం అబ్దుల్ హమీద్ ' పాద్షానామా ' గ్రంథ రచన చేపట్టాడు. షాజహాన్ పరిపాలనా కాలానికి సంబంధించిన చరిత్రను సవివరంగా, విశ్వసనీయంగా హమీద్ దీనిలో వర్ణించాడు. అబుల్ ఫజల్ గ్రంథాన్ని నమూనాగా తీసుకొని, హమీద్ ఈ రచనను చేశాడు. మొగల్‌ల మత విధానంలో వచ్చిన మార్పును ఈ గ్రంథం విశదం చేస్తున్నది. ' షాజహాన్ నామా ' పేరుతో, ఇనాయత్ ఖాన్, మహమ్మద్ సాదిక్ ఖాన్‌లు వేర్వేరుగా, చరిత్ర గ్రంథాలను రచించారు. వీటితోబాటు, మహమ్మద్ సాలి గ్రంథం ' అమల్ ఇ సాలి ' కూడా, షాజహాన్ జీవిత చరిత్రగా పేరుపొందింది.

ప్రసిద్ధ మొగల్ చక్రవర్తుల్లో చివరివాడైన ఔరంగజేబ్, అరబ్బీ, పారశీక భాషల్లో గొప్ప పండితుడు. అతనికి తుర్కీ, హిందీ భాషల పరిజ్ఞానం కూడా ఎక్కువే. ఇస్లాం మత తత్వంలో, ధర్మశాస్త్రంలో ప్రావీణ్యత ఉంది. అయితే, అతని పరిశుద్ధ వాదం (Puritanism) కవిత్వానికి , కళలకు ఎదగటానికి అవకాశమివ్వలేదు. తన 21వ పరిపాలనా సంవత్సరంలో చరిత్ర రచనను నిషేధిస్తూ, ఆజ్ఞలను జారీ చేశాడు. అయినప్పటికీ, చారిత్రక మనస్తత్వం ఏ స్థాయికి చేరిందంటే, ప్రోత్సాహం లేకున్నా, ఆటంకాలను కల్పించినా, చరిత్ర రచన మాత్రం ఆగలేదు. మీర్జా మహమ్మద్ కాజిమ్ ' ఆలంగీర్ నామా ' ను రచించాడు. ఇది ఔరంగజేబ్ మొదటి పది సంవత్సరాల పరిపాలకునకు సంబంధించిన ప్రామాణికమైన అధికార చరిత్ర. మహమ్మద్ సాకి ముస్తయిద్ రచించిన 'మా సిర్ ఇ ఆలంగీరి', హకీరి రాసిన ' ఔరంగజేబ్ నామా ', ఖాఫీఖాన్‌గా ప్రసిద్ధుడైన మహమ్మద్ హషీమ్ గ్రంథం ' మున్తఖబ్ ఉల్ లుబాబ్ ', లేదా ' తారీఖ్ ఇ ఖాఫీఖాన్ ' మొదలైన చరిత్ర రచనలన్నీ, ఔరంగజేబ్ పాలన గురించి సంపూర్ణంగా వివరిస్తున్నాయి.

మొత్తం మీద, మొగల్ యుగ చరిత్ర రచనా సంప్రదాయంలో కొన్ని విషయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చారిత్రక వాఙ్మయం అపారంగానే ఉత్పత్తైంది. అయితే, సమ తూకం కన్పించదు. విషయ పరిధి విస్తృతమైంది. చరిత్ర సమగ్రతను, అర్థాన్ని, మానవతను సంతరించుకుంది. జీవిత చరిత్రలతోబాటు, స్వీయ చరిత్రలు, దిన చర్యలు, నమోదైన పుస్తకాలు, నిబంధన పత్రాలు (manuals), మొదలైన కొత్త రూపాలు, కౌశలం చోటు చేసుకున్నాయి. తురుష్క యుగంలో చరిత్ర రచనలో ప్రస్ఫుటంగా కన్పించిన మత తత్వ వైఖరి, మొగల్‌ల కాలంలో ప్రాధాన్యతను కోల్పోయింది. అయితే, ఈ యుగంలో ఏవిధమైన చరిత్ర తత్వం రూపొందలేదు. అధిక

BRAOU

శ్రమ కోర్చి, చరిత్రకారులు సమాచారాన్ని సేకరించారు. ఆ సమాచారాన్ని వివేకంతో వినియోగించారు. తమ భావాలను శక్తివంతంగానే వ్యక్తం చేశారు. కాని, ఇంకా చేయాల్సింది ఎంతో మిగిలింది. ముఖ్యంగా, ఆ సమాచారాన్ని అర్థవంతంగా వ్యాఖ్యానించాల్సి ఉంది. ఆధునిక యుగంలో, విదేశీయుల ప్రభావంతో, ఈ లోటు తీరింది.

## 16.4 సంగ్రహంగా

మధ్య యుగంలో ఇస్లాం మతం, పరిపాలనా వ్యవస్థలు, భారతీయ చరిత్ర రచనా విధానాన్ని, సంప్రదాయాన్ని చాలా ప్రభావితం చేశాయి. చరిత్రకారులు సంఘటనలను వరస క్రమంలో పేర్కొన్నారు. వారి దృష్టి పాలక వర్గాల వారి చుట్టూనే తిరిగింది. సామాన్య మానవుల జీవిత చిత్రణం, చరిత్ర రచనల్లో చోటు చేసుకోలేదు. కార్యకారణ సంబంధమైన అన్వేషణ కాని, కొత్త చరిత్ర తత్వాన్ని ప్రవేశపెట్టడం గాని జరగలేదు. అయితే, చారిత్రక సమాచారాన్ని పోల్చి చూసి, ప్రామాణిక సమాచారాన్ని అందించే ప్రయత్నాలు మాత్రం జరిగాయి.

## 16.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. భారతదేశంలో మధ్య యుగంలో జరిగిన ముస్లిం చరిత్ర రచనాభివృద్ధిని వివరించండి.
2. మధ్య యుగంలో చరిత్ర రచనాభివృద్ధికి అమీర్ ఖుస్రూ, బరని, ఇబ్నబతూతాల సేవలను వర్ణించండి.

II. **క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. అమీర్ ఖుస్రూ రచనలను పేర్కొనండి.
2. ఢిల్లీ సుల్తాన్‌ల యుగంలో చరిత్ర రచనాభివృద్ధిలో ఇసామీ పాత్రను విశ్లేషించండి.
3. మధ్య యుగ భారతీయ చరిత్ర రచనాభివృద్ధిలో మొగల్ చక్రవర్తుల పాత్రను వివరించండి.
4. మధ్య యుగ భారతీయ చరిత్ర రచనా సంప్రదాయాన్ని వివరించే చరిత్రకారులుగా బరని, ఫెరిష్టా, అబుల్ ఫజల్‌ల స్థాయిని అంచనా వేయండి.

BRAOU

## 16.6 ఉపయుక్త గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | *Barnes, H.E* | : | **A History of Historical Writing.** |
| 2. | *Elliot and Dowson (Ed)* | : | **History of India as told by its own Historians (8 vols.)** |
| 3. | *Hasan, M (Ed)* | : | **Historians of Medieval India.** |
| 4. | *Lunia, B.N* | : | **Some Historians of Medieval India.** |
| 5. | *Mukhia, Harbans* | : | **Historians and Historiography during the Reign of Akbar.** |
| 6. | *Kanungo, K.R.* | : | **Historical Essays.** |
| 7. | *Peter Hardy* | : | **Historians of Medieval India** |
| 8. | *Sarkar, J.N* | : | **History of History Writing in Medieval India.** |
| 9. | *Faruqi, Nisar Ahmad* | : | **Early Muslim Historiography.** |


*రచయిత : డా. జె. దుర్గాప్రసాద్*

## ఖండం - V

# ఆధునిక ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి

ఆధునిక యుగంలో ఐరోపాలో చరిత్ర పరిజ్ఞానాన్ని, చరిత్ర రచనా విధానాన్ని ప్రభావితం చేసిన అంశాలు అనేకం ఉన్నాయి. వీటిలో, సాంస్కృతిక పునరుజ్జీవనం, మత సంస్కరణోద్యమం, జ్ఞాన వికాసం ( భావ విప్లవం) ఉన్నాయి. భావుకత పునాదిగా కాల్పనిక వాదం ఆవిర్భవించింది. దీనికి ప్రతిస్పందనగా వచ్చిన, జ్ఞానం ప్రత్యక్ష విషయాలపైనే ఆధారపడి వుండాలని నమ్మే తాత్విక సిద్ధాంతమైన ప్రత్యక్ష జ్ఞానవాదం, జర్మన్ భావవాదం, మార్క్సీయ చారిత్రక వాదం మొదలైనవి, వీటిలో అంతర్భాగమే. వీటి ప్రభావంతో, చరిత్రలో ఆధ్యాత్మిక విషయాసక్తి తగ్గిపోయి, మానవీయ విషయాసక్తి పెరిగింది. దీనికి శాస్త్రీయ దృక్పథం తోడైంది. ఫలితంగా, చరిత్ర విషయ పరిధి విస్తృతం కావడమే కాక, వైవిధ్యాన్ని సంతరించుకుంది. లౌకికంగా, పక్షపాత రహితంగా, ఉపదేశాత్మకంగా, తాత్వికంగా, చరిత్ర రూపొందాలనే భావం, ఆకాంక్ష, చరిత్రకారుల్లో పెరిగింది. దీంతో, శాస్త్రీయ దృక్పథంలో చరిత్ర ఆధారాలను నిశితంగా పరిశీలించి, ప్రామాణికతను నిర్ధారించి, నమ్మదగ్గ చారిత్రక యదార్థాలను విశ్లేషించి, గతంలో ఏది, ఎందుకు, ఎలా జరిగిందనే క్రమబద్ధమైన, విశ్వజనీనమైన విశ్లేషణతో కూడిన వివరణ నివ్వడం, చరిత్రకారులకు ఆదర్శంగా మారింది. పరికల్పక చరిత్ర తత్వంలో అంతర్భాగంగా, ఈ విషయాలనే, ఈ ఖండంలో 17, 18, 19, భాగాలలో వివరించడమైంది.

BRAOU

# భాగం : 17 ఆధునిక ఐరోపా : ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్ర రచనా సంప్రదాయం

విషయక్రమం


17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 చరిత్రతత్వం

17.2.1 పరికల్పక చరిత్రతత్వం

17.3 ఆధునిక ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి - నేపథ్యం

17.4 సాంస్కృతిక పునరుజ్జీవన సంప్రదాయం

17.5 ప్రొటెస్టాంట్ ఉద్యమ ప్రభావం

17.6 జ్ఞాన వికాస సంప్రదాయం

17.6.1 గిబ్బన్

17.7 కాల్పనిక వాదం

17.8 ప్రత్యక్ష జ్ఞానవాద సంప్రదాయం

17.9 విజ్ఞాన శాస్త్ర చరిత్ర

17.10 17,18 శతాబ్దాల్లో శాస్త్ర ప్రగతి - చరిత్రపై దాని ప్రభావం

17.11 ప్రత్యక్ష జ్ఞానవాదం - 19వ శతాబ్దంలో చరిత్ర రచన

17.11.1 ఆగస్ట్ కామ్టే

17.11.2 రాంకె

17.11.3 బర్క్‌హార్ట్ తదితరులు

17.11.4 ముగింపు

17.12 సంగ్రహంగా

17.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

17.14 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 17.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు

- ప్రత్యక్ష జ్ఞానవాదం అంటే ఏమిటో వివరించగలగాలి.
- చరిత్రను సూత్రబద్ధమైన విజ్ఞాన శాస్త్రంగా రూపొందించే ప్రయత్నాలు, చరిత్ర రచనలో ఏవిధంగా జరిగాయో విశ్లేషించగలగాలి.

## 17.1 పరిచయం

జ్ఞానం ప్రత్యక్ష విషయాలపైనే ఆధారపడాలని నమ్మే తాత్విక సిద్ధాంతమే, ప్రత్యక్ష జ్ఞానవాదం. మొత్తం యదార్థాలను పరిగణించి, సంఘటనలను వాటి పరిణామ క్రమంలో గుర్తించి, వ్యక్తివాదాన్ని ప్రక్కకు గెంటి, ప్రజా సమూహాలను, జాతులను, సమాజాలను అధ్యయనంలో తీసుకోవడం జరిగింది. జరిగింది జరిగినట్లు విషయగతంగా, విశ్వసనీయంగా, చరిత్ర గతాన్ని వివరించేదిగా ఉండాలని, రాంకె మొదలైన వారు ప్రయత్నించారు.

## 17.2 చరిత్ర తత్వం

తత్వవేత్తలు చరిత్రాధ్యయనంలో ఎక్కువ కుతూహలాన్ని పెంచుకోడంతో, చరిత్ర తత్వం అనే భావన ప్రచారంలోకి వచ్చింది. చరిత్రను నిర్వచించాలన్నా, చరిత్ర స్వభావాన్ని వివరించడమన్నా ఎంత కష్టమో, చరిత్ర తత్వాన్ని వివరించటమూ అంతే కష్టం. ప్రత్యక్ష అనుభవానికి, ప్రత్యక్ష పరిశీలనకు, శాస్త్రీయ పరిశోధనకు అందనటువంటి అసాధారణమైన విషయాలను, వివేచన, తర్కం ఆధారంగా, ప్రాక్కల్పనలతో, క్రమబద్ధమైన ఆలోచనతో వివరించేది తత్వశాస్త్రం. చరిత్రకారుడు గతంలో ఏం జరిగిందో యదార్థాల ఆధారంతో, కథన పద్ధతిలో వర్ణించడంతో, సంతృప్తి పడలేదు. ఏ ప్రయోజనం కోసం, ఏ లక్ష్యంతో మానవుడు ప్రకృతిలో పరిసరాలతో పోరాటాన్ని సాగిస్తున్నాడో తెలుసుకోవాలని ప్రయత్నించాడు. మానవుడు తన జీవన విధానాన్ని మెరుగుపర్చుకునే ప్రయత్నంలో ఎదురైన అనుభవాలు, అనుభూతులు, సంఘటనల తీరుతెన్నుల్ని, వాటి అంతరార్థాన్ని వివరించటానికి పూనుకొన్నాడు. దీంతో, చరిత్రకారుడు తత్వవేత్తగా మారుతున్నాడు. అందుచేత, చరిత్ర తత్వం అనేది చారిత్రక చింతనల, పరిజ్ఞానాల ప్రత్యేక స్వభావాన్ని, స్పష్టంగా వివరించే ఒక సరైన ప్రయత్నమనే చెప్పాలి. అయితే, శ్రేష్ఠమైన జీవన గమ్యం ఏమిటనే విషయంలో, చరిత్రకారులు భిన్నాభిప్రాయాలను ప్రకటించటంతో, చరిత్ర తత్వాన్ని వివరించటం సంకీర్ణమైంది.

' చరిత్ర తత్వం ' అనే మాటను ఫ్రెంచ్ తత్వవేత్త వోల్టేర్ (Voltaire) ( 1694-1778) మొదటి సారిగా ప్రయోగించాడు. విమర్శనాత్మకమైన, లేదా శాస్త్రీయమైన చరిత్ర అనే భావంలో, అతనీ మాటను వాడాడు. జర్మన్ తత్వవేత్త హెగెల్ ( 1770 - 1831) ' ప్రపంచ చరిత్ర ' అనే అర్థంలో దీన్ని ఉపయోగించాడు. ఫ్రెంచ్ తత్వవేత్త, ప్రసిద్ధ సమాజ శాస్త్రజ్ఞుడు ఆగస్ట్ కామ్టే (Auguste Comte) (1798-1857) వంటి వాస్తవిక వాదులు, సంఘటనల క్రమాన్ని నియంత్రించే సామాన్య ధర్మాలను కనుగొనటమనే భావంలో వాడారు. బ్రిటీష్ చరిత్ర తత్వవేత్త కాలింగ్‌వుడ్ , చరిత్ర అంటే ఏమిటి ? అనే ప్రశ్నకు సమాధానం చెప్పే ప్రయత్నమే, చరిత్ర తత్వమని పేర్కొన్నాడు. కార్ (Carr) అభిప్రాయమూ ఇదే. కాలింగ్‌వుడ్ మరింత వివరిస్తూ, ' చరిత్ర తత్వం గతంతో కాని, గతం గురించి చరిత్రకారునికి ఉన్న భావాలతో గాని, ఏక పక్షంగా గాక, ఈ రెండు విషయాల పరస్పర

BRAOU

సంబంధం మూలంగా అనుబంధం ఉంటుంది' అనీ, ' చరిత్రకారుడు పరిశీలించేది నిర్జీవమైన గతాన్ని కాదు. సమకాలంతో ఏదో విధంగా సజీవ సంబంధం వున్న గతం ' అనీ, 'భావాల చరిత్రే చరిత్ర ' అనీ, అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

మనిషి జీవితానికి ఒక ప్రయోజనం, ఒక పరమార్థం అంటూ ఉంటే, ఆ మనిషితో ముడిపడివున్న చరిత్రకూ ప్రయోజనం ఉండి తీరాలనే నమ్మకం, మామూలుగానే ఏర్పడింది. శ్రేష్ఠమైన జీవనానికి మానవుడు మొదటి నుండీ పోరాటం చేస్తూనే వున్నాడు. అంటే, ఈ పోరాటాన్ని చిత్రిస్తున్న చరిత్రకారులకు ఈ శ్రేష్ఠమైన జీవన గమ్యం ఏమిటనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఇది ఒక్కో చరిత్రకారునికి ఒక్కో విధంగా కన్పించొచ్చు. హెర్బర్ట్ బటర్‌ఫీల్డ్ చరిత్రను తనకు తానుగా ముందుకు సాగే ఒక శక్తి అని వ్యాఖ్యానించగా, బ్యూరీ, బ్లాక్, బెకర్, బియర్డ్‌ల దృష్టిలో, చారిత్రక సంశ్లేషణం నిజంగా కాలావసరాలతో సంబంధం ఉన్నటుసంటిది. చరిత్ర గమ్యం సెయింట్-అగస్టీన్‌కు ' భగవన్నగరం ' (City of God) అయితే, హెగెల్‌కు అది ' పరిపూర్ణ రాజ్యం ' (Perfect State); క్రోస్ (Croce) కు ' బౌద్ధిక అంతర్దృష్టి(Intellectual Intution). కార్ల్ మార్క్స్ ఈ గమ్యాన్ని ' ఆర్థిక నియతివాదం ' (Economic Determinisim) దృష్ట్యా చూశాడు. ఈ శతాబ్దంలో అనేకమంది ఆలోచనాశీలుర కిది ' చారిత్రక సాపేక్షతావాదం ' (Historical Relativism) . ఈవిధంగా, చరిత్ర తత్వమనే మామూలు పదానికిలా అనంతంగా వ్యాఖ్యానాలొచ్చాయి.

చరిత్ర తత్వాన్ని మౌలికంగా చూస్తే, తాత్వికాన్వేషణకు సంబంధించిన రెండు భిన్నమైన, పరస్పర సంబంధం ఉన్న విభాగాలకు సంబంధించింది. వీటిలో మొదటిది, విమర్శనాత్మక, లేదా శాస్త్రీయ చరిత్ర తత్వం. ఇది చరిత్రకారులు చేసే తార్కికమైన జ్ఞాన మీమాంసకు సంబంధించిన లక్షణ చిత్రణం గురించి పరిశీలిస్తుంది. దీన్నే, విశ్లేషణాత్మక (analytical), లేదా స్థూలపరిశీలనాత్మక (synoptic) చరిత్ర తత్వమనికూడా అంటారు. 19వ శతాబ్దం నుండీ అభివృద్ధి చెందిన ఈ అధ్యయనం, చరిత్ర విజ్ఞాన శాస్త్రమా ? చరిత్రలో యదార్థాల, వివరణల స్థానం ఏమిటి ? చరిత్ర విషయగతంగా ఉండగలదా ? వంటి అనేక కీలకమైన సమస్యల్ని పరిష్కరించింది.

### 17.2.1 పరికల్పక లేదా భావనాత్మక చరిత్ర తత్వం

ఇక రెండోది, పరికల్పక (Speculative) చరిత్ర తత్వం. దీన్ని కాల్పనిక, లేదా భావనాత్మక చరిత్ర తత్వమని కూడా వ్యవహరించొచ్చు. సామాన్య చరిత్ర గ్రంథాలు తెలియజేసే పరిజ్ఞానాన్ని మించి, చారిత్రక సంఘటనల తీరుతెన్నుల్ని, వాటి అంతరార్థాన్ని, ప్రాముఖ్యాన్ని గ్రహించటానికి, ఈ పరికల్పక చరిత్ర తత్వం ప్రయత్నిస్తుంది. చరిత్రకు ఒక రీతి (Pattern) ఉందనే నమ్మకం, పూర్వ కాలం నుండి ఉంది. ప్రాచీన గ్రీక్ చరిత్రకారుడు డయొనీషియస్, చరిత్రను ' నిదర్శనాల ద్వారా బోధించే తత్వశాస్త్ర ' మన్నాడు. చరిత్ర దైవం నిర్దేశించిన ప్రకారం జరిగిందని హెసియాడ్, సెయింట్ అగస్టీన్‌లు భావించారు. అయితే, దీన్ని చరిత్ర తత్వమని వ్యవహరించడం తప్పు. ఎందుకంటే, చరిత్ర తత్వం అతీత శక్తుల ప్రభావాన్ని గుర్తించదు.

ప్రాచీన భారతీయులకు తమదైన ప్రత్యేక చరిత్ర తత్వం ఉంది. వారి దృష్టిలో, ధర్మార్థ, కామ, మోక్షో పదేశంతో కూడిన పూర్వ వృత్తాన్ని కథాయుక్తంగా చెప్పడమే, ఇతిహాసం, లేదా చరిత్ర. జీవిత విలువలను, వాటిని వాస్తవం చేసే ప్రయత్నాలను, తెలివితేటలతో సాధించిన అంశాలను విపులంగా వివరించే సమగ్ర చరిత్రే, భారతీయుల లక్ష్యం. మన మహాభారత రామాయణాలు, పురాణాలు, కావ్యాలు, శాసనాలు మొదలైనవన్నీ, ఈ సమగ్ర, లేదా సార్వత్రిక చరిత్ర అనే దృక్పథాన్నే ఊపిరిగా చేసుకున్నాయి. మన ప్రాచీనుల ఈ విశ్వజనీన దృక్పథం, వారి అసమాన చరిత్ర తత్వం నుండి పుట్టింది. పరమ పురుషుడైన బ్రహ్మ, సృష్టి స్థితిలయాలకు

మూలమనే నమ్మకాన్ని, మన ప్రాచీన వాఙ్మయం ప్రతిబింబించింది. ఈ నమ్మకమే, కల్పాలు, యుగాలు, కర్మ, పునర్జన్మ, అవతారాలు, వర్ణాశ్రమ ధర్మం, పురుషార్థ లక్ష్యం మొదలైన వాటినన్నిటినీ నిర్దేశించింది. ఇవన్నీ, చరిత్రను కేవలం గతం గురించి కథగా గాక, భవిష్యత్తులో కొనసాగుతుందనే ఆలోచనతో కూడిన, అర్థవంతమైన సజీవ వర్తమానంగా ప్రాచీన భారతీయుల దృక్పథాన్ని పెంపొందించాయి. వ్యక్తి పరిసరాల పరిమితులకు అతీతంగా, సార్వత్రిక ధోరణిని పెంచుకున్నాడు. ఈ చరిత్ర తత్వాన్నే, మన ప్రాచీన సాహిత్యం విశదీకరిస్తున్నది.

ఆధునిక యుగంలో చరిత్ర అంటే ఏమిటి ? అనే ప్రశ్నకు సమాధానం చెప్పి, చరిత్ర తత్వాన్ని రూపొందించిన మొదటివాడు, ఫ్రాన్సిస్ బేకన్ ( 1561-1626) . ఆధారాలను ఎత్తి రాయడం అతని దృష్టిలో చరిత్ర కాదు. ఆధునిక ప్రయోగాత్మక విజ్ఞాన శాస్త్ర ప్రధాన లక్షణమైన ఆగమన పద్ధతి (Inductive method) ద్వారా, ఆధారాలు చెప్పని విషయాలను వివరించటం, ఆధారాలు చెప్పే ఎక్కువ ప్రాముఖ్యం లేని అప్రస్తుత విషయాలను తొలగించటం, చరిత్రకారుల పని అని, అతడు తెలియజేశాడు.

అయితే, ఆధునిక చరిత్ర తత్వానికి బలంగా పునాది వేసినవాడు, ఇటలీ తత్వవేత్త, న్యాయశాస్త్ర ప్రవీణుడైన వీకో ( 1668 - 1744). ఈతడు సంపూర్ణ చారిత్రక పద్ధతిని, మానవ సమాజశాస్త్రాన్ని రూపొందించాడు. చరిత్ర పునరావృతమౌతుందని చెప్పాడు. కాని, సమాజం మీద ఈతని ప్రభావం కనిపించదు. దీనికి బహుశా ఈతని నిగూఢమైన భాష, భావ గర్భితంగా విషయాన్ని అంతర్దృష్టితో వివరించటం, హేతువాదాన్ని నిరాకరించటం, పైగా సమకాలీనుల కంటే ఆలోచనలో ముందుండటం, కారణాలు కావచ్చు.

18వ శతాబ్దంలో జ్ఞాన వికాస దృక్పథంలో చరిత్రను అధ్యయనం చేసినవారు, చరిత్రను మానవాళి ప్రగతి వైపుకు సాగే, శీఘ్రీయ గమనం (Linear Movement) గా భావిస్తే, కాల్పనికోద్యమ ప్రభావితులు చరిత్రను చక్రీయ గమనం (Cyclical Movement) గా తీసుకున్నారు. జర్మన్ తత్వవేత్త కాంట్(1724 - 1804), ఫ్రెంచ్ తత్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడైన కన్‌డార్సె (Condorcet) (1743-94) లు, మనిషి విచక్షణకు సంబంధించిన ప్రగతిశీల ప్రత్యక్ష రూపమని వర్ణించారు. వీకో మాదిరే, జర్మన్ తత్వవేత్త, కవి, విమర్శకుడైన హెర్డర్ (1744-1803) చరిత్రను చక్రీయంగా భావించాడు.

18,19 శతాబ్దాల్లోని పరికల్పక, లేదా భావాత్మక చరిత్ర తత్వ అధ్యయనాలను మూడు తరగతులుగా విభజించొచ్చు. అవి ప్రత్యక్ష జ్ఞానవాదం (Positivism), భావవాదం (Idealism) , చారిత్రకత, లేదా చారిత్రక వాదం (Historicism) . ఇవి గాక, ప్రత్యక్ష జ్ఞానవాద, భావ వాదాల ప్రాతిపదికతో, మార్క్సు వాదం (Marxism) ఆవిర్భవించింది. చరిత్ర తాత్విక చింతనా ధోరణుల్లో వచ్చిన ఈ పరిణామాల దృష్ట్యానే, ఆధునిక చరిత్ర రచనాభివృద్ధిని పరిశీలించాలి.

## 17.3 ఆధునిక ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి - నేపథ్యం

ప్రాచీన కాలంలో జ్ఞాన ప్రపంచానికి చరిత్ర అనే పదాన్ని అందించిన గ్రీకులే, దానిలోని వస్తుతత్వాన్ని సుసంపన్నం చేశారు. వారి చేతుల్లో అది అన్ని ప్రధాన లక్షణాలను సంతరించుకుంది. మానవదార్శనికంగా, (Humanistic), శాస్త్రీయంగా (Scientific), స్వీయ దార్శనికంగా (Self-revelatory) రూపొందింది. అనంతరం, రోమన్ల చేతుల్లో రాజకీయ సంఘటనల, వ్యక్తుల వర్ణనాత్మక జాబితాగా కుదించబడ్డ చరిత్ర, క్రీ.శ. 5 -13 శతాబ్దాల మధ్య, అతీత శక్తుల ప్రభావానికి, లేదా క్రైస్తవ ధర్మ ప్రభావానికి లోనైంది. చారిత్రక పరిజ్ఞానం మతావసరాలకు పరిమితమైంది. వివేచన కనుమరుగైంది. మత వాఙ్మయానికి సరిపోయేట్లు చరిత్ర విశ్లేషణను భావోపదేశం (allegorise) చేశారు.

BRAOU

## 17.4 సాంస్కృతిక పునరుజ్జీవన సంప్రదాయం

ఆధునిక యుగారంభంలో ఐరోపాలో అనేక ముఖ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. సాంస్కృతిక పునరుజ్జీవన ఫలితంగా, భౌగోళిక ఆవిష్కరణలు, మత సంస్కరణోద్యమం, వ్యాపార విస్తరణ, జాతీయ రాజ్యాల ఆవిర్భావం వంటి పరిణామాలొచ్చాయి. కళ, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రం, తత్వం, రాజనీతి, విద్యారంగాల్లోనూ, కొత్తగా ఘన కార్యాలు సాధించబడ్డాయి. ఈ నూతన విశేషాల ఫలితంగా, మానవీయ విషయాసక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొందాయి. ఈ మార్పులు చరిత్ర రచనా రంగలోనూ, ప్రభావాన్ని చూపించాయి. ' చరిత్ర లౌకికంగా, పక్షపాత రహితంగా, బోధనాత్మకంగా, తాత్వికంగా రూపొందాలి ' అనేది ఆదర్శమైంది. ఈ సాంస్కృతిక పునరుజ్జీవన సంప్రదాయాన్ని అనుసరించిన ముఖ్య చరిత్రకారులు, ఇటలీకి చెందిన రాజనీతివేత్త మాకియవెల్లి ( 1469 - 1527), ఫ్లోరంటైన్ దౌత్యవేత్త గ్వీకిర్డినీ (Guiccirdini) , ఫ్రాన్స్‌కు చెందిన గంగూయిన్ (Ganguin) , ప్రసిద్ధ తత్వవేత్త జీన్ బోడిన్ (Jean Bodin) ( 1530-96) లు.

## 17.5 ప్రొటెస్టంట్ ఉద్యమ ప్రభావం

సాంస్కృతిక పునరుజ్జీవనం చరిత్ర రచనలో విమర్శనాత్మక ధోరణి ప్రారంభం కావడానికి దోహదపడితే, ప్రొటెస్టాంట్‌ల తిరుగుబాటు ఫలితంగా జరిగిన మత కలహాలు, విమర్శనా శక్తికి మరింత పదును చేకూర్చాయి. విశ్వసనీయమైన సాక్ష్య పత్రాల అన్వేషణను, విశ్లేషణను ముమ్మరం చేశాయి. సర్ థామస్ మోర్, కావెండిష్, సర్ వాల్టర్ రాలీల రచనలు, దీనికి నిదర్శనం. ఫ్రాన్సిస్ బేకన్ మరో అడుగు ముందుకు వేసి, యదార్థాల పరిశీలనపై ఆధారపడి చరిత్రను శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని, ఏడో హెన్రీపై రాసిన వ్యాసంలో నొక్కి చెప్పారు. నేటి ప్రయోగాత్మక, విజ్ఞానశాస్త్ర ఆగమన పద్ధతిని తత్వశాస్త్రంలో ప్రవేశపెట్టింది ఇతడే. థామస్ హాబ్స్ (1588 - 1679) కూడా, తన ' సామాజిక ఒడంబడిక ' (Social Contract) ద్వారా రాజ్యం ఏర్పడిందని తెలియజెప్పి, లౌకికమైన, శాస్త్రీయమైన చరిత్ర రచనాభివృద్ధికి తోడ్పడ్డాడు.

## 17.6 జ్ఞాన వికాస సంప్రదాయం

17వ శతాబ్ది మధ్యభాగం నుండి 18వ శతాబ్ది చివరి వరకు, చరిత్ర రచనలో ఒక కొత్త సంప్రదాయం విలసిల్లింది. డెస్‌కార్టెస్ (Descartes) , ఐజాక్ న్యూటన్, జాన్ లాక్‌ల రచనలు, ఐరోపాలో భావ విప్లవానికి దారి తీశాయి. ఈ శతాబ్దాల్లో తత్వ, విజ్ఞానశాస్త్ర రంగాల్లో సాధించిన గొప్ప కార్యాలు, వీటి ఫలితంగా వచ్చిన కొత్త ధోరణులు కలిసి, భావ విప్లవమయ్యాయి. చరిత్ర రచనలపై కూడా ప్రభావం చూపించిన ఈ భావ విప్లవానికి మరో రూపమే, జ్ఞాన వికాసం (enlightenment) . ఈ యుగంలో, యదార్థాల నిర్ధారణకు, మానవ వికాసాన్ని విలువ కట్టేందుకు, 'ప్రగతి ' (Progress) భావన బాగా వ్యాపించింది. హేతువు మార్గదర్శక సూత్రమైంది. లాటిన్ బదులుగా, జాతీయ భాషలు అభిమానపాత్రమయ్యాయి. విమర్శనం ఆదర్శమైంది. చర్చ్ చరిత్ర రచనా సంప్రదాయం తీవ్రంగా విమర్శకు గురైంది.

ఈ జ్ఞాన వికాస యుగంలో చారిత్రక యదార్థాలను వాటి ఉపయోగం దృష్ట్యా చూడటం ఆరంభమైంది. ఇది వ్యవహారికతా భావం. దీన్నే, అమూర్త వ్యక్తివాద (abstract individualism)మంటారు. ఈ వ్యవహారికతా వాదం (Pragmatism), లేదా ఉపయోగితావాదం చరిత్రలోని అనేక అంశాలకు అన్వయించబడింది. దురభిమానం, పక్షపాతం లేకుండా వివేకంతో పరిశీలిస్తే, చరిత్ర ఉపయుక్తమైన సూచనలు, సలహాలిస్తుందనే భావనలో ' చరిత్ర తత్వం ' అనే మాట వాడుకలోకి వచ్చింది. పరిశోధకుల దృష్టి భౌతిక విషయాలతో బాటు, మానసికమైన అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలని వోల్టేర్, రాబర్ట్‌సన్‌లు భావించారు. ఈ కాలంలో, చారిత్రక సమస్యలకు లోకజ్ఞానాన్ని ఎక్కువగా అన్వయించారు.

BRAOU

జ్ఞాన వికాస సంప్రదాయానికి చెందిన మేధావుల్లో, డేవిడ్ హ్యూమ్, ఆడమ్ స్మిత్, వోల్టేర్, గిబ్బన్‌లు ప్రసిద్ధులు. వీరిలో, 18వ శతాబ్ది బ్రిటీష్ చరిత్రకారుడు హ్యూమ్, చరిత్ర అధ్యయనంలో సామాజిక సంబంధాలు, కళ, సాహిత్యం, నైతిక విలువల ప్రాధాన్యతను అంచనా వేయటంలో, వోల్టేర్‌కి మార్గదర్శకుడు. ఆడమ్ స్మిత్ చరిత్రను సాధనంగా చేసుకొని, ప్రసిద్ధ ' ది వెల్త్ ఆఫ్ నేషన్స్ ' (The Wealth of Nations) గ్రంథాన్ని రాశాడు. ఇక ప్రముఖ తత్త్వవేత్త వోల్టేర్ విజ్ఞాన శాస్త్రం, వివేచనలని నమ్మే హేతువాద సంప్రదాయానికి చెందిన చరిత్రకారులకు మూల పురుషుడు. ఈతడు 'వరల్డ్ హిస్టరీ ' (World History) , 'ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ ' (Philosophy of History) వంటి అనేక రచనల్లో, యుద్ధం, రాజకీయాలు మొదలైన విషయాలతో బాటు, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, భావ శక్తులూ చరిత్రకు ప్రధాన విషయాలేనని గుర్తించాడు. భవిష్యత్తును తీర్చిదిద్దటానికి నమూనాలను శోధించటం, చరిత్ర కర్తవ్యమని ఇతని నమ్మకం.

### 17.6.1 గిబ్బన్

ఆంగ్ల చరిత్రకారుల్లో గొప్పవాడిగాను, జ్ఞానవికాస యుగ చరిత్ర రచనా సంప్రదాయానికి ప్రతినిధిగాను, ఆధునిక ఐరోపా చరిత్ర రచనా శాస్త్రంలో ఎడ్వర్డ్ గిబ్బన్ (1737-94) కు ప్రత్యేక స్థానముంది. మౌలికాధారాలను, ఇతర సాక్ష్యాలను క్షుణ్ణంగా సూక్ష్మ పరిశీలన చేసి, విమర్శనాత్మకంగా విశ్లేషించి, సమాచారాన్ని క్రమబద్ధంగా పొందుపర్చుకుంటూ రాసిన దాన్నే మళ్లీ మళ్లీ రాస్తూ, ఆధారాలను ఎంత జాగ్రత్తగా విశ్లేషించాడో అంతే శ్రద్ధను, ఏకాగ్రతనూ, రచనా శైలిపైన, భావ వ్యక్తీకరణపైన చూపించి, రెండు దశాబ్దాలకు పైగా శ్రమించి, గిబ్బన్ తన మహా కావ్యం ' ది డిక్లైన్ అండ్ ఫాల్ ఆఫ్ ది రోమన్ ఎంపైర్ ' (The Decline and Fall of the Roman Empire) ని ఆరు సంపుటాలలో వెలువరించాడు. అతడీ రచనలో క్రైస్తవ మతం పట్ల కొంత వ్యతిరేక ధోరణినే కనబర్చాడు. రచనా విషయం పట్ల సానుభూతి చూపలేదు. సైనిక, రాజకీయ పరిణామాలలోనే శ్రద్ధ చూపాడు తప్ప, మిగతా విషయాలను ప్రస్తావించలేదు. అయినా, శ్రమతో కూడిన పరిశోధనకు, ఖచ్చితమైన అమరికకు, పారవశ్యాన్ని కలిగించే రచనా శైలికి అద్దం పడ్తున్న ఈ గ్రంథం, అత్యుత్తమ చారిత్రక రచనగానే గాక, మహోత్కృష్ట సారస్వత కళాఖండంగా కూడా, ప్రసిద్ధి పొందింది.

B R A O U

## 17.7 కాల్పనిక వాదం

భావనాపరంగా చరిత్ర 19వ శతాబ్దంలో గొప్ప మార్పులను చవిచూసింది. జ్ఞాన వికాస యుగ తీవ్ర వివేచనాత్మక భావ వైఖరికి ప్రతిస్పందనగా కాల్పనిక వాదం (Romanticism) అనే కొత్త సంప్రదాయం ఆవిర్భవించింది. ఫ్రెంచ్ విప్లవానికి ప్రాతిపదికను ఏర్పర్చిన మేధావి వర్గంలో వోల్టేర్, రూసో, మాంటెస్క్యూలను ప్రముఖంగా పేర్కొంటారు. వీరిలో వోల్టేర్ విచక్షణను ఆయుధంగా ఎక్కుపెట్టి, చర్చ్‌పై దాడిని ముమ్మరం చేస్తే, రాజ్యాంగ పరిష్కారానికి పిలుపు నిస్తూ, చరిత్ర అధ్యయనంలో పర్యావరణ ప్రాముఖ్యంపైకి దృష్టి మళ్ళించిన వాడు, మాంటెస్క్యూ. యధాపూర్వ స్థితిని వ్యతిరేకించిన మేరకు వీరిద్దరితో ఏకీభవించినా, రూసో మాత్రం ( ఎటువంటి నిరంకుశత్వానికైనా బద్ధ వ్యతిరేకి) ఒక కాల్పనికవాదిగానే మిగిలాడు. ఈ కొత్త సంప్రదాయంలో, హేతువు స్థానాన్ని ఊహ ఆక్రమించింది. తర్కబద్ధమైన ఆలోచన కంటే, అనుభూతికి ప్రాధాన్యత పెరిగింది. అంటే భావుకత పునాదైంది. నేటి జాతి మాంద్యాలన్నింటినీ పరిమార్చటానికి మానవులు సహజ పరిస్థితుల్లోకి వెళ్ళి, సహజ ప్రవృత్తులతో తిరిగి జీవించాలి. అదే, మనకు నిజమైన ఆనందాన్నిస్తుందనే అద్భుతమైన ఊహాతో, అనుభూతితో, ఫ్రెంచ్ తత్త్వవేత్త రూసో ఈ కొత్త సంప్రదాయానికి ఆద్యుడయ్యాడు. జర్మనీలో షెల్గెగల్, లెస్సింగ్‌లు, ఇంగ్లాండ్‌లో గ్రే, కౌపర్, బర్న్స్, కోల్‌రిడ్జ్, సౌత్, బైరన్, షెల్లీ, కీట్స్ వంటి వారు, యీ కాల్పనిక వాద సంప్రదాయానికి ప్రతినిధులు. ఈ రచయితల సాహిత్య ముఖ్య లక్షణం, ' విచిత్ర , సాహస, అద్భుత, అలౌకిక విషయాలపై ఆసక్తి, వ్యక్తి స్వేచ్ఛ, సంకల్ప ప్రాధాన్యత, అంతర జ్ఞానాలు, కాల్పనిక వాదంలో ప్రధానాంశా లయ్యాయి.

చరిత్ర రచనా రంగంలో ఈ కాల్పనిక వాదం వల్ల ప్రభావితులైన వారు, మేడమ్ డిస్టెల్, కార్లైల్, సర్ వాల్టర్ స్కాట్, ఫ్రూడ్, మెకాలే, కార్ల్ మార్క్స్, మిచలెట్, మొటైల్, బాంక్రాఫ్ట్ మొదలైనవారు. మహాపురుషులే, చరిత్ర రథ సారథులని కార్లైల్ పేర్కొన్నాడు. చరిత్ర మొత్తం వర్గ పోరాట చరిత్రని, వర్గ రహిత సమసమాజ స్థాపన దాని ధ్యేయమని, మార్క్స్ చరిత్ర గతిని విశ్లేషించాడు. మిచలెట్ (1798 - 1874) రాసిన ' హిస్టరీ ఆఫ్ ఫ్రాన్స్' (History of France) లో, కేవలం తన ఊహకు తోచిన కొంతమంది వ్యక్తుల మీద, సంఘటనల మీద మాత్రమే దృష్టిని కేంద్రీకరించి, చరిత్ర రచనలో కొంత కొత్త ధోరణిని అనుసరించాడు. ఇక బాంక్రాఫ్ట్ (1800-91) అమెరికన్ చరిత్ర రచనా సంప్రదాయానికి ఆద్యుడు. ఇతడు సాంప్రదాయిక ధార్మిక అధ్యయనాలతో సమానంగా, చరిత్ర, సామాజిక అధ్యయనాలంటే ఎక్కువ అనురక్తిని కనబర్చాడు.

## 17.8 ప్రత్యక్ష జ్ఞానవాద సంప్రదాయం

19వ శతాబ్దంలోనే కాల్పనిక వాద శిథిలాలపై ప్రత్యక్ష జ్ఞానవాదమనే కొత్త సంప్రదాయం బాగా ప్రచారం లోకి వచ్చింది. ఊహ, అనుభూతి, భావుకతలను ఆలంబనగా చేసుకున్న చరిత్ర రచనా విధానం, ఎక్కువ కాలం మనలేకపోయింది. కల్పనకు ప్రతిస్పందనగానే, ప్రత్యక్ష జ్ఞానవాదం ఆవిర్భవించింది. జ్ఞానం ప్రత్యక్ష విషయాల మీదనే ఆధారపడి ఉండాలని నమ్మే తాత్విక సిద్ధాంతమే, ప్రత్యక్ష జ్ఞానవాదం. ఏ విశ్లేషణైనా , ఏ వివేచనైనా అనుభవం మీద ఆధారపడాలి. శాస్త్రీయ విజ్ఞానికి విలువ నివ్వాలి. లోకజ్ఞతకు దగ్గరగా ఉండాలి. చరిత్ర రచనలో మనోకల్పనకు, సిద్ధాంత అన్వయానికి ప్రాధాన్యం ఇచ్చిన కాల్పనిక వాదం, విషయాల యదార్థ వర్ణన మీది కంటే, అవి కళాకారుని మనసులో కల్గే ఆత్మాశ్రయ సంవేదనల (Subjective sensations) మీదనే దృష్టి నిలిపింది. ఇక్కడ వ్యక్తులే ప్రధాన ఆకర్షణ కేంద్రం. భావనాత్మక విలువలే ముఖ్యం. చరిత్ర కల్తీ లేని కళ. అది విజ్ఞానదాయకం, నీతిబోధకం, ప్రయోజనకరం అనే విషయాన్ని కాల్పనిక వాదులు విస్మరించారు. అయితే, ప్రత్యక్ష జ్ఞానవాదులు మానవుని విషయ పరిజ్ఞానం అతని అనుభవాన్ని దాటి వెళ్లలేదని, అందుచేత చారిత్రక దృగ్విషయాల గూర్చి చేసే ఏ పరిశీలనైనా శాస్త్రీయ విధానానికి పరిమితం కావాలని నమ్మారు. ప్రత్యక్ష జ్ఞానవాద సంప్రదాయం చరిత్ర రచన అమూర్త స్థాయిని అధిగమించింది. యదార్థాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంది. సంఘటనల్ని వాటి పరిణామ క్రమంలో గుర్తించింది. వ్యక్తుల్ని కాక, ప్రజా సమూహాలను, జాతులను, సమాజాలను పరిగణించింది. సామాజిక విషయాలు పరస్పరం ఒకదానిపై ఒకటి అధారపడ్డాయని నమ్మింది. చరిత్రను సూత్రబద్ధమైన విజ్ఞాన శాస్త్రంగా తీర్చిదిద్దటం, ప్రత్యక్ష జ్ఞానవాదుల ఆశయం.

## 17.9 విజ్ఞాన శాస్త్ర చరిత్ర

అయితే, ఈ పరిణామం మొత్తం అనుకోకుండా ఒక్కసారిగా వచ్చింది కాదు. 17, 18 శతాబ్దాల్లో బహుముఖంగా జరిగిన శాస్త్ర పరిశోధనలు, వాటితో సాధించిన ప్రగతి, దీనికి ప్రాతిపదికని చెప్పాలి. విజ్ఞాన శాస్త్ర చరిత్ర , చరిత్ర రచనా శాస్త్రానికి ఒక ముఖ్యమైన ఉపచరిత్రగా భావించొచ్చు. ముఖ్యంగా, ఖగోళశాస్త్రంలో జరిగిన శాస్త్రీయ ఆవిష్కరణలు, మనిషి దృష్టిని, తద్వారా, చరిత్రకారుల అవలోకనాన్ని మార్చివేశాయి. కొత్త గ్రహాలను కనుక్కోవటం, దూరంగా సంకీర్ణంగా ఉన్న సౌర పద్ధతులు, అంతరిక్షం గురించి కొత్తగా అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని కల్పించాయి. భూగోళ సాపేక్ష ప్రాముఖ్యం, వర్తమాన స్థితి అవగతమయ్యాయి. దీంతో, మనిషి చేసే ప్రతి ఆలోచనలోను, ప్రతి యాదృచ్ఛిక కార్యకలాపంలోను, దైవానికి ఆసక్తి ఉందనేది పూర్తిగా అసంబద్ధమని, 16వ శతాబ్దంలోనే ఫ్రెంచ్ రచయిత మాంటైన్ (Montaigne) వెలిబుచ్చిన అనుమానం, శాస్త్రీయంగా సమర్థనీయమని తేలింది. చారిత్రక కార్యకారణ సంబంధం గూర్చి అంతా అతి ప్రాకృతికం, దైవికం అనే సిద్ధాంతానికిది గొడ్డలిపెట్టైంది. అలాగే, విజ్ఞాన శాస్త్రంలోని పరిణామ పరికల్పన, సామాజిక ప్రక్రియ



BRAOU

స్వభావాన్ని అర్థం చేసుకోవటంలో, చరిత్రకారుని అవగాహనను పెంపొందిస్తుందనే విషయం నిరూపితమైంది. చారిత్రక వికాసం గురించి చక్కగా సిద్ధాంతీకరింటానికి, ఒక స్థిరమైన ప్రాతిపదిక నిచ్చింది.

## 17.10 17,18 శతాబ్దాలలో శాస్త్ర ప్రగతి - చరిత్రపై దాని ప్రభావం

ప్రకృతి విజ్ఞాన ప్రగతికి దోహదపడ్డ వారు, మొదట ప్రాచీన గ్రీకులు, మధ్య యుగ మతాచార్యులు. అనంతరం చాలా అభివృద్ధి చెందింది. అయితే, విజ్ఞాన శాస్త్ర చరిత్రలో 17, 18 శతాబ్దాలు గొప్పవని చెప్పాలి. ఇతరత్రా ఏ రకంగాను లేనంతటి ప్రగతిని, విజ్ఞాన శాస్త్రం మౌలికంగా ఈ యుగంలో సాధించింది. మనిషి ఆలోచనా ధోరణి పూర్తిగా మారింది. కోపర్నికస్, గెలీలియో, హార్వే వంటి తొలి ఆధునిక శాస్త్రవేత్తల పరిశోధనలు విస్తృతమై, ప్రజా బాహుళ్యంలోకి చొచ్చుకు వెళ్ళటంతో, ఆ తర్వాత సంచలనాత్మక ప్రగతి జరిగింది. ఆంగ్ల వైద్యుడు విలియం హార్వే 1619లో తాను కనుగొన్న రక్త ప్రసరణ విషయాన్ని , 1628లో ప్రచురించిన గ్రంథంలో వెల్లడించటంతో, సంచలనం రేగింది. శాస్త్ర పరిశోధనలో ఇతనికి వెనిస్‌కు చెందిన సర్పి తోడ్పడ్డాడు. హార్వే శాస్త్ర పరిశోధన 17వ శతాబ్దంలో విజ్ఞాన శాస్త్ర చరిత్రకు నాంది పలికింది. డచ్ వైద్యుడు ఆచార్య బోయెర్హేవ్ (Boerhave) 1708లో వెలువరించిన రచన, 18వ శతాబ్దాంత శాస్త్ర చరిత్రకు శ్రీకారం చుట్టింది. అప్పటికే లీబ్నిట్జ్, న్యూటన్‌ల పరిశోధనా ఫలితాలు వెలుగు చూశాయి. గణిత, భౌతిక విజ్ఞాన శాస్త్రాల్లో, ముఖ్యంగా, యంత్ర శాస్త్రంలో న్యూటన్‌కు అపార ఖ్యాతిని సంపాదించి పెట్టాయి. అతని భూమ్యాకర్షణ సిద్ధాంతంతో, ఖగోళ శాస్త్రానికి సంబంధించి, కోపర్నికస్ విధానానికి బలమైన ప్రాతిపదిక ఏర్పడి, ఈ శాస్త్ర పరిశోధనలు మరింత ముమ్మరమయ్యాయి. టెలిస్కోప్, మైక్రోస్కోప్, మెర్క్యురీ థర్మామీటర్ వంటి పరికరాల తోడ్పాటు ఎక్కువైంది. విద్యుత్తు, అయస్కాంత రంగాల్లో ప్రయోగాలు జరిగాయి. రసాయన శాస్త్రంలో రాబర్ట్ బాయిల్ ముందంజ వేశాడు. జేమ్స్ హట్టన్ భూవిజ్ఞాన శాస్త్రంలో, జీవ, వైద్య శాస్త్రాల్లో మాల్పిఘి, జాన్‌రే, బఫన్, లినేయస్‌లు, 17, 18 శతాబ్దాల్లో తమ పరిశోధనల ద్వారా చరిత్ర కెక్కారు.

BRAOU

17వ శతాబ్దంలో అభివృద్ధి, ప్రధానంగా యంత్ర, భౌతిక, విజ్ఞాన, గణిత శాస్త్రాల్లో కనిపించింది. ఈ శాస్త్ర పరిశోధనలు చరిత్రను వ్యాఖ్యానించటంలో నైతిక, అర్థ, రాజనీతి, సమాజ శాస్త్రాలపైన కూడా చాలా ప్రభావాన్ని కనబర్చాయి. చరిత్రలో శక్తి సమతౌల్యం అనే (balance of power) భావన ఆవిర్భవించింది. అర్థశాస్త్రంలో ఎగుమతి, దిగుమతుల మధ్య తేడా (balance of trade) , వాణిజ్య చలనం (circulation of trade) , ద్రవ్య చెలామణి (circulation of money) వంటి పదజాలాలు ఉపయోగంలోకి వచ్చాయి. లాక్ ద్రవ్యరాశి సిద్ధాంతం (Quantity Theory of Money) అనే మరో పద ప్రయోగాన్ని చేశాడు.

18వ శతాబ్దంలో శాస్త్రాల అధ్యయనంలో రసాయన శాస్త్రం ప్రాబల్యాన్ని వహించింది. అంతకు ముందు కోపర్నికస్, గెలీలియో, న్యూటన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలు యదార్థాలే ప్రామాణికమైనవి, అభిప్రాయాలు నమ్మదగ్గవి కావని ధృవీకరించారు. కాని, 18వ శతాబ్దంలో కొంతమంది చరిత్రకారులు మర్యాద (courtesy) నియమ, విశ్లేషణా తర్కాలకు ప్రభావితులయ్యారు. దీంతో, వీరు సిద్ధాంతపరమైన ఊహాగానాలు చేయడమో, లేదా ముఖ్యమైన సాక్ష్యాన్ని విస్మరించటమో జరిగింది. అయితే, తర్వాత చారిత్రక గతాన్ని పునర్నిర్మించటంలో, యదార్థాల ప్రాధాన్యతను చరిత్రకారులు గుర్తించారు. హేతువాద యుగానికి మాంటెస్క్యూ, గిబ్బన్‌లు ప్రబల నిదర్శనంగా నిల్చారు. వారి ఆలోచనా ధోరణిపై, విజ్ఞాన శాస్త్రం గొప్ప ప్రభావాన్ని కనబర్చింది.

ప్రత్యక్ష జ్ఞానవాదాన్ని, ప్రకృతి రహస్యాలను తెలుసుకునే, ప్రకృతిని స్వాధీనం చేసుకునే మార్గాన్ని ఆలోచించే, తాత్విక చింతనగా తీసుకోవచ్చు. కాని, ప్రకృతి విజ్ఞాన మంటే యదార్థాల ధృవీకరణ, సూత్రీకరణ

అని, ప్రత్యక్ష జ్ఞానవాదుల అభిప్రాయం. ప్రాపంచిక సంఘటనలను మనిషి ప్రత్యక్షానుభవం దృష్ట్యా చెప్పాలని, ఈ సంప్రదాయ ప్రధాన పూజారి, ఆగస్ట్ కామ్టే పేర్కొన్నాడు. మత, అధిభౌతిక భావాల నుండి సామాజిక సంఘటనలను వేరుచేసి, వాటి అనుశీలనలో నియమాలను గూర్చి శాస్త్రీయంగా పరిశీలించాలని, కామ్టే, అతని అనుయాయుల అభిప్రాయం. అందుకే, వారి దృష్టిలో చరిత్ర 'సామాజిక భౌతిక శాస్త్రం' (Social Physics). కార్యకారణ సంబంధంలో గతానికి సంబంధించిన సంఘటనలను వివరించొచ్చని, దీని ఆధారంతో, ఆగమన పద్ధతి ద్వారా, భవిష్యత్తును తెలియజేసే నియమాలను రూపొందించొచ్చని వారి నమ్మకం. ఈ ప్రత్యక్ష జ్ఞానవాద చింతనా ప్రభావంలో, చరిత్రను సరికొత్తగా వ్యాఖ్యానిస్తూ, అనేక రచనలు వెలువడ్డాయి.

ఈ నూతన చారిత్రక ధోరణి దృష్ట్యా, చరిత్రకారులు తమ శక్తి మేరకు యదార్థాల ధృవీకరణకు పూనుకున్నారు. సాక్ష్యాన్ని ఖచ్చితంగాను, విమర్శనాత్మకంగాను పరీక్షించబూనారు. దీంతో, చారిత్రక పరిజ్ఞానం విపరీతంగా పెరిగింది. ఈ ధోరణి జాగ్రత్తగా జల్లెడ పట్టిన అపరిమితమైన సాక్ష్యాన్ని సేకరించటం ద్వారా, చరిత్రను సుసంపన్నం చేసింది. లాటిన్ శాసనాలపై, చారిత్రక మూల గ్రంథాలపై, ఇతర ఆధారాలపై ఎక్కువ సంఖ్యలో, సంపుటాలు వెలువడ్డాయి. వీటికి చరిత్ర రచనలో అత్యధిక ప్రాధాన్యమివ్వబడింది. పురావస్తు శాస్త్ర పరిశోధనపై దృష్టి ఎక్కువగా కేంద్రీకరించబడింది. జరిగింది జరిగినట్లు, విషయగతంగా, విశ్వసనీయంగా వివరాలదించేవారు అత్యుత్తమ చరిత్రకారులయ్యారు.

అయితే, గత చరిత్రను పునర్నిర్మించటంలో ఈ విధంగా ఇవ్వాల్సిన దానికంటే, ఎక్కువ ప్రాధాన్యతను యదార్థాల కివ్వటంపై, ఆ తర్వాత సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ విపులమైన పరిశోధన అంతిమ లక్ష్యం ప్రశ్నార్థకమైంది. వెలుగు చూసిన యదార్థాలు, అంత ఆసక్తికరంగా కన్పించలేదు. చరిత్ర యదార్థాలకు మాత్రమే పరిమితమైపోతే, అది శాస్త్రీయం అన్పించుకోదని కొంతమంది ప్రత్యక్ష జ్ఞానవాదులు వాదించ నారంభించారు. చారిత్రక యదార్థాల కంటే నిజంగా ఆసక్తికరమైన, ఎక్కువ ప్రాధాన్యత వహించిందేదో దాన్ని సాధించటానికి, ఆ యదార్థాలను ముడిసరుకుగా మాత్రమే వాడాలని కామ్టే వాదించాడు. సమాజ శాస్త్రం అనే నూతన విజ్ఞాన శాస్త్రాన్ని అతడు ప్రతిపాదించాడు. మానవ జీవనానికి సంబంధించిన యదార్థాలను కనుక్కోవటంతో ఆరంభమయ్యే ఈ సమాజ శాస్త్రం, ఆ యదార్థాల మధ్య పరస్పర కార్యకారణ సంబంధాల గురించి అన్వేషించ బూనుకుంటుందని అతని అభిప్రాయం.

BRAOU

ప్రత్యక్ష జ్ఞానవాదుల దృష్టిలో, చరిత్రకు, ప్రకృతికి ప్రాథమికంగా ఎటువంటి భేదం లేదు. చారిత్రక ప్రక్రియ ప్రకృతి ప్రక్రియ వంటిదేనని, కాబట్టి, ప్రకృతి శాస్త్ర అధ్యయన పద్ధతులను చరిత్రను వ్యాఖ్యానించ టానికి అన్వయించొచ్చని, వీరి అభిప్రాయం. డార్విన్ 1859లో తన 'ఆరిజిన్ ఆఫ్ స్పీషీస్' (Origin of Species) గ్రంథంలో, పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. జీవ పరిణామం ప్రకృతి వరణం ద్వారా వస్తుందని, జాతులు ఒక కాలప్రక్రియలో పుడ్తాయని అతడు చెప్పాడు. డార్విన్ ఈ సిద్ధాతం చెప్పటానికి చాలా కాలం ముందే చరిత్రకారులు భావాల, సంస్థల చరిత్రలో ఈ పరిణామ సూత్రాన్ని కనుక్కున్నారు. ఈ చారిత్రక మార్పును, సాధారణీకరణాన్ని ప్రకృతి గురించి అధ్యయనం చేస్తున్నప్పుడు, డార్విన్ తన అధ్యయనానికి అన్వయించి, ఈ సిద్ధాంతాలను రూపొందించాడు. అతని పరిశోధన చారిత్రక చింతనా గౌరవాన్ని పెంచింది. ఫలితంగా, ఇటు చరిత్రకారులు, అటు శాస్త్రవేత్తలు తమ అధ్యయన విషయాలను ప్రగతిశీలమని ఆమోదించారు. పరిణామం అనే మాట చారిత్రకంగాను, ప్రకృతిపరంగాను కూడా, వాడుకలోకి వచ్చింది.

19వ శతాబ్దంలోనే, చరిత్ర ఆధారాలను ఉపయోగించటంలో ఒక కొత్త పద్ధతి ఆరంభమైంది. దీన్ని 'భాషా శాస్త్ర సంబంధ విమర్శన పద్ధతి' (Philological Criticism) అని వ్యవహరిస్తారు. ఇందులో రెండు ప్రక్రియలు

న్నాయి. ఎక్కువ నమ్మదగ్గ, అంతగా నమ్మలేని భాగాలుగా వేరుచేసే సమర్థతను, చరిత్రకారునికి కలిగించే భిన్న అంశాల కింద ఆధారాలను విశ్లేషించటానికి సంబంధించింది మొదటిది. ఇక రెండోది, అత్యంత విశ్వసనీయమైన గతం గురించి అంతర్విమర్శనానికి సంబంధించింది. గ్రంథ కర్త ( సాక్ష్య పత్ర రచయిత) దృక్పథం, యదార్థాలను నివేదించటంలో ఏవిధంగా ప్రభావం చూపించిందో, దీంతో చరిత్రకారునికి విరూప చిత్రణలకు ఏవిధంగా అవకాశాన్ని కల్పించిందో, ఈ రెండో ప్రక్రియ తెలియజేస్తుంది. ప్రత్యక్ష జ్ఞానవాదులు చెప్పినట్లు, సామాన్య సూత్రాలను రూపొందించటానికి తొందరపడేలా కాకుండా, ఈ కొత్త విమర్శనాత్మక పద్ధతి చరిత్రకారుల దృష్టిని యదార్థాలను ధృవీకరించుకోటానికి పరిమితం చేసింది.

ఈ విమర్శనాత్మక పద్ధతిని ప్రవేశపెట్టటంతో, చారిత్రక చింతనకు సంబంధించి, స్వతంత్ర ప్రతిపత్తి వృద్ధి చెందింది. ఇది ప్రత్యక్ష జ్ఞానవాద తత్వ తీవ్రతను నిరోధించటంలో, కొంతమేరకు సఫలీకృతమైంది. అయినా, ఆ తత్వం దీనిపై లోతుగానే ప్రభావం చూపింది. 19వ శతాబ్దంలో, చరిత్రకారులింకా యదార్థాలను ప్రత్యక్ష జ్ఞానవాద తత్వం దృష్ట్యా చూడటం మానలేదు. యదార్థాలను పరిగణించే పద్ధతిలో వీరు రెండు నియమాలను అనుసరించారు. ప్రతి యదార్థాన్ని దేనికదే విడివిడిగా , స్వతంత్రంగా ధృవీకరించటం, మొదటి నియమం. ఆ యదార్థంపై ఆ చరిత్రకారుని ప్రభావం ఉండకూడదనేది, రెండో నియమం. అంటే, చరిత్రకారునికి సంబంధించిన ఆత్మగత విషయాలను యదార్థం నుండి వేరు చేయటానికి, ఈ రెండో నియమం ఉద్దేశించబడింది. యదార్థాలను యదాతథంగా తెలియచెప్పడం చరిత్రకారుని విధి. ఆ యదార్థాలపై అతడు తన తీర్పు లివ్వకూడదు. మొదటి నియమం, చరిత్రకారులు వివరాలను ఖచ్చితంగా అందించడంలో తర్ఫీదు నిస్తుంది. సమస్యలపైకి దృష్టిని మళ్లించకుండా, చరిత్రకారుణ్ణి ఇది నిరోధిస్తుంది.

ఇంతకు ముందే చెప్పినట్లు, మత, అధిభౌతిక భావాల నుండి సామాజిక సంఘటనలను వేరు జేసి, వాటి అనుశీలనలో వాటి నియమాలను గూర్చి శాస్త్రీయంగా పర్యవేక్షించాలని, ప్రత్యక్ష జ్ఞానవాదుల అభిప్రాయం. అంటే, భౌతిక విజ్ఞానం, రసాయన , జీవశాస్త్రాల్లో ఉన్నట్లే, నియమాల శాస్త్రీయ పరిశీలనను సమాజాన్ని గూర్చిన అధ్యయనంలో కూడా ప్రవేశపెట్టడానికి వీరు ప్రయత్నించారు. సమాజ నియమాల అవగాహన చరిత్ర దిశను అదుపులో ఉంచటానికే కాక, చరిత్ర గతిని ముందుగానే తెలుసుకోటానికీ ఉపకరిస్తుందని వీరి నమ్మకం.

BRAOU

## 17.11 ప్రత్యక్ష జ్ఞానవాదం - 19వ శతాబ్దంలో చరిత్ర రచన

జీవశాస్త్రంలో పరిణామ సూత్రాన్ని ప్రవచించిన డార్విన్ అనంతరం, చారిత్రక అభివృద్ధిలో ఈ పరిణామ విషయాన్ని విస్మరించటం, ఏ చరిత్రకారునికీ సాధ్యం కాలేదు. కాలం విషయంలో ఈ సిద్ధాంతం అతని అవగాహనను మరింత పెంచింది. సంస్థల పురోగతి విషయంలో కూడా, ఇది అతనికి కొత్త అవగాహనను కలిగించింది. వర్తమానం గతంలో లోతుగా వేళ్లూనుకుందని, సంప్రదాయాన్ని గౌరవించాలని, - ఈ భావాలు చరిత్రకారునిలో పెంపొందాయి. చరిత్రకు సంబంధించినంతవరకు ఈ పరిణామ ప్రాక్కల్పనా ప్రాముఖ్యాన్ని తెల్పే, మనసుకు హత్తుకునే అనేక అంశాలున్నాయి. అందులో ముఖ్యంగా, అతీతక తాత్వికతను, దైవ ప్రేరణను నిరాకరించటం, సామాజిక సంస్థల క్రమావిర్భావాన్ని గుర్తించటాన్ని పేర్కొనాలి.

19వ శతాబ్దంలో విజ్ఞాన శాస్త్ర సంస్థల ప్రాదుర్భావం, మౌలిక అర్థాల గూర్చి, అంటే మూల ప్రాధాన్యతను గూర్చి చరిత్రకారులు లోతుగా ఆలోచించేలా ప్రభావం చూపింది. ఆంగ్ల కవి, విమర్శకుడైన పాల్‌గ్రేవ్ (Palgrave) 1832లో వెలువరించిన ' రైజ్ అండ్ గ్రోత్ ఆఫ్ ఇంగ్లీష్ కామన్‌వెల్త్ ' (Rise and Growth of English Commonwealth) అనే పుస్తకంలో, ' రాజకీయ సంఘటనలను ముందుగా చెప్పటం ముఖ్యం. అనంతరం సంస్థల గురించి చెప్పాలి' అనే అభిప్రాయాన్ని ఖండించాడు. ఈ శతాబ్దంలో తన తరానికి ' అత్యంత

మౌలిక మేధావి ' గా కీర్తించబడ్డ ఆంగ్లేయుడు, వాల్టర్ బేజ్‌హాట్ (Walter Bagehot) అర్థశాస్త్రవేత్త, రాజనీతి విశారదుడు, సమాజ శాస్త్రజ్ఞుడు కూడా. 1872లో అతడు ప్రచురించిన ' ఫిజిక్స్ అండ్ పాలిటిక్స్' (Physics and Politics) అనే గ్రంథంలో, సమాజాల మూలం, క్రమావిర్భావాలకు డార్విన్ పరిణామ సిద్ధాంతాలను అత్యద్భుతంగా అన్వయించాడు. శాస్త్ర పరిభాషలో చరిత్రను చక్కగా వ్యాఖ్యానించాడు.

### 17.11.1 అగస్ట్ కామ్టే

ఫ్రెంచ్ తత్త్వవేత్త, నవీన సమాజ శాస్త్ర నిర్మాతైన ఆగస్ట్ కామ్టే (1798 - 1857) ప్రాపంచిక సంఘటనలను, మానవుడి ప్రత్యక్షానుభవం దృష్ట్యా వివరించాలని పేర్కొన్నాడు. సామాజిక భౌతిక శాస్త్ర (Social Physics) అధ్యయనం, అవగాహన అతని ప్రధాన ధ్యేయం. ప్రత్యక్ష జ్ఞానవాద సంప్రదాయానికి ప్రధాన పూజారిగా ప్రసిద్ధుడైన కామ్టే అధిభౌతికత (Metaphysics) ను పూర్తిగా వ్యతిరేకించాడు. ఆధునిక ప్రామాణిక శాస్త్రాల పరిశీలనలపై ఆధారపడ్డాడు. 1818-24 మధ్య కాలంలో, సెయింట్ సిమాన్ ప్రచురణలకు తన సేవలందిస్తున్న సమయంలోనే, యీవిధమైన తాత్త్విక చింతనను పెంపొందించట మారంభించాడు. సామరస్యంతో సుఖంగా మానవాళి జీవించేలా సమాజాన్ని పరిష్కరించటం, అతని అంతిమ లక్ష్యం. శాస్త్రా లన్నిటికీ సమాజ శాస్త్రం తలమానికమని అతడు పరిగణించాడు. 1830 - 42 మధ్య అతడు రచించిన ' కోర్స్ ఆఫ్ పాజిటివ్ ఫిలాసఫీ' (Course of Positive Philosophy) లో వ్యక్తమైన ఈ నూతన విధానం, తర్వాత రచనల్లో విపులీకరించ బడింది. 1848లో వాతావరణం రాజకీయంగా ఉత్తేజంగా ఉన్న సమయంలో, ' ప్రత్యక్ష జ్ఞానవాద సమాజ ' మొక దాన్ని ఆరంభించటంతో, అతనికి చాలామంది శిష్యులు ఏర్పడ్డారు. 19వ శతాబ్దం చివరి భాగంలో, ప్రపంచ మంతటా వీరి ప్రభావం మరింత ప్రస్ఫుటమైంది. మార్క్స్ కూడా, ఈ ప్రభావానికి లోనైన వాడే. దూర్‌ఖైమ్ (Dorkheim) హెన్రీ బెర్ (Henri Berr) , మాక్స్ వెబర్ (Max Weber) ల పరిశోధనలు, రచనలు ఈ ప్రభావాన్ని ప్రతిబింబించేవే. ప్రత్యక్ష జ్ఞానవాదం 'త్రిదశా నియమం' ( The Law of Three States) తో ప్రారంభమౌతుందని కామ్టే అభిప్రాయం. దీని ప్రకారం, మొదటి దశలో మానవుడు ప్రాపంచిక సంఘటనలను మత దృష్టితోను, రెండో దశలో అధిభౌతిక దృష్టితోను చూస్తాడు. మూడో దశలో, సామాజిక సంఘటనలను వేరు చేసి, వాటి పరిశీలనలో శాస్త్రీయ పర్యవేక్షణను, అదీ ప్రత్యక్షానుభవంతో ప్రవేశపెడ్తాడు. సామాజిక సంఘటనలను మూడో దశలోకి తెచ్చే ఈ ప్రయత్నం నుండే భౌతిక విజ్ఞాన శాస్త్రాలు ఆవిర్భవించాయి. మానవాళి ప్రగతి ప్రకృతి విజ్ఞానంలోను, సాంకేతిక పరిజ్ఞానం లోను వేసిన ముందంజతో ప్రత్యక్షంగా ముడిపడి ఉందనే ఆలోచనే, ఫ్రెంచ్ తత్త్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు, విప్లవవాదైన కన్‌డార్సెట్ (Condorcet) రచనలో ప్రతిబింబించాయి. ఇది 18వ శతాబ్దం ద్వితీయార్థంలో జరిగింది. దీన్నే, కామ్టే, బకల్‌లు ఆ తర్వాత పునరుద్ధరించారు.

ఆంగ్ల చరిత్రకారుడు హెన్రీ థామస్ బకల్ ( 1821 - 63), ఫ్రెంచ్ చరిత్రకారుడు హిపోలైట్ టైనె ( 1828 - 93) లు కామ్టే భావాలను చరిత్ర వ్యాఖ్యానానికి అన్వయించటాన్ని సమర్థించారు. బకల్ హేతువాది అయినప్పటికీ, ప్రత్యక్ష జ్ఞానవాదానికి ప్రభావితుడయ్యాడు. అతడు ప్రసిద్ధ గ్రంథం ' హిస్టరీ ఆఫ్ సివిలిజేషన్ ఇన్ ఇంగ్లాండ్ ' (History of Civilization in England) లో, చారిత్రక అభివృద్ధికి సంబంధించి కొన్ని స్వాభావిక నియమాలను రూపొందించాడు. మానవుడు ప్రకృతిలో అంతర్భాగమేననీ, అందుచేత, చారిత్రకాభివృద్ధి సూత్రాలను భౌతిక విజ్ఞాన, నైతిక, బౌద్ధిక నియమాల వలెనే, స్వాభావిక నియమాల క్రింద రూపొందించొచ్చని, బకల్ భావించాడు. ఇక టైనె, ఫ్రాన్స్‌లో కాల్పనికవాద యుగ (1820 - 50) అనంతర శకానికి సంబంధించిన తత్త్వవేత్త. సత్యం ఈ కొత్త తరానికి ఆదర్శం. స్వాతంత్ర్యం వారి సంకేతం. శాస్త్రీయమైన సత్యానికి ఎంత వీలైతే, అంత దగ్గరవ్వటం వారి లక్ష్యం. ఈ యుగానికి అత్యంత విశ్వసనీయమైన ప్రతినిధిగా, టైనెని భావించొచ్చు.

BRAOU

### 17.11.2 రాంకె

చరిత్రకారుని లక్ష్యం జరిగింది, జరిగినట్లు విషయాత్మకంగా, విశ్వసనీయంగా, గతాన్ని వివరించటమనీ, తత్వశాస్త్రానికి భిన్నమైంది చరిత్రనీ, ప్రగాఢంగా నమ్మిన ప్రత్యక్ష జ్ఞానవాదుల్లో ముఖ్యుడు రాంకె. ఆధునిక విషయ చరిత్ర రచనా సంప్రదాయానికి మార్గదర్శకునిగా ప్రసిద్ధి పొందిన లియోపాల్డ్ వాన్ రాంకె (Leopold von Ranke) ( 1775 - 1886) జర్మనీ దేశస్థుడు. సంపన్న లూథరన్ కుటుంబంలో జన్మించిన ఈతడు, లీప్జిగ్‌లో భాషాశాస్త్రం, మతధర్మశాస్త్రం, బైబిల్‌ను అధ్యయనం చేశాడు. చాలాకాలం వరకు చరిత్రలో ఇతనికి ఆసక్తి లేదు. అయితే, గ్రహణ శక్తి, విశ్వసింపదగ్గ ప్రామాణికమైన సమాచారాన్ని సేకరించాలనే బలీయమైన ఆకాంక్ష, చివరి కితణ్ణి చరిత్ర అధ్యయనానికి ప్రేరేపించాయి. ముఖ్యంగా, కామ్త్, ఫిక్టె (Fichte) , నైబూర్‌ల రచనలవల్ల ప్రభావితుడయ్యాడు. అందులోనూ, చరిత్ర ఆధారాలను విమర్శనాత్మకంగా అధ్యనం చేసి, నైబూర్ రాసిన రోమన్ చరిత్ర ఇతనికి శ్లాఘనీయంగా కన్పించింది. డాక్టరేట్ పట్టా పొందాక, ఫ్రాంక్‌ఫర్ట్‌లో ప్రాచీన గ్రీక్, లాటిన్ గ్రంథాలను విద్యార్థులకు బోధిస్తున్నప్పుడు, ఆ గ్రంథాల చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకోవాలనే కుతూహలం, ఇతణ్ణి చరిత్ర వైపుకి, చరిత్రకారుల వైపుకి దృష్టి మళ్ళించింది. ప్రాచీన గ్రీస్, రోమ్‌లపైన, మధ్య యుగ జర్మనీపైన వెలువడ్డ రచనలను పరిశీలించాడు. దీంతో, చరిత్ర పరిశోధనలలో అభిలాష, మౌలికాధారాల ప్రాతిపదికగా వాస్తవాన్ని ధృవీకరించుకోవాలనే పట్టుదల పెంపొందాయి. ఫలితంగా, ' హిస్టరీస్ ఆఫ్ ది రోమన్ అండ్ ట్యుటానిక్ పీపుల్స్ ' (Histories of the Roman and Teutonic Peoples) అనే తన మొదటి రచనను రాంకె వెలువరించాడు. మూలాధారాలను అధ్యయనం చేయటంలో, ప్రాచీన రోమన్ చరిత్రను రచించటంలో, నైబూర్ అనుసరించిన విమర్శనాత్మక పద్ధతిని మార్గదర్శకంగా చేసుకుని, ముఖ్యమైన ఆధునిక రోమన్, జర్మానిక్ ప్రజల గూర్చి, పోప్ అధికార వ్యవస్థ గూర్చి, రాంకె ఈ రచనలో అధ్యయనం చేశాడు. ఈ గ్రంథం సంకలనమే అయినా, ఐరోపా చరిత్రను విషయగతంగా పరిశీలించటంలో ముందడుగు వేసిందని గూచ్ వ్యాఖ్యానించాడు. ఈ విమర్శనాత్మక పద్ధతినే, రాంకె ఆ తర్వాత మధ్య యుగ చరిత్ర పరిశోధనకు విస్తరించాడు.

BRAOU

రాంకె రాసిన 54 సంపుటాల రచనల్లో , ప్రష్యా, జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ చరిత్రలు, యుద్ధ చరిత్రలు, జీవిత చరిత్రలు, చరిత్రపై సిద్ధాంతపరమైన వ్యాసాలున్నాయి. సిద్ధాంతపరమైన వ్యాసాల్లో కంటే, మొత్తం చరిత్ర రచనల్లోనే, ఇతని చరిత్ర తత్వం అర్థమౌతుంది. ఈతని రచనల్లో, చరిత్ర పరిశోధనలో అత్యున్నతమైందిగాను, కళాఖండంగాను ప్రసిద్ధి పొందింది ' హిస్టరీ ఆఫ్ ది పోప్స్ ' (History of the Popes) . ఇక ఇతని చివరి ఉద్గ్రంథం, తొమ్మిది సంపుటాల ' ది హిస్టరీ ఆఫ్ ది వరల్డ్ ' (The History of the World) . ఈ రచనలన్నిటిలో ఇతని నిష్పాక్షికత, అపురూపమైన వస్తు పరత, ఖచ్చితత్వం పతాక స్థాయిలో కన్పిస్తాయి.

నవీన చారిత్రక పద్ధతికి ఆద్యునిగా ప్రసిద్ధి పొందిన రాంకె, వృత్తి రీత్యా అధ్యాపకుడు. చరిత్ర బోధనలో ఈతడు ' విషయ చర్చ ' (Seminar) పద్ధతిని ప్రవేశపెట్టి, చరిత్ర పరిశోధనలో ఇంగ్లాండ్, అమెరికా తదితర పాశ్చాత్య దేశాల్లో మార్గదర్శకుడయ్యాడు. లూథరన్ మత ధర్మ నిష్ఠ, ఫిక్టె భావవాదం, హెర్డర్ - గోథెల తాత్వికలు చింతన, 18వ శతాబ్ది సర్వమానవ చరిత్రనే భావన, 19వ శతాబ్ది వ్యక్తివాదమనే కాల్పనిక భావం, రాంకెలో ప్రస్ఫుటమయ్యాయి. జ్ఞాన వికాస యుగ, ' ఉపయోగితా వాదాన్ని ' ఇతడు వ్యతిరేకించటమే గాక, ఉపదేశాత్మక (didactic) చారిత్రక పద్ధతిపై తిరుగుబాటు చేశాడు. ప్రశాంత విషయనిష్ఠతతో కూడిన దురభిమానరహిత పరిశోధనే ధ్యేయంగా, తన రచనల్లో ప్రయత్నించాడు. జరిగింది జరిగినట్లు ఖచ్చితంగా నివేదించటమే చరిత్రకారుని కర్తవ్యమని, యదార్థాల గురించి చరిత్రకారుడు చూసుకుంటే, చరిత్ర తత్వం గురించి దైవం చూసుకుంటాడని రాంకె అభిప్రాయం. ఆధునిక చరిత్ర రచనకు ప్రత్యక్ష సాక్షుల కథనాలు, ఆర్కైవ్స్‌లో భద్రపరచిన విశ్వసనీయమైన సమకాలీన సాక్ష్య పత్రాలు తప్పనిసరని, ఈతడు నొక్కి చెప్పాడు. స్వదేశమనే

దురభిమానానికి గాని, సమకాలీన సిద్ధాంతాల ప్రభావానికి గాని, చరిత్రకారుడు లోబడరాదని భావించాడు. రాజకీయంగా మెటర్నిక్, జెన్ట్జ్‌ల ప్రభావంలో పడ్డ రాంకె, సంప్రదాయాన్ని గౌరవించాడు. 1830, 1848 ఫ్రెంచ్ విప్లవాలు జర్మన్ రాజ్యాల్లోనూ ప్రభావాన్ని కనబర్చినప్పుడు, రెండు సందర్భాల్లోనూ ఇది స్పష్టమైంది. రాంకె జాతీయ విప్లవ భావాలను వ్యతిరేకించాడు. దీంతో ప్రగతి నిరోధకునిగా ఇతణ్ని జర్మన్ యువకులు భావించి, కొంతకాలం ఇతని శాస్త్రీయ దృక్పథ ప్రభావాన్ని అణగదొక్కారు కూడా. కాని, 1880 అనంతరం శాస్త్రీయ చరిత్రకారులకు రాంకె ఒక నమూనా అయ్యాడు.

చరిత్ర రచనకు శాస్త్రీయ దృక్పథమే ప్రాతిపదిక కావాలని, పక్షపాత ధోరణి కూడదని, విషయగత పరిశోధన ధ్యేయం కావాలని చెప్పిన రాంకెలోనూ, లోపాలు లేకపోలేదు. మార్టిన్ లూథర్ గురించి, ప్రష్యా గురించి, ప్రష్యా రాజ వంశం గురించి వివరించేటప్పుడు, ఇతని విషయనిష్ఠత పరిమితమైంది. దురభిమానం చోటుచేసుకుంది. ఇతని రచనల్లో కన్పించే మరో లోపం, రాజకీయ పరిణామాలకే ఎక్కువ ప్రాధాన్యతనివ్వటం, సాంస్కృతిక, ఆర్థిక విషయాలను వెనక్కి నెంటి వేయటం, పైగా జరిగింది జరిగినట్లు చెప్పాలనే తపనతో, యదార్థాలు ప్రాతిపదికగా, విషయ వివరణకు ప్రాధాన్యత నివ్వటంతో, ఎందుకు జరిగింది ? ఎలా జరిగింది ? అంతరార్థం ఏమిటి ? అనే విశ్లేషణ లేకుండా పోయింది. ఫలితంగా, రాంకె రచనల్లో తాత్వికత లోపించింది. శాస్త్రీయ దృక్పథాలకు పెద్ద పీట వేసిన ఇతడు, మరో వంక చరిత్ర మొత్తం దైవ సంకల్పితమనటం, వైరుధ్యాన్నే చాటుతుంది.

ఏది ఏమైనా, ' విషయాత్మకంగా ఉండటం సాధ్యం కాదనే వాదన తీసుకురాకు. ఇది తెలిసిన సంగతే. కాని విషయాత్మకంగా ఉండటానికి మరింత ప్రయత్నించు ' అని, రాంకె చరిత్రకారులకు ఒక ఆదర్శవంతమైన పిలుపునిచ్చాడు. ఆర్థర్ మార్విక్ చెప్పినట్లు, " విమర్శనాత్మక కౌశల్యం, పరిశ్రమ, పట్టువీడని పరిశోధనల ద్వారా, రాంకె ఒక కొత్త, మరింత సంస్కరించబడ్డ చరిత్ర రచనా విధానాన్ని సృష్టించాడు ". తద్వారా, శాశ్వతమైన పేరు ప్రతిష్ఠలను పొందాడు.

BRAOU

రాంకె నూతన చరిత్ర రచనా విధానాన్ని అనుసరించి, జర్మన్ దేశస్థుడే అయిన డ్రోయిజన్, ప్రష్యా రాజకీయ దౌత్య చరిత్రను, 14 సంపుటాల్లో రచించాడు. అయితే, డ్రోయిజన్ శిష్యుడు థియొడర్ మామ్‌సెన్ ( 1817 – 1903) మాత్రం, తన పద్ధతిని సాంప్రదాయిక భాషా శాస్త్రవేత్తల నుండి గ్రహించాడు. సమకాలీన ఉదారతా భావాలు ఇతనిలోనూ కన్పిస్తాయి. చిన్న వ్యాసాలు మొదలుకొని, పెద్ద పెద్ద సంకలనాల వరకు, ఇంచుమించు 1500 పైగా రాసిన రచనల్లో, ఇతని నిరంతర పరిశ్రమ కన్పిస్తుంది. సాహిత్యం, నాణేలు, శాసనాలు, ప్రాచీన పత్రాల వంటి అన్ని రకాల ఆధారాలను శోధించి, రోమన్ చరిత్ర రచనను విప్లవాత్మకంగా తీర్చిదిద్దాడు. లాటిన్ శాసనాలపై ఇతని 15 సంపుటాల సంకలనం, రోమన్ సామ్రాజ్య సామాజిక చరిత్రకు అత్యంత ప్రామాణికాధారంగా నిల్చింది. ఆగమన, నిగమన పద్ధతుల రెండింటి కలయికను, తన రచనల్లో సాధించి, మామ్‌సెన్ శాస్త్రవేత్తలకూ ఆదర్శప్రాయుడయ్యాడు.

### 17.11.3 బర్కారోల్ట్ తదితరులు

స్విట్జర్లాండ్‌కు చెందిన బర్కారోల్ట్ (Burcharolt) (1818 - 97), రాంకె వద్దనే శిక్షణ పొందాడు. మూర్తిత్వం , సంస్కృతి అనే రెండు భావనల చుట్టూ అతడు నేర్చింది, కృషి చేసింది అల్లబడింది. అతని రచనలన్నిటా, మూర్తిత్వంపై ఊనిక ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. సాంస్కృతిక పునరుజ్జీవనంపై అతడు రాసిన అత్యంత మౌలికమైన ' ది సివిలిజేషన్ ఆఫ్ ది రినైజాన్స్ " (The Civilization of the Renaissance) గ్రంథంలో, అద్భుతమైన అవలోకనాన్నిచ్చాడు. కనకనే, ఆక్టన్ ఈ గ్రంథాన్ని ' నాగరికత చరిత్రపై సాహిత్యంలో ఉన్న మిక్కిలి జిజ్ఞాస కలిగించే బుద్ధి సూక్ష్మతతో కూడిన గ్రంథం ' గా అభివర్ణించాడు. సాహిత్యం, లలితకళల

చరిత్రపై అనురక్తిని పెంచటంలో, ఈ రచన సఫలమైంది. రసజ్ఞుడైన బర్కార్లోట్ మరో రచన ' హిస్టరీ ఆఫ్ గ్రీక్ సివిలిజేషన్ ' (History of Greek Civilization), హెలెనిక్ నాగరికతపై ఒక వాస్తవిక అధ్యయనం.

జర్మన్ జాతీయ తీవ్రవాది, చరిత్రకారుడైన సైబెల్ (1817 - 95) ప్రకృతి శాస్త్రమెంత ప్రామాణికమో, చరిత్ర అంతే ప్రామాణికమని భావించాడు. ప్రష్యా సైనిక నాయకత్వం ద్వారా, జర్మన్ ఏకీకరణను కాంక్షిస్తూ ఇతడు ' ది ఫౌండేషన్ ఆఫ్ జర్మన్ ఎంపైర్ బై విలియం I' ( The Foundation of German Empire by William I) అనే గ్రంథాన్ని రాసాడు. ' హిస్టరీ ఆఫ్ ది ఫ్రెంచ్ రివల్యూషన్' ( History of the French Revolution) అనే మరో రచనలో, వాస్తవికమైన, విమర్శనాత్మకమైన రీతిలో, ఫ్రెంచ్ విప్లవ చరిత్రను వీక్షించాడు. టైనె సమకాలీనుడైన రేనాన్ (1823 - 92) కూడా, ప్రత్యక్ష జ్ఞానవాదే. ' స్వతంత్ర ఆలోచన ' ను సాంస్కృతిక చరిత్రతో అనుసంధించటానికి, మత విశ్వాసానికి, బుద్ధి పరిణతకు మధ్యగల సంబంధాన్ని, సామాజిక స్థితిగతులపై ఈ రెండింటి ప్రభావాన్ని వివరించటానికి, ఈ ఫ్రెంచ్ చరిత్రకారుడు, తత్త్వవేత్త ప్రయత్నించాడు. విమర్శనాత్మక పద్ధతిని చేర్చి, ఫ్రెంచ్ చరిత్ర రచనను సమగ్రంగా రూపొందించింది, గేబ్రియల్ మొనాడ్ ఆరంభించిన 'రెవ్యూ హిస్టారిక్' అనే చారిత్రక పత్రిక. 19వ శతాబ్దంలో, బ్రిటన్‌లో చరిత్ర రచనలో ఎంత విమర్శనాత్మక పద్ధతులను అనుసరించినా, చరిత్ర సారస్వత ప్రక్రియగానే కొనసాగింది.

**17.11.4 ముగింపు**

18,19 శతాబ్దాలలోని పరికల్పక చరిత్ర తత్త్వ అధ్యయనాల్లో, ప్రత్యక్ష జ్ఞానవాదం కాక, భావవాదం, చారిత్రకత, లేదా చారిత్రక వాదమని మరో రెండు అంశాలున్నాయని ముందే చెప్పుకున్నాం. ఇందులో, ప్రత్యక్ష జ్ఞానవాదానికి భిన్నంగా జర్మన్ భావవాదులు, చారిత్రక వాదులు ప్రకృతి శాస్త్రాల నుండి సంస్కృతి, చరిత్రల పరిధిని ఖచ్చితంగానే వేరు చేశారు. జర్మన్ భావవాదానికి ప్రతినిధులు కాంట్, ఫిక్టె, హెగెల్ లు. కాంట్ కాల్పనిక ఆదర్శవాద ఉద్యమానికి ప్రేరణ నిచ్చాడు. జ్ఞానం అతీంద్రియమే అయినా, ఇంద్రియాల ద్వారా సంవేదనం ఏర్పడి, అవగాహన వల్ల రూపం ఏర్పర్చబడ్డప్పుడు, అది జ్ఞానమై, అనుభవ ప్రపంచం గురించి తెల్పుతుంది. భావ కల్పన ద్వారా అవగాహన జ్ఞానాన్ని కలిగిస్తుంది కనుక, ఇది భావవాదమైంది.

' లెక్చర్స్ ఆన్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ ' (Lectures on the Philosophy of History) అనే గ్రంథంలో, హెగెల్ చారిత్రక ప్రక్రియను తర్కంతో గుర్తించాడు. ప్రపంచాన్ని పాలిస్తున్నది హేతువనేది, అతని దృఢ విశ్వాసం. కాబట్టి, ప్రపంచ చరిత్ర ఒక వివేచనాత్మకమైన ప్రక్రియ అని పేర్కొన్నాడు. హెగెల్ తత్త్వాన్ని 'హేతువాదము ' ని, ఒక మాటలో చెప్పొచ్చు. చరిత్ర తత్త్వం పై అతని భావాలు, ముందు తరాల వారిని ఎంతో ప్రభావితం చేసాయి. అతడు రూపొందించిన చరిత్ర తత్త్వం, ఉపయోగించిన గతి తార్కిక పద్ధతి, మార్క్స్ పై చాలా ప్రభావాన్ని చూపింది.

కారల్ మార్క్స్, ఎంజెల్స్‌లు హెగెల్ భావవాదాన్ని వ్యతిరేకించినా, అతడు ఉపయోగించిన గతి తార్కిక పద్ధతికి విప్లవాత్మకమైన అర్థాన్నిచ్చి, మానవ సమాజ పరిణామంలోని వివిధ దశలను కార్యకారణ సంబంధం ద్వారా విశ్లేషించి, గతితార్కిక భౌతికవాదానికి (Dialectical Historical Materialism) పునాది వేసేదాన్నే, మార్క్స్ వాదం (Marxism) గా ప్రపంచం గుర్తించింది.

ఇక చారిత్రకత, లేదా చారిత్రక వాదాన్ని తీసుకుంటే, ఇది ప్రత్యక్ష జ్ఞానవాదానికి, జర్మన్ భావవాదానికి భిన్నమైంది. చరిత్ర ఒక అర్థవంతమైన, వివేచనాత్మకమైన ప్రక్రియని, చారిత్రక వాదుల నమ్మకం. వీరు చరిత్ర లోని ' ఏక రేఖీయ నిర్దేశాన్ని' (Unilinear direction) వ్యతిరేకించారు. ' వికాసం, అవిచ్ఛిన్నత ప్రధాన లక్షణాలుగా ఉన్న చారిత్రక ప్రక్రియే, చారిత్రకత' అని బారక్లో (Barraclough) పేర్కొన్నాడు. మైనెక్ (Meinecke) దీన్నే, జాతుల, సంస్కృతుల వికాసాన్ని గూర్చిన అధ్యయనంలో, భావ చరిత్ర ప్రాముఖ్యాన్ని

తెలిపే కొత్త చారిత్రక దృక్పథమన్నాడు. చరిత్ర ద్వారా భవిష్యత్తుని కొంత తెలుసుకోవచ్చని వివరించేదే, చారిత్రకతని, కార్ల్ పోపర్ అభిప్రాయం. డ్రోయిజన్, డిల్తీ, ట్రోయెల్ష్ (Troeltsch), మైనెక్ మొదలైన చరిత్రకారులు, సామాజిక సైద్ధాంతికులు, చారిత్రక వాదాన్ని ప్రచారం చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక దృగ్విషయాలన్నిటికీ చారిత్రక పరిజ్ఞానాన్ని తగ్గ రీతిలో ఉపయోగించారు. వోల్టేర్ సాంఘిక, ఆర్థిక చరిత్రకు మొదటిసారిగా ఉపయోగించిన చరిత్ర తత్వమనే మాటను, హెర్డర్ ' సార్వత్రిక చరిత్ర ' కు ఉపయోగించాడు. ఈ జర్మన్ భావవాదం, మార్క్సువాదం, చారిత్రకతల గూర్చిన వివరాలు, తర్వాత భాగంలో వివరించబడ్డాయి.

## 17.12 సంగ్రహంగా

కాల్పనికవాద శిథిలాలపై ఆవిర్భవించిన ప్రత్యక్ష జ్ఞానవాదం, 19వ శతాబ్దంలోనే, చరిత్ర రచనలను ప్రభావితం చేసింది. ఆధునిక విషయగత చారిత్రక సంప్రదాయానికి మార్గదర్శకుడు రాంకె. ఈ దృక్పథాన్ని ప్రతిబింబించిన మరో చరిత్రకారుడు మామ్‌సెన్.

## 17.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలివ్వండి.**

1. ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్ర రచనా సాంప్రదాయ లక్షణాలను వివరించండి.
2. ఆగస్ట్ కామ్టే, రాంకెలు ఆధునిక చరిత్ర రచనకు చేసిన సేవలను సమీక్షించండి.

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. పరికల్పక చరిత్ర తత్వాన్ని వివరించండి.
2. జ్ఞాన వికాస చరిత్ర రచనా సంప్రదాయాన్ని వివరించండి.
3. ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్ర రచనకు బర్క్హార్ట్, సైబెల్, రేనాన్‌ల సేవలను సమీక్షించండి.

## 17.14 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Dray William H. | : | **Philosophy of History** |
| Ernest Breisach | : | **Historiography, Ancient, Medieval and Modern** |
| Gardiner Patrick (Ed) | : | **The Philosophy of History** |
| Helperin, W.S ( Ed) | : | **Essays in Modern European Historiography** |
| Iggers George G., | : | **New Directions in European Historiography** |
| Markel, Frank E. | : | **Shapes of Philosophical History** |
| Walsh | : | **An Introduction to Philosophy of History** |


*రచయిత : డా. జె. దుర్గాప్రసాద్*

BRAOU

# భాగం : 18 ఆధునిక ఐరోపా చరిత్ర రచనాభివృద్ధిలో మార్క్స్ వాదం

18.0 లక్ష్యాలు

18.1 పరిచయం

18.2 నేపథ్యం

18.3 మార్క్స్

18.4 మార్క్స్ రచనలు

18.5 మార్క్సీయ చారిత్రక వాదంలో ప్రధాన సిద్ధాంతాలు

18.6 గతి తార్కిక చారిత్రక భౌతికవాదం

18.7 వర్గ పోరాటం - సమాజ పరిణామం

18.8 కమ్యూనిస్ట్ సమాజం - రెండు దశలు

18.9 విమర్శ

18.10 మార్క్స్‌వాద ప్రభావం

18.11 సంగ్రహంగా

18.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

18.13 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 18.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు

- మార్క్స్ వాదానికి నేపథ్యం, లేక ప్రాతిపదిక ఏమిటో వివరించగలగాలి.
- కార్ల్ మార్క్స్ చారిత్రక/భౌతికవాదాన్ని గూర్చి వివరించి, దీనిపై వెలువడ్డ విమర్శలను, వ్యాఖ్యానాలను విశ్లేషించగలగాలి.
- ఆధునిక యుగంలో ఐరోపా చరిత్ర పరిజ్ఞానాన్ని, చరిత్ర రచనలను మార్క్స్ వాదం ఎంతగా ప్రభావితం చేసిందో వివరించగలగాలి.

## 18.1 పరిచయం

మానవుని పరిసరాలను కూలంకషంగా పరిశీలించి, విశదీకరించటం శాస్త్రాల ధ్యేయం. ఈవిధమైన విపులీకరణ వలన మనిషి పరిసరాలను అర్థం చేసుకోవడమే గాక, వాటిపై అదుపును, వాటిని మార్చగల సామర్థ్యాన్ని సంపాదించుకుంటాడు. ఈ లక్ష్యానికి చరిత్ర భిన్నమైంది కాదు. చరిత్ర సంస్కృతీ వికాసానికి

తోడ్పడే నాగరికతా పరిణామాన్ని విశదీకరించే సాంఘిక శాస్త్రం. కనుక, చరిత్రకారుడు వర్తమాన నాగరికతా ధోరణులను విశదీకరించటానికి ప్రయత్నిస్తాడు. ఈ కృషి వలన సామాజికులకు తమ నాగరికతా గుణగుణాలు తెలుస్తాయి. దాని అభివృద్ధికి తాము నిర్వర్తించాల్సిన నిర్మాణాత్మక పాత్ర గురించీ అవగతమౌతుంది. చరిత్ర ఒక సాంఘిక ప్రవంతి అనుకుంటే, యీ ప్రవంతిలో గతాన్ని వర్తమానం సాయంతోను, వర్తమానాన్ని గతం సాయంతోను అర్థం చేసుకోవటం జరుగుతుంది. చరిత్ర గమనాన్ని నిర్దేశించే శక్తులు ఏవి ? చరిత్ర పరిణామం, అంతరార్థాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి ? అనే ప్రశ్నలను వివిధ దృక్కోణాల నుండి పరిశీలించి, తత్వవేత్తలు, చరిత్రకారులు తమ జాతి, మత, కాల ఆలోచనా ధోరణులను ప్రభావితం చేసిన జ్ఞాన వికాసం, కాల్పనిక, ప్రత్యక్ష జ్ఞానవాదం వంటి వివిధ దృక్పథాల దృష్ట్యా, చరిత్ర స్వభావాన్ని, లక్ష్యాన్ని వివరించారు, వ్యాఖ్యానించారు. ఇటువంటి వ్యాఖ్యానాల్లో, ఈనాడు ప్రపంచంలో అత్యధిక చరిత్రకారులను ప్రభావితం చేసింది, కార్ల్ మార్క్స్ చారిత్రక భౌతికవాద వ్యాఖ్యానం. ఈ మార్క్స్‌వాద పూర్వాపరాలను, విషయ ప్రభావాన్ని, లోటుపాట్లను తెలుసుకుందాం.

## 18.2 నేపథ్యం

తత్వశాస్త్రాన్ని పూర్తిగా ఆధునిక పద్ధతుల్లో నిర్మించిన హెగెల్, ఇమాన్యువల్ కాంట్, ఫిక్టెలతోబాటు, జర్మన్ భావవాదానికి ప్రాతినిధ్యం వహించాడు. చరిత్ర తత్వాన్ని తన ' లెక్చర్స్ ఆన్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ' (Lectures on the Philosophy of History) గ్రంథంలో విశ్లేషించిన హెగెల్, చారిత్రక ప్రక్రియను తర్కంతో గుర్తించాడు. అతని దృష్టిలో తర్కం అనేది ఒక నిర్దిష్టమైన చారిత్రిక గమనం. ఈ చారిత్రక గమనం ద్వారానే, అసందిగ్ధ భావమైన హేతువు అమూర్తమైన ఆలోచన నుండి మానవ సంస్థల రూపంలో వ్యక్తమైన వాస్తవికతను సృష్టించేందుకు, తనకు తానుగా అదే పరివర్తన చెందుతుంది. మనుషుల తెలివితేటలతో ప్రణాళికా బద్ధంగా ఆచరించిన పనుల ద్వారా కాక, సమాజంలో అంతర్లీనంగా వున్న వైరుధ్యాల ద్వారా, ఈ ప్రక్రియ సంభవించిందని కాంట్ చెప్పిన దానితో, అతడు ఏకీభవించాడు.

BRAOU

హెగెల్ చరిత్ర తత్వాన్ని చిదాత్మ (spirit) తత్వంలో భాగంగా గుర్తించాడు. చిదాత్మ కనిపించని స్థాయి నుండి, పూర్తి వికాసం పొందటానికి చరిత్ర తోడ్పడుతుంది. ప్రపంచ చరిత్ర హేతుబద్ధంగా వ్యక్తమౌతుందని హెగెల్ వివరించాడు. అతని దృష్టిలో వివేచనాత్మకమైంది వాస్తవికమైంది, వాస్తవికమైంది వివేచనాత్మకమైంది. అతనికి వాస్తవికత అంటే చిదాత్మ. చరిత్రకారుని చాలా ముఖ్యమైన సమస్య, హేతువు పనిచేసే తీరును కనుగొనడమని అతని అభిప్రాయం. ఆకర్షణీయమైన పద్ధతిలో ఆయా సంఘటనలను వర్ణించటం వరకే పరిమితం కాక, మొత్తం చారిత్రక ప్రక్రియ వెనక ఉన్న హేతువును కూడా, చరిత్రకారుడు చూపించాలి. హేతువు ద్వారా అన్ని విషయాలూ తెలుసుకోవచ్చని హెగెల్ దృఢ విశ్వాసం. ప్రపంచాన్ని పాలిస్తున్నది హేతువు కాబట్టి, ప్రపంచ చరిత్ర ఒక వివేచనాత్మక ప్రక్రియ అని అతడు పేర్కొన్నాడు. హెగెల్ తత్వాన్ని ' హేతువాదమ' ని ఒక మాటలో చెప్పొచ్చు.

హెగెల్ జాతికి ఎక్కువ ప్రాముఖ్యాన్నిస్తూ చరిత్రను గతి తార్కిక పద్ధతి ద్వారా వ్యాఖ్యానించాలని పేర్కొన్నాడు. దీనివల్ల ప్రతి జాతి ప్రపంచ సంస్కృతికి దోహదం చేయడానికి వీలౌతుందన్నాడు. ప్రపంచంలో చిదాత్మ ఏ విధంగా పురోగమిస్తుందో, ఒక స్థాయి నుండి ఇంకో స్థాయికి ఏ విధంగా చేరుతుందో గతి తర్కం(dialectic) వివరిస్తుందని అతని నమ్మకం. అతని అభిప్రాయం ప్రకారం, ప్రతి విషయంలోను చిదాత్మ, లేదా హేతువు గమ్యాన్ని చేరినప్పుడు, దానిలో కనుపించేవే కాక, కనుపించనవి కూడా ఉంటాయి.ఏ విషయాన్నైనా అర్థం చేసుకోవాలంటే, ఈ రెంటిని అవగాహన చేసుకోవాలి. అంటే, యదార్థమైంది, దానికి వ్యతిరేకమైంది - ఈ రెంటిని సమన్వయపరిస్తే, వాస్తవికత నిర్ధారితమౌతుంది. హెగెల్ దీన్నే, వాద ప్రతివాద (thesis and

antithesis) సంఘర్షణన్నాడు. ఈ సంఘర్షణ పర్యవసానంగా, సమన్వయం (synthesis) రూపు దిద్దుకుంటుంది. అంటే, ఈ సమన్వయం పై రెండింటిలోని మంచిని గ్రహించి పొందుపరుస్తుంది. ఇది మళ్ళీ, కొత్త వాద ప్రతివాదాలకు దారితీస్తుంది. ఈ రకంగా, భావంలో పరిపూర్ణత సాధింపబడేవరకు మార్పులు జరుగుతుంటాయని హెగెల్ విపులీకరించాడు. చిదాత్మ పురోగమనమే మానవజాతి చరిత్రని, గతి తర్కం ద్వారా దాన్ని తెలుసుకోవచ్చని అతడు వివరించాడు. హెగెల్ రూపొందించిన తత్వ విచారం, ఈ గతి తార్కిక పద్ధతి, మార్క్స్ వాదానికి ప్రాతిపదికైంది.

## 18.3 మార్క్స్

ఆలోచనాశీలిగా, ప్రవక్తగా, శాస్త్రవేత్తగా, నీతివేత్తగా ప్రసిద్ధుడైన కార్ల్ మార్క్స్, సామ్యవాద చింతనా చరిత్రలో తీవ్రమైన మార్పును తీసుకువచ్చిన వ్యక్తిగా, అత్యంత వివాదాస్పదుడైన జర్మన్ చరిత్ర తత్వవేత్తని నిస్సందేహంగా పేర్కొనొచ్చు. ప్రష్యా భూభాగం రైన్‌లాండ్‌లోని ట్రయర్‌లో 1818లో మే 5వ తేదీన జర్మన్ యూదు కుటుంబంలో జన్మించి, మార్క్స్ బాన్, బెర్లిన్‌ల్లో ప్రాథమిక విద్య నభ్యసించాడు. ఇతని ఆరో యేటనే, మొత్తం కుటుంబం ప్రొటెస్టాంట్ మతాన్ని స్వీకరించింది. బాల్యం నుండి వయస్సుకు మించిన బుద్ధి సూక్ష్మతను ప్రదర్శించిన మార్క్స్‌ను, వృత్తి రీత్యా లాయరైన అతని తండ్రియే, 'పిశాచ మేధావి' గా అభివర్ణించాడు. కవిత్వం, తత్వశాస్త్రాలంటే మార్క్స్‌కు మొదటి నుండి మక్కువ ఎక్కువ. ముఖ్యంగా, ఇంగ్లాండ్‌లో అధ్యయనం చేస్తున్న కాలంలో, చరిత్ర, తత్వశాస్త్రాల పై మరింత అభిరుచిని పెంచుకున్నాడు. హెగెల్ నియమ తత్వ విచారంపై అనేక వ్యాసాలను రాశాడు. 1841లో జేనా విశ్వవిద్యాలయాన్నుండి తత్వశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందాడు.

1842లో ఒక పత్రికా సంపాదకునిగా జీవితాన్ని ఆరంభించిన మార్క్స్, తన అస్తుబిస్తు సంపాదన జీవికకు సరిపోక, సంపన్న ప్రత్తి ఉత్పత్తిదారుని కుమారుడు, తన మిత్రుడైన ఫ్రెడరిక్ ఎంజెల్స్ పై ఆధారపడ్డాడు. 1843లో జర్మనీని వదిలిపెట్టాడు. 1848 - 49లో కోలోన్‌లో వున్న కొద్ది కాలం మినహాయిస్తే, మార్క్స్ తన జీవితకాలాన్నంతా ప్రవాసంలో విదేశాల్లోనే గడిపాడు. 1843-45ల మధ్య, ప్రూధన్ రచనలను అధ్యయనం చేసి, సామాజికవాదిగా మారాడు. ఇక్కడే, ఎంజెల్స్‌తో ఇతనికి మైత్రి పెంపొందింది. 1845 - 48ల మధ్య, బ్రస్సెల్స్‌లో గడిపిన అనంతరం, మార్క్స్ చివరకు లండన్‌లో స్థిరపడ్డాడు. 1845లో ప్రష్యన్ పౌరసత్వాన్ని వదిలిపెట్టి, బ్రిటీష్ పౌరసత్వానికై ప్రయత్నించి విఫలుడయ్యాడు.

## 18.4 మార్క్స్ రచనలు

కార్ల్ మార్క్స్ 1847లో ప్రూధన్ రచన 'ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ' (Philosophy of Poverty) కి సమాధానంగా, 'పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ' (Poverty of Philosophy) ని రాశాడు. ఈ రచనలోనే, ఇతడు చరిత్రకు, తన ఆర్థికపరమైన వ్యాఖ్యానానికి సంబంధించి, మూల ప్రతిపాదన చేశాడు. మిత్రుడు ఎంజెల్స్‌తో కలసి, 1848లో తన మొత్తం సామాజిక తత్వాన్ని గూర్చి సంక్షిప్తంగా తెలియజేసే అత్యంత ప్రసిద్ధి పొందిన 'కమ్యూనిస్ట్ మానిఫెస్టో' (Communist Manifesto) అనే నివేదికను ప్రచురించాడు. ఆ సంవత్సరం సంభవించిన విప్లవాలతో ఐరోపా మొత్తం ఉద్రిక్తపూరిత వాతావరణంలో ఉండగా, ఈ నివేదిక వెలువడింది. దారిద్ర్యం, అనారోగ్యం నిత్యం వెన్నాడినా, మార్క్స్ మేధావిగానే కాక, చక్కటి రచయితగా కూడా పేరుపొందాడు. ఈతని అత్యంత ప్రసిద్ధి పొందిన గ్రంథం, 'దాస్ కాపిటల్' (Das Capital). ఈ రచనలో, పెట్టుబడిదారీ వ్యవస్థ గూర్చి, దాని శక్తి సంపన్నత గూర్చి, ముఖ్యంగా దాని స్వయం వినాశకర ధోరణుల గూర్చి, మార్క్స్ సిద్ధాంతీకరించాడు. నేటి ప్రపంచ వ్యవస్థ ఎలా వచ్చింది, క్రమేపీ ఇది మరో ఉత్తమ వ్యవస్థలోకి ఎందుకు, ఎలా

BRAOU

దారితీస్తుంది. ఇతడు తన వాదం ద్వారా శాస్త్రీయంగా విశదీకరించాడు. ' మానవాళి చైతన్యం వారి అస్తిత్వాన్ని నిర్ణయించడం లేదు. పైగా, దానికి వ్యతిరేకంగా సమాజంలో వారి ఉనికే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుందని' ఈతడు చెప్పాడు. చరిత్రను వ్యాఖ్యానించటంలో మార్క్స్ భౌతిక వాదానికి, హెగెల్ భావ వాదానికి తేడా ఇదే.

## 18.5 మార్క్సీయ చరిత్ర వాదంలో ప్రధాన సిద్ధాంతాలు

హెగెల్ భావవాదాన్ని త్రోసి పుచ్చిన మార్క్స్, ఎంజెల్స్‌లు, హెగెల్ గతి తార్కిక భావానికి ఒక విప్లవాత్మకమైన అర్థాన్నిచ్చారు. ఒక నూతన దర్శనాన్ని వెలయించారు. ఆ దార్శనిక సిద్ధాంతాలను వారు సంఘ పరిణామానికి అన్వయించి, ఆర్థిక నియమ సూత్రాన్ని ప్రతిపాదించారు. మానవాళి చరిత్రను, విస్తృతమైన దాని వివిధ పరిణామ దశలను కార్యకారణ సంబంధం ద్వారా మాత్రమే వివరించగలమని, మార్క్స్ విశ్వాసం. మార్క్సీయ చారిత్రక వాదంలో ప్రధానంగా నాలుగు సిద్ధాంతాలు కన్పిస్తున్నాయి. 1) హెగెల్ నుండి గ్రహించిన తార్కిక తత్వం, తార్కిక భౌతికవాదంగా రూపాంతరం చెందింది. దీని నాధారంగానే, మార్క్స్ చరిత్రను భౌతిక వాద దృక్పథంలో వ్యాఖ్యానించాడు. 2) రాజకీయ - ఆర్థిక వ్యవస్థ, విలువను గూర్చిన శ్రామిక సిద్ధాంతం, పెట్టుబడిదారీ వ్యవస్థా విశ్లేషణ, అధిక విలువ సిద్ధాంతం, వీటి నుండి వచ్చే పరిణామాలు, ఈ వ్యవస్థలోని ముఖ్యాంశాలు. 3) వర్గ పోరాటం, విప్లవం, రాష్ట్రం - వీటిని గూర్చిన సిద్ధాతం. 4) నైతిక వ్యవస్థ.

## 18.6 గతి తార్కిక చారిత్రక భౌతిక వాదం

మార్క్స్‌వాదానికి ప్రాతిపదిక హెగెల్ ఉపయోగించిన గతి తార్కిక పద్ధతని ముందే పేర్కొటం జరిగింది. గతి తార్కిక (dialectic) అంటే, ద్వంద్వ తర్కం. దీనికి అర్థం, ' వ్యతిరేకాల సంయోజన సిద్ధాంతం '. ఇదే, పూర్వం గ్రీక్ భాషలో వాద ప్రతివాద విద్య. ఈ తార్కిక పద్ధతి ఒక నిరంతర పరిణామ ప్రక్రియ. మార్క్స్ సిద్ధాంతం ప్రకారం, దీని గమ్యం వర్గ రహిత సమాజం. గతి తార్కిక భౌతికవాదాన్ని సామాజికాభివృద్ధికి అన్వయించడమే, చారిత్రక భౌతికవాద వ్యాఖ్యానం (Materialistic Interpretation of History). మార్క్స్, ఎంజెల్స్‌లు ప్రతిపాదించిన ఆర్థిక నియతి సూత్ర ప్రకారం, ఉత్పత్తి విధానం, ఆర్థిక స్థితిగతులు, చరిత్ర పరిణామాన్ని నిర్దేశిస్తాయి. చరిత్రలో వచ్చిన మార్పులన్నీ, భౌతిక పరిస్థితుల ప్రభావం కారణంగానే వచ్చాయని మార్క్స్ భావించాడు. దీన్నే, గతి తార్కిక చారిత్రక భౌతికవాదమని వివరించాడు.

## 18.7 వర్గ పోరాటం - సమాజ పరిణామం

సామాజిక పరిణామం సారాంశం వర్గ పోరాటమేనని, మార్క్స్ భావించాడు. ఉత్పత్తి సాధనాలను స్వాధీనంలో ఉంచుకున్న వర్గం, ఎప్పుడూ పాలక వర్గమే. ఆవిధంగా లేని వర్గం, పాలితులు. పాలక వర్గం, పాలితులను దోచుకుంటుంది. పర్యవసానం, ఈ రెండు వర్గాల మధ్య సంఘర్షణ తప్పనిసరి. ఆ సూత్రం దృష్ట్యానే, సమాజ పరిణామాన్ని అర్థం చేసుకోవాల్సి వుంటుంది. సమాజ చరిత్ర తొలి దశలో, మానవుని జీవితం సాక్షాత్తూ ప్రకృతి మీద ఆధారపడి ఉంది. అప్పుడు సొంతంగా ఆస్తి అంటూ లేదు. ప్రాకృతిక వస్తువులను సమాజం ఉమ్మడిగా అనుభవిస్తూ ఉండేది. అనంతరం సొంత ఆస్తి ఏర్పడి, బానిస యుగం ప్రారంభమైంది. ఈ యుగంలో బానిస యజమానులకు, బానిసలకు మధ్య, వర్గ పోరాటం జరిగింది. తర్వాత, భూస్వామిక యుగం వచ్చింది. ఈ యుగంలో పాలక వర్గమైన భూస్వాములకు, దళిత వర్గంగా ఉండిన రైతులకు, పరిశ్రమలను అభివృద్ధి చేస్తున్న బూర్జువాలకూ మధ్య పోరాటం జరిగి, పెట్టుబడిదారీ యుగం ప్రారంభమైంది. పెట్టుబడిదారీ యుగంలో, యంత్రం ప్రధాన ఉత్పత్తి సాధనం. యంత్రాధిపతులు, అంటే పెట్టుబడిదారులు, అధికారాన్ని

BRAOU

స్వాయత్తం చేసుకుంటారు. లాభం కోసం ఉత్పత్తిదారులు పెట్టుబడి సాగిస్తారు. వీరు కార్మికులకు కేవలం బ్రతకడానికి చాలినంత మాత్రమే ఇస్తూ, అదనపు విలువను అపహరిస్తారు. దీంతో, పెట్టుబడిదారులకు, శ్రామిక వర్గానికి మధ్య పోరాటం తప్పదనీ, విప్లవం రాక తప్పదనీ, శ్రామిక వర్గం జయిస్తుందనీ, ముందుగా శ్రామిక నియంతృత్వం నెలకొల్ప బడుతుందని, తర్వాత వర్గాలు అంతరించి, దోపిడీ రహితమైన సమసమాజం ఏర్పడుతుందనీ, మార్క్సిస్ట్ సిద్ధాంతం.

అరిస్టాటిల్ నాటి నుండి మొత్తం సామాజిక పరిజ్ఞాన వారసత్వాన్ని సమన్వయించటం, మార్క్స్ ఉద్దేశం. మానవాళి ప్రగతి ఏ పరిస్థితుల్లో జరుగుతుందో, వాటి గూర్చి మరింత అవగాహన పెంపొందించటం, ఇతని లక్ష్యం. అటువంటి పురోభివృద్ధిని సాధించడానికి ఈతడు సూచించిన ఆదర్శమే, కమ్యూనిస్ట్ సమాజం. వ్యక్తిగత ఆస్తిని రద్దు చేస్తేనే, ఉత్పత్తి మార్గాలను జాతీయం చేస్తేనే, వివేచనతో కూడిన ప్రణాళికా రచన, సహకారోత్పత్తి, సమాన పంపిణీలపై ఆధారపడ్డ ఈ సమాజం సాధ్యమని, మార్క్స్ వాదించాడు.

## 18.8 కమ్యూనిస్ట్ సమాజం - రెండు దశలు

మార్క్స్ రచన 'క్రిటిక్ ఆఫ్ ది గోథా ప్రోగ్రామ్' (Critique of the Gotha Programme), కమ్యూనిస్ట్ సమాజం రెండు దశల్లో రూపొందడాన్ని వివరించింది. మొదటి దశలో, ఫ్యాక్టరీలు , యంత్రాలు, భూములు మొదలైన ఉత్పత్తి సాధనాలు సమాజ ఆస్తి. సమాజ సంపూర్ణ శ్రమ ఫలితం నుండి ఒక నిధి ఏర్పడుతుంది. ఈ నిధి నుండి ఆస్పత్రులు, పాఠశాలలు, తదితర నిర్మాణాలు జరుగుతాయి. ఈ సమాజ నిధికి మొత్తాన్ని మినహాయించాక, మిగిలిన దానిలో, ప్రతి శ్రామికుడూ తాను సమాజానికి ఎంత యిచ్చాడో, దాన్నుండి అంతే ప్రతిఫలాన్ని పొందుతాడు. అయితే, ఇది శ్రమకు తగ్గ ప్రతిఫలం కాదు. పనిచేయని వాడికి తిండి తినే హక్కు లేదు. ఇది అనివార్యమైన దశ. దీనికి రాజ్యం అవసరం. ఇది పూర్తి కమ్యూనిజం కాదు.

అయితే, రెండో దశలో 'సామర్థ్యాన్ని బట్టి పని, అవసరాలకు తగ్గ ప్రతిఫలం ' అనే లక్ష్యం నెరవేరుతుంది. ఎప్పుడైతే ప్రజలు తమ శ్రమను పూర్తిగా వినియోగించి ఉత్పత్తిని పెంచారో, సామరస్యంతో స్వచ్ఛందంగా పనిచేశారో, అప్పుడు రాజ్యం అంతరిస్తుంది. ఈ పరివర్తన దశలో శ్రామిక నియంతృత్వం తప్పదని మార్క్స్ భావించాడు. బల ప్రయోగంతో సమాజంలో బూర్జువా శక్తులన్నింటినీ రూపుమాపాక, రాజ్యం ఉండదు. తారతమ్యాలు లేని సమాజం - అంటే ,వర్గరహిత సమాజం ఏర్పడుతుంది. ఈ సమాజంలో వైషమ్యాలు,పరపీడన ఉండవు. ప్రజలంతా పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, సామాజిక జీవన ప్రాథమిక సూత్రాలను స్వచ్ఛందగా తమకు తాము అనుసరిస్తూ, సుఖ సంతోషాలతో జీవిస్తారు. ఇదీ, మార్క్స్ అందమైన ఊహా లోకం.

మార్క్స్ వివరించిన పెట్టుబడిదారీ వ్యవస్థ, వర్గ పోరాటం, శ్రామిక నియంతృత్వం, సామ్యవాద సమాజాన్ని గూర్చి, లెనిన్ తన ' స్టేట్ అండ్ రివల్యూషన్ ' (State and Revolution) అనే గ్రంథంలో వివరంగా చర్చించాడు. శ్రామిక నియంతృత్వం ద్వారా మాత్రమే, సామ్యవాద సమాజం, రాజ్యమవసరంలేని, వర్గాలు అంతరించిన, దోపిడీ రహితమైన సమ సమాజాన్ని సాధించటం వీలౌతుందని లెనిన్ భావించాడు.

## 18.9 విమర్శ

మార్క్స్ సిద్ధాంతం పాక్షికంగా మాత్రమే వాస్తవమని అనేకమంది భావిస్తున్నారు. దీనికి యిటీవలి కాలంలో, రష్యా వంటి ఐరోపా కమ్యూనిస్ట్ దేశాల్లో చోటు చేసుకున్న పరిణామాలు తోడయ్యాయి. మార్క్స్ సిద్ధాంతం పాక్షిక సత్యమనే భావనకు, అది ఆర్థిక వాదమనే అపోహ కారణం. సమాజ పరిణామానికి ఒక్క ఉత్పత్తి విధానమే మూల కారణం, ఉత్పత్తి శక్తులే చరిత్ర గతిని నిర్ణయిస్తాయని పేర్కొడమంటే, సమాజ పరిణామంలో రాజకీయ

BRAOU

విప్లవాలు, శాస్త్ర పరిజ్ఞానం , వ్యక్తుల ప్రాబల్యం, భావాల ప్రభావం మొదలైన వాటికి ఏమాత్రం స్థానం లేకుండా చేయడమే అవుతుందని, మార్క్స్ వాదాన్ని ఖండిస్తున్న వారు చెప్తున్నారు. ఆర్థిక స్థితిలోని మార్పే, మార్క్స్ చరిత్రలో మనుష్యుల యితర ప్రవర్తనలన్నింటికీ పరమ కారణం. అయితే, ఆర్థిక స్థితిలో వస్తున్న మార్పు, దేనివల్ల కలుగుతుందని వారు ప్రశ్నించారు. అహేతుకమైన గతి తర్కాన్ని సమాజ పరిణామానికి అన్వయించి, వర్గ పోరాటమనే ఏకగతిని చరిత్రకు కల్పించి, ఉత్పత్తి విధానం సర్వాన్ని నిర్ణయిస్తుందనే ఈ మార్క్స్ వాదం, చరిత్రను ఒక కర్మ సిద్ధాంతంగా, ఒక జోస్యం చెప్పే విధంగా చిత్రిస్తుందని, వారు వ్యాఖ్యానించారు. మార్క్స్ ప్రతిపాదించిన వర్గరహిత సమాజం, కేవలం అతని ఊహా ప్రపంచం మాత్రమేనని, అటువంటి సమాజం ఎక్కడా యింతవరకు ఏర్పడలేదని, ఇక ముందూ ఏర్పడే ప్రసక్తి లేదని, కొందరు భావించారు. సెబైన్ మహాశయుడు దీనిపై ఇంకో అడుగు ముందుకు వేశాడు. " The motion that society advances with iron necessity towards an inevitable goal belongs to the realm of religion or fate rather than to that of science or history " అని వ్యాఖ్యానించాడు.

మార్క్స్ ఉపయోగించిన గతి తర్కం, గత చరిత్రను వ్యాఖ్యానించడానికి మాత్రమే ఉపయోగిస్తుందిగాని, భవిష్యదనుభవానికి అన్వయింపదని, మార్క్స్ చరిత్ర తత్వం గూర్చి మరో సందేహాన్ని కొంత మంది వెలిబుచ్చారు. ఒకసారి వర్గరహిత కమ్యూనిస్ట్ సమాజాన్ని సాధించాక, గతి తార్కిక ప్రక్రియ ముగుస్తుందని మార్క్స్ చెప్పింది సహేతుకంగా లేదని ఈ విమర్శకులు పేర్కొన్నారు. అయితే, మార్క్స్ చరిత్ర తత్వంలో బహుశా అత్యంత ప్రధానమైన లోపం, అతడు ప్రకృతి న్యాయాలను, ధోరణులను సమాజంలో గుర్తించడమే కావచ్చు.

## 18.10 మార్క్స్‌వాద ప్రభావం

ఏది ఏమైనప్పటికీ, ప్రపంచంలో మార్క్స్ ఎంత వివాదాస్పదుడైన వ్యక్తో, అంతగానూ ఈ నాటి సమాజాన్ని ప్రభావితం చేసినవాడిగా చెప్పొచ్చు. మార్క్స్ వాదం ఆర్థిక వాదమనే అపోహ, పై విమర్శలకు కొంత కారణం. మార్క్స్ చరిత్రకు ఆర్థికపరమైన వ్యాఖ్యానాన్ని ఇచ్చినప్పటికీ, ఆయా సంఘటనలకు ఆర్థిక కారణాలను మాత్రమే చూపినట్లుగా భావించడం సరికాదు. ఇతర కారణాలపై, ఆర్థిక కారణాలు ప్రాబల్యం వహించినట్లుగా మాత్రమే, భావించాలి. మార్క్స్ చెప్పినట్లు "men make their own history,but they make it not of their own accord or under self-chosen conditions, but under given and transmitted conditions, the tradition of all dead generation weighs like a mountain on the brain of the living. " ఇంకో మాటలో చెప్పాలంటే, చరిత్రకు సంబంధించిన పై పై అంశాలను మాత్రమే మానవుడు నిర్దేశించగలడు. కాని, చరిత్ర మూల విషయాలు అతని పరిధికి మించినవి, అవి పూర్వ నిర్ధారితాలని మార్క్స్ విశ్వసించాడు.

మార్క్స్‌వాదంపై ఎన్ని సందేహాలున్నా, ఎంత తాత్విక విమర్శున్నా, వాల్ష్ చెప్పినట్లు, దాన్ని పూర్తిగా త్రోసిపుచ్చలేం. వాల్ష్ మహాశయుడే పేర్కొన్నట్లు, అనుభవపూర్వక పరిస్థితులను గూర్చి అవగాహన పెంపొందించుకోడంలో, మార్క్సిస్ట్ సిద్ధాంతం చరిత్రకారునికి తోడ్పడుతుంది. చరిత్రలో గొప్ప సంచలనం తెచ్చిన మార్క్స్‌వాదం, రష్యాలో లెనిన్, అతని అనుయాయులు శ్రామిక నియంతృత్వ వ్యవస్థను ఏర్పర్చడానికి ప్రాతిపదికైంది. సామ్యవాద సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా ప్రతిపాదించి, ' ప్రపంచ కార్మికులారా ! ఏకం కండి ' అనే నినాదాన్ని ప్రబోధించి, మార్క్స్ కోట్లాది ప్రజలకు మహా ప్రవక్తగా, ' లౌకిక జీసస్ ' గా ఆరాధ్యుడయ్యాడు. ఈ శతాబ్ది సమాజ శాస్త్రజ్ఞులపై, సంఘ సంస్కర్తలపై, విప్లవకారులపై, అతని ప్రభావం ప్రస్ఫుటమౌతూనే ఉంది. నేడు ప్రపంచంలోని ప్రతి పదిమందిలోనూ, కనీసం నలుగురు అతని ఆలోచనలకు ప్రభావితులైనవారే.



BRAOU

## 18.11 సంగ్రహంగా

చరిత్ర అంటే ఏమిటి ? చరిత్ర గమనాన్ని నిర్దేశిస్తున్న శక్తులు ఏమిటి ? చరిత్ర పరిణామాన్ని, అంతరార్థాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి ? మొదలైన ప్రశ్నలను వివిధ కోణాల నుండి పరిశీలించిన తత్వవేత్తలు, చరిత్రకారులు, సమకాలీన ఆలోచనా ధోరణులకు ప్రభావితులై, చరిత్ర స్వభావాన్ని, చరిత్ర తత్వాన్ని, చరిత్ర పరిణామాన్ని వివరించారు, వ్యాఖ్యానించారు. హెగెల్ ప్రతిపాదించిన గతి తార్కిక పద్ధతిని, సామాజిక అభివృద్ధి అధ్యయనానికి అన్వయించి, సామాజిక పరిణామాన్ని తన చారిత్రక భౌతికవాద వ్యాఖ్యానం ద్వారా, మార్క్స్ విశ్లేషించాడు. తన తాత్విక విచారణ ద్వారా, మానవ సమాజ పరిశ్రమలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి, చరిత్ర గమ్యం వర్గరహితమైన, వైషమ్యాలు, పరపీడన లేని, పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, ప్రజలంతా స్వచ్ఛందంగా, బాధ్యతాయుతంగా జీవించే సమ సమాజ స్థాపనను వివరించాడు.

మార్క్స్ చరిత్ర తత్వం అనేక విమర్శలకు లోనైంది. అతడిని విమర్శించిన వారు, చరిత్ర గమనం పూర్తిగా ఆర్థిక పరిస్థితులపైనే ఆధారపడదని, మానవ పురోభివృద్ధికి ఇతర కారణాలూ తోడ్పడతాయనీ, ఆ కారణాలను మార్క్స్ పట్టించుకోలేదని ఆరోపించారు. పైగా, వర్గరహిత సమాజ మనేది కేవలం అతని ఊహ మాత్రమేనని, అటువంటి సమాజం ఏర్పడటం సాధ్యం కాదని విమర్శించారు. ఈ విమర్శల్లో పూర్తి నిజం లేదనొచ్చు. ఏది ఎలా ఉన్నా, ఈనాటి సమాజంపై మార్క్స్ ప్రభావాన్ని ఎవరూ త్రోసిపుచ్చలేరు. చరిత్రకారులపైనే గాక, సమాజ శాస్త్రజ్ఞులు, సంఘ సంస్కర్తలు, విప్లవకారులపై నేడు మార్క్స్ ప్రభావం ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది.

## 18.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. గతితార్కిక పద్ధతిని అన్వయించి, కార్ల్ మార్క్స్ సామాజిక పరిణామాన్ని ఏవిధంగా విశ్లేషించాడో వివరించండి.
2. చారిత్రక భౌతికవాద వ్యాఖ్యానమంటే ఏమిటో వివరించండి.
3. మార్క్స్ చరిత్ర తత్వంపై వెలువడ్డ విమర్శలను విశ్లేషించి, మార్క్స్ ప్రభావంపై అంచనా నివ్వండి.

**II.** క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. మార్క్సీయ చరిత్రవాదంలోని ప్రధాన సిద్ధాంతాలను పేర్కొనండి.
2. మార్క్స్ సమాజంలోని దశలను గూర్చి విమర్శనాత్మకంగా రాయండి.

BRAOU

## 18.13 ఉపయుక్త గ్రంథాలు


1. Dray William, H., — **Philosophy of History**, Prentice Hall, New York, 1964
2. Edwin, R.A. Selignan, — **The Economic Interprefation of History,** Columbia University News press, New Yon, 1965

3. Gardiner, Patrick (Ed) — **The Philosophy of History,** Oxford University Press, 1974

4. Helperin. W.S. (Ed) — **Essays in Modern European Historiography,** London, 1970.

5. Iggers George, G. — **New Directions in European Historiography,** Connecticut, 1964.

6. Manuel, Frank, E., — **Shapes of Philosophical History,** Allen and Unwin(1965).

7. Peter singer, Mary — **History ,** Allen and Unwin (1965)

8. Walsh, W.H. — **An Introduction to Philosophy of History** London, 1969.

రచయిత : డా . జె. దుర్గాప్రసాద్

BRAOU

## భాగం - 19 : ఆధునిక ఐరోపా చరిత్ర రచనాభివృద్ధి - ఆనల్స్

విషయక్రమం


19.0 లక్ష్యాలు

19.1 పరిచయం

19.2 ఆనల్స్ విధానమంటే ఏమిటి ?

19.2.1 పుట్టుక

19.2.2 ఆనల్స్ పద్ధతిలో ముఖ్యాంశాలు

19.3 ఆనల్స్ చరిత్రలో ప్రముఖులు

19.3.1 ఫెర్నాండ్ బ్రాండెల్

19.4 ఆనల్స్ రచనా పద్ధతిపై గల విమర్శ

19.5 సంగ్రహంగా

19.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

19.7 ఉపయుక్త గ్రంథాలు


### 19.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

- ఆనల్ చారిత్రిక పద్ధతంటే ఏమిటో వివరించగలగాలి.
- ఆనల్ చారిత్రక పద్ధతి లోని ముఖ్యాంశాలను పేర్కొనగలగాలి.
- ఆనల్ చారిత్రక పద్ధతిని ప్రతిపాదించిన వారిలో ప్రముఖుల పాత్రను విశ్లేషించగలగాలి.
- నవీన, లేక ఆధునిక చారిత్రక విధానాల్లో ఆనల్ పద్ధతికి గల స్థానం, ప్రాముఖ్యత, ఈ పద్ధతిలోని లోపాలను విశ్లేషించగలగాలి.

### 19.1 పరిచయం

ఆధునిక చరిత్ర రచనా స్థాయిలో నూతన భావాలను, దృక్పథాలను, నిగూఢ ప్రశ్నలను నిష్కర్షగా రూపొందించుకొని, ముఖ్యమైన స్థానాన్ని పొందుతున్న చారిత్రక పద్ధతి, 1920లో ఫ్రాన్స్‌లో బహిర్గతమైన ' ఆనల్ చారిత్రక ', లేక ' ఆనల్ సాంప్రదాయ పద్ధతి '. ఆనల్ చరిత్రకారులు ముఖ్యంగా ఐరోపా, ఫ్రాన్స్ చరిత్రలను అధ్యయనం చెయ్యటంలో నిమగ్నమైనప్పటికీ, వీరు అవలంబించిన రచనా పరిజ్ఞానం, నూతన దృక్పథాలు, ఒక సమాజంలోని సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, మానసిక, భౌతిక సంబంధమైన అనేకాంశాలను విశాల అంతర్దృష్టితో చూడాల్సిన ఆవశ్యకతను ప్రతిపాదించారు. తమ అధ్యయనంలోను, విచారణల్లోను విశ్లేషించిన

BRAOU

అపరిమితమైన చారిత్రకాంశాల ఫలితంగా, ఇప్పటి వరకు చరిత్ర పుటల్లో అణిగివున్న అతి సూక్ష్మాంశాలను కూడ, ఉన్నత స్థాయికి చేర్చేటటువంటి నూతన ప్రక్రియను, వీరు చరిత్ర రచనా స్థాయిలో రూపొందించారు.

## 19.2 ఆనల్ విధానమంటే ఏమిటి ?

ఆనల్ చారిత్రక పద్ధతిని సంక్షిప్తమైన, స్పష్టమైన, నిర్వచన రూపంలో చెప్పడం, అతి క్లిష్టమైన పని. పొందికైన, సంశ్లేషనాత్మకమైన ఆధారాన్ని, ఆనల్ చరిత్రకారులు తమ రచనల్లో అవలంబించిక పోవుటయే దీనికి కారణం. అయినప్పటికీ, ఆనలిస్ట్ సాంప్రదాయం (Annalistic tradition) లో ప్రస్ఫుటమై, ఆనల్ చరిత్రకారుల్లో గమనింపదగ్గది, వీరు చరిత్రను ఒక పూర్ణమైన గమనంలో (holistic process) చూడడమే. అంటే, చరిత్ర రచనను కొన్ని సంఘటనలను అధ్యయనం చేసే పద్ధతిగా, ఆనల్ చరిత్రకారులు నిర్ద్వందంగా వదిలేశారు. దీనికి బదులుగా, ఒక నిర్దిష్టమైన, లేక ప్రత్యేకమైన స్థలం (space), కాలం (time), సమాజంలోని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిణామాలన్నింటినీ, సర్వసమగ్ర రూపంలో పరిశీలించటాన్ని వీరు చేపట్టారు.

### 19.2.1 పుట్టుక

ఆనల్ చారిత్రక రచనా పద్ధతి ఉద్భవించటానికి గల కారణం, ఆనాటి ప్రాబల్యమైన రాంకే (Ranke) చారిత్రక విధానంపై , ఫ్రాన్స్ చరిత్రకారులకు ఏర్పడ్డ అసంతృప్తియే. రాంకే ప్రతిపాదించిన శాస్త్రీయ చారిత్రక రచన (Scientific History) లో ముఖ్యంగా చోటు చేసుకున్నది, సంఘటనాత్మకమైన చారిత్రక రచనా సంప్రదాయం. ఇది ఆనాటి చారిత్రక రచనా విధానాలపై ఎనలేని ప్రభావాన్ని చూపింది. రాంకే రచనా విధానానికి వ్యతిరేకంగా, 1900లో హెన్రీ బెర్ (Henry Berr) సంపాదకత్వంలో, రెవి డి సింథెస్ హిస్టారిక్ (Revee de synthese historique) అనేటటువంటి పత్రిక ప్రచురణలోకి వచ్చింది.

రెవిడి సింథెస్ హిస్టారిక్ కు సంపాదకత్వం వహించిన బెర్ అభిప్రాయంలో, చారిత్రక రచనంటే గతాన్ని వర్ణించటం కాదు. గతాన్ని స్పష్టీకరణం, లేక వ్యాఖ్యానం చేయటం. బెర్ ప్రారంభించిన ఈ పత్రికా ప్రభావం వలన అనేక గ్రంథాలు చారిత్రక రచనా విధానాన్ని తిరిగి తెలిపేందుకు పూనుకున్నాయి. వీటిలో గమనింపదగ్గ విషయం, కాలక్రమానుసారమైన సంఘటన ; ప్రబలమైన జాతీయ రాజ్యంలా, రాజకీయ చరిత్రను వర్ణించే విధానానికి భిన్నమైన సామాజిక, సాంస్కృతిక రచనా పద్ధతిపై వీరు దృష్టిని కేంద్రీకరింపచేయటం.

ప్రముఖ చరిత్రకారులైన లూసియన్ ఫెవ్ర్ (Lucien Febvre) , మార్క్ బ్లాక్ (Marc Bloch) , ఈ నూతన చారిత్రక రచనా సాంప్రదాయానికి వారి పరిశీలనల ద్వారా, మరింత ప్రేరణను కల్పించారు. 1912లో రచించిన 'రెండవ ఫిలిప్ , మరియు ఫ్రెంచ్ కామ్టే' (Philip II and French Comte) అనే గ్రంథం ద్వారా, ఫెవ్ర్ (Febvre) రాజకీయ వాస్తవికమై, అత్యంత ప్రాణమైన ఫ్రెంచ్ కామ్టే ప్రాంతాన్ని మరింత ప్రాముఖ్యం లోకి తేవడానికి, తాను రాజకీయ చరిత్ర రచనకు పూనుకున్నాడని ధృవపర్చాడు. తాను పరిశీలించే రాజకీయ చరిత్రలో ముఖ్యంగా అస్పష్టమైన వాటిని స్థిర పర్చుకొని, ప్రబలమైన మానవ నిశ్చయాలను, ఏర్పడ్డ పరిస్థితులను, మాండలిక ప్రాంతాల్లోనున్న అనువైన వాస్తవాల్లోను, సామాజిక వ్యవస్థలోనున్న మార్పుల్లో ఉండే రాజకీయ చరిత్రగా భావించాడు. ఈ దృక్పథంతో విశదీకరించే రాజకీయ చరిత్ర రచనలో, సూటిగా ఏ ఒక్క పరిణామానికి ప్రాముఖ్యత నివ్వలేదు. దీనికి కారణం, ఫెవ్ర్ సమాజంలోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక నిర్మాణ వ్యవస్థలన్నింటిని, భూగోళం ప్రత్యేక పాత్రను, చారిత్రక రచనా పద్ధతిలో అంతర్భాగంగా నిల్పి, తన పరిశీలనను సాగించుటయే. ఒక సమాజంలో పటిష్ఠమైన మేధో చైతన్యం (Intellectual consciousness) చరిత్ర పునర్నిర్మాణానికి ఏ విధంగా దారితీస్తుందో అన్న విషయాన్వేషణపై ఆసక్తి చూపి, లూసియన్ ఫెవ్ర్ (Lucien

Febvre) 16వ శతాబ్దంలోని నాస్తికవాదం (atheism) , దేవునిపై గల అపనమ్మకమైన భావాలను, ' లేప్రాబ్లమ్ డి ఇంక్రోయాన్స్ యాన్ XVI సీయేలా రెలిజియన్ డి రాబెలె, (Le problem de Incroance an XVI siecl La Religion de Rabelais) లో విశదీకరించడం ద్వారా, రూఢి చేశాడు. దీన్ని సూక్ష్మంగా తెలిపిన బౌద్ధిక చరిత్రనే కాక, ఆ కాలంలో వ్యాప్తిలోనున్న బౌద్ధిక వాతావరణమంతటిని విశ్లేషించటానికి, రాంకే, ఫెబ్రేలు ఈ గ్రంథంలో కృషి చేశారు.

బౌద్ధిక, మానసిక సంబంధ చరిత్ర పరిణామాలను పరిశోధించటంలో, మక్కువ చూపిన వారిలో ఎన్నదగిన వాడు, మార్క్ బ్లాక్ (Marc Bloch) కూడా. 1924లో ప్రచురితమైన ' లెరాయ్‌స్థమాంటర్గస్ ' (Le Raisthamanturges) పుస్తకంలో , అద్భుతకరమైన శక్తులున్న వాటిని స్పష్టపర్చగల సామర్థ్యం రాజులకుందనే నమ్మకం ఉద్భవించటానికి గల కారణాలను విశ్లేషించటమేగాక, ఈ నమ్మకం ఏ విధంగా రాజత్వమనే భావంలో మిళితమైందో స్పష్టం చేశాడు. బ్లాక్ రచనల్లో సుప్రసిద్ధమైంది, ' భూస్వామ్య సమాజం ' (Feudal Society). దీని ద్వారా , చుట్టూ వ్యాపిస్తున్న పూర్తి సామాజిక చరిత్ర పునర్నిర్మాణానికి పూనుకొన్నాడు. సామాజిక వాతావరణంలో ప్రబలిన ఒక వైఖరిలో నున్న ఆలోచన, పని, పాలిత, పీడిత వర్గాలు, ఐశ్వర్య దారిద్ర్యం లాంటి అనేక అంశాలను మిళితం చేసుకొన్న పద్ధతిని, సంఘటిత ఫ్యూడల్ పద్ధతిగా నిరూపించాడు.

తొలి ఆనల్ చరిత్రకారులైన మార్క్ బ్లాక్, లూసియన్ ఫెబ్రేల కృషి ఫలితమే, 1929లో వెలువడ్డ ' ఆనల్ డి హిస్టారిక్ ఎకనమిక్ అండ్ సోషల్ ' (Annals d 'historic economic and social) పత్రిక. కాల క్రమేణా, ఈ పత్రిక ' ది ఆనల్స్ ' (The Annals) అనే పేరుతో ప్రపంచ వ్యాప్తిని పొందింది. దీనికి సంపాదకత్వం వహించిన మార్క్ బ్లాక్, లూసియన్ ఫెబ్రే, తొలి సంచికలో, ఆనల్ చరిత్ర రచనా పద్ధతి, ఉద్దేశాన్ని విశదీకరించారు. ఇప్పటివరకు సాంప్రదాయ పద్ధతిని అవలింబించి, ఆధార పత్రాలను పరిశీలించే చరిత్రకారులు, సమకాలిక సామాజిక,ఆర్థిక పరిమాణాలను పరిశీలించే చారిత్రకవేత్తలు, సమాంతర త్రోవల్లో పయనిస్తున్నారు. మరికొందరు చరిత్రకారులు లబ్దమైన అంశాలను పరిశీలించటంలో నిగమ్నులై, తమ పరిశీలనా పరిధి ఆవల జరుగుతున్న చారిత్రక రచనలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రబలమైన ఇటువంటి చారిత్రక పద్ధతులన్నింటిలోనున్న " ఉపద్రవమైన చీలికలను " అధిగమించటమే, ఆనల్ చారిత్రక రచనా పద్ధతి ధ్యేయంగా వీరు ప్రకటించారు. అంతేకాదు ; చారిత్రక రచనా సంప్రదాయానికి ఆవశ్యకమైన, శాస్త్రబద్ధమైన పరిశీలనా గ్రంథాలను, వ్యాసాలను ప్రచురించటమే కాకుండా, వివిధ శిక్షణా విభాగాల నుండి, ప్రత్యేకమైన విషయాలను విచారణ చేసిన గ్రంథాల నుండి, అనేక పరిశోధనాంశాలను ప్రకటింప చేయటానికి అవసరమైన వేదికా పీఠంలా, ఈ ఆనల్ పత్రికను రూపొందించారు.

ఈవిధంగా ప్రచురణలోకి వచ్చిన ' ది ఆనల్ ' పత్రిక వినూతనమైన ఒరవడిని ప్రకటించడం ద్వారా, నూతన రచనా విధానానికి దోహద పడింది. అయినప్పటికీ, సాంప్రదాయ చారిత్రక రచనా పద్ధతిని అధిగమిస్తూ, నూతన దృక్పథాలకు ' ది ఆనల్ ' నాంది పలికిందనడం అతిశయోక్తియే. ఆనాటికే, అమెరికా చరిత్రకారులైన యఫ్. జె. టర్నర్, (F.J. Turner), ఛార్ల్స్ బియెర్డ్ (Charles Beard), సాంప్రదాయబద్ధమైన రాజకీయ చరిత్ర రచనా పద్ధతికి దూరమైన నూతన పద్ధతులను అవలంబిస్తున్నారు. ఇంగ్లాండ్‌లో ఆర్థిక చరిత్ర రచనలకు మంచి చేయూతనిస్తూండడమైంది. 1929లో ప్రచురణకు వచ్చిన ' ది ఎకనామిక్ హిస్టరీ రెవ్యూ ' (The Economic History Review) గతాన్ని ఇంకొంచం ముందుకు జరిపి, చారిత్రక రచనా విధానాలకు నూతన ప్రేరణను కల్పించింది కార్ల్ మార్క్స్, ఏంజెల్స్ (Karl Marx and Engels) రచనలనుట అతిశయోక్తి కాదు.

BRAOU

### 19.2.2 ఆనల్స్ పద్ధతిలోని ముఖ్యాంశాలు

సాంప్రదాయకమైన చారిత్రక రచనా సంప్రదాయానికి, ' ది ఆనల్ ' నాంది పలకక పోయినప్పటికీ, గతాన్ని పరిశీలించటంలోను, వివరించటంలోను, విశదీకరించటంలోను, ' ది ఆనల్ ' పత్రిక సమూల సంస్కరణోపేతమై, అద్వితీయమైన మార్గాన్ని సూచిస్తూ, చారిత్రక రచనా పద్ధతిలో మూడు ముఖ్యాంశాలను సూచించింది.

మొదటిది, నూతన చరిత్ర రచనకు పూనుకున్న ఆనల్ చరిత్రకారులు ఇప్పటివరకు చరిత్రకారుని దృష్టిలో బహిర్భాగంగా నిల్చిపోయిన గతానికి సంబంధించిన అనేకాంశాలకు పత్రికలో ప్రచురణను కల్పించారు. ఉదాహరణకు, వ్యవసాయ సంబందమైన నిర్మాణ వ్యవస్థలను, మంత్ర విద్య ప్రాముఖ్యతను, సాంకేతిక శాస్త్రీయ బౌద్ధిక వాతావరణాన్ని ఒక దానిపై ఒకటి ప్రభావం చూపే విధానాలను, తొలి దశలో అంకురిస్తున్న పెట్టుబడిదారీ విధానం, వ్యాపార, వాణిజ్య సంబంధిత సంప్రదాయాలపై చూపిన ప్రభావం, మానసికమైన సాధనాలు, ఆర్థిక, సామాజిక వాస్తవాల మధ్య గల పరస్పర బంధం, మొదలైన విస్తారమైన అంశాలను, గత గమన వర్ణనల్లో అంతర్భాగంగా చేపట్టారు.

రెండోది, నూతన చారిత్రక విధానం రూఢిగా, ఏ ఒక్క అంశానికి ఆవశ్యకంగా ప్రముఖతను చూపలేదు. కాని, అది భౌతికమైన అంశాల (Material factors) ప్రాముఖ్యతను గుర్తించటమేగాక, ఆనల్ చరిత్రకారులు గతాన్ని విశ్లేషించటంలో మనోభావమైన, లేక మానసికమైన (Mental) పరిణామాల పాత్రను నొక్కి వక్కాణించారు. తొలి దశలో ' ది ఆనల్ ' ప్రచురించిన వ్యాసాలు, దీనికి ప్రతీక. ఈ ప్రక్రియ చారిత్రక రచనా విధానంలో ఎంతో ప్రభావాన్ని చూపింది. ఎందుకంటే, అప్పటికి ప్రబలిన మార్క్సిస్ట్ (Marxist) రచనా సంప్రదాయంలో, సాంస్కృతిక పరిణామాలకు వాస్తవికంగా తావులేని, అధిభౌతికమైన అంశాలకు ప్రాధాన్యమిచ్చే పద్ధతులను వ్యాప్తి చేశారు. గ్రామ్‌షియన్ ఆల్తూషియన్ తర్వాతి కాలంలో ప్రబలిన మార్క్సిస్ట్ పద్ధతిలో, సాంస్కృతిక ప్రాంతానికి కూడా చారిత్రక రచనా పద్ధతిలో యధాస్థితిని కల్పించటంలో గోచరమౌతుంది.

మూడోది, చారిత్రక రచనలో గతి గమనాన్ని (Historical Process) పూర్తిగా తెలుసుకోవాల్సిన ప్రధానాంశంగా గుర్తించాలనే భావాన్ని వక్కాణించారు. పరిపూర్ణమైన పూర్తి చరిత్ర రచనకు, భౌగోళిక, వాతావరణ, దీర్ఘకాలిక, ఆర్థిక అస్థిరతలు, సాంకేతిక, సాంస్కృతిక పద్ధతులు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్న అంశాలను విచారణ చేసే రచనా పద్ధతిని అవలంబించాలన్నదే వీరి ధ్యేయం. అంటే, అన్యోన్యాశ్రయమైన అంశాలను చారిత్రక రచనలో గుర్తించాల్సిన ఆవశ్యకతను వీరు తెల్పారు.

## 19.3 ఆనల్స్ చరిత్రలో ప్రముఖులు

ఆనల్ చారిత్రక పద్ధతి నవలంబించిన ముఖ్య ప్రతినిధుల రచనలను తెలుసుకోవటం ద్వారా, పైన చెప్పిన ఆనల్ చరిత్ర పద్ధతి స్వభావం, లక్షణాలను స్పష్టం చేయటానికి అవకాశముంది.

### 19.3.1 ఫెర్‌నాండ్ బ్రాండెల్

ఆనల్ రచనా పద్ధతిని ప్రభావితం చేసి, ఎనలేని ఘనతను పొందిన చరిత్రకారుల్లో మొదటివాడు ఫెర్‌నాండ్ బ్రాండెల్ అనడం, నిస్సంకోచం. ఆనల్ రచనల్లో జ్ఞాపకార్థమై నిల్చింది, 1949లో ఫెర్‌నాండ్ బ్రాండెల్ ప్రచురించిన " లామెడిటరాన్నే ఎ లే మాండ్ మెడిటరాన్నే ఆలేపోక్ డి ఫిలిప్ II " - ( La Meditaranne et le monde Meditaranne 'al ' epque de Philippe II) (Meditarranean and the Meditarranean World in the Age of Philip II ) గ్రంథం, చారిత్రక రచనకు ఆదర్శప్రాయంగా నిల్చింది. ఈ గ్రంథం

BRAOU

ద్వారా, బ్రాండెల్ రూపొందించిన ఆనల్ చారిత్రక సంప్రదాయంలో, రెండు ముఖ్యాంశాలు గర్భితమై ఉన్నాయి. మొదటిది, చారిత్రక కాలంలో ముఖ్యంగా మూడు కాల పరిణామాలను గుర్తించి, వాటి మధ్య గల వ్యత్యాసాలను విశదీకరించటం. ఈ మూడు కాలపరిణామాల్లో ఒకటి, అచలమైన భూగర్భ కాలం, (almost immobile geological time) ; రెండు, అతి నెమ్మదైనప్పటికీ, దృఢీకరించుకొని, సామాజిక చరిత్రలో మిళితమైన, దీర్ఘకాలిక కాలం. దీన్నే లాంగ్ డ్యూర్ అని పేర్కొన్నాడు. మూడు, స్వల్పకాల పరిమితి వల్ల, సంఘటన పూరితమైన కాలం. లోతుగా నుండి గంభీరంగా అనిపించే ప్రత్యక్షమైనటువంటి ఈ పరిణామాలన్నీ సాధారణంగా నిగూఢమై, దీర్ఘ కాలపరిమితిలో ప్రస్ఫుటమై, నిశ్చయమైన గతిగమనాలు (historical processes), రాజకీయ సంఘటనల ద్వారా, చరిత్ర ఉపరిభాగంలో సాక్షీకరిస్తున్నాయని, ఫెర్నాండ్ బ్రాండెల్ విశదీకరించాడు.

తాను ప్రతిపాదించిన మూడు కాల ప్రత్యాయాలను, మూడు భాగాల్లో ఇమిడ్చి, ఒక గ్రంథాన్ని రచించాడు. మొదటి భాగంలో, మానవ జీవనం చుట్టూ పరివేష్టితమైన పరిస్థితుల మధ్య గల పరస్పర స్పర్థలను స్పష్టం చేసే " భౌగోళిక స్థలం " (Geographical Space) అనే ప్రయోగ శాలలో తన పరిశోధనలను నిలిపాడు. భౌగోళిక వాతావరణ పరిస్థితులు మాత్రమే చరిత్రను నిశ్చయిస్తాయని చెప్పలేదు కాని, గతి గమనాన్ని మలచటంలో ఈ రెండంశాలు ముఖ్యమైనవిగా గుర్తించటమావశ్యకమని, ఫెర్నాండ్ బ్రాండెల్ తెలిపాడు. రెండో భాగంలో, ప్రత్యక్షంగా కన్పిస్తున్న చరిత్ర చలనాలను చర్చించాడు. మూడో భాగంలో, చరిత్రాత్మక సంఘటనలను కూలంకషంగా వర్ణించాడు.

చరిత్ర గమన నిర్ణయంలో జీవ్యావరణ సంబంధమైన అంశాల పాత్రను చరిత్రకారులు గుర్తించటమేకాకుండా, దీర్ఘకాలిక గతి గమనానికి (Long term Historical process), అల్పకాలిక గతిగమనానికి (Short term Historical process) మధ్యగల వ్యత్యాసాలను స్పష్టం చేయాలన్నాడు ఫెర్నాండ్ బ్రాండెల్. వీటన్నింటిని అంతర్దృష్టితో, సమగ్ర రూపంలో చూసి, చారిత్రక పరిశోధనల్లో పూర్తిగా మిళితం చేసి, చారిత్రక రచనా నిర్మాణంలో నూతన నమూనాను తయారు చేయటమే, బ్రాండెల్ సాధించిన ప్రతిభ.

BRAOU

ఈ నూతన రచనా విధానంలో బ్రాండెల్ రూపొందించిన మరో ప్రక్రియ, మార్క్‌బ్లాక్ (Marc Bloch), లూసియన్ ఫెబ్రే (Lucien Febvre) వక్కాణించిన మానసికమైన చరిత్ర నుండి , సామాజిక నిర్మాణ వ్యవస్థలపై నిల్చినటువంటి వినూతన చారిత్రక నిర్వికల్ప జ్ఞానానికి చేరుకోడం. అంటే, సంఘటనలకు, దీర్ఘకాలిక గతి గమనాలకు, భౌగోళిక పరిస్థితులకు మధ్య సమన్వయాలను విచారణ చేయడమేగాక, సామాజిక వ్యవస్థలు చరిత్రను స్పష్టం చేయడంలో ఏవిధంగా ఆధారపడతాయన్న విషయాన్ని విశ్లేషించాల్సిన ఆవశ్యకతను తెల్పాడు.

చరిత్ర గమనాన్ని నిర్ణయించటంలో, నిర్మాణ వ్యవస్థలు ఏవిధంగా ప్రభావితం చేస్తాయన్న విషయాన్ని ' కాపిటలిజమ్ అండ్ మెటీరియల్ లైఫ్, 1400 - 1800 ' (Capitalism and Material life, 1400 - 1800) లో, మరొక్కసారి స్పష్టం చేశాడు, ఫెర్నాండ్ బ్రాండెల్. పెట్టుబడిదారీ విధాన ప్రారంభం, వ్యాప్తి, కాల క్రమేణా భూగోళ పరిణామంగా ఏర్పడినటువంటి వివిధాంశాలను స్పష్టంగా వర్ణించాడు. ' ది మెడిటరేనియన్ అండ్ మెడిటరేనియన్ వరల్డ్ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఫిలిప్ II ' అండ్ ' ది సివిలైజేషన్ అండ్ కాపిటలిజమ్ 15th - 18th సెంచరీ : ది పర్‌స్పెక్టివ్ ఆఫ్ ది వరల్డ్ ' (The Mediterranean and the Mediterranean World in the Age of Philip II and the Civilization and Capitalism 15th - 18th Century : the Perspective of the World) అనే రెండు గ్రంథాల్లోను, గతిగమనాలు, రాజకీయ సరిహద్దులను అతిశయింపచేస్తూ, మిళితం గావించే, ఆర్థిక ద్విగ్విషయం, ప్రపంచాల నిర్మాణాలను ఏర్పాటు చేస్తాయన్న అంశాన్ని విశదీకరించటంలో సఫలీకృతుడైనాడు, ఫెర్నాండ్ బ్రాండెల్. కాబట్టి, బ్రాండెల్ ప్రతిపాదించిన చారిత్రక దర్శన కోణం పూర్ణమైన

చరిత్రగా రూపొందింది. ఇక్కడ 'పూర్ణమైన చరిత్ర' అంశాన్ని, రాంకే గుర్తించిన చారిత్రక సంఘటనల సేకరణన్న అర్థవిషయంలో గుర్తింపరాదు. గతి గమనంలో చోటు చేసుకున్న వివిధ అంశాలన్నింటిని, అభిన్నమైన, పూర్తి నిర్వికల్పజ్ఞానం ప్రస్ఫుటం చేసే ఒకే ఒక గమనంగా పరిగణిస్తూ, చరిత్ర రచనా నిర్మాణానికి పూనుకొనుటగా భావించాలి.

సమకాలిక చరిత్రకారులలో గొప్ప ప్రభావాన్ని చూపిన ఫెర్‌నాండ్ బ్రాండెల్, నూతన చరిత్ర రచనా సంప్రదాయంలోనే, కేంద్రీయ స్థానాన్ని అధిరోహించాడు. పలువురు ఆనల్ చరిత్రకారులు బ్రాండెల్ సాధించిన పరిశోధనా స్థాయికి చేరలేకపోయినప్పటికీ, అపరిమితమైన విస్తృతిగల అనేక కథాంశాలను, ఈ నూతన దృక్కోణం నుండి విచారణ చేయటాన్ని ప్రారంభించారు. సాంప్రదాయ చారిత్రక రచనలో రాశి పృథక్కరణ చరిత్రను (Quantitative history), ప్రత్యేకమైన చారిత్రక స్థితులను వర్ణించటంలో సాధనంగా వాడారు. కాని, ఆనల్ చరిత్రకారులు, అతి దీర్ఘకాలికమైన ఆర్థిక, ప్రభువర్ణన పరంపర ప్రమాణాలను విశ్లేషించుటకు ప్రధానంగా రాశి పృథక్కరణాలనుపయోగించారు. స్థూలమైన పది భాగాలు గల 'సెవిల్ ఏలా అటెంటివ్, 1550 - 1650' (Seville et l attentive 1550 - 1650) 1979లో ప్రచురితమైన 'పియర్' 'హ్యుగెట్‌చౌన్' (Pierre, Hugvete Chaun) గ్రంథాలు ఈ కోవకు చెందినవే. వీరు వ్యాపార సంబంధమైన లిఖిత గ్రంథాల రూపేణా, స్పెయిన్ వ్యాపారస్తుల ఎగుమతి, దిగుమతులైన నౌకా వ్యాపారాన్ని విశదీకరించారు.

రాశి పృథక్కరణమైన చరిత్ర రచన, మనుష్యులకు సంబంధించిన అంశాలను విస్మరించిందనుటకు వీలుకాదు. ఎందుకంటే, ఆనల్ చరిత్రకారులైన పియర్ (Pierre) మొదలైన వారు, రాశీ ప్రమాణమైన పరిశీలనలను సామాజిక చరిత్రతో సమన్వయ పరుస్తూ, ఉత్పాదకమైన చరిత్ర రచనా దృక్పథ ప్రాముఖ్యతను తెల్పారు. ఉదాహరణకు, పియర్ గోబర్ట్ (Pierre Gobert) రచించిన 'బోవేయి ఏలా బోవేసిస్ డి 1600 - 1730' (Beauvais el la beauvaisis de 1600 - 1730) లో బ్యూరిస్ (Beauris) ప్రాంతంలోగల ఆర్థిక వ్యవస్థలను రూఢిగా చిత్రించటంలోను, సాంస్కృతిక భావాల పాత్రలను నిరూపించటంలోను, జనాభాలకు సంబంధించిన నిరూపణ సంఖ్యా పట్టికల ఆవశ్యకతను తెల్పారు. పియర్ గోబర్ట్ రచనా పంథాలో నడిచిన మరో గ్రంథం, ఇమాన్యుయల్ లా రే లాడ్యూరి (Emmanuel Laray Ladurie) రాసిన 'లేపే సన్స్ డి లాంగ్యూడక్' (Le paysans dee Languedoc). ఇందులో, సాంస్కృతికాంశాలు చరిత్ర గమనంలో జీవ శాస్త్ర సంబంధిత అంశాలను మితం చేస్తూ, వాటి పాత్రను నిశ్చయింప చేస్తాయన్న విషయాన్ని అవగాహనకు తెచ్చాడు. ముఖ్యంగా, ఒక ప్రత్యేకమైన ప్రాంతంలో ప్రొటెస్టాంటిజమ్ (Protestantism), జనాభా పెరుగుదల, ఆహార సమస్య, వర్గపోరాటాలనే పలు అంశాలను పరిశీలించారు.

ఒక చిన్న ప్రాంతంలో ఆర్థిక, సాంస్కృతిక సమాజాల మధ్య, మానసిక, అధిభౌతికపరమైన అంశాల మధ్యగల పరస్పరానుబంధాలను అద్భుతంగా వర్ణిస్తూ పూర్ణ చరిత్ర (Total History) రచనా పునర్నిర్మాణానికి రూపొందిన పంథాలో నడిచిన గ్రంథం లోడ్యూర్ (Lodurie) రాసిన ఇటువంటి చరిత్ర రచనలు, మనోగతి శాస్త్ర చరిత్రకు సంబంధించిన గ్రంథాల కంటే భిన్నంగా రూపొందాయి. సాధారణంగా, మనోగతి శాస్త్రానికి సంబంధించిన రచనల్లో, ఒక వ్యక్తి మనోగతి సంబంధితమైన అంశాల విశదీకరణే జరుగుతుంది గాని, ఆ నాయకుడు నిల్చియున్న సామాజిక అన్వయానికి సంబంధించిన అంశాలను పూర్తిగా విస్మరించడమైంది. చైతన్య పూరితమైన అభిప్రాయాలను పదే పదే వెల్లడిస్తూ, లోపల నిగూఢమైన (Subconscious) అభిప్రాయాలను పూర్తిగా ధిక్కరించిన మార్క్సిస్ట్ చరిత్రకారులకు భిన్నంగా ఉన్నారు, ఆనల్ చరిత్రకారులు. ఆనల్ చరిత్రకారులు మానసికమైన ప్రపంచానికి సంబంధించిన రచనా పరిజ్ఞానంలో, మిగతా చరిత్రకారులతో ఏకీభవించినప్పటికీ,

BRAOU

వీటి పరిశీలనకు తీసుకున్న విషయాలను స్పష్టం చేయటానికవలంబించిన మార్గాలు, సాధనం, పూర్తిగా నూతనమైనవి. సాంస్కృతిక ఉత్పాదకాలైన చిత్రవర్ణనలు, సాహిత్యపరమైన గ్రంథాలు మొదలైన వాటిని విశ్లేషించటం ద్వారా, ఉదాహరణకు, ఫిలిప్ ఏరీ, (Philip Aries), సాంస్కృతిక ప్రేరితమైన బాల్యాన్ని, 'సెంచరీస్ అఫ్ చైల్డ్‌హుడ్ (Centuries of Childhood) అనే గ్రంథంలో, ఈ విషయాలను వివరించాడు.

సాంఖ్యక విశ్లేషణం (Statistical Analysis) ద్వారా, పుస్తకాల పేర్లను, సమీక్షలను, విషయ సూచికలను విశ్లేషించి, తద్వారా రాశిపృథక్కరణమైన సాంస్కృతిక చరిత్రను, ఫ్రాంకోయిస్ (Francois), అతని సహచరులు, చిత్రీకరించడానికి పూనుకున్నారు. అసాధారణమైన పరంపరలో అనేక పరిశీలనాంశాలకు శ్రీకారం చుట్టిన ఆనల్ చారిత్రక రచనా విధానాలకు మరోమచ్చు తునక, ఫెర్నాండ్ బ్రాండెల్ ఆహార పద్ధతుల చరిత్రలో సాగించిన పరిశోధనలు. మానవ జీవనానికి ఆహారం, గృహం, వస్త్రాల కంటే ముఖ్యమైనప్పటికీ, చరిత్రకారులు ఈ అంశాన్ని పూర్తిగా ఉపేక్షచేస్తూ వచ్చారు. ఆహార సంబంధితమైన చారిత్రక పరిశోధనలు, చరిత్రలో అగుపించే అన్ని స్థాయిలను వెలుగులోకి తేవడమేకాక, దీర్ఘకాలిక పరిమితమైన లాంగ్‌డ్యూరి (Long duree) ను, స్పష్టీకరణకు ఉపయోగితమైన భావాలను విశదపరుస్తాయన్న దృక్పథాన్ని బ్రాండెల్ తెలిపాడు. ఎందుకంటే, అసాధారణంగా దీర్ఘకాలంలో మానవ ఆహార పద్ధతుల్లో మార్పు అనేది కన్పిస్తుందని బ్రాండెల్ అభిప్రాయం. ఫ్రాన్స్‌లో అగుపడ్డ నూతన ప్రాచీన ఆధారాలను ఈ నూతన దృక్కోణంతో పరిశీలిస్తే, కన్పించేవి ఫ్రెంచ్ సమాజంలోని వివిధ వర్ణ, జన సమూహాల ఆహార, వ్యయ అలవాట్లు, వీరు పండించే వివిధ పంటల వివరాలు, పండిన ధాన్యాలను విక్రయించే విధానాలతోపాటు, వీరి అభిరుచుల్లో, వంటావార్పు విధానాల్లో ఉండే మార్పులు. ఈవిధంగా, మానవ జీవితానికి, సాంస్కృతిక జీవితానిక మధ్యగల సంబంధాన్ని ఏర్పర్చే మార్గంగా, ఆహార పద్ధతులకు సంబంధించిన చరిత్ర నిల్చింది.

ఆనల్ చరిత్రకారులు అభివృద్ధి పర్చిన మరో పరిశీలనాంశం, చారిత్రక ప్రభావానికి సంబంధించింది. ఈ ప్రక్రియ ద్వారా, సంస్కృతి, జీవ శాస్త్ర పరిధుల మధ్యగల సమన్వయం, ఒక ప్రాంత జనాభాను నిర్ధారించటంలోనే గాక, కుటుంబ స్వభావాన్ని గూడా నిశ్చయించటంలో, ఏవిధంగా ప్రభావితం చేస్తాయన్న విషయానికి, వారు పరిశీలనాంశాల ద్వారా నిర్ధారించారి.

BRAOU

## 19.4 ఆనల్ రచనా పద్ధతిపై గల విమర్శ

రాజకీయ చరిత్రను, చరిత్ర ఉపరి భాగంలోనున్న చరిత్రగా భావించటం వల్ల, ఆనల్ చరిత్రకారులు దానిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఆనల్ చారిత్రక పద్ధతిని విమర్శించిన అనేక మంది, దీన్ని ఒక దోషంగా భావించారు. ఎందుకంటే, రాజకీయ చరిత్రను విస్మరించటం వల్ల, ఆర్థిక చరిత్ర రచనల్లో వక్రీకరణ దృష్టి ఏర్పడే ప్రమాదముందని ఆరోపించారు. బ్రాండెల్, మార్క్‌పెరో, ఫ్రాంకోయిస్ ఫూరె మొదలైన ఆనల్ చరిత్రకారులు, రాజకీయ గమనాలను అధ్యయనం చేసినప్పటికి, వీటిని ఒక సమగ్ర రూపంలో సంఘటితం చేసే పద్ధతికి, ఆనల్స్ నిర్వికల్పజ్ఞుల దృక్పథంతో మిళితం చేయలేకపోయారు

ఆనల్ చరిత్రకారులు విమర్శకుగురైన మరో అంశం, వీరు చరిత్రను సామాన్య శాస్త్రానుసారంగా రూపుదిద్దుకొన్న చలనంగా భావిస్తూ, మానవ చర్యలన్నీ ఆ నిర్దుష్టమైన శక్తుల చర్యలతో నిర్ణయింపబడినవిగా చిత్రించి, మానవ ప్రాతినిధ్య ప్రభావానికి ఎటువంటి ప్రతిపత్తిని ఆనల్ చరిత్రకారులు ఆపాదించలేదు. ఇదేవిధంగా, వీరు రాశిపృథక్కరణ చరిత్రకు, నిరూప సంఖ్య పట్టికలకు ఎక్కువ ప్రాముఖ్యతను చూపుతారనేది, విమర్శకులు చేసిన మరో అభియోగం. కాని, ఈ రెండు విమర్శలు చెల్లనేరవు. ఎందుకంటే, ఆనల్

చరిత్రకారులు లెక్కపెట్టగల వాస్తవాలకు ప్రాముఖ్యతను చూపారు. వీరు ప్రవేశపెట్టిన గతి గమనాల్లో, " పూర్ణ చరిత్ర' స్వభావమనే చారిత్రక ప్రక్రియ, తప్పనిసరిగా మానవ దృక్పథాలను పొందుపర్చాల్సిన ఆవశ్యకతను వెల్లడించింది. ఈవిధంగా, మానవాతీతమైన శక్తులకు వీరు చారిత్రక రచనలో ముఖ్య స్థాయిని కల్పించినప్పటికీ, ఈ శక్తులను మానవ సమాజంలో పొందుపర్చిన శక్తులుగా భావించటమెంతైనా అవసరం. ఆనల్ చారిత్రక పరిశోధనలన్నీ, ఐరోపా, ఫ్రాన్స్ దేశాల మధ్య యుగ చరిత్రైన విప్లవం రావటానికి ముందు గల పరిస్థితుల అధ్యయనంలో నిమగ్నమై ఉండటం వల్ల, పందొమ్మిది, ఇరవై శతాబ్దాల పరిణామాల చిత్రీకరణలో, ఈ దృక్పథంతో గూడిన రచనలు అతి తక్కువని, ఆనల్ చరిత్ర పద్ధతిలో విమర్శనాంశంగా విమర్శకులు ఆపాదించారు.

చారిత్రక మార్పులను ఆనల్ చరిత్రకారులు నిర్ద్వంద్వంగా వదిలేశారనేది, ఆనల్ చారిత్రక రచనా పద్ధతిపై అభియోగించిన ముఖ్య విమర్శ. పెట్టుబడిదారీ పద్ధతి ఆవిర్భావాన్ని విశ్లేషించిన బ్రాండెల్ ముఖ్య గ్రంథాలు కూడా, మార్పును ప్రేరేపించినటువంటి పరిణామాలను స్పష్టంగా వర్ణించి, విశ్లేషించుట జరుగలేదు. దీనికి మూడు కారణాలున్నాయి. బ్రాండెలియన్ ప్రత్యయమైన దీర్ఘకాలిక పరిమితి (లాంగ్ డ్యూర్)తో, చారిత్రక మార్పును కన్పించనటువంటి అతిశిదముగా గుర్తించారు. ఇది ఆనల్ చరిత్ర రచనా విశ్లేషణా పద్ధతికే, చారిత్రక మార్పులేని స్థిరమైన గుణాన్ని ఆపాదించింది. రెండోది, పొందికతో ఒకే పద్ధతితో కన్పించే సామాజిక మార్పులోపించటం వల్ల, పరిణామంలో అర్థమైన రీతిలో విశ్లేషించటాన్ని ఆటంకపరుస్తూ వస్తుంది. మూడోది, నిర్మాణ వ్యవస్థల సంబంధమైన అంశాలపై ఎక్కువ నొక్కి చెప్పటం వల్ల, ఆనల్ చరిత్రకారులు ఒకే కాలంలో జరిగే దృక్పథాన్ని ప్రోత్సహిస్తున్నారు. అంటే, ఆనల్ చరిత్రకారులు ఒకే ప్రత్యేకమైన చారిత్రక స్థితికి, లేక ద్విగ్విషయానికి ప్రాముఖ్యతనిస్తూ, వీరు కొంత కాలానుసారంగా కన్పించే మార్పనే భావాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఉదాహరణకు, మార్క్సిస్టులు సృష్టించిన చట్టంలో ప్రధానాంశాలు అవస్థాంతరం పొందే విషయాలపై దృష్టిని కేంద్రీకరించారు.

మార్క్సిస్టులు రూపొందించిన మార్పు దృష్టిని ఆకర్షించాలని, చరిత్రకారులు పోటీపడుతున్నారు. కానీ, వీరు అవలంబించిన మూల దృక్పథాల్లోనే, చాలా వ్యత్యాసముంది. గతి గమనంలో మార్పు అన్న విషయాన్ని, ఆనల్ చరిత్రకారులు అంతగా పట్టించుకోలేదు. వర్గ పోరాటమనేటటువంటి అభిప్రాయానికై, వీరు ఎటువంటి ప్రసక్తిని చేయలేదు. కానీ, ఈ రెండు, మార్క్సిస్ట్ దృక్పథానికి ప్రధానాంశం. అయినప్పటికీ, ఈ రెండింటి చరిత్ర రచనా పద్ధతుల్లో పోలికలున్నాయి. మార్క్సిస్ట్ చరిత్రకారులు ఆధారం, ఉపనిర్మాణ (base, superstructure) నమూనాను తిరిగి పరిశీలించే తరుణంలో, సంస్కృతుల పరిణామ విచారణను కూడా సంకల్పించారు. ఆనల్ చరిత్రకారుల మానసికమైన అంశాలపై చూపిన ప్రాముఖ్యత కూడా, ఈ కోవకు చెందినదే. అదేవిధంగా, అదే భౌతిక అంశాలకు చూపిన ఆవశ్యకతతో, ఆనల్, మార్క్సిస్ట్ చరిత్రకారులను సమానంగా పరిగణించే అవకాశమేర్పడింది. అయినప్పటికీ, పూర్తి విశ్లేషణలలో, ఆనల్, రాజకీయ విముఖత చూపిన చారిత్రక రచనా దృక్పథాన్ని చేపట్టగా, మార్క్సిస్ట్ దృక్పథంలో వచ్చే మార్పు, ముఖ్యంగా రాజకీయపరమైన అంశాలపై దృష్టిని కేంద్రీకరించింది.

ఇప్పటివరకు ఆనల్ చరిత్ర విధాన పరిశీలనలో గుర్తింపవలసింది, ఆనల్ చారిత్రక విభాగాన్ని ఒకే సిద్ధాంతాన్ని, పద్ధతిని, అవలంబించి, గుర్తింప శక్యం కాదు. ఆనల్ పద్ధతి అనేక శిక్షణా విభాగాల మధ్య, అంతర్జాతీయంగా, స్థూలంగా, నూతన చారిత్రక రచనా సంప్రదాయానికి ఏర్పడింది. వీరి రచనల్లో మానవ సమాజంలో నున్న పరిణామాలన్నింటిని విచారణ చేయడం వల్ల, ఈ పరిణామం మధ్య గల పరస్పరానుబంధాలను స్పష్టం చేయడం వల్ల, ఆనల్ చరిత్రకారులు చరిత్ర ఉద్దేశాన్ని మరింత విస్తృత పర్చారు. బ్రాండెలియన్ భావమైన

BRAOU

మూల రకాలైన చరిత్ర కాలాలు, చారిత్రక ప్రపంచ (Historical World) మనే భావన, మానవాతీత అంశాలైన వాతావరణం మొదలైన వాటి పాత్రను మరింత ప్రబలం చేయటం, సంస్కృతుల ప్రాముఖ్యతను గుర్తించటమనే చారిత్రక ప్రక్రియలన్నీ, ఆనల్ చరిత్రకారులు చేసినటువంటి అంశ దానాలు. వీటి ప్రభావితంతో రూపొందిన నూతన చరిత్ర, ప్రపంచ చరిత్రకారుల రచనల్లో అద్భుతమైన ప్రభావాన్ని చూపిస్తూ చారిత్రక రచనా సంప్రదాయంలో వినూతనమైన స్థానాన్ని ఆనల్ చరిత్రకారులకు కల్పించింది.

## 19.5 సంగ్రహంగా

1920లో ఫ్రాన్స్ లో, ఆనాటి ప్రముఖుల్లో ఒకడైన రాంకె చారిత్రక విధానంపై ఫ్రాన్స్ చరిత్రకారులకు ఏర్పడ్డ అసంతృప్తి, ఆనల్ చారిత్రక రచనా పద్ధతి ఉద్భవించడానికి కారణమైంది. ఆధునిక చరిత్ర రచనా స్థాయిలో నూతన భావాలను, దృక్పథాలను, నిగూఢ ప్రశ్నలను నిష్కర్షగా రూపొందించుకోవాలనే ఉద్దేశంతో, ఆనల్ చరిత్రకారులు చరిత్రను " ఒక పూర్ణమైన గమనంలో " చూశారు. ఆనల్ చరిత్రకారుల్లో ముఖ్యులైన లూసియన్ ఫెవ్ర్, మార్క్ బ్లాక్, ఫెర్నాండ్ బ్రాండెల్‌లు, మానసిక చరిత్ర నుండి, సామాజిక నిర్మాణ వ్యవస్థపై నిల్చేవి నూతన చారిత్రక నిర్వికల్ప జ్ఞానానికి చేరుకోవాలని వక్కాణించారు. కానీ, ఆనల్ చరిత్రకారులు రాజకీయ చరిత్రను నిర్లక్ష్యం చేసి, చారిత్రక మార్పులను నిర్ద్వందంగా వదిలేశారు.

## 19.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఆనల్ చారిత్రక పద్ధతంటే ఏమిటి ? ఆనల్ చారిత్రక పద్ధతిలోని ముఖ్యాంశాలేవి ?
2. నవీన, లేక ఆధునిక చారిత్రక విధానాల్లో ఆనల్ పద్ధతికి గల స్థానం, ప్రాముఖ్యత, లోపాలను వివరించండి.

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ఆనల్ చరిత్ర రచనలో ప్రముఖుడైన ఫెర్నాండ్ బ్రాండెల్ గూర్చి సంక్షిప్తంగా రాయండి.
2. ఆనల్ చరిత్ర రచనా పద్ధతి ఉద్భవించడానికి గల కారణాలను తెల్పండి.

BRAOU

## 19.7 ఉపయుక్త గ్రంథాలు


1. Aymard, Maurice and Mukhia, Harbhans (eds) — **French Studies in History , 2 vols., vol. I The Inheritance, vol. II The Departers, New Delhi, 1989.**
2. Brandel, Fernand — **Our History**
3. Hunt, Lywn — **French History in the last twenty years: The Rise and Fall of the Annals Paradigm, Journal of Contemporary History, 21 (1986), PP. 209 - 224.**
4. Iggers, George. G. — **New Directions in European Historiography, London, 1985.**
5. Jha, Vishwamohan — **Undertaking Annals History, Social Scientist 203 (1990) PP. 53 - 60**
6. Nora, Pierrie and Legoff Jacques. — **Constructing the past**


రచయిత : డా.యస్. సుధీర్

# ఖండం : VI

# భారతీయ చరిత్ర రచనాభివృద్ధి : ఆధునిక యుగం

భారతదేశానికి ఐరోపావాసులైన పోర్చ్‌గీస్, డచ్, ఇంగ్లీష్ , ఫ్రెంచ్ వారి రాకతో, భారతీయ చరిత్ర రచనా సంప్రదాయంలో పెద్ద మార్పు వచ్చిందని చెప్పాలి. వీరిలో ముఖ్యంగా ఆంగ్లేయులు, తమకు ముందు ఈ దేశాన్ని పాలించిన ముస్లిం పాలకులవలె, దైనందిన ప్రభుత్వ పాలనా వ్యవహారాలకు సంబంధించిన పత్రాలేగాక, వాణిజ్య, రాజకీయ లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఇతర వలసలతో ఉత్తర ప్రత్యుత్తరాలను కూడా నిర్వహించేవారు. భారతదేశ ఆధునిక చరిత్ర పునర్నిర్మాణానికి ఈ పత్రాలన్నీ ప్రధానాధారమయ్యాయి. దీంతో, చరిత్ర రచనా విషయంలో, దృక్పథంలోను, పరిభాషలోను, రచనా వస్తువులోను మార్పు వచ్చింది. వీటికి తోడు, 18, 19 శతాబ్దాల్లో ఐరోపాలోని మేధావులను ప్రభావితం చేసిన సైద్ధాంతిక ధోరణుల దృష్ట్యా, భారతీయ చరిత్ర - సంస్కృతిని విశ్లేషించారు. ఈ విశ్లేషణలో విమర్శనాత్మక వైఖరి వుంది. సానుభూతి పూర్వక ధోరణి వుంది. క్రమేణా, మరిన్ని ఆలోచనా ధోరణులు భారతదేశ చరిత్ర రచనను ప్రభావితం చేశాయి.

పాశ్చాత్య విద్యా ప్రభావంలో, మొదట్లో ఆంగ్లేయుల అడుగుజాడల్లోనే చరిత్ర రచనకు పూనుకున్న భారతీయులు, బ్రిటీష్ యుగం నాటి భారతదేశ వాస్తవ చరిత్ర, ఈస్ట్ ఇండియా కంపెనీ, లేదా బ్రిటీష్ పాలకుల కార్యకలాపాల్లోగాక, భారతీయుల కార్యకలాపాల్లో ఉందనే విషయాన్ని, ఆ తర్వాత త్వరగానే గుర్తించారు. చరిత్రపట్ల తమవైన భావాలను పెంపొందించుకున్నారు. దీనికి అనుగుణంగానే, స్వాభావిక వైవిధ్యంతో కూడిన అనేక ఆలోచనా ధోరణులను తమ చరిత్ర రచనల్లో 19, 20 శతాబ్దాల్లో ప్రతిబింబించారు. ఈ విషయాలనే, ఈ ఖండంలోని 20, 21, 22, 23 భాగాల్లో వివరించడమైంది. 20వ భాగంలో భారతదేశంలో వలసవాద చరిత్ర రచనల గూర్చి చర్చించడమైంది. 21వ భాగంలో, జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధిని గూర్చి వివరించడమైంది. 22వ భాగంలో, భారతదేశ చరిత్ర రచనా మతతత్వ దృక్పథం గూర్చి, ఆ పై 23 వ భాగంలో, మార్క్సియవాద ప్రభావం భారతదేశ చరిత్ర రచనపై ఏవిధంగా ఉందో, చర్చిండమైంది.

BRAOU

# భాగం - 20 : వలసవాద భారతీయ చరిత్ర రచనాభివృద్ధి

20.0 లక్ష్యం

20.1 పరిచయం : చరిత్ర రచన - విషయనిష్ఠత

20.2 భారతదేశ చరిత్ర రచన - సైద్ధాంతిక ధోరణులు

20.3 సామ్రాజ్యవాద, వలసవాద ధోరణి

20.4 వలసవాద చరిత్ర రచనలో సానుభూతి పూర్వక వైఖరి : ప్రాచ్యవాదులు, భారత అధ్యయనాల నిపుణులు

20.4.1 సర్ విలియం జోన్స్

20.4.2 అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్

20.4.3 ఎల్ఫిన్‌స్టన్

20.5 ప్రయోజనవాది జేమ్స్ మిల్

20.6 భారతదేశంలో బ్రిటీష్ పాలన దైవదత్తమనే ధోరణి

20.7 పాశ్చాత్య, ప్రాచ్య శక్తుల కార్యవిధానం

20.7.1 వి.ఏ. స్మిత్

20.8 విషయపరత ధోరణి

20.9 భారతీయుల స్పందన

20.10 హేతువాద వర్గం

20.10.1 రాజేంద్రలాల్ మిత్రా

20.10.2 రమేష్‌చంద్ర దత్

20.10.3 ఆర్.జి. భండార్కర్

20.10.4 హెచ్.సి. రాయ్‌చౌదరి

20.11 తీవ్రవాద వర్గం

20.11.1 కె.పి. జయస్వాల్

20.12 యథాతథవాద వర్గం

20.12.1 జె.యన్. సర్కార్

BRAOU

20.12.2 ఎస్.ఎన్. సేన్

20.12.3 షఫాత్ అహ్మద్ ఖాన్

20.12.4 జి.ఎస్. సర్దేశాయ్

20.12.5 యస్. కె. అయ్యంగార్

20.13 ఇతర ధోరణులు

20.14 సంగ్రహంగా

20.15 పరీక్ష నమూనా ప్రశ్నలు

20.16 ఉపయుక్త గ్రంథాలు

## 20.0 లక్ష్యాలు

- ఈ భాగాధ్యయనం వల్ల మీరు
- వలసవాద యుగంలో భారత చరిత్ర రచనాభివృద్ధిని విశ్లేషించగలగాలి.
- వలసవాద యుగంలో చరిత్ర రచనాభివృద్ధిలో, బ్రిటీష్ పండితుల, చరిత్రకారుల చింతనా ధోరణులను, విశ్లేషించగలగాలి.
- వలసవాద బ్రిటీష్ చరిత్రకారుల ధోరణికి, భారత చరిత్రకారుల ప్రతిస్పందన ఎట్టిదో, సమకాలీన పరిస్థితులను ప్రతిబింబిస్తూ వారి చరిత్ర రచన ఎలా సాగిందో, వివరించగలగాలి.

BRAOU

## 20.1 పరిచయం

సత్యమైనదానికి, వాస్తవికమైన దానికి ప్రతీక, విషయనిష్ఠత. వ్యక్తిగత పక్షపాతానికి, దురభిమానానికి, భావుకతకు దూరంగా ఉండే స్థితి ఇది. చరిత్రకారుడు గత సంఘటనలను చిత్రించేటప్పుడు ఉద్వేగరహితంగా, నిష్పాక్షికంగా, శాస్త్రీయంగా ఆ సంఘటలన్నిటి పట్ల వ్యవహరించే తీరు, విషయనిష్ఠత, చరిత్ర విషయగతంగా ఉంటేనే, దాని వాస్తవిక విలువను అర్థం చేసుకోడానికి వీలౌతుంది. చరిత్రలో యదార్థాలు పూర్తిగా వస్తుపరంగా (విషయగతంగా) ఉండే అవకాశాలు లేవు. వాటికి చరిత్రకారుడిచ్చే ప్రాధాన్యతను బట్టి, అవి చారిత్రక యదార్థాలుగా మారతాయి. చరిత్రలో విషయనిష్ఠత ఈ యదార్థాలకే పరిమితం కాదు. ఇది యదార్థాలకు, వ్యాఖ్యానానికి మధ్య - అంటే గతానికి, యదార్థాలకు, వ్యాఖ్యానానికి మధ్య ఉన్న సంబంధానికి సంబంధించింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చరిత్రకారుడు, గతాన్ని వర్తమాన పరిధిలో క్రమబద్ధంగా పరిశీలించి వ్యాఖ్యానిస్తాడు. ఇది అతని బాధ్యత. కాలం గడిచేకొద్దీ గతాన్ని గూర్చిన అతని వ్యాఖ్యానం, లక్ష్య శుద్ధి మారుతూ, ప్రగతిశీలంగా పరిణామం చెందుతూ ఉంటాయి. భవిష్యదావిర్భూతి గూర్చి చరిత్రకారుడు తనకు ఉన్న భావన ద్వారా, గతాన్ని విలువ కడతాడు. కనకనే, కార్ చరిత్రను 'గతకాలపు సంఘటనలకు, క్రమ క్రమేణా రూపొందే భవిష్యత్ లక్ష్యాలకు మధ్య జరిగే సంభాషణ కూడా' అని పేర్కొన్నాడు. అయితే, సమాజంలో, చరిత్రలో తమ స్వీయ స్థితి పరిమితులను అధిగమించి ఏ విషయాన్నైనా చూడగల సామర్థ్యం, గతం గురించి బుద్ధి సూక్ష్మతతో మరింత శాశ్వతమైన అంతర్దృష్టిని ప్రసాదించేలా, భవిష్యత్‌లోకి తమ దృష్టిని సారించే సామర్థ్యం, ఎంత మంది చరిత్రకారులకు ఉంటుంది ?

చరిత్రకారుడు చరిత్రలో తన పూర్వీకుల గూర్చి అధ్యయనం చేస్తున్నాడు. పూర్వీకుల చర్యల వెనక ఆలోచనలేమిటోనని ఆలోచించే అతడు, తన సమకాలిక దృక్కోణం నుండే, తన వ్యక్తిగత అభిరుచులు, ఇష్టాయిష్టాలను ప్రతిబింబించేలా సంఘటనలను వీక్షిస్తాడు. గత సంఘటనల అస్తిత్వం అతని ఆలోచన మీద ఆధారపడి ఉంది. అంటే, అతని పరిశీలనాంశంపై అతని వ్యక్తిత్వం, పరోక్షంగానైనా ప్రతిఫలిస్తుంది. ఈ విషయాన్నే స్పష్టీకరిస్తూ జి.ఎం. ట్రెవెల్యన్, ఎవరైనా రచన చేస్తున్నప్పుడు ఆ రచయిత నైజం, వివేకం, వర్గ చైతన్యాలతో సహా పూర్తి వ్యక్తిత్వంతో అతని ఉనికి, ఆ రచనలో వుంటుందని పేర్కొన్నాడు. అంటే, తన మనస్సులోనే గతాన్ని పునరుజ్జీవింపజేసే చరిత్రకారుడు అలా చేసేటప్పుడు, గత సంఘటనలపై తన భావాలను కొంతవరకైనా అధ్యారోపితం చేస్తాడు. ఇది ఒక ప్రేరక ప్రక్రియ. ఆత్మాశ్రయతకు దారితీసే ఈ ప్రేరేపణకు అనేక కారణాలు ఉండొచ్చు. అవి సైద్ధాంతిక పరిశీలనలు కావచ్చు. లేదా, రాజకీయ నిబద్ధత కావచ్చు. లేదా, వర్గ దురభిమానం - ఇలా ఏదైనా కావచ్చు. ఆధునిక భారతదేశంలో చరిత్ర రచనా విధానంలో ఇటువంటి ధోరణులే ద్యోతకమౌతున్నాయి. చరిత్రకారులందరూ ఎవరికీ వారే తమను తాము శ్రీరామచంద్రులని భావించుకొనేవారే.

## 20.2 భారత చరిత్ర రచన - సైద్ధాంతిక ధోరణులు

చరిత్ర రచనలో చరిత్రకారుణ్ణి ఎక్కువగా ప్రభావితం చేస్తున్నది సైద్ధాంతిక పరిశీలన. దీనికి మూలం, ఒక ప్రత్యేక ఆలోచనా మార్గంలో గట్టి నమ్మకం. అది మత ధర్మ సంబంధమైంది కావచ్చు, లేదా భౌతికవాద సంబంధమైంది కావచ్చు, లేదా మరే ఇతర బుద్ధి సూక్ష్మతకు, అంటే మేధస్సుకు సంబంధించిందైనా కావచ్చు. ఆధునిక యుగంలో భారతదేశ చరిత్ర రచనలో, అటువంటి సైద్ధాంతిక ధోరణులు ప్రధానంగా నాలుగు కన్పిస్తున్నాయి: (i) సామ్రాజ్యవాద, వలసవాద ధోరణి (ii) జాతీయవాద ధోరణి (iii) మతతత్వ వైఖరి (iv) మార్క్సిస్ట్ ధోరణి.

## 20.3 సామ్రాజ్యవాద , వలసవాద ధోరణి

BRAOU

మనదేశ చరిత్రపై వలసవాదం, జాతీయవాదం ప్రాబల్యం వహించాయి. ఈ రెండు అసాధారణ అంశాల దృష్ట్యానే, అనేక విషయాలపై ఎక్కువ ప్రయోజనకరమైన అధ్యయనాలు జరిగాయి. ఇంచుమించు గత రెండు శతాబ్దాలుగా జరిగిన చరిత్ర రచనలన్నింటా, వలసవాద చరిత్ర రచనా సంప్రదాయమే ప్రాముఖ్యం వహించి[illegible]. ఈ రచనలు బ్రిటీష్ వారు చేసినవైనా, లేదా ఎక్కువ భాగం భారతీయులు చేసినవే అయినా, పెద్ద తేడా [illegible]దు.

భారతదేశం గూర్చి 1757-1947 మధ్య కాలానికి సంబంధించి లభించినంత చరిత్ర ముడి[illegible]కు, లేదా సామాగ్రి, మరే కాలానికీ, దేశానికీ కూడా లభ్యమై ఉండదు. తన అధికార పీఠానికి వేలాది మైళ్ల ద[illegible] ప్రాంతంలో, ఒక లండన్ వాణిజ్య సంస్థ (ఈస్ట్ ఇండియా కంపెనీ) విశాల భూభాగంపై తన రాజకీయాధిపత్[illegible]లకొల్పుకుందనే వాస్తవమే, మొత్తం కాగితాల మీద నడిచే ఒక రకం ప్రభుత్వ ఆవశ్యకతను సూచిస్తున్[illegible] ప్రభుత్వం గూర్చి, ప్రభుత్వ విధానాల గూర్చి, విధాన నిర్ణేతల గూర్చి, ఇతరరేతర కార్యకలాపాల గూర్చి [illegible]త్తం జాబులు, తదితర కాగితాల దొంతులు, ఇండియా ఆఫీస్ లైబ్రరీలో నిక్షిప్తమయ్యాయి. ఈస్ట్ ఇండి[illegible]ా కంపెనీ ముందుగా తన మనుగడ కోసం, తర్వాత తన ఆధిపత్యానికి, విస్తరణకు సాగించిన నిరంతర పోరాటం, అనంతరం 1858లో భారతదేశ పాలనకు బ్రిటీష్ ప్రభుత్వం పూర్తి అధికారాన్ని చేపట్టడంతో, తమ స్వార్థ ప్రయోజనాలకోసం, ప్రపంచ ఆధిపత్యం కోసం, సామ్రాజ్యవాదుల చేతుల్లో ఈ దేశం ఏవిధంగా ఒక పావుగా మారిందో, విశేషాలు ఈ ఆధారాల్లో లభిస్తున్నాయి. ఈ దేశంలోని వనరులను ఏవిధంగా బ్రిటీష్ వారు దోచుకుందీ, కళలను, వృత్తులను, సామాజిక సమతుల్యాన్ని ఎలా దెబ్బతీసిందనే సమాచారం, ఈ లండన్ లైబ్రరీ నుండి గ్రహించొచ్చు.

బ్రిటన్‌లోని సామ్రాజ్యవాద వ్యతిరేకులతో వివాద సమయంలో, కొంతమంది బ్రిటీష్‌వారే అంగీకరించినట్లు ఈ దేశం తమ విదేశీ వాణిజ్య విస్తరణలో ఉత్పత్తిదారులకు ఒక ప్రధానమైన మార్కెట్‌గా, ముడిసరుకులు మెండుగా లభించే ప్రాంతంగా, పెట్టుబడులకు ప్రధాన రంగస్థలిగా, మధ్యతరగతి బ్రిటీష్ యువతరానికి ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చే ఉపాధి కేంద్రంగా, బ్రిటీష్ నౌకలకు పూర్తి పని కల్పించేదిగా, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు భారతీయ సైన్యాన్ని ఉపయోగించుకోడానికి, ఇలా అనేక విషయాల్లో భారతదేశం బ్రిటీష్ వారి ప్రధాన వలస కేంద్రంగా భాసిల్లింది. ఇతర వలసల మాదిరిగా కాక, ఇక్కడి ఈ ప్రయోజనాలు బ్రిటన్ ఏ ఖర్చూ లేకుండా పొందినవే. బ్రిటీష్ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రగతిలో, భారతదేశం నిరుపమాన వలసరాజ్యంగా కీలక పాత్ర వహించింది. తద్వారా, 19వ శతాబ్దంలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో పూర్తిగా అంతర్భాగమైంది.

సామ్రాజ్యవాద, వలసవాద చరిత్ర రచనా విధానం, పెట్టుబడిదారీ వ్యవస్థ భావజాలంపై నిర్మితమైంది. ఇంతకు ముందే చెప్పినట్లు, ఇది బ్రిటీష్ రచయితలు మాత్రమే అనుసరించింది కాదు. ఈ రచనా సంప్రదాయం భారతీయ చరిత్రకారుల రచనల మీద లోతైన ప్రభావాన్నే చూపింది. కొన్ని సందర్భాల్లో అయితే, రాజకీయాల్లో తమను తాము సామ్రాజ్యవాద వ్యతిరేకులుగా భావించుకున్న భారతీయ చరిత్రకారులపై కూడా, ఈ ప్రభావం కన్పించింది. వేసిన ప్రశ్నల గూర్చి కావచ్చు, విశ్లేషణకు మూలమైన చట్రం గూర్చి కావచ్చు - ఉదాహరణకు, భారతీయ ఆధ్యాత్మికత విషయమే తీసుకోండి. భారతీయ ఆధ్యాత్మిక చింతనా గొప్పతనాన్ని ఎప్పుడూ ఉద్ఘాటించే వాళ్లు, నిజానికి సామ్రాజ్యవాద చారిత్రక దృక్పథాన్నే అనుసరిస్తున్నారు. 19వ శతాబ్దం ప్రారంభంలో, భారతీయ సమాజం మొత్తం దాని సైద్ధాంతిక చట్రంతో సహా వెనుకబడి వుందని, నాగరిక ఛాయలు అంతంత మాత్రమని, కనుక, దీన్ని ఆధునీకరించడానికి వలసవాదం అవసరమని బ్రిటీష్ చరిత్రకారులు భావించారు. అయితే, ఆ శతాబ్దం చివరికి వచ్చే సరికి, ఈ రకమైన ధోరణిని వలసవాదులు వదిలేసారు. 'తాత్విక, ఆధ్యాత్మిక రంగంలో భారతీయ ప్రజలు చాలా గొప్పవారే కాని. . . ఆర్థిక, రాజకీయ రంగాన్ని నిర్వహించడం మనకు వదిలేయక తప్పదనే, వైఖరిని ప్రదర్శించారు. అందుచేతనే, భారతీయ చరిత్ర - సంస్కృతీ విశ్లేషణలో, సామ్రాజ్యవాద, వలసవాద చరిత్ర రచనల్లో విమర్శనాత్మక వైఖరి, సానుభూతి పూర్వక ధోరణి వున్నాయని చెప్పుకున్నాం.

BRAOU

## 20.4 వలసవాద చరిత్ర రచనల్లో సానుభూతిపూర్వక వైఖరి : ప్రాచ్యవాదులు : భారత అధ్యయనాల నిపుణులు

భారతదేశంలో (బ్రిటీష్ యుగంలో) చరిత్ర రూపొందుతున్నప్పుడే, అంటే చారిత్రక సంఘటనలు చోటు చేసుకుంటున్నప్పుడే, చరిత్ర రచనా ప్రక్రియ జరిగింది. ఈ దేశం వచ్చిన సైనిక వీరులు, పరిపాలనా నిర్వాహకులు, వర్తకులు కూడా, చరిత్రపట్ల నిర్దిష్టమైన అభిప్రాయాలతో ఉన్నారు. రాజకీయంగా ఉపదేశాత్మక స్వభావం ఉన్న రచనలను ప్రచురించడం ద్వారా, వీరు విధాన నిర్ణేతలను ప్రభావితం చేయ ప్రయత్నించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, హాలెండ్‌ల్లో మితవాద, ఉదారవాద వర్గాలు ఆవిర్భవించాయి. వలసలపై రాజకీయాధికారాన్ని ఐరోపావాసులే నిలబెట్టుకోవాలనే విషయంలో, ఈ రెండు వర్గాలదీ ఏకాభిప్రాయమే. కాని వలస వ్యవస్థలో, పాలనావిధాన విషయంలో, ఈ వర్గాలు విభేదించాయి. కాలక్రమేణా, ఇతర చింతనా ధోరణులూ తలెత్తాయి.

### 20.4.1 సర్ విలియం జోన్స్

బ్రిటీష్ వారి భారతీయ చరిత్ర రచనా సంప్రదాయం 18వ శతాబ్దంలో ప్రారంభమైంది. మొదట వీరి దృష్టి ప్రాచీన యుగ చరిత్ర విమర్శనాత్మక అధ్యయనం, పునర్నిర్మాణాలపై కేంద్రీకృతమైంది. ప్రాచ్యవాదులు, లేదా

ఇండాలజిస్ట్‌లు భారతదేశ గత చరిత్ర - సంస్కృతి గూర్చి విశ్లేషణ నారంభించారు. దీనికి ఒక ప్రధాన కారణం, ఈ దేశంలో రాజ్యాధికారాన్ని స్థాపించిన ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగులకు భారతీయ న్యాయ స్మృతులు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, అలవాట్ల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడటమే. పర్యవసానంగా, సర్ విలియం జోన్స్ ( 1746 - 94) , అలెగ్జాండర్ కన్నింగ్ హేమ్ ( 1844-93), విల్కిన్స్ మన్రో, మాల్కోలం, ఎల్ఫిన్‌స్టన్ మొదలైన ప్రాచ్యవాదులు భారతదేశాన్ని గూర్చి అధ్యయనాన్ని ఆరంభించారు. వీరిలో, మొదట పేర్కొన్న జోన్స్, కలకత్తా సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి. 1784లో ' ది ఏసియాటిక్ సొసైటి ఆఫ్ బెంగాల్ (The Asiatic Society of Bengal ) అనే సంఘాన్ని స్థాపించి, అధ్యక్షునిగా సర్ విలియం జోన్స్ దాన్ని ఒక పరిశోధనా కేంద్రంగా అభివృద్ధి చేశాడు. ' ఏసియాటిక్ రిసర్చెస్ ' (Asiatic Researches) అనే పేరుతో, ఈ సొసైటీ ద్వారా ఒక జర్నల్ కూడా వెలువడింది. దీనిలో, భారతీయ చరిత్ర, సంస్కృతులను గూర్చిన అనేక పరిశోధనా వ్యాసాలు చోటు చేసుకున్నాయి. అనేక భారతీయ గ్రంథాలు ఆంగ్లంలోకి అనువాదాన్ని పొందాయి. కాళిదాసు ' శకుంతలం' , జయదేవుని ' గీతగోవిందం ' , ' మను సంహిత ' లను జోన్సే అనువదించాడు. జోన్స్ లాగానే 'ఏసియాటిక్ సొసైటీ' (Asiatic Society) లో, ఛార్లెస్ విల్కిన్స్ ( భగవద్గీత, హితోపదేశ గ్రంథాలను ఆంగ్లంలోకి అనువదించాడు), హెచ్.టి. కోల్‌బ్రూక్, జాన్ షోర్, ఫ్రాన్సిస్ గ్లాడ్‌విన్ మొదలైన ప్రముఖులు కూడా , ప్రధాన పాత్ర వహించారు.

### 20.4.2 అలెగ్జాండర్ కన్నింగ్‌హేమ్

అలెగ్జాండర్ కన్నింగ్‌హేమ్ వృత్తి రీత్యా ఇంజనీర్. భారతీయ పురావస్తు శాస్త్ర పితగా ప్రసిద్ధుడైన కన్నింగ్ హేమ్ 1862లో పురావస్తు శాఖ డైరెక్టర్‌గా నియమితుడై, దేశంలోని వివిధ ప్రాంతాలను పర్యటించి, ముఖ్యమైన చారిత్రక విశేషాలను వార్షిక నివేదికల రూపంలో ప్రచురించాడు. అనేక పరిశోధనా పత్రాలతో బాటు, భిల్సా టోప్స్(Bhilsa Topes) , ' ఏన్షియెంట్ జాగ్రఫి ఆఫ్ ఇండియా ' (Ancient Geography of India), ' ది స్తూపా ఆఫ్ బార్హుత్' (The Sthupa of Barhut) , ' ది బుక్ ఆఫ్ ఇండియన్ ఈరాస్ ' (The Book of Indian Eras) , ' మహాబోధి ' (Mahabodhi) వంటి ముఖ్యమైన గ్రంథాలనూ వెలువరించాడు. సర్ విలియం జోన్స్ ప్రాచీన సాహిత్యాధ్యయనం ద్వారా, ప్రాచీన భారతీయ చరిత్ర, సంస్కృతీ అధ్యయనానికి మార్గదర్శి కాగా, కన్నింగ్‌హేమ్ పురావస్తు పరిశోధన, నాణేల పరిశీలన ద్వారా, ప్రాచీన భారతీయ సంస్కృతీ అవగాహనకు మార్గదర్శయ్యాడు.

### 20.4.3 ఎల్ఫిన్‌స్టన్

మౌంట్ స్టూవర్ట్ ఎల్ఫిన్‌స్టన్ ఆధునిక చరిత్రకారుల్లో టాసిటస్‌గా పేరు పొందాడు. 16వ ఏట భారతదేశం వచ్చి, ఈస్ట్ ఇండియా కంపెనీలో లేఖకునిగా చేరాడు. అనేక హోదాల్లో కంపెనీని సేవించి, బొంబాయ్ గవర్నర్ స్థానానికి ఎదిగాడు. ఎనిమిది సంవత్సరాల అనంతరం, ఉద్యోగ విరమణ చేశాడు. 1839లో అతని మొదటి ప్రధాన చరిత్ర గ్రంథం ' హిస్టరీ ఆఫ్ ఇండియా ' (History of India) వెలువడింది. దీనిలో, ప్రాచీన, మధ్య యుగాల చారిత్రక విషయ వివరణకు ప్రాధాన్యమిచ్చాడు. ఆధునిక చరిత్ర రచనా సంప్రదాయంతో సుపరిచితుడైన ఎల్ఫిన్‌స్టన్, ప్రాచీన భారత దేశ చరిత్రను రాస్తున్నప్పుడు, కట్టుకథలకు చోటు లేకుండా చేశాడు. ప్రాచీన భారత చరిత్రను ఋగ్వేద సంకలనంతో ఆరంభించి, కాలక్రమంలో వివరింప ప్రయత్నించాడు. పురాణాల్లో లభించిన జాబితాల సహాయంతో, మహాభారత యుద్ధ కాలం నుండి క్రీ.శ. 4వ శతాబ్దిలో గుప్తుల వరకు రాజవంశాల కాల నిర్ణయానికి ప్రయత్నించాడు. ఎల్ఫిన్‌స్టన్ ప్రాచీన భారతదేశ రాజకీయ చరిత్రకు ప్రాధాన్యత నివ్వలేదు. ప్రధానంగా, హిందువుల సాంస్కృతిక ఘనత మీద దృష్టిని కేంద్రీకరించాడు. జావా,

BRAOU

బాలి, తదితర ద్వీపాలతో జరిగిన భారత విదేశీ వాణిజ్యం అతని దృష్టిని ఆకర్షించిన మరో విశేషం. లభించిన చారిత్రక ఆధారాలను పూర్తిగా సద్వినియోగపర్చుకొని, ఎల్ఫిన్‌స్టన్ ప్రాచీన భారతదేశ సాంస్కృతిక చరిత్రకు పునాది వేశాడు.

పైన పేర్కొన్న సర్ విలియం జోన్స్, కన్నింగ్‌హేమ్, విల్కిన్స్, మన్రో, ఎల్ఫిన్‌స్టన్ తదితరులంతా, భారతీయ సమాజం పట్ల సానుకూల వైఖరిని ప్రదర్శించిన వారే. భారతీయ సంస్థల పట్ల సానుభూతిపూర్వక అవగాహనతో రాజకీయ పరిస్థితుల్ని, భారతీయ సమాజ స్వభావాన్నీ వీరు చిత్రించ ప్రయత్నించారు. ఈ ప్రాచ్య వాదులు భారతీయ సంస్కృతిపై మక్కువను పెంచుకోడంతోబాటు, అనాదిగా అవిచ్ఛిన్నంగా సాగుతున్న భారతీయ సంస్కృతిని ఒక ఆదర్శ పూర్వకమైందిగా భావించి పొగిడారు. 19వ శతాబ్దపు సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో, ఆర్య సామాజికులు ప్రాచ్యవాదుల పై విశ్లేషణను భారతీయులను జాగృతం చేయడానికి వాడుకొన్నారు.

అయితే, ప్రాచ్యవాదులు చరిత్ర ఆధారాలను సమకాలీన చారిత్రక పద్ధతిలో విశ్లేషించడానికి పూనుకోలేదు. ప్రాచీన భారతీయ వాఙ్మయంలో ఉన్నట్లు, సమాజం ఆనాడు ఉందా ? లేదా ? అనే ఆలోచన, ప్రశ్నలు వారికి తలెత్తలేదు. ఆ వాఙ్మయాన్ని వారు సంపూర్ణంగా విశ్వసించడమొక కారణమైతే, ఈ విషయాన్ని మరి కొంత లోతుగా పరిశీలించాలి. ప్రాచీన భారత సమాజాన్ని ఘనంగా కీర్తించేలా, ప్రాచ్యవాదుల్ని ,లేదా ప్రాచ్య సిద్ధాంత వేత్తలను, భారత అధ్యయనాల నిపుణులను (Indologists) ప్రేరేపించిన ఉద్దేశాలను, ఆకాంక్షలను, వీరి ఆలోచనా ధోరణిని, ఆ తర్వాత ఆశ్రయించిన భారత చరిత్రకారులు విస్మరించారనే చెప్పాలి. ఆవిధంగా పురికొల్పిన ఉద్దేశాల్లో, స్పష్టంగా కన్పించే విషయం ఒకటి ఉంది. ప్రాచ్యవాదుల్లో ఎక్కువమంది తమ స్వీయ సమాజం నుండి వేరుపడ్డవారు. ప్రధానంగా పారిశ్రామికీకరణ వల్ల, ఐరోపాలో వస్తున్న మార్పులను జీర్ణించుకోలేని స్థితిలో వారు, ఊహా స్వర్గాల కోసం మరెక్కడో వెదకడ మారంభించారు. ఆవిధంగా , వారిలో చాలా మందికి ప్రాచ్య ప్రపంచంలోని భారతీయ సంస్కృతి వంటి ప్రాచీన సంస్కృతుల్లో, అటువంటి ఊహా స్వర్గ సమాజాలు కన్పించాయి. దీనికి తోడు, ప్రాచ్యవాదులు జేమ్స్ మిల్ వంటి ప్రయోజనవాదులతో చేస్తున్న పోరాటంలో ఓటమి చెందుతూ వచ్చారు. అయితే, ప్రాచ్యవాదులు భారతదేశ గత పునర్దర్శనకు కారకులయ్యారు. ఆవిధంగా, వారు గతంపై జాతీయవాద ఆసక్తికి పునాది నేర్పర్చారు. అదే సమయంలో, భారతీయ సంస్కృతిని సమర్థించడంలో, గతం పట్ల అవిమర్శక వైఖరిని అవలంబించేవారికి విస్తృత సమాచారాన్నందించారు.

BRAOU

## 20.5 ప్రయోజనవాది జేమ్స్ మిల్

19వ శతాబ్దంలో, బ్రిటీష్ తత్వవేత్తల బృందం కూడా బలంగా ఉండేది. బ్రిటీష్ పరిపాలన, బ్రిటీష్ శాసన వ్యవస్థ భారతదేశం వెనుకబాటుతనాన్ని అంతం చేస్తాయి గనుక, భారతదేశానికి బ్రిటీష్ వారి రాక దైవదత్తం లాంటిదని వారు గట్టిగా నమ్మారు. బ్రిటీష్ పరిపాలన ఇక్కడి నియంతలను తొలగించి, భారత ప్రజలకు రాజకీయ స్పృహను కలిగిస్తుందని విశ్వసించారు. భారతీయుల చారిత్రక చింతనను ప్రభావితం చేసిన ప్రయోజన వాదుల్లో ముఖ్యుడు, జేమ్స్ స్టువర్ట్ మిల్ (1773-1836) . భారతదేశం గూర్చి రాయడానికి ముందే, మిల్ బహుళంగా రచనలను చేశాడు. రాజకీయార్థిక వ్యవస్థపై నిర్దిష్టమైన అభిప్రాయాలను ఏర్పర్చుకున్నాడు. ఆధునిక భారతదేశాన్ని గూర్చి మొదటి చరిత్ర గ్రంథం ' హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా ' (History of British India)ను, 1818 నాటికి పూర్తి చేశాడు. ఈ గ్రంథం వెలువడ్డ తర్వాత, మెకాలే దీన్ని ' గిబ్బన్ రచన వెలువడ్డాక ఆంగ్ల భాషలో ప్రచురింపబడ్డ చాలా గొప్ప చరిత్ర రచన ' అని కీర్తించాడు. మిల్ గ్రంథం భారత చరిత్రపై ప్రామాణిక రచనగా గుర్తింపు పొందింది. అనేక భారతీయ విశ్వవిద్యాలయాల్లో శతాబ్దంపైగా, పాఠ్య గ్రంథంగా కొనసాగింది.

జేమ్స్ మిల్ తన గ్రంథంలో తొలి నుండి 18వ శతాబ్ది చివరి వరకు భారత చరిత్రను ఉల్లేఖించాడు. ఈ గ్రంథంలోని అత్యంత ప్రాముఖ్యం వహించిన విషయం ఏమిటంటే, ఇది ఒక రకంగా, భారతదేశ చరిత్ర రచనలో మతతత్త్వ వైఖరికి గట్టి పునాది వేసింది. తద్వారా, ద్విజాతి సిద్ధాంతానికి చరిత్రపూర్వకమైన సమర్థనను సంతరించిపెట్టింది. భారతదేశ చరిత్రను హిందూ నాగరికత, ముస్లిం నాగరికత, బ్రిటీష్ నాగరికత (క్రిస్టియన్ నాగరికత కాకపోవడం విచిత్రమే) అని మూడు దశలుగా విభజించే సిద్ధాంతాన్ని మొదటిసారిగా, అతడే రూపొందించాడు. ప్రయోజనవాదుల ఆలోచనా ధోరణి బౌద్ధిక, రాజకీయ నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మిల్ ఈ పథకాన్ని అనాలోచితంగా వాడాడంటే అర్థం చేసుకోవచ్చు. కాని, ఆశ్చర్యకర విషయం - ఈ దశల విభజన పద్ధతిని ఆ తర్వాత వచ్చిన చరిత్రకారులు ఆమోదించడం. ఈ పద్ధతి ఔచిత్యం విషయమై తీవ్రంగా విశ్లేషించడానికి, ఇటీవలి వరకు ప్రయత్నం కూడా జరగలేదు. మిల్ గ్రంథంలో, ఊహలను ఈనాటికీ కొందరు ఆమోదించడం విచిత్రం. కొంతమంది చరిత్రకారులు భారతదేశ చరిత్ర దశల విభజనలో, ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలని పదాలైతే వాడుతున్నారు. కానీ, మిల్ రూపొందించిన దశల విభజన ప్రాతిపదిక - ప్రధాన పాలక వంశాల మతాల్లోని మార్పు - ఇప్పటికీ సజీవంగా ఉంది.

మిల్ గ్రంథంలోని మరో విషయం ఏమిటంటే, అతడు హిందూ సంస్కృతిని తీవ్రంగా దుయ్యబట్టాడు. అది వెనకబడ్డ సంస్కృతనీ, ప్రగతికి శత్రువనీ, హేతు వ్యతిరేకమనీ అభివర్ణించాడు. 'ముస్లిం నాగరికత' పట్ల సానుభూతి చూపినా, దాన్ని కూడా కొన్ని చోట్ల ఖండించాడు. ఈ కారణంగానే, ప్రాచ్యవాదులు కొందరు, ఆ తర్వాత భారత చరిత్రకారులు 'హిందూ సంస్కృతి'ని సమర్థించారు. ప్రాచీన భారతీయ సంస్కృతిని శృతిమించి ప్రశంసించే దాకా కూడా వెళ్ళారు. మిల్ బ్రిటీష్ యుగం విషయంలో కూడా, ఉదారులైన వారన్ హేస్టింగ్స్ లాంటి బ్రిటీష్ పాలకుల పట్ల తీవ్ర వైఖరిని ప్రదర్శించాడు. ఇవన్నీ యదార్థాల విషయంలో మిల్ అజ్ఞానాన్ని, సమాచార రాహిత్యాన్ని తెలియజెప్పటమే కాకుండా, అతని జాతి దురభిమానాన్ని కూడా విశదం చేస్తున్నాయి.

## 20.6 భారతదేశంలో బ్రిటీష్ పాలన దైవదత్తమనే ధోరణి

భారతదేశంలో బ్రిటీష్ పాలనను సమర్థించ ప్రయత్నించిన వారిలో, మతాచార్యులైన షోర్, గ్రాంట్ మొదలైనవారున్నారు. ఒక పనికిమాలిన జాతిని విముక్తం చేయడానికి, బ్రిటీష్ పరిపాలనను, ఇక్కడ ఆ భగవంతుడే ముందుగా నిర్దేశించాడని వారి భావన. క్రైస్తవ సంఘాలు కూడా వారికి మద్దతును తెలిపాయి. వీరందరూ, భారత సమాజాన్ని మతం మార్పిడి ద్వారా, విద్య ద్వారా మార్చాలని ప్రయత్నించారు.

## 20.7 పాశ్చాత్య, ప్రాచ్య శక్తులపై పరస్పర కార్యవిధానం

తాత్విక చరిత్రకారులైన ఆల్‌ఫ్రెడ్ ల్యాల్, హెన్రీ మైన్, స్టీఫెన్, విలియం, హంటర్ మొదలైన వర్గం మరొకటుంది. వీరి దృక్పథం వేరు. భారతదేశంలో బ్రిటీష్ పాలన ప్రాచ్య, పాశ్చాత్య శక్తుల పరస్పర కార్యవిధాన ఫలితమనే దృష్టి వీరిది. భారతీయ సంస్థలు, సమాజం గూర్చి అధ్యయనం చేయడంలో, వీరు చాలా ఆసక్తిని కనబర్చారు. వీరిలో హంటర్, బ్రిటీష్ సివిల్ సర్వెంట్‌గా సామ్రాజ్యవాదానికే కొమ్ముకాసినా, భారతీయుల్ని ఆంగ్లేయుల హృదయాలకు మరింత చేరువయ్యేలా చరిత్ర రచనకు పూనుకొన్నాడు. 'ఎ కంపారిటివ్ డైరెక్టరీ ఆఫ్ ది నాన్ ఆర్యన్ లాంగ్వేజెస్ ఇన్ ఇండియా అండ్ హై ఏసియా' (A Comparative Directory of the Non-Aryan Languages in India and High Asia) 'ది ఆనల్స్ ఆఫ్ రూరల్ బెంగాల్' (The Annals of Rural Bengal), 'ది ఇంపీరియల్ గజెటీర్ ఆఫ్ ఇండియా' (The Imperial Gazetteer of India) (14 సంపుటాలు), హంటర్ రచనల్లో ముఖ్యమైనవి. 28 సంపుటాల్లో వెలువడ్డ 'ది రూలర్స్ ఆఫ్ ఇండియా సిరీస్' (The Rulers of India Series) కు, ఈయనే సంపాదకుడు.

BRAOU

### 20.7.1 వి.ఏ.స్మిత్

జేమ్స్ మిల్ అనంతరం, భారతీయ చరిత్ర రచనా సంప్రదాయాన్ని ప్రభావితం చేసిన మరో బ్రిటీష్ ఉద్యోగి, విన్సెంట్ ఆర్థర్ స్మిత్ (1843-1920). స్మిత్ కాలానికి వాఙ్మయాధారాలతో బాటు, చారిత్రక అవశేషాల పరిశోధన కూడా సాగింది. ముఖ్యంగా, జేమ్స్ ప్రిన్సెప్ 1837లో బ్రాహ్మీ లిపిని పరిష్కరించడంతో, చరిత్ర పునర్నిర్మాణంలో శాసనాధారాలు ముఖ్య పాత్ర వహించసాగాయి. దీనికి తోడు, బూలర్, కీల్‌హోర్న్, ఫ్లీట్‌ల పరిశోధనా ఫలితాలు కూడా, భారత చరిత్ర రచనను మరింత మెరుగుపర్చాయి.

ఇండియన్ సివిల్ సర్వెంట్‌గా 30 సంవత్సరాలు భారతదేశంలో ఉద్యోగాన్ని నిర్వహించిన వి.ఏ. స్మిత్, అర్థ శతాబ్దంపాటు భారతదేశ చరిత్ర, కళలు, పురావస్తు శాస్త్ర విషయాలను ఎంతో ఆసక్తితో శోధించి, సమాచారాన్ని సేకరించి, శాస్త్రీయంగా, సమగ్రంగా సాగసైన భాషా శైలితో విషయ వివరణకు పూనుకొన్నాడు. ప్రాచీన భారత చరిత్రను అధ్యయనం చేసిన ఇతడు, భారతీయ నాగరికతలోని ప్రతి విశేషాన్ని గ్రీక్ నాగరికతా సంపర్క ప్రభావమని రుజువు చేయాలని ప్రయత్నించాడు. ' ఇండియన్ యాంటిక్వరి ' (Indian Antiquary) అనే జర్నల్‌కు, 40 సంవత్సరాల పాటు అనేక పరిశోధనా వ్యాసాలను రాశాడు. వీటిలో, 'ది కాయిన్స్ ఆఫ్ ది గుప్తా డైనాస్టీ' (The Coins of the Gupta Dynasty ), ' ది హిస్టరీ అండ్ ది కాయినేజ్ ఆఫ్ ది ఛండేలా డైనాస్టీ '(The History and Coinage of the Chandela Dynasty), ' ది పాలాస్ ఆఫ్ బెంగాల్ ' (The Palas of Bengal) మొదలైనవి ముఖ్యమైనవి. ఆంధ్రుల గూర్చి, శకుల గూర్చి, ఇండో - పార్థియన్‌ల గురించి, గుప్తుల నాణేల గూర్చి, అనేక వ్యాసాలను రాశాడు.

గిబ్బన్ వలె స్మిత్ కూడా వీరుడు. సామ్రాజ్యాల వల్ల ఉత్తేజితుడై, భారత చరిత్రను అదే పద్ధతిలో అధ్యయనం చేశాడు. పర్యవసానంగా, అశోకుడు, రెండో చంద్రగుప్తుడు, అక్బర్‌లు ప్రముఖ పాలకులయ్యారు. ఇతర పాలకుల కాలం అంధయుగమైంది. అశోకునిపై ఆంగ్లంలో, 1901లో వచ్చిన ' అశోకా ది బుద్దిస్ట్ ఎంపరర్ ఆఫ్ ఇండియా ' (Asoka, the Buddhist Emperor of India) అనే రచన, స్మిత్ రాసిన చరిత్ర గ్రంథాల్లో మొదటిది. విషయపరంగాను, గుణాత్మకంగాను, అశోకునిపై ఆ తర్వాత వచ్చిన రచనలకు, ఇది ఏ విధంగానూ తీసిపోదు. 1904లో ఆనాటి వరకు లభ్యమైన చరిత్ర ఆధారాలన్నింటిని శోధించి, వంశావళులకు సంబంధించిన రాజకీయ చరిత్రకు ప్రాధాన్యతనిస్తూ, స్మిత్, " ది ఎర్లీ హిస్టరీ ఆఫ్ ఇండియా ' (The Early History of India) , అనే గ్రంథాన్ని ప్రామాణికంగా రాశాడు. 1906లో ' కేటలాగ్ ఆఫ్ ది కాయిన్స్ ఇన్ ఇండియన్ మ్యూజియం, సంపుటి. 1', (Catalogue of the Coins in Indian Museum, Vol.I), 1911లో ' ఎ హిస్టరీ ఆఫ్ ఫైన్ ఆర్ట్ ఇన్ ఇండియా అండ్ సిలోన్ ' (A History of Fine Art in India and Ceylon), 1917లో, 'అక్బర్ ది గ్రేట్ మొగల్ ' (Akbar The Great Mughal), 1918లో ' ది ఆక్స్‌ఫర్డ్ హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా ' (The Oxford History of British India) గ్రంథాలను వెలువరించి, స్మిత్ తన పరిశోధనాభిలాషకు, సునిశిత మేథాసంపత్తికి, అద్దం పట్టాడు. అయితే, ముందే చెప్పినట్లు, స్మిత్ బ్రిటీష్ పాలనను సమర్థించే ఆయుధంగా, చరిత్ర రచనను చేపట్టడం వల్లనూ, ఆ పాలన వల్ల భారతీయులకు కలిగిన లాభాన్ని గట్టిగా తెలియజేయాలని అభిలషించడం వల్లనూ, ఉత్తమ చరిత్రకారునికి ఉండాల్సిన విషయనిష్ఠత ఇతనిలో లోపించిందనే చెప్పాలి.

## 20.8 విషయపరత ధోరణి

ఈ రచనలకు కొంత భిన్నంగా, ఆ తర్వాత వచ్చిన ఆధునిక పండితులు పి.ఇ. రాబర్ట్స్, టి.జి.పి. స్పియర్, సి.హెచ్. ఫిలిప్స్, ఫర్టర్, బాల్‌హాచెట్‌లు రాంకేని అనుసరించి, చరిత్ర రచనకు పూనుకొన్నారు. ఆధారాలను జాగ్రత్తగా , విమర్శనాత్మకంగా అధ్యయనం చేసి, విషయాన్ని సాధ్యమైనంత మేరకు వస్తుగతంగానే చెప్పడానికి ప్రాధాన్యత నిచ్చారు.

## 20.9 భారతీయుల స్పందన

తమ తమ దృక్పథాల నుండి బ్రిటీష్ చరిత్రకారులు ఈ విధంగా చరిత్ర రచన కొనసాగిస్తుండగా, ఈ రంగంలోకి ఆలస్యంగా అడుగుపెట్టిన భారత చరిత్రకారులు, సంఘటనలను ప్రభావితం చేసే ప్రక్రియలు, పరిస్థితులను విశ్లేషించే ప్రయత్నం చేయకుండా, వర్ణనకు, కథనానికి పరిమితమై పోయారు. ఒక శతాబ్ది కాలం పైగా, కేవలం నిరాసక్తమైన ప్రేక్షకులుగా ఉండిపోయిన భారతీయుల్లో, రాజారామ్‌మోహన్‌రాయ్ బౌద్ధిక పునరుజ్జీవం పుణ్యమా అని, చైతన్యం వచ్చింది. తమకు ఆమోదయోగ్యం కాని అనేక సిద్ధాంతాల విషయంలో, పాశ్చాత్య పండితులతో విభేదించారు. మొదట్లో బ్రిటీష్ వారి అడుగుజాడల్లోనే నడచినా, త్వరలోనే చరిత్రపై స్వీయ భావాలను ఏర్పరచుకొన్నారు. స్వజాతి శ్రమ ద్వారా వచ్చే భారతీయ సమాజ పరిణామంలోనే, చరిత్ర అసలు ప్రాముఖ్యం ఉందని గుర్తించారు. అయితే, ఈ విధమైన ఆధునిక భావజాలాన్ని ఏర్పర్చుకోడానికి ముందు, భారతీయుల చారిత్రక చింతనలో వైవిధ్యంతో కూడిన అనేక దశలు ద్యోతకమయ్యాయి.

## 20.10 హేతువాద వర్గం

భారతదేశంలో ఆధునిక చారిత్రక పరిశోధనలకు 18వ శతాబ్దం చివరి దశాబ్దాల్లో విదేశీ పండితులైన జోన్స్ తదితరుల ద్వారా, శ్రీకారం చుట్టడం తెలిసిందే. 19వ శతాబ్దంలో పాశ్చాత్య విద్య నేర్చిన భారతీయుల ఆలోచనలు మారాయి. జీవితంలో వివిధ రంగాల్లో కొత్త భావాలు ప్రభావం చూపాయి. విషయాత్మక వివేకం చోటు చేసుకుంది. శాస్త్రీయ పరిజ్ఞానం పెరిగింది. భారత చరిత్ర, సంస్కృతుల్లో విమర్శనాత్మక అధ్యయనాలు ఆరంభమయ్యాయి. భారతీయ సాంస్కృతిక వారసత్వ విలువకు గుర్తింపు వచ్చింది. జాతీయ భావాల మత్తులో విషయాలను చూడటం ఏమీ జరుగలేదు. ఈ వర్గానికి చెందిన రాజా రాజేంద్రలాల్ మిత్రా, రమేష్ చంద్ర దత్, ఆర్.జి. భండార్కర్, రాయ్‌చౌదరి మొదలైన చరిత్రకారులు, భారత చరిత్ర విషయంలో ఐరోపీయులు చేసిన తప్పులను సరిదిద్దడానికి సంఘటనలను మరింత విషయనిష్ఠతతో వీక్షించారు.

### 20.10.1 రాజేంద్రలాల్ మిత్రా

సర్ విలియం జోన్స్ వల్ల ఆధునిక చరిత్ర పరిశోధనల్లో ప్రగాఢంగా ప్రేరణ పొందిన బెంగాలీ యువ మేధావుల్లో, రాజా రాజేంద్రలాల్ మిత్రా (1822-1891) ఒకడు. రాజేంద్రలాల్ సాధారణ విద్య, వైద్యం, న్యాయశాస్త్రాల్లో పట్టా పొందాలని చేసిన ప్రయత్నాలు అర్థాంతరంగానే ముగిశాయి. అయితే, వివిధ రంగాల్లో అతని అధ్యయనాలు అనేక విషయాలపై అతనికి విస్తృత పరిజ్ఞానం పెరగడానికి తోడ్పడ్డాయి. ఈ పరిజ్ఞానమే, ఆధునిక చరిత్ర పరిశోధనలో అతడు ఉన్నత కీర్తి శిఖరాలందుకోడానికి ప్రాతిపదికైంది. 1846లో ఏసియాటిక్ సొసైటీకి ఉపకార్యదర్శిగా, లైబ్రేరియన్‌గా నియుక్తుడవటంతో, అతని జీవితం మలుపు జరిగింది. భవిష్యత్తులో భారత అధ్యయనాల నిపుణునిగా రాజేంద్రలాల్ ఎదగడానికి 1846-56 దశాబ్దంలో అతని ఉద్యోగ బాధ్యతలు

BRAOU

సోపానాలయ్యాయి. అనంతరం, ప్రభుత్వ జమీందార్లు, భూస్వాముల కుమారుల విద్యాభ్యాసం కోసం స్థాపించిన వార్డ్స్ ఇన్‌స్టిట్యూషన్‌కు డైరెక్టర్‌గా 25 సంవత్సరాలు పనిచేసినా, ఏసియాటిక్ సొసైటీతో తన సాన్నిహిత్యాన్ని వదులుకోలేదు.

చరిత్ర పరిశోధకులకు ఎంతో ఉపకరించేలా, వర్ణనాత్మక జాబితాలను రూపొందించే విధానాన్ని రాజేంద్రలాల్ మొదటిసారిగా ప్రవేశపెట్టాడు. గ్రంథాలు, మ్యాపులు, సంస్కృత రాత ప్రతులు, మొదలైన వాటి విస్తృత జాబితాలు రూపు దిద్దుకొన్నాయి. ప్రాచీన యుగ భారత చరిత్ర అధ్యయనాలకు మార్గం సుగమమైంది. కామందకుని 'నీతిసారం' వంటి గ్రంథాలు అతని సంపాదకత్వంలో వెలువడ్డాయి. కౌటిల్యుని 'అర్థశాస్త్రం', చైతన్య చన్ద్రోదయ నాటకం', శునాకుని 'బృహద్దేవత', పతంజలి 'యోగసూత్రాలు', 'అగ్నిపురాణం', 'వాయు పురాణం', అనేక బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, అతని వ్యాఖ్యానాలతో చరిత్రకారులకు అందుబాటులోకి వచ్చాయి. అతని అనేక వ్యాసాల్లో కొన్నింటిని సంకలనం చేసి, 1881లో 'ది ఇండో ఆర్యన్స్' (The Indo - Aryans) పేరుతో రెండు సంపుటాలు వెలువడ్డాయి. అయితే, ప్రసిద్ధ భారత చరిత్రకారులు, ప్రాచీన విషయాల పరిశోధకుల జాబితాలో, రాజేంద్ర లాల్ పేరును శాశ్వతం చేసిన రెండు రచనలు - 'ది శాన్‌స్క్రిట్ బుద్ధిస్ట్ లిటరేచర్ ఆఫ్ నేపాల్' (The Sanskrit Buddhist Literature of Nepal), 'యాంటిక్విటీస్ ఆఫ్ ఒరిస్సా' (Antiquities of Orissa)లు. నాణేలు, కళ, వాస్తు, సాహిత్య అధ్యయనాల్లో కూడా, అతని స్థానం గణనీయమైందే. అతని సేవలకు గుర్తింపుగా, ప్రభుత్వం కూడా అతణ్ణి 'రాయ్ బహదూర్', 'రాజా' వంటి సమున్నత బిరుదులతో సత్కరించింది.

### 20.10.2 రమేష్‌చంద్ర దత్

ఇక రమేష్ చంద్ర దత్ (1848-1909) విషయానికి వస్తే, ఇండియన్ సివిల్ సర్వీస్‌లో ఉత్తీర్ణుడైన ఇతడు ఇంగ్లాండ్‌లో ఉండగా, జేమ్స్ మిల్, చార్లెస్ డికెన్స్‌ల ప్రభావంలోకి వచ్చాడు. బంకించంద్ర చటర్జీ ప్రోత్సాహంతో రచనకు పూనుకొన్న ఇతడు, ముందుగా నాలుగు చారిత్రక నవలల్ని రాశాడు. అనంతరం, ఋగ్వేదాన్ని బెంగాలీ లోకి అనువదించాడు. 1889లో, సంస్కృత సాహిత్యంపై ప్రధానంగా ఆధారపడి, మొదటి ప్రధాన చరిత్ర రచన 'ఎ హిస్టరీ ఆఫ్ సివిలైజేషన్ ఇన్ ఏన్షియెంట్ ఇండియా' (A History of Civilization in Ancient India) గ్రంథాన్ని మూడు సంపుటాల్లో వెలువరించాడు. దేశంలోని కరువుకాటకాల గూర్చి, దారిద్ర్యం గూర్చి, బ్రిటిష్ ప్రభుత్వ వైఖరి గూర్చి వివరిస్తూ ,1897లో 'ఇంగ్లాండ్ అండ్ ఇండియా' (England and India) అనే చిన్న గ్రంథాన్ని ప్రచురించాడు. ఆ తర్వాత మన ఇతిహాసాల్ని ఆంగ్లంలోకి అనువదించాడు. పార్లమెంట్ పేపర్లు, అధికారిక నివేదికలపై ప్రధానంగా ఆధారపడి, 'ది ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా' (The Economic History of India) అనే గ్రంథాన్ని, 1902 - 1904లో రెండు సంపుటాల్లో వెలువరించాడు. తన వాదనను సమర్థించుకోడానికి గణాంకాలను విస్తృతంగా ఉపయోగించాడు. యదార్థాలపై ఇతని పరిపూర్ణ సామర్థ్యానికి, సునిశిత పరిశీలనకు, లోతైన అవగాహనకు, ఈ గ్రంథం ప్రతీక. ఈ నాటికీ, ఈ గ్రంథం ప్రామాణికంగానే ఉంది. భారతదేశ రుగ్మతకు మూల కారణం భూస్వామిక సమస్యలో ఉందని రమేష్‌చంద్ర విశ్లేషించాడు. పాలక వర్గం పెంచి పోషించిన వలసవాద ఆర్థిక వ్యవస్థను విశదీకరించాడు. భారత ప్రజా పేదరికాన్ని వివరించే సందర్భంలో "ఆర్థిక దోపిడీ" (Economic drain) ని గూర్చి చెప్పాడు.

### 20.10.3 ఆర్.జి. భండార్కర్

రామకృష్ణ గోపాల్ భండార్కర్ (1837-1925) విషయానికొస్తే, బొంబాయ్ ఎల్ఫిన్‌స్టన్ కళాశాల్లో చదివి,

BRAOU

అతడు అక్కడే ఆ తర్వాత ప్రాచ్య భాషల ఆచార్యునిగా పనిజేశాడు. అనంతరం, పూనాలోని దక్కన్ కళాశాలలో పనిజేస్తూ, ఉద్యోగ విరమణ చేశాడు. చరిత్రకారునిగా భండార్కర్‌కు కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించి పెట్టిన అతని ప్రధాన రచనల్లో, ' ఎర్లీ హిస్టరీ ఆఫ్ దక్కన్, 1884 ' (Early History of the Deccan, 1884), ' ఎ పీప్ ఇన్‌టు ది ఎర్లీ హిస్టరీ ఆఫ్ ఇండియా, 1890 ' (A Peep into the Early History of India, 1890) , ' వైష్ణవిజం, శైవిజం అండ్ మైనర్ రెలిజియస్ సిస్టమ్స్ ' (Vaishnavism, Saivism and Minor Religious systems, 1913), మొదలైనవి ఉన్నాయి. ఇవిగాక, అనేక శాసనాలు, తదితర అంశాలపై అసంఖ్యాకంగా చారిత్రక వ్యాసాలను కూడా రాశాడు. సంస్కృత భాషా బోధనను సరళతరం చేస్తూ, ప్రజల్లో ఆ భాషా వ్యాప్తికి అతడు ప్రచురించిన రెండు పుస్తకాలు, ఈ నాటికీ బహుళంగా ఉపయోగించబడుతున్నాయి.

భండార్కర్ రచనలన్నిటినీ, అంటే గ్రంథాలు, వ్యాసాలు, ఉపన్యాసాలను - సంకలనంగా, 2482 పుటల్లో నాలుగు సంపుటాలుగా, 1927–33 మధ్యకాలం లో అతని బహుముఖ ప్రజ్ఞను చాటుతూ, పూనాలోని భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వెలువరించింది. భండార్కర్ అనుసరించిన రచనా విధానాన్ని, అతని రచనలే ప్రస్ఫుటం చేస్తున్నాయి. మొత్తం సమాచారాన్ని క్షుణ్ణమైన, విమర్శనాత్మకమైన పరిశీలనకు మొదట పెట్టేవాడు. తర్వాత తన అభిప్రాయాలను ధైర్యంగా, ఆత్మ విశ్వాసంతో వెల్లడించేవాడు. వాది తరపునో, లేదా ప్రతివాది తరపునో వాదించే వకీలులా గాక, చరిత్రకారుడు ఒక న్యాయాధీశునిలా వ్యవహరించాలని అతని భావన. నిజానికి చరిత్ర అధ్యయనమంటే రాజకీయ చరిత్ర అధ్యయనం మాత్రమే కాదని, అది సామాజిక, ఆర్థిక, మత విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని భండార్కర్ నొక్కి చెప్పాడు.

### 20.10.4 హెచ్.సి.రాయ్‌చౌదరి

భారత సంస్కృతి అధ్యయన రంగంలో, రాజేంద్రలాల్ మిత్రా, మహామహోపాధ్యాయ హరప్రసాద్ శాస్త్రి వంటి ఉద్దండులు మార్గదర్శకులు కాగా, వారి అడుగుజాడల్లో ప్రసిద్ధ బెంగాలీ చరిత్రకారులు అక్షయ్ కుమార్ మొయిత్రా, రాఖాల్‌దాస్ బెనర్జీ, రమేష్ చంద్ర మజుందార్, ఆర్.పి. చాందా, ఆర్.కె. ముఖర్జీ మొదలైనవారు, ప్రాచీన భారతదేశ చరిత్ర, సంస్కృతులకు తమ అమూల్యమైన సేవలను అపారంగా అందించారు. ఈ కోవకే చెందిన వాడు, హేమచంద్ర రాయ్‌చౌదరి (1892-1957).

చరిత్ర ఉపన్యాసకునిగా అధ్యాపక వృత్తిని చేపట్టిన రాయ్‌చౌదరి, ప్రాచీన భారతదేశ చరిత్రకు సంబంధించి, రాజకీయ చరిత్ర, మత చరిత్ర, చారిత్రక భూగోళం వంటి అనేక అంశాలపై పరిశోధకునిగా, అసంఖ్యాకమైన వ్యాసాలను వివిధ ప్రతికల్లో ప్రచురించాడు. ఇక అతని ప్రధాన గ్రంథాల్లో ముందుగా చెప్పాల్సింది ' ది పొలిటికల్ హిస్టరీ ఆఫ్ ఏన్సియంట్ ఇండియా ఫ్రమ్ ది యాక్సెషన్ ఆఫ్ పరీక్షిత్ టు ది ఎక్స్టింక్షన్ ఆఫ్ ది గుప్తా ఎంపైర్, '1923) (The Political History of Ancient India from the Accession of Parikshit to the Extinction of the Gupta Empire , 1923). పరీక్షిత్ అనంతర - బింబిసారుని పూర్వయుగంలోని ప్రాచీన భారత కాలక్రమానుసార చరిత్రను, ఈ గ్రంథం మొదటి భాగంలో రాయ్‌చౌదరి చాలా ప్రామాణికంగా ఇచ్చాడు. అతని ప్రాచీన భారత చారిత్రక భౌగోళిక పరిజ్ఞానం కూడా ఇందులో ప్రస్ఫుటమైంది. గ్రంథం రెండో భాగంలో కూడా, శిశునాగుని కాలం గురించి, మౌర్య సామ్రాజ్య పతనం గూర్చి, ఇంకా ఇతర వివాదాస్పద అంశాల్లో రాయ్‌చౌదరి పరిశోధనా ప్రామాణికత కన్పించింది. ఈ కారణంగానే, ఈ గ్రంథ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ "It is a standard work on the subject, and considering its subject - matter, originality, manner of presentation and wealth of details, it stands unrivalled even now" అని, బి.కె. మజుందార్ పేర్కొన్నాడు.

BRAOU

రాయ్‌చౌదరి మరో ప్రముఖ చరిత్ర రచన ' మెటీరియల్స్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఎర్లీ హిస్టరీ ఆఫ్ ది వైష్ణవా సెక్ట్,1936) (Materials for the Study of Early History of the Vaishnava Sect, 1936) పరిమాణంలో చిన్నదైనా, యీ గ్రంథం ప్రాచీన భారతంలో మత చరిత్రకు సంబంధించిన సమస్యల విషయంలో గ్రంథకర్త స్వతంత్ర పంథాను వ్యక్తీకరిస్తుంది. అతని ' స్టడీస్ ఇన్ ఇండియన్ యాంటిక్విటీస్' (Studies in Indian Antiquities), అనేక అంశాలపై పరిశోధక పత్రాల సంకలనం. ఇవిగాక, ఆర్.సి. మజుందార్, కె.కె. దత్తాలతో కలసి ' యాన్ అడ్వాన్స్‌డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా ' (An Advanced History of India) అనే ఉన్నత స్థాయి పాఠ్య గ్రంథాన్ని కూడా రాయ్‌చౌదరి వెలువరించాడు.

## 20.11 తీవ్రవాద వర్గం

పాశ్చాత్య సంస్కృతి కంటె హైందవుల పై చేయిని ఉద్ఘాటించిన వర్గం, తీవ్రవాద వర్గం. రాజ్ నారాయణ్ బోస్, చంద్రనాథ్ బసు, బంకించంద్ర చటర్జీ, అవినాష్ చంద్ర దాస్, కాశీ ప్రసాద్ జయస్వాల్, బాలగంగాధర తిలక్, వి.డి. సావర్కర్ మొదలైన వారు, ఈ వర్గం క్రిందికి వస్తారు. హైందవ సంస్కృతి ఆధిక్యతను ఉద్ఘాటించిన వీరి రచనల్లో, ఇస్లాం సంస్కృతి ఆధ్యాత్మిక బలం మీద కంటే, శారీరక శక్తిపై ఆధారపడిందనే విషయం కనిపిస్తుంది. బంకించంద్ర ' దుర్గేశనందిని', ' కపాలకుండల', ' ఆనందమఠ్ ' , తదితర చారిత్రక నవలల్లో గాని, దాస్ రచన ' ఋగ్వేదిక్ ఇండియా' (Rig Vedic India) లో గాని, తిలక్ రాసిన ' రిసర్చెస్ ఇన్‌టు ది యాంటిక్విటీ ఆఫ్ వేదాస్' (Researches into the Antiquity of Vedas) , ' ది ఆర్కిటిక్ హోమ్ ఇన్ ది వేదాస్' (The Arctic Home in the Vedas) గ్రంథాల్లో గాని, సావర్కర్ రచన ' ది ఫస్ట్ వార్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ ' (The First War of Indian Independence) లో గాని, ఇతరుల రచనల్లో గాని, భారతదేశ గతం ఎంతో వైభవోపేతమైందనే ప్రగాఢ విశ్వాసం, చారిత్రక విషయ నిష్ఠత అవధుల్ని అతిక్రమించింది. జాతీయ భావాల ఉప్పెన ఈ చరిత్రకారుల్ని ముంచెత్తింది.

### 20.11.1 కె.పి. జయస్వాల్

జయస్వాల్ (1871-1937) ఎటువంటి బలమైన సాక్ష్యం లేకుండానే, ప్రాచీన భారతీయ సంస్కృతిని విశిష్టమైందిగా చాటి చెప్పాలనే తపన ఉన్న వ్యక్తి. ఉదాహరణకు, 20వ శతాబ్దంలో స్వయంపాలనకు భారతదేశం సిద్ధమని నిరూపించడానికి, యీ దేశానికి ప్రజాస్వామ్యం కొత్త కాదని, ప్రాచీన కాలంలోనే ఇక్కడ ఉందనీ, బాగా నడచిందనీ, అతడు వాదించగలడు. తన ప్రసిద్ధ గ్రంథం ' హిందూ పాలిటీ ' (Hindu Polity) లో, భారతదేశ గతంలో ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వం ఒక సాధారణ విషయమని, అది నియంతృత్వ ప్రభుత్వం కాదని, ధర్మసూత్ర బద్ధుడైన ప్రభువు అధికారం చెలాయించే రాజ్యాంగబద్ధమైన రాచరిక ప్రభుత్వమని, అతడు చిత్రించాడు. అతని మరో గ్రంథం, ' హిస్టరీ ఆఫ్ ఇండియా., ఎ.డి. 150 టు ఎ.డి. 350' (History of India, A.D. 150 to A.D 350) లో, నాగులను జాతి వీరులుగా తీర్చిదిద్దాడు. బౌద్ధ గ్రంథం ' మంజుశ్రీ మూలకల్ప' ను సాక్షికంగా అనువదించాడు. అనేక పరిశోధనా వ్యాసాలను కూడా ప్రచురించాడు.

## 20.12 యథాతథవాద వర్గం

భారత చరిత్రకారుల్లో మరోవర్గం కన్పిస్తుంది. దీన్ని ' యథాతథవాద ' వర్గంగా పేర్కొనొచ్చు. ఎటువంటి సైద్ధాంతిక వివాదానికైనా దూరంగా ఉండాలని అభిలషించే వర్గమిది. ఈ వర్గ చరిత్రకారులు రాంకె తరహా చరిత్రను అందించాలని ప్రయత్నించారు. దీనికోసం గట్టిగా నిలబడ్డారు, శ్రమించారు కూడా. బ్రిటిష్ చరిత్రకారులు పి.ఇ. రాబర్ట్స్, టి.జి.పి. స్పియర్, సి.హెచ్. ఫిలిప్స్, పర్బర్, బాల్‌హాచెట్ తదితరుల తరహాలో,

BRAOU

ఈవర్గం పాటుపడింది. జాదునాథ్ సర్కార్, యస్. ఎన్. సేన్, షఫాత్ అహ్మద్ ఖాన్, జి.ఎస్. సర్దేశాయ్, ఎస్.కృష్ణస్వామి అయ్యంగార్, శ్రీనివాసాచారి తదితరులను ఈ వర్గంగా పరిగణించొచ్చు.

### 20.12.1 జె.ఎన్. సర్కార్

జాదునాథ్ సర్కార్ (1870-1958) బహు భాషా కోవిదుడు. ఆంగ్ల భాషోపన్యాసకునిగా వృత్తి చేపట్టి, చరిత్ర పరిశోధనలో అనురక్తి పెంచుకొన్న వ్యక్తి. 1901లో మొదటి పరిశోధన గ్రంథం, ' ఇండియా ఆఫ్ ఔరంగాబాద్, ఇట్స్ టొపోగ్రఫీ, స్టాటిస్టిక్స్ అండ్ రోడ్స్' (India of Aurangabad, its Topography, Statistics and Roads) వెలువడ్డంతో, చరిత్ర పరిశోధకునిగా, చరిత్రకారునిగా సర్కార్‌కు గౌరవ ప్రతిష్ఠలను, గుర్తింపును తెచ్చింది. మొగల్, మరాఠా చరిత్రలపై దృష్టిని కేంద్రీకరించిన అతడు, చరిత్ర మూలాధారాలను సేకరించి, చారిత్రక ప్రదేశాలను సందర్శించి, విషయ అవగాహనతో ఆధారాలను విశ్లేషించి, చరిత్ర రచనకు పూనుకొన్నాడు. ప్రామాణికమైన, ఖచ్చితమైన చారిత్రక యదార్థాల తోడ్పాటుతో, సత్యాన్వేషకునిలా ముందుకు సాగాడు. అతని ప్రధాన గ్రంథాల్లో, ' ఎ హిస్టరీ ఆఫ్ ఔరంజేబ్, సంపుటాలు 5,' (A History of Aurangab, 5 volumes), ' శివాజీ అండ్ హిజ్ టైమ్స్ ', (Sivaji and His Times), ' ఎనెక్‌డోట్స్ ఆఫ్ ఔరంగాబాద్', (Anecdotes of Aurangabad), ' మొగల్ అడ్మినిస్ట్రేషన్' (Mughal Administration), ' ఇండియా త్రూ ది ఏజెస్ ' (India through the Ages), ' స్టడీస్ ఇన్ మొగల్ ఇండియా' (Studies in Mughal India), ' హిస్టారికల్ ఎస్సేస్' (Historical Essays), ' ఫాల్ ఆఫ్ ది మొగల్ ఎంపైర్, 5 సంపుటాలు' (Fall of the Mughal Empire, 5 volumes) ' చైతన్య హిజ్ పిలిగ్రిమేజెస్ అండ్ టీచింగ్స్ ' (Chaitanya His Pilgrimages and Teachings), ' హౌస్ ఆఫ్ శివాజీ' (House of Shivaji), ' మిలిటరీ హిస్టరీ ఆఫ్ ఇండియా' (Military History of India) ప్రసిద్ధి పొందాయి. " పూనా ప్రెసిడెన్సీ కరెస్పాండెన్స్" (Poona Presidency Correspondence), " ఐన్ - ఇ - అక్బరీ " (Ain - i - Akbari) మొదలైన వాటికి అతడు సంపాదకత్వాన్ని నిర్వహించాడు. అసంఖ్యాకంగా చారిత్రక వ్యాసాలను వెలువరించాడు.

సర్కార్ అనుసరించిన పరిశోధనా పద్ధతిని, దేశ పట లేఖనాలు (Cartographs), గుర్తింపు (Identification), కాలక్రమణిక (Chronology), ధృవీకరణ (Corroboration), అనే నాలుగు పదాల్లో క్లుప్తీకరించాడు. చరిత్రకారుడు వకీలు కాదు, న్యాయాధిపతి లాంటి వాడని, అతడు వాస్తవాన్ని చిత్రించాలని, తన జాతికి అప్రతిష్ఠ తెస్తాయన్న దురభిమానంతో, విషయాలను మరుగుపర్చరాదని, మంచీ చెడులను నిస్సంకోచంగా, నిర్భయంగా చెప్పగలగాలని సర్కార్ నిశ్చితాభిప్రాయం. అంతేగాక, నిజమైన చరిత్ర, మానవాళికి ఎన్నో గుణపాఠాలను నేర్పుతుందని అతని నమ్మకం. అతని అన్వేషణాతత్వం, జ్ఞాన పిపాస, అవిశ్రాంత కృషి, ఉదాత్త చారిత్రక భావనలు, మన చరిత్రకారుల్లో అతనికి ఉన్నత స్థానాన్ని సంపాదించిపెట్టాయి.

BRAOU

### 20.12.2 ఎస్.ఎన్.సేన్

సురేంద్రనాథ్ సేన్ (1890-1962) చరిత్రోపన్యాసకునిగా అధ్యాపక వృత్తిలో చేరి, ప్రసిద్ధ చరిత్ర పరిశోధకునిగా ఎదిగాడు. మరాఠుల చరిత్రలో ఆసక్తిని కనబర్చాడు. మరాఠీ, పర్షియన్, పోర్చుగీస్, ఆంగ్ల భాషల్లో ఉన్న మూలాధారాలను క్షుణ్ణంగా ప్రత్యక్షంగా పరిశీలించాడు. రాజకీయ చరిత్రలో అతనికి ఆసక్తే లేదు. కనుకనే, తమ సామాజిక, రాజకీయ సంప్రదాయాలను అనుసంధిస్తూ, మరాఠులు పరిపాలనా సంస్థల్ని నిర్మించడంలో సమర్థులని నిరూపిస్తూ, ' అడ్మినిస్ట్రేటివ్ సిస్టమ్ ఆఫ్ ది మరాటాస్' (Administrative System of the Marathas) అనే గ్రంథాన్ని రచించాడు. అనంతరం, ఒక మామూలు పౌరునికి

అగమ్యగోచరమైన సైనిక విషయాలను కూలంకషంగా అర్థం చేసుకుని, ఎంతో గొప్పగా ' మిలిటరీ సిస్టమ్ ఆఫ్ ది మరాటాస్' (Military System of the Marathas) గ్రంథాన్ని వెలువరించాడు. ఇవిగాక, ' స్టడీస్ ఇన్ ఇండియన్ హిస్టరీ ఆఫ్ ది మెయిన్ ట్రాక్' (Studies in Indian History off the Main Track), ఢిల్లీ అండ్ ఇట్స్ మాన్యుమెంట్స్'(Delhi and its Monuments), ' ఇండియా త్రూ ది చైనీస్ ఐస్ ' (India Through The Chinese Eyes), మొదలైన ఇతర రచనలను కూడా చేశాడు. సేన్ రాసిన చివరి ప్రధాన గ్రంథం ' ఎయిటీన్ ఫిఫ్టీ సెవెన్ ' (Eighteen Fifty Seven). అతని దృష్టిలో చరిత్రాధారాలు పాక్షికమైనవి, ఒక వైపు మొగ్గు చూపినవే. 1857 సంఘటనల గూర్చి భారతీయ కథనాన్ని వెలికి తీయడానికి అతడు చాలా శ్రమించాడు.

### 20.12.3 షఫాత్ అహ్మద్ ఖాన్

రికార్డులను విశ్లేషించి, సంఘటనలను జరిగినవి జరిగినట్లుగా వర్ణించాలనే సమకాలీన వైఖరిని తన చారిత్రక రచనల్లో ప్రతిబింబించిన మరో చరిత్రకారుడు, షఫాత్ అహ్మద్ ఖాన్. 1921లో వెలువడ్డ అతని తొలి రచన ' ఐడియల్స్ అండ్ రియాలిటీస్ ' (Ideals And Realities). అతని యితర గ్రంథాల్లో, ' ఈస్ట్ ఇండియా ట్రేడ్ ఇన్ ది 17 సెంచరీ ' (East Indian Trade In The 17th Century) , ' ఆంగ్లో- పోర్చుగీస్ నెగోషియేషన్స్ రిలేటింగ్ టు బాంబే, 1660 - 1679' (Anglo - Portuguese Negotiations Relating to Bombay, 1660 - 1679), ' సోర్సెస్ ఫర్ ది హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా ఇన్ ది 17 సెంచరీ' (Sources for the History of British India in the 17th Century), ' జాన్ మార్షల్ ఇన్ ఇండియా' (John Marshall in India), ' ఇండియన్ ఫెడరేషన్ ' (Indian Federation), ' ఫెడరల్ ఫ్రాన్స్ ' (Federal France), ' ది హిస్టరీ అండ్ హిస్టోరియన్స్ ఆఫ్ బ్రిటీష్ ఇండియా' (The History and Historians of British India) ప్రధానమైనవి. మూలాధారాల ప్రామాణికతను చాలా శ్రద్ధగా పరీక్షించాలనే వాటిమీదే ఆధారపడి, అహ్మద్ ఖాన్ ఎప్పుడూ తుది నిర్ణయాలను వెలిబుచ్చడం, అతని రచనలన్నింటా కన్పిస్తుంది. శాస్త్రీయమైన చరిత్రలో అతనికి ప్రగాఢ విశ్వాసముంది. అతని మొదటి రచనను బట్టి, అతణ్ణి తొలి భారత ఆర్థిక చరిత్రకారుల్లో ఒకడిగా పరిగణించొచ్చు. అయితే, ఆర్థిక చరిత్రే గాక, పరిపాలనా చరిత్ర, సామాజిక చరిత్ర, రాజకీయ ఉద్యమాలు కూడా, అతని దృష్టిని ఆకట్టుకొన్నాయి.

BRAOU

### 20.12.4 జి.ఎస్. సర్దేశాయ్

భారత చరిత్రకారుల్లో మరో మణిపూస, గోవింద్ సఖారాం సర్దేశాయ్ ( 1865-1958) . ఈతడు చరిత్రకారుడవడం యాదృచ్ఛికంగా జరిగింది. బరోడా రాకుమారులకు పాఠాలు చెప్పేందుకు, భారతదేశ చరిత్రపై విస్తృతంగా నోట్స్ తయారు చేయగా, ఆ నోట్సే మరాఠీలో ప్రసిద్ధికెక్కిన ' రియాసత్ ' ల ప్రచురణకు ప్రాతిపదికైంది. ' ముసల్మానీ రియాసత్ ' పేరుతో రెండు సంపుటాలు, ' మరాఠీ రియాసత్ ' పేరుతో ఎనిమిది సంపుటాలు వెలువడ్డాయి. ' బ్రిటీష్ రియాసత్ ' రెండు సంపుటాల్లో ప్రచురింపబడింది. 1926లో సర్దేశాయ్ మరాఠుల చరిత్రపై పాట్నా విశ్వవిద్యాయలయంలో ఇచ్చిన ఉపన్యాసాలే, ' మెయిన్ కరెంట్స్ ఆఫ్ మరాఠా హిస్టరీ ' (Main Currents of Maratha History) పేరుతో , గ్రంథ రూపాన్ని సంతరించుకొన్నాయి. ఎనిమిది సంపుటాల్లో ' మరాఠీ రియాసత్ ' గా వెలువరించిన మరాఠుల చరిత్రను, సర్దేశాయ్ ఆంగ్లంలో మూడు సంపుటాల్లో ' ది న్యూ హిస్టరీ ఆఫ్ ది మరాటాస్ ' (The New History of the Marathas) పేరుతో ప్రచురించి, మరాఠా చరిత్రకారునిగా ప్రసిద్ధి కెక్కాడు. జె.యన్. సర్కార్‌తో కలిసి, ' పీష్వా దఫ్తర్ ' కు చెందిన ఉత్తర ప్రత్యుత్తరాలను ' పూనా రెసిడెన్సీ కరెస్పాండెన్స్ ' (Poona Residency Correspondence) అనే పేరుతో, తన సంపాదకత్వంలో వెలువరించాడు. మొత్తం మీద, మరాఠా చరిత్రకు సంబంధించిన మౌలిక చరిత్రాధారాలను 62 సంపుటాల్లో ప్రకటించి, సర్దేశాయ్ చరిత్ర విద్యార్థులకు, పరిశోధకులకు గణనీయమైన

సేవలందించాడు. అయితే, చరిత్రాధారాల విశ్వసనీయతను విశ్లేషించకపోవడం, మరాఠా వీరుల వ్యక్తిత్వం గూర్చి స్వీయ అంచనాన్నివ్వకపోవడం, ఇతనిలో కన్పించే లోపాలు.

### 20.12.5 ఎస్.కె. అయ్యంగార్

దక్షిణ భారతదేశంలో వేళ్లమీద లెక్కించదగ్గ పై కోవకు చెందిన కొద్దిమంది చరిత్రకారుల్లో , ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్ (1871-1953) ఒకడు. ఆంగ్ల భాష, చరిత్రల్లో అధ్యాపక వృత్తిని చేపట్టిన అయ్యంగార్, ప్రవృత్తి రీత్యా పరిశోధనలను సాగించి, చరిత్రకారునిగా అనేక రచనలను చేశాడు. అతని గ్రంథాల్లో, 'ఏన్షియెంట్ ఇండియా సౌత్ ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్ ' , (Ancient India South Indian History and Culture), 'సమ్ కంట్రిబ్యూషన్స్ ఆఫ్ సౌత్ ఇండియా టు ఇండియన్ కల్చర్' (Some Contributions of South India to Indian Culture) , 'సౌత్ ఇండియా అండ్ హర్ మహొమ్మడన్ ఇన్వేడర్స్ ' ( South India and Her Mohammadan Invaders) , ' మణిమేఖలై ఇన్ ఇట్స్ హిస్టారికల్ సెట్టింగ్' (Manimekhalai in its Historical Setting), ' ది ఇవల్యూషన్ ఆఫ్ హిందూ అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్ సౌత్ ఇండియా '(The Evolution of Hindu Administrative Institutions in South India),' ఎ హిస్టరీ ఆఫ్ తిరుపతి ', 2 సంపుటాలు' ( A History of Tirupati , 2 Volumes), ' సీవెల్స్ హిస్టారికల్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ సౌత్ ఇండియా '(Sewell' s Historical Inscriptions of South India), ' ది పరమ్ సంహిత ఆఫ్ ది పంచతంత్ర ' (The Param Samhita of the Panchatantra ) లు ప్రధానమైనవి. ఇవిగాక, అయ్యంగార్ కొన్ని పత్రికలకు సంపాదకునిగా వ్యవహరించాడు. అనేక వ్యాసాలను రాశాడు. రంగస్వామి సరస్వతి, సతియనాథయ్యర్, గోపాలన్, వి.ఆర్.ఆర్. దీక్షితార్ వంటి ప్రముఖ చరిత్రకారులు, అయ్యంగార్ చే మలచబడ్డ వారే. పట్టుదల, పరిశ్రమ, పాండిత్య ప్రతిభ అయ్యంగార్‌ను ఉన్నతుడ్ని చేశాయి. అతని పరిశోధనా కృషి ఫలితంగానే, సంగమ యుగం ఘనత, పల్లవ, చోళ, విజయనగర రాజ్యాల చరిత్ర, వెలుగును చూశాయి. సర్దేశాయ్ వంటి ప్రముఖులకూ, అయ్యంగారే స్ఫూర్తి ప్రదాత. తూర్పు ద్వీప సముదాయానికీ, భారత సంస్కృతి విస్తరించడంలో, దక్షిణ భారత పాత్రను చాటిచెప్పిన వారు, కృష్ణస్వామి అయ్యంగార్, సి.యస్. శ్రీనివాసాచారి మొదలైన వారే. మణి, సురేంద్రనాథ్ బెనర్జీ మొదలైన వారు దీనికై తమ రచనల ద్వారా ప్రయత్నించారు.

## 20.13 ఇతర ధోరణులు

భారత చరిత్ర రచనలో మతతత్త్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ, మార్క్సువాదాన్ని మన దేశ చారిత్రక పరిణామాలకు అన్వయిస్తూ,హిరేన్ ముఖర్జీ, పామె దత్, కోశాంబి మొదలైనవారు రచనలను చేశారు. ఈమార్క్సు వాద అభ్యుదయ చరిత్రకారులు ముఖ్యంగా, స్వాతంత్ర్యానంతరం ఎక్కువ ప్రభావాన్ని చూపించారు. ఫలితంగా, మహమ్మద్ హబీబ్, ఎస్. నూరుల్ హసన్, రొమిల్లా థాపర్, బిపిన్ చంద్ర, హర్బన్స్ ముఖియా, ఇర్ఫాన్ హబీబ్ తదితరులు, ఈ దృక్పథంలోనే పరిశోధనలను సాగిస్తున్నారు. సామ్రాజ్యవాద, వలసవాద ధోరణికి భిన్నంగా, భారత చరిత్ర రచనా విధానంలో తలెత్తిన జాతీయవాద, కుల, మత తత్త్వ, మార్క్సువాద వైఖరులను, ఈ ఖండంలోని మిగతా భాగాలు ప్రతిబింబిస్తాయి.

## 20.14 సంగ్రహంగా

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, చరిత్రకారుడు గతాన్ని వర్తమాన పరిధిలో క్రమబద్ధంగా పరిశీలించి, వ్యాఖ్యానించాడు. గత కాల సంఘటనల అస్తిత్వం, అతని ఆలోచన మీద ఆధారపడి ఉంది. అంటే, అతడు

BRAOU

పరిశీలిస్తున్న విషయంపై అతని వ్యక్తిత్వం పరోక్షంగానైనా ప్రతిఫలిస్తుంది. ఆధునిక యుగంలో, చరిత్ర రచనలో చరిత్రకారుణ్ణి ఎక్కువగా ప్రభావితం చేస్తున్నది, సైద్ధాంతిక పరిశీలన. భారతదేశంలో గత రెండు శతాబ్దాలుగా జరిగిన చరిత్ర రచనల్లో, వలసవాద రచనా సంప్రదాయం ప్రాముఖ్యాన్ని వహించింది. ఈ రచనలు బ్రిటీష్ వారు చేసినవైనా, లేదా భారతీయులు చేసినవైనా, పెద్ద తేడా లేదు.

బ్రిటీష్‌వారి భారత చరిత్ర రచనా సంప్రదాయం, ప్రాచ్యవాదులు, లేదా భారత సంస్కృతీ అధ్యయన నిపుణులతో ప్రారంభమైంది. సర్ విలియం జోన్స్, అలెగ్జాండర్ కన్నింగ్ హామ్, విల్కిన్స్, ఎల్ఫిన్‌స్టన్ తదితరుల భారత సానుకూల వైఖరి, వారి రచనల్లో ప్రతిబింబించింది. ఆధునిక కాలంలో, భారతదేశం గూర్చి మొదటి చరిత్ర గ్రంథాన్ని రాసిన జేమ్స్ మిల్, కులమతాలు, స్థాయీబేధాలు, దురభిమానాలు ప్రాబల్యం వహించిన భారతీయ సమాజాన్ని, జ్ఞాన వికాస నియంతృత్వం ద్వారా మాత్రమే, అభివృద్ధిలోకి తీసుకురావచ్చని ఉద్ఘాటించాడు. షోర్, గ్రాంట్ వంటి మతాచార్యులు భారతదేశ వెనుకబాటుతనానికి హిందూ మతమే కారణమని, హిందువులను క్రైస్తవులుగా మారిస్తే, భారతదేశాన్ని ముందుకు తీసుకుపోవచ్చని రాశారు. తాత్విక చరిత్రకారులైన ల్యాల్, మైన్, స్టీఫెన్, హంటర్ మొదలైన వర్గం, ప్రాచ్య, పాశ్చాత్య శక్తుల పరస్పర కార్య విధాన ఫలితమే, భారతదేశంలో బ్రిటీష్ వారి పరిపాలననే దృష్టితో చూసింది. ఇంక రాబర్ట్స్, స్పియర్, ఫిలిప్స్ వంటి ఆధునికులు, విషయపరతా ధోరణిలో రాంకె రచనా విధానాన్ని అనుసరించారు.

భారత చరిత్ర రచనా రంగంలోకి ఆలస్యంగా అడుగుపెట్టిన మన చరిత్రకారులు, మొదట వర్ణనకు, కథనానికి పరితమై పోయారు. ఆ తర్వాత, పాశ్చాత్య విద్యార్జనతో, వారిలో భారతీయ సాంస్కృతిక వారసత్వ విలువకు గుర్తింపు పెరిగింది. రాజేంద్రలాల్, ఆర్.సి. దత్, ఆర్.జి. భండార్కర్, రాయ్‌చౌదరి మొదలైన వారు, భారత చరిత్ర విషయంలో, ఐరోపీయులు చేసిన తప్పులను సరిదిద్దడానికి, సంఘటనలను మరింత విషయ నిష్ఠతతో పరికించారు. పాశ్చాత్య సంస్కృతి కంటే, హిందూ సంస్కృతీ ఆధిక్యతను, రాజ్‌నారాయణ్ బోస్, బంకించంద్ర, జయస్వాల్, తిలక్, సావర్కర్‌లు ఉద్ఘాటించారు. అయితే, సైద్ధాంతిక వివరణలకు దూరంగా రాంకె తరహా చరిత్రను అందించాలని, జె.ఎన్. సర్కార్, సేన్, షఫాత్ అహ్మద్ ఖాన్, సర్దేశాయ్, యస్. కె. అయ్యంగార్ తదితరులు శ్రమించారు.

## 20.15 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. వలసవాద యుగ భారత చరిత్ర రచనాభివృద్ధిని సమీక్షించండి.
2. భారత చరిత్ర రచనా సంప్రదాయంలో, బ్రిటిష్ చరిత్రకారుల వివిధ ధోరణులను వివరించండి.
3. భారతదేశ చరిత్ర రచనాభివృద్ధిలో కన్పించిన భారతీయ చరిత్రకారుల దృక్పథాలను విపులీకరించండి.

**II. ఈ క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. సర్ విలియం జోన్స్
2. వి.ఏ. స్మిత్
3. రమేష్‌చంద్ర దత్

BRAOU

4. కె.పి. జయస్వాల్

5. ఎస్.కె. అయ్యంగార్.

## 20.16 ఉపయుక్త గ్రంథాలు


| | |
|---|---|
| Ali B. Sheik | **History : its Theory and Method,** Macmillian, Madras, 1973. |
| Chandra, Bipin | **Nationalism and Colonialism in Modern India,** Orient Longman Ltd. N. Delhi, 1979. |
| Kadhirvel, S. | **Historical Methods,** Saravana Books, Madras, 1978. |
| Majumdar, R.C. | **Historiography in Modern India,** Asia Publishing House, Bombay, 1970. |
| Nilakanta Sastri, K.A, and Ramana, H.S. | **Historical Method in Relation to Indian History,** Madras, 1956. |
| Philips C.H. | **Historians of India, Pakistan and Ceylon,** Oxford, New York, 1961. |
| Sen, S.P. (Ed) | **Historians and Historigraphy in Modern India,** Institute of Historical Studies, Calcutta, 1973. |
| Tikekar, S.R. | **On Historiography,** Popular Prakasan, Bombay, 1964. |
| Warder, A.K. | **An Introduction to Indian Historiography.** |


BRAOU

రచయిత : డా. జె. దుర్గాప్రసాద్

# భాగం - 21 : భారతదేశం : జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి

విషయక్రమం

21.0 లక్ష్యాలు

21.1 పరిచయం

21.2 జాతీయవాద చరిత్ర రచన - తొలి స్ఫూర్తి

21.3 ఆర్థిక జాతీయవాదులు

21.3.1 కె.పి. జయస్వాల్

21.3.2 హేమచంద్ర రాయ్‌చౌదరి

21.3.3 కె.ఏ. నీలకంఠ శాస్త్రి

21.3.4 ఆర్.సి. మజుందార్

21.4 ముగింపు

21.5 సంగ్రహంగా

21.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

21.7 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 21.0 లక్ష్యాలు

- ఈ భాగాధ్యయనం వల్ల మీరు
- 'ఆధునిక భారతదేశంలో భారతీయుల జాతీయవాద చరిత్ర రచన పుట్టుకకు కారణాలను వివరించగలగాలి.
- జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధిలో ఆర్థిక జాతీయవాదులైన కె.పి. జయస్వాల్, హేమచంద్ర రాయ్‌చౌదరి, కె.ఏ. నీలకంఠ శాస్త్రి, ఆర్.సి. మజుందార్ ల పాత్రలను విశ్లేషించగలగాలి.

## 21.1 పరిచయం

18వ శతాబ్దంలో, ప్రాచీన భారతీయ సంస్కృతీ అధ్యయనం, ప్రాచీన భారతదేశ చరిత్రను గూర్చి చరిత్ర రచనలు మొదలయ్యాయి. అప్పటి నుండి 20 వ శతాబ్దం వరకు, భారతీయ చరిత్ర - సంస్కృతీ విశ్లేషణలో, ప్రాచ్యవాద, ఉపయోగితావాద, జాతీయవాద దృక్పథ ప్రభావముంది. ప్రాచ్యవాదులు లేదా ఓరియంటలిస్ట్‌లు ప్రాచీన భారతీయ సంస్కృతిని ఆకాశానికి ఎత్తుతూ స్తుతించగా, ఉపయోగితావాదైన జేమ్స్ కుక్ ' హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా ' (History of British India) గ్రంథాన్ని రచించి, హిందూ యుగం, మహమ్మదీయ యుగం, బ్రిటీష్ యుగమని విభజించాడు. ఆ గ్రంథంలో హిందూ సంస్కృతి వెనుకబడిందని, అభివృద్ధికి

వ్యతిరేకమని, హేతువాద వ్యతిరేకమని తీవ్రంగా దుయ్యబట్టాడు. ఒక పక్కన ఉపయోగితావాదులు ప్రాచీన భారతీయ సంస్కృతిని తీవ్రంగా దుయ్యబట్టగా, ఓరియంటలిస్ట్‌లు పొగడగా, రెండు పరిణామాలు తలెత్తాయి. అవేమంటే, భారతీయ గత ఘనతను పునరుద్ధరించటం, విమర్శకుల నోళ్లు మూయించేందుకు ఉపయోగించాలను కోటం ఆరంభమైంది. ప్రాచీన గత ఔన్నత్యాన్ని పొగడటం, ప్రతి జాతీయోద్యమంలో సాధారణంగా కన్పించే సహజ లక్షణమే అనేది, గుర్తుంచుకోదగ్గ అంశం. అయితే, గత ఔన్నత్య పునరుద్ధరణ మొదట్లో నిద్రాణమైన భారత[illegible] జాతిని మేల్కొల్పటానికి ప్రయత్నించగా, కాలక్రమేణా బ్రిటీష్ వలసరాజ్య విధానం, ఆర్థిక దోపిడి, జాత్య[illegible]ర దృక్పథం, 'తూర్పు తూర్పే, పశ్చిమం పశ్చిమమే', 'అనాగరికులైన భారతీయులను నాగరికులుగా చేయు[illegible]ల్లవారి బాధ్యత' అనేది, ప్రాచీన భారతీయ సంస్కృతిలో పాశ్చాత్యులు గొప్పవిగా చెప్పుకొంటున్న, అహంభావంతో గర్వపడుతున్న అంశాలను వెదకి, బయటకు తీసి, మా సంస్కృతి వెనుకబడింది కాదు, అభివృద్ధికి వ్యతిరేకమైంది కాదు, హేతువాదానికి లొంగనిది కాదన్నది రుజావు చేయ పూనుకొనడానికి దారితీసింది. ఈ ధోరణి తీవ్రమైన, గాఢమైన జాత్యభిమానానికి దారితీసింది. వలసవాద, సామ్రాజ్యవాద చరిత్రకారులు భారతదేశం ఒక జాతి రాజ్యం కాదని, జాతుల సమూహమని విమర్శించటం కూడా, పైన పేర్కొన్న ధోరణి పెరిగేందుకు సహాయపడింది. ఈ ధోరణికి సమాధానమే, తీవ్రమైన జాతీయవాద చరిత్ర రచన పెరగటం.

జాతీయోద్యమ కాలం నాటి భారతీయ చరిత్రకారులు డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదుల్లా, సాక్ష్యాధారాలతో విమర్శకుల నోళ్లు మూయించేందుకు, ప్రాచీన భారతీయ చరిత్ర - సంస్కృతి అధ్యయనాన్ని తమ లక్ష్యంగా ఎన్నుకొన్నారు. ఆర్.యస్. శర్మ మాటల్లో, 'బ్రిటీష్‌వారు భారతదేశ చరిత్రను విమర్శించినపుడు, దానికి సమాధానంగా, చాలా పరిశోధన జరిగిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. ప్రాచీన భారతదేశంలోని అనేక నూతనాంశాలు జాతీయవాద దృక్పథం గల చరిత్రకారుల వల్ల వెలుగులోకి వచ్చాయి'. పైన పేర్కొన్న లక్ష్యానికి అనుగుణంగా, కలకత్తా విశ్వవిద్యాలయంలో మొట్టమొదటిసారిగా 'ప్రాచీన భారతీయ చరిత్ర - సంస్కృతి' అనే ప్రత్యేక విభాగాన్ని స్థాపించటం, అందులో పాఠ్యాంశాలుగా రాజపుత్ర, మరాఠా, సిక్కు చరిత్రలకు ప్రాధాన్య మివ్వటం వెనుక, పైన పేర్కొన్న లక్ష్యం కనిపిస్తుంది. కాలక్రమేణా, బెంగాల్, బీహార్, అస్సాం ప్రాంతాల విశ్వవిద్యాలయాల్లో, చరిత్ర అధ్యయనానికి కలకత్తా ఆదర్శమైంది. వారణాశిలోను, ఇతర చోట్ల ప్రాచీన భారత చరిత్ర - సంస్కృతి విభాగాల నేర్పాటు చేశారు. ఈ విశ్వవిద్యాలయాల్లోని ఈ భావంచే స్ఫూర్తిని పొందిన భారతీయ చరిత్రకారులు, వ్యక్తిగతంగా గణనీయమైన పరిశోధనలను జరిపారు. తమ రచనలద్వారా హైందవ సంస్కృతి ఔన్నత్యం, ప్రాచీన భారతీయులు అపూర్వమైన అంశాలను సాధించారని నొక్కి చెప్పి, హైందవ సంస్కృతి పునరుద్ధరణ ఆవశ్యకతను బలంగా చాటి చెప్పి, గాఢమైన, తీవ్రమైన జాతీయవాదానికి గట్టి పునాదులను వేశారు.

BRAOU

## 21.2 జాతీయావాద చరిత్ర రచన - తొలి స్ఫూర్తి

19వ శతాబ్దం నాటి భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో, పాశ్చాత్య విద్యాసంస్కృతులచే ప్రభావితులైన మేథావులు, ఆలోచనాపరులు, పాశ్చాత్య సంపర్కంచేత ప్రభావితులు కానివారు, భారతీయ సమాజాన్ని సంస్కరించాల్సిన అవసరాన్ని గుర్తించి, అందుకు పూనుకొన్నారు. ఈ విధంగా పూనుకొన్నవారు, వృత్తి రీత్యా చరిత్ర రచయితలు కారు, చరిత్ర అధ్యాపకులు కారు. కాని, తమ రచనల, ప్రబోధాల, ప్రసంగాల ద్వారా, నిరాశ, నిస్పృహ, నిర్లిప్తతలతో నిండిన భారతీయ సమాజాన్ని మేల్కొల్పారు. ఆనాటి సంస్కరణవాదులు మనం చదువుకుంటున్న జాతీయవాద స్ఫూర్తితో కూడిన చరిత్ర రచనా విధానానికి, అనుకూలమైన పునాదిని వేశారు. ఆనాటి సంఘ సంస్కర్తలు చేసిన కృషిని స్థూలంగా తెలుసుకుందాం.

ఆధునిక భారత జాతి నిర్మాతగా పేరుపొందిన రాజారామ్‌మోహన్ రాయ్ (1772 - 1833) తన కృషి ద్వారా, గాఢ నిద్రలో ఉన్న భారత జాతిని వెన్నుతట్టి లేపి, సమకాలీన ప్రపంచంలో వేగవంతంగా వస్తున్న పరిణామాలను మనకు తెలియబర్చాడు. అంతేకాక, నియంతృత్వానికి, బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఫ్రెంచ్ విప్లవం వల్ల ఉత్తేజితుడై, ప్రజాందోళన అనే సాధనం వల్ల కలిగే ఫలితాలను తెలియబర్చి, ఆధునిక దృక్పథంతో విషయాలను అవగాహన చేసుకోవాల్సిన ఆవశ్యకతను, విశ్లేషణ చేయాల్సిన అవసరాన్ని తెలియజేశాడు. అంతేగాక, ప్రముఖ చరిత్రకారుడైన ఆర్నాల్డ్ టాయన్‌బీ కన్నా ముందుగానే, చరిత్ర అంతా నాగరికతల వృద్ధి, పతనాలతోనూ, సవాల్, స్పందనలతో నిండిందని, ఒక నాగరికతా పతనం, విజయం, ఆ నాగరిక[illegible]ల్‌కు స్పందించిన దానిపై ఆధారపడిందని తెల్పారు. రాజారామ్‌మోహన్ రాయ్ ఏ అంశాన్ని తీసుకున్నా, ఆ [illegible]నికి సంబంధించిన అన్ని ఆధారాలను కూలంకషంగా అధ్యయనం చేసి, విమర్శించి, విశ్లేషించి, ఆ విషయం గురించి రాయడం, మాట్లాడటం, వాదించటం చేశాడు. ఈయన ప్రతి విషయం గురించి, నిజమైన, వృత్తిపరమైన చరిత్రకారుని వలె స్పందించిన సంఘ సంస్కర్త.

భారతీయ సమాజంపై ప్రభావాన్ని చూపించిన మరో మేధావి, సంస్కర్త, చరిత్రకారుడు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ (1820 - 1891) . ఈయన చరిత్ర రచనా విధానంలో, ప్రధానంగా మూడు మౌలిక అంశాలున్నాయి. అవి : (1) భాషకు, సాహిత్యానికి, భాషకు, చరిత్రకు మధ్యనున్న అవినాభావ సంబంధం ; (2) జీవిత చరిత్రకు ప్రాధాన్యమివ్వటం. (3) ఆసియా, పశ్చిమ దేశాల మధ్య సంపర్కం ఫలితంగా రూపొందిన సమ్మేళనానికి ప్రాధాన్యమివ్వటం. విద్యాసాగర్ రచనల్లో చరిత్ర దృష్ట్యా ముఖ్యమైంది, బెంగాలీలో ఇతడు రచించిన ' బంగ్లాకా ఇతిహాస్ '. 1849లో ' ప్రముఖ ఐరోపీయులు ' (Great Europeans) అనే జీవిత చరిత్ర గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథంలో, ఐరోపీయ మేధావుల ఆలోచనా ధోరణిని భారతీయులకు పరిచయం చేశాడు.

బెంగాలీ భాషలో రాసిన రచనలు బెంగాలీ యువతను ప్రభావితం చేశాయి. మైకేల్ మధుసూదన దత్తా (1824 - 1873) భారతదేశ సంస్కృతిని, సంప్రదాయాలను ఆధునికత పేరుతో విమర్శించిన వారిని, చీల్చి చెండాడిన కవి, నాటకకర్తగా కూడా చెప్పుకోదగ్గవాడు. ఈయన చారిత్రక నవల, నాటక ప్రక్రియ ద్వారా, ప్రజలను ఉత్తేజ పర్చాడు. ఈతని ' మేఘనాథ్ వధ్ ' అనే మహాకావ్యంలో, భారతదేశాన్ని గొప్ప నాగరికతకు తల్లి అని పొగుడుతూనే, సమకాలీన పాశ్చాత్య సంస్కృతి ఆధిక్యతకు కారణాలను తెల్పి, దయానంద్, వివేకానందులకు మార్గదర్శకుడయ్యాడు.

BRAOU

దయానంద సరస్వతి (1824 - 1883) హిందూ మతం ద్వారా భారతీయ జాతీయోద్యమాన్ని ఉత్తేజపర్చి, హిందూ జాతీయవాద చరిత్ర రచనావిధానానికి పునాది వేయగా, ఆ పునాదిపైనే, హిందూ మహాసభకు చెందిన సావర్కార్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘానికి చెందిన గోల్‌వాల్కర్, జన సంఘ్‌కు చెందిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ, భారతీయ జనతా పార్టీకి చెందిన లాల్‌క్రిష్ణ అద్వానీ మొదలైనవారు, తమ హిందూత్వ జాతీయవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. 1870 నాటికి ' ది హిందూ స్పిరిట్ ' (The Hindu spirit) విద్యావంతులైన హిందువులను ఎంతగానో ప్రభావితం చేసి, హిందూ మతం మతాలన్నిటిలోకీ అత్యున్నతమైందనే భావనను గాఢంగా నమ్మినట్లు, ప్రచారం చేసే స్థితికి వచ్చింది. దయానంద సరస్వతి ఆత్మకథ 1857తో ఆగిపోయింది. ఆయన తన ఆత్మకథలో, 1857 తిరుగుబాటును గురించి పేర్కొలేదు. 1872 నాటికి హిందీలో కలకత్తాలో ప్రసంగించాడు. 1874 నాటికి ' సత్యార్థ ప్రకాశ్ ' అనే గ్రంథాన్ని పూర్తి చేశాడు. 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. దయానందుడు ' వేదకాలానికి మరలండి, ' ' భారతదేశం భారతీయులకే ' అనే ప్రచారాల ద్వారా, గాఢమైన జాతీయభావాన్ని పెంపొందింపజేశాడు. ' ఆధునిక భారతీయ చారిత్రక విధానం ' అనే గ్రంథంలో, సుగమ్ ఆనంద్ జాతీయ చరిత్ర రచనా విధానంపై దయానందుని ప్రభావాన్ని ఈక్రింది విధంగా పేర్కొన్నాడు.

' భారతీయ నాగరికతకు చెందిన వివిధ అంశాలు - మతం, విద్య, కళ, పరిశ్రమలు, శాస్త్రాలు, పాలనా విధానాలు - ఆరోగ్యకరమైనవే కాక, అందమైనవి, మంచివి, గొప్పవి' అని. కాని, మహమ్మదీయ, బ్రిటీష్ వారి పాలన వల్ల పాడైపోయినవని, కాబట్టి, నిజమైన దేశభక్తుడు మహమ్మదీయులతో, బ్రిటీష్ వారితో పోరాడి, ప్రాచీన హైందవ సంస్కృతీ ఔన్నత్యాన్ని, స్వచ్ఛతను పునరుద్ధరించాలని బోధించాడు. అంతేకాక, ఇస్లామిక్ సంస్కృతి విదేశీయమైందని, సెమిటిక్ జాతికి చెందిందని, మౌలికంగా చెడ్డదనే అభిప్రాయాన్ని ప్రచారం చేసి, వారికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించాడు. అదేవిధంగా, భౌతిక దృక్పథంతో, పాశ్చాత్య సంస్కృతికి దూరంగా ఉండాలని, దాని ప్రభావం నుండి రక్షించుకోవాలనీ, ప్రచారం చేశాడు. భారతీయ వీరుల చరిత్రను తిరిగి రాయాలని కూడా ప్రబోధించాడు. ఈ విధంగా, దయానంద జాతీయవాద దృక్పథానికి మతపరమైన స్ఫూర్తిని కలిగించాడు. ఈ నాటికీ, ఈ స్ఫూర్తి తన ప్రభావాన్ని చూపిస్తూనే ఉంది.

రుషిగా, జాతి నిర్మాతగా, ఆధునిక భారత నిర్మాతల్లో ఒకడుగా, భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవన ప్రవక్తగా పిలవబడ్డ, సుప్రసిద్ధ బెంగాలీ నవలా రచయిత, పత్రికా సంపాదకుడు, భారతీయులను ఉత్తేజపర్చిన ' వందేమాతరం ' గేయ రచయిత, బంకించంద్ర ఛటర్జీ కూడా, జాతీయోద్యమ చరిత్ర రచనా విధానానికి స్ఫూర్తి నిచ్చిన వారిలో ఒకడు. బంకించంద్ర ఛటర్జీ ' భారతమాత ' అనే భావనకు రూపమిచ్చి, ' వందేమాతరం ' అనే మంత్రం ద్వారా జాతీయ చైతన్యాన్ని పెంపుచేయటంలో కీలక పాత్ర నిర్వహించాడనటంలో, ఎటువంటి అతిశయోక్తి లేదు.

## 21.3 ఆర్థిక జాతీయవాదులు

మనం ఇంతవరకు వృత్తి రీత్యా, చరిత్రకారులు కాని సంఘ సంస్కర్తలైన రాజారామ్‌మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మైకేల్ మధుసూదన దత్తా, దయానంద సరస్వతి, బంకించంద్ర ఛటర్జీలు ఏవిధంగా, ఏ మార్గాల ద్వారా, భారతీయుల్లో జాతీయ చైతన్యాన్ని కలిగించారో చెప్పుకోగా, అదేవిధంగా, బ్రిటీష్ వారి ఆర్థిక దోపిడీని గురించి వివరించి, ఆర్థిక జాతీయవాదానికి కృషి చేసిన దాదాభాయ్ నౌరోజి, మహాదేవ గోవింద రెనడే, రమేష్ చంద్ర దత్తాల గూర్చి తెలుసుకుందాం.

' గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా ' గా గుర్తింపబడి, భారత జాతీయోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని, మితవాద, అతివాద నాయకులచే సమానంగా గౌరవించబడి, బ్రిటీష్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నుకోబడి, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా మూడు పర్యాయాలు వ్యవహరించి, భారతీయుల దారిద్ర్యానికి , ఆర్థిక దుస్థితికి కారణాలను ఇండక్షన్ విధానం ద్వారా కనుగొని, డ్రెయిన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, మన సంపదను బ్రిటీష్‌వారు తమ అవసరార్థం తరలి పోయేటట్లుగా చేయుటయే, ప్రస్తుత దుస్థితికి కారణమని చెప్పినవాడు, దాదాభాయ్ నౌరోజి (1825 - 1917) . నౌరోజి రచించిన ' పావర్టీ అండ్ అన్ బ్రిటీష్ రూల్ ఇన్ ఇండియా ' (Poverty and Un - British rule in India) అనే గ్రంథం, భారత చారిత్రక రచనా విధానంలో ఒక నూతన అధ్యాయానికి ఒరవడి పెట్టిందన్న విషయంలో ఎట్టి సందేహం లేదు. ఆ గ్రంథంలో భారతీయుల దారిద్ర్యానికి కారణం, బ్రిటీష్ ఆర్థిక దోపిడీ అని స్పష్టంగా తెలిపాడు. ఈ అభిప్రాయాన్నే, బ్రిటీష్ పార్లమెంట్‌లోను, బయట తన ప్రసంగాల ద్వారా చాటిచెప్పాడు. ఈ సిద్ధాంతమే, తొలి తరానికి చెందిన జాతీయ ఆర్థిక శాస్త్రవేత్తలైన జస్టిస్ మహదేవ గోవింద రెనడే, బి.వి. జోషి మొదలైన వారిని ఎంతగానో ప్రభావితం చేసింది. 1867లో ఇతడు రచించిన మరొక పత్రం ' ఇంగ్లాండ్స్ డెట్ టు ఇండియా ' (England's Debt to India) లండన్‌లోని ఈస్టిండియా అసోసియేషన్ సభ్యుల సమక్షంలో చదవబడింది. ఆ పత్రంలో, భారతీయులను పరిపాలించినందుకు ఖరీదుగా మన దేశంలో నుండి సంపదను దోచుకుపోతున్నారని ప్రతిపాదించి, కలకలాన్ని

BRAOU

రేకెత్తించాడు. 1870 - 71ల్లో ' ది వాంట్స్ అండ్ మీన్స్ ఆఫ్ ఇండియా' (The Wants and Means of India, ' ఆన్ ది కామర్స్ ఆఫ్ ఇండియా '(On the Commerce of India) అను మరో రెండు పత్రాలను ప్రకటించి, తన సిద్ధాంతానికి మరింత బలాన్ని చేకూర్చాడు. వీటన్నిటి సారాంశమే, 1876 లో పూర్తిచేయబడ్డ ' పావర్టీ అండ్ అన్ బ్రిటీష్ రూల్ ఇన్ ఇండియా ' (Poverty and Un -British Rule in India) అనేది. ఈ గ్రంథంలో ప్రతిపాదించిన డ్రెయిన్ సిద్ధాంతానికి కారణాలను సోదాహరణంగా, ఇండక్షన్ విధానం ద్వారా వివరించటమేకాక, పరిస్థితిని మెరుగుపర్చడానికి ఏంచేయాలో తెలియబర్చాడు. భారతీయ చరిత్ర రచనా విధానానికి ఆయన చేసిన ముఖ్యమైన కృషి, ఇండక్షన్ విధానంతో కూడిన పరిశోధనా పద్ధతి. ఆర్థిక పరిస్థితులకు, సామాజిక, రాజకీయ, నైతిక పరిస్థితులకు మధ్య అవినాభావ సంబంధముందని నమ్మినవాడై, ఆర్థికతత్వం మొత్తం సమాజాన్ని ప్రభావితం చేస్తుందని అభిప్రాయపడ్డాడు. 1904లో జరిగిన ఇంటర్నేషనల్ సోషలిస్ట్ కాంగ్రెస్ మహాసభలో, ' భారతీయుల దుస్థితిని నివారించటానికి కావాల్సింది స్వపరిపాలనని, భారతీయులకు బ్రిటీష్ వారితో సంబంధం పెట్టుకోడం ఇష్టమేకాని, బానిసల్లాగా భారతీయులను చూడటం సహించరని, తమను తాము పరిపాలించుకొనే హక్కును కోరుతున్నారని' , స్పష్టంగా తెలిపాడు. వారణాసిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహా సభకు పంపిన సందేశంలో కూడా, స్వపరిపాలన లేకుండా భారతీయుల పరిస్థితి మెరుగుకాదని, కాబట్టి స్వపరిపాలన మన లక్ష్యం కావాలన్నాడు. ఈ విధంగా ,లౌకిక దృక్పథంతో కూడిన ఆర్థిక జాతీయతావాద చరిత్ర రచనా విధానాన్ని ప్రచారం చేసిన దాదాభాయ్ నౌరోజి నిజంగానే, భారతీయ చరిత్ర రచనా విధానంలో నూతన ఒరవడికి కారణమైనాడు.

బి. దత్తా మాటల్లో, జస్టిస్ మహాదేవ గోవింద రానడే (1842-1891) భారతీయ ఆర్థిక జాతీయవాదానికి సంపూర్ణ, సమగ్రమైన హేతువాదంతో, స్వరూపమిచ్చిన మొదటివాడు. రానడే 19వ శతాబ్ది రెండో భాగానికి చెందిన భారత జాతీయ ఆర్థిక వ్యవస్థ స్వభావ, స్వరూప దిశలను బాగా అవగాహన చేసుకొన్న మొదటి వ్యక్తి. భారతీయ ఆర్థిక వ్యవస్థపై 1898లో ప్రచురించిన 12 వ్యాసాలు, 1878 - 1893 మధ్య కాలంలో పూనాకు చెందిన జర్నల్ ఆఫ్ పూనా సార్వజనిక్ సభలో ప్రచురించబడ్డ 15 వ్యాసాలు, 1872లో పూనాలో స్వదేశీ వ్యాపారం, పరిశ్రమలపై చేసిన 2 ప్రసంగాలు, ' కరెన్సీస్ అండ్ మింట్స్ అండర్ మరాఠా రూల్ ' (Currencies and Mints under Maratha Rule) అనే గ్రంథం, 1900లో ప్రచురించిన 'రైజ్ ఆఫ్ మరాఠా పవర్' (Rise of Maratha Power) అన్న గ్రంథం, ఆయన మేధా శక్తికి నిదర్శనాలు.

BRAOU

మహాదేవ గోవింద రానడే తన అధ్యయన విషయంలో, ప్రధానంగా భారతీయ ఆర్థిక విషయాల అధ్యయనంలో చారిత్రక పద్ధతిని నిర్దుష్టం చేయటమే కాక, సాంస్కృతిక రంగంలో వచ్చిన మొత్తం మార్పును, సామాజిక పరివర్తనా రంగంలో వచ్చిన జాతి రాజ్య పాత్రను అర్థం చేసుకోవాలనే భావనను ప్రవేశపెట్టాడు. బ్రిటీష్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరికి వ్యతిరేకంగా, రాజ్య వ్యవస్థ జోక్యం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించాలని అభిప్రాయపడ్డాడు. వలస రాజ్యమైన భారతదేశంలో స్థాపించబడ్డ పరిశ్రమల పటిష్ఠత గురించి ఆలోచించిన తొలి ఆర్థికవేత్త పి.కె. గోపాలకృష్ణన్ ' డెవలప్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ ఐడియాస్ ఇన్ ఇండియా ' 1880 - 1950) (Development of Economic Ideas in India, 1880 - 1950 ) అనే గ్రంథంలో, ' భారతదేశంలోని తొలి పెట్టుబడిదారీ అభివృద్ధి గురించి తపించిన జాతీయ ఆర్థిక వేత్తనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. 'రానడేస్ ఎకనమిక్ రైటింగ్స్' (Ranade's Economic Writings ) అనే గ్రంథ సంపాదకుడైన బిపన్ చంద్ర మాటల్లో, ' సమకాలీన గణాంక వివరాలపైనున్న ఆధిపత్యం మెచ్చుకోదగ్గది. కాగా, ఆర్థిక శాస్త్రవేత్తల్లో అనుభవ పూర్వక విషయంపై ఆధిపత్యం సంపాదించాలన్న సంప్రదాయాన్ని ప్రారంభించిన వాడు, మహాదేవ గోవింద రానడే '. ఈవిధంగా, వలసరాజ్య ఆర్థిక వ్యవస్థపై శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనాన్ని కొనసాగించిన తొలి భారతీయ ఆర్థికవేత్త రానడే.

రానడే ఆర్థికవేత్తయే కాక, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త. భారతీయ సాంస్కృతిక ఏకత్వం, వైశిష్ట్యం గురించి రాస్తూ, ఆనాడు ప్రచారంలో ఉన్న హిందూ మహమ్మదీయ సంబంధాలకు భిన్నంగా మహమ్మదీయ పాలన అవమానకరమైంది, దుఃఖపూరితమైంది కాదన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ, మహమ్మదీయ, హిందూ సంప్రదాయాలు రెండు శాఖలవంటివని, ఆధునిక విలువలను తోడు తెచ్చుకుని, రెండు సంప్రదాయాలను సంస్కరించాల్సి ఉందన్నారు. రానడే రచించిన 'రైజ్ ఆఫ్ ది మరాఠా పవర్' (Rise of the Maratha Power) ను గురించి, అతని చారిత్రక దృక్పథం గురించి ' హిస్టోరియన్స్ అండ్ హిస్టోరియోగ్రఫీ ' (Historians and Historiography) అనే గ్రంథంలో, డా. వి.జి. హలాల్కార్, ఆయన అన్ని రచనల్లో ' చారిత్రక పక్షపాతం ' (Historical bias) కనపడుతుందన్నాడు. న్యాయమూర్తిగా ఆయన ఇచ్చిన తీర్పులపై కూడా, చారిత్రక దృష్టి కనపడుతుందన్నాడు. రానడే మహారాష్ట్ర చరిత్రను కొత్త దృక్పథంతో, కొత్త కోణంలో నుండి, ప్రత్యేకంగా భారతీయుల దృక్పథం నుండి రాశాడు. ఆదేమంటే, హిందూ జాతీయవాద విజయమే మహారాష్ట్ర సమ్మేళన రాజ్య అవతరణకు కారణమన్నాడు. అంతేకాక, మహారాష్ట్ర రాజ్య అవతరణ వెనుక అన్ని వర్గాల ప్రజల చైతన్యం పునాదిగా ఉన్నదన్నాడు. డా . సురేంద్రనాథ్ సేన్ మాటల్లో, చరిత్రకారునిగా రానడే ఘనత అతని విశ్లేషణా విధానంపై ఆధారపడింది. డా. వి. జి. హలాల్కార్ మాటల్లో, రానడే ' రైజ్ ఆఫ్ ది మరాఠాస్ ' (Rise of the Marathas) మరాఠా చరిత్ర తత్వాన్ని తెలియబరుస్తుంది. హలాల్కార్ మాటల్లో, ' మరాఠా చరిత్రపై రానడే మరణానంతరం ఎన్నో పుస్తకాలు వచ్చినప్పటికీ, దీనికి ప్రత్యేక స్థానమున్నది '. ' వ్యక్తులుగా, సమాజాలుగా, జాతీయ రాజ్యాలుగా, సామ్రాజ్యాలుగా సాధించిన అభివృద్ధికి కారణాల న్వేషించి, చారిత్రక గమనాన్ని నిర్ణయించే విధానం, రానడేదని ' సుగమ్ ఆనంద్ పేర్కొన్నాడు.

బెంగాలీ నవలా రచయితగా, బెంగాలీలోకి ఋగ్వేదాన్ని అనువాదం చేసినవాడుగా, చరిత్రకారునిగా, ఆర్థిక వేత్తగా కీర్తి గడించిన రమేష్ చంద్ర దత్ ( 1845 - 1909), జాతీయోద్యమ కాలంలో జాతీయవాదిగా చేసిన కృషి ప్రశంసనీయమైంది. రమేష్‌చంద్ర దత్ బెంగాల్‌కు చెందిన ప్రసిద్ధ కుటుంబంలో జన్మించి, 1869లో ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలో విజయం పొంది, వివిధ హోదాల్లో ఉద్యోగం చేసి, 1897లో ఐచ్ఛికంగా పదవీ విరమణ చేసి, విశ్రాంతి తీసుకున్నాడు. అదే సంవత్సరం డిసెంబర్‌లో, లండన్‌లోని యూనివర్సిటీ కళాశాల్లో భారతదేశ చరిత్రను బోధించటానికి గౌరవ అధ్యాపకుడిగా నియమింపబడ్డాడు. 1899లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షుడిగా వ్యవహరించాడు. 1875లో ' పెజెంట్రీ ఇన్ బెంగాల్ ' (Peasantry in Bengal) అనేగ్రంథాన్ని, 1885లో ఋగ్వేదాన్ని బెంగాలీలోకి అనువదించాడు. 1890లో ' ఎ హిస్టరీ ఆఫ్ సివిలిజేషన్ ఇన్ ఏన్షియంట్ ఇండియా ' (A History of Civilization in Ancient India) ను, 1897లో ' ఇంగ్లాండ్ మరియు ఇండియా ' (England and India) ను, 1894 - 98 మధ్య కాలంలో మహాభారతాన్ని, రామాయణాన్ని బెంగాలీ లోకి అనువదించాడు. 1902లో ' ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా' మొదటి భాగం (Economic History of India, Vol. I), 1904లో ' ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా ' రెండో భాగం (Economic History of India, Vol. II) ను ప్రచురించాడు. రమేష్‌చంద్ర దత్ బెంగాలీలో 'బంగ బిజేత' 'మాధవి కంకణ్' 'మహారాష్ట్ర జీవన ప్రభాత్', 'రాజపుట్ జీవన్ సంధ్య' అనే చారిత్రక నవలలను, ' సంగసార్ ', ' సమాజ్ ' అను సాంఘిక నవలలను రచించాడు.

దత్ మొదటి చరిత్ర గ్రంథమైన ' ఎ హిస్టరీ ఆఫ్ సివిలిజేషన్ ఇన్ ఏన్షియంట్ ఇండియా ' (A History of Civilization in Ancient India) సంస్కృత సాహిత్యంపై ఆధారపడి, రచించబడింది. ఈ గ్రంథంలో దత్ భారతీయుల బుద్ధి కుశలతను, సాంఘిక వ్యవస్థలను అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు. నివేదిత మాటల్లో, ఈ గ్రంథం భారతీయుల ప్రాచీన ఔన్నత్యాన్ని, భారతీయులకు, ప్రపంచానికి చాటి చెప్పింది. ఈ

BRAOU

గ్రంథ రచనవల్ల రమేష్ చంద్ర దత్ జాతీయవాద చరిత్రకారునిగా కీర్తి, గుర్తింపును పొందాడు. ' ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా ' (Economic History of India), అతనికి సంఘటనలపై గల ఆధిపత్యాన్ని, నిశిత పరిశీలనా దృక్పథాన్ని, లోతైన అవగాహనను తెలియబరుస్తోందని, డా. సునీల్ సేన్ అన్నారు. ఈ గ్రంథ రచనకు మౌలికాధారాలైన అధికార రిపోర్ట్‌లు, పార్లమెంటరీ పేపర్లు సహాయపడ్డాయి. ఇతడు గణాంక వివరాలను విశేషంగా ఇచ్చి, తన ప్రతిపాదనలకు బలాన్ని చేకూర్చాడు. దత్ కృషి ఫలితంగానే, ఆర్థిక చరిత్రకు ఒక ప్రత్యేక ప్రతిపత్తి కలిగింది. ఈ నాటికీ రమేష్ చంద్ర దత్ ' ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా' ప్రధానమైన ఆర్థిక చరిత్ర గ్రంథంగా గుర్తింపబడింది. దత్ ' ఏన్సియంట్ హిస్టరీ ' (Ancient History) రామాయణం, మహాభారతాలు, ఎకనామిక్ హిస్టరీతోపాటుగా, ఆయన బెంగాలీలో రాసిన వ్యాసాలను పరిశీలిస్తే, దత్ సామాజిక చరిత్రకు ప్రాధాన్యమిచ్చాడని, సామాజిక చరిత్ర రచనకు సాహిత్య ఆధారాలపై ఆధారపడ్డాడని చెప్పొచ్చు. దత్ రాసిన ' బంకిం చంద్ర ఓ ఆధునిక బంగేయ సాహిత్య ', ' యున్నాతిర్ యుగ్ ' వ్యాసాలు ఆతని చారిత్రక పరిశీలనా శక్తిని తెలియబరుస్తున్నాయి. చరిత్ర గమనంలో వ్యక్తి నిర్వహించిన పాత్రను గురించి మొదటి వ్యాసంలో రాయగా, రెండో వ్యాసంలో అభివృద్ధిపై అతని నమ్మకాన్ని తెలియబర్చాడు. దత్ మానవ సమాజ అభివృద్ధి ఒక గీతలా కాక, హెచ్చు తగ్గులతో కూడిందని గుర్తిస్తూనే , మానవుడు పురోగమిస్తున్నాడని పేర్కొన్నాడు. సామాజిక చరిత్ర లేకుండా, రాజకీయ చరిత్రకే ప్రాధాన్యమివ్వకూడదని గుర్తించిన వాడై, చరిత్ర గమనానికి ఒక అర్థముందని చెప్పక చెప్పాడు.

జాతీయోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలో, అనేకమంది ప్రసిద్ధ చరిత్రకారులైన రాజేంద్రలాల్ మిత్రా, రాఖాల్ దాస్ బందోపాధ్యాయ, ఆర్.జి. భండార్కర్, డి. ఆర్. భండార్కర్, ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్, రాధాకుముద్ ముఖర్జీ , కాశీ ప్రసాద్ జయస్వాల్ , హేమచంద్ర రాయ్‌చౌదరి, ప్రబోధ్ చంద్ర బాగ్చి, ఘులమ్ హిజదాని మొదలైనవారు, పాశ్చాత్య చారిత్రక రచనా విధానం వల్ల ప్రభావితులై, ప్రాచీన భారతీయ చరిత్ర - సంస్కృతిని సాహిత్య, శాసన , నాణేల, పురావస్తు ఆధారాల సహాయంతో నిర్మించేందుకు, విలువైన కృషిని సల్పారు. అదేవిధంగా, మధ్య యుగానికి చెందిన మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాలపై విశేషమైన చారిత్రక పరిశోధన జరిగింది. అట్టి పరిశోధన చేసిన వారిలో ప్రసిద్ధులు, సర్ జాదునాథ్ సర్కార్, సర్ షఫాత్ అహ్మద్ ఖాన్, డా. బాలకృష్ణ, కె.టి. తెలాంగ్, వి.కె. రాజ్‌వాడే, వి.వి. ఖరే, సీతారామ్ కోహ్లి, కృష్ణమోహన్ జవేరి మొదలైనవారు. ఈపైన పేర్కొన్న వారిలో, జాతీయవాద చరిత్రకారులుగా గుర్తింపబడ్డవారు కె.పి. జయస్వాల్, హెచ్.సి. రాయ్‌చౌదరీలు. వీరితో పాటుగా గుర్తింపబడ్డవారు, కె.ఎ. నీలకంఠశాస్త్రి, ఆర్.సి. మజుందార్‌లు.

BRAOU

### 21.3.1 కె.పి. జయస్వాల్

మొదట కాశీ ప్రసాద్ జయస్వాల్ (1881-1937) కృషి గురించి తెలుసుకుందాం. కాశీప్రసాద్ జయస్వాల్ నివసించిన 57 సంవత్సరాల్లో, భారతదేశ చరిత్రకారుల్లో ఒక అతి ముఖ్యమైన, ప్రధానమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఏ. డిగ్రీ సంపాదించి, అనంతరం బార్ ఎట్‌లా డిగ్రీ సంపాదించాడు. ఆక్స్‌ఫర్డ్‌లోని జీసస్ కళాశాల్లో గౌరవ పరిశోధకుడుగా వ్యవహరించాడు. ఇంగ్లాండ్‌లోని బ్రిటీష్ వ్యతిరేక, విప్లవవాదులతో సంబంధాలున్నప్పటికీ, కె.పి. జయస్వాల్ ప్రత్యక్ష రాజకీయ పోరాటంలో పాల్గొనలేదు. విప్లవవాదన్న అనుమానంతో, ఆంగ్ల ప్రభుత్వం జయస్వాల్‌కు కలకత్తా విశ్వవిద్యాలయంలో, అధ్యాపక పదవిని నిరాకరించింది. ఫలితంగా, 1911లో కలకత్తా హైకోర్ట్‌లో న్యాయవాదిగా చేరాడు. కాని, కలకత్తా హైకోర్ట్ నుండి పాట్నా హైకోర్ట్‌కు మారాడు. న్యాయవాదిగా ఉంటూనే, జయస్వాల్ తన దృష్టిని భారతీయుల్లో గత ఔన్నత్యాన్ని గూర్చి చైతన్యాన్ని పెంపొందింపజేయటంపై కేంద్రీకరించి, భారతీయ ప్రాచీన వారసత్వం గురించి

విద్యాధికులైన భారతీయులు గర్వించే విధంగా, భారత సంస్కృతి ఔన్నత్యాన్ని వెలికితీయటానికి పూనుకొన్నాడు. అందుకుగాను, 1914లో బీహార్, ఒరిస్సా పరిశోధనా సంస్థను స్థాపించి, అదే పేరుతో ఒక పరిశోధనా జర్నల్‌ను 1915లో ప్రచురించాడు. అనేక సంవత్సరాలు ఆ పత్రికకు సంపాదకుడుగా వ్యవహరించాడు. పాట్నా మ్యూజియం స్థాపనలో కూడా, కీలక పాత్రను నిర్వహించాడు.

1913లో మోడరన్ రెవ్యూలో ప్రచురించబడ్డ, 'ఏన్ ఇంట్రడక్షన్ టు హిందూ పాలిటీ ' (An Introduction to Hindu Polity) అన్న వ్యాసంతో, చరిత్రకారుడిగా గుర్తింపు పొందాడు. ఆ వ్యాసాలన్నీ, ' హిందూ పాలిటి' (Hindu Polity) అనే పుస్తక రూపంలో, 1924లో ప్రచురించబడ్డాయి. 1911 - 13 మధ్యకాలంలో ప్రాచీన హిందూ న్యాయశాస్త్రం గురించి వరసగా వ్యాస పరంపరను ' కలకత్తా వీక్లీ నోట్స్' (Calcutta Weekly Notes) నందు ప్రచురించాడు. ఫలితంగా, కలకత్తా విశ్వవిద్యాలయం జయస్వాల్‌ను మను, యాజ్ఞవల్క్యులపై ఉపన్యాసమివ్వాల్సిందిగా ఆహ్వానించింది. 1919లో జయస్వాల్ తన ప్రసంగాలను కలకత్తా విశ్వవిద్యాలయంలో చేశాడు. జర్నల్ ఆఫ్ బీహార్ రిసెర్చ్ సొసైటీలో, అనేక విషయాలపై వ్యాసాలను ప్రచురించాడు. క్రీ.శ. 150 నుండి క్రీ.శ. 350 వరకు జరిగిన చరిత్రను, ' హిస్టరీ ఆఫ్ ఇండియా ' (History of India) అన్న పేరుతో ప్రకటించాడు. ఈ కాలానికి, నాగ, వాకాటక , ఇంపీరియల్ యుగమని పేరు పెట్టాడు. కొందరు ఈ కాలాన్ని చీకటి యుగమంటే, జయస్వాల్ పురాణ, శాసన, నాణేల సహాయంతో పునర్నిర్మించి, ఈ కాలం విదేశీయుల పాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమం జరిగిన కాలమని, భారత రాజకీయ, సాంస్కృతిక చరిత్రలో దేదీప్యమానంగా వెలిగిన కాలమని అన్నాడు.

భారతీయ శాసనాల అధ్యయనానికి కూడా, జయస్వాల్ విలువైన సేవ చేశాడు. అశోకుని శాసనాలపై, ఖారవేలుని హాతిగుంఫా శాసనంపై, భువనేశ్వర్ దేవాలయంలోని రాగి శాసనాలపై, ఇంకా అనేక ఇతర విషయాలపై, వ్యాసాలను ప్రచురించాడు. భారతీయ నాణేల శాస్త్ర అధ్యయనానికి కూడా, విలువైన సేవ చేశాడు. అంతేకాక, ఇంతవరకు ప్రచురింపబడని కొత్త గ్రంథానికి సంపాదకత్వాన్ని వహించి ప్రచురించాడు. అటువంటి వాటిలో పేర్కోదగ్గవి, చండేశ్వరుని ' రాజనీతి రత్నాకర ', కౌటిల్యుని ' అర్థశాస్త్రం' పై భట్టస్వామి వ్యాఖ్యానం, మాత్రిచేత 'అభ్యర్థాష్టక ', ఆచార్య నాగార్జునుని ' విగ్రహ వ్యావర్తిని ' యేకాక, టిబెటన్ భాషకు చెందిన ' మంజుశ్రీ మూలకల్ప ' ను రాహుల్ సాంకృత్యాయన్‌తో కలిసి, సంపాదకత్వం చేసి, ప్రచురించాడు. లేసన్ రచించిన ' హిస్టరీ ఆఫ్ ఇండియన్ కామర్స్ ' (History of Indian Commerce) ను అనువాదం చేసి, ప్రకటించాడు.

జయస్వాల్ చరిత్ర రచనలో ఉపయోగించిన విధానం, ఒక న్యాయవాది అవలంబించే విధానమని, డా . బి.పి. సిన్హా అభిప్రాయపడ్డాడు. జయస్వాల్ కొన్ని ముఖ్య ప్రశ్నలు వేసి, ఆ ప్రశ్నలకు సమాధానాలు చెపుతూ, తన పద్ధతిని రుజువు చేయటానికి సాక్ష్యాధారాలను పటిష్టంగా చూపించే పద్ధతిని ఉపయోగించాడు. జయస్వాల్ చరిత్రను గురించిన తన అభిప్రాయాలను తెలుపలేదు. కాని, గాఢమైన అభిమానంకల జాతీయవాది. సమకాలీన పాశ్చాత్య పాలననే కాక, గతంలోని విదేశీయ పాలనను తీవ్రంగా వ్యతిరేకించిన జయస్వాల్ , పాశ్చాత్యులు గర్వంగా చెప్పుకొనే పరిమిత రాజరికం, గణతంత్ర రాజ్య వ్యవస్థలు ప్రాచీన భారతీయులకు తెలుసునని, గణతంత్ర వ్యవస్థ, వైదిక యుగ అనంతర భారతదేశంలో ఉందని, ' హిందూ పాలిటీ '(Hindu Polity) గ్రంథంలో రుజువు చేశాడు. అంతేగాక, ఆనాటి గణతంత్ర రాజ్యాలు గ్రీక్ నగర రాజ్యాలకన్నా బలమైనవి, పెద్దవని కూడా, సగర్వంగా చెప్పాడు. ఇంకా, వైదిక యుగం నుండి భారతీయ రాచరిక వ్యవస్థ పరిమితమైందే కాని, పాశ్చాత్యులు ప్రచారం చేసినట్లుగా నియంతృత్వం కాదన్నాడు. అదేవిధంగా, విశాలమైన రాజ్యాలు, ప్రాతినిధ్య సభలు, బలమైన మంత్రి మండలి, కార్యనిర్వహణాధికారంపై చట్టం ఆధిక్యత, ప్రాచీన భారతదేశంలో

BRAOU

ఉన్నాయన్నాడు. ఈవిధమైన చారిత్రక విధానం ద్వారా, జయస్వాల్ గాఢమైన జాతీయవాద దృక్పథాన్ని పెంపు చేయటంలోనూ, భారతీయుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపచేయటం లోనూ, విదేశీయుల విమర్శను ఎదుర్కోటంలో విజయాన్ని పొందాడనటంలో అతిశయోక్తి ఏమీ లేదు.

### 21.3.2 హేమచంద్ర రాయ్‌చౌదరి

ప్రాచీన భారతదేశ చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చి , పరిపుష్టం చేసిన ప్రముఖ బెంగాలీ చరిత్రకారులైన రాజేంద్రలాల్ మిత్రా, మహా మహోపాధ్యాయ హరప్రసాద్ శాస్త్రి, అక్షయ్ కుమార్ మైత్రా, రాఖాల్‌దాస్ బెనర్జీ, రాధాకుముద్ ముఖర్జీ, ఆర్.పి. చాందా సరసన నిలువతగ్గ సుప్రసిద్ధ చరిత్రకారుడు, హేమచంద్ర రాయ్‌చౌదరి. రాయ్‌చౌదరి విద్యాధికుల కుటుంబమైన వైద్యా కుటుంబంలో, 1892లో జన్మించాడు. 1911లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఆనర్స్ డిగ్రీని మొదటి తరగతిలో సంపాదించాడు. 1913లో ఎమ్.ఎ. హిస్టరీ శాఖలో మొదటి తరగతిలో ఉత్తీర్ణులైన వారిలో మొదటివాడు. బంగబాసి కళాశాలల్లోను, ప్రెసిడెన్సీ కళాశాలల్లోనూ, చరిత్ర అధ్యాపకుడిగా పనిచేసి, కలకత్తా విశ్వవిద్యాలయంలోని ప్రాచీన భారత చరిత్ర - సంస్కృతి శాఖలో అధ్యాపకుడిగా నియమింపబడి, 1921లో తన సిద్ధాంత వ్యాసానికి పి.హెచ్.డి. పట్టాను పొందాడు. 1918 నుండి 1952 వరకు కలకత్తా విశ్వవిద్యాలయంలో పనిచేసి, ఆచార్యుడిగా పదవీ విరమణ చేశాడు. హైద్రాబాద్‌లో జరిగిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సభలో మొదటి విభాగానికి అధ్యక్షుడిగాను, నాగపూర్‌లో జరిగిన 13వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సభకు జనరల్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించాడు.

రాయ్‌చౌదరి ప్రాచీన భారతీయ చరిత్రలోని వివిధ శాఖలైన రాజకీయ, మత, చారిత్రక, భౌగోళిక శాస్త్రాలపైన అనేక గ్రంథాలు, వ్యాసాలను ప్రచురించాడు. అతని చరిత్ర రచనల్లో ప్రధానమైనవి : (1) ' ది పొలిటికల్ హిస్టరీ ఆఫ్ ఏన్సియంట్ ఇండియా ఫ్రం ది యాక్సెషన్ ఆఫ్ పరీక్షిత్ టు ది ఎక్స్‌టిన్క్షన్ ఆఫ్ ది గుప్తా ఎంపైర్ ' (The Political History of Ancient India From the Accession of Parikshit to the extinction of the Gupta Empire) (1923); (2) ' స్టడీస్ ఇన్ ఇండియన్ యాంటిక్విటీస్ ' (Studies in Indian Antiquities) ; (3) ' మెటీరియల్స్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఎర్లీ హిస్టరీ ఆఫ్ వైష్ణవ సెక్ట్' (Materials for the study of Earl History of Vaishnava Sect) (1936). ఈ గ్రంథాలే గాక, ఆర్.సి. మంజుదార్, కె.కె. దత్తాలతో కలసి, ' యాన్ అడ్వాన్స్‌డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా ' (An Advanced History of India) అనే రచననూ వెలువరించాడు. ఇవి గాక, ' ఏ నోట్ ఆన్ లేటర్ గుప్తాస్ ' (A Note on Later Guptas), ' ది డిక్లైన్ ఆఫ్ ఎర్లీ గుప్తా ఎంపైర్ ' (The Decline of the Early Gupta Empire), ' ది లక్ష్మణ సేన ఈరా' (The Lakshmana Sena Era) అనే వ్యాసాలను, ఆర్.సి. మజుందార్ సంపాదకత్వం లో తయారైన ' ది హిస్టరీ ఆఫ్ బెంగాల్ ' (The History of Bengal) మొదటి సంపుటంలో, మూడు విలువైన వ్యాసాలను రచించాడు. కె.ఏ. నీలకంఠ శాస్త్రి సంపాదకత్వంలో వెలువడ్డ ' ది ఏజ్ ఆఫ్ ది నందాస్ అండ్ మౌర్యాస్ ' (The Age of the Nandas and Mauryas) అనే గ్రంథంలో రెండు అధ్యాయాలను రాశాడు.

రాయ్‌చౌదరి చారిత్రక రచనా విధానం ఆధునికమైంది. అతడే విషయాన్ని నమ్మక, ప్రతి అంశాన్ని పరిశీలించి, పరిశోధించి, అన్ని ఆధారాలను సూక్ష్మంగా అధ్యయనం చేసి, నిర్ణయాలకు వచ్చేవాడు. కనుకనే, ఏ.ఎల్. భాషాం రాయ్‌చౌదరిని '' డ్రై ట్రూత్ '' (Dry truth) కి ప్రాధాన్యమిచ్చిన సర్ ఆర్.జి. భండార్కర్ కోవకి చెందిన వాడని పేర్కొన్నాడు. రాయ్‌చౌదరి ప్రత్యక్షంగా తీవ్రమైన, గాఢమైన జాతీయవాద చరిత్రకారుడు కాకపోయినా, పరోక్షంగా, హిందూ యుగపు ఔన్నత్యాన్ని వెలికి తీయడంలో, ఎంతో కృషిసల్పాడని చెప్పక తప్పదు.

BRAOU

### 21.3.3 కె.ఏ. నీలకంఠ శాస్త్రి

ఇక కె.ఏ. నీలకంఠ శాస్త్రి విషయానికి వస్తే, దక్షిణ భారతదేశ చరిత్ర - సంస్కృతిని ప్రధానాంశంగా అధ్యయనం చేసిన ఈతడు, పల్లవులు, చోళుల కాలంలో గ్రామ, జిల్లా స్థాయిల్లో స్వయంపాలనా వ్యవస్థలు, సమర్థవంతంగా పని చేసేవని, శాసనాధారాల సహాయంతో నిరూపించాడు. ఇతని పరిశోధనల వల్ల, స్వయం పాలన మనకు ప్రాచీన కాలం నుండి తెలుసునని, అది బ్రిటీష్ వారు మనకిచ్చిన వరం కాదని స్పష్టమౌతుంది. ఈ పరిశోధనాంశం, బ్రిటీష్, తదితర పాశ్చాత్య చరిత్రకారులు ప్రతిపాదించిన ' ఓరియంటల్ డెస్పాటిజమ్ ' (Oriental Despotism) సిద్ధాంతాన్ని తిప్పికొట్టింది. నీలకంఠ శాస్త్రి కూడా, హిందూ ఔన్నత్యాన్ని ప్రశంశిస్తూ, హిందువులు మహమ్మదీయుల కన్నా ఎక్కువ సహనశీలురని పేర్కొన్నాడు. అదేవిధంగా, ఆర్. గోపాలాచారి తన పరిశోధనల ఫలితంగా, విదేశీయులైన వ్యక్తులకు మన దేశంలో శాశ్వత రాజకీయ స్థానం లేకుండా చేయడంలో, శాతవాహనులు విజయాన్ని సాధించారని పొగిడాడు.

### 21.3.4. ఆర్.సి. మజుందార్

1888-1980 మధ్య కాలంలో జీవించి, చరిత్ర రచన చేసిన రమేష్‌చంద్ర మజుందార్ కూడా, గాఢమైన జాతీయవాద స్ఫూర్తి కల చరిత్రకారుడే. ఈయన సంపాదకత్వంలో భారతీయ విద్యాభవన్ సారథ్యంలో ప్రచురించబడ్డ ' భారతీయ చరిత్ర - సంస్కృతి సంపుటాల' లో, హిందూ ఆధిక్యత కల కాలానికి ఎక్కువ అధ్యాయాలు కేటాయించి, మహమ్మదీయ పాలనా కాలానికి తక్కువ స్థలం కేటాయించటం, మజుందార్ జాతీయ దృక్పథాన్ని తెలియజేస్తుంది. అయితే, బెంగాల్‌కు చెందిన మరో ప్రసిద్ధ చరిత్రకారుడు సర్ జాదునాథ్ సర్కార్, బ్రిటిష్ పాలన వల్ల, భారతీయులకు మేలు కలిగిందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

## 21.4. ముగింపు

బ్రిటీష్ వలస పాలనకు, సామ్రాజ్యవాద విధానానికి వ్యతిరేకంగా, జాతీయ స్థాయిలోనే గాక, వివిధ ప్రాంతాల్లో జాతీయోద్యమ ప్రభావం చేత, జాతీయవాద దృక్పథంతో చరిత్ర పరిశీలన, పరిశోధన, రచన చేపట్టబడింది. ఈ స్ఫూర్తి ప్రధానంగా, బెంగాల్, మహారాష్ట్ర, అస్సాం, పంజాబ్ మొదలైన ప్రాంతాల్లో కన్పించింది. 1985లో శాంతినికేతన్‌లో తారాశంకర్ బెనర్జీ సారథ్యంలో, ' హిస్టోరియోగ్రఫీ ఇన్ మోడరన్ ఇండియన్ లాంగ్వేజెస్ ' 1800 - 1947 (Historiography in Modern Indian Languages, 1800 - 1947) అనే అంశంపై, ఒక జాతీయ సదస్సు జరిగింది. ఆ జాతీయ సదస్సులో అస్సాం, బెంగాల్, గుజరాత్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర పంజాబ్ ప్రాంతాల గూర్చి , హిందీ భాషలో వెలువడ్డ చరిత్ర రచనల గురించి, వ్యాస ప్రసంగాలను చేశాడు. ఆ సదస్సులో అధ్యక్షోపన్యాసం చేసిన ప్రముఖ చరిత్రకారుడు, నిహార్ రంజన్ రే తన ప్రసంగంలో, మరో ప్రముఖ చరిత్రకారుడైన షేక్ అలీ అభిప్రాయాన్ని ప్రకటించాడు. షేక్ అలీ మాటల్లో, ' జాతీయోద్యమ కాలంలో పాశ్చాత్య విమర్శలకు వ్యతిరేకంగా, భారతీయ చరిత్రకారులు తమ పరిశోధనల ద్వారా, గత ఔన్నత్యాన్ని, వైభవాన్ని వెలికితీశారు. పాశ్చాత్యుల సవాళ్లను తమ పరిశోధనా నైపుణ్యంతో ఎదుర్కొని, విమర్శలను ఖండించి, భారతీయుల్లో జాతీయ స్ఫూర్తిని కల్గించి, ఆత్మాభిమానాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించారు.' కాని, ఈ ధోరణి ఫలితంగా, భారతీయుల చరిత్ర రచనలో ' ఆత్మాశ్రయత్వం' (Subjectivity) చోటు చేసుకుని, చరిత్రను రాజకీయ లక్ష్య సాధనంగా వాడుకునే పద్ధతికి, మార్గం సుగమమైంది.

BRAOU

సుబోధ్ కుమార్ ముఖోపాధ్యాయ 'ఎవల్యూషన్ ఆఫ్ హిస్టోరియోగ్రఫీ ఇన్ బెంగాల్ (1800 - 1947) - 'ఏ స్టడీ ఆఫ్ ది పేటర్న్ ఆఫ్ గ్రోత్' (Evolution of Historiography in Bengal (1800 - 1947) - A Study of the Pattern of Growth) అనే వ్యాసంలో, బెంగాలీ చరిత్ర రచనా విధానంలో, మూడు దశలను గుర్తించాడు. అవి - 1800 - 1875 నాటి మొదటి దశ ; 1875 - 1905 మధ్య కాలంనాటి రెండో దశ ; 1905 - 1947 నాటి మూడో దశ. మొదటి దశలో ఆరాధించటం జరగ్గా, రెండో దశలో శాస్త్రీయ దృక్పథంతో పరిశీలన, పరిశోధన, ఇక మూడో దశలో పరిణతి చెందిన చరిత్ర రచనలు వెలువడ్డాయి. 1860లో కేథార్‌నాథ్ దత్తా తన గ్రంథానికి రాసిన ముందు మాటలో, తనది భారతదేశ చరిత్రపై వెలువడ్డ మొదటి మౌలిక గ్రంథమన్నాడు. రెండో దశలో, బెంగాల్‌లోని చరిత్రకారులు పాశ్చాత్య చరిత్ర రచనా విధానాన్ని అవగాహన చేసుకుని, శాస్త్రీయ పరిశీలనా దృక్పథంతో విమర్శనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా రచనలను చేశారు. ఈ దశలోనే, చరిత్ర రచనపై జాతీయోద్యమ ప్రభావాన్ని ప్రస్ఫుటంగా చూడగలం. సుబోధ్‌కుమార్ ముఖోపాధ్యాయ మాటల్లో, భారత జాతీయోద్యమం, చరిత్ర రచన, ఒకదాని కొకటి పరస్పర సహాయకారులైనట్లు చెప్పాలి. జాతీయోద్యమం తీవ్రతరమైన కొద్దీ, భారతీయ చరిత్రకారులు గతాన్ని, ముఖ్యంగా ప్రాచీన కాలాన్ని, లేదా మిల్ చెప్పిన హిందూ యుగాన్ని ఒక ఆదర్శపూర్వకమైన, వైభవోపేత, గర్వించదగ్గ కాలంగా విశ్వసిస్తూ చరిత్ర రచన చేశారు. ఇంతకుముందే మనం చెప్పుకున్నట్లు, ఇది సహజ పరిణామమే. అయితే, 19 శతాబ్ది బ్రిటీష్ చరిత్రకారులు రాసిన దాన్నే నమ్మి, ఆ ధోరణిలోనే రచనలను చేశారు. ఉదాహరణకు, ఛార్లెస్ స్టీవర్ట్ అనే ఆంగ్ల చరిత్రకారుడు విదేశీయులైన పాలకులు మారి, అరాచకాన్ని బ్రిటీష్ వారు తొలగించినందుకు, హిందువులు ఆనందించాలన్నాడు. ఈ విషయం బెంగాలీ హిందువులకే కాక, హిందువులందరికీ ఎంతో ఆనందాన్ని కల్గించింది. కనుకనే, తొలి బెంగాలీ చరిత్ర గ్రంథాల్లో, మహమ్మదీయ పాలన నిరంకుశమైంది, దోపిడితో కూడుకుందని రాయబడింది. అంతటితో ఆగక, మహమ్మదీయుల రాకకు పూర్వం హిందూ యుగం స్వర్ణయుగమనే భావన బలంగా చోటు చేసుకుంది. దీనికి కూడా, బ్రిటీష్ రచయితలే పునాది వేశారు. ఈ విధంగా, హిందూ పునరుద్ధరణ వాదన జాతీయోద్యమ కాలంలో, హిందూ, మహమ్మదీయ విభజనకు దారితీసిందనే భావనకు దారితీసింది. బంకిం చంద్ర ఛటర్జీ 'బంగ దర్శన్' లో, భారతీయులను తమ చరిత్రను అవగాహన చేసుకుని, తద్వారా, దేశ సేవ చేయండని ఉద్బోధించాడు. ఈ విధమైన రచనల ఫలితంగా, చరిత్రనేది ఒక శాస్త్రమనే భావం కాక, లక్ష్య సాధనకు ఒక మార్గమనే అభిప్రాయం బలపడింది. చరిత్ర రచన ద్వారా భారతీయుల్లో జాతి గౌరవం, ఐకమత్యాన్ని పెంచాలనేది ఆరంభమైంది. ఈ విధంగా, జాతి అంటే హిందువులు, ఐకమత్యమంటే హిందువుల్లో ఐకమత్యమనే భావన బలపడింది. ఈ సందర్భంలో, బెర్ట్రండ్ రస్సెల్ చేసిన వ్యాఖ్యను మనం గుర్తుకు తెచ్చుకోటం అసందర్భం కాదు. అదేమంటే, బ్రిటీష్ చరిత్ర గ్రంథాల్లో ఒకప్పుడు ఫ్రెంచ్ వారు దుర్మార్గులని రాసి, తర్వాత జర్మన్లు దుర్మార్గులని రాయటమారంభించారు. అందుచేత, ప్రతి దేశంలోను చరిత్రను తమ జాతీయ అవసరాల దృష్ట్యా, రాస్తూ వచ్చారు. అదేవిధంగా, మన దేశంలోనూ స్వాతంత్ర్యానికి పూర్వమే జరిగింది. జాతీయోద్యమ చరిత్ర రచనా పద్ధతిపై వ్యాఖ్యానిస్తూ, ఆర్.సి. మజుందార్, స్థూలంగా పరిశీలిస్తే, మొదట్లో భారతీయ జాతీయవాద రచనా పద్ధతి బ్రిటీష్ వారి ధోరణికి సమాధానమైతే, మేలుకొన్న భారతీయ చైతన్యంతో బలాన్ని పుంజుకుంది. కొంతకాలం తర్వాత జాతీయోద్యమం వేగవంతం కావడంతో, దేశమంతటా రాజకీయ హక్కుల కొరకు ఉద్యమం ఆరంభం కావటంతో, మరింత స్ఫూర్తిని, ఉత్తేజాన్ని పొందింది.' బ్రిటీష్ చరిత్రకారులు హిందువుల ఔన్నత్యాన్ని, ఘనతను, కావాలని తక్కువగా రాశారని, భారతీయ సంస్కృతిని చిన్న చూపు చూశారని, హైందవ సమాజంలోని లోపాలను, లొసుగులను మాత్రమే పెద్దవిగా చేసి చూపించి విమర్శించారని, ఐరోపీయ సంస్కృతీ ఔన్నత్యం గొప్పదని, చెవిలో బాకాపెట్టి ఊదారని మజుందార్ పేర్కొన్నాడు. ఈ ధోరణికి సమాధానమే, జాతీయవాద చరిత్ర రచనా విధానం. ఈపైన పేర్కొన్న విధంగా,

BRAOU

1947కు పూర్వం బ్రిటీష్ వారి అనుకూల, ప్రతికూల ప్రశంస , విమర్శలకు సమాధానంగానే, విద్యాధికులైన, పాశ్చ్యాత్య విద్యా ప్రభావితులైన చరిత్రకారులు, పాశ్చ్యాత్య చరిత్ర రచనా ధోరణికి ప్రభావితులై, జాతీయవాద చరిత్ర రచనా పద్ధతిని మార్గంగా చేసుకుని, తమ లక్ష్యమైన జాతీయ చైతన్యాన్ని పెంపొందించటానికి పూనుకున్నారు.

పైన పేర్కొన్న జాతీయవాద చరిత్ర రచనా ధోరణి విలువను అంచనా వేస్తే, తాత్కాలికంగా ఆనాడు జాతీయ చైతన్యాన్ని పెంపొందింప జేయటంలో విజయాన్ని సాధించినా , దూరదృష్టితో పరిశీలిస్తే, కొన్ని అవాంఛనీయ ధోరణులకు కారణమైందేమోనన్పిస్తుంది. చరిత్ర రచనల మతతత్వ వైఖరి పెరగడానికి ఒక విధంగా, జాతీయవాద చరిత్రకారులు ప్రేరేపించిన ధోరణి కారణమని చెప్పొచ్చు. దాని ప్రభావాన్ని ఈ నాటికీ మనం కళ్లారా చూస్తూనే ఉన్నాం. బహుళ సంస్కృతికి నిలయమైన మన దేశం లాంటి దేశంలో, నిజమైన జాతీయతా భావం పెరగకపోవటానికి, జాతీయోద్యమ కాలంలో లాగే, మనం ఇంకా జాతి నిర్మాణం (Nation in the making) లోనే ఉండటానికి, ఈ ధోరణే కారణమేమో ఆలోచించాలి. అంతేగాక, హిందూ, మహమ్మదీయ విభజనకు ఆంగ్లేయులు వేసిన బాటను, మనం మనకు తెలియకుండా అంగీకరించి, వారి కుతంత్రం నుండి ఇంకా తేరుకోకపోవటానికి ఈ ధోరణే కారణమా ? అనేదాన్ని, భవిష్యత్తు మాత్రమే నిర్ధారించాలి.

## 21.5 సంగ్రహంగా

జాతీయోద్యమ స్ఫూర్తి పొందిన చరిత్రకారుల్లో, రాఖాల్‌దాస్ బందోపాధ్యాయ, హెచ్. సి. రాయ్ చౌదరి, కె.పి. జయస్వాల్, కె.ఏ.ఎన్.శాస్త్రి, ఆర్.సి. మజుందార్ , ఎస్.కె. అయ్యంగార్, ఆర్.కె. ముఖర్జీ, హెచ్. సి. ఓజా మొదలైనవారు తమ రచనలందించారు. వీరంతా, రాజకీయ, వంశ చరిత్రలపైనే దృష్టిని కేంద్రీకరించారు. అయినా, చారిత్రక వివరణలో కొన్ని దోషాలు చోటు చేసుకున్నాయి. జాతీయోద్యమ ప్రభావ ఫలితంగా, చరిత్ర రచనలో మతతత్వం పెరిగింది. అయితే, ఉప జాతీయవాదం (Sub - nationalism) అభివృద్ధిచెందటంతో, ప్రాంతీయ, స్థానిక చరిత్రల్లో ఆసక్తి పెరిగింది.

BRAOU

## 21.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలివ్వండి.

1. భారతీయ చరిత్ర రచనాభివృద్ధిలో జాతీయవాద ధోరణిని సమీక్షించండి.

2. జాతీయవాద చరిత్ర రచనా ధోరణి మంచీ, చెడులను, విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. సంఘ సంస్కర్తలైన రాజారామ్‌మోహన్ రాయ్, ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్‌వంటి వారు ఏవిధంగా జాతీయ చైతన్యాన్ని పెంపొందించారో వివరించండి.

2. కె.పి. జయస్వాల్ రచనా స్ఫూర్తిని వివరించండి.

3. హెచ్. సి. రాయ్‌చౌదరి, కె.ఏ. నీలకంఠ శాస్త్రిలు జాతీయవాద చరిత్ర రచన కందించిన సేవలను సమీక్షించండి.

## 21.7 ఉపయుక్త గ్రంథాలు


| | |
|---|---|
| Ali B. Sheik | **History Its Theory And Method,** Mac millian, Madras, 1973. |
| Chandra, Bipin | **Nationalism And Colonialism In Modern India,** Orient Longman Ltd, N. Delhi, 1979. |
| Golwalkar, M.S. | **We or Our Nationanhood Defined,** Nagpur, 1947. |
| Hasan, Mushirul | **Nationalism and Communal Politics in India, 1916 - 1928,** N. Delhi, 1979. |
| Majumdar, R.C. | **Historiography in Modern India,** Asia pubshing House, Bombay, 1970. |
| Philips, G.H. | **Historians of India, Pakistan and Ceylon,** Oxford, New York, 1961. |
| Sen, S.P., (Ed) | **Historians and Historiography in Modern India,** Institute of Historical Studies, Calcutta, 1973. |
| Warder, A.E. | **An Introduction to Indian Historiography.** |


రచయిత : డా. జె. దుర్గా ప్రసాద్

BRAOU

# భాగం - 22 : భారతదేశం:మతతత్వ చరిత్ర రచనాభివృద్ధి

విషయక్రమం


22.0 లక్ష్యాలు

22.1 పరిచయం

22.2 మతతత్వం - నిర్వచనం, వివరణ

22.3 మతతత్వ దృక్పథం - చరిత్ర వ్యాఖ్యానం

22.4 ఆధునిక భారతంలో మతతత్వవాద మూడు రూపాలు

22.4.1 మతతత్వ జాతీయవాదం

22.4.2 ఉదార మతతత్వవాదం

22.4.3 అతివాద (ఫాసిస్ట్) మతతత్వం

22.5 భారతదేశ మతతత్వ చరిత్ర ధోరణికి పునాది

22.6 జాతీయోద్యమ స్ఫూర్తి - మతతత్వ చారిత్రక వ్యాఖ్యానం

22.7 ప్రాచీన భారత చరిత్ర - మతతత్వ వ్యాఖ్యానం - అపసవ్యాలు

22.8 మధ్య యుగ భారతదేశ చరిత్ర - మతతత్వ వ్యాఖ్యానం - అపసవ్యాలు

22.9 1947కు ముందు - ఆ తర్వాత అపసవ్యాలు

22.10 లౌకిక, శాస్త్రీయ చరిత్ర రచన - మతతత్వవాదుల ప్రతిఘటన

22.11 సంగ్రహంగా

22.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

22.13 ఉపయుక్త గ్రంథాలు


## 22.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వల్ల మీరు, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

▲ మతతత్వమంటే ఏమిటో పేర్కొని, మతతత్వ దృక్పథం చరిత్ర వ్యాఖ్యానాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో వివరించగలగాలి.

▲ జేమ్స్ మిల్ చేసిన భారత చరిత్ర దశల విభజన, మతతత్వ చరిత్ర ధోరణికి ఎలా పునాది వేసిందో వివరించి, దాని ప్రభావం చరిత్ర రచయితలపై ఎంతగా ఉందో విశ్లేషించగలగాలి.

BRAOU

▲ జాతీయోద్యమం, మతతత్వ చారిత్రక ధోరణికి ఎంతగా దోహదం చేసిందో వివరించగలగాలి.

▲ భారతదేశ చరిత్ర రచనల్లో, ప్రాచీన , మధ్య యుగ, ఆధునిక దశల్లో సాగిన మతతత్వ వ్యాఖ్యానాల్లోని అపసవ్యాలను పేర్కొనగలగాలి.

▲ లౌకిక, శాస్త్రీయ చరిత్ర రచయితలను మతతత్వవాదులు ఈనాడు ఎలా ప్రతిఘటిస్తున్నారో విశ్లేషించగలగాలి.

## 22.1 పరిచయం

మతతత్వవాదం నేడు భారతదేశంలో తారాస్థాయికి చేరుకుందనుకున్నా, యిది ఆందోళన చెందేంత తీవ్ర స్థాయిలో లేదనే చెప్పాలి. మన ఆందోళనే దీనికి ఆ స్థాయిని ఆపాదిస్తున్నది. మతతత్వవాదం అనే దాన్ని, అన్నీ యిముడ్చుకున్న సమగ్ర పదంగా, వాడడం జరుగుతున్నది. అయితే, మతతత్వం అని వర్ణిస్తున్న దానిలో, నిజానికి అన్ని విషయాలు, లేదా ఏదో ఒకటి మాత్రమే మతతత్వానికి సంబంధించింది కాదు. ఏ సంఘటనకు, లేదా పరిస్థితికైనా మతతత్వవాదాన్ని కల్పించి చూడడంతో, దానికి మతతత్వ రంగు కన్పిస్తుంది. ఆర్థిక దురవస్థల వలన ఉద్రిక్తతలు ఉత్పన్నమైనా, ఊహాజనితమైన మతతత్వం, సంఘటనల స్వరూపాన్ని మార్చి చిత్రించేలా చేస్తుంది. గత చరిత్ర వర్తమానం దృష్ట్యా, అలా ప్రభావితమై చిత్రింపబడిందే.

## 22.2 మతతత్వం - నిర్వచనం, వివరణ

BRAOU

మతతత్వం అనే పదానికి పలువురు పలు రకాలుగా అర్థాన్ని, లేదా నిర్వచనాన్ని సూచిస్తున్నారు. వీటిలో, 'ఒక సిద్ధాంతం ', 'ఒక కుహనా చైతన్యం ' 'అరుదైన వనరుల కోసం పోరాటం ', 'ఉద్యోగాలకై పోటీ' , 'అధికార వర్గాల రాజకీయ పరికరం ' మొదలైనవి ఉన్నాయి. డబ్ల్యు. సి. స్మిత్ మతతత్వాన్ని ' ప్రతి జాతికి చెందిన సాంఘిక, రాజకీయ, ఆర్థిక సమూహాల మధ్య తేడాలను, వైరుధ్యాలను నొక్కి చెప్పే సిద్ధాంత' మని నిర్వచించాడు. సామాజిక చైతన్యంలో మతం ఒక అంతర్గత కారకం. తన ఉనికిని, సంస్కారాన్ని, తాను ఏ మతానికి చెందితే, ఆ మతం, ఆ మతానికి చెందిన జన సమూహం సంపూర్ణంగా నిర్ణయిస్తుందనే చైతన్యాన్ని ఒక మనిషి కలిగి వుండడమే మతతత్వమని, మతతత్వాన్ని సాధ్యమైనంత సరళంగా, సూటిగా నిర్వచించొచ్చు. అయితే, లౌకిక తత్వానికి విరుద్ధంగా మత తత్వాన్ని అర్థం చేసుకుంటే, యీ నిర్వచనమొస్తుంది. ఒక వర్గానికి చెందిన ప్రజలు ప్రత్యేకంగా ఒక మతాన్ని అనుసరిస్తారు. ఈ కారణంగా, వారికి, అంటే ఆ వర్గం ప్రజలకు, ఉమ్మడి సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి, లేదా ఏర్పడతాయి. తమ ఉనికి, సంస్కారం, యీ ఉమ్మడి ప్రయోజనాలను ఆ మతం, ఆ మతానికి చెందిన వర్గమే పూర్తిగా నిర్ణయిస్తుందనే భావనను, వేరే మతానికి చెందిన వారిని తమకు వ్యతిరేకులుగా గుర్తించే ఆలోచనా విధానం నుండి వేరు చేయలేం. భారతదేశంలోని హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, తదితర వివిధ మతాలకు చెందిన వారిపై యీ ప్రభావాన్ని లేదనలేం. కానీ, ముఖ్యంగా హిందువులకు, ముస్లింలకు యీ నిర్వచనం వర్తిస్తుంది.

కుమారేశ్ చక్రవర్తి చెప్పినట్లు, మత ఘర్షణలు కానీ, అక్కడక్కడ జరుగుతున్న ఇతర హింసాత్మక సంఘటనలు కానీ, ఈ భావజాలం నుండి పుట్టినవే. ఈ ఘర్షణలే, మతతత్వం మరింత పాతుకుపోడానికి తోడ్పడతాయి. మతతత్వం ఒక సమగ్ర సిద్ధాంతంగా పరిణతి చెందడానికి, ఈ సంఘనటలు దోహదం చేస్తాయనే మాట నిజమైనప్పటికీ, ప్రతిసారీ ఇలాగే జరుగుతుందని చెప్పలేం. మతతత్వ భావజాలానికి బహుళంగా ప్రచారం యిచ్చి కూడా, మతతత్వ చైతన్యాన్ని ప్రజల్లో పెంచొచ్చు.

ఏ మతానికైనా విశ్వాసం ముఖ్యం. కొన్ని మతాల్లో విశ్వాసానికి తోడు విగ్రహాలను, చిహ్నాలను,

ఆచారాలను, యజ్ఞయాగాదుల వంటి కర్మకాండలు ఇమిడి ఉంటాయి. బహు భాషా సమాజమైన మన దేశంలో, ప్రాంతీయ సమాజాలూ వున్నాయి. వీటితో బాటు, వృత్తి, ఆదాయం, విద్య, ఆస్తి వంటి ఇతర విషయాలు ప్రాతిపదికగా ఏర్పడ్డ చిన్న చిన్న సమాజాలూ ఉన్నాయి. సామాజిక పద్ధతులకు, ఆచారాలకు, మత విశ్వాసానికి మధ్య సంబంధం గాని, పోలిక గాని లేదు. మత విశ్వాసమనేది అనుభవానికి అతీతమైంది. ప్రజలు కొలిచే దేవుళ్ళు వారి సామాజిక జీవితానుభవం నుండి రూపుదిద్దుకున్న వారు. హిందువుల్లో ఒక సమాజ సంస్కృతిలో పురాణాలు, ఇతిహాసాలు, అంతర్భాగమయ్యాయి. కొన్ని సందర్భాల్లో పురాణ పురుషులు కాల క్రమేణా దైవత్వాన్ని సంతరించుకుంటారు. ( రాముడు దేవుడైనట్లు). కొన్ని సార్లు మామూలు మనుషులు కూడా, దైవ స్వరూపులుగా మారి, పూజార్హతను పొందుతారు. ( పశ్చిమ బెంగాల్‌లోని ఒక గ్రామంలో 19వ శతాబ్దిలో ఒక భూస్వామి చేతుల్లో అత్యాచారానికి గురై చనిపోయిన బాలిక, దేవతగా మారి, స్థానిక ప్రజల పూజలందు కుంటోంది). ప్రాంతీయ ప్రత్యేకతలు, కుల చరిత్రకు చెందిన ప్రత్యేకతలు కూడా ఈ దేవుళ్ళకు ఉండొచ్చు. సామాజిక పరమైన తేడాలూ కన్పించొచ్చు. ఎంతో వైవిధ్యం, అంతర్గత వైరుధ్యాలూ ఉన్న హిందూ జనాభాలో, అదేవిధంగా ముస్లింల్లో, లేదా మరో వర్గంలో, అసంఖ్యాకుల్లో మతతత్వ చైతన్యం ఎలా ప్రబలింది ? అందులోనూ, ప్రస్తుతం దేశంలోని పరిస్థితికి కారణాలు ఏమిటి ? మత తత్వాన్ని పనిగట్టుకుని ఒక సిద్ధాంతంగా వ్యాప్తి చేయడం, ఒక ప్రధాన కారణం. ప్రభుత్వాలు, కొన్ని వర్గాలు, కొన్ని రాజకీయ పార్టీలు ఈ పని చేస్తూ వచ్చాయి. ఆర్థిక, రాజకీయ అంశాలు కలగలసి కూడా, ఈ పరిస్థితిని సృష్టించాయి. 19వ శతాబ్ది సంఘ సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమం, స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థిక, రాజకీయ రంగాల్లో వచ్చిన పరిణామాలు - వీటిని నిశితంగా పరిశీలిస్తే, మతతత్వ దృక్పథం ఉన్మాద స్థాయికి ఎలా చేరిందో అర్థమౌతుంది.

## 22.3 మతతత్వ దృక్పథం - చరిత్ర వ్యాఖ్యానం

మౌలికమైన మతతత్వ దృక్పథం చరిత్ర వ్యాఖ్యానాన్ని, అవగాహనను ప్రభావితం చేసింది. చారిత్రక వ్యాఖ్యానం ఆధునిక భావజాల ఫలితంగా ఉంటుందనే విషయం మర్చిపోకూడదు. ఆధునిక మత తత్వ భావ జాలం గత చరిత్రలో తన బౌద్ధిక సమర్థనను చూపించడానికి ప్రయత్నిస్తుందనే విషయం, ఆ భావజాలాన్ని పరిశీలిస్తే స్పష్టమౌతుంది. ఈ విధంగా చూస్తే, ప్రాచీన యుగంలో ఆదర్శవంతమైన హిందూ సమాజాన్ని చిత్రించడానికి హిందూ మతతత్వ వాదులు ప్రయత్నిస్తారు. భారత దేశంలోని అన్ని రోగాలనూ ముస్లింల రాకకే అంటగడ్తారు. అలాగే, మధ్య యుగ ప్రారంభం నుండే, అంటే క్రీ.శ. 12, 13 శతాబ్దాల నుండే వేర్పాటు వాదం వేళ్లూనుకుందని ఇస్లాం మతతత్వ వాదులు ప్రయత్నించి, ధృవీకరిస్తారు.

## 22.4 ఆధునిక భారతంలో మతతత్వవాదం - మూడు రూపాలు

ఆధునిక భారతదేశంలో మతతత్వవాదం మూడు ప్రధాన రూపాలను సంతరించుకుందని, బిపన్ చంద్ర పేర్కొన్నాడు. అవి : (1) మతతత్వ జాతీయ వాదం ; (2) ఉదార మతతత్వవాదం ; (3) అతివాద మత తత్వం, లేదా ఫాసిస్ట్ మతతత్వం .

### 22.4.1 మతతత్వ జాతీయవాదం

వీటిలో మొదటిది నిజానికి మతతత్వ వాదమే కాదు. జాతీయవాద విస్తృత చట్రంలోనే ఇది పనిజేస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఇది జాతీయవాద బలహీనత. ఇందులో జాతీయవాదం మౌలికంగా ఉంటుంది. మతం, ప్రత్యేక మత ప్రయోజనాలు, అనే మౌలిక భావాలను మతతత్వ జాతీయవాది అంగీకరించాడు. అయితే,

BRAOU

విస్తృతమైన జాతి, జాతీయ ప్రయోజనాల్లోకి వీటిని చేర్చే అవకాశంలో, కోరికలో అతనికి నమ్మకముంది. విభిన్న మత వర్గాల ప్రయోజనాలు భిన్నమైనప్పుడు కూడా అవి పరస్పరం తలపడ లేదని, నిజానికి వృద్ధిచెందుతున్న జాతీయవాదంలోనే విభిన్న మతాల ప్రయోజనాలకు రక్షణ ఉంటుందని అతని విశ్వాసం. అలాగని ప్రచారం చేశాడు కూడా. తానే మత వర్గానికి చెందినా, అది తన రాజకీయాలకు అన్వయించే అంశం కాకూడదనే ఆదర్శంలో కూడా, అతనికి నమ్మకముంది. దీనికి ఉదాహరణగా, మహమ్మద్ అలీ జిన్నానే పేర్కోవచ్చు. 1920కి ముందు ముస్లిం లీగ్‌తో పనిజేస్తున్నా కాని, మతం నుండి రాజకీయాన్ని వేరు చేసి, లౌకికతను అలవర్చుకోమని జిన్నా భారత ప్రజలను కోరాడు. అంతకు ముందు, తొలి జాతీయవాదైన వి.డి. సావర్కర్ కూడా, మౌలికంగా మతేతర ధోరణికే కట్టుబడి ఉన్నాడు. " . . . . శివాజీ రోజుల్లో మహమ్మదీయులకు వ్యతిరేకంగా ద్వేష భావం సరైంది, అవసరమైంది కావచ్చు. కాని, ఆనాడు హిందువుల్లో అది ప్రబలమైన భావన కాబట్టి, అటువంటి భావమైనప్పుడు పెంచి పోషించడం అన్యాయం, తెలివి తక్కువ " అని, సావర్కర్ 1909 లో పేర్కొన్నాడు.

### 22.4.2 ఉదార మతతత్వవాదం

ఇక, ఉదార మతతత్వ వాది విషయానికొస్తే, మౌలికంగా మతతత్వ రాజకీయాల్లో నమ్మకమున్న వాడు, ఆచరించేవాడు ఇతడే. కాని, కొన్ని ఉదార, ప్రజాస్వామిక, మానవత్వ జాతీయవాద విలువలనింకా ఆదరించాడు. 1920 దశకంలో సంకుచిత కుల, మత ప్రాదిపదికలపైన జాతీయోద్యమాన్ని నిర్మించరాదనే భావన, ప్రాచుర్యంలోకి వచ్చింది. ' మనం నిర్మించదలచిన భారత జాతి హిందూ జాతి గాని, ముస్లిం జాతిగాని , క్రైస్తవ జాతిగాని, సిక్కు జాతి గాని కాదు. ఇది అన్ని మతాలకు చెందింది. నా జాతీయోద్యమ లక్ష్యమిదే ' నని లాలా లజపతి రాయ్ 1920లో ఉద్ఘాటించాడు. జాతీయోద్యమ రాజకీయాలు మతాతీత వైఖరిని తేటతెల్లం చేస్తూ , " హిందూస్థాన్ కేవలం హిందువులదే కాదు, ఇప్పుడది వారి ఒక్కరిదేనంటే కుదరదు. హిందూస్థాన్ ఒక్క హిందువులకే కాదు, ముస్లింలకు కూడా మాతృ దేశమే. ఉభయ మతాలకు చెందిన ప్రజలు ఇక్కడ ఎల్ల కాలం కలసి జీవిస్తారు " అని, హిందూ సమాజ్ నాయకుడు, బనారస్ హిందూ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడైన మదన్ మోహన్ మాలవీయ ప్రకటించాడు. సయ్యద్ అహ్మద్ ఖాన్, అలీ సోదరులు, ఎం.ఎ. జిన్నా, ఎన్.సి. కేల్కర్ వంటి వారు కూడా, 1920, 1930 దశకాల్లో ఉదార మతతత్వవాదులే. ముస్లిం లీగ్, హిందూ మహా సభలు 1920 దశకం చివరి వరకు, ప్రధానంగా ఉదార మతతత్వవాదాన్నే అనుసరించాయి. హిందువులు, ముస్లింలు న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్నట్లు ఆయా సంస్థలు చాటుకున్నా గాని, ఇతరత్రా హిందూ - ముస్లిం ఐక్యతకు, భారత జాతి, భారతదేశ రూపకల్పనకు పట్టుకొమ్మలుగా నిల్చాయి.

' నిజమైన భారతదేశాన్ని ఆవిష్కరించేందుకు విస్తృత స్థాయిలో కొనసాగిన చర్చల ద్వారా, చరిత్రకు, భిన్న దృక్పథాలతో చెప్పిన భాష్యాల ద్వారా, ఎప్పటికప్పుడు మారుతూ వచ్చిన వైఖరులు, దృక్కోణాల ద్వారా, భారతదేశ చరిత్రలో భిన్నత్వం, వైవిధ్యం, చలన శీలత ఉన్నాయని నాటి జాతీయవాదులు తిరుగులేని విధంగా నిరూపించారు. భారతీయ నాగరికతా ప్రత్యేకతలను, విజయాలను మాత్రమేగాక, అంతర్గత వైరుధ్యాలను, భిన్న త్వాన్ని అంగీకరించే విశాలత్వాన్ని , ఆధునీకరణను, అంతర్జాతీయ వాదాన్ని, సాంఘిక, ఆర్థిక సమానత్వ సాధనకు, జాతి ప్రజలు కనే స్వప్నాలను, ఈ మౌలిక దృక్పథం ప్రస్ఫుటం చేసింది.

### 22.4.3 అతివాద (ఫాసిస్ట్) మతతత్వం

అతివాద మతతత్వం లేదా, ఫాసిస్ట్ నియంతృత్వ ధోరణితో వ్యవహరించే మతతత్వం వివేకం లేంది, భయద్వేషాలపై పెరిగింది. రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా, హింస, భయాలను ఉపయోగించే వైఖరి గలది.

BRAOU

1930 దశకం చివరి వరకు మతతత్వ వాదానికి సామాజిక పునాది సంకుచితమైంది. అప్పటిదాకా, అసంఖ్యాక సామాన్య హిందూ, ముస్లింల్లోను, మేధావుల్లోను, జాతీయోద్యమం, జాతీయ భావాలు వ్యాప్తి చెందుతూనే వచ్చాయి. 1937 - 38లో హిందూ మహాసభ, ముస్లిం లీగ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రూపంలో హిందూ, ముస్లిం మతతత్వ వాదాలు రెండూ తమ సిద్ధాంతాలు, లేదా ఆదర్శాలు, రాజకీయాల్లో ఫాసిస్ట్ ధోరణితో వివేక రహితంగా మారడం ఆరంభం కావడంతో, ఉదారవాద మతతత్వంలో మౌలికమైన మార్పు వచ్చింది. పట్టణ దిగువ, మధ్య తరగతి ప్రజానీకంలో అతివాద మతతత్వ రాజకీయాలు చోటు చేసుకున్నాయి. దీనికి కారణముంది. 1937 ఎన్నికల్లో ముస్లిం లీగ్, హిందూ మహాసభలు ఉదార మతతత్వ ధోరణితో ప్రచారాన్ని నిర్వహించి, కాంగ్రెస్‌పై ఘోరంగా దెబ్బతిన్నాయి. పామర జనుల పునాదిని కాంగ్రెస్ పార్టీ పటిష్టపర్చు కుంటున్నదనే సంగతి తెలిసింది. పామర జనాన్ని కూడగట్టే యుద్ధోన్మాద రాజకీయాలను నిర్వహించకుంటే, మతవాద రాజకీయ పార్టీలు క్రమేణా అంతరించి పోతాయని గ్రహించాయి. ఫలితంగా, 1937 అక్టోబర్ లో జరిగిన లక్నో సమావేశంతో ముస్లిం లీగ్ ఫాసిస్ట్ మతతత్వ వాదం వైపుకు మొగ్గింది. సావర్కర్ నాయకత్వంలో అదే సంవత్సరం హిందూ మహాసభ కూడా, ఈ ధోరణికే తీవ్రంగా మొగ్గింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మొదటి నుండీ ఫాసిస్ట్ పద్ధతుల్లోనే వ్యవస్థీకరించబడ్డా గాని, 1937 నుండి మాత్రమే, అది మహారాష్ట్ర ఎల్లలను దాటి వ్యాపించడానికి, తీవ్రంగా ప్రయత్నించింది. ఎంతో కొంత సామ్రాజ్యవాద వ్యతిరేకమైన గతం ఉన్న హెడ్గేవార్, జిన్నా, సావర్కర్‌లు, ఉదార మతవాద నాయకులందరితో కాక, వలస పాలకులతో, పాలనతో విభేదించారు. ఈ ముగ్గురూ, ఆర్.ఎస్.ఎస్. ముస్లిం లీగ్, హిందూ మహాసభలకు ఈ ఫాసిస్ట్ దశలో శాశ్వత అధ్యక్షులుగా, వ్యక్తి ఆరాధనా రాజకీయాలకు కేంద్ర బిందువులు గావటం, ఒక ఆసక్తికర అంశం. ఫాసిస్ట్ ధోరణిలో మతతత్వ వాద ప్రచారం ముమ్మరమైంది. తమ తమ సంస్కృతుల్ని ఎదుటివారు అణచివేయడమే గాక, పూర్తిగా కూకటి వ్రేళ్ళతో పెళ్లగించి వేస్తారనే భయాన్ని, తమ వర్గాల పామర జనంలోకి ప్రాకేలా చేశారు. తెలివి తక్కువ ఉద్రేకాలను, భయాలను, ఎదుటివారిపై ద్వేషాన్ని సామాన్య జనంలో రెచ్చగొట్టారు. ద్విజాతి సిద్ధాంతాన్ని పాదుకొల్పారు. నినాదాలకు ప్రయోజనమే తప్ప, అర్థం అవసరం లేని రీతిలో రూపొందించారు.

ఉదార, అతివాద మతతత్వాలను, మతతత్వ జాతీయ వాదం పెంచి పోషించింది. వాటికి వ్యతిరేకంగా రాజకీయ పోరాటాన్ని కొనసాగించడం, కష్టతరం చేసింది. వాటికి బందీగా వ్యవహరించింది. అవి, వాటివైపు నుండి జాతీయవాదుల్లో నిరంతరం మతతత్వ జాతీయవాదాన్ని పెంచడం వల్ల, ప్రభుత్వ పాలన ముగుస్తుందనే విషయం స్పష్టం కావడంతో, ఉదార మతతత్వ వాదులైన హిందువులు, ముస్లింలు తమ తమ ప్రత్యేక హక్కులను పరిరక్షించుకోడానికి, పట్టువిడువని పద్ధతిలో, అతివాద మతతత్వం వైపుకి మొగ్గారని చెప్పాలి.

## 22.5 భారతదేశ మతతత్వ చరిత్ర ధోరణికి పునాది

భారతదేశంలో మతతత్వ చారిత్రక వ్యాఖ్యానం, మతతత్వ వాదానికి ప్రధాన ఆదర్శమైంది. అది లేకుంటే, మతతత్వ సిద్ధాంతమంటూ ఏమీ మిగలదు. హిందూ మతతత్వ వాదం విషయంలో ప్రత్యేకించి, ఇది వాస్తవం. చరిత్రను ఉపయోగించుకోడంలో, ముస్లిం మతతత్వవాదం భయమనే మనో భావనను సృష్టించడానికి, మత, అల్ప సంఖ్యాక వర్గ భావాలపై ఆధారపడింది. వర్తమానంలో హిందూ అధిక సంఖ్యాక వర్గం దృష్ట్యా, హిందూ మతతత్వ వాదులు ఆ విధంగా విజయవంతంగా చేయలేక పోయారు. ఈ కారణంగా, వీరు దీనికోసం గతం మీద ఆధారపడ్డారు. ఇదేవిధంగా, భారత చరిత్రలో తాము నిర్వహించిన పాత్ర దృష్ట్యా, ముస్లిం మతతత్వ వాదులు ముస్లింలకు ఒక ప్రత్యేక రాజకీయ వర్గంగా వేరే విశేషమైన అంతస్థును ధైర్యంగా అడిగారు. భయం, కోపం, దురభిమానం, ద్వేషం వంటి వాటితో కూడిన వాతావరణాన్ని కల్పించడానికి, రెండు మతతత్వ వాదాలూ, భారతదేశ చరిత్ర మతతత్వ వ్యాఖ్యానాన్ని ఉపయోగించుకున్నాయి.

BRAOU

సామ్రాజ్యవాద లక్షణాల్లో ముఖ్యమైంది, వలస ప్రజల్లో విభేదాలను రెచ్చగొట్టడం. ఇందువల్ల, వలస ప్రజల్లో ముఠాలేర్పడి తాము పరస్పరం భిన్నులమనే నమ్మకంతో, అధికారం కోసం పోటీ పడతారు. ప్రతి ముఠా తన సంస్కృతికి ప్రత్యేక పునాదుల్ని పరిశోధించే ప్రయత్నంలో, పునరుద్ధరణవాదం తలెత్తి, విభేదాలను మరింత రెచ్చగొడుతుంది. భారతదేశంలో విభిన్న హిందూ ముస్లిం సంస్కృతులు ఏ విధంగా ఉన్నాయో తన " హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా ' (History of British India) గ్రంథం ద్వారా, దేశ చరిత్రను హిందూ, ముస్లిం, బ్రిటీష్ యుగాలుగా విభజించి, జేమ్స్ మిల్ హిందూ, ముస్లిం విభేదాలకు దోహదం చేశాడు. దీనికి తగ్గట్టే , దేశ రాజకీయాల్లో మత వైషమ్యాలు రెచ్చి, హిందూవులు వైదిక సంస్కృతిని, ముస్లింలు ఇస్లాం స్వచ్ఛతను ఆశ్రయించారు. 19వ శతాబ్దంలో క్రైస్తవమత ప్రచారకులు భారతదేశానికి తమ మతంలో తప్ప, నిష్కృతి లేదని ప్రచారం చేశారు. ఈ దేశంలోని మూఢ విశ్వాసాలు, న్యాయశాస్త్రరాహిత్యం, పరివర్తనారాహిత సంఘ వ్యవస్థ, రాజకీయ నిరంకుశత్వానికి కారణమని, జేమ్స్ మిల్ వంటి ప్రయోజనవాదులు హేతుబద్ధంగా వాదించారు. ముఖ్యంగా, హిందువుల పన్నుల విధానం స్వేచ్ఛా వాణిజ్యానికి గాని, మూల ధనాభివృద్ధికి గాని, అనుకూలం కాదని, మిల్ భారతీయ సంస్కృతిని విమర్శించాడు. చట్టాల ద్వారా సమాజాన్ని మార్చవచ్చని అతడు సూచించడంతో, తమ సామ్రాజ్య ప్రయోజనాలకు అనుకూలంగా , భారత సమాజంలోను, పాలనా యంత్రాంగంలోను, మార్పులు తేవడానికి బ్రిటీష్ పాలకులు ప్రయత్నించారు. కనుకనే, భారతదేశానికి పంపే ప్రభుత్వోద్యోగులకు శిక్షణనిచ్చే హెయిల్‌బరీ కాలేజీలో, మిల్ రచన పాఠ్య గ్రంథమైంది.

ఐరోపావారి భారత చరిత్ర రచనా సంప్రదాయం, సర్ విలియం జోన్స్, విల్కిన్స్, కోల్‌బ్రూక్, తదితర ప్రాచ్యవాదుల, ఇండాలజిస్ట్‌ల విశ్లేషణతో ఆరంభమైంది. అనేక పరిశోధనా వ్యాసాలు వెలువడ్డాయి. ప్రాచీన భారతీయ సాహిత్యం ఆంగ్లంలోకి అనువదించబడింది. భారతీయ సంస్కృతి పై మక్కువ పెరిగింది. ప్రాచ్యవాదులు ప్రాచీన భారతీయ సంస్కృతిని ఆదర్శపూర్వకమని పొగిడారు. 19వ శతాబ్దంలో, ఆర్య సామాజికులు ఈ ప్రాచ్యవాదుల విశ్లేషణనే, భారతీయులను జాగృతం చేయడానికి వాడుకొన్నారు. మిల్ భారతదేశ చరిత్ర విభజన, మతతత్వ చరిత్ర ధోరణికి పునాది వేయడం తెలిసిందే. మిల్ ప్రతిపాదనల ఫలితంగా, థామస్ రో, బెర్నియర్‌లు భారతదేశంలో ప్రైవేట్ ఆస్తి హక్కు లేదనే కారణంగాను, ' ప్రాచ్య నియంతృత్వం ' అనే భావన పెరిగింది.

BRAOU

## 22.6 జాతీయోద్యమ స్ఫూర్తి - మతతత్వ చారిత్రక వ్యాఖ్యానం

ఆంగ్ల చరిత్రకారులు భారత చరిత్ర రచన సాగిస్తున్న కాలంలోనే, ఆర్.జి. భండార్కర్ వంటి భారతీయులు కూడా, వారి అడుగు జాడల్లో నడచి, రాజకీయ వంశ చరిత్రలను రచించి, కొత్త సమాచారాన్ని సేకరించడానికి కృషి చేశారు. కాని, 19వ శతాబ్దానంతరం జాతీయోద్యమ స్ఫూర్తితో, చరిత్ర రచనలో మార్పు వచ్చింది. గత చరిత్రను ఎటువంటి సంకోచం లేకుండా పొగడటం, ఇది జేమ్స్ మిల్‌కు సమాధానంగా కొందరు భావించడం జరిగింది. ఈ సువిశాల భారతదేశంలో, అతి ప్రాచీన కాలం నుండి రాజకీయైక్యత ఉందని, బ్రిటీష్ పాలన వలన అది రాలేదని రుజువు చేసే ప్రయత్నం జరిగింది. గణతంత్ర రాజ్య భావన, ప్రాతినిధ్య ప్రభుత్వం భారతీయులకు ప్రాచీన కాలం నుండీ తెలుసని, కె.పి. జయస్వాల్ రుజువు చేయడానికి ప్రయత్నించాడు. భారతీయ శిల్పకళ, గ్రీక్ శిల్పకళ కన్న గొప్పదని, ఆనంద్ కె. కుమారస్వామి చాటాడు. ఇటువంటి ప్రయత్నాలే, ఆర్. సి. మజుందార్, తదితరులు చేశారు. ఆంగ్లేయుల ప్రచారానికి ఇవి సమాధానాలని సరిపెట్టుకుందామన్నా, బ్రిటీష్ చరిత్రకారుల వలెనే, మనవారూ స్వదేశాభిమానం వంటి ఆభాసలను అధిగమించ లేకపోయారు. మిల్ ప్రతిపాదనలను విమర్శించిన జాతీయవాద చరిత్రకారులు అతని విభజనను అంగీకరించారు. అంతేగాక, హిందూ, మహమ్మదీయ,

బ్రిటీష్ యుగాల్లో, వ్యత్యాసాలు కూడా ఉన్నాయని నమ్మారు. పర్యవసానంగా, 1930 దశకం చివరి కాలంలో జాతీయోద్యమ దృక్పథం వెర్రితలలు వేసి, తీవ్ర మతతత్త్వ మనే విష బీజం పెరగడానికి దారితీసిన దృక్పథాలు, చరిత్ర రచనలో చోటు చేసుకున్నాయి. ప్రాచీన కాలంలో గుప్తుల యుగం స్వర్ణ యుగమని, ముస్లింల రాక తోనే దుర్దశ ఆరంభమైందని, ముస్లింలు భారతీయులు కారని, వారు విదేశీయులేనని, హిందూ సంస్కృతి ముస్లిం సంస్కృతికన్నా గొప్పదనే నమ్మకం పెరిగి, చరిత్ర రచనల్లో మతతత్త్వం మరింత పెరిగి పెద్దదైంది. దీనికి ఒక ప్రబల నిదర్శనంగా, భారతీయ విద్యాభవన్ వారు ఆర్.సి. మజుందార్ సంపాదకత్వంలో వెలువరించిన ' భారత చరిత్ర - సంస్కృతి సంపుటాల' ను పేర్కోవచ్చు.

వర్తమాన భావాల ప్రభావంలోనే, భారత చరిత్ర రచన గత రెండు శతాబ్దాలుగా సాగుతూ వస్తుంది. తన మనస్సులోనే గతాన్ని పునరుజ్జీవింపజేసే చరిత్రకారుడు, అలా చేసేటప్పుడు, గత సంఘటనలపై తన భావాలను కొంత వరకైనా రుద్దుతాడు. మతతత్త్వ పాక్షిక దృష్టి అటువంటిదే. భారత చరిత్ర వ్యాఖ్యానం పట్ల, అవగాహన పట్ల గల మతతత్త్వ దృక్పథం ప్రాచీన దశకు, మధ్య యుగ దశకు, ఆధునిక దశకు సమానంగానే వర్తిస్తుంది. పారిశ్రామికీకరణ వల్ల వస్తున్న మార్పుల్ని జీర్ణించుకోలేక, ఊహా స్వర్గ సమాజాల కోసం మరెక్కడో వెదకడ మారంభించిన ప్రాచ్యవాదులకు, వైదిక వాఙ్మయంలో ప్రతిఫలించిన ఆర్య సంస్కృతి ఒక ఆదర్శమైంది. జాతి, భాషను ఒకటిగా నిరూపించిన భాషా శాస్త్రవేత్తల పొరబాటు, దీనికి ఆజ్యం పోసింది. మాక్స్ ముల్లర్ 19వ శతాబ్దంలో భారతదేశాన్ని సందర్శించి ఉంటే, ఆయన భావాలు ఎలా ఉండేవో మరి ! ద్విజాతి సిద్ధాంతానికి చారిత్రక సమర్థనను సంతరించిపెట్టిన, భారత చరిత్ర మతతత్త్వ వ్యాఖ్యానానికి పునాది వేసిన జేమ్స్ మిల్, భారత చరిత్రకారులపై మరింత ప్రభావాన్ని చూపాడు. భారత జాతీయవాద చరిత్రకారులు ప్రాచ్యవాదుల రచనలపై ఆధారపడి, ప్రాచీన హిందూ భారతాన్ని మహోజ్వలమైందిగా పొగిడారు. వలసవాదంతోను, సామ్రాజ్య వ్యతిరేక పరిస్థితులతోను, జాతీయవాదం కలియడంతో, గతకాల ప్రశంస, వర్తమాన కాల అవమానాలకు సాంత్వనంగా ఉపయోగపడింది. చరిత్ర ఆధారాలను ప్రశ్నించే చారిత్రక విశ్లేషణ ప్రధాన లక్షణం, చరిత్రకారుల్లో కన్పించదు.

సామాజిక - ఆర్థిక చరిత్రను దాదాపు వదిలేసి, రాజకీయ, పాలక వంశ చరిత్ర అధ్యయనాన్ని కొనసాగించడం వల్ల, జాతీయవాద చరిత్రకారులు మిల్ చేసిన దశల విభజనను సవాల్ చేయలేదు. పైగా, వీరు ప్రాచీన దశను అంటే ముఖ్యంగా, హిందూ దశను ప్రశంసించడంతో, హిందూ, ముస్లింల దశల మధ్య వ్యత్యాసం మరింత ఘనీభవించింది. 1920 దశకం నుండి ముస్లిం వేర్పాటువాదంతో, ఈ విభజన మరింత తీవ్రమైంది. ముస్లింల రాకతో, హిందూ రాజ్యం పతనమైపోయిందని వివరించే వారి పని తేలికైంది. తురుష్కులు అంత త్వరగా ఎలా తమ అధికారాన్ని స్థాపించుకున్నారనే విషయాన్ని వివరించడానికి, ఆనాటి సమాజాన్ని విశ్లేషించే ప్రయత్నం పెద్దగా జరగలేదు. దీంతో, ' ముస్లిం దశ ' క్షీణ దశైంది. ఆ క్షీణత్వం చివరకు బ్రిటీష్ వారి రాకకు దారితీసింది - ఇదీ వారి వాదన. ముస్లిం దశలో హిందూ, ముస్లిం, రెండు జాతులు ఆవిర్భవించాయనీ, పర్యవసానంగా, ఉపఖండంలో హిందూ ప్రాబల్య రాజ్యం, ముస్లిం ప్రాబల్య రాజ్యం ఏర్పడ్డాయని, వారు వాదించారు. కేవలం మతపరమైన గ్రూపులే జాతిగా రూపొందలేవనే వాదనను వారు పరిగణించలేదు. 1930, 1940 దశకాల మతతత్త్వ రాజకీయాలు ఈ వ్యాఖ్యానానికి తోడయ్యాయి. వేర్పాటువాదం మరింత తీవ్రమైంది. పాకిస్తాన్ సృష్టి సమస్యను పరిష్కరించలేకపోయింది.

## 22.7 ప్రాచీన భారత చరిత్ర - మతతత్త్వ వ్యాఖ్యానం - అపస్వరాలు

విమర్శనాత్మక పరిధికి లోబడని మతతత్త్వ ఊహాల ప్రాతిపదికగా సాగిన చరిత్ర రచనలు, చాలా

హానికరంగా పరిణమించాయి. ఆ ఊహలను ప్రశ్నించే వారు లేరు. సవాల్ చేసేవారు లేరు. చరిత్ర బోధకులు ఎక్కువ మంది ఈ ఊహల్ని, చారిత్రక సత్యాలుగా ఆమోదిస్తున్నారు. వస్తుగత విశ్లేషణ పద్ధతిని అన్వయించడం లేదు. తరతరాలుగా అవే పాఠాలు, అవే వ్యాఖ్యానాలు. తాజా పరిశోధనా ఫలితాలను ప్రామాణిక గ్రంథాల్లోనూ, పాఠ్య గ్రంథాల్లోను, ఎప్పటికప్పుడు చేర్చకపోవడం కూడా, దీనికి కారణమే. ఉదాహరణకు, ఆర్య జాతి సిద్ధాంతాన్ని తీసుకుంటే, గత నాలుగు దశాబ్దాలుగా జరిగిన పురావస్తు పరిశోధనలు, ఇతర సాక్ష్యాధారాలు, ఆర్య జాతి అనేది ఫలానా భాష మాట్లాడిన ప్రజా సముదాయం మాత్రమేననీ, అదొక ప్రత్యేక జాతి కాదనీ, ఆర్య, ఆర్యేతర సంస్కృతులు రెంటినీ, వేద సాహిత్యం ప్రతిబింబిస్తుందని స్పష్టం చేస్తున్నాయి. ఆర్యులు, గొడ్డు మాంసం తిన్నారనే వాస్తవాన్ని, మద్యం సేవించే వారనే వాస్తవాన్నీ, తెలియజెప్తున్నాయి.

ఇదేవిధంగా , మిల్ చేసిన భారతదేశ చరిత్రలోని దశల విభజన, హిందూ, ముస్లిం పదాల వాడకం లోని న్యాయబద్ధతను విశ్లేషించి పరిశీలిస్తే గాని, అందులోని ఔచిత్యం అర్థం కాదు. పాలక వంశాల చరిత్రనే ప్రాతిపదికగా తీసుకున్నా, ప్రాచీన యుగాన్ని, అంటే, క్రీ.పూ. 1000 నుండి క్రీ.శ. 1200 వరకు, హిందూ యుగమని వ్యవహరించడమెలా ? బౌద్ధులతో మమేకమైన మౌర్యులు, ఇండో - గ్రీక్‌లు, శకులు, కుషాణ రాజులు ప్రధానంగా పాలించిన, క్రీ.పూ. 500 నుండి క్రీ.శ. 300 దాకా ఉన్న దశను, బౌద్ధ దశని వ్యవహరించరేం ? దేశంలో ఈనాడు బౌద్ధ జనాభాయే అధిక సంఖ్యలో వుండి వుంటే, ' బౌద్ధ దశ ' అని వ్యవహరించి ఉండేవారే గదా ! అలాగే, భారతదేశానికి సంబంధించి, ఇస్లాం పూర్వ ఆధారాలలో కన్పించని హిందూ అనే పదాన్ని, ఈనాడు గుర్తిస్తున్న రీతిలో, ప్రాచీన కాలంలో గుర్తించలేదే ? హిందువులనేవారు ఒక సమైక్యం చెందిన మతంగా ఆవిర్భంచలేదనడానికి, ప్రాచీనాధారాల్లో బోలెడు సాక్ష్యముంటే, పరిగణనలోకి తీసుకోరేమి ? నిజానికి, ఆధునిక హిందూ మత లక్షణాలు, ప్రత్యేకించి భక్తి ఉద్యమ లక్షణాలు, సరిగ్గా మధ్య యుగ దశలోనే కన్పిస్తే, మతతత్వ చరిత్రకారులు ఆ దశను క్షీణ దశగా పరిగణిస్తున్నారేం ?

క్రీ.శ. ఏడు నుండి పదమూడు శతాబ్దాల మధ్య చరిత్రను రచించే సందర్భంగా, ఈనాడు అరబ్బులకు, టర్క్‌లకు, పర్షియన్లకు ' ముస్లిం ' అనే ఒకే పదం వాడటం జరుగుతుంది. కాని, వారు ముగ్గురినీ వర్ణించడానికి, ఏ పత్రాల్లోను ముస్లిం పదాన్ని పదమూడో శతాబ్దం దాకా వాడలేదే ? మతపరమైన పదజాలం ఆనాటి ఆధారాల్లో కనిపించదు. అలాగే, ' మ్లేచ్ఛ ' పదం తురుష్కులను, పర్షియన్లను, అరబ్బులను ప్రస్తావించే సందర్భంలో వాడబడింది. ఈ పదం నిర్దిష్ట సంస్కృతిని వెల్లడించడానికి వాడిన పదం మాత్రమే. భారత ఉప ఖండంలో తురుష్కుల రాజకీయ అధికార వ్యవస్థీకరణ జరిగాకే, మతపరమైన ప్రత్యేకతలు, లేదా మతాల వేర్పాటు తత్వం జనించాయి. ఇక ఉప ఖండం మొత్తంగా చూస్తే, మిల్ చేసిన దశల విభజన పద్ధతి ఆమోదయోగ్యమే కాదు. గంగాలోయ ప్రాంతాల్లోని పాలక వంశాల చరిత్రే, భారతదేశ చరిత్ర కాదు. పైగా, భారత ఉప ఖండంలో వివిధ ప్రాంతాల్లోకి ముస్లింలు వివిధ కాలాల్లో వచ్చారు. అందుచేత, అందరూ అనుసరిస్తున్న మిల్ దశల విభజన అపసవ్యమైంది. సామాజిక పరిణామం దృష్ట్యా, చరిత్రనెందుకు అధ్యయనం చేయరు ?

ఇదే విధంగా, గుప్తుల " స్వర్ణ యుగం " లోని వైరుధ్యాలనూ, చరిత్ర బోధకులు పట్టించుకోడం లేదు. గుప్త యుగాన్ని హిందూ పునర్వికాస దశగా వర్ణించారు. మరి కళారంగంలో ముఖ్యంగా, శిల్పకళ, చిత్రకళల్లో ప్రధాన విజయాలు బౌద్ధానికి సంబంధించినవి. శాస్త్రీయ విజయాలేమో కొన్ని స్వదేశీయం, మరికొన్ని విదేశీయం. హిందూ సంప్రదాయానికి అహింసే ప్రధానమని ఒక పక్క నొక్కి చెప్తూ , మరో వంక సముద్రగుప్తుని సైనిక విజేతగా కీర్తించడంలో ఔచిత్యమేమిటి ? గుప్త రాజులు హిందూ మత పోషకులని నాణేలు, శాసనాలు తెలియజేస్తున్నాయి. మరి హిందూ పునర్వికాసమనేది స్వర్ణ యుగంలో భాగమెలా ఔతుంది ? ప్రజల్లో

చండాలురనే ఒక వర్గం నగరం వెలుపలే నివసిస్తూ, మిగతావారు ముందుగా జాగ్రత్త పడటం కోసం కర్రను నేలకు తాటించుకుంటూ సంచరించే స్థితి ఉన్న సమాజం - అదసలు స్వర్ణ యుగమెలా ఔతుంది ? భారతీయ సంస్కృతి విశిష్ట ఆధ్యాత్మిక లక్షణాలు కలిగి ఉందనే భావన కూడా, పారిశ్రామికీకరణ, సాంకేతికాభివృద్ధి, విదేశీ పాలన నుండి స్వేచ్ఛ, మొదలైన ప్రధాన ఐహిక విషయాల నుండి భారతీయుల మనస్సులను దూరంగా ఉంచాలని, 19వ శతాబ్దంలోని రచయితలు రూపొందించిందే. అహింస భావనా విషయమూ అంతే. జాతీయోద్యమంలో గాంధీ అనుసరించిన విధాన సాన్నిహిత్యంతో, ఈ భావనకు ప్రాముఖ్యమొచ్చింది. ఇది తాత్విక భావనగా భారతదేశానికి మాత్రమే చెందింది కాదు. అయితే, ఈ తాత్విక భావనకూ, దీని ఆచరణకూ మధ్య వ్యత్యాసం ఉంది. ప్రాచీన భారత చరిత్రలోని మౌర్య చంద్రగుప్తుడు, కనిష్కుడు, సముద్ర గుప్తుడు, హర్షుడు, రెండో పులకేశి, తదితరులు ప్రధానంగా విజేతలు కాబట్టి, మహావీరులయ్యారు. చరిత్ర పుటల్లో ఈ రక్తపాతం కన్పిస్తుంటే, మరి అహింస ఎక్కడ ? అహింస పునాదిపై రాజకీయ విధానాన్ని రూపొందించినవాడు అశోకుడని కీర్తించిన వారే , మౌర్య సామ్రాజ్య విచ్ఛిత్తికి అతడే కారకుడని విమర్శించారు.

చరిత్ర మతతత్వ వ్యాఖ్యానమనేది, ఎంత తక్కువ స్థాయి గల చరిత్రో తెలియజెప్పడానికి, గజనీ మహమ్మద్ ఉదాహరణను పేర్కొనొచ్చు. ప్రామాణిక చరిత్ర గ్రంథాల్లో, అతడొక దేవాలయాల విధ్వంసకుడు, విగ్రహ విచ్ఛేదకుడు. ఇస్లాం విగ్రహారాధనకు వ్యతిరేకం కాబట్టి , ముస్లిం పాలకులంతా విగ్రహ విచ్ఛేదకులుగా వ్యవహరించేవారే కాబట్టి, మహమ్మద్ ఈ పనులు చేసి ఉంటాడని వివరిస్తారు. మరి 11వ శతాబ్దంలో, కాశ్మీర్ రాజైన హర్షుడు, పథకం ప్రకారం వ్యవస్థీకృతంగా, దేవాలయాలను పగడొట్టించాడు. అతడు నియమించిన ' ' దేవోత్పాత నాయక ' అనే అధికారికి దేవాలయాలను దోపిడీ చేయడమే పని, అని కల్హణుడు పేర్కొన్నాడు. ధనాగారాలైన ఆలయాలను పడగొట్టి, సంపదను వాడుకోడం, అటు గజనీ మహమ్మద్ చేశాడు, ఇటు శ్రీ హర్షుడూ చేశాడు. మరి ఇద్దరి గూర్చి అంచనాల్లో , ఎంత వ్యత్యాసం !

## 22.8 మధ్య యుగ భారతదేశ చరిత్ర - మతతత్వ చారిత్రక వ్యాఖ్యానం - అపసవ్యాలు

మధ్య యుగ భారతదేశ చరిత్రకు సంబంధించిన మతతత్వ వాదుల చరిత్ర రచనల్లోనూ, ఇటువంటి అపసవ్యాలు అనేకం కన్పిస్తాయి. అరేబియాలో, క్రీ.శ. 7వ శతాబ్దంలో ఇస్లాంకు ప్రాతిపదిక సామాజిక సమానత్వం. అయితే, 13వ శతాబ్దం నాటికి భారతదేశంలో ఇస్లాంకు మూలం, రాచరిక వ్యవస్థైంది. అంతేగాక, అల్లాఉద్దీన్ ఖిల్జీ, మహమ్మద్ బిన్ తుగ్లక్, అక్బర్, ఔరంగజేబ్, ఉలేమాలు, సూఫీ తత్వవేత్తలు అందరూ ఇస్లాంను నమ్మినవారే అయినా, ఇస్లాం అంటే ఎవరి అర్థాలు వారివి. అలాగే, మధ్య యుగ భారత చరిత్రగా అధ్యయనం చేయబడుతున్నది నిజానికి, చరిత్రలో ఒక భాగమే. మొత్తం సమాజాన్ని గూర్చిన అధ్యయనం ఎక్కడ ఉంది ? ఇటువంటి విషయాలనేకం విస్మరించబడుతున్నాయి. నాటి సమకాలీన రచనల స్వభావాన్ని విశ్లేషించడం లేదు. జియాఉద్దీన్ బరనీ లాంటి సమకాలీన చరిత్రకారులు హిందువులను సంహరించాలని వాదించారంటే అర్థం, రైతులతో సహా మొత్తం హిందువులందరినీ కాక, హిందూ సమాజంలోని ఒక విభాగం ( పాలక వర్గంలో అంతర్భాగమైన రాజులు, జమీందార్లు) వారిని మాత్రమే సంహరించాలనేది వారి భావం. అంటే, ఇక్కడ ' హిందూ' అనే పదం మతపరంగా కాక, రాజకీయపరంగానే వాడటం జరిగింది. అలాగే, ఆశ్రాశ్రయ ధోరణిలో సమకాలీన చరిత్రకారులు తరచూ జరిగిందేమిటో రాయకుండా, ఏం జరిగితే బావుంటుందని వారాశించేవారో, అదే రాశారు. బరనీ పేర్కొనట్లు, ఇస్లాం నిబంధనలను అసలు పట్టించుకోని అల్లాఉద్దీన్ ఖిల్జీ తిరుగుబాటుదార్లైన హిందూ జమీందార్లను ( మరి తిరుగుబాట్లతో ఏమీ సంబంధం లేని ముస్లిం ఇక్తదార్లను కూడా) అణచడానికి గట్టి చర్యలను తీసుకుంటే, ఆధునిక లౌకికవాద చరిత్రకారుల దృష్టిలో కూడా, అతడు

BRAOU

మతోన్మాదయ్యాడు. రాజకీయంగా ముఖ్యులైన కొందరిని షాజహాన్, ఔరంగజేబ్ లాంటి వారు ఇస్లాం మతస్థులుగా మార్చడానికి ప్రయత్నిస్తే , మొత్తం హిందువులనే ముస్లింలుగా మార్చ ప్రయత్నించినట్లు చిత్రించడం, మతతత్వ దృక్పథం కాక మరేమిటి ? ప్రభుత్వం సామూహిక మతాంతీకరణలో పాల్గొన్న సాక్ష్యం, ఎక్కడా కన్పించలేదు. అశోకుడు బౌద్ధ మత వ్యాప్తికి రాజ్య యంత్రాంగాన్ని అధికారికంగా ఉపయోగిస్తే, అతణ్ణి గొప్ప చక్రవర్తిగా పరిగణించడం, మధ్య యుగ భారతదేశంలో ప్రభుత్వం మతాంతీకరణలో ఆసక్తిని వ్యక్తం చేయకున్నా, ఆ ప్రభుత్వాన్ని ఖండించడం ఏం న్యాయం? అక్బర్ ఉదారవాదాన్ని ప్రశంసిస్తూ , అతణ్ణి " లౌకిక వాది ' అనీ, ' జాతీయవాది ' అనీ పేర్కొనడం, ఆధునిక భావజాలాన్ని గతానికి అన్వయించడమే గదా ! 19వ శతాబ్దంలో మరాఠులు, సిక్కులు, జాట్‌ల తిరుగుబాట్లు విస్తృత పోరాటాలకు దారితీసినప్పుడు కూడా, ఔరంగజేబ్ కాలం నాటి ' క్రూరత్వపు ' దుర్భర దినాల్లో సైతం, అవి సామాజిక స్థాయిలో మత కలహాలకు దారితీయలేదు. మరి ఇటువంటి పరిశీలనలు, ఈ నాటికీ చరిత్ర బోధనలో, పాఠ్య గ్రంథాల్లో ఎందుకు చోటు చేసుకోడం లేదు ? టర్కుల కంటే ముందు, ఈ దేశానికి వచ్చిన రాజపుత్రులు ఈ నాటికీ చౌహాన్లుగా, ప్రతీహారులుగా, సోలంకీలుగా తమ వ్యక్తిత్వాలను కాపాడుకుంటూంటే, నాటి మామ్లూక్, ఖిల్జీ, తుగ్లక్, సయ్యద్, లోడీ, మొగల్ మహా పాలక వంశాలకు చెందిన అనువంశీకులు నేడెక్కడ ? వారంతా భారత జీవన ప్రధాన స్రవంతిలో అంతర్భాగమయ్యారని, చరిత్ర బోధకులు, రచయితలు ఎందుకు వివరించరు ? అంతగా వీరంతా మతతత్వ వాదాన్ని తమ నరనరాల్లో జీర్ణించుకున్నారనేగా అర్థం! గత నూరేళ్ళుగా మతతత్వం వ్యాప్తి చెందడానికి, భారత చరిత్ర బోధనకూ చాలా సంబంధముందనే విషయాన్ని, ఈ అంశాలన్నీ స్పష్టం చేస్తున్నాయి. నిజానికి, భారత చరిత్ర ప్రాచీన దశలోనూ, మధ్య యుగ దశలోనూ, మతతత్వ గుర్తింపు లేదని తేటతెల్లమౌతూంది.

## 22.9 1947కు ముందు - ఆ తర్వాత

BRAOU

అయితే, 20వ శతాబ్దంలో జాతీయవాద దృక్పథమూ, జాతీయవాద భావజాలమూ, ప్రజల్లో లోతుగా చొరబడలేక పోవడంతో, మతతత్వవాదం పెరిగి, ఊడలు వేసింది. మతతత్వ వాదాన్ని గత కాల అవశేషంగా కానీ, సంప్రదాయ భావజాల పునరుద్ధరణగా గానీ, పరిగణించడం తప్పు. బిపన్ చంద్ర చెప్పినట్లు, మతతత్వ వాదమంటే, గత నూరేళ్ల చారిత్రక క్రమ తప్పుడు చైతన్యం. ఆ తర్వాత, వర్తమాన మతతత్వ రాజకీయాల ప్రభావంతో, చరిత్రకారుల చేతుల్లో మతతత్వ వాదమనేది, గతానికి సంబంధించిన తప్పుడు చిత్రంగా కూడా తయారైంది. మతతత్వ రచయితలు ఒక్క మతం మినహా, అన్ని నిర్మాణ సూత్రాలను విస్మరించారు. అయితే, కొందరు మతం స్థానంలో కులాన్ని నిలుపుతారు. మరి కొందరు, భాషా తత్వాన్ని ప్రచారం చేసేవారు. వీరంతా ఒకే దారిలో నడిచారు. పశ్చిమ దేశాల్లో మాదిరి, భారతదేశంలోనూ జాతీయ చైతన్యముందని భ్రమసి, జవహర్‌లాల్ నెహ్రూ లాంటి జాతీయవాద నాయకులు చేసిన మతతత్వ వ్యతిరేక పోరాటం, మతతత్వమంటే జాతీయ వ్యతిరేకమైందని ప్రజలకు చెప్పే రూపం తీసుకుంది. అప్పటికి, జాతీయవాదులుగా రూపొందని ప్రజలను ఇది ప్రభావితం చేయలేకపోయింది. 1947 తర్వాత కూడా, ఈ పొరపాటు కొనసాగింది. జాతీయవాదం పట్ల ఆధునిక శాస్త్రీయ అవగాహన వ్యాప్తి చెందలేదు సరికదా, మతతత్వ దృక్పథం మరింత పటిష్టమైంది.

జాతీయ చైతన్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం కోసమూ, తమ జాతీయవాద వాంఛలను వ్యక్తీకరించుకోడానికీ, జాతీయ నాయకులు, విద్యావేత్తలు, రచయితలు, పాత్రికేయులు " జాతీయ వీరుల " ను ఉత్తేజకర సంకేతాలుగా, ఆదర్శప్రాయులుగా సృష్టించారు. జాతీయవాద ప్రచారంలో, జాతీయ వీర పూజ అంతర్భాగమైంది. రాణా ప్రతాపుడు, శివాజీ, గురుగోవింద సింగ్ వంటి చారిత్రక వ్యక్తులు, జాతీయ వీరులుగా పొగడ్త లందుకున్నారు. ఈ ఎంపిక చేసుకున్న జాతీయ వీరులలో కూడా, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటాన్ని

నిర్వహించిన చారిత్రక వ్యక్తులు - ఉదాహరణకు, 1857 తిరుగుబాటు వీరులు గాని, సంథాల్ తిరుగుబాటులోనూ, నీలిమందు పోరాటంలోనూ పాల్గొన్నవారు గానీ, ఆ తర్వాత వచ్చిన ఖుదీరాం బోస్ లాంటి వారు గాని - ఎవ్వరు లేరు. భారత జాతీయోద్యమ " మితవాద దశ " లో సురేంద్రనాథ్ బెనర్జీ , జస్టిస్ రానడే, మదన్‌మోహన్ మాలవీయ, ఆర్.సి. దత్, తిలక్‌లు, ఈ జాతీయ వీరుల్ని సృష్టించారు. బ్రిటీష్ పాలనను చారిత్రకంగా ప్రగతి శీలంగా భావించినందువల్ల, వీరు బ్రిటీష్ పాలనా పునాదులను వ్యతిరేకించిన వారిని కీర్తించలేదు. అయితే, శివాజీని ముస్లిం వ్యతిరేక వీరునిగా కీర్తించడాన్ని వ్యతిరేకించక పోయినా, ఎప్పుడైతే బ్రిటీష్ వ్యతిరేక భావాలను ప్రచారం చేయడానికి, శివాజీ వీర పూజను తిలక్ ఉపయోగించడ మారంభించాడో, అధికార్లు వెంటనే చర్యలకు పూనుకొన్నారు. మధ్య యుగ భారతదేశానికి చెందిన రాణా ప్రతాప్, శివాజీ, తదితర " జాతీయ వీరుల " కట్టు కథలు, ద్విజాతి సిద్ధాంతానికీ, మౌలికమైన మతతత్వ వైఖరికీ తోడ్పడ్డవే. ఈ చరిత్ర వ్యక్తులు ఏ విధంగా జాతీయ వీరులు ? ఏవిధంగా వారిది జాతీయ పోరాటం ? ఈ కట్టు కథలన్నీ, హిందూ మతతత్వాన్ని ప్రయత్నం లేకుండానే పెంచాయి. ఇవి నిజమైన చరిత్ర నుండి ఆవిర్భవించినవి కావు. రాజకీయ అవసరాల కోసం సృష్టించబడ్డవి. మరి స్వర్ణ యుగమనే ప్రాచీన భారతంలోని అశోకుడో, చంద్రగుప్తుడో, హర్షుడో, ఎందుకు ' జాతీయ వీరులు ' కాలేదు ? వాళ్ల పేర్ల మీద ముస్లిం వ్యతిరేక భావాలను రెచ్చగొట్టడం సాధ్యం కాదనేగా, మత తత్వ వాదులు వారిని వదిలేసింది ! " ప్రాతినిధ్య " జాతీయవాదంగా, లేదా " దొడ్డి దారి " జాతీయవాదంగా మతతత్వం పనిజేస్తుందనడానికి, ఇది ఉదాహరణ.

## 22.10 లౌకిక, శాస్త్రీయ చరిత్ర రచన - మతతత్వ వాదుల ప్రతిఘటన

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో సర్వసత్తాక రాజ్యాన్ని స్థాపించాక, జాతీయోద్యమ స్ఫూర్తి దాదాపు అంతరించింది. ఎన్నికల రాజకీయాలపై స్వార్థ ప్రయోజనాల ఒత్తిళ్ళు ఎక్కువయ్యాయి. ప్రజలకు చేసిన వాగ్దానాలను ఏళ్ళు గడుస్తున్నా తీర్చలేని, అంటే నెరవేర్చలేని పరిస్థితుల్లో, రాజకీయ నాయకులు, పక్షాలు, వర్గాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి, మతం ప్రాతిపదికతో చరిత్రను ఆలంబన చేసుకోడం దురదృష్టం. ఎవరైతే జాతీయతను గూర్చి మాట్లాడుతున్నారో, వారు మత సంబంధ లక్ష్యాల్లో గతాన్ని కాదంటున్నారు ; వక్రీకరిస్తున్నారు. ముస్లిం మతవాదులు కూడా, గతం విషయంతో వీరికి సమానమైన మత దృష్టినే కనబరుస్తున్నారు. లౌకికమైన, శాస్త్రీయమైన ఆలోచనా ధోరణిని ప్రవేశపెట్టి, భారతదేశ చరిత్రను ప్రగతి శీలంగా రూపు దిద్దే కృషిలో, గత నాలుగు దశాబ్దాలుగా తలమునకలై ఉన్న భారత మార్క్సిస్ట్ చరిత్రకారులు మతతత్వ వాదుల నుండి అడపాదడపా తీవ్ర ప్రతిబంధకాలనే ఎదుర్కొంటున్నారు. మతవాద సంస్థలూ, పార్టీలు చరిత్ర పాఠ్య గ్రంథా లెలా ఉండాలో నిర్దేశిస్తున్నాయి. 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక, ఆ పార్టీలో ఒక బలమైన వర్గం, రోమిల్లా థాపర్, బిపన్ చంద్ర వంటి అభ్యుదయ చరిత్రకారులు రాసిన పాఠ్య గ్రంథాలను ప్రభుత్వం నిషేధించేలా, ఒత్తిడి తెచ్చింది. ప్రభుత్వం స్వతంత్ర ప్రతిపత్తితో చరిత్ర పరిశోధనకు లక్షించిన ' ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రిసెర్చ్ ' (Indian Council for Historical Research) ని పునర్వ్యవస్థీకరించేలా చేసింది. ఈ చర్యలను నిరసించిన ' భారత చరిత్ర కాంగ్రెస్' (Indian History Congress) ను నిర్వీర్యం చేయడానికి, మతతత్వ వాదులు ప్రయత్నించారు. ఆర్.ఎస్. ఎస్., దీన్ దయాళ్ పరిశోధనా సంస్థల నిర్వహణలో వున్న 'భారతదేశ చరిత్ర - సాంస్కృతిక సంఘం' (Indian History and Culture Society) ని బలోపేతం చేయాలని చూశారు. లౌకికవాద దృక్పథంలో రాసిన రచనల అనువాదానికి బదులు, హిందూ మతతత్వ వైఖరిలో వెలువడ్డ భారతీయ విద్యాభవన్ సంపుటాలను అన్ని భారతీయ భాషల్లోకి అనువదింప జేయడానికి మద్దతు నందించారు. చరిత్ర పరిశోధనలో, రచనలో ప్రభుత్వ జోక్యాన్ని అభ్యుదయవాదులు సంతకాల సేకరణ ద్వారా, ప్రాంతీయంగానూ, అఖిల భారత స్థాయిలోనూ, సంస్థలు, సంఘాల సమావేశాలను నిర్వహించి, తీర్మానాలను చేయడం ద్వారా,

BRAOU

పత్రికా ప్రకటనల ద్వారా, పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో, మతతత్త్వవాదులు కొంత వెనుకంజ వేశారు. అయితే, 1980 దశకంలో వందేళ్ల ఘన చరిత్ర ఉన్నదని చెప్పుకునే కాంగ్రెస్‌వాదుల చర్యలకు పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ చేయూత నివ్వడంతో, భారత చరిత్ర, సంస్కృతులు ' మతం ' గా, మతం ' హిందూ మతం ' గా, హిందూ మతం ' ' రామభక్తి 'గా, ' రామభక్తి ' ' రామాలయ నిర్మాణం ' గా రూపుదిద్దుకొని, 1992 నాటికి వికృత వాతావరణానికి దోహదపడ్డాయి. 1947లో పాకిస్తాన్ ఏర్పడ్డాక, భారతీయ ముస్లింలకు ద్విజాతి సిద్ధాంతం లాంటి నిర్దిష్ట దృక్పథం లేకుండా పోయింది. ఉత్తర ప్రదేశ్, కర్నాటక, హైద్రాబాద్, కేరళల్లో కన్పించే మతతత్త్వానికి, ఉమ్మడి భూమిక ఏదీ లేదు. అయితే, మతతత్త్వం ఏదైనా, అది సమాజానికి ప్రమాదకారే.

పురోగతిని సాధించడానికి అనేక సమస్యల్ని పరిష్కరించాలి. చరిత్రలో పారిశ్రామికీకరణకు మూలమైన అపూర్వ సాంకేతిక విజ్ఞానంతో, సమాజంలో తీవ్రమూ, విస్తృతమూ, స్వయంచోదితమైన నిరంతర పరివర్తన ప్రారంభమైంది. మౌలిక విలువలతో సహా, సాంఘిక పరివర్తనం జరుగుతూ ఉంది. సమస్యలను ఎదిరించాలే తప్ప, పారలౌకిక విలువలంటూ చరిత్రలో తలదాచుకోవడం, ఆత్మవంచన. గతాన్నే వాస్తవిక దృష్టితో అర్థం చేసుకొని ప్రవర్తించడం వల్ల, సామాజిక పరివర్తనాక్రమాన్ని సులభం చేసినట్లౌతుంది. రొమిల్లా థాపర్ పేర్కొన్నట్లు, ' ప్రజానీకం వివిధ కార్యక్రమాల సమగ్ర వివరణమే చరిత్రనే పరిజ్ఞానం, గతం నిజ స్వరూపాన్ని దర్శింపజేస్తుంది. యదార్థ స్వరూప నిరూపణే, చరిత్ర పరిశోధనకు లక్ష్యం. '

## 22.11సంగ్రహంగా

తన ఉనికిని, సంస్కారాన్ని, తాను ఏ మతానికి చెందితే, ఆ మతం, ఆ మతానికి చెందిన జన సమూహం, సంపూర్ణంగా నిర్ణయిస్తుందనే చైతన్యం, ఒక మనిషికి ఉండటమే, మత తత్త్వం. మౌలికమైన మతతత్త్వ దృక్పథం చరిత్ర వ్యాఖ్యానాన్ని, అవగాహనను ప్రభావితం చేసింది. ఆధునిక భారతదేశంలో మతతత్త్వ వాదం మూడు రూపాల్లో కన్పిస్తుంది. ఈ మూడు, మతతత్త్వ జాతీయవాదం, ఉదార మతతత్త్వవాదం, అతివాద, లేదా ఫాసిస్ట్ మతతత్త్వ వాదం. భారతదేశ మతతత్త్వ చారిత్రక ధోరణికి, జేమ్స్ మిల్ హిందూ, ముస్లిం, బ్రిటీష్ దశల విభజన ద్వారా పునాది ఏర్పడింది. జాతీయోద్యమ స్ఫూర్తి మతతత్త్వ చారిత్రక వ్యాఖ్యానాన్ని ప్రభావితం చేసింది. భారత చరిత్ర వ్యాఖ్యానం పట్ల, అవగాహన పట్ల గల మతతత్త్వ దృక్పథం, ప్రాచీన దశకు, మధ్య యుగ దశకు, ఆధునిక దశకు సమానంగానే వర్తిస్తుంది. 1930 - 1940 దశకాల మతతత్త్వ రాజకీయాలు, చరిత్రను మరింత వక్రీకరించేలా చేశాయి. అనేక అపోహలు, అపసవ్యాలు చరిత్ర రచనల్లో చోటుచేసుకున్నాయి. 20వ శతాబ్దంలో, జాతీయవాద దృక్పథమూ, జాతీయవాద భావజాలమూ, ప్రజల్లో లోతుగా చొరబడలేకపోవడంతో, మతతత్త్వ వాదం పెరిగి , వూడలు వేసింది. బిపన్ చంద్ర చెప్పినట్లు , మతతత్త్వ వాదమంటే, గత నూరేళ్ల చారిత్రక క్రమం తప్పుడు చైతన్యం. వర్తమాన మత తత్త్వ రాజకీయాలతో, మతతత్త్వవాదం గతానికి సంబంధించిన తప్పుడు చిత్రంగా కూడా తయారైంది. కుల తత్త్వం, మత తత్త్వం కూడా ప్రచారమయ్యాయి ; జాతీయ చైతన్య ప్రచారం కోసం, ' జాతీయ వీరులు ' సృష్టించబడ్డారు. మతతత్త్వ వాద చారిత్రక వ్యాఖ్యానాన్ని సరిదిద్దే ప్రయత్నంలో, లౌకిక, శాస్త్రీయ చరిత్ర రచనా విధానం అభివృద్ధి చెందింది. అయితే ఇది గర్హించదగ్గ మార్క్సిస్ట్ రచనా విధానమని, మతతత్త్వవాదులు తమ దాడిని కొనసాగిస్తూనే ఉన్నారు. ఏది ఏమైనా, యదార్థ స్వరూప నిరూపణ, చరిత్ర పరిశోధనకు లక్ష్యం కావాలి. పురోగతిలో ఇటువంటి చిక్కులు, ఆటంకాలు తప్పవు.

BRAOU

## 22.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1). భారతదేశ చరిత్ర రచనలో మతతత్వ దృక్పథాన్ని విపులీకరించండి.

2). భారతదేశ చరిత్ర మతతత్వ వ్యాఖ్యానంలోని అపోహలను, అపసవ్యాలను వివరంగా సమీక్షించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1) ఫాసిస్ట్ మతతత్వం

2) మతతత్వ చారిత్రక వ్యాఖ్యానంపై జాతీయోద్యమ ప్రభావం

30 ప్రాచీన భారత చరిత్ర మతతత్వ వ్యాఖ్యానంలో అపసవ్యాలు

## 22.13 ఉపయుక్త గ్రంథాలు


Chandra, Bipan — **Communalism in Modern India,** Vani Educational Books, New Delhi, 1984.

- Do - — **Nationalism and Colonialism in Modern India,** Orient Longman Ltd., N. Delhi, 1979.

Chandra, Satish — **Communal Interpretation of Indian History,** New Delhi.

Dixit, Prabha — **Communalism - A Struggle for Power,** Orient Longman, New Delhi, 1974.

Golwalkar, M.S. — **We or Our Nationhood Defined,** Nagpur, 1947. Bunch of Thoughts, Bangalore, 1966.

Goyal, D.R. — **Rashtriya Swayamsewak Sangh,** New Delhi, 1979.

Habib, Irfan — **Essays in Indian History : Towards a Marxist Perception,** Teelika, New. Delhi, 1994.

Hasan, Mushirul — **Nationalism and Communal Politics in India, 1916-1928,** New. Delhi, 1979. (Ed), **Communal and Pan-Islamic Trends in Colonial India,** New Delhi. 1981.

Mukhia, Harbans — " Communalism : A Study in its Socio - Historical Perspective ", **Social Scientist,** New Delhi, Vol. I, No. I. Aug, 1972.

Nanda, B.R. (Ed). — **Essays in Modern Indian History,** Delhi, 1980.

Sawarkar, V.D. — **Hindutva,** Poona, 1949 reprint


BRAOU

Thapar Romilla, Mukhia Harbans and Chandra, Bipan — **The Writing of Indian History,** Peoples Publishing House, New Delhi, 1977 ( 2nd ed)

- Do - — **Past and Prejudice,**National Book Trust, New Delhi. 1975.

" State of Historical Research in India " , ' Outlook ' feature of **The Hindu,** 29th Oct. 1979.

రచయిత : డా.జె. దుర్గాప్రసాద్

BRAOU

# భాగం - 23 : భారత మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధి


| | |
|---|---|
| 23.0 | లక్ష్యాలు |
| 23.1 | పరిచయం |
| 23.2 | మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానం |
| 23.3 | భారతదేశంలో మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధి |
| 23.4 | రెండు వర్గాల మార్క్సిస్ట్ చరిత్రకారులు |
| 23.5 | కోశాంబి |
| 23.6 | మహమ్మద్ హబీబ్ |
| 23.7 | ఇతర మార్క్సిస్ట్ చరిత్రకారులు |
| 23.8 | భారత మార్క్సిస్ట్ చరిత్రకారుల రచనా ధోరణి - సాధారణాంశాలు |
| 23.9 | అంతరాలు |
| 23.10 | సంగ్రహంగా |
| 23.11 | పరీక్ష నమూనా ప్రశ్నలు |
| 23.12 | ఉపయుక్త గ్రంథాలు |


## 23.0 లక్ష్యాలు

BRAOU

ఈ భాగాధ్యయనం వల్ల మీరు క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

- ▲ కార్ల్ మార్క్స్ భావజాలంపై నిర్మితమైన మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానం, భారతదేశంలో ఏవిధంగా అభివృద్ధి చెందిందో తెలుసుకోగలగాలి.
- ▲ భారత మార్క్సిస్ట్ చరిత్రకారులు కోశాంబి, మహమ్మద్ హబీబ్, రొమిల్లా థాపర్, తదితరుల రచనా ధోరణిలో వ్యక్తమైన సాధారణాంశాలేమిటో తెలుసుకోగలగాలి.

## 23.1 పరిచయం

చారిత్రక వ్యాఖ్యానం సమకాలీన భావజాల ఫలితంగా ఉంటుందనే విషయాన్ని మర్చిపోకూడదు. ఇటీవల సంవత్సరాల్లో చరిత్రకారులు ప్రతిపాదించిన సిద్ధాంతాలకు ఇది మరీ ముఖ్యంగా వర్తిస్తుంది. విశ్లేషణ కోసం అట్టే ప్రయత్నించకుండా, ఆయా సంఘటనల వివరణనే చరిత్రగా చూపడం ఇంకా చాలా సందర్భాల్లో కొనసాగుతున్నా గాని, చరిత్రకారుడు తన వ్యక్తిత్వాన్ని, ఆలోచనా సరళిని, భావజాలాన్ని రచనలో ప్రతిబింబించడం, ఎంతో కొంత కన్పించక మానదు. అతని ఇష్టాయిష్టాలు ఆయా సంఘటనల ఎంపికను నిర్ణయిస్తాయి. ఆ ఎంపికలో, అతని ఆత్మాశ్రయతను గమనించొచ్చు. రొమిల్లా థాపర్ చెప్పినట్లు, చరిత్రకారుడు తన ఆధారాలకిచ్చే ప్రాధాన్యం,

ఆ ఆధారాల పట్ల అతడు విమర్శనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా ఉండడానికి ప్రయత్నించే సుముఖత స్థాయి - ఇవి వ్యాఖ్యానాన్ని ప్రభావితం చేస్తాయి. మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానాన్ని ఈ దృష్ట్యానే, అధ్యయనం చేయాలి; అర్థం చేసుకోవాలి ; అవగతం కావాలి.

మెరుగైన జీవనం కోసం మానవుడు నిరంతరం తపిస్తూనే ఉంటాడు. మార్గాలను వెతుకుతూనే ఉంటాడు. చరిత్ర పరిణామంలో గమనించదగ్గ ఒక అంశం, న్యాయమైన, లేదా మేలైన సమాజం కొరకు సాగే అన్వేషణ. దీని కోసం, చరిత్రకారుడు వెనుకటి సామాజిక పద్ధతులను, సమకాలీన సామాజిక విధానాన్ని లోతుగా పరిశీలిస్తాడు. ఈ విధమైన పరిశీలనే, ప్రత్యేకించి మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధికి దారితీసిందని ఇర్ఫాన్ హబీబ్ పేర్కొన్నాడు.

## 23.2 మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానం

జాతీయవాద చరిత్ర రచనా విధానంలో భాగంగానే, మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానమావిర్భవించిందని చెప్పొచ్చు. మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానానికి, ఉదార జాతీయవాద రచనా విధానానికి మధ్య కొన్ని పోలికలు ఉన్నాయి కాని, సామ్రాజ్యవాద , లేదా వలసవాద చరిత్ర రచనా విధానానికి, మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానానికి, ఎటువంటి సామ్యం లేదని, ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయం. సామ్రాజ్యవాద, వలసవాద చరిత్ర రచనా సంప్రదాయం, పెట్టుబడి వ్యవస్థ భావజాలంపై నిర్మించబడింది. మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానం, సోషలిస్ట్, కమ్యూనిస్టులు సమాజ స్థాపనకు కృషి చేసిన కార్ల్ మార్క్స్ భావజాలంపై నిర్మాణమైంది.

19వ శతాబ్దానికి చెందిన జర్మన్ యూదు జాతీయుడు కార్ల్ మార్క్స్, ప్రముఖ తత్వవేత్త, సమాజవాది, చరిత్ర అధ్యయనకారుడు. చరిత్రలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, మత, సాంస్కృతిక చరిత్రలు అనే పేర్లతో, వివిధ భాగాలున్నాయని అతడు భావించలేదు. సమాజ పరిణామానికి ఒక్క ఉత్పత్తి విధానమే మూల కారణమని, ఉత్పత్తి శక్తులే చరిత్రగతిని ప్రధానంగా నిర్ణయిస్తాయని అతని అభిప్రాయం. చరిత్ర గమనాన్ని నిర్దేశించే సూత్రం, ఆర్థిక పరమైన అంశమన్నమాట. కనుకనే, మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానంలో, ఆర్థికపరమైన కార్యకారణాలచే చరిత్ర గమనం నిండి ఉందనే భావన ఏర్పడింది. కాబట్టే, దీనికి ఆర్థికపరమైన విశ్లేషణ కూడా ఉంది. మానవ జాతి నీతివంతమైన, ఆరోగ్యకరమైన, వర్గరహిత, స్వేచ్ఛా సమాజం వైపు పురోగమిస్తుందని, మార్క్స్ నమ్మాడు. 1917లో రష్యా విప్లవం విజయవంతం కావడంతో, మార్క్స్ కలలు కన్న, ఆర్థిక అంతరాలు లేని స్వేచ్ఛా సమాజం ఎంతో దూరంలో లేదనే నమ్మకం పెరగడంతో, 1920 దశకం నుండి మార్క్స్ ఆలోచనా ధోరణి మానవాళిని నిన్న మొన్నటి వరకు ఎంతగానో ప్రభావితం చేసింది. భారతదేశంలో 1920 దశకంలో ఈ ప్రభావం అతి తక్కువ. కాని, 1930 - 40 ప్రాంతాల నుండి మార్క్స్ ప్రభావం భారత జాతీయోద్యమ గమనంపై , గమ్యంపై కన్పించడ మారంభమైంది. అందుచేతనే, మార్క్సిస్ట్ రచనా విధానం, జాతీయవాద చరిత్ర రచనా విధానం నుండి పుట్టుకు వచ్చిందని, ఇర్ఫాన్ హబీబ్ పేర్కొన్నాడు. జాతీయవాదులు, మార్క్సిస్ట్‌లు వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకులు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మన సమాజ లక్ష్యం, లేదా గమ్యం ఏమై ఉండాలనే విషయంలో, ఉదార జాతీయవాదులు, మార్క్సిస్ట్‌ల మధ్య తీవ్రమైన విభేదాలు లేవు. కాని, తీవ్ర జాతీయవాదుల దృక్పథం, మార్క్సిస్ట్‌ల దృక్పథంలో తేడాలున్నాయి. స్వాతంత్ర్యానంతరం సోషలిస్ట్ సమ సమాజ స్థాపన మన ధ్యేయంగా ఉండడానికి కారణం, మార్క్స్ ప్రభావమే.

## 23.3 భారతదేశంలో మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధి

భారతదేశంలో జాతీయవాద దశ అనంతరం, మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానం అటు ప్రత్యక్షంగాను, ఇటు పరోక్షంగాను, గణనీయంగా మనస్సులో హత్తుకునేలా సేవలందించింది. ప్రత్యక్షంగా అంటే, అది ప్రశ్నలను

BRAOU

రేకెత్తించి, చరిత్రకారుల కుతూహలాన్ని అంతకు ముందు వారు స్పృశించని, సందర్భోచితమనో, లేదా ప్రధానమనో భావించని రంగాల్లోకి చొచ్చుకు వెళ్లేలా చేయడం. ఇక పరోక్షంగా అంటే, ప్రపంచ వ్యాప్తంగానే అందరినీ మార్క్సిస్ట్ దృక్పథం ఆలోచింపజేసిన అంశమైంది. మార్క్సిస్టేతరులు మార్క్సిస్ట్ దృక్పథాన్ని ఖండించడానికైనా, వాదనకు దిగక తప్పదు గదా ! మార్క్సిస్ట్ వ్యాఖ్యానాన్ని ఆమోదించినా, ఆమోదించకున్నా, మార్క్సిస్ట్ చరిత్ర రచనా సంప్రదాయం పర్యవసానంగా ఏం జరుగుతుందో తెలియజెప్పడానికైనా, మార్క్సిస్టేతరులు మార్క్సిస్ట్ దృక్పథాన్ని అధ్యయనం చేయాల్సొచ్చింది.

చారిత్రక భౌతికవాద దృక్పథం ఆర్థిక చరిత్రపై బాగానే ప్రభావం చూపింది. ఆర్థిక చరిత్రను ఒక విస్తృత పరిధిలో చూస్తున్నప్పుడు, ఆ చరిత్రకారుడు ఏదో రకంగా భౌతికవాది కాకుండా ఉండలేడు. ఇర్ఫాన్ చెప్పినట్లు, ఒక విధంగా చారిత్రక భౌతికవాదులకు మార్గం సుగమం చేసిన విషయమేమంటే, ఏదో ఒక దృక్పథం నుండి రాసిన ఆర్థిక చరిత్రపై రచనలు తగినంత లేకపోవడం. భారత ఆర్థిక చరిత్రపై ఎంతో కొంత కృషి చేసిన ఆర్.సి. దత్, డి.ఆర్. గాడ్గిల్, జె.సి. సిన్హా, యస్. కె. సిన్హా, విదేశీయుడైన ఎల్. హెచ్. జేమ్స్ వంటి వారంతా, తెలిసీ మార్క్సిస్ట్ వ్యతిరేకులు కారు. లేదా, ఒక వేళ అలా భావించాల్సొస్తే , వారు తెలిసి సామ్రాజ్యవాద వ్యతిరేకులు మాత్రమే. వారు సామ్రాజ్యవాదానికి సంబంధించిన యదార్థాలను దాచి ఉంచాలని అనుకోలేదు.

కార్ల్ మార్క్స్ చరిత్రతత్వాన్ని, ఆర్థిక విశ్లేషణను, వర్గరహిత సమ సమాజ స్థాపనను విశ్వసించి, అతడు ప్రతిపాదించిన పద్ధతిలో, చరిత్ర చోదక శక్తులను అధ్యయనం చేసిన, లేదా చేసే వారినే, మార్క్సిస్ట్ చరిత్రకారులంటారు. మార్క్స్‌వాద ప్రభావితులు, లేదా సమాజ శాస్త్రజ్ఞుడు వెబర్ ప్రభావితులు, లేదా, చరిత్రను దాని సంపూర్ణత్వంతో అర్థం చేసుకొనేలా వీక్షించే ప్రయత్నం చేసే ఎవరైనా, బిపన్ చంద్ర చెప్పినట్లు, చరిత్రను లౌకికంగా శాస్త్రీయంగా తీర్చిదిద్దేవారే. ఇటువంటి శాస్త్రీయ చరిత్రకారుల్లో ముఖ్యులు, మార్క్సిస్ట్‌లు.

## 23.4 రెండు వర్గాల మార్క్సిస్ట్ చరిత్రకారులు

భారతదేశానికి సంబంధించి ఈ మార్క్సిస్ట్ చరిత్రకారుల్లో రెండు వర్గాల వారున్నారు. కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులుగానో, సానుభూతిపరులుగానో ఉంటూ, ఆ సిద్ధాంతాల ప్రాతిపదికపై భారతదేశ చరిత్ర - సంస్కృతిని అధ్యయనం చేసినవారు, మొదటి వర్గం. ఇక రెండో వర్గం, చరిత్ర బోధకులుగా, చరిత్ర రచయితలుగా, మార్క్స్ సిద్ధాంతాలను అభిమానించి, అతని ఆదర్శ కమ్యూనిస్ట్ సమాజం అతి త్వరలో వస్తుందని, రాక తప్పదని నమ్మినవారు.

మొదటి రకం మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానాన్ని అవలంబించిన వారిలో, హిరేన్ ముఖర్జీ, రజని పామెదత్, శ్రీ పాద అమృత డాంగే, శుభోజన సర్కార్, ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, పుచ్చలపల్లి సుందరయ్య ప్రభృతులు, ప్రముఖులు. వీరంతా, మార్క్స్ బోధనలను యథాతథంగా నమ్మి, మార్క్స్ ప్రతిపాదించిన దశలు మన సమాజ పరిణామ క్రమంలో ఉన్నాయని విశ్వసించినవారు. వీరి దృష్టిలో, మార్క్స్ మాటలు వేద వాక్కులు. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించినంతవరకు, ఏటుకూరి బలరామమూర్తి, కంభంపాటి సత్యనారాయణ, వై.వి. కృష్ణారావ్, కె. బాలగోపాల్ మొదలైనవారు, తమ రచనల ద్వారా, మార్క్సిస్ట్ దృక్పథాన్ని ప్రచారం చేశారు. ఈ కోవలో, ఏటుకూరి బలరామమూర్తి ' ఆంధ్రుల చరిత్ర ', కంభంపాటి సత్యనారాయణ ' ఏ హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఆంధ్రాస్' ( రెండు సంపుటాలు) ( A History and Culture of the Andhras,Two Vols.) చెప్పుకోదగ్గ రచనలు.

ఇక రెండో రకం చరిత్ర రచనా విధానానికి వస్తే, అఖిల భారత స్థాయిలో కోశాంబి, మహమ్మద్ హబీబ్, ఆర్.ఎస్. శర్మ, నూరుల్ హసన్, రొమిల్లా థాపర్, బిపన్ చంద్ర, హర్బన్స్ ముఖియా, ఇర్ఫాన్ హబీబ్ , తదితరులు

BRAOU

ప్రముఖులు. వీరంతా, మార్క్స్ చరిత్రతత్వంచే బాగా ప్రభావితులైనావారు. భారతదేశ చరిత్రకు సంబంధించిన విషయాలను, మార్క్సిస్ట్ దృక్పథంతో వివరించ ప్రయత్నించారు. చరిత్ర రచనలో మతతత్వ వైఖరిని దుయ్యబడ్తూ, వీరు చరిత్రను ప్రగతిశీలంగా తీర్చిదిద్దడానికి ముందంజ వేశారు.

## 23.5 కోశాంబి

భారతదేశానికి సంబంధించినంతవరకు, దామోదర్ ధర్మానంద్ కోశాంబి రాసిన ' ఏన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ '(An Introduction to the Study of Indian History) ఒక మైలు రాయి వంటిది. భారతదేశాన్ని ఆసియాలోను, ప్రపంచంలోను అంతర్భాగంగా వీక్షించి, భారత చరిత్రను దానికి మాత్రమే పరిమితం కాక, మరింత సార్వత్రికంగా అన్వయించే పరిభాషలో, చరిత్ర రచనా సంప్రదాయాన్ని ఒక కుదుపు కుదిపిన ఇటీవలి కాలంలోని పరిశోధకుల్లో మార్క్సిస్ట్ ధోరణి ప్రతిబింబించింది. భారత చరిత్ర పరిశోధనలో ఈ ధోరణికి ప్రాతినిధ్యం వహించిన కోశాంబి రచనల్లో, పై గ్రంథమే తలమానికమైంది.

గణిత శాస్త్రజ్ఞునిగా సుప్రసిద్ధుడైన కోశాంబిలో వైవిధ్యం, బహుముఖ ప్రజ్ఞ, అంతర్లీనంగా ఉన్నాయి. గణితం, జన్యుశాస్త్రాల్లో అతడు రచనలు చేయడమే కాకుండా, సంస్కృతంలో అత్యంత ప్రాచీనంగా భావింపబడుతూన్న భర్తృహరి సుభాషితాల సంకలనాన్ని వెలువరించాడు. అసామాన్య రీతిలో సేకరించిన సూక్ష్మ శిలా పరికరాలు, గణనీయంగా కనుగొన్న రాక్షసగుళ్ళు (megaliths) అతణ్ని ప్రాక్ చరిత్రకారునిగా (Pre-Historian) కూడా, నిలబెట్టాయి. ప్రాచీన భారత చరిత్ర - సంస్కృతిపై అనేక అంశాలను గూర్చి, దాదాపు వంద వ్యాసాలను. వెలువరించాడు. 1956లో ప్రచురించిన " ఏన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ " (An Introduction to the Study of Indian History) గ్రంథమే గాక, " ఎక్సర్‌సైజెస్ ఇన్ ది డైలెక్టికల్ మెథడ్ (1957)" ; " మిత్ అండ్ రియాలిటీ " ; " స్టడీస్ ఇన్ ది ఫార్మేషన్ ఆఫ్ ఇండియన్ కల్చర్ 1962)" ('Exercises in the Dialectical Method' 1957), ('Myth and Reality'), ('Studies in the Formation of Indian Culture, 1962)', ('The Culture and Civilization in Ancient India) (1965) అనే రచనలనూ, కోశాంబి వెలువరించాడు.

BRAOU

కోశాంబితో ఒక నూతన దృక్పథంతో శాస్త్రీయ పద్ధతిలో, భారతీయ సామాజిక గమనంపై అధ్యయన మారంభమైంది. కోశాంబి దృష్టిలో ' ఉత్పత్తి సాధనాలు, సంబంధాల్లో, ఒక దాని వెంట ఒకటి వచ్చే మార్పులను, కాలానుగుణ్యంగా చెప్పడమే చరిత్ర '. ఈ విధంగా కాకుండా, రాసిన చరిత్ర కాల్పనిక కావ్యంగా ఉంటుందని అతని అభిప్రాయం. మార్క్స్ వాదం ఆలోచనకు ప్రత్యామ్నాయం కాదు ; విశ్లేషణకు సాధనం మాత్రమేనని భావించాడు. ఉత్పాదన మూలంలో బలీయమైన మార్పుల్ని సూచించినంత మేరకు, రాజవంశాల గూర్చి, రాజ్యాల గూర్చి అధ్యయనం చేయవచ్చు గాని, అంతకు మించి ఏ ప్రాంతాన్ని ఏ రాజు పాలించాడు ? ఆ ప్రాంతానికి రాజెవరు ? అనేది అంత ముఖ్యం కాదని, ఆ ప్రాంత ప్రజలు ఆ కాలంలో ఏ ఉత్పత్తి సాధనాన్ని ఉపయోగించారనేది ప్రధానమని కోశాంబి పేర్కొన్నాడు. ఈ వైఖరికి అనుగుణంగానే, అతడు సంస్కృతిని స్వచ్ఛంగా బౌద్ధిక, ఆధ్యాత్మిక విలువలపరంగా చూడక, ప్రజలందరి జీవనానికి ప్రధాన మార్గంగా పరిగణించాడు.

చరిత్రాధారాలు వాటంతటవే చెప్పేది ఏమీ లేదని, అయితే లభిస్తున్న వాటిని విశ్లేషించి, మానవ శాస్త్రంతోను (Anthropology), మానవ వర్ణశాస్త్రం (Ethnology) తోను, పురావస్తు శాస్త్రం (Archaeology) తోను సమన్వయపర్చి, చరిత్ర, సంస్కృతులను రాయాలని కోశాంబి విశ్వసించాడు. నాణేల అధ్యయనంలో ఒక వినూత్న పంథాకు పునాది వేశాడు. దాదాపు 1200 ల ప్రాచీన నాణేలను గణిత శాస్త్ర గణాంకాల పద్ధతిలో (Statistical Applications) అధ్యయనం చేసి, వాటిపై నున్న చిహ్నాలకు భాష్యం చెప్పాడు.

ప్రాచీన భారత చరిత్రకు సంబంధించి ఆదిమ మానవుల్లో ఆహారం సమీకరించే, ఆహారం ఉత్పత్తి చేసే రెండు వర్గాలు, పరస్పర ప్రభావితులవడం వల్ల సామాజిక, ధార్మిక, సాంస్కృతిక, కళా రంగాల్లో ఎన్నో పరిణామాలు వచ్చాయని, కోశాంబి భావించాడు. ప్రాక్ చరిత్రకాలం నాటి అలవాట్లు, పద్ధతులు ఎన్నో ఈ నాటికీ కొనసాగుతున్నట్లు, అతడు విశదం చేశాడు. అయితే, అతని ఈ పరిశీలనాంశాలన్నీ స్వరాష్ట్రమైన మహారాష్ట్ర నుండి ఉదహరించాడు. ఈ పరిశీలన ఇతర ప్రాంతాలకూ విస్తరించాల్సుంది. ఇక సింధు నాగరికత ఆవిర్భావానికి నైసర్గిక పరిస్థితులే కారణమని, కోశాంబి వివరించాడు. కాంస్య యుగ నాగరికతను అతడు గుర్తించలేదు. గంగా మైదాన ప్రాంతాన్ని ఆర్యులు ఆక్రమించిన కాలంలోనే, కులాలు పుట్టి ఉంటాయని అతడు భావించాడు. స్థానికులకు, ఆర్యులకు జరిగిన సంఘర్షణలో, ఆర్యుల పూజా విధానాన్ని ఆకళింపు చేసుకున్నవారు బ్రాహ్మణులుగా చెలామణి అయ్యారని, అతని అభిప్రాయం. లోహాల వినియోగంతో మానవాళి అభ్యుదయం ముడిపడి ఉందనీ, ముఖ్యంగా, ఇనుము ఉపయోగంలోకి రావడంతో మనుగడ పూర్తిగా మారిపోయిందనీ, ఇనుప నాగలి ఆవిష్కరణతో వ్యవసాయోత్పత్తి అధికమైందనీ, ఇది వర్తక వ్యాపారాలకు, వ్యాపార కేంద్రాలు, నగరాల ఆవిర్భావానికి దారితీసిందనీ, గ్రామ జీవనం నగర జీవనానికి నాంది పలికిందని కోశాంబి వివరించాడు.

వ్యవసాయాభివృద్ధితో ఆటవిక సమాజాలు విచ్ఛిన్నమై, బ్రాహ్మణ మతంపై ధ్వజమెత్తిన జైన, బౌద్ధాలు వ్యాప్తిలోకి వచ్చాయని, కోశాంబి పేర్కొన్నాడు. సహజ వనరులు, సహజ సంపద కారణంగా, మగధ షోడశ మహాజన పదాల్లోను శక్తివంతమైందని, ముఖ్యంగా, ఇనుము వినియోగం మగధకు పెత్తనాన్ని సంతరించి పెట్టిందనీ, మగధ వికాసం చంద్రగుప్త మౌర్యుని కాలం నాటికి, పతాక స్థాయిని చేరిందని, అతడు వివరించాడు. మౌర్యుల అనంతర కాలంలో, ఉత్తర భారతంలో దేశ, విదేశీ గణాలు అధికారాన్ని పంచుకోగా, దక్కన్ స్థానిక శాతవాహనుల అధీనంలో ఉందని, ఈ కాలంలోనే ఆర్యులు, ఆర్యేతరుల పరస్పర సంస్కృతీ సమాగమంతో, భూస్వామ్య సమాజమేర్పడిందని అతడు చెప్పాడు. రోమన్ సామ్రాజ్యంతో వ్యాపారాభివృద్ధితో భారీ ఎత్తున వస్తూత్పత్తి సాధ్యమైందనీ, ఇది వాణిజ్య వర్గ ఆవిర్భావానికి దారితీసిందని, ఈ వర్గాలే పశ్చిమ భారతంలో బౌద్ధ గుహాలయాల నిర్మాణానికి ఆర్థికంగా తోడ్పడ్డాయని పేర్కొన్నాడు. గుప్తుల కాలం చివరలో, భూస్వామ్య వ్యవస్థ ఏర్పడిందన్నాడు. దక్షిణాపథంలో కొత్త సామ్రాజ్యాలను స్థాపించినవారు దైవాంశసంభూతులమని, సూర్య చంద్రులు వంశ మూల పురుషులని చెప్పుకున్నారని, సామ్రాజ్యాల రాకతో సామంతులు ఆవిర్భవించారని, ఈ సామంతులు గీతలో చెప్పిన స్వామి సేవక విధానం వల్ల రూపుదిద్దబడ్డారని, చందాలు, దానాలు, కానుకలపై ఆధారపడిన దేవాలయాలు ఆర్థికంగా స్థిరపడటంతో, అభివృద్ధి కార్యక్రమాలకు దోహదపడ్డాయని, అయితే, దేవాలయాల వల్ల ఉత్పత్తికి, పెట్టుబడికి దారితీయని సంపద పోగౌతుందని, అటువంటి సంస్థలు దేశ ఆర్థిక విధానానికి గొడ్డలి పెట్టనీ, కోశాంబి తెలియజేశాడు.

## 23.6 మహమ్మద్ హబీబ్

భారత మార్క్సిస్ట్ చరిత్రకారుల్లో కోశాంబి తర్వాత మహమ్మద్ హబీబ్‌ని పేర్కొనాలి. గతంలో అంటే, మధ్య యుగంలో ముస్లింలకు సంపన్న చారిత్రక సంప్రదాయం ఉన్నా, భారత చరిత్ర రచనా రంగంలో ఆధునిక ముస్లింల పాత్ర మృగ్యమనే చెప్పాలి. ప్రాచీన భారతదేశం విషయంలో, దక్షిణాపథ పూర్వ చరిత్రపై యాజ్దాని సంపుటం మినహా, ఇంకేమీ లేదనుకోవచ్చు. బ్రిటీష్ పాలనా కాలానికి సంబంధించి కూడా, షఫాత్ అహ్మద్ ఖాన్ రచనలు తప్ప, ఇతర రచనలూ అల్పమే. మధ్య యుగ భారత చరిత్రకు సంబంధించి మాత్రం, ఆధునిక ముస్లింల సేవలను కొంత మేరకు చూడొచ్చు. వీరిలో ప్రముఖంగా పరిగణింపదగ్గవాడు హబీబ్. హబీబ్ తర్వాత మహమ్మద్ నజీమ్, వహీద్ హుస్సేన్, జహీరుద్దీన్ ఫరూకి, మహమ్మద్ అష్రఫ్, ఎస్.ఎం. జాఫర్, ఇబ్న్ హసన్, ఆగా

మహ్దీ హుసేన్, ఐ.హెచ్. కురేషి, హెచ్. కె. షేర్వాణి, ఎ.బి.ఎం. హబీబుల్లా, అజీజ్ అహ్మద్, కె. నిజామి, నూరుల్ హసన్, ఇర్ఫాన్ హబీబ్ తదితరులను పేర్కొనాలి.

మహమ్మద్ హబీబ్ మధ్య యుగ భారతదేశంపై ఆధునిక ముస్లిం చరిత్ర రచనా సాంప్రదాయ శకాన్ని ప్రారంభించాడు. ఆవిధంగా, ' ఆధునిక ముస్లిం చరిత్ర రచనా సాంప్రదాయ పిత ' గా అతడు ప్రసిద్ధి పొందాడు. చారిత్రక సంఘటనలను, వాటి సరైన అవలోకనంలో హబీబ్ వివరించాడు. మహ్మద్ ప్రవక్త నిజమైన ముస్లింగా వ్యవహరింపతగడని చెప్పిన మొదటి చరిత్రకారుడితడే. ప్రవక్త పర్షియన్ రాచరిక వ్యవస్థకు ఒక ప్రతిరూపమే గాని, కాలిఫ్ ఇస్లాం భావనకు నిజమైన నమూనా కాదని, హబీబ్ స్పష్టం చేశాడు. మతాదరణకు, మత విశ్వాసానికి మధ్య గల అంతరాన్ని ఇతడు వివరించాడు. అలీఘర్‌లో హిందూ - ముస్లిం ఐక్యతా గీతాన్ని పాడుతున్నా, హబీబ్ వేర్పాటు వాదంలో మంచి రాజకీయ భవిష్యత్తును చూస్తున్న ముస్లిం మేధావులకు మింగుడు పడని సమస్య అయ్యాడు.

హబీబ్ దృష్టిలో చరిత్ర మానవుని మేధస్సు ప్రగతిని తెలిపేది ; ప్రాపంచిక భావనల దృష్ట్యానే, ఏ దేశ చరిత్ర కైనా ప్రాముఖ్యం ఉండేది. భారతదేశానికి ఎప్పుడైతే మతతత్వం శాంతిని ప్రసాదించలేదో, ఎప్పుడైతే ప్రతి భారతీయునికీ జాతీయవాదం తినడానికి తిండిని ప్రసాదించలేదో, హబీబ్ ఈ రెండింటిని దూరంగా నెట్టి, వామ పక్షానికి మొగ్గు చూపాడు. దేశానికి ప్రగతిశీల సమ సమాజ వాదం, లేదా మార్క్సు వాదమే మేలు చేస్తుందని భావించాడు. మార్క్సియన్ తర్కాన్ని భారత చరిత్రకు అన్వయించిన మొదటివాడు ఇతడు కాదు. ఇతనికి ముందు రజని పామెదత్, కోశాంబి, హిరేన్ ముఖర్జీలు ఉన్నారు. కాని, మధ్య యుగ భారత చరిత్రకు ఈ తర్కాన్ని అన్వయించి, విస్తృతంగా వివరించిన వాడితడే.

## 23.7 ఇతర మార్క్సిస్ట్ చరిత్రకారులు

ఇతర మార్కిస్ట్ చరిత్రకారుల్లో రోమిల్లా థాపర్ ప్రాచీన భారతదేశాన్ని గూర్చి శాస్త్రీయ చారిత్రక వ్యాఖ్యానంలో దిట్ట. ప్రత్యేకించి సామాజిక పరిణామం విషయంలో, ఈవిడకు ఆసక్తి మక్కువ. ఈ విషయంలో రొమిల్లాను కోశాంబితోనే పోల్చొచ్చు. ఈమె 'అశోక అండ్ ది డిక్లైన్ ఆఫ్ ది మౌర్యాస్ ' ( Asoka and the Decline of the Mauryas), ' ఫ్రెం లీనేజ్ టు స్టేట్ ' ( From Lineage to State ) , ' ఎ హిస్టరీ ఆఫ్ ఇండియా ' ( A History of India ) , 'ది పాస్ట్ అండ్ ప్రెజుడిస్ ' ( The Past and Prejudice ) , ' ఇంటర్‌ప్రెటింగ్ ఎర్లీ ఇండియా ' ( Interpreting Early India), మొదలైన రచనల ద్వారా, తన భావాలను మార్క్సిస్ట్ దృక్పథంలో స్పష్టంగానే వ్యక్తీకరించింది. ఇర్ఫాన్ హబీబ్ ' ది అగ్రేరియన్ సిస్టమ్ ఆఫ్ మొగల్ ఇండియా' (The Agrarian System of Moghal India) గ్రంథంతో సంచలనాన్ని సృష్టించాడు. అనంతరం కొనసాగించిన పరిశోధనల్లో, వలస యుగానికి ముందు ( మధ్య యుగం చివరి దశ) భారత ఆర్థిక చరిత్ర, ఉత్పత్తి సాంకేతిజ్ఞత, సామాజిక వ్యవస్థీకరణ మొదలైన విషయాల గురించి, అనేక సైద్ధాంతిక సమస్యలకు పరిష్కారం సాధించడంలో, జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని పొందాడు. ఇర్ఫాన్ మూడు దశాబ్దాల కృషికి ప్రతిరూపమే ఇటీవల వెలువడ్డ ' ఎస్సేస్ ఇన్ ఇండియన్ హిస్టరీ : టువర్డ్స్ ఎ మార్క్సిస్ట్ పర్‌సెప్షన్ ' ( Essays in Indian History : Towards a Marxist Perception ) అనే సంపుటి , మార్కిస్ట్ చరిత్ర రచనా విధానం దృష్ట్యా , భారత చరిత్రలోని ప్రధానాంశాలపై ఈ సంపుటం లోతైన అవగాహనను పెంపొందిస్తుంది. భారత చరిత్రలో రైతాంగం, కుల వ్యవస్థలు నిర్వహించిన పాత్రను ఇందులో ఇర్ఫాన్ పరిశీలించాడు. వర్గ పోరాట రూపాల గూర్చి, మొగలుల కాలం నాటికి భారతదేశంలో ఆర్థిక వ్యవస్థ ఏ దశలో ఉందో పరిశోధించాడు. భారత ఆర్థిక వ్యవస్థపై వలసవాద ప్రభావాన్ని విశ్లేషించాడు. మార్క్సు భారతదేశ పరిజ్ఞానంలో వచ్చిన మార్పులను కూడా, ఇర్ఫాన్ ఈ



BRAOU

గ్రంథంలో వివరించాడు. వలస ప్రభావంపై , స్వాతంత్ర్య పోరాటాన్ని గూర్చి క్రమబద్ధమైన పరిశోధనలను కొనసాగించిన మార్క్సిస్ట్ చరిత్రకారుడు, బిపన్ చంద్ర. బిపన్ రాసిన " ది రైజ్ అండ్ గ్రోత్ ఆఫ్ ఎకనమిక్ నేషనలిజం ఇన్ మోడరన్ ఇండియా " (The Rise and Growth of Economic Nationalism in Modern India) అనే గ్రంథం, చాలా ప్రామాణికమైన అధ్యయనం. ఇతని ఇతర రచనల్లో,' నేషనలిజం అండ్ కలోనియలిజం ఇన్ మోడర్న్ ఇండియా ' (Nationalism and Colonialism in Modern India), ' మోడర్న్ ఇండియా ' (Modern India) , ' కమ్యూనలిజం ఇన్ మోడర్న్ ఇండియా ' (Communalism in Modern India) లు ముఖ్యమైనవి. 1977లో కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక, విద్య, విదేశాంగ వ్యవహారాల వంటి కీలక శాఖలను నిర్వహించిన ఛాందస జనసంఘ్ వర్గం వారి ద్వారా, అంతకు ముందు ప్రభుత్వం ప్రచురించిన కొన్ని పాఠ్య గ్రంథాలను రాసిన రచయితలపై తీవ్రంగా నిగూఢమైన దాడి జరిగింది. ఆ పాఠ్య గ్రంథాలను నిషేధించారు. ఆ రచయితల్లో , బిపన్ చంద్ర కూడా ఒకడు. అయితే, ఆ తర్వాత అఖిల భారత స్థాయిలో చరిత్రకారులు, ఆయా సంస్థలు చేపట్టిన ఉద్యమాలతో, రచయిత సామాజిక స్పృహకు, స్వేచ్ఛా చింతనకు మళ్ళీ పట్టం కట్టారు.

## 23.8 భారత మార్క్సిస్ట్ చరిత్రకారుల రచనా ధోరణి - సాధారణాంశాలు

బిపన్ చంద్ర చెప్పినట్లు, ' కోశాంబి మొదలుకొని కొత్త చరిత్రకారులందరూ, తమ చుట్టూ వున్న జీవితంతో గాఢంగా పెనవేసుకుపోయారు. దానికి కారణం, వారి సామాజిక నిబద్ధత. దీనికి తోడు, యదార్థ ప్రపంచ పరిణామాలతో నిత్య సంబంధముండి, అందులో పాలుపంచుకోడం ద్వారా, గతాన్ని అవగాహన చేసుకొనే శక్తి కూడా పెంపొందుతుందని వారు గ్రహించారు. అంటే, జీవితాన్ని మంచిగా అర్థం చేసుకుంటే, మేలైన చరిత్ర రూపొందుతుంది. చరిత్రకారునికి బ్రతికున్న వారిని గూర్చి తెలియనిదే, చనిపోయిన వారిని గూర్చి ఏం తెలుస్తుంది ? తానున్న సమాజాన్ని మార్చే కృషిలో పాలుపంచుకొన్నప్పుడే, గతాన్ని గూర్చి, వర్తమానాన్ని గూర్చి బాగా తెలుస్తుంది. దీన్ని బట్టి, మార్క్సిస్ట్ చరిత్రకారులు సమాజాన్ని మార్చే కృషిలో భాగంగానే, చరిత్ర రచన చేశారని అర్థమౌతుంది. చరిత్రను సమాజం, సామాజికాభివృద్ధి, సామాజిక మార్పుల చరిత్రగా భావించడమే, దీనికి కారణం. ఆర్థిక చరిత్రని, సామాజిక చరిత్రని, సాంస్కృతిక చరిత్రని, చరిత్రను ముక్కలు ముక్కలుగా విడదీసి, దేనికి దాన్ని విడివిడిగా అధ్యయనం చేసే పద్ధతిని, ఈ మార్క్సిస్ట్ చరిత్రకారులు నిర్ద్వందంగా వ్యతిరేకించారు. గతం మొత్తాన్ని ఒక సర్వ సమగ్ర రూపంలో పెట్టడమే, వీరు తమ ధ్యేయంగా పెట్టుకొన్నారు. గతానికి సంబంధించిన అతి సూక్ష్మ అంశాలపై పరిశోధన సాగిస్తున్నప్పటికీ, వీరి లక్ష్యం సామాజిక వ్యవస్థ మొత్తాన్ని అఖండ రూపంలో అర్థం చేసుకోవడం. సమాజ స్వభావాన్ని, ఆ సమాజంలోని ఉద్రిక్తతలను, వాటి స్వభావాల్ని అర్థం చేసుకుంటూనే, సామాజిక అభివృద్ధి దశలు , వాటితోపాటుగా సమాజంలో వచ్చిన, వస్తున్న మౌలిక మార్పులు, అంతేగాక, సమాజం ఒక వ్యవస్థ నుండి మరొక వ్యవస్థ లోనికి మార్పు చెందడం , లేదా, ఎందుకు మార్పు చెందలేక పోయిందనే విషయం గూర్చి, ఈ మార్క్సిస్ట్ చరిత్రకారుల పరిశోధన నిండి ఉంది.

## 23.9 అంతరాలు

పరిణామశీలత అనేది సమాజానికి ఉన్న గుణం. కార్ల్ మార్క్స్ సమాజ పరిణామంలో ఉన్న దశలను పేర్కొని, ప్రతి సమాజం ఆ పరిణామ క్రమంలో పయనిస్తుందన్నాడు. ఆ సామాజిక పరిణామంలో చోదక శక్తుల్ని వెదకి పట్టుకొని , అవి ఏ విధంగా సమాజ పరిణామాన్ని ప్రభావితం చేశాయో వివరించడం, మార్క్స్ భావజాలంలో విహరించే చరిత్రకారుల ధ్యేయం. అయితే, ఈ చరిత్రకారులు మార్క్సిస్ట్ పరిశోధనా పద్ధతిని అంగీకరించినా, తుది నిర్ణయాల (Conclusions) విషయంలో, ఏకాభిప్రాయం వీరిలో లేదు. దీనికి ఒక ఉదాహరణను

BRAOU

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

## కోర్స్ - 11 : చరిత్ర రచనా పద్ధతి

**అభ్యాసం - 3**

గమనికలు :

- ✱ పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- ✱ సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- ✱ జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూక వివరాలను పొందుపర్చండి.
- ✱ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- ✱ మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ✱ ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

భాగం - A

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఆధునిక చరిత్ర రచనలో ఆగస్ట్ కామ్ట్, రాంకేల పాత్రను సమీక్షించండి.
2. భారతదేశంలో జాతీయోద్యమం చేత ప్రభావితమైన జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధిని సమగ్రం పరిశీలించండి ?

**భాగం -B**

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ఆనల్ చారిత్రక పద్ధతిలోని ముఖ్యాంశాలేవి ?
2. కార్ల్ మార్క్స్ ప్రతిపాదించిన గతి తార్కిక పద్ధతిని వివరించండి ?

BRAOU

BRAOU

BRAOU

గ్రంథంలో వివరించాడు. వలస ప్రభావంపై, స్వాతంత్ర్య పోరాటాన్ని గూర్చి క్రమబద్ధమైన పరిశోధనలను కొనసాగించిన మార్క్సిస్ట్ చరిత్రకారుడు, బిపన్ చంద్ర. బిపన్ రాసిన " ది రైజ్ అండ్ గ్రోత్ ఆఫ్ ఎకనమిక్ నేషనలిజం ఇన్ మోడరన్ ఇండియా " (The Rise and Growth of Economic Nationalism in Modern India) అనే గ్రంథం, చాలా ప్రామాణికమైన అధ్యయనం. ఇతని ఇతర రచనల్లో,' నేషనలిజం అండ్ కలోనియలిజం ఇన్ మోడర్న్ ఇండియా ' (Nationalism and Colonialism in Modern India), ' మోడర్న్ ఇండియా ' (Modern India) , ' కమ్యూనలిజం ఇన్ మోడర్న్ ఇండియా ' (Communalism in Modern India) లు ముఖ్యమైనవి. 1977లో కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక, విద్య, విదేశాంగ వ్యవహారాల వంటి కీలక శాఖలను నిర్వహించిన ఛాందస జనసంఘ్ వర్గం వారి ద్వారా, అంతకు ముందు ప్రభుత్వం ప్రచురించిన కొన్ని పాఠ్య గ్రంథాలను రాసిన రచయితలపై తీవ్రంగా నిగూఢమైన దాడి జరిగింది. ఆ పాఠ్య గ్రంథాలను నిషేధించారు. ఆ రచయితల్లో , బిపన్ చంద్ర కూడా ఒకడు. అయితే, ఆ తర్వాత అఖిల భారత స్థాయిలో చరిత్రకారులు, ఆయా సంస్థలు చేపట్టిన ఉద్యమాలతో, రచయిత సామాజిక స్పృహకు, స్వేచ్ఛా చింతనకు మళ్ళీ పట్టం కట్టారు.

## 23.8 భారత మార్క్సిస్ట్ చరిత్రకారుల రచనా ధోరణి - సాధారణాంశాలు

బిపన్ చంద్ర చెప్పినట్లు, ' కోశాంబి మొదలుకొని కొత్త చరిత్రకారులందరూ, తమ చుట్టూ వున్న జీవితంతో గాఢంగా పెనవేసుకుపోయారు. దానికి కారణం, వారి సామాజిక నిబద్ధత. దీనికి తోడు, యదార్థ ప్రపంచ పరిణామాలతో నిత్య సంబంధముండి, అందులో పాలుపంచుకోడం ద్వారా, గతాన్ని అవగాహన చేసుకొనే శక్తి కూడా పెంపొందుతుందని వారు గ్రహించారు. అంటే, జీవితాన్ని మంచిగా అర్థం చేసుకుంటే, మేలైన చరిత్ర రూపొందుతుంది. చరిత్రకారునికి బ్రతికున్న వారిని గూర్చి తెలియనిదే, చనిపోయిన వారిని గూర్చి ఏం తెలుస్తుంది ? తానున్న సమాజాన్ని మార్చే కృషిలో పాలుపంచుకొన్నప్పుడే, గతాన్ని గూర్చి, వర్తమానాన్ని గూర్చి బాగా తెలుస్తుంది. దీన్ని బట్టి, మార్క్సిస్ట్ చరిత్రకారులు సమాజాన్ని మార్చే కృషిలో భాగంగానే, చరిత్ర రచన చేశారని అర్థమౌతుంది. చరిత్రను సమాజం, సామాజికాభివృద్ధి, సామాజిక మార్పుల చరిత్రగా భావించడమే, దీనికి కారణం. ఆర్థిక చరిత్రని, సామాజిక చరిత్రని, సాంస్కృతిక చరిత్రని, చరిత్రను ముక్కలు ముక్కలుగా విడదీసి, దేనికి దాన్ని విడివిడిగా అధ్యయనం చేసే పద్ధతిని, ఈ మార్క్సిస్ట్ చరిత్రకారులు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. గతం మొత్తాన్ని ఒక సర్వ సమగ్ర రూపంలో పెట్టడమే, వీరు తమ ధ్యేయంగా పెట్టుకొన్నారు. గతానికి సంబంధించిన అతి సూక్ష్మ అంశాలపై పరిశోధన సాగిస్తున్నప్పటికీ, వీరి లక్ష్యం సామాజిక వ్యవస్థ మొత్తాన్ని అఖండ రూపంలో అర్థం చేసుకోవడం. సమాజ స్వభావాన్ని, ఆ సమాజంలోని ఉద్రిక్తతలను, వాటి స్వభావాల్ని అర్థం చేసుకుంటూనే, సామాజిక అభివృద్ధి దశలు , వాటితోపాటుగా సమాజంలో వచ్చిన, వస్తున్న మౌలిక మార్పులు, అంతేగాక, సమాజం ఒక వ్యవస్థ నుండి మరొక వ్యవస్థ లోనికి మార్పు చెందడం , లేదా, ఎందుకు మార్పు చెందలేక పోయిందనే విషయం గూర్చి, ఈ మార్క్సిస్ట్ చరిత్రకారుల పరిశోధన నిండి ఉంది.

## 23.9 అంతరాలు

పరిణామశీలత అనేది సమాజానికి ఉన్న గుణం. కార్ల్ మార్క్స్ సమాజ పరిణామంలో ఉన్న దశలను పేర్కొని, ప్రతి సమాజం ఆ పరిణామ క్రమంలో పయనిస్తుందన్నాడు. ఆ సామాజిక పరిణామంలో చోదక శక్తుల్ని వెదకి పట్టుకొని , అవి ఏ విధంగా సమాజ పరిణామాన్ని ప్రభావితం చేశాయో వివరించడం, మార్క్స్ భావజాలంలో విహరించే చరిత్రకారుల ధ్యేయం. అయితే, ఈ చరిత్రకారులు మార్క్సిస్ట్ పరిశోధనా పద్ధతిని అంగీకరించినా, తుది నిర్ణయాల (Conclusions) విషయంలో, ఏకాభిప్రాయం వీరిలో లేదు. దీనికి ఒక ఉదాహరణను

BRAOU

పేర్కొనొచ్చు. భారతదేశంలో బ్రిటీష్ వారు అడుగు పెట్టేంతవరకు, ఈ సమాజంలో మార్పు లేదని మార్క్స్ చెప్పాడు. మన మార్క్సిస్ట్ చరిత్రకారులు ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. " అవిచ్ఛిన్నత, పరిణామం " (Continuity and Change) అనేది, భారత చరిత్ర లో ప్రధాన రచనా విషయ (theme) మని, వీరి అభిప్రాయం. కోశాంబి, ఆర్.యస్. శర్మ, రొమిల్లా థాపర్, డి.యన్. ఝా మొదలైన వారందరూ, ఈ ధోరణిలోనే చరిత్రను అధ్యయనం చేశారు. ఈ ' అవిచ్ఛిన్నత ' కు, ' పరిణామా ' నికి దోహదం చేసిన ' చోదక శక్తుల గూర్చి, వీరిలో ఏకాభిప్రాయముంది. అయితే, మార్క్స్ ప్రతిపాదించిన ' వర్గ సంఘర్షణ ', ' ఆసియా ఉత్పాదకత రీతి ', ' అనివార్యత ' అనే విషయాల గూర్చి, వీరిలో అభిప్రాయ భేదాలున్నాయి. కోశాంబి గ్రంథం ' ఏన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ ' (An Introduction To The Study of Indian History) లో, వర్గ సంఘర్షణ తప్ప, మిగిలిన మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధాన విషయాలన్నీ ఉన్నాయని, ఇర్ఫాన్ హబీబ్ విమర్శించాడు. " Our study of Indian History should not overlook the fact that we are living in a society of class, exploitation, and therefore, of class resistance and struggle; also that such was our past society " అని ఇర్ఫాన్ పేర్కొన్నాడు. మార్క్స్ దృష్టిలో, భారతదేశం వలస రాజ్యం కాక ముందు, ఫ్యూడల్ కాదు. అయితే, కోశాంబి. ఆర్.ఎస్. శర్మలు ప్రాచీన కాలం నాటి భారతదేశంలో, బానిస సమాజం లేదని చెప్పారు. కాని, క్రీ.శ. 4వ శతాబ్ది నుండి బ్రిటీష్ వారి ఆక్రమణ వరకు, ఫ్యూడల్ సమాజం కొనసాగిందన్నారు. మార్క్స్‌కు ఆపాదించబడిన ' అనివార్యత ' సిద్ధాంతాన్నుండి మనం బయట పడాలని, ఇర్ఫాన్ హబీబ్ హెచ్చరించాడు. " మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానం నిరంతరం తాజా విషయాలను మళ్లీ మళ్లీ అన్వేషిస్తూండాలి, తాజా ప్రశ్నలకు సమాధానమిస్తూ ఉండాలి. . . . . పరిశోధన విస్తృతమౌతుంది, ఈ ప్రకియ యింతకు పూర్వం తెలియని యదార్థాలను బహిర్గతం చేస్తుంది ; భారతదేశ గతాన్ని గూర్చి మార్క్స్‌కు తెలిసిన దానికంటే, మనకెక్కువే తెలుసని, నమ్రతతో చెప్పగలం. అతనికి లభించిన సమాచారం పరిమితమైందని ప్రత్యేకించి మనం గుర్తించినప్పుడు, భారతదేశంపై ఆయన వాదమే, చివరి మాటగా అంగీకరించగలమా ? విస్తృతమైన పరిజ్ఞానం, ప్రస్తుత మన సమాచార స్థాయి మీద, మన మరీ పాత వ్యాఖ్యానాన్ని ప్రక్కకు తప్పించే పనిని, సహజంగానే మన మీద పెడుతుంది. ఇది నిరంతరం సాగాల్సిన ప్రక్రియ " అని ఇర్ఫాన్ పేర్కొన్నాడు. ఈ విధంగా, మార్క్సిస్ట్ చరిత్ర రచనా ధోరణి ఒక మూసలో కాక, కొత్త ఆధారాల సహాయంతో మన సామాజిక గమనాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నది. పద్ధతి ఏదైనా, సత్యాన్వేషణలో నిరంతరం కృషి కొనసాగవలసిందే. మార్క్సిస్ట్ చరిత్రకారులు దీనినే ఒక బాధ్యతగా నిర్వహిస్తున్నారు.

## 23.10 సంగ్రహంగా

బ్రతుకును బాగు చేసుకోడానికి, మరింత మెరుగుపర్చుకోడానికి, మానవుడు తపిస్తూ ఉంటాడు. నిరంతరం మార్గాలను వెతుకుతూ ఉంటాడు. మేలైన సమాజం కోసం సాగే అన్వేషణ, చరిత్ర పరిణామంలో కన్పిస్తుంది. దీని కోసమే, చరిత్రకారుడు వెనుకటి సామాజిక పద్ధతులను, సమకాలీన సామాజిక విధానాన్ని లోతుగా పరిశీలిస్తాడు. ఇటువంటి పరిశీలనే, ప్రత్యేకించి మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధికి దారితీసింది. జాతీయవాద చరిత్ర రచనా విధానంలో భాగంగా, మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధాన మావిర్భవించింది. కార్ల్ మార్క్స్ భావజాలంపై నిర్మితమైంది. 1930 - 40 ప్రాంతాల నుండి మార్క్స్ ప్రభావం భారత జాతీయోద్యమంపై కన్పించసాగింది. స్వాతంత్ర్యానంతరం, సోషలిస్ట్ సమ సమాజ స్థాపన మన ధ్యేయమైంది. మార్క్సిస్ట్ చరిత్రకారులు చరిత్రను లౌకికంగా, శాస్త్రీయంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నారు.

భారతదేశంలో రెండు వర్గాల మార్క్సిస్ట్ చరిత్రకారులున్నారు. పార్టీ సభ్యులో, సానుభూతిపరులో ఒక వర్గమైతే, చరిత్ర బోధకులు, రచయితలు మరో వర్గం. కోశాంబి, మహమ్మద్ హబీబ్, ఆర్.ఎస్. శర్మ, నూరుల్ హసన్, రొమిల్లా థాపర్, బిపన్ చంద్ర, హర్బన్స్ ముఖియా, ఇర్ఫాన్ హబీబ్, డి.ఎన్. ఝా తదితరులు, ఈ రెండో

కోవకు చెందినవారు. ఒక నూతన దృక్పథంతో, శాస్త్రీయ పద్ధతిలో భారతీయ సామాజిక గమనంపై అధ్యయనం కోశాంబితో ప్రారంభమైంది. మహమ్మద్ హబీబ్ మధ్య యుగ భారత చరిత్రకు మార్క్సియన్ తర్కాన్ని అన్వయించాడు. రొమిల్లా వంటి ఇతర చరిత్రకారులూ చరిత్రను అభ్యుదయ పంథాలో, ప్రగతి శీలంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మార్క్సిస్ట్ చరిత్రకారులందరూ మార్క్సిస్ట్ పరిశోధనా పద్ధతిని అంగీకరించినా, తుది నిర్ణయాల విషయంలో వీరికి ఏకాభిప్రాయం లేదు. అయితే, సత్యాన్వేషణకు సాగే నిరంతర కృషిని ఒక బాధ్యతగా, ఈ చరిత్రకారులు కొనసాగిస్తున్నారు.

## 23.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1) భారత మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధిని సమీక్షించండి.

2) కోశాంబి వంటి మార్క్సిస్ట్ చరిత్రకారుల కృషిని వివరించండి.

II. **క్రింది వానికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1) మహమ్మద్ హబీబ్

2) భారత మార్క్సిస్ట్ చరిత్రకారుల రచనా ధోరణిలో సాధారణాంశాలు

## 23.12 ఉపయుక్త గ్రంథాలు


Ali, B. Sheik — **History : Its Theory and Method,** Macmillan, Madras, 1978.

Deutscher, I. — **Marxism in Our time,** Rampart Press, San Francisco,1973.

Devahuti (Ed) — **Bias in Indian Historiography,** D.K. Publishers, Delhi, 1980.

Ghosh, Shanker — **Socialism and Communism in India,** Allied Publishers, Bombay, 1971.

Gopal, S. and Thapar , R0milla — **Problems of Historical Writing in India,** India International Centre, N. Delhi, 1963.

Habib, Irfan — **Essays in Indian History : Towards a Marxist Perception,** Tulika, New. Delhi, 1994.

Majumdar, R.C., — **Historiography in Modern India,** Asia Publishing House, Bombay, 1970.

Philips, Ch. — **Historians of India, Pakistan and Ceylon,** Oxford, New Delhi. 1961.

Sen, S.P. (Ed) — **Historians and Historography in Modern India,** Institute of Historical Studies, Calcutta, 1973.

" State of Historical Research in India ", " Outlook " feature of **The Hindu**, 29th October, 1979.


BRAOU

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

పాఠ్య ప్రణాళిక

## కోర్స్ - 1 : చరిత్ర రచనా పద్ధతి

**ఖండం- I : చరిత్ర పునాదులు**

భాగం - 1 : చరిత్ర ఒక శాస్త్రం

భాగం - 2 : చారిత్రక యదార్థాలు : హీరిస్టిక్స్

భాగం -3 : కార్యకారణ సంబంధం

భాగం -4 : సాధారణీకరణ

భాగం - 5 : విషయనిష్ఠత

భాగం - 6 : సంశ్లేషణ

**ఖండం- II : చారిత్రక ఆధారాలు**

భాగం - 7 : పురావస్తు ఆధారాలు, శాసనాలు, నాణేలు

భాగం - 8 : సాహిత్యం

భాగం - 9 : పాలనా రికార్డులు

భాగం - 10 : వార్తా పత్రికలు

భాగం - 11 : మౌఖిక సంప్రదాయం

**ఖండం–III : చరిత్ర రచనాభివృద్ధి : ప్రాచీన యుగం**

భాగం - 12 : ప్రాచీన యుగం : ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 13 : ప్రాచీన యుగం : భారతీయ చరిత్ర రచనాభివృద్ధి

**ఖండం-IV : చరిత్ర రచనాభివృద్ధి : మధ్య యుగం**

భాగం - 14 : మధ్య యుగం : ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 15 : మధ్య యుగం : పశ్చిమ ఆసియాలో చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 16 : మధ్య యుగం : భారతదేశంలో ముస్లిం చరిత్ర రచనాభివృద్ధి

BRAOU

**ఖండం- V :** **ఆధునిక ఐరోపాలో చరిత్ర రచనాభివృద్ధి**

భాగం - 17 : ఆధునిక ఐరోపా : ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్ర రచనా సంప్రదాయం

భాగం - 18 : ఆధునిక ఐరోపా చరిత్ర రచనాభివృద్ధిలో మార్క్సువాదం

భాగం - 19 : ఆధునిక ఐరోపా చరిత్ర రచనాభివృద్ధి : అనల్స్

**ఖండం-VI :** **భారతీయ చరిత్ర రచనాభివృద్ధి** : ఆధునిక యుగం

భాగం -20 : వలసవాద భారతీయ చరిత్ర రచనాభివృద్ధి

భాగం -21 : భారతదేశం : జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 22 : భారతదేశం : మతతత్వ చరిత్ర రచనాభివృద్ధి

భాగం - 23 : భారత మార్క్సిస్ట్ చరిత్ర రచనాభివృద్ధి

BRAOU

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

మాదిరి పరీక్షా పత్రం

## కోర్స్ - 11 : చరిత్ర రచనా పద్ధతి

సమయం : 3 గంటలు	మార్కులు : 100

భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చరిత్రపై విజ్ఞాన శాస్త్రాల ప్రభావాన్ని తెల్పి, చరిత్ర శాస్త్రమా అనే వాదాన్ని గూర్చి విపులంగా చర్చించండి.

లేదా

చారిత్రక ఆధారాల సేకరణకుపయోగించే మార్గాలను పేర్కొని, వాటిని భద్రపర్చడంలో ఆయా సంస్థల పాత్రను విశ్లేషించండి.

2. " ప్రాచీన భారతీయులకు చారిత్రక దృష్టి, చరిత్ర రచనా సంప్రదాయాలు లేవు ". దీనిని నీవు అంగీకరిస్తావా ?

లేదా

ప్రామాణిక (గ్రీకో - రోమన్) చరిత్ర రచనాభివృద్ధిలో గ్రీకో - రోమన్ చరిత్రకారులైన హెరోడోటస్, థూసిడైడ్స్, లీవీ, టాసిటస్ పాత్రలను విశ్లేషించండి ?

3. మధ్య యుగంలో చరిత్ర రచనపై ఇస్లాం ప్రభావాన్ని తెల్పి, చరిత్ర రచనాభివృద్ధిలో అమీర్ ఖుస్రూ, బరని, ఇబ్న్‌బతూతాల సేవలను వివరించండి.

లేదా

ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్ర రచనా సంప్రదాయాల లక్షణాలను వివరించండి.

4. చరిత్ర రచనాభివృద్ధిలో మార్క్స్‌వాదాన్ని విశ్లేషించి, చరిత్ర తత్వంపై మార్క్స్ ప్రభావాన్ని అంచనా వేయండి.

లేదా

భారతదేశంలో వలసవాద యుగంలో చరిత్ర రచనాభివృద్ధిని విమర్శనాత్మకంగా పరిశీలించండి.

BRAOU

**II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

5. చరిత్రలో సాధారణీకరణ అంటే ఏమిటి ?

లేదా

ప్రశ్నా విధాన ప్రాక్కల్పన గురించి రాయండి.

6. చరిత్ర రచనకు వార్తా పత్రికలు ఏవిధంగా ఉపయోగపడతాయి ?

లేదా

భారతదేశ చరిత్ర పునర్నిర్మాణంలో తోడ్పడే మౌఖిక ఆధారాల ప్రాముఖ్యతను తెల్పండి ?

7. ప్రాచీన భారతీయ చరిత్రకారుల్లో కల్హణుని స్థానాన్ని అంచనా వేయండి.

లేదా

అత్యున్నత చరిత్రకారుల్లో ఒకడుగా థూసిడైడ్స్ ఏల పరిగణింపబడుతున్నాడు ?

8. ఆనల్ చారిత్రక పద్ధతి అంటే ఏమిటి ?

లేదా

కమ్యూనిస్ట్ సమాజంలో దశలను పేర్కొనండి.

9. జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధిలో, హెచ్.సి. రాయ్‌చౌదరి, కె.వి. నీలకంఠ శాస్త్రి ల సేవలేట్టివి ?

లేదా

భారతదేశ చరిత్ర రచనలో మత తత్వ రచన ఆవిర్భావం ఎలా జరిగిందో తెల్పండి ?

BRAOU

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

## కోర్స్ - 11 : చరిత్ర రచనా పద్ధతి

### అభ్యాసం - 1

గమనికలు :

* పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
* సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
* జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
* అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
* మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
* ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం - A

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. చరిత్ర అంటే చరిత్రకారునికి, అతని యదార్థాలకు మధ్య అవిచ్ఛిన్నంగా జరిగే కార్యవిధానం ; వర్తమానానికి, గతానికీ మధ్య జరిగే అనంతమైన సంభాషణ. వివరించండి.

2. ప్రాచీన, మధ్యయుగ భారత చరిత్ర పునర్నిర్మాణానికి, పురావస్తు ఆధారాలు ఏవిధంగా తోడ్పడ్డాయో వివరించండి ?

భాగం -B

II. **క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చరిత్రలో సంపూర్ణ విషయనిష్ఠతను సాధించడం సాధ్యమా ?

2. సాహిత్యం, చరిత్రకు గల పరస్పర సంబంధాన్ని తెల్పండి ?

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

## కోర్స్ - 11 : చరిత్ర రచనా పద్ధతి

## అభ్యాసం - 2

గమనికలు :

* పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
* సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
* జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
* అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
* మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
* ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం - A

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ప్రామాణిక (గ్రీకో - రోమన్) చరిత్ర [illegible] ముఖ్య లక్షణాలను తెల్పి, చారిత్రక చింతనాభివృద్ధికి గ్రీకో - రోమన్ చరిత్రకారుల పాత్రను విశ్లేషించండి.
2. భారతదేశంలో మధ్య యుగంలో జరిగిన ముస్లిం చరిత్ర రచనాభివృద్ధిని వివరించండి.

భాగం -B

II. **క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. మౌఖిక [illegible], ఆధారాలకున్న పరిమితులను తెల్పండి.
2. ప్రాచీన భారతదేశ చరిత్ర రచనపై ఇతిహాస, పురాణ సంప్రదాయ ప్రభావమెట్టిదో చర్చించండి.

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

## కోర్స్ - 11 : చరిత్ర రచనా పద్ధతి

**అభ్యాసం - 3**

గమనికలు :

* పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
* సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
* జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
* అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
* మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
* ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం - A

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఆధునిక చరిత్ర రచనలో ఆగస్ట్ కామ్టే, రాంకేల పాత్రను సమీక్షించండి.
2. భారతదేశంలో జాతీయోద్యమం చేత ప్రభావితమైన జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధిని సమగ్రంగా పరిశీలించండి ?

**భాగం -B**

II. **క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. అనల్ చారిత్రక పద్ధతిలోని ముఖ్యాంశాలేవి ?
2. కార్ల్ మార్క్స్ ప్రతిపాదించిన గతి తార్కిక పద్ధతిని వివరించండి ?

BRAOU

BRAOU